అఖండ గోదావరి

పుష్కర దర్శనమ్



దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశేష ప్రచురణ

అఖండ గోదావరి

పుష్కర దర్శనమ్



ప్రధాన సంపాదకులు

మరుమాముల వెంకటరమణ శర్మ

'దర్శనమ్'

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

29-105/4/1, శ్రీరామసిద్ధాంతి భవనం, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 56.

ఫోన్: 040-27220401, 94410 15469

Email: d_darshanam@yahoo.co.in, editordarshanam@gmail.com

అఖండ గోదావరి పుష్కర దర్శనమ్

'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

సందర్భం : **శ్రీమన్మథనామ సంవత్సర 'గోదావరి పుష్కరాలు"**
(14.07.2015 - 25.07.2015)

ప్రతులు : 5000

వెల : ₹ 150/-

అక్షరాల కూర్పు : **ఆరవేటి వెంకటసుబ్బయ్య**
98496 92028

ముద్రణ : **సాయి తిరుమల ప్రింటింగ్ ప్రెస్**
చిక్కడపల్లి, హైదరాబాద్.

బొమ్మలు : **సునీతావాసు**

ప్రతులు లభించుచోటు

1. **మరుమాముల వెంకటరమణ శర్మ**
ప్రధాన సంపాదకులు:
దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక
29-105/1/1, న్యూ విద్యానగర్,
నేరేడ్‌మెట్, సికిందరాబాద్ - 56.
040-27220401, 94410 15469

2. **నవచేతన పబ్లిషింగ్ హౌస్**
హైదరాబాద్

3. **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
విజయవాడ
మరియు
అన్ని ముఖ్య పుస్తక విక్రయ కేంద్రాలు

కృతజ్ఞతలు

గత 11 సంవత్సరాల 'దర్శనమ్' ప్రస్థానంలో పలు విశిష్ట సంచికలను వెలువరించింది. గతంలో **'శతావధాన సమారోహం', 'అవధానాల హరివిల్లు', 'అఖండానందం', 'మహస్సు', 'యజ్ఞవైభవమ్', 'గురువందనమ్', 'అమ్మ', 'దివ్యజ్ఞాన రహస్యమ్', 'జిల్లెళ్లమూడి అమ్మ బొమ్మలకథ'** తదితర సంచికలకు పాఠకులనుండి విశేష స్పందన లభించింది.

ప్రస్తుతం గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రతి తెలుగింట దాచుకోదగిన పుస్తకంగా, 'అఖండ గోదావరి పుష్కర దర్శనమ్' అన్న పేరుతో ఒక ప్రత్యేక సంచిక 'దర్శనమ్' అందిస్తోంది. ఈ ప్రచురణ యజ్ఞంలో ఎందరో మహానుభావులు, పండితులు, రచయితలు, హితులు, సన్నిహితులు పలువిధాలుగా సహాయసహకారాలందించి నన్ను ప్రోత్సహించారు.

శ్రీ శృంగేరి శారదాపీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు, శ్రీ గురు మదనానంద పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతిస్వామివారు, శ్రీ శైవపీఠాధీశ్వరులు మహామహోపాధ్యాయ శ్రీ సద్గురు శివానందమూర్తిగార్ల దివ్యాశీస్సులతో... నాకు జన్మనిచ్చిన మా తల్లిదండ్రులు నిష్కామకర్మయోగి కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ, అన్నపూర్ణమ్మగారలు, సదా నా ఉన్నతిని కాంక్షించే గౌరవ సంపాదకులు శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ, శ్రీ ఆర్‌వివి కృష్ణారావుగార్ల ప్రోత్సాహంతో ఈ పుస్తకాన్ని తెలుగువారి ముంగిట ఉంచుతున్నాం.

ఇంకా నాకు అడుగడుగునా మార్గనిర్దేశం చేస్తున్న మా సహోదరుడు మరుమాముల దత్తాత్రేయశర్మగారికి, దీనిని అనేకసార్లు పరిశీలించి తమ అమూల్యమైన సలహాలు, సూచనలిచ్చిన ప్రసాదవర్మ కామబుషి, డా॥ కె. పూర్ణప్రజ్ఞాభారతి, ఈ ప్రచురణకు తోడ్పడిన మదునూరి వెంకటరామశర్మ, నా సహధర్మచారిణి మరుమాముల రుక్మిణి, అడుగగానే ముఖచిత్రం వేసిచ్చిన సునీతావాసు, అక్షరాల కూర్పు నందించిన ఆరవేటి వెంకటసుబ్బయ్య, అప్పాల శ్యాంప్రణీత్ శర్మ గార్లకు, నా ఆంతరంగిక సహాయకుడు అన్నారం నాగిరెడ్డి గార్లకు, ఎంతో అందంగా ముద్రించి ఇచ్చిన తిరుమల ప్రింటింగ్ ప్రెస్ యాజమాని లక్ష్మీనర్సుగారికి, ఇంకా ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన ఎందరో పెద్దలకు కృతజ్ఞతలతో.....

(మరుమాముల వెంకటరమణశర్మ)

విషయ సూచిక

పుష్కరశోభ – సంపాదకీయం 6

దక్షిణ గంగకు దర్శనమ్ అక్షర హారతి 7

అమృతవాహిని గోదావరి – మరుమాముల వెంకటరమణశర్మ 10

పావన గోదావరి పుష్కరాలు – భండారు పర్వతాలరావు 11

పవిత్ర గోదావరి పుష్కర స్నాన విధి– శ్రీపాలకుర్తి నృసింహ రామ సిద్ధాంతి 19

శ్రీ గోదావరి పుష్కరకథ – శ్రీ మొకిరాల ప్రభాకరశర్మ 52

జల ప్రాధాన్యత – స్నాన ఆవశ్యకత – తోటపల్లి బాలకృష్ణ శర్మ 59

గోదావరి స్వగతం – డా॥ గరికపాటి నరసింహారావు 61

అమ్మలాగే... – ఆచార్య ఎస్వీ సత్యనారాయణ 62

పుష్కర స్నాన పుణ్యము – అష్టకాల నరసింహరామశర్మ 70

ఘనచరిత సొంతం – మూడు రాష్ట్రాలు పునీతం – అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని 71

గోదావరి జన్మ స్థలి నాసిక్ – త్రయంబకం – ప్రసాదవర్మ కామబుషి 74

వ్యాసభారతం – గోదావరి – ఆచార్య శలాక రఘునాథశర్మ 76

రాగఝరి.. గోదావరి – మరుమాముల దత్తాత్రేయ శర్మ 77

పుష్కర పుణ్య చరిత్ర – గౌరీభట్ల విట్ఠలశర్మ సిద్ధాంతి 81

కవితా గోదావరి –డా. కడిమిళ్ళ వరప్రసాద్ 83

పాపహరీ – గోదావరీ – ఆచార్య విజయశ్రీ కుప్పా 85

శ్రేష్ఠం... పవిత్రం.... గోదావరి పుష్కరం 88

గోదావరీ పుష్కరాష్టకమ్ – డా॥ అయాచితం నటేశ్వర శర్మ 89

పుష్కర గోదావరి – డా. కడిమిళ్ళ వరప్రసాద్ 91

ఆంధ్రమహాభారతంలో గోదావరి – ముదివర్తి కొండమాచార్యులు 92

శాసనాలలో గోదావరి – ఆచార్య ఎస్.ఎస్. రామచంద్రమూరి 94

వెండితెరపై గోదావరి వెలుగులు – పైడిపాల 97

జానపద సాహిత్యంలో గోదావరి సొరభాలు – డా॥ జి.ఎస్. మోహన్ 102

నదీ పర్వం – పుష్కర, కుంభమేళా – పీసపాటి నాగేశ్వరశర్మ 104

'మార్గ' కవితా మార్గదర్శి – నన్నయ ఋషి – మరుమాముల రుక్మిణి 108

భక్తి కవితా చతురానన – బమ్మెర పోతన – డా॥ సి. నారాయణరెడ్డి 110


భక్త కవిరాజు – శ్రీరామదాసు – మరుమాముల దత్తాత్రేయ శర్మ 116

గోదావరీ ప్రేంఖణం – వి.యల్.యస్. భీమశంకరం 117


భూషణ వికాస!... శ్రీధర్మపుర నివాస!! – డా॥ సంగనభట్ల నరసయ్య..... 118
అభినవ పోతన వానమామలై – భక్త డి. సురేష్‌కుమార్ 125
చైతన్య గోదావరి – కందుకూరి – డా॥ మన్నవ భాస్కరనాయుడు 128
ప్రాచీన, ఆధునిక కవులకు పుట్టినిల్లు గోదావరి – డా॥ గల్లా చలపతి, ప్రసాదవర్మ కామబుషి. 132
శ్రీ గోదావర్యష్టకమ్ – అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని..... 144
జనజీవన ధాత్రి 145
గోదావరి పుష్కరాల్లో గోపూజ – బ్రహ్మశ్రీ బాణాల శివసూర్య భాస్కర దుర్గావరప్రసాదు..... 147
పుష్కర గోదావరి – శాస్త్రుల రఘురామశర్మ..... 149
గోదావరి నదీస్నాన సమయములో చేయాల్సినవి, చేయకూడనివి – అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని 150
త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రం –గీతాప్రెస్‌వారి సౌజన్యంతో 151
త్రివేణి సంగమం – పవిత్ర కందకుర్తి – మరుమాముల వెంకటరమణశర్మ 154
పరమపావనంబు – భవ్య గోదావరి – ఆచార్య ఎం. కులశేఖరరావు..... 156
అన్ని విద్యలకూ నెలవు.. బాసర కొలువు – మరుమాముల దత్తాత్రేయశర్మ 157
జ్ఞానపీఠం.. బాసర – శ్రీ చుక్కా రామయ్య, ప్రముఖ విద్యావేత్త 160
దక్షిణ కైలాసం – కాళేశ్వరం – అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని 161
ఉత్తరవాహిని తీరం...అగస్తేశ్వరాలయం – మరుమాముల రుక్మిణి 163
వేదమూర్తులకు ఆలవాలం – మంథని – రంగి సత్యనారాయణ శర్మ..... 165
గోదావరి తీరం నుండి భారత ప్రధాని దాకా.... పీవీ నరసింహారావు – అదరాసుపల్లి శశిధర శర్మ 167
'అగ్రహారాల' సమాహారం – గోదావరీ తీరం – అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని..... 168
పుష్కర వైభవం – ధర్మపురి వైశిష్ట్యం – డా॥ సంగనభట్ల నరసయ్య 170
వేదశాస్త్ర సంప్రదాయ ధామం – ధర్మపురి – డా॥ బాచంపల్లి సంతోషకుమారశాస్త్రి..... 173
సాహిత్యంలో ధర్మపురి –సంగనభట్ల లాస్యప్రియ 174
పుష్కర సమయంలో దానాలు – విధులు 175
ప్రాచీన మహానగరం – కోటిలింగాల – డా॥ సంగనభట్ల నరసయ్య..... 176
అందరి దేవుడు భద్రాద్రి రాముడు – ఆరవేటి వెంకటసుబ్బయ్య..... 179
పరమపావన రామక్షేత్రం – కంచి పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ మహాస్వామి 182
పుష్కలామరభంగి! ఓ పుష్కరాంగి! – జి.ఎం. రామశర్మ..... 183
పుష్కరోత్సవము – శ్రీమాన్ వేముగంటి నరసింహాచార్యులు..... 185
అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి – డా॥ అల్లాడి సంధ్య..... 186

❖ ❖ ❖

జగద్గురువుల దివ్యాశీస్సులతో...



కృత్యంజలి



అన్నపూర్ణమ్మ మాయమ్మ అన్నపూర్ణ
రాజమౌళియె మా తండ్రి రాజమౌళి
తత్కుమారుడ నగు సుకృతమ్ము వలన
నీ కృతిని వారి కంకిత మిత్తు భక్తి

సంపాదకీయం

పుష్కర శోభ

కాలచక్రం గిర్రున తిరిగింది. పుష్కరకాలం సమీపించింది. తెలుగువారి జీవననాడియైన గోదావరీ నదికి మళ్లీ పుష్కరశోభ వస్తోంది జూలై మాసంలో. గురుడు ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తే ఒక్కోనదికి పుష్కరం వస్తుంది. ఆ కాలంలో ఆ నదీజలాల్లో సకల పుణ్యనదుల జలాలు వచ్చి చేరతాయని, తద్వారా పుష్కరకాలంలో ఆయా నదీ జలాల్లో స్నానమాచరించినవారికి సర్వపాపాలు దూరమైతాయని, సకల శుభాలు సంప్రాప్తిస్తాయని హిందువుల నమ్మకం నమ్మకం. అలాంటి పుణ్యప్రదమైన పుష్కరశోభతో ఈ జూలై మాసంలో మన గోదావరీ మాత మనల్ని తరింపజేయబోతున్నది.

పుష్కరం కేవలం నదీస్నానాలకు మాత్రమేనా? కేవలం పుణ్య సమూపార్జన కోసమేనా? వ్యక్తికి పుణ్యం రావడమే లక్ష్యమైతే పుష్కరాన్ని సామాజికం చేయవలసిన అవసరమేమిటి? దాన్ని కూడా నైమిత్తిక అర్చనలలో భాగంగా చెయ్యవచ్చుగా? అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే, మన పూర్వీకులు ఈ పుష్కర నియమాన్ని ఎందుకు ఆరంభించారో తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

పూర్వం రవాణా సౌకర్యాలు ఇంతగా వృద్ధి చెందిలేవు. వివాహితలైన పుత్రికలు, అక్కచెల్లెళ్లు తమతమ అత్తవారిళ్లనుండి మాటిమాటికీ పుట్టింటికి రావడానికి అవకాశాలు తక్కువ. అలాగే వేర్వేరు ప్రాంతాలలో ఉండే అన్నదమ్ములు, దాయాదులు, బంధువుల విషయంలో కూడా. వీరిని అప్పుడప్పుడైనా కలపడానికి పర్వాలు, సంస్కారాలు నియమించారు మన పూర్వీకులు. ఒక నదీ పరివాహక ప్రాంతానికి చెందినవారు కనీసం పన్నెండేళ్లకాలంలో ఒక్కసారైన కలుసుకోవాలని నిబంధన విధించారు. పుష్కరకాలం వరకు భర్త అచూకీ తెలియకపోతే ఆయన ఇకలేనట్టే, పుష్కరకాలం ఒక బంధువుతో సంబంధాలు లేకపోతే ఆ బంధం తెగిపోయినట్టే, పుష్కరకాలం ఆస్తి ఎవరి అనుభుక్తంగా ఉంటే వారికే స్వంతం అన్న భావాలను ప్రచారంలోకి తీసుకువచ్చి, కనీసం పుష్కరకాలంలోనైనా తమ బంధువులను కలిసి, వారితో ఆత్మీయంగా గడిపి, తమ బంధాలను మరొక్కసారి బలోపేతం చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇది సామాజికంగా పుష్కరాల వెనుక ఉన్న ప్రయోజనం. అందుకే కుంభమేళా లేదా పుష్కరం దేశం మొత్తాన్ని ఆకర్షిస్తోంది.

పుష్కరాలు లక్షలాదిమంది భక్తుల, విశ్వాసుల కూడికకు అవకాశమిచ్చే సందర్భం కావడంతో ప్రభుత్వాలు తమ పాలనా ప్రాంతంలో ఉన్న పుష్కరనదుల వద్ద స్నానాలకు, ఆలయాల సందర్శనకు, ఆరోగ్య పరిరక్షణకు, భద్రతకుగాను ఎన్నో సదుపాయాలు, ఏర్పాట్లు చేస్తాయి. చేస్తున్నాయి. అయితే కాలం మారుతున్న కొద్దీ అందించాల్సిన సేవలు మారుతాయి. గత పుష్కరాలనాటికి ఒక్క రాష్ట్రప్రజలుగా ఉన్న తెలుగువారు ఇప్పుడు రెండు రాష్ట్రాల ప్రజలుగా మారిపోయారు. ఇప్పుడు రెండు ప్రభుత్వాలు ఈ సేవలను అందించాలి. మన అదృష్టమో, దురదృష్టమో ఈ రెండు ప్రభుత్వాల మధ్య ఇప్పుడు ప్రతి విషయంలోనూ అహమహమిక నడుస్తోంది. ఈ పోటీ పుష్కరప్రజలకు మేలు కలిగిస్తే మంచిది.

పుష్కరఘాట్ల నిర్మాణం, రోడ్ల నిర్మాణం, నీటి సదుపాయం, ఆవాస సౌకర్యాలు కల్పించడం, అత్యవసరమైన మందులు, వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడం, సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం వంటి సేవలను ప్రభుత్వాలు అందిస్తాయి. తెలంగాణా, ఆంధ్ర ప్రభుత్వాలు ఈ సౌకర్యాల కల్పనలో ఒకదానితో ఒకటి పోటీపడి తెలుగు ప్రజలు మనసారా ఆశీర్వదించేలా సేవలందించాలని దర్శనమ్ కోరుకుంటున్నది.

మరుమాముల వెంకటరమణశర్మ

దక్షిణగంగకు 'దర్శనమ్' అక్షర హారతి!

అద్భుతం. అత్యద్భుతం. ఆనందం – పరమానందం. పవిత్రమైన గోదావరీ నదీమతల్లికి పుష్కరోత్సవ శోభ కలకలలాడుచున్న తరుణంలో ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక 'దర్శనమ్' ఆధ్వర్యంలో "అఖండ గోదావరి పుష్కరదర్శనమ్' అను పేరుతో అత్యంత విశిష్టమైన రీతిలో వెలువరించిన ఈ ప్రత్యేక సంచికను జ్ఞానవిజ్ఞాన సర్వస్వమని నిస్సంకోచంగా చెప్పవచ్చును. ఈ సందర్భంగా దర్శనమ్ పత్రికా యాజమాన్యానికి నా హృదయపూర్వక అభినందనలు.

రేవాతీరే తపఃకుర్యాత్ మరణం జాహ్నవీ తటే । దానం దద్యాత్ కురుక్షేత్రే గౌతమ్యాం త్రితయంవరమ్ ॥

రేవాతీరంలో తపస్సు చేయటం, గంగాతీరంలో మరణించటం, కురుక్షేత్రంలో దానం చేయటం అత్యంత ముక్తిప్రదం అని చెప్పబడింది. అయితే ఈ మూడింటి ఫలాన్ని మూట కట్టుకొనే చోటు ఒక్కటే ఒక్కటి. అదే దివ్యమైన, పవిత్రమైన తీర్థం గోదావరి అని స్పష్టంగా వక్కాణింపబడింది.

మన భారతీయ సంప్రదాయంలో ప్రతినిత్యం స్నానం చేసేముందు చెప్పే సంకల్పంలోగానీ, దేవతార్చనలో చేసే కలశారాధనయందుగానీ **"గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి । నర్మదే సింధుకావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"** అంటూ పవిత్రమైన నదులను స్మరించి వాటి జలాలను ఆవాహనం చేయడం పరిపాటి.

"పుష్కరాద్యాని తీర్థాని గంగాద్యాః సరితస్తథా । ఆగచ్ఛంతు పవిత్రాణి స్నానకాలే సదా మమ ॥

అని స్నానం చేసే ముందు ఈవిధంగా గంగా గోదావరి మున్నగు నదీజలాలను ప్రార్థిస్తుంటాం. పవి అంటే సంసారము, పవిత్రాణఱి అంటే – సంసార బంధనములనుండి విముక్తిని ప్రసాదించేవి నదీజలాలు అని విశిష్టంగా చెప్పబడింది.

తెలుగుజాతికి గోదావరి దక్షిణగంగా వాసిగాంచిన అత్యంత తధానమైన జీవనది. మహారాష్ట్రలో పుట్టి పెరిగి, తెలంగాణలో ప్రవేశించి గలగలా పరుగెత్తుతూ ఆంధ్రరాష్ట్రంలోని అంతర్వేదిని ఆఖరి మజిలీగా చేసికొని మాతృగర్భమైన అగాధ జలరాశిలో లీనమై పోతుంది గోదావరి.

పేరులోనే పెన్నిధి ఉంటుందనేది నానుడి. ఆ కోణంలో గోదావరి పేరును పరిశీలిస్తే – ఇందులో నాలుగు అక్షరాలున్నాయి. **'గో'** అంటే గోవు, భూమి, ఇంద్రియ సమూహం అని అనేక అర్థాలను నిఘంటువులు చెప్తున్నాయి. **'దా'** అంటే దదాతి – ఇచ్చునది అని అర్థం. **'వ'** – వం అనేది అమృతబీజం; ఇక **'ర'** – రం అంటే అగ్నిబీజం. ఈ నాలుగు అక్షరాల సముదాయాన్ని సమన్వయం చేసి అర్థం చెప్పితే – 'రం' అనే బీజంలోగల అగ్నిని తన గర్భంలో ఇముడ్చుకొని, వ–'వం' అనే అమృతబీజంలోగల అమృతత్వంతో ప్రవాహ జలాన్ని అమృతీకరణం చేసి గో అనగా ఇంద్రియ సమూహం కలిగిన సమస్త ప్రాణికోటికి నిరంతరాయంగా అమృతజలంతో పోషిస్తున్నదే "గోదావరి" నది అని చెప్పవచ్చును.

ఇంతటి గంభీరమైన, పవిత్రమైన పేరు గలిగి జీవనాధారమైన గోదావరి నదీమతల్లికి స్వయం ప్రతిపత్తితో కూడిన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన శుభతరుణంలో తొలిరోజుల్లో అత్యంత పుణ్యప్రదమైన పుష్కరోత్సవాలు రావడంవలన పూవుకు తావి అబ్బినట్లయింది. చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలుస్తుంది.

గోదావరికి పుష్కరాలు వచ్చాయి. గోదావరి పేరులోగల పెన్నిధిని పైన గమనించాలి. ఇక పుష్కరం అంటే ఏమిటో చూద్దాం–

శ్లో॥ పుష్కరం కరిహస్తాగ్రే వాద్యభాండముఖే జలే । వ్యోమ్ని ఖడ్గఫలే పద్మే తీర్థౌషధి విశేషయోః ॥

అని అమరకోశంలోని నానార్థవర్గంలో చెప్పబడింది. పుష్కర శబ్దము 1. ఏనుగు తొండము కొనకు, 2. మద్దెల వంటి వాద్యముల ముఖానికి, 3. నీళ్ళకు 4. ఆకాశమునకు, 5. కత్తి పదనుకు, 6. పద్మమునకు 7. తీర్థభేదమునకు, 8. ఓషధి –

విశేషమునకు పేరుగా చెప్పబడింది. దీన్ని ఒకసారి పరిశీలిస్తే – పుష్కరం అంటే తీర్థవిశేషం, తీర్థభేదం అని ముఖ్యంగా చెప్పవచ్చును.

అయితే మహానదులన్నీ ప్రాణుల పాపపంకిలాలను తమలో ఇముడ్చుకొని ఆ ప్రాణులను పవిత్రులనుగా మార్చుతాయి. ఆ రకంగా జీవులు పునీతులవుతున్నారు. కాని, పాపపంకిలభరితమై నదులను తిరిగి పునీతం చేయదలచిన పుష్కరుడనే ఒక బ్రాహ్మణుడు త్యాగపూర్వకంగా తపస్సు చేసి శివుణ్ణి మెప్పించాడు. శివుని వరప్రదానం వలన పుష్కరుడు జలతత్త్వసిద్ధిని పొందాడు. అనంతరం అతడు బ్రహ్మదేవుని కోరిక మేరకు జలంగా మారి బ్రహ్మకమండలం చేరాడు. ఆ తర్వాత దేవగురువు అభ్యర్థనతో పుష్కరుని సమాగమంతో ఒక్కొక్కరాశిలోనికి గురువు మారినప్పుడల్లా ఒక్కొక్క మహానదికి పుష్కరాలు ఏర్పడతాయని, పుష్కరకాలంలో పుష్కరుని త్యాగంవలన ఆయా నదులకు తిరిగి పవిత్రత కలిగే అవకాశం వచ్చిందని పురాణ కథనం. ఇందులో మొదటి 12 రోజులు అత్యంత పవిత్రమైనవిగా చెప్పబడినవి. ఈ తరుణంలో పుష్కరకాలంలో స్నానం చేయుటద్వారా, తీర్థవిధులను పాటించుట ద్వారా నదీదర్శనం వలన పవిత్రం కాగలిగే భక్తజనులందరం పుష్కర శబ్దానికి పైన చెప్పబీపడిన అర్థాలను, తాత్పర్య పూర్వకంగా ఒకసారి గమనిద్దాం.

1. ఏనుగు తన తొండము కొనతో ఎంతటి చిన్న సూదివంటి వస్తువునైనా పట్టుకున్నట్లుగా పుష్కరకాలంలోని నదీజలంలో గల పవిత్రతను భక్తిశ్రద్ధలతో స్వీకరించాలి.
2. మద్దెలవంటి వాద్యముల ముఖాలను వాయించినప్పుడు చక్కని తాళధ్వనులు వచ్చినట్లుగా నదీతీరంలో చెప్పబడే బ్రాహ్మణోత్తముల వేదమంత్రాలను, గోదావరీ పుష్కర మాహాత్మ్యాలను, మహాత్ముల ప్రవచనాలను సావధానంగా వినగలగాలి.
3. నదీజలాలను పవిత్రంగా వాడుకోవాలి. అపవిత్రం కాకుండా జాగ్రత్త పడాలి.
4. సర్వవ్యాపకమై శబ్దగుణము కలిగినది ఆకాశం. కావున గోదావరీ పరీవాహక ప్రాంతమంతటా వెలసిన వివిధ తీర్థస్థానాలలో, క్షేత్రాలలో అంతటా దైవత్వం సర్వవ్యాపకమై యున్నదని భావించి, గోదావరీ నదీమతల్లిని దర్శిస్తూ ప్రార్థించాలి.
5. పదను కలిగిన కత్తిని బహుజాగ్రత్తగా వాడుకొన్నట్లుగా పుష్కరోత్సవ శోభను కలిగిన జలాలను కడు జాగ్రత్తగా వినియోగించుకోవాలి.
6. సూర్యకిరణాలకు విప్పారిన పద్మము తనను చూచే వారికి మానసిక ఆహ్లాదాన్ని కలిగించినట్లుగా, పుణ్యప్రదమైన నదీతీరంలో నిర్మలంగా గలగలా ప్రవహించే నదీజలాలను పవిత్రమైన దైవభావంతో దర్శించి ఆనందించాలి.
7. తీర్థమునందు స్నానము చేసి, తీర్థవిధులను చక్కగా ఆచరించి పుష్కరకాల పుణ్యరాశిని మూటగట్టుకోవాలి.
8. చివరగా పుష్కరమంటే ఓషధి విశేషం అనగా – ఉదకము నందు అనేక ఔషధ గుణాలుంటాయని ఆయుర్వేద శాస్త్రం, ఆధునిక సైన్స్ చెప్తుంది. పుష్కర సమయంలో ప్రత్యేక ఔషధ గుణాలతో ప్రభావాన్వితమైన జలాలను ఔషధ విశేషంగా వాడుకోవటం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యాన్ని కాపాడుకొనవచ్చును.

ఇంతటి మహిమాన్విత విశేషాలతో కూడిన పుష్కరం జీవనదియైన గోదావరికి ఇప్పుడు రావటం అందులో కూడా అధిక ఆషాఢమాసమైన 'పురుషోత్తమ మాసం'లో రావడం చెప్పుకోదగ్గ మరింత గొప్ప విశేషం.

'అఖండ గోదావరీ పుష్కర దర్శనమ్' అను పేరుతో అందింపబడిన ఈ విశిష్ట సంచికలో ఎందరో విద్వాంసులు, పండితులు, కవులు రచించినర పుష్కర విశేషాలు, గోదావరి విశిష్టతలు, ఇంకా ఎన్నో ఎన్నెన్నో అంశాలను తెలియజేసే అపూర్వమైన అంశాలు దర్శింపజేయబడినాయి.

ముందుగా పుష్కరశోభను గూర్చిన సంపాదకీయంతో పాటుగా పవిత్ర గోదావరిని పరిచయం చేసిన తీరు శ్లాఘనీయం. పురాణాంతర్గతమైన గోదావరీ మాహాత్మ్యము; గోదావరి పుష్కరాల పరిచయంతోబాటుగా జలప్రాధాన్యత, స్నాన ఆవశ్యకతను గూర్చి నొక్కి చెప్పబడింది. తదుపరి పుష్కర స్నానవిధి వైదికంగా, పౌరాణికంగా విధివిధానమంతా ఎంతో చక్కగా పొందుపరచ బడింది. గోదావరి గమనాన్ని వివరిస్తూ చరిత్రలో ముడివడిన గోదావరిని విశ్లేషిస్తూ, గోదావరి జన్మస్థలమైన నాసిక – త్ర్యంబకాల పరిచయం చాలా బాగుంది. 'అందరి దేవుడు – భద్రాద్రి రాముడు' అనే అంశంతో పాఠకుల దృష్టిని కేంద్రీకరింపజేసి 'వెండితెరపై గోదావరి వెలుగులు' చూపించి పఠితలను పులకింపచేసిన రచనలు ప్రశంసనీయాలు. గోదావరీ తీరంలోగల పుణ్యక్షేత్రాలను, తీర్థభేదాలను, రామదాసు వంటి పరమభక్తుల చరిత్రలను, ప్రాంతీయ కవులను, సంఘసంస్కర్తలను, మహనీయులను, అనేక దేవాలయాలను, అగ్రహారాలను, పట్టణాలను కన్నులకు కట్టినట్లుగా ప్రామాణికంగా నిబద్ధతతో కూడిన రచనలు పఠితలకు అనేకానేక జ్ఞానవిజ్ఞాన విశేషాలను అందచేస్తాయని ఖచ్చితంగా చెప్పవచ్చును. అటు వ్యాసభారతంలో, ఇటు ఆంధ్రమహాభారతంలో, పురాతన శాసనాలలో, తెలుగు జానపద సాహిత్యంలో గోదావరిని గూర్చి వర్ణించిన తీరుతెన్నులను పరిచయం చేసిన రచనలు ఎంత చదివినా తనివితీరదు. పవిత్ర గోదావరీ తీరంలో వెలసిన పుణ్యస్థలాలు – జ్యోతిర్లింగంగా చెప్పబడిన త్ర్యంబకేశ్వరం, గోదావరికి సీతారాములకు విడదీయరాని అనుబంధంగా, అగ్రగణ్యంగా వెలసిన భద్రాద్రి, త్రివేణీ సంగమంగా, తెలంగాణలో గోదావరికి తొలి అడుగుగా నిలిచిన కందకుర్తి, చదువుల తల్లికి నిలయమైన బాసర, మరొక త్రివేణీ సంగమ తీర్థస్థలమైన కాళేశ్వరం, ఉత్తరవాహినీ తీరంలోగల అగస్తేశ్వరాలయం, వేదశాస్త్ర సంప్రదాయ ధామంగా, నృసింహస్వామికి క్షేత్రంగా వెలసిన ధర్మపురి, కోటిలింగాలు, మంథని రాజమహేంద్రవరం వంటి స్థలాలను గూర్చిన పౌరాణిక, చారిత్రిక పరిచయాల రచనల సమాహారం పఠితలకు ముదావహంగా ఉంటాయని చెప్పవలసిన పనిలేదు.

ప్రముఖ కవులు రచించిన పుష్కరాష్టకం, గోదావరి ప్రేంఖణం, రాగఝరీ వంటి అనేక పద్యరచనల పరిమళాల గుబాళింపులు పాఠకుల యెదలను పులకింపచేస్తాయి.

వైదికంగా, పౌరాణికంగా, సాహిత్యపరంగా, చరిత్రపరంగా ఇంకా అనేక వివిధ అంశాలతో కూడిన వేరు-వేరు కోణాలలో పరిశీలించినర వైవిధ్యభరితమైన పలు అంశాలతో కూడిన రచనల సమాహారాన్ని గుదిగ్రుచ్చి పుష్కరోత్సవాల సందర్భంగా గోదావరి నదీమతల్లికి అమూల్యమైన రత్నాలహారంగా అర్పించిన 'అఖండ గోదావరి పుష్కర దర్శనమ్' జ్ఞానవిజ్ఞాన దాయకం. పుష్కరోత్సవ వేళ గోదావరిని దర్శించే భక్తజనులకు విశిష్టమైన ఈ సంచిక ఒక కరదీపిక. జిజ్ఞాసువులకు ఈ సంచిక ఒక కల్పతరువు. తెలుగు ప్రజలందరు తమ ఇంటి గ్రంథాలయంలో దాచుకోదగిన పారిజాతపాదపము.

ఎంతయో శ్రమకోర్చి, అందరికి అన్నిరకాలుగా ఉపయోగపడే రీతిలో ఇంతటి గొప్ప విశిష్టమైన ప్రత్యేక సంచికను సిద్ధపరచి తెలుగు పాఠకుల కరకమలాలకు అందించిన ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక 'దర్శనమ్' యాజమాన్యమును మరొక్కమారు హృదయపూర్వకంగా అభినందిస్తూ నాకు ముందుమాటను వ్రాసే అవకాశాన్ని ప్రేమతో అందించిన దర్శనమ్‌వారికి ఇవే నా హృదయపూర్వక కృతజ్ఞతలు. శేషం భగవత్కృప.

శ్లో॥ పుష్యార్కే జన్మనక్షత్రే వ్యతీపాతే చ వైధృతౌ । సకృత్ గోదావరీ స్నానం కులకోటిం సముద్ధరేత్ ॥

సుజన విధేయుడు

మదునూరి వెంకటరామశర్మ

గీతాప్రెస్ – గోరఖ్‌పూర్, తెలుగు అనువాద విభాగసేవకులు
సెల్ : 78931 42535

అమృతవాహిని గోదావరి

దక్షిణ గంగగా భాసిల్లుతున్న పవిత్ర గోదావరీనది ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. భారతదేశంలో దక్షిణం వైపు మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలమీదుగా ఈ నది ప్రవహిస్తుంది. దక్షిణ, పశ్చిమ భారతదేశం ప్రాంతంలో ఈ నది ఆవరించి ఉంది. ఈ నదికి ఎడమవైపున పూర్ణ నది, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరు, వైన్‌గంగ, పెన్‌గంగ, వర్ణ, దుధన కుడివైపున ప్రవర, మంజీర, పెద్దవాగు, మన్నేరు, కిన్నెరసాని, మానేరు నదులు ఉపనదులుగా గోదావరిలో కలుస్తాయి. గోదావరి నదిపై శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాదసాగర్ ప్రాజెక్టు, ధవళేశ్వరం ప్రాజెక్టులు ఉన్నాయి. మహారాష్ట్ర నాసిక్‌లోని త్ర్యంబకేశ్వర్‌లో ఉద్భవిస్తున్న ఈ నది ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

ఈ నది పరీవాహక ప్రాంతంలో నాసిక్, నాందేడ్, నిజామాబాద్, రాజమండ్రి నగరాలు చారిత్రకతను సంతరించుకుని దర్శనీయ స్థలాలుగా విలసిల్లుతున్నాయి. గోదావరి నది ఎత్తు **920** మీటర్లు **(3018** అడుగులు), అక్షాంశ రేఖాంశాలు **$19^0$55'48" $73^0$31'39"**. మొత్తం నది పొడవు **1465** కిలోమీటర్లు. **(910** మైళ్ళు). నిర్మాణంలో వున్న ప్రాజెక్టు పోలవరం. గోదావరి నది భారతదేశంలో గంగా, సింధు తర్వాత అతి పెద్ద నది. మహారాష్ట్రలో నాసిక్ దగ్గరలోని త్ర్యంబకంలో అరేబియా సముద్రానికి **80** కిలోమీటర్ల దూరంలో జన్మించి, నిజామాబాద్ జిల్లా రంజల్ మండలం, కందకుర్తి వద్ద తెలంగాణలో ప్రవేశించి ఆ తరువాత అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలమీదుగా ప్రవహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలమీదుగా బంగాళాఖాతంలో సంగమిస్తుంది.

ఈ నదీ తీరాలలో విఖ్యాత పుణ్యక్షేత్రాలు, పట్టణాలు వున్నాయి. త్ర్యంబకేశ్వర్, కోపర్‌గావ్, పైఠాన్, నాందేడ్, తెలంగాణలో బాసర, ధర్మపురి, కాళేశ్వరం, కోటిలింగాల, గోదావరిఖని, మంథని, భద్రాచలం, ఆంధ్రప్రదేశ్‌లో పట్టసం, కొవ్వూరు, రాజమండ్రి, మందపల్లి, కోటిపల్లి, ముక్తేశ్వరం, రాజులపాలెం, తాతపూడి, రాజోలు, నర్సాపూర్, మురుమళ్ళ, అంతర్వేది పుణ్యక్షేత్రాలు. ధవళేశ్వరం దగ్గర అఖండ గోదావరి (గౌతమి) ఏడుపాయలుగా చీలుతుంది. అవి గౌతమి, వసిష్ఠ, వైనతేయ, ఆత్రేయ, భరద్వాజ, తుల్యభాగ, కశ్యప. ఇందులో గౌతమి, వసిష్ఠ, వైనతేయలు మాత్రమే ప్రవహించే నదులు. మిగిలినవి అంతర్వాహినులు. ఆ పాయలు సప్తఋషుల పేరుమీద పిలువబడుతున్నాయి.

ఎందరో ఋషులు, తపస్సంపన్నులు, మహాత్ములు, యతీశ్వరులకు జన్మనిచ్చిన గోదావరి పరీవాహక ప్రాంతం అనేక పుణ్యక్షేత్రాలకు నెలవై వుంది. ఈ గోదావరి తీరంలోనే ఎందరో మహాకవులు గొప్పకావ్యాలు విరచించారు. లక్షలాది ఎకరాలకు సాగునీరును, తాగునీరును అందించడమేగాక నాలుగు రాష్ట్రాల కల్పవల్లిగా విరాజిల్లుతున్న పవిత్ర నదీమతల్లి, దక్షిణగంగ, గోదావరినది పుష్కర మహోత్సవాలు మన్మథ నామ సంవత్సరం అధిక ఆషాఢ బహుళ త్రయోదశి, మంగళవారం **14.07.2015**న ఉ.**6.25** ని.లకు బృహస్పతి సింహరాశిలో మఖ నక్షత్రం, 1వ పాదంలోకి ప్రవేశించడంతో గోదావరి పుష్కరాలు ఆరంభమవుతాయి. నిజ ఆషాఢ శుద్ధ నవమి, శనివారం **25.07.2015**న ముగుస్తాయి. ఈ **12** రోజులపాటు అంగరంగవైభవంగా ఉభయ తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు పుష్కర మహోత్సవాలను నిర్వహించడానికి సకల ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల మాహాత్మ్యం, గోదావరి ప్రాంతంలోని ప్రదేశాలు, మహిమాన్విత, దర్శనీయ క్షేత్రాలు, మహానుభావులు, మహాకవులు సకల విశేషాలను అందించేందుకు 'దర్శనమ్' చేస్తున్న ఈ ప్రయత్నమే 'అఖండ గోదావరి పుష్కర దర్శనమ్'.

పాఠకదేవుళ్ళు ఈ గ్రంథాన్ని ఆదరిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

– మరుమాముల వెంకటరమణ శర్మ

పావన గోదావరి పుష్కరాలు



2015 జులై 14 నుండి గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. దాదాపు ఐదుకోట్ల మంది భక్తులు గోదావరీ పుణ్యజలాలలో స్నానమాడి పునీతులు కావాలని గోదావరీ తీరంలోని వివిధ క్షేత్రాలకు తరలిరానున్నారు. ప్రభుత్వ యంత్రాంగమే కాక, అనేక స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు సకల సౌకర్యాలు సమకూర్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్నాయి.

పుష్కరం అంటే....?

ప్రచారంలో వున్న ఒక కథ ప్రకారం పుష్కరుడనే బ్రాహ్మణుడు తీవ్రమైన తపస్సును చేసి శివుని మెప్పించాడు. శివుని అష్టమూర్తులలో ఒకరైన జలమమత్వ సిద్ధి పొందాడు. సర్వతీర్థాలనూ పవిత్రం చేయగల దివ్యశక్తి అతనికి లభించింది. అతడిని బ్రహ్మ జలరూపంలో తన కమండలంలో ఉంచుకున్నాడు. ఇదిలా వుండగా గ్రహరూపంలో ఆకాశంలో వెలిగే దేవగురువు బృహస్పతి బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. తాను (గురుగ్రహం) ఒక రాశి నుండి మరొక రాశికి చేరే సమయంలో మొదటి 12 రోజులూ, చివరి పన్నెండు రోజులూ పుష్కరుడు తనతో కలిసి ఉండేలా వరం పొందాడు. బృహస్పతితో కలిసి పుష్కరుడు ఒక్కొక్క రాశిలోకి మారినప్పుడు ఒక్కొక్క నదికి పుష్కరాలు వస్తాయి. ఎప్పుడూ పావనంగా వుండే నదీజలాలు, పుష్కర సంయోగంతో పరమపావనంగా మారి ముక్తిదాయకాలౌతున్నాయి.

మరొక కథ ప్రకారం బ్రహ్మ పుష్కరుని సృజించాడు. తీర్థాలన్నింటికీ అతడిని ఆదిదేవునిగా చేశాడు. బ్రహ్మ ఆజ్ఞ ప్రకారం పుష్కరుడు ఒక్కొక్క నదిలో బృహస్పతితో పాటు సంవత్సరం మొదట 12 రోజులు, సంవత్సరాంతంలో 12 రోజులు ఉంటాడు. పుష్కరుడు ఏ నదిని కూడి వుంటే ఆ నదికి ఆ యేడు పుష్కరాలు వస్తాయి. బ్రహ్మ, విష్ణువు, శివుడు, సకల దేవతలు, సకల మహర్షులు అందరూ పుష్కర సమయంలో ఆ నదీ జలాలలో వుంటారు. కనుక ఆ సమయంలో ఆ నదీ జలాలు ఎంతో మహిమాన్వితంగా, పరమపావనంగా శోభిల్లుతుంటాయి.

పుష్కరాలు వచ్చే నదులు

పుష్కరునితో సంయోగం లభించే నదులు కూడా పన్నెండే. అవి గంగ (మేషం), గోదావరి (సింహం), కృష్ణా (కన్య), నర్మద (వృషభం), సరస్వతి (మిథునం), యమున (కర్కాటకం), కావేరి (తులా), భీమ (వృశ్చికం), పుష్కర (ధనుస్సు), తుంగభద్ర (మకరం), సింధు (కుంభం), ప్రాణహిత (మీనం) అని ఎబికె ప్రసాద్ సంకలనం చేసిన సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రచురణ, 'తల్లి గోదావరి' తెల్పుతోంది. ఇందులో గంగ, గోదావరి కృష్ణ, నర్మద, కావేరీ, సింధు మాత్రమే నదులు. సరస్వతి ప్రస్తుతం అంతర్వాహిణి. యమున, భీమ, తుంగభద్ర, ప్రాణహితలు ఉపనదులు. పుష్కరం సరస్సు. అయితే ఈ జాబితా కాక వేరే జాబితా కూడా ఈ సందర్భంలో ప్రచారంలో ఉన్నాయి. దక్షిణాదిన మహామాఘం అనే కొలను వద్ద మాఘమాసంలో 'మేళా' జరుగుతుంది. స్థానికులు దానిని 'పుష్కరాలు'గానే నిర్వహించుకొంటారు.

జాతీయ సమైక్యత

ఆయా నదులకు పుష్కరాలు ఇలా 12 సంవత్సరాల కొకసారి వస్తాయి. ఏ నదికి ఎప్పుడు పుష్కరాలు వచ్చినా, ఆ నదీ తీరవాసులేగాక, భారతదేశంలోని పలు ప్రాంతాల నుండి

అక్కడికి జనం తీర్థప్రజగా తరలివస్తారు. నేపాల్ దేశస్తులు, ఇతర దేశాలలో వుంటున్న ప్రవాస భారతీయులు కూడా పుష్కరాలకు వస్తుంటారు. ఇలా పుష్కరాలు జాతీయ సమైక్యతకు దోహద పడుతుంటాయి.

పుష్కర విధులు

గోదావరీ పుష్కర సమయంలో జనం పెద్ద సంఖ్యలో వచ్చి, గోదావరిలో స్నానం చేస్తారు. నదీ జలాలలో స్నానం చేయడానికి ఒక పద్ధతి ఉంది. స్నానం చేసే ముందు శాస్త్రోక్తంగా సంకల్పం చెప్పుకోవాలి. దంపతులు 'సరిగంగ' స్నానాలు చేస్తారు. భార్య చీరకొంగున భర్త ఉత్తరీయపు కొంగునూ కలిపి ముడివేసి, సంకల్పం చెప్పుకొన్న తరువాత ఇద్దరు ఒకేసారి కలిసి నీటిలో మూడు మునకలు వేయటం సరిగంగ స్నానం. అయితే సంకల్పం కాగానే స్నానం చేయరాదు. ముందుగా ఒడ్డున గల మట్టిని కొంచెం చేతితో తీసికొని 'కృత్య' అనే శక్తిని స్మరించి, ఆ మట్టిని నదిలో పడవేయాలి. ఆ తర్వాతనే స్నానం. దంపతులకు విడివ్యక్తులకు అందరికీ 'కృత్య' స్మరణం తప్పనిసరి. ఎవరైతే కృత్యను స్మరించి మట్టి నదిలో వేయకుండా స్నానం చేస్తారో, వారికి ఆ నదీస్నానం వల్ల లభించవలసిన పుణ్యం లభించదు. ఆ పుణ్యం కృత్యకే పోతుంది.

స్నానం తర్వాత తండ్రిలేని వాళ్లు పితృతర్పణాలను వదలడం, శ్రాద్ధకర్మ చేసి పిండప్రదానాన్ని జరపడం చాలా ముఖ్యం. పుష్కర సమయంలో నదీతీరంలో పెట్టే శ్రాద్ధం విశేషఫలప్రదం.

నదీపూజ

పుష్కరాల సమయంలో గౌతమీపూజ చేస్తారు. అంటే, గోదావరీ మాత పూజ అన్నమాట. షోడశోపచారాలతో అర్చన చేసి, అష్టోత్తర శత (108) నామాలతో స్తోత్రం చేస్తారు. రాత్రిపూట ఈ 12 రోజులూ బ్రహ్మపురాణంలో 114వ అధ్యాయంలో వున్న 'గౌతమీ మాహాత్మ్యమ్'ను భక్తులు పారాయణ చేస్తారు.

ఏ క్షేత్రం ప్రధానం?

కొంతమందికి గోదావరి పుష్కరాలను గోదావరీ తీరంలోని ఏ క్షేత్రంలో జరపాలి అన్న సందేహం వస్తుంది. త్ర్యంబకమ్ నుండి బంగాళాఖాతంలో చేరబోయే సంగమ స్థానం దాకా అంతా ఒకే గోదావరి. పుష్కరుడు, సకల దేవతలతో, ఋషులతో కూడి గోదావరి జలాలంతటి లోనూ ఉంటాడు. కనుక పవిత్ర గోదావరిలో ఎక్కడ స్నానం చేసినా, దానాదులిచ్చినా ఒకటే. అది ఎక్కువ, ఇది తక్కువ అనుకోడం తగదు. అలా పుణ్యక్షేత్రాల పట్ల వ్యత్యాసం చూపడం క్షేత్ర తిరస్కారం అవుతుంది. గోదావరిలో స్నానం చేసేటప్పుడు ముందుగా గోదావరీ నదీమ తల్లినే ధ్యానించాలి. పూజించాలి. స్తుతించాలి. ఆ తరవాతనే ఇతర నదులను, తీర్థాలను కావాలనుకుంటే స్మరించవచ్చు. ఒక జీవనదిలో స్నానం చేస్తూ, మరొక జీవనదిని స్తుతించడం తగదు. స్నానానంతరం సూర్యుని దిక్కుగా తిరిగి మూడుసార్లు అర్ఘ్యప్రదానం చేయాలి. పుష్కరాల సమయంలో ఏ పూజ చేసినా, ఏ శ్రాద్ధకర్మ చేసినా, ఏ దానం ఇచ్చినా, ఆఖరుకు స్నానం చేసినా ముందుగా శాస్త్రోక్తంగా సంకల్పం చెప్పుకొనడం తప్పనిసరి.

పుష్కరాలు వచ్చిన సంవత్సరం ఆ నదీ తీరవాసులు సాధారణంగా వివాహం మొదలైన శుభకార్యాలు చేయరు. అటువంటి శుభకర్మల అవసరం వస్తే శాస్త్ర, సంప్రదాయాలను తెలిసిన పెద్దలను సంప్రదించడం మంచిది.

అంకురం

గోదావరి మహారాష్ట్రలో పడమటి కనుమలలో సముద్రమట్టానికి 1067 మీటర్ల ఎత్తున వున్న త్రయంబకం వద్ద జన్మించింది. త్రయంబకం నాసిక్ పట్టణానికి దగ్గర్లో వుంటుంది. త్రయంబకంలో కొండరాతిలో అమర్చివున్న ఒక గోముఖం నుండి సన్ననది ధారగా గోదావరి బయలుదేరుతోంది. ఆ గోముఖంలోకి ఆ నీరెలా వస్తోందీ తెలియదు. త్రయంబకం నుండి సాగర సంగమందాకా ఈ నది మొత్తం 1465 కి.మీ. దూరం ప్రవహిస్తోంది. ఈ నదీ పరీవాహక ప్రదేశం మొత్తం వైశాల్యం 3,12,812 చదరపు కిలోమీటర్లు, భారతదేశపు వైశాల్యంలో ఇది దాదాపు పదిశాతం. గోదావరీ నదికి ప్రవర, పూర్ణ, మంజీర, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి మొదలైన ఉపనదులున్నాయి.

సప్త సాగరాలు

సముద్రంలో కలిసే ముందుగా గోదావరి ఏడుపాయలుగా చీలుతోంది. వీటిని సప్తసాగరాలనీ, సప్త గోదావరులనీ అంటారు. ఈ ఏడుపాయలనూ ఏడుగురు మహర్షులు వెంట తీసికొని పోయి సాగరంలో సంగమింపజేస్తున్నారు. జమదగ్ని మహర్షి తుల్యభాగనూ, అత్రిమహర్షి ఆత్రేయినీ, భరద్వాజ మహర్షి భరద్వాజనూ, గౌతమ మహర్షి గౌతమినీ, వామదేవ మహర్షి వృద్ధ గౌతమిని, విశ్వామిత్ర మహర్షి కౌశికనూ, వసిష్ఠ మహర్షి వసిష్ఠనూ సముద్రంలో సంగమింపజేశారు. ఇటీవల ఈ నదులపై వంతెనల నిర్మాణం జరిగి రాకపోకలు చాలా సులువయ్యాయి.

గోదావరీ తీరంలో...

గోదావరీ తీరంలో ఎన్నో ముఖ్యమైన క్షేత్రాలు నెలకొని వున్నాయి. అందులో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించడం జరుగుతుంది.

త్రయంబకం

గోదావరి జన్మస్థానం. ఇక్కడ త్రయంబకేశ్వరాలయం వుంది. దేశంలోగల ద్వాదశ జ్యోతిర్లింగాలలో త్రయంబ కేశ్వరుడు ఒకడు.

నాసిక్

గోదావరి కొండలపై నుండి నేలకు దిగిన తర్వాత వచ్చే మొదటి క్షేత్రం నాసిక్. ఇక్కడ వందలాది ఆలయాలున్నాయి. ఇక్కడ పంచవటి అనే స్థలం ఉంది. శ్రీరాముని వనవాసకాలంలో సీతారామలక్ష్మణులు నివసించిన పంచవటి ఇదేనని స్థానికులు చెబుతారు.

పైఠాన్

పూర్వం ప్రతిష్ఠానపురం ప్రస్తుతం పైఠాన్ అయిందని చెబుతారు. లలితాసనంలో కూర్చొనివున్న 14 చేతుల నరసింహస్వామి మూర్తి ఇక్కడ ఉంది. హిరణ్యకశిపుని సంహరిస్తున్న ఉగ్ర నారసింహుడు. ఇలాంటి విగ్రహం అరుదు. సంత్ ఏకనాథ్ మహరాజ్ జీవసమాధి ఇక్కడ ఉంది.

బోరి

గోదావరీ తీరానికి దగ్గర్లోగల బోరిలో అనేక ప్రాచీన ఆలయాలున్నాయి. అందులో ఒక శిథిలాలయంలో అద్భుతమైన నరసింహుని విగ్రహం ఉంది. నరసింహుడు ఎక్కడైనా హిరణ్యకశిపుని చేతివ్రేళ్ల గోళ్లతో చీల్చి సంహరిస్తున్న ట్లుంటాడు. ఇక్కడ మాత్రం రెండు చేతులలో ధరించిన కత్తులతో హిరణ్యకశిపుని రొమ్ము చీలుస్తుంటాడు. ఇది ఎంతో అరుదైన విగ్రహం.

షిరిడి

ఈ క్షేత్రం గోదావరీ తీరానికి కొద్దిదూరంలో ఉంది. దత్తావతారంగా పేరొందిన సాయిబాబా ఇక్కడ చాలాకాలం నివసించారు. ఆయన సమాధి మందిరం ఇక్కడే ఉంది. ఆయన నివసించిన పాతమసీదు ద్వారకామాయి, పూర్వం ఆయన తపస్సు చేసిన గురుస్థాన్, ఆయన తరచూ వెళ్లి పడుకొంటూ ఉండే గ్రామ చావడి, అఖండ దీపం వెలిగే లెండి తోట ఇక్కడ ఉన్నాయి. మహల్సాపతి బాబాను సాయిబాబా అని మొదటిసారి సంబోధించిన ఖండోబా ఆలయం, సాయిబాబా శిష్యులు ఉపాసనీ బాబా ఆశ్రమం, (అందులో అక్కలకోట గజానన్ మహరాజ్ తల్లి సోనామాత సమాధి ఉంది) మొదలైనవి ఇక్కడ దర్శనీయాలు. సాయిబాబా సమాధి మందిరం దిగువన బాబా అసలు సమాధి ఉందంటారు. అక్కడికి విడిగా మెట్లున్నాయి.

షిరిడీకి దగ్గర్లోనే శనిసింగనాపురం ఉంది. అక్కడ రాతిగుండు రూపంలో వెలసిన శనికి తైలాభిషేకాలు చేసికోవచ్చు. ఆ వూళ్లో ఎవరింటికీ తలుపులుండవు. దొంగల భయంలేదు. షిరిడీ సాయి జన్మస్థలం అని ప్రశస్తి నొందిన పత్రి గోదావరీ తీరంలోనే ఉంది.

బాసర

సుప్రసిద్ధ జ్ఞానసరస్వతీ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన బాసరలో సరస్వతీదేవిని మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతులు మువ్వురి సంయుక్తరూపంగా అర్చిస్తారు. ఇక్కడ సరస్వతీదేవి విగ్రహం సైకతం (ఇసుకతో ఏర్పడినది) కావడం విశేషం. ఇటీవల ఈ క్షేత్రాన్ని బాగా అభివృద్ధి చేశారు. ఈ క్షేత్రానికీ వ్యాస, వాల్మీకులకు సంబంధమున్నట్లు స్థలపురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ ఆలయ ప్రాంగణంలో మేడి చెట్టుంది. దానికి భక్తులు పూజ చేస్తారు. సరస్వతీదేవి మేడి పుల్లలతో వీణ వాయించేదని ఒక కథ ఉంది. అక్కడ ఒక బండ వుంది. దానిపై కొడితే సప్తస్వరాలు పలుకుతాయి. ఈ క్షేత్రంలో అనేక పవిత్ర కుండాలున్నాయి.

ధర్మపురి

కరీంనగర్ జిల్లాలో గోదావరీ తీరంలో ఉంది. ఇక్కడ నరసింహస్వామి ఆలయాలు రెండు, రామలింగేశ్వరాలయం, ఇంకా అనేక గుళ్లున్నాయి. ధర్మాంగద పాముపాటలో సత్యవతి భర్తకు నిజరూపం ఇచ్చిన మహిమగల బ్రహ్మకుండం ఇక్కడే ఉంది. సత్యవతి గుడి, అప్పటి మట్టిస్తంభం ఉన్నాయి. ఇక్కడి నరసింహాలయంలో ఆరడుగుల ఎత్తు బ్రహ్మవిగ్రహం యమధర్మరాజు విగ్రహాలున్నాయి. ఇక్కడ యమదర్శనం (యముని విగ్రహాన్ని చూడడం) అయింది గనుక ఇక్కడికి వచ్చిన యాత్రికులకు ఇక యమదర్శనం (నరకానికి పోయే అవసరం ఉండదని చెబుతారు. బ్రహ్మ అర్చామూర్తి కూడా అరుదే.

వేములవాడ

కరీంనగర్ జిల్లాలో ఉంది. ఈ ఊరికి దగ్గరగా గోదావరి పాయవొకటి పారుతుండేది. ప్రస్తుతం అది ఎండిపోయింది. ఇక్కడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉంది. అమ్మవారి పేరు రాజరాజేశ్వరి. ఈ గుళ్లోనే ఒక మహమ్మదీయ దర్గా, ఒక జైన అర్చామూర్తి ఉండడంతో మతసమైక్యతకు ఉదాహరణగా చెబుతారు. స్వామికి అన్నపూజ చేయడం, కోడెలను కట్టడం ఇక్కడ ప్రత్యేకతలు.

శ్రీకాళేశ్వరం

ఇది కరీంనగర్ జిల్లాలోనే ఉంది. ఇక్కడ ఒక పానవట్టంపై రెండు లింగాలుండడం ప్రత్యేకత. యముడు (కాలుడు) ప్రతిష్ఠించిన లింగం కనుక కాలేశ్వరుడు అని ఒక లింగాన్నీ, ముక్తినిస్తాడు కనుక ముక్తీశ్వరుడని రెండవ లింగాన్నీ పిలుస్తారు. ముక్తీశ్వరునికి రెండు నాసికా రంధ్రాలుండడం విశేషం.

ఈ లింగాలకు అభిషేకం చేసిన నీరు ఒక్క చుక్కైనా గర్భాలయం నుండి బయటకు రాదు. గోదావరిలోకి ఆ నీరంతా అంతర్వాహినిగా పోతుందని ప్రతీతి. ఇక్కడకు దగ్గర్లో గోదావరి ప్రాణహిత, సరస్వతి (అంతర్వాహిని) కలిసే త్రివేణీ సంగమం ఉంది. తెలుగునాడుకు త్రిలింగమని పేరు రావడానికి ద్రాక్షారామం, శ్రీశైలం, శ్రీకాళేశ్వర లింగాలే కారణం. ఇక్కడ సరస్వతీదేవికి, సూర్యనారాయణ స్వామికి ఆలయాలున్నాయి. ఇక్కడ వలె గర్భాలయానికి నాలుగువైపులా ద్వారాలుండడం చాలా అరుదు.

మల్లూరు

వరంగల్ జిల్లాలో గోదావరీ తీరంలో ఉంది. ఒక కొండ గుహలో ఏడడుగుల ఎత్తు నరసింహస్వామి వెలసి ఉన్నాడు. ఈ విగ్రహాన్ని ఎక్కడ వత్తినా సజీవ శరీరాన్ని వత్తినట్లు మెత్తని అనుభూతి కలగడం ఒక విశేషం. సామాన్యంగా శనికి తైలాభిషేకం ఉంటుంది. కాని ఇక్కడ నరసింహునికి తైలాభిషేకమే జరుపుతారు. గుహలో వున్న మూర్తిని కనుగొనే ప్రయత్నంలో స్వామి బొడ్డువద్ద గునపం తగిలి గాయమైందని ఒక కథ వుంది. ఆ గాయానికి చందనం అద్దినా కొంచెం కొంచెంగా ఏదో ద్రవం వూరుతుంటుంది. శనివారంనాడు సీసాల్లో పట్టి భక్తులకు ఇస్తారు. సంతానం లేనివాళ్లు ఆ నాభితీర్థాన్ని తీసికొంటే పిల్లలు కలుగుతారని నమ్మకం వుంది. ఇక్కడ చింతామణి జలపాతం వుంది. ఆ నీటికి ఔషధగుణ ముందని చెబుతారు. సాదాసీదా ఆలయంలో అడవిలో కాలక్షేపం చేస్తున్న ఈ స్వామికి 13 కిలోల బంగారపు నగలున్నాయి! మల్లూరులోని శిథిలాలయమొక దానిలో అచ్చంగా భద్రాద్రి రాముని పోలిన మూలవరులున్నారు. ఆ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు.

రాయవరం

బూర్గంపాడుకు దిగువన గోదావరీ తీరంలో చిన్న కొండపై కేదారేశ్వర స్వామి ఆలయం ఉంది. శివుడిక్కడ లింగరూపంతో పాటు నిలువెత్తు విగ్రహమూర్తిగా వుండడం అపూర్వం.

భద్రాచలం

భద్రుడనే గిరికుమారుని ప్రార్థనపై రాముడిక్కడ సీతాలక్ష్మణ సమేతుడై వెలిశాడు. ఈయనను వైకుంఠరాముడని అంటారు. సీత ప్రక్కన వున్నా విడిగా మహాలక్ష్మి సన్నిధి ఉంది. ఇక్కడ రాముడు కుడిచేత శంఖం, ఎడమచేత చక్రం ధరించి ఉంటాడు. ఇది చాలా అరుదు. ఈ ఆలయంలో కబీరు, భక్తరామదాసులకే గాక, ఆంజనేయుడు, నరసింహుడు, భద్రుడు మొదలైన వారికి విడిగా సన్నిధులున్నాయి. పోకల దమ్మక్క, తర్వాత కంచర్ల గోపన్న ఈ స్వామికి ఉండే తెరవేర్పరచారు. ఆ గుడిని పడగొట్టి, విశాలంగా పునర్నిర్మించారు. నూతన కళ్యాణ మండపం శిల్పసంపదకు కాణాచి. భద్రాద్రిలో కుసుమహరనాథ మందిరం, రామదాసు

ధ్యాన మందిరం, సత్యనారాయణ స్వామి గుడి, బాలాజీ గుడి, నరసింహాలయం మొదలైన ఆలయాలెన్నో ఉన్నాయి.

పంచవటి

భద్రాచలానికి దగ్గర వున్న పంచవటిలో శ్రీరాముడు వనవాస కాలంలో సీతాలక్ష్మణులతో కలసి గడిపాడని చెబుతారు. సీతమ్మ వారు బట్టలారేసుకున్న చోటని రంగులచారలున్న బండలను చూపుతారు.

పాపికొండలు

ఇక్కడ గోదావరి పాపికొండల మధ్యగా ఇరుకైన సందులో నుండి పోతుంది. కొండలపై పేరంటాలపల్లి స్వామి ఆశ్రమం, సమాధి ఉన్నాయి. కూనవరం వద్ద శబరి, గోదావరి కలుస్తాయి. శ్రీసత్యసాయి మందిరాన్నిటీవల అక్కడ నిర్మించారు.

రాజమండ్రి

గోదావరి పుష్కరాలకు అత్యధిక సంఖ్యాకులు వచ్చే ఈ పట్టణం వేయేళ్లకు పైగా చరిత్ర కలిగింది. అది కవి నన్నయభట్టుతో మహాభారతాన్ని తెలుగులో రచింపజేసి, రాజరాజ నరేంద్రుని పేర ఇది రాజమహేంద్రవరమైందని ప్రతీతి. ఒకప్పుడీ నగరాన్ని దంతపురి అనీ, పంచగిరి దుర్గమనీ పిలిచేవారు.

పంచగిరులు

హేమగిరి (వేమగిరి), ధవళగిరి (ధవళేశ్వరం), రామగిరి (రామదుర్గం), భద్రగిరి (పట్టిసం), పద్మగిరి (రాజమండ్రి) ఇవి పంచగిరులు. ఇంద్రుడు గౌతముని శాపకారణంగా కలిగిన అసహ్యరూపాన్ని ఇక్కడి పుష్కర కుండంలో స్నానం చేసి పోగొట్టుకున్నాడట. ఆ కుండాన్ని పుష్కర జలంతో బ్రహ్మ గోదావరీ తీరంలో ఏర్పరచాడట. శ్రీ రాజరాజుకు ఇష్టదైవం వేణుగోపాలస్వామి గుడి శ్వేతగిరిపై ఉండేది. దానిని తరువాత పునర్నిర్మించారు. ఇతర ప్రాచీన ఆలయాల్లో లక్ష్మీ నరసింహాలయం, సంజీవ ఆంజనేయాలయం, మార్కండేశ్వరాలయం, కోటిలింగాల క్షేత్రం ఉన్నాయి. ఐదు వీధుల కూడలిలోని దేవీవిగ్రహం, విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి గుడి, రాజరాజేశ్వరీ ఆలయం, గొల్ల మూరెమ్మ గుడి, పాత శ్యామలాంబగుడి మొదలైనవి వందలాదిగా ఉన్నాయి. పాత రైలు వంతెన ఒక పర్యాటక ఆకర్షణ. 1868లో స్థాపించబడిన గౌతమీ గ్రంథాలయం దర్శనీయం. రాజమండ్రి పురపాలనా వ్యవస్థ మునిసిపల్ కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన తర్వాత వస్తున్న తొలిపుష్కరం ఇదే!

ధవళేశ్వరం

గోదావరీ తీరంలోని నవజనార్దనాలయాలలో ఇక్కడి జనార్దనాలయం ప్రధానమైందని చెబుతారు. వేదరాశి జనార్దనుని మహిమవల్ల తెల్లని కొండ (ధవళగిరి)గా మారిందట! కనుక ఈ వూరు ధవళేశ్వరమైంది. ఈ గిరికి మూడు ప్రదక్షిణలు చేసి, తర్వాత రావిచెట్టుకు ఎనిమిది ప్రదక్షిణాలు చేసి, ఆ పైననే జనార్దనుని సేవించాలని పెద్దలు చెబుతారు. ప్రక్కన ఏవున్న నారదగుహలో సంతాన గోపాలస్వామి ఉన్నాడు. ఆయనను సేవిస్తే సంతానం లేనివారికి సంతానభాగ్యం కలుగుతుందని ప్రతీతి.

పంచారామాలు

పంచారామాలలో అమరారామం (అమరావతి) తప్ప మిగిలినవి ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఉన్నాయి. సామర్లకోటలో కుమారారామం, గుణుపూడి భీమవరంలో సోమారామం పాలకొల్లులో క్షీరారామం, ద్రాక్షారామం పంచారామాల్లోనే. ద్రాక్షారామం వద్ద గోదావరి అంతర్వాహినిగా సప్తఋషుల పేర్లతో వచ్చి సప్త గోదావరిలో కలుస్తుందని చెబుతారు. ఇక్కడి భీమేశ్వర లింగం మూడు అంతస్తుల ఆలయంలో స్థితమైవుంది. అమ్మవారు మాణిక్యాంబ. స్వామి ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకడనీ, అమ్మవారు అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకరనీ స్థానికులంటారు. సోమారామంలో లింగం శుక్లపక్షంలో క్రమంగా తెల్లనౌతూ పున్నమికి తెల్లగా వుంటుందనీ, కృష్ణపక్షంలో క్రమంగా నల్లనౌతూ అమావాస్యకల్లా నల్లగా అవుతుందనీ చెబుతారు.

పట్టిసం

గోదావరి మధ్యలో తేలిన ఒక ద్వీపంపై గల భద్రగిరిపై శివాలయం ఉంది. క్షేత్రపాలకుడు వీరభద్రస్వామి. తెలుగునాట కొరవి వీరభద్రుడు (వరంగల్ జిల్లా), లేపాక్షి వీరభద్రుడు (అనంతపురం జిల్లా), పట్టిసం వీరభద్రుడు సుప్రసిద్ధులు.

అంతర్వేది

గోదావరి పాయ వసిష్ఠ సముద్రంలో కలిసే చోట ఈ క్షేత్రం ఉంది. ఇక్కడ నరసింహ ఆలయం, నీలకంఠేశ్వర ఆలయం, గుర్రాలక్క గుడి ఉన్నాయి. ఆవిధంగా ఇది హరిహర దేవీ క్షేత్రం అనవచ్చు. లోగడ ఎప్పుడో సముద్రజలాల్లో దొరికిన కూర్మనాథుడు (రాతి తాబేలు) కూడా ఈ ఆలయంలో పూజలందుకుంటుంది.

గోదావరి వెలుగులు

తెలుగు భాషకు వ్యాకరణం రాసి వాగనుశాసనుడయ్యాడు. తొలి తెలుగు కావ్యం ఆంధ్రభారతాన్ని రచించి ఆదికవి అయ్యాడు. ఆయనే మనకు ప్రాతఃస్మరణీయుడు. నన్నయ భట్టారకుడు. ఆయనను ప్రోత్సహించి తెలుగులో మహాకావ్యరచనకు శ్రీకారం చుట్టించిన ప్రభువు రాజరాజ నరేంద్రుడు. ద్రాక్షారామభీమేశు నందనుడుగా, నోటవచ్చిన మాట శిలాక్షరంగా వెలిగిన వేములవాడ భీమకవి, నాట్యకారిణి లకుమ సాయంతో 'వసంత రాజీయం' అనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రచించిన కొమరగిరి రెడ్డి. 'కృష్ణమ్ కలయ సఖీ సుందరమ్' అంటూ తన తరంగాలతో, భక్త జనులందరినీ తన్మయులను చేసిన నారాయణ తీర్థులు. 'పలుకే బంగారమాయెనా' అని దాశరథీ కరుణాపయోనిధిని నిలదీసిన భక్తరామదాసు. ఆయన ఒరవడిలో తత్వాలు పాడిన తూము దాస సోదరులు. వీరంతా గోదావరి తీరంలోని వెలుగులే.

దత్తావతారం శ్రీపాద శ్రీవల్లభులు జన్మించింది పిఠాపురంలోనే. మధురభక్తి ఉద్యమ నిర్మాత శుద్ధాద్వైతి వల్లభాచార్యులు ఈ ప్రాంతంవారే. ద్వైతాద్వైత ప్రవక్త నింబార్కాచార్యులవారిది ఇక్కడి నుండి ఉత్తరానికి వెళ్లిన కుటుంబమే.

సంస్కరణోద్యమాలకూ, స్వాతంత్ర్యోద్యమానికీ, సాహిత్య, నాట్య, నాటక రంగాల పునర్వికాసానికీ, విద్యాసంస్థల, గ్రంథాలయాల స్థాపనలోనూ ముందంజలో ఉన్న ప్రాంతం గోదావరి తీరం. కందుకూరి వీరేశలింగం, ఘుపతి వెంకటరత్నం నాయుడు వంటి సంస్కర్తలు ఇక్కడివారే. తెల్లదొరల పక్కలో బల్లెమై నిలచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆయన అనుచరులు మల్లుదొర, గంటం దొరలది ఈ ప్రాంతమే. రాజమండ్రి కోట ముందు సజీవంగా వ్రేలాడదీయబడి, కాకులకూ, గద్దలకూ ఆహారంగా వదలబడి నరకయాతన పడి బ్రిటీషు పాలకులచే దారుణంగా హత్య చేయబడిన మన్యం ప్రజల తిరుగుబాటు నాయకుడు వెంకటరెడ్డి (1858) ఇక్కడివాడే.

తమ అష్టావధానామృత ధారలలో తెలుగునాటిని ముంచెత్తిన తిరుపతి వెంకటకవులు (కడియం), ఒక్క చేతిమీదుగా భారత, భాగవత రామాయణాలనే గాక శతాధిక గ్రంథాలను రచించిన శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, 'మాకొద్దీ తెల్లదొరతనం' అన్న పాటతో తెలుగు నాట స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గరిమెళ్ల సత్యనారాయణ, 'ఉప్పొంగిపోయింది గోదావరీ' అంటూ ఉత్సాహంతో ఉర్రూతలూగిన బాపిబావ (అడవి బాపిరాజు), నవ్వుల పువ్వులతో తెలుగుతల్లి నర్చించిన భమిడిపాటి కామేశ్వరరావు ఇక్కడివారే! సోషలిజం అరుణకాంతులతో యువతరాన్ని ప్రభావితం చేసిన మద్దూరి అన్నపూర్ణయ్య గ్రంథాలయోద్యమానికి ఆద్యుడుగా వెలిగిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, నూనూగు మీసాలురాని రోజుల్లో నాటకాలు వేసి, ఆపైన న్యాయవాదిగా ఎదిగి, మునిసిపల్ చైర్మన్‌గా వెలిగి, సైమన్ కమీషన్ రాక సందర్భంలో చెన్నపట్నంలో పోలీసు తుపాకులకు గుండె నెదురొడ్డిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులును పెంచి పెద్దజేసింది రాజమహేంద్రవరమే. దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ, మహర్షి బులుసు సాంబమూర్తి, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం మొదలైన వీరులెందరో ఈ గడ్డ పుణ్యాల పంటగా నిలిచారు.

కన్నీటి కెరటాల వెన్నెలలు కురియించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి, గణపతి పాత్రతో కడుపుబ్బ నవ్వించిన చిలకమర్తి అపర భగీరథుడు కాటన్, చిత్రాలలో చిరంజీవిగా నిలిచిన దామెర్ల రామారావు అంతా చిరస్మరణీయులే. పువ్వుల సోదరీమణులుగా నాట్యరంగంలో నాడు వెలిగిన తారలు గోవిందమ్మ, రాయలమ్మ (జయప్రద అమ్మగారు), నేటి నాట్యతారలు శోభానాయుడు, వహీదా రెహమాన్, జరీనా వాహబ్, గీతాంజలి, సుకన్య ఎందరెందరో!



ఇంకా, ఇంకా ఎన్నెన్నో

ఉభయ గోదావరి జిల్లాల్లో జగన్మోహినీ చెన్నకేశవాలయం ఉన్న ర్యాలీ, చిన్న తిరుపతిగా పేరొందిన ద్వారకా తిరుమల, రాజమండ్రి దగ్గర్లో గల కోరుకొండ (నారసింహ క్షేత్రం), దత్తావతారం శ్రీపాద శ్రీవల్లభుల జన్మస్థలం, కుక్కుటేశ్వరాలయం వున్న దక్షిణ గయ (పాద) క్షేత్రం పిఠాపురం, శ్రీసత్యనారాయణ క్షేత్రం అన్నవరం, ఓంకారస్వామి ఆశ్రమం, శంకరగిరి లక్ష్మీనారసింహ క్షేత్రం, లక్ష్మీపురం మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

1846-54 ప్రాంతంలో సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం వద్ద గోదావరికి ఆనకట్ట కట్టి దాదాపు పదిలక్షల ఎకరాలకు పైగా సాగునీరు లభించే సదుపాయం చేశారు. ఇటీవల దాని స్థానంలో బ్యారేజీ నిర్మించి దానికి కాటన్ బ్యారేజీ అని నామకరణం చేశారు. శ్రీరాంసాగర్ (పోచంపాడు) 10 లక్షల ఎకరాలకు పైగా నీరందిస్తోంది. వరంగల్లు పట్టనానికి మంచినీటి కొరత తీర్చింది. పోలవరం ప్రాజెక్టు వంటి బృహత్పథకాలు నిర్మాణంలో వివిధ దశలలో రూపొందుకుంటున్నాయి. నెరవేరని కలల్లో శౌంఠి రామమూర్తి సంకల్పించిన రామపాదసాగర ప్రాజెక్టు ఉంది.

గోదావరీ తీరంలోనే కొత్తగూడెం, రామగుండం, గోదావరిఖని మొదలగు చోట్ల బొగ్గు గనులున్నాయి. కొత్తగూడెం (పాల్వంచ), రామగుండంలలో థర్మల్ స్టేషన్లు, మాచ్‌ఖండ్, బలిమెల, సీలేరులలో జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. గోదావరీ తీరంలో ఇటీవల కనుగొన్న సహజవాయువు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు వెలుస్తున్నాయి. భారతదేశానికి ఉభయ గోదావరులు (డెల్టా) అన్నదాతగా ఉన్నాయి.

విస్తృతంగా ఏర్పాట్లు

గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు రెండూ విస్తృతమైన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమై ఉన్నాయి. దాదాపు ఐదు కోట్ల మంది భక్తజనం ఈ పుష్కరాల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని స్నానఘట్టాలలో గోదావరి పుష్కర తీర్థస్నానాల నాచరించనున్నారని అంచనా. జులై 14 నుండి 25 వరకు సాగే ఈ పుష్కర కార్యక్రమాల క్రమబద్ధీకరణకోసం ఒక సంఘం ఏర్పాటైంది. దీనికి రాష్ట్ర మంత్రి ఒకరు అధ్యక్షులుగా ఉంటారు. కార్యదర్శుల సంఘానికి రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు.

వివిధ శాఖల కార్యక్రమాలు

నీటిపారుదలశాఖ, కమాండ్ ఏరియా అభివృద్ధి : స్నానఘట్టాలనూ, వరద కట్టలనూ అభివృద్ధిపరచడం;

పంచాయతీరాజ్, మునిసిపల్ పరిపాలన : పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, తాత్కాలిక వసతి, బట్టలు మార్చుకునే వసతులు, త్రాగునీటి సరఫరా;

రోడ్లు, భవనాలశాఖ, పంచాయతీరాజ్ : అప్రోచ్‌రోడ్లు, బారికేడ్లు;

వైద్య, ఆరోగ్యశాఖ : ప్రథమచికిత్స, వైద్యసౌకర్యాల ఏర్పాట్లు;

దేవాదాయ శాఖ, పురావస్తు శాఖ : ఆలయాల మరమ్మతు, పునరుద్ధరణ.

పోలీస్ : జనసందోహాల చలనాల క్రమబద్ధీకరణ, బందోబస్తు విధులు;

ట్రాన్స్‌కో : విద్యుత్ సరఫరా;

సమాచార, పౌరసంబంధశాఖ, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు : ప్రచారం, వినోదం.

మతసంబంధ కార్యక్రమాలు



స్నానాల సమయంలో సంకల్పం చెప్పేందుకు, తర్పణ, పిండప్రదానాదులను చేయించేందుకు, దానాలను స్వీకరించేందుకు తగిన పురోహితులను గుర్తింపు కార్డులిచ్చి, నియమిస్తున్నారు. వీరిలో తెలుగు వారే కాక, హిందీ, ఒరియా, బెంగాలీ, తమిళ పురోహితులు కూడా వుంటారు. వీరు ఆయా కార్యక్రమాలకు తీసికోదగిన రుసుములను కూడా నిర్ణయించి ప్రకటిస్తారు. పుష్కరాల సందర్భంగా అనేక ప్రచురణలను, కరపత్రాలను వెలువరిస్తారు. టిటిడి వారు కూడా ఒక ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నారు. టిటిడి తరఫున ఇంకా అనేక కార్యక్రమాలను, ధార్మిక సంబంధమైన, అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. హోటళ్లలో వసతికి, భోజన ఫలహారాదులకు ప్రభుత్వం రేట్లను నిర్ణయిస్తోంది.

స్వచ్ఛంద సంస్థలు

గత గోదావరీ పుష్కరాల సమయంలో వలెనే ఈసారి కూడా శ్రీసత్యసాయి సేవాసంస్థ వేలాది కార్యకర్తలతో రంగంలోకి దిగి తాగునీరు, పారిశుద్ధ్యం, మొదలైన సేవా కార్యక్రమాలను చేయనున్నది. బాలభట సంఘాలు, రెడ్‌క్రాస్, యువజన సంఘాలు, ఇతర స్వచ్ఛంద సేవాసంస్థలు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకొననున్నాయి.

కమ్యూనికేషన్స్

పుష్కర సమయంలో విస్తృతమైన కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పరుస్తున్నారు. సెల్‌ఫోన్, విహెచ్‌యఫ్ సెట్లను, బియస్‌యన్‌ఎల్ సెట్లను, వెబ్‌సైట్లను ఇందుకు వినియోగిస్తారు. మీడియా కవరేజిక్కూడా విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగ్జిబిషన్, నమూనా ఆలయ సముదాయం, హరికథలు, పురాణ కాలక్షేపాల ఏర్పాట్లు ఇతర ఆకర్షణలు.

రవాణా సౌకర్యాలు

వివిధ ప్రాంతాలనుండి పుష్కరాలు జరిగే గోదావరీ తీర ప్రదేశాలకు ఇరురాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులను నడుపనున్నది. పుష్కరాల నుండి తిరిగి వచ్చేవారిని త్వరితగతిని తరలించేందుకు కూడా భారీ ఏర్పాట్లు జరిగాయి. అలాగే దక్షిణ మధ్య రైల్వే కూడా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక రైళ్లు నడుపనుంది. కొన్ని రైళ్లకు అదనపు బోగీలను తగిలిస్తారు.

పన్నెండేళ్ల తర్వాత మళ్లీ వస్తున్న గోదావరి పుష్కరాలు లక్షలాది భక్తజనులకు అధ్యాత్మ సుధ నందించాలనీ, జాతీయ సమైక్యతాభావనను దృఢతరం చేయాలనీ ఆకాంక్షిద్దాం. ఈ పుష్కరాలను జయప్రదంగా నిర్వహించడానికి నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రభుత్వ, స్థానిక ప్రభుత్వ, ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలకూ, అశేష కార్యకర్తలకూ, అధికారులకూ, అనధికారులకూ అభినందనలు తెలుపుదాం.


శ్రీనాథ మహాకవి చెప్పిన క్రింది పద్యంతో గోదావరిమాత ఆశీస్సుల నర్థిద్దాం:

గోదావరి గోదావరి
గోదావరి యంచు బలుకు – గుణవంతులకున్
గోదావరి తల్లీ! సం
పాదింతుగదమ్మ నీవు భవ్య సుఖంబుల్

సమాచార, పౌరసంబంధాల శాఖ పూర్వ సంచాలకులు

- భండారు పర్వతాలరావు

'గోదావరి పుష్కరాలు' నుండి



పవిత్ర గోదావరి పుష్కర స్నాన విధి

వైదికం - పౌరాణికం

సంకలనం : శ్రీవిద్యాలంకరణ, దైవజ్ఞకుల శిరోమణి,
వైదికాగమ శిరోమణి, స్మార్త సరస్వతి, యజ్ఞేశానందనాథ
బ్రహ్మశ్రీ పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతి

శ్రీ కంకాలమూర్తి ధ్యానమ్

భస్మాలేపత్రిపుండ్రం రుచిరమణిలస
త్పిచ్ఛకంకాలదక్షం ।
టంకం వామే కరాబ్జే దధత మఖిలస
త్సాంద్రసిందూరశోభమ్ ।
(శూలం కృష్ణమృగాస్యలంబితకరం
బద్ధేందుచూడం హరం ।
వందే దేవృషీశ్వరైః పరివృతం
వైయాఘ్రచర్మాంబరమ్)
శూలం కృష్ణస్య వక్త్రే ప్రసృతకరతలం
బద్ధబాలేందుచూడం
వందే దేవై ర్మునీంద్రైః పరివృత మభవం
వ్యాఘ్రచర్మోత్తరీయమ్ ॥
చతుర్భుజం త్రినేత్రం చ జటామకుటసంయుతమ్ ।
పాదయోః పాదుకాయుక్తం కించి ద్వై గమనోన్ముఖమ్ ॥
సర్వాభరణసంయుక్తం యజ్ఞసూత్రోత్తరీయకమ్
శంఖం తు వామకర్ణే తు దక్షిణే నక్రకుండలమ్ ॥
కించి త్ప్రహసితాస్యం చ నానాలీలాసమావృతమ్
ఛురికాం దక్షకట్యాం తు దధానం భూతసంయుతమ్ ॥
భిక్షాన్న మోచనాయాతమృగపక్ష్యాదిసంయుతమ్ ।
దేవస్య వామపార్శ్వే తు మహాభూతం ప్రకల్పయేత్ ॥
ద్విభుజం చ ద్వినేత్రం చ కరాళ వదనాన్వితమ్ ।
కపాలం శిరసి న్యస్య దేవవామే తు సంస్థితమ్ ॥
ఏవం కింకాల మాఖ్యాతమ్
(దేవో రక్తవర్ణః, భూతః కృష్ణవర్ణః)

శ్రీ భిక్షాటనమూర్తి ధ్యానమ్

చతుర్భుజం త్రినేత్రం చ నగ్నం చైవ స్మితాననమ్ ।
భస్మ దిగ్ధం విద్రుమాభం కట్యాం పన్నగసంవృతమ్ ॥
(ఆవృత్తాలంకృతం భృంగీ పాదం పాదుకసంయుతమ్)
ఆవృత్తాలంకృతో భృంగీ పాదం పాదుకసంయుతమ్
దక్షిణం తత్కరాగ్రం తు హరిణాస్యానుగం భవేత్ ॥
దక్షిణే పరహస్తే తు డమరుం చైవ కారయేత్
వామే త్వపరహస్తే తు త్రిశూలం పింఛధారిణమ్ ॥
కుంచితం దక్షిణం పాదం వామపాదం తు సుస్థితమ్ ।
సమభంగస్థానకం చ గమనోన్ముఖరూపకమ్ ॥
కపాలోపేతహస్తం చ వృషనాభిసమం భవేత్ ।
ఏవం భిక్షాటనం ప్రోక్తం గుండోదర మథో శృణు ॥
దేవస్య వామపార్శ్వే తు గుండోదర మధఃస్థితమ్ ।
హస్తద్వయసమాయుక్తం కపాలం శిరసి న్యసేత్ ॥



శ్రీ గంగాధర స్తోత్రమ్

క్షీరాంభోనిధి మంథనోద్భవ విషాత్సందహ్యమానాన్సురాన్
బ్రహ్మాదీనవలోక్య యః కరుణయా హాలాహలాఖ్యం విషమ్,
నిశ్శంకం నిజలీలయా కబళయ న్లోకాన్రరక్షాదరాదార్తత్రాణ
పరాయణఃస్సభగవా న్గంగాధరో మేగతిః.

శ్రీ కళ్యాణ సుందరమూర్తి ధ్యానమ్

(కళ్యాణసుందరం రూపం వక్ష్యతేఽద్య జగత్పతేః ।
కుంచితం దక్షిణం పాదం వామపాదం తు సుస్థితమ్ ॥
సవ్యపూర్వకరే ణైవ దేవ్యాః సవ్యకరం గ్రహేత్ ।
వరదం వామహస్తం తు పరహస్తద్వయో రపి ॥
పరశుం సవ్యహస్తే తు మృగం వామే తు సంధరేత్ ।
జటామకుటసంయుక్తం దివ్యాభరణభూషితమ్ ॥
దివ్యవస్త్రై రలంకృత్య ప్రవాళసదృశప్రభమథ్ ।
శ్యామవర్ణనిభాం గౌరీం దుకూలవసనాన్వితామ్ ॥
ఉత్పలం వామహస్తే తు మకుటం కేశబంధితమ్ ।
సుస్థితం వామపాదం చాపీతరం కుంచితాన్వితమ్ ॥
ఈషల్లజ్జితవక్త్రాభ్యాం దక్షిణే తు వ్యవస్థితామ్ ।
తస్యా శ్చైవాపరే పార్శ్వే శ్రీభూమీ చైవ కారయేత్ ॥
తయోర్హస్తోభయాభ్యాం తు గౌర్యా స్తు మపరం స్పృశేత్ ।
దేవ స్యాగ్రే చ కుండే తు జుహుయా త్తు ప్రజాపతిః ॥
హోమ స్యోత్తరదేశే తు హరి ర్వర్ధనిసంయుతః ।
దేవస్య వరదే హస్తే గౌరీం దద్యా త్తదంబునా ॥
శక్రాది సర్వదేవా శ్చ భక్తియుక్తా వృతాః స్థితాః ॥

శ్రీ దక్షిణామూర్తి ధ్యానమ్

భూతివ్యాపాండురాంగః శశిశకలధరో
జ్ఞానముద్రాక్షమాలా
వీణాపుస్తై ర్విరాజత్కరతలకమలో
యోగపట్టాభిరామః ।
వ్యాఖ్యాపీఠే నిషణ్ణః సకలమునివరైః
సేవిత స్సుప్రసన్నః
సవ్యాలః కృత్తివాసాః సతత మవతు నో
దక్షిణామూర్తి రీశః ॥
(నారదో జమదగ్ని శ్చ వసిష్ఠభృగుదక్షిణే)
దక్షిణే జమదగ్ని శ్చ వసిష్ఠభృగునారదాః
భరద్వాజః శౌనక శ్చాప్యగస్త్యో భార్గవ స్తథా ॥
వామపార్శ్వే విధాతవ్యాః కిన్నరాద్యైః సుసేవితే ।
కైలాసపర్వతే తస్మిన్ వటవృక్షస్య మూలకే ॥
ఆసీనం సకలేశం తు శాంతరూపం మహేశ్వరమ్ ।
దక్షిణామూర్తి మూచుస్తే-పస్మారం శాయయే దధః ॥

అర్ధనారీశ్వరమూర్తి ధ్యానమ్

చతుర్భుజం త్రినేత్రం చ శివాంశం దక్ష పార్శ్వకే
వామార్ధం వామభాగే తు సీమంతతిలకాలకమ్ ॥
నేత్రార్ధం తు లలాటే తు సంయుక్తం దక్షిణాంశకే ।
దక్షిణే కుండలం కర్ణే దధం వామే తు పత్రకమ్ ॥
కట్యాం వా కలితం వామే-భయటంకౌ చ దక్షిణే ।
వరదోత్పలకే వామే కేయూరకటకాన్వితమ్ ॥
ఉమాంశే తు స్తనం కుర్యా త్స్నాహోకారయుతం తు వా ।
శ్రోణ్యర్ధం దక్షిణే శంభో ర్వ్యాఘ్రచర్మకృతాంబరమ్ ॥
ఉమార్ధం కటిసూత్రం తు చిత్రవస్త్రపరిచ్ఛదమ్ ।
నూపురాలంకృతం వామే సవ్యపాదం తు కుంచితమ్ ॥
స్వయం ప్రవాలవర్ణః స్యాత్ సుకృష్ణం వామభాగకమ్ ।
అర్ధనారీశ్వరం ప్రోక్తం (రూపం సర్వశుభప్రదమ్) ॥
దేవీభాగః శ్యామవర్ణ ఈశ్వరోరక్తవర్ణకః ॥

శ్రీ వృషభారూఢ ధ్యానమ్

సవ్యే స్యా ద్వక్రతుండాన్వితకటకరం
గోపతేః పృష్ఠసంస్థం
వామస్యార్ధం సదక్షం వరకరయుగలే
టంకకృష్ణం దధానమ్ ।
ఫాలస్థాక్షం ప్రసన్నం త్రినయనలసితం
బద్ధవేణీ కిరీటం
వామే గౌర్యా సమేతం నమత శుభకరం
తం వృషారూఢ మీశమ్ ॥

శ్రీ హరిహర ధ్యానమ్

సవ్యాంగే విద్రుమాభం శశధరమకుటం
భస్మరుద్రాక్షభూషం
వామాంగే శ్యామలాభం మణిమకుటయుతం
పీతవస్త్రాతిశోభమ్ ।
సవ్యే టంకాభయం స్యా దితరకరయుగే
శంఖకౌమోదకీ స్యాత్
కించి ల్లలాటనేత్రం విలసతు పురతః
శ్రీహరే రర్ధదేహమ్ ॥
సవ్యే టంకం పరస్మిన్ కటకసుజలజం
సింధువేణీ సునద్ధం
వామార్ధే సత్కిరీటం రుధిరజలనిభం
వ్యాఘ్రచార్మంబరాఢ్యమ్ ।
ఫాలార్ధే లోచనార్ధా కలితసమపదం
శుభ్రయజ్ఞోపవీతం
హర్యర్ధం నౌమి శంభుం సకలశుభకరం
సర్వసంపత్కరాఢ్యమ్ ॥

గురుడు సింహాంశంలో ఉంటే....

గురువు (బృహస్పతి) మఖానక్షత్రంలో వున్నా, సింహాంశమునందు ఉన్నా అన్ని దేశాలు లేక రాష్ట్రాలలో శుభకర్మలు నిషిద్ధం. సింహాంశం దాటాక గోదావరికి దక్షిణమున, భాగీరథికి ఉత్తరమున సింహస్థత్వ దోషం పరిగణించ నక్కరలేదు. కాని గంగా – గోదావరీ మధ్య దేశమునకంతటికీ సింహరాశిని పూర్తిగా దాటేవరకు వివాహం, ఉపనయనం నిషిద్ధములు. మిగతా కర్మలన్నీ సింహాంశం దాటగానే చెయ్యవచ్చు!

ఇట్లే మేషంలో రవి ఉన్నప్పుడు సర్వదేశాలకు శుభకర్మల నిమిత్తం ఎలాటి దోషం ఉండదు. కొన్ని గ్రంథాలలో సూర్యుడు వృషభంలో ఉన్నప్పుడు ఇట్లాంటి దోషం లేదని చెప్పబడింది.

పుష్కరాలు

బృహస్పతి సింహస్థుడైనపుడు గోదావరీ స్నానం, కన్యలో ఉన్నప్పుడు కృష్ణానదీ స్నానం పుణ్యం. ఇవే పుష్కరాలు.


పుష్కరం అనగా ఏమిటి? పుష్ అను ధాతువు నుండి పుష్కరము అను శబ్దము ఏర్పడింది. పుష్కరము అను శబ్దమునకు పోషణము అని అర్థం. ఇంకా జ్యోతిషశాస్త్రం ప్రకారం పన్నెండు సంవత్సరాల కాల పరిమాణం అని కూడా అర్థం. బృహస్పతి, గురుగ్రహ సంచారము ఒక్కొక్క రాశిలో ఒక సంవత్సరం (ఈవిధంగా పన్నెండు రాశులలో సంచారమునకు పన్నెండు సంవత్సరాలు) అవుతుంది. దీనినే పుష్కరము అని వ్యవహరిస్తారు. పుష్కర శబ్దమునకు తామరకాడ, తామరపువ్వు, తామరాకు – 'పుష్కర పర్ణైః పుష్కర దణ్డైః, పుష్కరైశ్చ సంగ్గేస్తేర్య' అని ఉపనిషద్వాక్య ప్రమాణముంది.

పుష్కరాలు ఒక్కొక్క జీవనదికి ఒక్కొక్క పర్యాయం వస్తాయి. ఆయా సంవత్సరాల రాశుల కధిష్ఠానాలైన నదులలో పుష్కరుడు ఉంటాడు. 1. మేషం – గంగానది 2. వృషభం – నర్మద 3. మిధునం – సరస్వతి 4. కర్కాటకం – యమున 5. సింహం– గోదావరి 6. కన్య – కృష్ణవేణి 7. తుల – కావేరి 8. వృశ్చికం – తామ్రపర్ణి 9. ధనుస్సు – రథ్య నది 10. మకరం – తుంగభద్ర 11. కుంభం – సింధు 12. మీనం – ప్రాణహిత. ఈవిధంగా ఈ రాశుల్లో ఈ నదులకు పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి (గురు) గ్రహం నవగ్రహాలలో ఒకటి. గురుగ్రహం భూమి కంటే పెద్దది. పురుషగ్రహంగాను, బ్రాహ్మణ గ్రహంగాను చెప్పబడింది. గ్రహములన్నింటిలోనూ ఉత్తమ గ్రహము

గురువు. సత్త్వగుణ ప్రధానుడు. విద్యాకారకుడు. బుద్ధికారకుడు. జ్ఞానకారకుడు – ధనకారకుడు, తేజోవంతుడు. గురుగ్రహ ప్రభావం భూమిపైనున్న జీవులకు అధికంగా వుంటుంది అని జ్యోతిష శాస్త్రంలో పేర్కొనబడింది. పూర్వం తుందిలుడు అను బ్రాహ్మణుడు శివుని గూర్చి తపస్సు చేసెను. తుందిలుడి తపస్సునకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. శివుడు ఎల్లవేళలా అష్టమూర్తులతో విరాజిల్లుతుంటాడు. 1. కంకాళమూర్తి 2. భిక్షాటనమూర్తి 3. పుష్కరమూర్తి లేదా గంగాధరమూర్తి 4. కళ్యాణ సుందరమూర్తి 5. వీణాధరమూర్తి 6. అర్ధనారీశ్వరమూర్తి 7. వృషభరుద్రమూర్తి 8. హరిహరమూర్తి. ఈ ఎనిమిది మూర్తులలో ఒకటైన పుష్కర – గంగాధర మూర్తి (నీటి) రూపం తనకు ప్రసాదించమని కోరుకున్నాడు తుందిలుడు. శివుని వరప్రభావంవల్ల తుందిలుడికి పుష్కరమాసం (నీటిరూపం) వచ్చింది. శివుడు ఆ పుష్కరుడిని తన కమండలంలో నిలుపుకుని కైలాసం చేరుకున్నాడు.

ఈ సంగతి సృష్టికర్త బ్రహ్మకు తెలిసింది. తన సృష్టికార్యం నెరవేరడానికి పుష్కరుని సహాయం అవసరమని గ్రహించాడు బ్రహ్మ. వెంటనే కైలాసానికి వెళ్లి శివుడిని స్తుతించి ప్రసన్నం చేసుకున్నాడు. "పరమేశ్వరా! నా సృష్టికార్యం నెరవేరాలంటే మీ అధీనంలో వున్న పుష్కరుడు నాకు కావాలి!" అని అడిగాడు. అందుకు శివుడు అంగీకరించి పుష్కరుడిని బ్రహ్మకిచ్చాడు. బ్రహ్మ పుష్కరుడిని తన కమండలంలో నిలుపుకొని



బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు. సృష్టికార్యం నెరవేర్చసాగాడు. దేవగురువు బృహస్పతి బ్రహ్మను గురించి తపస్సు చేసాడు. బ్రహ్మ అతని తపస్సుకు మెచ్చుకొని వరం కోరుకోమన్నాడు. 'గ్రహాలపైన తనకు ఆధిపత్యం, బ్రహ్మ కమండలంలో నీటి రూపంలో వున్న పుష్కరుణ్ణి తనకు యివ్వమని' బృహస్పతి కోరాడు. బ్రహ్మ అంగీకరించాడు. కాని పుష్కరుడు బ్రహ్మను వదలి వెళ్లడానికి యిష్టపడలేదు. చివరకు ఎలాగో ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం బృహస్పతి కొత్తగా ఒక రాశిలో ప్రవేశించినపుడు మొదట పన్నెండు రోజులు, మిగిలిన రోజుల్లో ప్రతిదినం మధ్యాహ్నం నాలుగు ఘడియలు మాత్రం పుష్కరుడు బృహస్పతి అధీనంలో వుండేటట్లు, ఆ సమయంలో దేవగణాలందరితో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించి వుండేటట్లు ఒప్పందం కుదిరింది. పుష్కరునితో సహా బ్రహ్మాది దేవతలంతా ఆయానదుల్లో బృహస్పతితో కలిసి నివసిస్తారు. కనుక నదులకు ఎంతో ప్రభావముంటుంది. ఆ సమయంలో చేసే స్నాన దాన జప తర్పణాదులకు విశేష ఫలముంటుంది.

నదులు నాలుగు రకాలు. దైవ, ఆర్ష, మానస, అసుర అను నాలుగు రకాలుగా బ్రహ్మపురాణంలో చెప్పబడింది. త్రిమూర్తులచేత ప్రవర్తింజేయబడేవి దైవరకం నదులు – అవి గంగానది, గోదావరి, కృష్ణవేణి నదులు. ప్రజలు సాధారణంగా నీటికింత ప్రాముఖ్యత, పవిత్రత, విలువేంటని అనుకోవచ్చు. నీళ్లల్లో రెండు రకాలున్నాయని వేదాల్లో చెప్పబింది. లౌకికశక్తి – ప్రాణుల దాహం తీర్చడం, మురికిని పోగొట్టడం, సేద్యానికి తోడ్పడడం. 2. అతీంద్రియ దైవికశక్తి. అది విద్యుత్ శక్తి, మేధ్యం, యజ్ఞ్యం. యజ్ఞ్యం అనే శక్తి ప్రోక్షణాదులద్వారా ద్రవ్య శుద్ధిని కల్గిస్తుంది. అది కంటికి కనిపించదు.

'ఆపస్స్వభావతో మేధ్యాః' అని నీరు స్వతః పవిత్రమైంది. కొన్ని సమయాల్లో కొన్ని ప్రదేశాలలో ప్రవహించే నీరు పవిత్ర నదీసారాలను తనయందుంచుకొని ప్రవహిస్తుంది. అటువంటి నీటిలో స్నానం ఇహపరాలకు ఫలం చేకూర్చుతుంది. పంచభూతములలో నీరు రెండోది. భూమికంటే విస్తృతిలో విశాలమైంది. పంచభూతములు పరబ్రహ్మము నుండి ఆవిర్భవించాయి. పరబ్రహ్మము నుంచి ఆకాశము, ఆకాశము

ఆజ్యపాః పితర స్తర్ఘ్యం గృహ్ణం త్వపిచ సోమపాః ॥
ఓం అగ్నిష్వాత్తాది పితృభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి
శ్లో॥ సనకాద్యాస్తధాసింధుః కపిలాద్యామహౌజసః।
తేగృహ్ణంతు మయాదత్త మర్ఘ్యం సింహగతే గురౌ ॥
ఓం సనకాది మహాజనేభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
ఈవిధంగా అర్ఘ్యము లిచ్చిన తరువాత అభిముఖస్నానం ఆచరించవలెను.

క్షేత్రోపవాస సంకల్పము

శ్లో॥ ఉపవాసం కరిష్యామి ప్రీతయేతవ గౌతమి।
ప్రసాదం కురుమే దేవి నిర్విఘ్నం కురుమే వ్రతమ్ ॥

కేశవపనము

మేరుమందరతుల్యాని పాపాని వివిధానిచ కేశానాశ్రిత్యతిష్ఠంతి తస్మాత్ కేశాన్ వపామ్యహమ్ ।। ఆత్మనః శుద్ధికామోవా పితౄణాం తారణాయ చ వన వపనం కారయిష్యామి తీరేహం తవ గౌతమి।

గోదావరీ తీరవాసులకు – ఉపవాసము, కేశవపనము జుట్టు తీయించుకొనుట అక్కరలేదని పెద్దలందురు. అనగా గోదావరీ తీరవాసులు కానివారు ఉపవాసము, కేశవపనము ఆచరింపవలయును. తల్లిదండ్రులు కలవారు – పితృకర్మలు చేయనక్కరలేనివారు వీనిని ఆచరింపనక్కరలేదు.

అభిముఖస్నానమ్

తతః ప్రవాహాభిముఖం స్నానం కరిష్యే। "యన్మయాదురితం తోయం శారీరమల సంయుతం । తస్యపాప విశుద్ధ్యర్థం యక్ష్యాణం తర్పయామ్యహం" యేకే చాస్స... వస్త్రి నిష్పీడనోదకం (కట్టుకుని ఉన్న వస్త్రముయొక్క ఎదటి అంచులు గుప్పిళ్లబట్టి నీరు పిండుకొనవలెను.)

అథ గౌతమీ పూజా సంకల్పః

ఓం అస్య శ్రీమద్భగవతో మహాపురుషస్య, శ్రీమదాది నారాయణస్య అంచిత్యా పరిమిత శక్త్యాభియ మాణస్య, మహాజలౌఘమధ్యే, పరిభ్రమమాణానామనేకకోటి బ్రహ్మాండానామేక తమేవ్యక్తావ్యక్త మహదహంకార పృథివ్యాపస్తే జోవాయురాకాశాద్యావృణైరా వృతేస్మిన్ మహతి బ్రహ్మాండ ఖండయోర్మధ్యే, ఆధారశక్తి శ్రీకూర్మవరాహ వైష్ణవానంత నాగశేష తక్షకా దిగ్గజోపరి ప్రతిష్ఠితే, స్వ అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహీతల, పాతాళ సప్తలోకానాముపరితలే భూలోక, భువర్లోక, సువ్లోక, మహాలోక, జనోలోక, తపోలోక, సత్యలోకా నామధోభాగే, చక్రవాళ, శైలమహావలయ, మధ్యేవర్తినాం, మహానాళాయమాన ఫణి రాజస్య, శేష్య, సహస్ర ఫణాఫణి మండలమండితే, ఐరావత, పుండరీక, వామన, కుముదాంజస, పుష్పదంత, సార్వభౌమ సుప్రతీకా ఖ్యాష్ట, దిగ్దంతి, శుండా దండోత్థంభితే, ఇంద్రాగ్ని, యమనిర్రుతి, వరుణ, వాయు, కుబేర, ఈశాన్యాద్యష్ట, దిక్పాలకపాలితే, లోకాలోక చలవలయితే, వలయాకార లవణైక సురాసర్పి దధిక్షీర, శుద్ధజలార్ణ వైరవావృతేస్మిన్ మహతి జంబూప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కరాఖ్యై, స్సప్తభిర్ద్వీ, పైర్దిపితే మతంగ, హిరణ్య, శృంగాది, పంచభిర్మహోన, గైస్సమధిష్ఠితే హిమశైల, హేమకూటాది సప్త భిర్మహలై, స్సమధిష్ఠితే, ఇంద్ర ఖశేరు తామ్రగ భస్తి, నాగ, సౌమ్య, శర, భరత, ఖండాఖ్యస్మృతి, నవఖండాత్మికే, మహాసరోరుహకార, పంచాశత్కోటి, విస్తీర్ణ భూమండలే, మేరోర్ద క్షిణేపార్శ్వే మలయాదుత్తరే, కర్మభూమౌ, భారత కింపురుష, హరిరా వృతకురు, భద్రాశ్మకర, మందహాస జిహ్వాదాఖ్యేతి నవఖండ ఖండితే, దండక, చంపక, వింధ్యావిశా, నైమిశ, కదళిక, బదరిక, నహుష గోదారు, కారణ్యాద్యే, కాదశారణ్యయుతే, అంగ, వంగ, కళింక, కాశ్మీర, కాంభోజ, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, మగధ, మాళవ, సింహళ, నేపాళ, ద్రవిడ, ద్రావిడ, కర్ణాట, పానాటాది, చొప్పన్నదేశ భూపాల విచిత్రితే, స్వామ్యవంతి, కురుక్షేత్రాది గంగా, గోదావరీ భీమరధీ, తుంగభద్రా, కృష్ణవేణీ, కావేర్యా మహానదీవిలసితే, అయోధ్యా, కాశీ, పురుషోత్తమ, రామేశ్వరాది మహాముక్తి స్థలయుతే, శ్రీశైలస్య ఈశాన్యప్రదేశే గంగా, గోదావర్యోర్మధ్యదేశే, దేవతిర్యఙ్మనుష్య, సకల జగత్సృష్ట పరార్ధ ద్వయ జీవినో బ్రహ్మణః ప్రథమ పరార్ధే పంచ శతాతీతే, ద్వితీయ పరార్ధే పంచశతాధివర్షే, ప్రథమమాసే, ప్రథమపక్షే, ప్రథమదివసే, అహని ద్వితీయయామే, తృతీయముహూర్తే, త్రయోదశ ఘటికాయా ద్విచత్వారిగ్ం, శద్విఘటికా సుగతాసు త్రిచత్వారిగ్ం శద్విఘటికాసు గతాయాం శ్వేత వరాహకల్పే స్వాయంభువ, స్వారోచిషోత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సూర్యసావర్ణి, బ్రహ్మసావర్ణి, రుద్రసావర్ణి, దక్షసావర్ణి, రౌచ్యసావర్ణి, భౌత్యసావర్ణి, విష్ణుసావర్ణాదీనాం, ఏవం, చతుర్థ మన్వంతరాణాం, మధ్యే, సప్తమే వైవస్వత మన్వంతరే, అక్ష్మాష్టావింగ్ం శన్మహా కలియుగే, మత్స్యకూర్మాది, దశావతారాణాం, మధ్యే నవమే, బౌద్ధావతారే, యుధిష్ఠిరాది షట్చక్రవర్తీనాం, మధ్యేశాలివాహనశకే, అష్టాదశ శత వర్షాతీతే, వర్తమానేన, వ్యవహారిక, చాంద్రమానేన, సుభానునామసంవత్సరే, దక్షిణాయనే, వర్షఋతౌ, శ్రావణమాసే, శుక్లపక్షే, వాసరే, శుభనక్షత్ర శుభయోగే, శుభకరణే, ఏవంగుణ, విశేషణ, విశిష్టాయాం, శుభతిథౌ, శ్రీమాన్.... గోత్ర.... నామధేయ, ధర్మపత్నీసమేత శ్రీమతః గోత్రస్య నామధేయస్య, ధర్మపత్నీ సమేతస్య, మమ జన్మాభ్యాసా, జ్జన్మప్రభృతి, ఏతత్క్షణపర్యంతం, మధ్యేవర్తినికాలే, సంభావితానాం, పాపానాం, బాల్య యౌవన, కౌమార, వార్ధకేషు, జాగ్రత్ స్వప్న, సుషుప్తవస్థాసు, మనోవాక్కాయ, కర్మేంద్రియ, వ్యాపారైః, రహస్యేచ, ప్రకాశేచ, జ్ఞానతోజ్ఞాన, కృత సమస్త పాపక్షయద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం, మయా సహదశ పూర్వేషాం, దశాపరేషాం, మద్వంశ్యానాం సర్వేషాం, పితౄణాం, నరకాదుత్తీర్య శాశ్వత బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, తిలైః సూర్య మండల పర్యంతం, కృతరాశీర్వర్ష, సహస్రావసానే, ఏకైక, తిలాప,

కర్షణ, క్రమేణ సర్వరాశ్యప, కర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, యవైశ్చంద్రమండల పర్యంతం కృతరాశీర్వర్ష సహస్రావసానే, ఏకైక యవాప, కర్షణ, క్రమేణ సర్వరాశ్యప, కర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, యవైశ్చంద్రమండల పర్యంతం, కృతరాశీర్వర్ష సహస్రావసానే, ఏకైక యవాప, కర్షణ, క్రమేణ, సర్వరాశ్య పకర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, మాషైః ధృవమండల పర్యంతం, కృతరాశీర్వర్ష సహస్రావసానే, ఏకైక యవాప, కర్షణ, క్రమేణ, సర్వరాశ్య పకర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, నివాస సిద్ధ్యర్థం మాషైః ధృవమండల పర్యంతం, కృతరాశీర్యర్ష సహస్రావసానే ఏకైక మాషాపకర్షణ క్రమేణ సర్వరాశ్యప, కర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకే నివాస సిద్ధ్యర్థం, గోలోమభి ర్నక్షత్రమండల పర్యంతం, కృతరాశీర్వర్ష సహస్రావసానే, ఏకైక గోలోమాపకర్షణ క్రమేణ, సర్వరాశ్యపకర్షణ సమితకాలే, బ్రహ్మలోకే నివాస సిద్ధ్యర్థం, గంగా వాలుకాభి స్సప్తర్షిమండల పర్యంతం కృతరాశీర్వర్ష సహస్రావసానే, ఏకైక వాలుకాపకర్షణ క్రమేణ, సర్వరాశ్యపకర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, గంగా వాలుకాభి స్సప్తర్షిమండల పర్యంతం కృతరాశీర్వర్ష సహస్రావసానే, ఏకైక వాలుకాపకర్షణ క్రమేణ, సర్వరాశ్యపకర్షణ సమ్మితకాలే, బ్రహ్మలోకేనివాస సిద్ధ్యర్థం, త్రిగుణీ కృతాగ్నిష్టోమాతి, రాత్రాప్తోర్యాసాంతపన, వాజపేయ, పౌండరీ, కాశ్వమేధాది శతక్రతు పుణ్యఫలావాప్త్యర్థం, ఇహజన్మని, జన్మని రాజాధిరాజోభూత్వా, సమస్త సుఖాన్యనుభూయ, తతో విష్ణుసాయుజ్య ఫలావాప్త్యర్థం, శ్రీలక్ష్మీనారాయణ ముద్దిశ్య శ్రీలక్ష్మీనారాయణ ప్రీత్యర్థం, సింహంగతే దేవగురౌ సార్థత్రికోటితీర్థ తీర్థరాజేన సహిత పుష్కర యోగ మహాపర్వణి పుణ్యకాలే, అఖండ గౌతమీస్నాన మహంకరిష్యే. (అని సంకల్పము చేసి స్నానము చేయవలెను).

స్నాన లక్షణమ్

సంకల్పయుక్త పఠనం మార్జనం చాఘ మర్షణం ।
దేవాది తర్పణం చైవ స్నానం పంచాంగముత్తమమ్ ॥
కర్షమాత్ర సువర్ణేన తదర్ధార్ధేన వాపునః ।
ఆచార్యం ప్రతిమాం కృత్వా యధా విభవ మర్చయేత్ ॥
రజతేన తధాసింహం యధాశక్త్యా వినిర్మతం ।
గంగాయాః ప్రతిమాం కృత్వా రాజతీం వా స్వశక్తితః ।
అశక్తో హృదయేధ్యాత్వా తతః పూజాం సమాచరేత్ ।
ఆగచ్ఛ విబుధాచార్య సింహస్థ సురపూజిత ॥
తవ పూజాం కరిష్యామి గౌతమీ సహితస్యవై
జీవేన జీవరూపోసి సింహస్థోప ఇసురార్చిత ॥
తవపూజాం కరిష్యామి గౌతమీ సహితస్యవై ।
విష్టరం పాద్యమర్ఘ్యం చ దాతవ్యం సురమంత్రిణే ॥
చతుర్భుజం దండహస్తం వరదాభయ పాణినం ।
గజసింహ సమారూధం గురుం ధ్యాత్వానమామ్యహం ॥
ఉపచారైష్షోడ శభిర్గురు పూజాం సమాచరేత్ ।
బృహస్పతే సురాధ్యక్ష ఇతిచార్ఘాణి దాపయేత్ ।
తతస్తు గౌతమీ పూజాం సుసంకల్ప్య సమాచరేత్ ॥

ఆచమ్య.... ప్రాణానాయమ్య.... సంకల్ప్య....

సంకల్పం ఓం మమోపాత్త దురితక్షయ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం శ్రీమాన్..... గోత్రః .... నామధేయస్యః. శ్రీమతస్యః... గోత్రవత్యాః నామధేయస్యః మమ ఆచరిత పుష్కరాదిక సమస్త ప్రతకల్పోక్త సకల ఫలావ్యాప్త్యర్థం గోదావరీ పూజాం కరిష్యే । తదంగ ప్రతిమా శోధనం కరిష్యే.

గోదావరీ రూప నిర్దేశనం

శ్లో॥ దక్షిణేతు కరే కుంభం వామే వరుణ పాశకం ।
దధానా ద్విభుజా పూజ్యా సద్యోమకరవాహనా ॥

ఉపర్యుక్త గోదావరీ ప్రతిమను పంచామృతములోనూ, శుద్ధోదకముతోనూ ఈ దిగువ మంత్రములతో శోధన చేయవలెను. ప్రతిమాం సంశోధ్య

1 మం॥

ఆప్యాయస్య సమేతు తే విశ్వతస్సోమ
వృష్ణియం భవావాజస్యసంగధూ (పాలు)

2 మం॥

దధిక్రావుణ్ణో అకారిషం జిష్ణోరశ్వస్య వాజినః
సురభినో ముఖాకరత్ప్రణ ఆయూగ్ంషి తారిషత్ ॥ (పెరుగు)

3 మం॥

శుక్రమసి జ్యోతిరసి తేజోసి దేవో వస్సవితోత్పునా ।
త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసో సూర్యస్య రశ్మిభిః ॥ (నేయి)

4 మం॥

మధువాతా ఋతాయతే మధుక్షరంతి సింధవః ।
మధునక్తముతోషసి మధుమత్పార్థివగ్ం రజః మధుద్యౌర
స్తునఃపితా, మధు మాన్నోవనస్పతి ర్మధుమాగ్ం అస్తు, సూర్యః,
మాధ్వీర్గావో భవంతునః ॥ (తేనె)

5 మం॥

స్వాదుః పవస్వదివ్యాయ, జన్మనేస్వాదురింద్రాయ సుహవేతు
నామ్నే స్వాదుర్మిత్రాయ వరుణాయ వాయవే బృహస్పతయే
మధుమాగ్ం అదాభ్యః । (చక్కెర)

6 మం॥

యాః ఫలినీర్యా అఫలాయాశ్చ పుష్పిణీః ।
బృహస్పతిప్రసూతాస్తానో ముంచం త్వగ్ంహసః

(ఫలోదకస్నానమ్)

పై మంత్రములతో పంచామృతములతో శోధనచేసి

ఓం ఆపోహిష్టామయోభువః। తాన ఊర్జే దధాతన। మహేరణాయ చక్షసే। యో వశ్శివతమోరసః। తస్య భాజయ తేహనః। ఉశతీరివ మాతరః । తస్మా అరంగ మామ వోయస్య క్షయాయ జిన్వథ । ఆపోజన యథాచనః ॥

సహస్ర జరసేదేవీ పవిత్రం విమలం జలం 7 స్నానార్థం యత్ సమానీతం రుద్రపత్ని నమోస్తు తే ॥ తమో రసన్తస్య భాజయతే హనః ఉశతీరివమాతరః తస్మా అరంగమామవో యస్య క్షయాయ శుద్ధోదక స్నానం సమర్పయామి.

అథ ధ్యానమ్

పద్మాస్యాం పద్మపత్రాక్షీం పద్మగర్భ స్వరూపిణీం ।
చింతయే త్వద్మచరణాం పద్మాసన నివేశినీమ్ ॥
చతుర్భుజాం సువర్ణాఢ్యాం వరదాం పద్మధారిణీం ।
సుధాసంపూర్ణ సౌవర్ణకలశద్వయ ధారిణీమ్ ॥
క్షౌమయుగ్మ పరీధానాం రత్నకుంకుమ ధారిణీం ।
ముక్తామాణిక్యసమ్మిశ్ర దివ్యహార విభూషితాం ॥
దివ్యమందార సంభూత పుష్పాలంకృత విగ్రహామ్
భక్తానుగ్రహదాందేవీం ప్రాదుర్భూతాం నమామితామ్ ॥

శ్లో॥ దివ్యకర్పూర గంధాఢ్యాం శ్వేత చందన చర్చితాం ।
లసన్మజీర చరణాం క్వణత్కంకణమండితామ్ ॥
శ్వేతాంబరాం శ్వేత వర్ణాం శ్వేతాల్యానులేపనాం ।
త్ర్యక్షాంహంస సమారూఢాం ప్రసన్నాస్యాం చతుర్భుజామ్।
శంఖంత్రిశూలం పరశుం అక్షమాలాం చ బిభ్రతం ॥
దివ్యభూషణ సంయుక్తాం బ్రహ్మవిష్ణుసమాత్మికామ్ ॥
సార్థత్రికోటి తీర్థైశ్చ సంయుతాం వృద్ధ గౌతమీం ।
తీర్థరాజేన సహితాం పుణ్యగోదావరీం శుభామ్ ॥
సింహస్థేదేవగుగౌ – సార్థత్రికోటి తీర్థరాజపుష్కర సహిత గోదావరీ మహానదీ దేవతాయై నమః – ధ్యాయామి.

ఆవాహనమ్

హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజత స్రజాం ।
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ ॥
అఘక్షయకరే దేవి చంద్ర చూడప్రియేనఘే ।

సింహస్థేదేవగురౌ – సార్థత్రికోటి తీర్థరాజ పుష్కర సహిత గోదావరీ మహానదీ దేవతాయై నమః – ఆవాహనం సమర్పయామి.

ఆసనమ్

తాంమ ఆవహజాతవేదో లక్ష్మీ మనపగామినీం ।
యస్యాం హిరణ్యం విందేయం గామశ్వం పురుషానహమ్ ॥
అనంతాబ్జదళం పత్రం అనంతాఖ్యం మహాసనం ।
హేమాద్రికేసరం సమ్యక్ ఆసనార్థం ప్రకల్పితమ్ ॥

సింహస్థేదేవగురౌ – సార్థత్రికోటి తీర్థరాజ పుష్కర సహిత గోదావరీ మహానదీ దేవతాయై నమః – ఆసనం సమర్పయామి.

పాద్యమ్

అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాద ప్రబోధినీం ।
శ్రియందేవీ మపహ్వయే శ్రీర్మాదేవీ జుషతామ్ ॥
లోకోత్తర శ్శంకర స్త్వాముత్తమాంగే భిభర్తియత్ ।
పాద్యం గృహాణ హేగంగే పాపభంగే భయాపహే ॥

సింహస్థేదేవగురౌ – ..... మహానదీ దేవతాయై నమః – పాద్యం సమర్పయామి.

అర్ఘ్యమ్

కాంసోస్మితాం హిరణ్య ప్రాకారామార్ద్రాం జ్వలంతీం ।
తృప్తాం తర్పయంతీం పద్మేస్థితాం పద్మవర్ణాం తామిహోపహ్వయే శ్రియమ్ ॥
సపత్నీ భావ మాహాత్మ్య కవితా కామ భాసురే
గృహాణార్ఘ్యం మయాదత్తం బ్రాహ్మణః ప్రాణధారిణి ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – అర్ఘ్యమ్ సమర్పయామి.

ఆచమనమ్

చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం శ్రియంలోకే దేవ జుష్టాముదారాం ।
తాం పద్మినీం శరణమహం ప్రపద్యే అలక్ష్మీ ర్మేనశ్యతాం త్వా వృణే ॥
త్వదుద్భూతం మహాపుణ్యం ఉదకం హ్యమృతోపమం
గృహాణాచమనం గంగే కృపయా భక్తవత్సలే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – ఆచమనం సమర్పయామి.

మధుపర్కమ్

పెరుగు, తేనె, నేయి, నీరు, పంచదార వీనిని మధుపర్కము అంటారు.

మధ్వాజ్యదధిసంయుక్తం శర్కరాజలసంయుతం ।
మధుపర్కం గృహాణత్వం జగన్మాతః నమోస్తుతే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – మధుపర్కమ్ సమర్పయామి.

పంచామృత స్నానమ్

ఆదిత్యవర్ణేతపసోధిజాతో వనస్పతి స్తవవృక్షోఽథబిల్వః
తస్యఫలాని తపసానుదంతు మాయాంతరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః॥
క్షీరోదధి సముద్భూతం క్షీరం స్నానార్థముత్తమం।
మయా స్నానార్థమానీతం స్వీకురుత్వం నమోస్తుతే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – పంచామృత స్నానం సమర్పయామి.

ఓం ఆపోహిష్ఠామయో భువస్తాన ఊర్జే దధాతన, మహేరణాయ చక్షసే యోవశ్శివతమోరసః తస్యషభాజయతే హనః ఉశతీరివ మాతరః, తస్మా అరంగమామ వోయస్యక్షయాయ జిన్వధ ఆపోజన యధాచనః ॥

శుద్ధోదకస్నానమ్

సహస్రశిరసేదేవి పవిత్రం విమలం జలం।
స్నానార్థం యత్ సమానీతం రుద్రపత్ని నమోస్తుతే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – శుద్ధోదకస్నానం సమర్పయామి.

వస్త్రమ్

ఉపైతుమాం దేవసఖః కీర్తిశ్చమణినాసహ ప్రాదుర్భూతో–స్మి
రాష్ట్రే–స్మిన్ కీర్తిమృద్ధిం దదాతు మే ॥
లసత్ క్షౌమయుతం దేవి గుణాతీతే–నుకంపయా
మయోపనీతం శుభగే – గృహాణ పరమేశ్వరి ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – వస్త్రయుగ్మం సమర్పయామి.

కంఠసూత్రమ్

క్షుత్పిపాసామలాం జ్యేష్ఠాం అలక్ష్మీ నాశయామ్యహం।
అభూతి మసమృద్ధిం చ సర్వాంనిర్ణుదమే గృహాత్ ॥
సుసూత్రం గ్రంధితం దివ్యం పవిత్రం పరమం శుభం।
గృహాణ కంఠభూషార్థం గంగే గంగాధర ప్రియే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవ్యై నమః – శ్రీగంధం సమర్పయామి.

గంధమ్

గంధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీం।
ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియమ్ ॥
కర్పూరాగరు కస్తూరీ కుంకుమాఢ్యం మనోహరం।
గృహాణచందనం దేవి గోదావరి నమోస్తుతే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – హరిద్రాచూర్ణం సమర్పయామి.

కుంకుమ

యాగ్ం కుర్యాసినీవాలీ యా రాకా యా సరస్వతీ।
ఇంద్రాణీ మహ్య ఊత మేవరుణానీ స్వస్తయే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – కుంకుమకజ్జలాది సుగంధద్రవ్యాణి సమర్పయామి.

అక్షతలు

మనసః కామమాకూతిం వాచస్పత్య మశీమహీ।
పశూనాగ్ం రూప మన్నస్యమయి శ్రీశ్శ్రయతాం యశః ॥
అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీతండుల సంభవాన్।
గృహాణవరదే దేవి ఈశపత్ని శుభాక్షతాన్ ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః –అక్షతాన్ సమర్పయామి.

సౌభాగ్య ద్రవ్యమ్

హరిద్రాకుంకుమం చైవ సిందూరం కజ్జలాదికం।
నీలలోహిత తాటంకే మంగళ ద్రవ్యమీశ్వరి ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః –సమస్త సౌభాగ్య ద్రవ్యాణి సమర్పయామి.

పుష్పమ్

మల్లికాశోక పున్నాగ కరవీరాంబుజానిచ।
గంగేమయోపనీతాని పుష్పాణి ప్రతిగృహ్యతామ్ ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – పుష్ప పూజాం కరిష్యామి.

అథాంగపూజా

ఓం శ్రీ పద్మనాభ పదోద్భవాయై నమః – పాదౌ పూజయామి
ఓం గుణత్రయ స్వరూపిణ్యై నమః – గుల్ఫౌ పూజయామి
ఓం జంఘాపీత ప్రభంజనాయై నమః – జానునీ పూజయామి
ఓం జగజ్జనన్యై నమః – జంఘే పూజయామి
ఓం ఊరీకృతేభ నాసోరవే నమః – ఊరూ పూజయామి
ఓం కటనిర్జిత పులినాభాయై నమః – కటిం పూజయామి
ఓం నవరత్న కాంచీవిభూషాయై నమః – నాభిం పూజయామి
ఓం వరదానాసక్త చిత్తాయై నమః – వక్షస్థలం పూజయామి
ఓం కరకలిత స్వర్ణ కుంభభుజాయై నమః – భుజౌ పూజయామి
ఓం నిరంతరామృతపయః పరీవాహ పరిపోషణ శీలసుస్తనాయై నమః – స్తనౌ పూజయామి
ఓం కటకాంచితమణిబంధనాయై నమః – కర్ణౌ పూజయామి

ఓం కనత్ గ్రైవేయరంజితాయై నమః – కంఠం పూజయామి
ఓం రాకేందు వదనాయై నమః – వదనం పూజయామి
ఓం స్ఫురన్మణికుండలాయై నమః – కర్ణౌ పూజయామి
ఓం నీరజాక్ష్యై నమః – నేత్రే పూజయామి
ఓం నవగంధఫలినాసాయై నమః – నాసికాం పూజయామి
ఓం ఘనదర్పణ గండనాయై నమః – గండస్థలం పూజయామి
ఓం దాడిమీబీజసందోహనిభదంతావళ్యై నమః – దంతాన్ పూజయామి
ఓం చంచత్కింశుక పుష్పాభలస దోష్ఠ ద్వయాంచితాయై నమః – చుబుకం పూజయామి
ఓం ప్రతిపచ్చంద్రసంకాశ కర్పూర తిలకాయై నమః – ఫాలం పూజయామి
ఓం ముక్తాబిందులసత్ మందారాయై నమః – మస్తకం పూజయామి
ఓం కేకీదళసచ్ఛన్న కేశపాశవిరాజితాయై నమః – కేశపాశాన్ పూజయామి
ఓం సర్వజగన్మాత్రే నమః – శిరః పూజయామి
ఓం గౌతమాఘచయోత్థాత నసమర్థ జలపూరితాయై నమః – సర్వాణ్యంగాని పూజయామి

శ్రీ గోదావరి అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీ మహాదేవ్యై నమః
ఓం శ్రీకర్యై నమః
ఓం శ్రీపరిగ్రహాయై నమః
ఓం శ్రీగౌతమ్యై నమః
ఓం శ్రీ భవాన్యై నమః
ఓం శ్రీ మాత్రే నమః
ఓం శ్రీజయాన్వితాయై నమః
ఓం శ్రీ శాంకర్యై నమః
ఓం శ్రీ శివాయై నమః
ఓం శ్రీ దుర్గాయై నమః
ఓం శ్రీ పతి పదాంభోజా(తా)యై నమః
ఓం శ్రీ మత్త్రిపురసుందర్యై నమః
ఓం శ్రీ కాళ్యై నమః
ఓం శ్రీ పదాయై నమః
ఓం శ్రీ ప్రదాయై నమః
ఓం శ్రీ మదిందిరాయై నమః
ఓం శ్రీ చక్రధారిణ్యై నమః
ఓం శ్రీ జలాయై నమః
ఓం శ్రీ పరమేశ్వర్యై నమః
ఓం శ్రీ చక్రరాజ నిలయాయై నమః
ఓం శ్రీ కర్ణాయై నమః
ఓం శ్రీ పతివ్రతాయై నమః
ఓం శ్రీ గోదావర్యై నమః
ఓం శ్రీ మదనంత ఫలదాయిన్యై నమః
ఓం శ్రీ బీజాయై నమః
ఓం శ్రీ కరావర్తాయై నమః
ఓం శ్రీ జయాయై నమః
ఓం శ్రీ విజయాయై నమః
ఓం శ్రీ విరాజితాయై నమః
ఓం శ్రీ మూలాయై నమః
ఓం శ్రీ మధ్రూమధ్యమాయై నమః
ఓం శ్రీ వసుంధరాయై నమః
ఓం శ్రీ తోయాయై నమః
ఓం శ్రీ ముఖాయై నమః
ఓం శ్రీ నికేతనాయై నమః
ఓం శ్రీ విలాసిన్యై నమః
ఓం శ్రీ భ్రూయుగాయై నమః
ఓం శ్రీ శ్రీమదంబాయై నమః
ఓం శ్రీమత్సింహాసన సంస్థితాయై నమః
ఓం శ్రీజంఘాయై నమః
ఓం శ్రీభగాయై నమః
ఓం శ్రీమత్కటకచక్రరాజిన్యై నమః
ఓం శ్రీ మధ్యమాయై నమః
ఓం శ్రీ విశాలాక్ష్యై నమః
ఓం శ్రీ విద్యాయై నమః
ఓం శ్రీ పరాయై నమః
ఓం శ్రీ శ్రియై నమః
ఓం శ్రీ మానిన్యై నమః
ఓం శ్రీ కరాబ్జాయై నమః
ఓం శ్రీ మత్సింహాసనేశ్వర్యై నమః
ఓం శ్రీ పక్షాయై నమః
ఓం శ్రీ పరిజ్ఞానాయై నమః
ఓం శ్రీ జటాయై నమః
ఓం శ్రీ స్మితాననాయై నమః
ఓం శ్రీ మదాగమసంవేద్యాయై నమః
ఓం శ్రీ వేదాంత ప్రదీపితాయై నమః
ఓం శ్రీ శివజటాజూట నివాసాయై నమః
ఓం శ్రీ భద్రాసనమధ్యస్థాయై నమః
ఓం శ్రీ కరార్చితాయై నమః
ఓం శ్రీ వీణాగానలోలుపాయై నమః
ఓం శ్రీ చిత్రాంబరధరాయై నమః
ఓం శ్రీ వేణుగానలోలుపాయై
ఓం శ్రీ చిత్రాంబరధరాయై
ఓం శ్రీ మత్యై
ఓం శ్రీ మదాపగాయై నమః
ఓం శ్రీ మదంబికాయై నమః
ఓం శ్రీ గుణాయై నమః
ఓం శ్రీ మదనఘాయై నమః
ఓం శ్రీ మదలకాయై నమః
ఓం శ్రీ కుచద్వయాయై నమః
ఓం శ్రీ దంతాయై నమః
ఓం శ్రీ కవచాయై నమః

ఓం శ్రీ కాంచనపుష్పాయై నమః
ఓం శ్రీ కాశికాయై నమః
ఓం శ్రీ మనోహరాయై నమః
ఓం శ్రీ విగ్రహాయై నమః
ఓం శ్రీ విశేషాయై నమః
ఓం శ్రీ భాషాయై నమః
ఓం శ్రీ ధరాత్మజాయై నమః
ఓం శ్రీ నారాయణ పదాబ్జజా మరందాయై నమః
ఓం శ్రీ మాతృసంగమపావనాయై నమః
ఓం శ్రీ మహానద్యై నమః
ఓం శ్రీ గౌతమాఘసంహర్త్యై నమః
ఓం శ్రీ భూనీలాసంసేవితాయై నమః
ఓం శ్రీ మహానాసాయై నమః
ఓం శ్రీ మహానేత్రాయై నమః
ఓం శ్రీ మనోరథాయై నమః
ఓం శ్రీ నామ్న్యై నమః
ఓం శ్రీ మహాదీప్తాయై నమః
ఓం శ్రీ మహాబలాయై నమః
ఓం శ్రీ మహామత్యై నమః
ఓం శ్రీ మహీభూషణాయై నమః
ఓం శ్రీ శతాంగాయై నమః
ఓం శ్రీ దివ్యామృతవాహిన్యై నమః
ఓం శ్రీ మునిసతీబృందసేవితా మలపాదుకాయై నమః
ఓం శ్రీ మత్సురబృందోల్లాసిన్యై నమః
ఓం శ్రీ విలసితతరంగిణ్యై నమః
ఓం శ్రీ గోహత్యాపాపౌఘహారిణ్యై నమః
ఓం శ్రీ స్త్రీ హత్యాఘనివారిణ్యై నమః
ఓం శ్రీ గౌతమతపోయోగ సంభూతాయై నమః
ఓం శ్రీ కంచుకధారిణ్యై నమః
ఓం శ్రీ మంత్రరాజఫలప్రదాయై నమః
ఓం శ్రీ గిరివరాత్మజాయై నమః
ఓం శ్రీ అద్భుత చారిత్రాయై నమః
ఓం శ్రీ శ్రీవత్సాంకితవక్షసే నమః
ఓం శ్రీ ఖేచర్యై నమః
ఓం శ్రీ పురాణ్యై నమః
ఓం శ్రీ భూషణభూషితాయై నమః
ఓం శ్రీ సర్వపండిత సంపూజ్యాయై నమః
ఓం శ్రీ ఆగమమహానద్యై నమః
ఓం శ్రీ వశిష్ఠాదిముని స్తవనీయాయై నమః
ఓం శ్రీ సప్తధాసాగరాన్వితాయై నమః
ఓం శ్రీ గోదావర్యై నమః
ఓం శ్రీ మద్గోదావరీ మహానద్యై నమః

ఏవం విధం శ్రీగోదావరీ కూలంకషాయా అష్టోత్తర శతనామ పూజా సమాప్తా

ధూపమ్

కర్దమేన ప్రజాభూతామయి సంభవకర్దమ శ్రియం।
వాసయ మేకులేమాతరం పద్మమాలినీమ్॥
వనస్పత్యుద్భవోదివ్యో గంధాఢ్యః సుమనోహరః।
ఆఘ్రేయ స్సర్వదేవానాం ధూపోయం ప్రతిగృహ్యతామ్॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – ధూపమాఘ్రాపయామి.

దీపమ్

ఆపస్రజంతు స్నిగ్ధాని చిక్లీతవసమే గృహే।
నిచదేవీం మాతరం శ్రియం వాసయ మేకులే॥
అతివర్ణోజ్వలం దీపం అజ్ఞానాంధ వినాశనం।
జ్ఞానప్రదం మహాగంగే గృహాణసురవందితే॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – దీపం దర్శయామి.

నైవేద్యమ్

ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగళాం పద్మమాలినీం।
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ॥
అన్నం చతుర్విధందేవి రసైష్షడ్భిః సమన్వితం।
నిత్య తృప్తికరేగంగే నైవేద్యం ప్రతిగృహ్యతామ్॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – నైవేద్యం సమర్పయామి.

తాంబూలమ్

ఆర్ద్రాం యఃకరిణీం యష్టింసువర్ణాం హేమమాలినీం।
సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమ ఆవహ॥
నాగవల్లీ దళైర్యుక్తం ఖదిరక్రముకాన్వితం।
కర్పూర భావితం గంగే తాంబూలం ప్రతిగృహ్యతామ్॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – తాంబూలం సమర్పయామి.

నీరాజనమ్

తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీ మనపగామినీం।
యస్యాం హిరణ్యం ప్రభూతంగావో దాస్యోశ్వాన్ విందేయం పురుషానహమ్॥
నీరాజనం జగద్బీజం నీరజాసనవందితే।
భక్తార్తి భంజనేదేవి స్వీకురుష్వ మయార్పితమ్॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – నీరాజనం సమర్పయామి.

దక్షిణ

సువర్ణం సర్వధాతూనాం శ్రేష్ఠ దేవివరం సదా ।
భక్త్యాదద్యామివరదే ధాన్య వృష్టిం చ దేహిమే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – దక్షిణ సమర్పయామి.

పుష్పాంజలి

బ్రహ్మాద్రిశిఖరోద్భూతే త్రికంటక విరాజితే ।
గౌతమ ప్రార్థితే దేవి, సరిదంశే నమోస్తుతే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – పుష్పాంజలిం సమర్పయామి.

నమస్కారమ్

మందాకిని నమస్తుభ్యం నమస్తే సురపూజితే ।
గోదావరి నమస్తుభ్యం గౌతమాదిభిరర్చితే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – నమస్కారాన్ సమర్పయామి.

ఆత్మప్రదక్షిణ నమస్కారమ్

ప్రదక్షిణం కరోమ్యద్య గౌతమాఘ వినాశిని ।
సర్వపాపహరేదేవి గోదావరి నమోస్తుతే ॥

సింహస్థేదేవగురౌ – మహానదీ దేవతాయై నమః – ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

అనయా మయాకృత ధ్యానావాహనాది షోడశోపచార పూజయా భగవతీసర్వాత్మికా శ్రీగోదావరీ దేవతా సుప్రీతా సుప్రసన్నా... వరదా భవతు, గోదావరీ ప్రసాదం శిరసా గృహ్ణామి ।

పుష్కర పూజా పుష్కర చతుర్వింశతి నామావళి

ఓం పుష్కరాయనమః, తీర్థనిలయాయ నమః, సురనాథాయ నమః, సుందరాయ నమః, తీర్థఫలదాయ నమః, శివరూపిణే నమః, శివప్రదాయ నమః, చతుర్ముఖాది సేవ్యాయ నమః, శుక్రదోష హరాయ నమః, హరయే నమః, అహల్యారాధితపాదాయ నమః, పరమాత్మనే నమః, జనార్దనాయ నమః, నారాయణాయ నమః, అవ్యయాయ నమః, నౌకరీ నిలయాయ నమః, శుచయే నమః, రమాపతిసుతాయ నమః, దేవాయ నమః, దేవకార్య సముత్సుకాయ నమః, వీక్షమాణిక్య కటకాయ నమః, ద్రౌపదీ పూజ్య చరణాయ నమః, రుక్మిణీనాథ సేవితాయ నమః, తీర్థనాథాయ నమః, శ్రీపుష్కరతీర్థరాజాయ నమః.

అథ గురుపూజా కల్పః (బృహస్పతీ పూజా)

ఆచమ్య, ప్రాణానాయమ్య సంకల్ప్య శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం .... గోత్రఃఽ.... శ్రీమాన్ .... నామధేయఃఽ, అహం .... గోత్రస్య శ్రీమతః సకుటుంబపరివారస్య మమ... నామధేయస్య ఆచరిత ప్రతకల్పోక్త సంపూర్ణ సకలఫలావాప్త్యర్థం బృహస్పతి పూజాం కరిష్యే.

తదంగ ప్రతిమాశోధనం : గోదావరీ ప్రతిమవలె నీ బృహస్పతి ప్రతిమను కూడా పంచామృతాదులలో శోధించవలెను. తదనంతరం ప్రతిమా గంధ పుష్పాక్షతైరభ్యర్చ్య ఓం శ్రీ బృహస్పత్యై నమః

బృహస్పతే అతియదర్యో అర్వాద్ద్యుమద్విభాతి క్రతుమజ్జనేషు।
యద్దీదయచ్ఛవసర్త ప్రజాత తదస్మాసుద్రవిణం ధేహి చిత్రమ్॥

బృహస్పతిం సాంగం సాయుధం సవాహనం సశక్తి పత్నీపుత్ర పరివారసహితం ఆవాహయామి స్థాపయామి పూజయామి.

కలశస్య ముఖే విష్ణుః కంఠేరుద్రస్సమాశ్రితః। మూలేతత్ర స్థితో బ్రహ్మామధ్యేమాతృగణస్థితాః ॥ కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపావసుంధరా। ఋగ్వేదోధయజుర్వేద స్సామవేదోహ్యధర్వణఃఽ అంగైశ్చసహితా స్సర్వే కలశాంబు సమాశ్రితాః । కలశే గంధపుష్పాక్షతాన్ నిక్షిప్య బృహస్పతి సాంగం, సాయుధం, సవాహనం సశక్తిపత్నీపుత్ర పరివారసహితం బృహస్పతిం ఆవాహయామి స్థాపయామి – పూజయామి – ఓం.

అసునీతే పునరస్మాసుచక్షుఃఽ పునఃఽ ప్రాణమిహనో ధేహిభోగం జ్యోక్పశ్యేమ సూర్యముచ్చరంత మనుమతేమృడయాన స్వస్తి అమృతం వై ప్రాణా అమృతరూపఃఽ ప్రాణానేవ యధాస్థానముపహ్వయతే యితి ప్రాణప్రతిష్ఠాపనం కృత్వా ప్రాణప్రతిష్ఠాపన ముహూర్త స్సుముహూర్తోస్తు । స్థిరో భవ । ఇష్టకామ్యార్థ ఠఫల సిద్ధిర్భవ ఇత్యుక్త్వా తదంగ కలశారాధనం కరిష్యే.

అథ గురుధ్యానమ్

ఆగచ్ఛ దిత్సురాచార్య సింహస్థ సురపూజిత ।
తవపూజాం విధాస్యామి గౌతమ్యా సహితస్యవై ॥

ఓం శ్రీ గౌతమీ మహానదీసమాగత సార్ధత్రికోటి తీర్థరాజ పుష్కర దేవతా గమన కారణాయ సింహగత దేవగురవే నమః – ధ్యాయామి – ధ్యానం సమర్పయామి.

ఆవాహనమ్

ఓం సహస్రశీర్షా పురుషఃఽ సహస్రాక్ష స్సహస్రపాత్ ।
స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠ దశాంగులమ్ ॥
చతుర్భుజం దేవ గురుం పీతాంబరధరం ।
విభుం నానాలంకార రుచిరం నమామి సురవందితమ్ ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - ఆవాహనం సమర్పయామి.

ఆసనమ్

పురుష ఏవేదగ్ం సర్వం యద్భూతం యచ్చభవ్యం ।
ఉతామృతత్వ స్యేశానః యదన్నే నాతిరోహతి ॥
బృహస్పతే సురాధ్యక్ష సర్వకల్మషనాశన ।
సింహాసనం రత్నమయం గృహాణ సురపూజిత ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - ఆసనం సమర్పయామి.

పాద్యమ్

ఏతావానస్యమహిమా అతోజ్యాయాగ్ంశ్చ పూరుషః ।
పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి ॥
రక్తాంభోరుహ సారాధ్య నలినాయతలోచన ।
గృహాణపాద్యమనఘ సురాణాం హితేరత ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - పాద్యం సమర్పయామి.

అర్ఘ్యమ్

త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః పాదోస్యేహా భవాత్పునః ।
తతో విష్వఙ్వ్యక్రామత్ సాశనా నశనే అభి ॥
సురాధ్యక్ష మహాబాహో గురోతవ నమస్కృతిః ।
అర్ఘ్యం గంగా జలోపేతం గృహ్ణీష్వసురసత్తమ ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - అర్ఘ్యం సమర్పయామి.

ఆచమనమ్

తస్మాద్విరాడజాయతవిరాజో అధిపూరుషః ।
సజాతో అత్యరిచ్యత పశ్చాద్భూమి మథోపురః ॥
దండాక్షసూత్ర వరదాభయపాణే మనోహర ।
గృహాణాచమనం దేవ తారయా సహిత ప్రభో ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - ఆచమనం సమర్పయామి.

స్నానమ్

యత్పురుషేణ హవిషాదేవా యజ్ఞమతన్వత ।
వసన్తో అస్యాసీదాజ్యం గ్రీష్మ ఇద్మ శరద్ధవిః ॥
లసన్మకుట మాణిక్య శోభయా ధ్వాంత నాశన ।
స్నాపయామి సురేశత్వాం శుద్ధగంగాజలైశ్శుభైః ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - స్నానం సమర్పయామి.

మధుపర్కమ్

మధ్వాజ్యదధిసంయుక్తం శర్కరాజలసంయుతం ।
మధుపర్కం గృహాణత్వం సురాచార్య నమోస్తుతే ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః - మధుపర్కం సమర్పయామి.

పంచామృతస్నానమ్

నాప్యాయస్వ సమేతుతే విశ్వతస్సోమ
వృష్ణియం భవావాజస్య సంగధే ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః క్షీరేణ స్నపయామి (పాలు పోయవలెను)

శుక్రమపి, జ్యోతిరసి, తేజోసి, దేవోవస్సవివోత్పునా ।
త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసోస్సూర్య స్యరశ్మిభిః ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః క్షీరేణ స్నపయామి (పాలు పోయవలెను)

మధువాతా ఋతాయతే మధుక్షరంతి సింధవః, మాధ్వీర్న స్సంత్వోషధీః । మధునక్తముతోషసి మధుమత్పార్థివగ్ం రజః మధుద్యౌరస్తునః పితా। మధుమాన్నో వనస్పతి ర్మధుమాగ్ం అస్తుసూర్యః మాధ్వీర్గావో భవంతునః ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః మధునాస్నపయామి (తేనో పోయవలెను)

స్వాదుః పవస్వ దివ్యాయ జన్మనే, స్వాదురింద్రాయ సుహవీతునామ్నే । స్వాదుర్మిత్రాయ వరుణాయ వాయవే బృహస్పతిం మధుమాగ్ం అదాభ్యః ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః శర్కరయా స్నపయామి

ఓం శ్రీ గౌతమీ సహిత బృహస్పతయే నమః పంచామృతై స్నపయామి.

శుద్ధోదక స్నానమ్

ఆపోహిష్ఠా మయోభువః । స్తాన ఊర్జేదధాతన మహేరణాయ చక్షసే। యోవశ్శివ తమోరవస్తస్యభాజయతేహనః, ఉశతీరివమాతరః । తస్మా అరంగమామవో యస్యక్షయాయ జిన్వనధ, ఆపోజనయధాచనః ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః శుద్ధోదక స్నానం సమర్పయామి (నీరు పోయవలెను)

ఫలోదకస్నానమ్

యాః ఫలినీర్యా అఫలాయాశ్చ పుష్పిణీః ।
బృహస్పతి ప్రసూతాస్తానో ముంచం త్వగ్ంహసః ॥

నమోనమస్సర్వగురో సర్వదేవ హృదర్చిత (జీవ)
నారికేళోదకస్నానం స్వీకురుష్వకృపాపర॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః ఫలోదక స్నానం సమర్పయామి.

వస్త్రయుగ్మమ్

సప్తాస్యాసన్ పరిధయః త్రిస్సప్తసమిధః కృతాః।
దేవా యద్యజ్ఞం తన్వానాః అబధ్నన్ పురుషం పశుమ్ ॥
స్వర్ణవర్ణమయంవాసో గృహ్యతాంగ్రహనాయక।
గురో భక్తేష్టఫలద స్సింహస్థ కృపయా మయి ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః వస్త్రయుగ్మం సమర్పయామి.

యజ్ఞోపవీతమ్

తం యజ్ఞం బర్హిషిప్రౌక్షన్ పురుషం జాతమగ్రతః।
తేనదేవా అయజన్త సాధ్యా ఋషయశ్చయే ॥
ఉపవీతం మయానీతం నవతంతు వినిర్మితం।
బ్రహ్మగ్రంధి సమాయుక్తం గృహాణ విబుధేశ్వర ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః యజ్ఞోపవీతమ్ సమర్పయామి.

గంధమ్

తస్మాద్య జ్ఞాత్సర్వహుతః సంభృతం పృషదాజ్యం।
పశూగ్ంస్తాగ్ం। శ్చక్రేవాయవ్యాన్, అరణ్యాన్ గ్రామ్యాశ్చయే।
కర్పూరాగరు కస్తూరీ సహితం చందనం శివం।
సర్వశాస్త్రార్థ తత్వజ్ఞ, స్వీకురుష్వ నమోస్తుతే ॥

ఓం శ్రీ గౌతమీ..... దేవగురవే నమః గంధమ్ సమర్పయామి.

అక్షతలు

తస్మా ద్యజ్ఞాత్సర్వహుతః ఋచస్సామానిజజ్ఞిరే।
ఛందాగ్ంసిజజ్ఞిరే తస్మాత్ యజు స్తస్మాదజాయత ॥

ఓం శ్రీ గౌతమీ..... దేవగురవే నమః అక్షతాన్ సమర్పయామి.

పుష్పమ్

తస్మాదశ్వా అజాయంత ఏకేచో భయదాతః।
గావోహ జజ్ఞి రేతస్మాత్, తస్మాజ్జాతా అజావయః ॥
చంపకా శోక పున్నాగ కేతకీ వకుళాని చ।
అన్యానిచ సుపుష్పాణి స్వీకురు ద్విజనాయక ॥

ఓం శ్రీ గౌతమీ..... దేవగురవే నమః పుష్పాణి సమర్పయామి.

అథాంగపూజా

ఓం రక్తాంబుజ పదాయ నమః – పాదౌ పూజయామి
ఓం గురవే నమః – గుల్ఫౌ పూజయామి
ఓం జగద్విదితాయ నమః – జానునీ పూజయామి
ఓం జీవాయ నమః – జంఘే పూజయామి
ఓం గీష్పతయే నమః – ఊరూ పూజయామి
ఓం సురాచార్యాయ నమః – కటిం పూజయామి
ఓం మహాత్మనే నమః – నాభిం పూజయామి
ఓం ఇంద్రవరదాయినే నమః – వక్షస్థలం పూజయామి
ఓం ఆజానుబాహవే నమః – బాహూన్ పూజయామి
ఓం కంబుకంఠాయ నమః – స్తనౌ పూజయామి
ఓం రత్నకుండల ధారిణే నమః – కర్ణౌ పూజయామి
ఓం సునాసాయ నమః – కంఠం పూజయామి
ఓం సువదనాయ నమః – వదనం పూజయామి
ఓం పుండరీకాక్షాయ నమః – నేత్రే పూజయామి
ఓం శ్రీ బృహస్పతయే నమః – శిరః పూజయామి
ఓం సర్వాభీష్ట ప్రదాయ నమః – సర్వాణ్యంగాని పూజయామి

అథ బృహస్పత్యష్టోత్తర శతనామ పూజా

ఓం శ్రీ గురవే నమః
ఓం గుణవరాయ నమః
ఓం గోప్త్రే నమః
ఓం గోచరాయ నమః
ఓం గోపతిప్రియాయ నమః
ఓం గుణినే నమః
ఓం గుణవతాంశ్రేష్ఠాయ నమః
ఓం గురూణాం గురవే నమః
ఓం అవ్యయా నమః
ఓం జేత్రే నమః
ఓం జయంతాయ నమః
ఓం జయదాయ నమః
ఓం జీవాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం జయావహాయ నమః
ఓం అంగీరసాయ నమః
ఓం అధ్వరాసక్తాయ నమః
ఓం వివిక్తాయ నమః
ఓం అధకవరకృతే నమః
ఓం పరస్మై నమః
ఓం వాచస్పతయే నమః

ఓం వశినే నమః
ఓం వరిష్ఠాయ నమః
ఓం వాగ్విచక్షణాయ నమః
ఓం చిత్తశుద్ధికరాయ నమః
ఓం శ్రీమతే నమః
ఓం చైత్రాయ నమః
ఓం చిత్రశిఖండిజాయ నమః
ఓం బీహద్భానవే నమః
ఓం బృహస్పతయే నమః
ఓం అభీష్టదాయ నమః
ఓం సురాచార్యాయ నమః
ఓం సురారాధ్యాయ నమః
ఓం సురకార్యహితంకరాయ నమః
ఓం గీర్వాణ నమః
ఓం ధన్యాయ నమః
ఓం గీష్పతయే నమః
ఓం గిరిశాయ నమః
ఓం అనఘాయ నమః
ఓం ధీవరాయ నమః
ఓం ధిషణాయ నమః
ఓం దివ్యభూషణాయ నమః
ఓం దేవపూజితాయ నమః
ఓం ధనుర్ధరాయ నమః
ఓం దైత్యహంత్రే నమః
ఓం దయాసారాయ నమః
ఓం దారిద్ర్య నాశకాయ నమః
ఓం ధన్యాయ నమః
ఓం దక్షిణాయన సంభవాయ నమః
ఓం ధనుర్మీనాధిపాయ నమః
ఓం దేవాయ నమః
ఓం ధనుర్భాణధరాయ నమః
ఓం హరయే నమః
ఓం అంగీరసకులోద్భవాయ నమః
ఓం సింధుదేశాధిపాయ నమః
ఓం ధీమతే నమః
ఓం స్వర్ణవరాణాయ నమః
ఓం చతుర్భుజాయః నమః
ఓం హేమాంగదాయ నమః
ఓం హేమవపుషే నమః
ఓం హేమభూషణ భూషితాయ నమః
ఓం పుష్యనాథాయ నమః
ఓం పుష్యరాగ మణిమండన మండితాయ
ఓం కాశపుష్పసమానాభాయ నమః
ఓం కలిదోషనివారకాయ నమః
ఓం ఇంద్రాధిదేవాయ నమః
ఓం దేవేశాయ నమః
ఓం దేవతాభీష్టదాయకాయ నమః
ఓం అసమానబలాయ నమః
ఓం సత్వగుణసంపద్విభాసురాయ నమః
ఓం భూసురాభీష్టదాయ నమః
ఓం భూరియశసే నమః
ఓం పుణ్యవివర్ధనాయ నమః
ఓం ధర్మరూపాయ నమః
ఓం ధనాధ్యక్షాయ నమః
ఓం ధనదాయ నమః
ఓం ధర్మపాలనాయ నమః
ఓం సర్వవేదార్థ తత్వజ్ఞాయ నమః
ఓం సర్వాపద్వినివరణాయ నమః
ఓం సర్వపాపప్రశమనాయ నమః
ఓం స్వమతానుగతామరాయ నమః
ఓం ఋగ్వేదపారగాయ నమః
ఓం ఋక్షరాశిమార్గ ప్రచారకాయ నమః
ఓం సదానందాయ నమః
ఓం సత్యసంకల్ప మానసాయ నమః
ఓం సర్వాగమజ్ఞాయ నమః
ఓం సర్వజ్ఞాయ నమః
ఓం సర్వవేదాంతవిదే నమః
ఓం వరాయ నమః
ఓం బ్రహ్మపుత్రాయ నమః
ఓం బ్రహ్మవిద్యావిశారదాయ నమః
ఓం సమానాధికవినిర్ముక్తాయ నమః
ఓం సర్వలోకవశంవదాయ నమః
ఓం సురాసురగంధర్వ వందితాయ నమః
ఓం సత్యభాషణాయ నమః
ఓం సురేంద్రవంద్యాయ నమః
ఓం దేవాచార్యాయ నమః
ఓం అనంతసామర్థ్యాయ నమః
ఓం వేదసిద్ధాంతవారణాయ నమః
ఓం సదానందాయ నమః
ఓం పీడాహరాయ నమః
ఓం వాచస్పతయే నమః
ఓం పీతవాససే నమః
ఓం అద్వితీయరూపాయ నమః
ఓం లంబకూర్చాయ నమః
ఓం ప్రహృష్టనేత్రాయ నమః
ఓం విప్రాణాంపతయే నమః
ఓం భార్గవశిష్యాయ నమః
ఓం విపన్నహితకారిథణే నమః
ఓం సురాణాంవిపత్తిత్రాణ హేతవే నమః
ఓం బృహస్పతయే నమః
ఓం సురాచార్యయ నమః
ఓం దయావతే నమః
ఓం శుభలక్షణాయ నమః
ఓం లోకత్రయగురవే నమః
ఓం శ్రీమతే నమః
ఓం సర్వపాయ నమః
ఓం విభవే నమః
ఓం సర్వేశాయ నమః
ఓం సర్వదాహృష్టాయ నమః
ఓం సర్వగాయ నమః
ఓం సర్వపూజితాయ నమః
ఓం అక్రోధనాయ నమః
ఓం మునిశ్రేష్ఠాయ నమః
ఓం నీతికర్త్రే నమః
ఓం జగత్పిత్రే నమః
ఓం విశ్వాత్మనే నమః
ఓం విశ్వకర్త్రే నమః
ఓం విశ్వయోనయే నమః

ఓం అయోనిజాయ నమః
ఓం భూర్భువాయ నమః
ఓం ధనదాత్రే నమః
ఓం భర్త్రే నమః
ఓం జీవాయ నమః
ఓం మహాబలాయ నమః
ఓం బృహస్పతయే నమః
ఓం కాశ్యపేయాయ నమః
ఓం దయావతే నమః
ఓం శుభలక్షణాయ నమః
ఓం అభీష్టఫలదాయ నమః
ఓం శ్రీమతే నమః
ఓం శుభగ్రహాయ నమః
ఓం బృహస్పతయే నమః
ఓం సురాచార్యాయ నమః
ఓం దేవాసురపూజితాయ నమః
ఓం ఆచార్యాయ నమః
ఓం దానవారయే నమః
ఓం సురమంత్రిణే నమః
ఓం పురోహితాయ నమః
ఓం కాలజ్ఞాయ నమః
ఓం కాలబుగ్వేత్రే నమః
ఓం చిత్తగాయ నమః
ఓం ప్రజాపతయే నమః
ఓం విష్ణవే నమః
ఓం శ్రీకృష్ణాయ నమః
ఓం సూక్ష్మాయ నమః
ఓం ప్రతిదేవోజ్వలగ్రహాయ నమః
ఓం శ్రీబృహస్పతయే నమః

పుష్కరాష్టోత్తర శతనామావళి

ధ్యానమ్ : పుష్కరాధ్యమహం వందే సర్వదేవప్రియం శుభం।
సర్వసౌఖ్యప్రదాతారం సర్వతీర్థవిభుం ప్రభమ్॥

ఓం అష్టమూర్తిప్రియాయ నమః
ఓం దివ్యాయ నమః
ఓం సర్వపాపనాశకాయ నమః
ఓం శివప్రదాయ నమః
ఓం శివేష్టాయ నమః
ఓం శివభావప్రదాయకాయ నమః
ఓం లోకానుగ్రహకారిణే నమః
ఓం సర్వతీర్థప్రశో(సా)ధకాయ నమః
ఓం దివ్యమూర్తయే నమః
ఓం అనేకాత్మనే నమః 10
ఓం శివతేజోవిరాజితాయ నమః
ఓం శివదోషాపహాయ నమః
ఓం శ్రీమతే నమః
ఓం బ్రహ్మదోష నివారకాయ నమః
ఓంత్రివిక్రమపదస్పర్శ పరిపూతనిజాకృతయే
ఓం లోకత్రయసమారాధ్యాయ నమః
ఓం బ్రహ్మవిష్ణుశివప్రియాయ నమః
ఓం పుష్కరాఖ్యాయ నమః
ఓం మహాతీర్థాయ నమః
ఓం సర్వతీర్థమహాప్రభవే నమః 20
ఓం బ్రహ్మప్రియాయ నమః
ఓం బ్రహ్మవేత్రే నమః
ఓం బ్రాహ్మీసంపత్ప్రదాయకాయ నమః
ఓం పుష్టిప్రదాయ నమః
ఓం పుష్కరాధ్యాయ నమః
ఓం విభవే నమః
ఓం సర్వనదీప్రియాయ నమః
ఓం బృహస్పతి సమారాధ్యాయ నమః
ఓం గురువృత్తిప్రవర్తకా(నాయ) నమః
ఓం మహాదేవప్రియాయ నమః 30
ఓం ధీమతే నమః
ఓం సర్వతీర్థప్రియాకృతయే నమః
ఓం సర్వదేవప్రియాయ నమః
ఓం శుద్ధాయ నమః
ఓం శుద్ధిబుద్ధిప్రదాయకాయ నమః
ఓం మూర్తిత్రయమహాబంధవే నమః
ఓం బృహస్పతిసమర్చితాయ నమః
ఓం బృహస్పతి పురోగామినే నమః
ఓం సర్వరాశిప్రచారణాయ నమః
ఓం గురు-రాశిసమాయోగ నమః
సమాక్రాంతమహానదయే 40
ఓం సార్ధత్రికోటి తీర్థేశాయ
ఓం సర్వదేవపురస్కృతాయ నమః
ఓం శివభక్తాయ నమః
ఓం విష్ణుతుల్యాయ నమః
ఓం బ్రహ్మజ్ఞానప్రదాయకాయ నమః
ఓం శివయాచాదృతాయ నమః
ఓం లక్ష్మీప్రీతిసమాశ్రయాయ నమః
ఓం వాణీప్రసాదలలితాయ నమః
ఓం సర్వదేవసమర్చితాయ నమః
ఓం సర్వదోషాపహాయ నమః 50
ఓం పుణ్యాయ నమః
ఓం సర్వపాపప్రణాశకాయ నమః
ఓం సర్వాభీష్టప్రదాయ నమః
ఓం దేవాయ నమః
ఓం ఋజుమార్గప్రవర్తకాయ నమః
ఓం దేవలోకనివాసినే నమః
ఓం కృతమందాకినీ స్థితయే నమః
ఓం పుష్కరహ్రదరూపాయ నమః
ఓం చతుర్ముఖ సమాదృతాయ నమః
ఓం మహేంద్రస్యాపాపహర్త్రే నమః 60
ఓం జలతత్త్వస్వరూపకాయ నమః
ఓం ఘృణావతే నమః
ఓం పటుశక్తయే నమః
ఓం సర్వపాపహరాయ నమః
ఓం ప్రభవే నమః

ఓం పూతాయ నమః
ఓం పవిత్రకారాయ నమః
ఓం సర్వలోకప్రియాయ నమః
ఓం అనఘాయ నమః
ఓం అమోఘాయ నమః
ఓం పావనాయ నమః
ఓం సిద్ధయే నమః
ఓం పితృదేవప్రియాయ నమః
ఓం శుభాయ నమః
ఓం సర్వదేవైరనుగతాయ నమః
ఓం సర్వజీవసమాదృతయే నమః
ఓం బ్రహ్మలోకప్రియాయ నమః
ఓం సాధవే నమః
ఓం బ్రహ్మసన్నిధి సంస్థితాయ నమః
ఓం సర్వర్షిగణ సంసేవ్యాయ నమః 80
ఓం స్నానపుణ్యప్రదాయకాయ నమః
ఓం సర్వజీవసముద్ధర్త్రే నమః
ఓం సర్వేషాం మోక్షదాయకాయ నమః
ఓం సర్వపుణ్యప్రదాత్రే నమః
ఓం సర్వేషామిష్టదాయకాయ నమః
ఓం నదీకాలుష్యసంహర్త్రే నమః
ఓం నదీపావనసన్నిధయే నమః
ఓం ఋషిసంఘైరనుగతాయ నమః
ఓం ప్రసన్నాయ
ఓం ధర్మవర్ధనాయ నమః 90
ఓం సర్వలోకప్రియకరాయ నమః
ఓం సర్వజీవశుభంకరాయ నమః
ఓం సర్వార్థప్రదాత్రే నమః
ఓం సర్వాశుభనివారకాయ నమః
ఓం నదీనాంవల్లభాయ నమః
ఓం శ్రేష్ఠాయ నమః
ఓం నదీపావనహేతవే నమః
ఓం సర్వతీర్థాభిగమ్యాయ నమః
ఓం సర్వతీర్థమనోహరాయ నమః
ఓం సర్వతీర్థమహారాజాయ నమః 100
ఓం సర్వతీర్థఫలప్రదాయ నమః
ఓం అఖండపుణ్యసంధాత్రే నమః
ఓం పుణ్యలోకప్రదాయకాయ నమః
ఓం సౌఖ్యానందప్రదాత్రే నమః
ఓం మనశ్శాంతిప్రదాఅయ నమః
ఓం కృతినే నమః
ఓం దేవానాంప్రియకృతే నమః
ఓం ప్రీతాయ నమః 108
ఓం ఋషీణాంప్రియదర్శనాయ నమః
ఓం సర్వలోకప్రియాయ నమః
ఓం శ్రీదాయ/పుష్కరాయ నమః
ఓం పుష్కలార్ధదాయ నమః

ధూపమ్

యత్పురుషం వ్యదధుః కతిధావ్య కల్పయన్ ।
ముఖంకిమస్యకైబాహూకావూరూపాదావుచ్యేతే ॥
వనస్పత్యుద్భవోదివ్యో గంధాధ్య స్సుమనోహరః ।
ఆఘ్రేయ స్సర్వదేవానాం ధూపోయం ప్రతిగృహ్యతామ్ ॥

ఓం శ్రీ గౌతమీ మహానదీ సమాగత సార్ధత్రికోటి తీర్థరాజ పుష్కర దేవతా గమనం కారణాయ సింహగత దేవగురవే నమః – ధూపమాఘ్రాపయామి.

దీపమ్

బ్రాహ్మణోస్య ముఖమాసీత్ బాహూరాజన్యః కృతః ।
ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత ॥
సాజ్యం త్రివర్తి సంయుక్తం వహ్నినాయోజితం ప్రియం ।
గృహాణ మంగళం దీపం త్రైలోక్యతిమిరాపహం ।
భక్త్యా దీపం ప్రయచ్ఛామి దేవాయ పరమాత్మనే ।
త్రాహిమాం నరకాద్ఘోరా ద్దివ్యజ్యోతిర్నమోస్తుతే ॥

ఓం శ్రీ గౌతమీ ..... దేవగురవే నమః – దీపం దర్శయామి.

నైవేద్యమ్

చంద్రమా మనసోజాతః చక్షోస్సూర్యో అజాయత ।
ముఖాదింద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత ॥
నైవేద్యం షడ్రసోపేతం నానావ్యంజన సంయుతం ।
దధ్యాజ్య భక్ష్య సంయుక్తం సంగృహాణాఘనాశన ॥

ఓం శ్రీ గౌతమీ..... దేవగురవే నమః –మహానైవేద్యమ్ సమర్పయామి.

తాంబూలమ్

నాభ్యా ఆసీ దంతరిక్షం శీర్ష్ణోద్యౌ స్సమవర్తత ।
పద్భ్యాం భూమిర్దిశ శ్శ్రోతాత్ తథా లోకాగ్ం అకల్పయన్ ॥
పూగీఫలైస్స కర్పూరైర్నాగవల్లీ దళైర్యుతం ।
ముక్తాచూర్ణేన సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥

ఓం శ్రీ గౌతమీ ..... బృహస్పతయే నమః –తాంబూలం సమర్పయామి.

నీరాజనమ్

వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసస్తు పారే ।
సర్వాణిరూపాణి విచిత్యధీరః నామాని కృత్వాభివదన్ యదాస్తే
నీరాజనం జగద్బీజం నీరజాసన వందిత ।
భక్తార్తి భంజన నాసక్త స్వీకురుష్వ మయార్పితమ్ ॥

ఓం శ్రీ గౌతమీ మహానదీ సమాగత సార్ధత్రికోటి తీర్థరాజ పుష్కర దేవతా గమన కారణాయ సింహగత దేవగురవే నమః – నీరాజనం సమర్పయామి.

మంత్రపుష్పమ్

ఓం ధాతాపురస్తాద్య ముదాజహార।

శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చ తస్రః ।

త మేవం విద్వాన్ అమృత ఇహభవతి। నాన్యః పంథా అయనాయ విద్యతే ॥ (తదుపరి యధాశక్తి)

ఓం శ్రీ గౌతమీ ..... బృహస్పతయే నమః - మంత్రపుష్పం సమర్పయామి.

పుష్పాంజలి

అంజలిం తవ దాస్యామి సర్వపుష్ప మనోహరం ।

గృఱూహాణ తారయాసహ సర్వదేవాభిపూజిత ॥

ఓం శ్రీ గౌతమీ మహానదీ సమాగత సార్థత్రికోటి తీర్థరాజ పుష్కర దేవతా గమన కారణాయ సింహగత దేవగురవే నమః - పుష్పాంజలి సమర్పయామి.

మంత్రపుష్పమ్

ఓం ధాతాపురస్తాద్య ముదాజహార।

శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చ తస్రః ।

త మేవం విద్వాన్ అమృత ఇహభవతి। నాన్యః పంథా అయనాయ విద్యతే ॥ (తదుపరి యధాశక్తి)

ఓం శ్రీ గౌతమీ ..... బృహస్పతయే నమః - మంత్రపుష్పం సమర్పయామి.

ప్రదక్షిణ నమస్కారం

నమస్తే దేవగురవే నమస్తే విబుధాధిప ।

తమోఘనాశనే తుభ్యం నమస్తే లోకవందిత ॥

ఓం శ్రీ గౌతమీ మహానదీ సమాగత సార్థత్రికోటి తీర్థరాజ పుష్కర దేవతా గమన కారణాయ సింహగత దేవగురవే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

క్షమాపణ నమస్కారమ్

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం బృహస్పతే ।

యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుతే ॥

❖ ❖ ❖

గోదావరి పుష్కర కథ

శ్రీమదనంతకోటి బ్రహ్మాండ నాయకుండగు భగవంతుని సృష్టి విశేషంబుల నెల్ల విశేషగుణాకరంబగు భరతఖండము నందలి నైమిషారణ్యము తపోవనంబుల కెల్ల తలమానికంబై అలరారుచున్నది. ఒకానొకప్పుడు విశిష్ట తపోవరిష్ఠులగు శౌనకాదిముని వరిష్ఠులెల్లరునూ ఆ యరణ్యమున సమావిష్టులై సత్రమను యజ్ఞమును నిర్వహింప సాగినారు. అమ్మహోష్టీ దర్శనలాలసుడై సూతుడను ముని - వివిధ పురాణకథాకథన చతురతా ఖని అచటికి ఏతెంచినాడు. అంత నా వనాంతరవాసులగు ఋషులెల్లరాయనను సత్కరించి ఉచితాసనమున కూర్చుండచేసి, ఆయనను పరివేష్టించినవారైరి. ఆ మునుల కోరికపై సూతుడు అనేక పురాణములను వివరించుచుండగా, శ్రోతలగు ఋషులు "ఆర్యా! పాపపంకిలమందు కూరుకొనిపోవుచున్న మానవజాతికి సత్వరవిముక్తి సంధిల్లు సూక్ష్మోపాయము చెప్పవే" అని యర్థింపగా, అందులకు ఆ మహాజ్ఞాని మందహాసము చేయుచూ, ఓ పుణ్యాత్ములారా! మేషాది ద్వాదశ రాశులయందునూ, సర్వశుభగ్రహమగు గురుడు సంచరించు ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క నదికి పుష్కరకాలముగా నిర్ణయింపబడి యున్నది. ఈ పద్ధతి ప్రకారము బృహస్పతి మేషరాశియందు చరించు సంవత్సరము గంగానదికి, వృషభరాశిని గోచరించు వర్షమున నర్మదాకల్లోలినికి, మిథునగతుడైనపుడు సరస్వతీఝరికి, కటకమందుండగా యమునా కూలంకషకు, సింహము నందున్నప్పుడు గోదావరీ నదీమతల్లికి, కన్యయందుండగా కృష్ణకు, తులయందు కావేరీనదికి, వృశ్చికమందు మసలునపుడు భీమా (తామ్రపర్ణీ) నదికి, ధశ్చారమున పుష్కరిణీ పులిందినికి, మకర మప్పుడు తుంగభద్రా సరిత్తునకు, కుంభమున తిరుగునపుడు సింధునదికి, మీనరాశిని చరించునపుడు ప్రాణహితా వాహినికి పుష్కరోత్సవములు జరుగును. ఈవిధముగా ఈ పన్నెండు నదులకును, పన్నెండు సంవత్సరముల కొకసారి పుష్కరము లేర్పడును. ఆయా పుష్కర సమయములందు ఆయా నదీస్నాన పూజాదాన ధర్మాదికముల ద్వారా మానవులు తక్షణ పాపవిముక్తు లగుటయే గాక, తర్పణాదికముల వలన తమ తమ పితృదేవతలకు సైతము ఊర్ధ్వగతిని కల్పించిన వారగుచున్నారు" అని చెప్పినాడు.

దానిపై ఋషులు "సర్వజ్ఞా! నీవు చెప్పిన పన్నెండు నదులలోనూ యే నదీ పుష్కరములు ఉత్కృష్టమైనవి?" అని అడుగగా గోదావరీ పుష్కరములే సర్వోత్కృష్టములైనవి. సమస్త నదీ పుష్కరములకన్ననూ గౌతమీ పుష్కరములే అమిత శక్తిమంతములు, అత్యంత మాహాత్మ్యవంతములునయి యొప్పుచున్నవి" అనినాడు సూతుడు. అంతట శ్రోతలగు ఋషులు "మహాభాగా! ఆ గోదావరీ కూలంకషా ప్రాభవాదికములను, పుష్కర వైభవాదులను సవిస్తరముగా

విశదీకరింపుము" అని కోరగా సూతమహర్షి యిట్లు వక్కాణింప దొడగెను.

"పుణ్యశ్రవణ కుతూహలులారా! గోదావరి గోదావరి గోదావరి యని ముమ్మారు స్మరించినంతనే సర్వపాపములనుండి విముక్తపరచు ఆ దివ్యాపగా చరిత్ర మెంత జెప్పిననూ తనివి తీరదు. అయిననూ నా యోపినయంత చెప్పెదనాలింపుడు. గంగయు గోదావరియు అభిన్నలు. ఈ రెంటి పరీవాహ ప్రాంతములు వేరేగాని నిజమునకీ రెండు యొక్కటియే. ముందుగా గంగా విషయము తెలిపెదను వినుడు.

గంగాజననము : పూర్వము దేవతలకు కంటకముగా పరిణమించిన 'బలి'యను రాక్షసరాజు మదమణంచుటకు శ్రీమహావిష్ణువు వామనునిగా అవతరించినాడు. దానదీక్షా పరతంత్రుడైన బలివద్దకు పోయి తనకొక మూడడుగుల తావునిమ్మని కోరినాడు. బలి అంగీకరించి మూడడుగుల ఎడము గొనుమని ధారపోసినాడు. వెంటనే వామనుడు త్రివిక్రముడై ఒక అడుగుతో భూమినీ, వేరొక యడుగుతో ఆకాశమును ఆక్రమించి మూడవ యడుగుగా బలి శిరమున పాదముంచి అతనిని పాతాళమునకు త్రొక్కినాడు. ఆ సందర్భమున ఊర్ధ్వలోకమందున్న బ్రహ్మ దిగువమండలములు కనరాక విష్ణుపాదము ఒక్కటే ఆకాశమున పరివ్యాప్తమై యుండుట చూచి అది తన తండ్రియగు విష్ణుపాదముగా గుర్తించినాడు. ఎనలేని భక్తి తాత్పర్యములు కలవాడై సర్వతీర్థములనూ తన కమండలువు లోనికి రప్పించి ఆ మహావారితో విష్ణుపాదమును ప్రక్షాళించినాడు. ఆ పాదోదకమును ఊర్ధ్వవాసులెల్లరును శిరముల జల్లుకొనినారు. ఓ పుణ్యాత్ములారా! ఆ పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువుయొక్క పాదోదకమే మహాగంగ. ఆకాశమంతటి పాదమును కడుగుట యనిన అదియెంత నీరో ఆలోచింపుడు! ఆ మహాజలము నాలుగు దిక్కులుగా ప్రవహించినది. అందు తూర్పుదిశగా సాగినదానిని ముక్కోటి దేవతలునూ, గరుడ, గంధర్వ, కిన్నర, యక్ష, విద్యాధరాది దేవయోనుల వారెల్లరునూ కలిసి దేవమునులతో సహా స్వీకరించినారు. ఆ పాయయే 'మందాకిని' యనుపేర దేవతా గంగగా పరిఢవిల్లుచున్నది. పశ్చిమదిశగా ప్రాకిన గంగావాహినిని పితామహుడగు బ్రహ్మ తన కమండలువున ధరించినాడు. శివ శిరస్థయైన యీ సలిలమే అఖండగంగగా పేరు పడినది. ఇది గంగా చరిత్రము. ఈ సందర్భమునందే భగీరథుని యత్నము. గంగ భూమికి వచ్చుటకూడా జరిగినవి. ఇక గోదావరీ నదీ ప్రాదుర్భావము తెలుసుకొందుము.

గోదావరీ జననము : రసరాజ్ఞియైన గంగను వలచి, శివుడామెను తలకెత్తుకొని నాడని తెలిసి శివానియైన గౌరిరోషిల్లినది. ఎట్లయిననూ గంగను తన భర్తనుండి యెడము చేయవలెనని తలచి, ఆ పనికై





ఆమె వినాయకుని నియోగించినది. విఘ్నేశ్వరుడు తగిన అదనుకొరకై ఎదురుచూడసాగినాడు.

బ్రహ్మగిరిపై గౌతముడను ఋషి కలడు. అతడు మహాతపస్వి. శివునకు అత్యంత ప్రియమైన భక్తుడు. అతని ఆశ్రమ ప్రాంతంలో కరవు కాటకములు రాగా, కంటేకాలుడు గౌతమునకు ఒక వరమునిచ్చినాడు. ఆ ప్రకారము ఆ ఋషి అతని చేతితో కాసిని విత్తనములు చల్లినచో నెట్టి బంజరు నేలయందైననూ సరే నిత్యము సద్యోజాత ధాన్యసంపత్తితో ఆశ్రితులకు, ఆగంతకులకూ అన్న సమారాధన మాచరించుచుండెడివాడు. ఇది కనిపెట్టిన వినాయకుడు అక్కడకు చేరినాడు. ఒకనాడు గౌతముడు ఒకక్షేత్రములో విత్తనములు చల్లి, జపము చేసికొనుటకు వెళ్ళినాడు. అలవాటు ప్రకారం విత్తనములు వెనువెంటనే పైరైనవి. అది గమనించిన వినాయకుడు ఒక మాయాగోవును సృష్టించి ఆ పైరు నడుమ వదిలెను. ఆ గోవు పైరును మేసివేయసాగెను. జపము ముగించుకొని చేనువద్దకు వచ్చుచున్న గౌతముడది చూసి, యెన్నడూలేని ఆ యాటంకమునకు ఆశ్చర్యపోయెను. పైరును గోవు మేసి వేసినచో అన్న సమారాధనమునకు విఘ్నము కలుగునని భావించి అచ్చట పడియున్న ఒక జీర్ణతృణమును తీసి 'హరి-హరీ' అని అదలించుచూ ఆ గోవుపైకి విసరినాడు. అంత శ్రీవిఘ్నేశ్వరుని మాయవలన గౌతముడు 'హరీ' అనినదే తడవుగా, ఆ మాయాగోవు 'హరీ అనినంతపని అయినది. మహాతపస్వియైన గౌతముని ముఖతః వెలువడిన 'హరి' నామముచే అభిమంత్రితమైన గడ్డిపరక ఆగ్నేయాస్త్రముపలె పనిచేయగా, అంతర్దహనోద్వేగితయై ఆ యావు అనూహ్యమైన వేదనపడుచూ, అరచుచూ, ఆ ప్రాంతమంతయూ, కలగాపులగముగా తిరిగి అటునుండి తూర్పునకు సాగిపోయినది. ఆ విధముగా పశువు వేదనతో పొర్లాటపడిన స్థలమే కాలక్రమమున 'పశివేద' అను గ్రామముగా పరిణమించినదని చెప్పబడుచున్నది.

ఆవు చేసిన ఆర్తనాదములకు, పరిసరముల మునిగణము లన్నియూ బయటకు వచ్చినవి. ఆవు వెంట పడినవి. కొంత దూరమేగి, నేలను పడి ఆ ఆవు కాళ్ళు చాపివైచినది. కండ్లు తేలవేసినది. ఇంకేమున్నది? ఆచారపరులకు ఆవు చావు అత్యఘాయిత్యమే కదా? అందునా అది మహాముని విసరిన గడ్డిపరక దెబ్బకు మరణించినదాయె! అందువలన ఆ పరిసర బ్రాహ్మణులెల్లరును చేరి, గోహత్య చేసినవానితో తాముకూడి యుండమనినారు. గౌతముని తమనుండి వెలివేసినారు. అంత గౌతముడు తగిన ప్రాయశ్చిత్తము తెలిపినచో చేసికొందునని ప్రార్థించగా, సాటి విప్రులు దయదలచి, "గౌతమా! నీచే కొట్టబడి మరణించిన యీ గో కళేబరము మీదుగా శివ శిరస్థయైన గంగను ప్రవహింప చేసినచో నీ గోహత్యాపాతకము తొలగిపోవుననిరి.

గౌతముడు శివునికై తీవ్రముగా తపించినాడు. తరలి వచ్చినాడు. తరుణేందు శేఖరుడు గంగ నీయుమనినాడు గౌతముడు. భగవంతునకు భక్తులకంటెను ప్రియులెవరును యుండరు గదా! అందుచే శివుడు ఆతని కోర్కెను అంగీకరించినాడు. నిత్యగంగాంభఃస్నాతార్ద్రములైన తన జటలలో నుండి యొకటి పెరకి పిండినాడు. అచట గంగ ధరాపాతమైనది. భగీరథుని వెంట నంటిన గంగ భాగీరథియైనట్లుగా, గౌతమునికై వెలువరించబడిన గంగ 'గౌతమి' యనుపేరు నదియైనది. ఆ నదీమతల్లియొక్క కోరిక ననుసరించి ఆమె గోముఖాకృతినుండి బాహ్యమునకు ప్రకటింపబడునట్లుగా వరమిచ్చినాడు హరుడు. తన వలపుల రాణియగు ఆమె వాంఛమేరకు గౌతమీ జన్మస్థానమగు 'నాసిక్' ప్రాంతమున అతిలోక సుందరుడైన త్ర్యంబకేశ్వరునిగా అవతరించినాడు.



ఓ పుణ్యాత్ములారా! ఆవిధంబుగా శివదత్త పావనోదారవా వూరము తనను వెన్నంటిరాగా గౌతముడు తోయములను గోవుయొక్క మృతకళేబరము మీదుగా ప్రవహింప చేసినాడు. గోవునకు సద్గతి కలిగినది. బ్రాహ్మణులు గౌతముని మెచ్చుకొని, తిరిగి కులమున చేర్చుకొనినారు. గోకళేబరము నావరించి ప్రవహించుటచే గౌతమీనదికి గోదావరియను వ్యవహార నామమేర్పడినది. జన్మస్థలమగు 'నాసిక్' మొదలు సముద్ర సంగమము వరకు దాదాపు వేయిమైళ్ళు పొడవునా ప్రవహించు యీ నదీమతల్లియొక్క యే ప్రాంతమునందు మునుకలిడిననూ పుణ్యమే యగునవి శివవరము. మరియు ఎవరైనను గోదావరీ స్నాన సంకల్పమాత్రులై వెడలుచూ, మార్గమధ్యమున మృతులైననూ కూడా, గౌతమీ స్నాన సంకల్ప పుణ్యబలముచే వారు మోక్షార్హులే యగుదురని పెద్దలు నొక్కి వక్కాణించుచున్నారు. ఇది గోదావరీ ప్రభావము.

పుష్కరోత్పత్తి : "హే మహామునీ! గోదావరియొక్క అద్భుత చరిత్రను వినిపించి మమ్ములను ఆనందపరవశులను చేశావు. అదేవిధంగా పుష్కరమనగా యేమిటో ఇది పండ్రెండేండ్లకు ఒక్కసారే వచ్చుటలోని అంతరార్థమేమిటో ఆ వివరములు కూడా వినిపింపవే!" అని ఋషులు కోరగా సూతుడిట్లు తెలియజేయ సాగినాడు.

"సాధారణ కశ్మలజలాలను ఇండుపగింజ యెలా శుద్ధి చేస్తుందో అదేవిధంగా అనేకానేక జీవుల పాపపంకిలాన్ని తమయందు ఇముడ్చుకొనే మహానదులు పునఃచైతన్య సముత్తేజితాలు కావడమే పుష్కరం అనిపించుకుంటూ ఉన్నది.

"జీవులందరూ తమ పాపాలను నదులలో వదిలినట్లయితే అట్టి పాపములతో నిండిన యీ నదులెట్లు పునీతములగునా!" యనే తర్కమానసుడైన పుష్కరుడనే బ్రాహ్మణుడు, శివునికై తపించి





ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలత్వ సిద్ధికై ప్రాధేయపడినాడు. భక్తుని ముగ్ధావేదనను అర్థము చేసుకొనిన పశుపతి అతని కభయమిచ్చి భక్తునకు పుష్కర స్ఫూర్తిగా పరిణమించాడు. అది తెలిసిన బ్రహ్మ, శివుని ప్రార్థించి, పుష్కరతత్వాన్ని తన కమండలు జలంలో భద్రపరచుకోగలిగాడు.

పుష్కర మహిమ : ఇదిట్లుండగా గౌతముని యిల్లాలైన అహల్యపై కామవాంఛాతప్తుడైన దేవేంద్రుడు తన కోరిక తీర్చుకొనుటకు అనేక మార్గముల నన్వేషించినాడు. తుదకొకనాడు తన మాయచే గౌతముని అకాలమున స్నానార్థమై నదికేగునట్లు చేసి, తాను ఆ ముని రూపమును పొంది అహల్య ననుభవింపనుంకించెను. స్నానార్థమై యేగిన గౌతముడు మార్గమధ్యమునందే అది రాక్షసముహూర్తముగా గ్రహించి యావేళ స్నానవేళ కాకుండుటచే వెనుదిరిగి ఆశ్రమము చేరి తన వేషమునన్న యింద్రునీ, అతని పొందునందున్న అహల్యనూగని ఆగ్రహించి, "ఓ అహల్యా! చైతన్యవంతమైన ప్రాణివైయుండియూ, కామమదముచే మారువేషమునన్న పరాయివానితో మదన క్రీడకుంకించిన నీవికనుండి జడస్థితి నొందెదవుగాక!" అని భార్యనూ, "ఓరోరీ సురపతీ! దివ్యుడవయ్యునూ యోచనావిచక్షణతను కోల్పోయి ఏ యోనిపట్ల తమకముతో యింతటి తప్పు చేయుటకు తలపడితివో నీ నిలువెల్లనూ ఆ యోనులమయమై పోవునుగాక" అని ఇంద్రునీ శపించినాడు. అహల్య రాయియైపోయినది. ఇంద్రుని ఒడలెల్ల యోని సంజ్ఞలైనవి. ముల్లోకముల నేలు మొనగాడు ఆభీషణ శాపము భరించలేక గురువగు బృహస్పతి నాశ్రయించినాడు. దేవగురువా! విరూపియగు మఘవుని వెంటనిడుకొని బ్రహ్మకడకేగి ప్రార్థించినాడు. బ్రహ్మ, ఇంద్రుని దేవగంగయైన మందాకినిలో జలకమాడు మనినాడు. అయిననూ అతని విరూపత నశింపలేదు. అంత బ్రహ్మ మందాకిని



వద్ద నొక్క సరసు నిర్మింపచేసి అందులో తన కమండలువు నందలి పుష్కర జలమును కొంత ప్రోక్షించినాడు. మహేంద్రుడందు స్నానము చేయగా అమిత వికృతమగు రూపము పోయి యథాపూర్వసుందరుడైనాడు. ఆకాశగంగ కన్ననూ అత్యంత ప్రభావ సమన్వితమైన పుష్కర మాహాత్మ్యమునకు దేవేంద్రుడునూ బృహస్పతియూ కూడా అబ్బురపడినాడు.

నదులకు పుష్కరములేర్పడుట : అతిలోక విద్దూరమైన పుష్కర మాహాత్మ్యమానోట ఆ నోట జగమంతటా ప్రాకసాగినది. ఆకాశగంగ కన్ననూ అమలమైన ఆ పుష్కర సమ్మేళనముకై నదులన్నియు ఉవ్విళ్లూరుసాగినవి. గంగా గౌతమీ నదులను ముందిడుకొని సర్వమహానదులు ప్రష్టను ప్రార్థించినవి. అదేవేళ పుష్కరమహిమను కనులారా తిలకించి యున్న శుభగ్రహమగు గురుడు తనకు పుష్కరత్వమాపాదింపమని ప్రార్థించినాడు. కాని, పుష్కరుడందులకు అంగీకరించలేదు. అయిననూ, నదులయొక్కయు, గురుని యొక్కయు ప్రార్థనపై బ్రహ్మ పలుమారు పుష్కరుని సంతుష్టునొనరించి ఎట్టకేలకు జీవ, జీవనముల వాంఛను తీర్చినాడు. ఆ మేరకు గురుడు ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క సంవత్సరముండును. గావున గురుపుష్టికై ఆయా రాశులలో చేరిన తొలి పండ్రెండు దినములునూ, రాశినివిడచు తుది పండ్రెండు దినములును బ్రహ్మచే నిర్ణయింపబడిన నదులకు పుష్కరముగా నిర్ణయించినాడు. రాశికొక సంవత్సరము చొప్పున గురుడు పన్నెండు రాశులనూ సంచరించుటకు పన్నెండు సంవత్సరములగును. కావున ఒక్కొక్క నదికీ పన్నెండు సంవత్సరములకు ఒక్కమారే పుష్కర పుణ్యకాలము సంక్రమించుచున్నది. వానిలో, గురుడు సింహరాశి గతుడైన వత్సరమున మన గోదావరీనదికి పుష్కరోత్సవము.

అట్లు గురుడు సింహరాశిని ప్రవేశించగానే, మూడుకోట్ల యేబది లక్షల తీర్థసమేతుడై పుష్కరుడు గోదావరి నాశ్రయించును. అది మొదలు సంవత్సరాంతము వరకు తీర్థములన్నియూ, గోదావరి యందే యుండును. పుష్కరుడు, తొలి పండ్రెండు దినములును, సంవత్సరము చివరనొక పండ్రెండు దినములును గోదావరియందుండును. కావున మొదటి పండ్రెండు దినములను ఆది పుష్కరములనియు, చివరి పండ్రెండు రోజులను అంత్య పుష్కరములనియు పిలచెదరు. ఈ అంత్యపుష్కరోత్సవము అన్ని నదులకూ జరుగదు. ఒక్క గోదావరికి మాత్రమే సంభవించుట యీ నది ప్రత్యేకత. కావున, సాధారణ కాల గౌతమీస్నానమే సర్వార్థసిద్ధికరము కాగా, యీ పుష్కరకాలములో గౌతమీస్నానమూ,


ఆ తీరమున సాగించు జపహోమదాన ధర్మ తర్పణాదిక కర్మతంతులన్నియు సహస్రాధిక ఫలము ననుగ్రహించును. అందుచేతనే మహామహులగు ఋషులనేకులు గోదావరి గురించి–

"పంచానామపి భూతానాం ఆపః శ్రేష్ఠత్వమాగతాః
తాసుబ్భాగీరథీ జ్యేష్ఠా తస్యా జ్యేష్ఠా తు గౌతమీ ।
ఆద్యాతు గౌతమీ గంగా పశ్చాద్భాగీరథీస్మృతా
తయోరేకతరాసేవ్యా గౌతమీ తత్ర పావనీ ॥ అని ఉటంకించి నారు.

మహామనస్వులారా! ఇంకొక్క విషయము సోదాహరణముగా వివరించెదను. ఈ గోదావరి గంగానదిని సైతము పవిత్రవంతము చేయగల దివ్యజలమని మరచిపోరాదు. అందువలననే కాశీకి పోయినవారు గంగోదకమును తెచ్చి గోదావరిలో కలుపుటయను ఆచారము కలదు. ఇట్లు కలుపుటచే గంగ పాపవిముక్త యగునని దైవజ్ఞ నిర్ణయము అందువలన, గంగనే పావనము చేయగల శక్తి గోదావరికి యున్నదని తెలుసుకొనవలెను. ఒక్కముక్కలో చెప్పవలెనన్నచో గోదావరికన్న గొప్పనదియూ, గోదావరీ పుష్కరములకన్న పుణ్యకాలమును సృష్టిలోనే లేవు" అని సూతుడు చెప్పగా విని ఋషులు ఆనందించిరి.

సంకలనం : **'బ్రహ్మర్షి' మొకిరాల ప్రభాకరశర్మ**
స్మార్త, వేద పండితులు

❖ ❖ ❖



జల ప్రశస్తి

క్రీ.శ. 1369 – భాస్కర భవదూర మహీపతి (బుక్కరాయని కుమారుడు) పోరుమామిళ్ళ చెఱువు నిర్మాణం చేయించి నప్పుడు వేయించిన శాసనములోని శ్లోకాలు. కవి లింగయమాచనార్య.

ఆపోవా ఇదగ్ం సర్వమిత్యామ్నాయ ప్రమాణతః ।
జలాదేవాన్న సంభూతః అన్నం బ్రహ్మేతి చ శ్రుతిః ॥

అంతా నీరే అనడానికి వేదాలే సాక్ష్యం. నీటినుంచి అన్నం సృష్టింపబడుతుంది. అన్నం పరబ్రహ్మము అని వేదాలు చెబుతున్నాయి.

చరాచర జగద్బీజం జలమేవ న సంశయః ।
కింపునర్బహునోక్తేన జలాధిక్యం వదామ్యహమ్ ॥

చరాచర జగత్తునకు హేతువు నీరే అనడంలో సందేహంలేదు. పలు మాటలు ఎందుకు? నేను నీటి గొప్పతనాన్ని చెబుతాను.

గంగాధరో హరస్సోపి విష్ణురంభోధి మందిరః ।
బ్రహ్మాజలజ సంభూతః తస్మాత్ సర్వాధికం జలం ॥

ఈశ్వరుడు గంగను స్వతః దర్శించాడు. విష్ణువు సాగరంలోనే ఇంటిని చేసుకున్నాడు. నీటిలో పుట్టిన కమలంలో బ్రహ్మదేవుడు జన్మించాడు. అందువలన నీరు అన్నిటికంటే గొప్పది.

ప్రపా కూపశ్చ వాపీ చ కుల్యా పద్మాకరస్తథా ।
ఉత్తరోత్తరతః తేషాం కోటి కోట్యధికం ఫలం ॥

చలివేంద్రం, చేదే బావి, దిగుడు బావి, కాలువ, చెరువు– వీటిలో క్రమంగా ఒకదాని నిర్మాణం కంటే మరొకదాని నిర్మాణం కోటిరెట్లు అధిక ఫలాన్నిస్తుంది.

చరాచర జగద్రక్షా యత్తటాకాంబునా భువి ।
తస్య పుణ్యఫలం వక్తుమశక్తః కమలాసనః ॥

చరాచర లోకాన్ని రక్షించేది చెరువు నీరే కాబట్టి అటువంటి తటాక నిర్మాణం వల్ల లభించే పుణ్యఫలాన్ని కమలాసనుడు కూడ వర్ణించలేడు.

జల ప్రాధాన్యత - స్నాన ఆవశ్యకత

పుష్కర శోభ

"పంచానామపి భూతానామ్ ఆపః శ్రేష్ఠత్వ మాగతాః"

జీవుడు పాంచభౌతిక దేవుడు. పృథ్వ్యాదీ పంచభూతములలో ఆపః అనగా జలం శ్రేష్ఠమైనది.

మిక్కిలి అవసరమైనదియును.

ముందుగా పృథివ్యాది పంచభూతములకు నమస్కారం అని చెప్పవలెను.

జల ప్రాధాన్యత గూర్చి తెలుసుకుందాము చిత్తమునకు స్థానము జలతత్త్వము. శరీర పారిశుధ్యమునకై బాహ్యశుద్ధికై స్నానమవసరమెట్లో, బాహ్య శరీర శుద్ధికై ఆ జలమును హస్తమునకున్న ఐదు వ్రేళ్ళతో **"ఆపోహిష్ఠా .....ఆపో జనయథాచనః"** - అను మంత్రముతో జలమును ప్రోక్షించుకొందుము.

మంత్రార్థం: జల దేవతా! నీవే మాకు సుఖమునిచ్చుదానవు. నీ రసాస్వాదనకు యోగ్యతనిమ్ము. నీ మహిమ, గొప్పతనం తెలుసుకొనుటకు, చూడగలుగుటకు నీకు ఏ మంచి గలిగించు గొప్ప రస శక్తిగలదో అనగా నీలో యుండే అంతర్గతంగా నున్న నిజమైన రసాన్ని, శక్తివంతమైన గుణాలను మేము మాతృ స్వరూపముగా మమ్ము పుట్టించువారుగా, ఆచరణీయముగా, అనుభవనీయముగా నొనర్చుము.

ఇక అంతశ్శుద్ధిగా శరీరములోకి జలము వెళ్ళు ఆచారణగా ఆచమనం అనేది, మనం తెలిసి, తెలియక చేసిన సర్వపాపాల క్రియలన్నింటిని ఈ జ్ఞానామృతజ్యోతి రూపమైన జలమును భావముతో ఆ జలమును కించిత్ (పెసర గింజ ప్రమాణంగా) మొదట స్వాహాకారంగా, "కేశవాయస్వాహా, నారాయణయ స్వాహా, మాధవాయస్వాహా" - అని శ్రీమన్నారయణుని ముమ్మార్లు నామస్మరణతో జలపానము చేసి తుదిగా హస్తమును ఆ జలంతో శుద్ధిగావించడమగును.

కొందరు ముందుగానే ఆ జలపాత్రపై దక్షిణ హస్తమును (అరచేయిని) ఉంచి జల పరిశుభ్రత నొనర్చు



"ఆపఃపునంతుపృథివీం....." అను మంత్రమును ఉచ్చరించిన ఆపాత్ర జలమును పరిశుద్ధియగునని భావన. 'ఆపః' అను పదమునకర్థం కేవలం నీరే కాదు. శక్తికారకంగా ద్రవము సూర్య శక్తితో కూడినదైనదిగా భావించి గ్రహించాలి.

సంధ్యావందనములోను ప్రాతః కాలమందు ఆ సూర్య దేవతను స్మరించునట్లుగా "సూర్యశ్చ ..... స్వాహా!" అను మంత్రముతో ఆ పాత్రలోని జలమును ఒక పర్యాయముగా పానీయంగైకొనుటగును. అటులే మధ్యాహ్నక్రియగా "ఆపః పునంతు..... స్వాహా" సాయంవేళలో "అగ్నిశ్చమామన్యుశ్చ.....స్వాహా"తో జలపానము పొందుటగును. ఇదొక జల ప్రార్థనగా నెంచవలెను.

తదుపరి కేశవ నామాల పూర్తితో "దధిక్రావిణ్ణో....." అను మంత్రము తదుపరి మరల జల ప్రోక్షణ మంత్రముతో మరికొంత దేహశుద్ధి జరుపబడును.

మంత్రార్థం: ఓ జలదేవతా! మాకు నీయందున్న విశేష రసశక్తిని తెలుసుకొని, అనుభవించునట్లు మాతృ స్వరూపముగా మమ్మనుగ్రహింతువుగాక! యని, ఏది స్వర్ణకాంతితో తేజోమయమైన శక్తి కలిగి కశ్యపుడు, ఇంద్రుడు ఎందుండి ఉద్భవించిరో, ఏది అగ్నిగర్భం వల్ల అనేక రూపాలు

పొందినదో ఆ జలం మాకును సుఖ శాంతులనిచ్చి అనుగ్రహించుగాక!

మరియు ఎవరివల్ల వరుణ (గ్రహ) రాజు వచ్చెనో, సత్యా సత్యములను చూచుటకు, మంచి ఆహారమును దేనివల్ల పిండబడి పక్వమవుతున్నదో అట్టి జలం మాకు సుఖశాంతులనిచ్చి అనుగ్రహించుగాక!

మరియు ఏ దివి యందు దేవతలుగాను, అంతరిక్షమందు అనేక విధాలుగాను మార్పు చెందుతుందో, ఏది పృథివికి పుష్టిని, శక్తిని యిస్తుందో అట్టి జలం మాకు సుఖశాంతుల నిచ్చుగాక!

మరియు జలమా! మమ్ము శాంతి దృక్పథంతో చూడుము. నీ తనువుతో మమ్ము స్పృశించుము. నీలో యుండే అగ్ని తేజస్సును. కాంతిని, జలమును, వీర్యమును, వర్చస్సును మాయందుంచుము.

సూచన:- 'ఆపః' అనే, 'దధిక్రావిణ్ణో' అనే దేవతచేత ఆ జలం మనకు చక్కటి బలవర్ధకమైన ఆహారంగాను, సర్వ కోరిక లీడేర్చు దేవతా శక్తిగాను చెప్పబడినది. అనగా జల (ద్రవ) శక్తికంతకును రాజైన వరుణుని ప్రేరేపణవల్ల మన విచక్షణా జ్ఞానం వికసిస్తుంది. కనుక ఇట్టి శక్తులు కలిగిన జలం మామూలు నీరుగా (ద్రవంగా) తలంచడం హాస్యాస్పదం.

ఇప్పటి విజ్ఞాన శాస్త్ర (సైన్సు) రీత్యా ఆలోచిస్తే, ఈ విశ్వంలో నున్న గోళాలు, నక్షత్రాలు మొదలైనవన్నీ విశ్వం పుట్టుక పూర్వం యుండినవే. అవి ధన, ఋణ, విద్యుదయస్కాంత తేజోమయమైన శక్తులన్నీ మేళవింపబడి, పరస్పరం ఘర్షణలతో శక్తి జృంభితమై, సౌమ్యత్వ కలిగి ఏకత్వంపొంది శక్తి రహితంగా యుండే (నేచురల్ సెమి లిక్విడ్)గా ఒక ద్రవం (జల) రూపకంగా, అందులోనేదో అపురూపమైన పరిణామంతో అన్నివైపులకు విసరివేయబడు ఈ గోళాలు, శక్తులు, భూతాలు, అణువులు, తేజస్సులు పుట్టాయని మన విజ్ఞాన శాస్త్రజ్ఞుల వాదము.

ఈ పై వివరణ అంతా మనం చెప్పుకున్న జల లక్షణాలే. అనగా విజ్ఞాన శాస్త్రం కూడ ఈ జలాన్ని గూర్చి సమర్థించడమే గాకుండా, సర్వం జలంపైననే ఆధారపడి యుందని కూడా తెలుస్తుంది. ఈ విషయం ఈ 20వ శతాబ్దంలోనే విజ్ఞాన శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

అటులే ఈ జలాన్ని గూర్చి మన వేదాలలో యింత విపులంగా, నిస్సంకోచంగా అనేక యుగాల క్రిందటనే తెలియపరుచబడిన దంటే, ఈ వేదాలు ఎంత విజ్ఞానదాయకాలో తెలుసుకొంటే, మనం అంధకారంలో నుంచి బయటపడుదుము. ఇది నిక్కము.

ఈ జలాన్ని గూర్చి మన "నారాయణీయం"లోను సాధారణంగా వినే మంత్రపుష్పం.

"యోపా మాయతనంవేద। ఆయతనవాన్ భవతి।
వాయుర్వా అపామాయతనం। ఆయతనవాన్ భవతి।"

అను మంత్రము అటు అగ్నికి, పుష్పమునకు, వాయువునకు, చంద్రునకు, నక్షత్రములకు, మేఘములకును, వర్షాకాలమునకును, నీటి (జల) మూలాన్ని ఎవరు తెలుసుకొందురో అని జెప్పుటలో మంత్ర పుష్పములో---

"యోఽపాం పుష్పంవేద। ------।"
ఎవరు నీటి యొక్క పుష్పాన్ని గూర్చి తెలుసుకొంటాడో,
"చంద్రమావా అపాం పుష్పం । -------"
చంద్రుడే నీటి యొక్క పుష్పముగా తెలుసుకొంటాడో,
"అగ్నిర్వా అపామాయాతనమ్। ఆయతనవాన్ భవతి।"
యోఽగ్నేరాయతనం వేద। ఆయతనవాన్ భవతి।
ఆపోవా అగ్నేరాయతనమ్। ఆయతనవాన్ భవతి।
ఏ ఏ వేదం వేద ।"

అని ఎవరు నీటి యొక్క మూలాన్ని తెలుసుకొంటాడో, అతడు తనలో నెలకొన్నవాడవుతాడు. అగ్నే నీటికి ఆధారంగా, నీరే అగ్నికి ఆధారంగా ఉంటుందని తెసుకొంటాడో అతడు తనలో తాను నెలకొన్నవాడవుతాడు అని అర్థం.

"వాయుర్వాఽపా మాయతనమ్। ఆపోవైరాయతనమ్।
ఆయతనవాన్ భవతి।

ఎవరు నీటి మూలాన్ని అనగా వాయువే నీటికి ఆధారమని, నీరే వాయువునకు మూలమని తెలుసుకొంటాడో....

"అసౌవా తపన్న పామాయతనమ్। ఆపోవా ఆయుష్మతపత – ఆయతనమ్ । ఆయతనవాన్ భవతి।"

ఎవరు నీటి గూర్చి తెలుసుకోవడంలో, దహించే సూర్యుడే నీటికి ఆధారమని, నీరే ఆ దహించే సూర్యుని మూలాధారమని తెలుసుకొంటాడో, అతడు తనలో నెలకొన్న వాడవుతాడు. అని అర్థం.

"చంద్రమావా అపామాయతనమ్। యశ్చంద్రమస ఆయతనంవేద।

ఆపోవై చన్ద్రమాస ఆయతనమ్। ఆయతనవాన్ భవతి"

ఎవరునీటిని గూర్చి తెలుసుకోవడంలో, చంద్రుడే నీటికి మూలాధారమని, ఇటులా నీటి మూలాన్ని తెలుసుకొంటాడో, అతడు తనలో నెలకొన్నవాడవుతాడు. అని అర్థం.

"నక్షత్రాణివా అపామాయతనమ్। యోనక్షత్రాణా మాయతనమ్ ।

ఆపోవై నక్షత్రాణం మాయతనమ్। ఆయతనవాన్ భవతి।"

నక్షత్రాలే నీటి ఆధారమని, నీరే నక్షత్రాల మూలాధారమని, ఎవరు నీటి మూలాన్ని తెలుసుకొంటాడో, అతడు తనలో నెలకొన్న వాడవుతాడు అని అర్థం.

పర్జన్యోవా అపామాయతనమ్। ఆయతనవాన్ భవతి।

యఃపర్జన్యస్యాయతనమ్ వేద। ఆయతనవాన్ భవతి।

ఆపోవైపర్జన్యస్యాఽఽతనమ్। ఆయతనవాన్ భవతి।"

మేఘమే నీటికి మూలాధారమని, నీరే మేఘం యొక్క మూలమని ఎవరు నీటి మూలాన్నిట్లు తెలుసుకొంటాడో, అతడు తనలో నెలకొన్న వాడవుతాడు అని అర్థం.

"సంవత్సరోవా అపామాయతనమ్। యస్సంవత్సర స్యాయతనమ్।

వేద। ఆపోవై సంవత్సరస్యాయతనమ్। ఆయతనవాన్ భవతి।"

సంవత్సరః వర్షాకాలము అని, వర్షాకాలమే నీటి మూలాధారంగా, నీరే వర్షాకాలపు ఆధారంగా అని తుదిలో...

"యోఽప్సునావం ప్రతిష్ఠితామ్ వేద। ప్రత్యేవతిష్ఠతి।"

అర్థం: ఎవరు నీటిలో నెలకొనియున్న నావను గూర్చి తెలుసుకొంటాడో అతడు అందులోనే నెలకొని యుంటాడని,

గోదావరి స్వగతం

మహాసహస్రావధాని, సాగరఘోష కవి

– డా॥ గరికపాటి నరసింహారావు

గోదావరి తీరమ్మిది
వేదమ్ముల పుట్టినిల్లు; విద్వాంసులకున్
వాదోపవాదములకున్
గోదామిది మ్రొక్కవలయు గుండెలనిండన్

ఇది గోదావరి నీరు, మ్రొక్కవలదే? ఈ నేలపై మైథిలీ
పదముల్ పూచెను; రామచంద్రుని కరస్పర్శన్ పవిత్రంబులీ
నదు, విందుండు కథానిధుల్; కవివరుల్ నన్నయ్య శ్రీనాథులీ
నది యంకమ్మున నూయలూగరె సుధా స్నానాను లిప్తాంగులై

నదులకు పూజసేయు ఘన నాగరకంబగు జాతిమీది, ఏ
పది పదిరెండు నేండ్లకొ అపారముగా జనసంఘముల్ నదిన్
నది మును గంగ వచ్చెనన స్నానము చేసెద రంతెగాని ఈ
నదు లభివృద్ధి సౌధపు పునాదులటంచు గ్రహింపలేరుగా!

సహజ జలప్రవాహములు సాగుచునుండ నదీమతల్లికిన్
దుహితలబోలు కాల్వయి సుదూరపు తీరములందు కాల్వలన్
బహుళఫలాలు ధాన్యములు భారము లెంచక తెచ్చియమ్ము నా
సహృదయ వర్తకమ్ములవి సాగిలపడ్డవి తెల్పిలేమి చే

ఉన్న వనరులన్ని ఉపయోగమున నున్న
చిత్తశుద్ధి పనులు చేయుచున్న
వెనుకనున్న ఘనత కునుకు తీయకయున్న
ప్రగతి కురియు హర్ష వర్షమట్లు

❖ ❖ ❖

ఇటులా నీటి యొక్క ప్రాధాన్యతను వేదములోనిట్లు చెప్పబడెను.

ఇట్లు సర్వవిశ్వానికి కారణభూతమైనది నీరేయని జెప్పుటలో ద్రవానికి ప్రతీకగాను, సులభంగా 'నీరు' అని జెప్పబడెను.

"స్విన్నస్స్నాత్వామలాదివ। పూతం పవిత్రేణ వాజ్యం।
ఆపః శుంధంతు మైనసః॥ దృపదాదివ.... మైనసః॥

చెమట పట్టినవాడు నీటితో స్నానం చేస్తే మలాది దుర్గంధములు తొలగినట్లును, ఈ పవిత్రమైన నీరు నన్ను పాప విముక్తిగా జేయుగాక! ఇక్కడ కూడ పాపవిముక్తి కన్నింటికి నీరే మూలాధారమని ప్రార్థనగా మంత్రము జెప్పబడెను.

క్రియగా, అరచేతిలోకి నీటిని గైకొని ఈ మంత్రము జెప్పుచూ అందులో శ్వాసను విడిచి, ఆ నీటిని నైఋతి దిక్కున విడిచిన, సర్వ విధాలైన మాలిన్యాన్ని వదలినట్లు, శరీరం, మనస్సులును పవిత్రత జెంది పరిశుద్ధుడౌతాడని భావం.

త్రికాల సంధ్యాకాలములలో సంధ్యావందనంలోని అర్ఘ్యప్రధాన ఘట్టం, సూర్య భగవానునకు కృతజ్ఞతాపూర్వక చిహ్నముగా జలంను ముమ్మార్లుగా ధారవోయడమగును. అట్టిధారలు సూర్యుని ప్రయాణములో అడ్డగించు మందేహులను రాక్షసులకు కంటకములై వారు తొలగి పోవుటతో మార్గము సుగమమగును. అట్టి అర్ఘ్యాలివ్వడంలో సూర్యుడే ఆధారభూతుడని ప్రార్థనగా ఇక ఆయనకు మనమేమివ్వగలమని తలంచవలెను. సూర్యుడే పృథివిలో నుండు జలమును గైకొని, తిరిగి మేఘముల ద్వారా మన కందునది జలం. ఆ జలంతోనే ముమ్మార్లు మూడు దోసిళ్ళ నీటిని నింపుకొని గాయత్రీమంత్రముతో అర్ఘ్యమివ్వడం అను తంతు ప్రార్థనగా సర్వుల సంప్రదాయం కదా।


ఆ సూర్యుడు (సవిత్రుడు) (భర్గుడు) అట్టివానికి నేను యిట్లు జలార్ఘ్యం ద్వారా ధ్యానించుటతో నామనస్సు పవిత్రతతో వికసించుగాక! అని నీళ్ళివ్వడంలో, సంధ్యాకాలం మీరితే (ఆలస్యమైతే) పరిహారంగా మరొక దోసెడు నీళ్ళతో అర్ఘ్యమిచ్చిన సూర్యుడు తృప్తిపడుతాడు.

అమ్మలాగే గోదావరి

ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు
- ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

అమ్మలాగే గోదావరి
అనేకజలచరాలకు జన్మనిచ్చి పెంచి పోషించే కన్నతల్లి
పుట్టినింట మెట్టినింట
సిరిసంపదలు పెంచే కల్పవల్లి
మానవసమూహాలకు ఆట, మాట, పాట నేర్పే ఆదిగురువు
ఆకలిగొన్న బిడ్డలకు ఆదరువు చూపే దయామయి
అలసటను, అనారోగ్యాన్ని
విసుగును, విషాదాలను దూరం చేసే కరుణామయి
లక్షలాది జనం జీవనయాన దిక్సూచి
బతుకునిచ్చి మెతుకునిచ్చి బతకనిచ్చే బతుకమ్మ
కళ్లనిండా కరుణరసం
హృదయంలో ప్రేమామృతం
ప్రవాహం పొడుగునా పరిమళించే నిత్యచైతన్యం
పుడమితల్లి కంఠంలో మణిహారం
ప్రకృతి పారవశ్యానికి సహజసుందరంగా
అందిన పారిజాతం
అలల కదలికలను కలల కల్లోలాలను
నిబ్బరంగా మోసే సహనశీలి
ఉత్థానపతనాలను, ఆటుపోట్లను, ఒడిదుడుకులను
ఓపిగ్గా భరించే స్థితప్రజ్ఞి
మానవతప్పిదాలను, స్వార్థప్రయోజనాలను
వికృత విధ్వంసాలను
మౌనంగా భరిస్తున్న అవని మేఘం
కన్నబిడ్డలే కడుపులో కార్చిచ్చును రగిలిస్తుంటే
కాలం సాక్షిగా కుమిలి కరిగిపోతున్న కొవ్వొత్తి
అవును నిజం!
అమ్మలాగే గోదావరి నిరంతర స్ఫూర్తిప్రదాత
నిర్విరామ జీవధార

❖ ❖ ❖



ఆ సూర్యుడు నీటిలోంచి పుట్టి క్రమేపి ఘనీభవించిన రూపకంగా అగుపడేదే అతడు, ఇతడిని పరబ్రహ్మ పదార్థంగా భావించాలి. అనగా జలం కూడ పరబ్రహ్మ స్వరూపంగా భావించాలి. సూర్యుడును జలరూపమే గనుక, అన్నిటికి ఆధారమైన ఆ బ్రహ్మనుండియే (ద్రవమునుండియే) వచ్చాడని సమ్మతించాలి. ఇది గొప్ప నిజమే. దీనినిట్లు తెలిసికోవడమే పరబ్రహ్మ స్వరూపమును తెలుకోవడమగును. అనగా ఆదిత్యుడు, జలమును పరబ్రహ్మమయం. అని భావించి కొంత జలాన్ని తన చుట్టూ, తనపై ప్రోక్షించుకోవాలి.

అటులా త్రిసంధ్యలలో సూర్యుణ్ణి వరుసగా గాయత్రిగా, సావిత్రిగా, సరస్వతిగా రూపాలలో భావిస్తూ అర్ఘ్యములివ్వడంలో, సూర్యునితోపాటు ఆ త్రిశక్తుల అనుగ్రహ పాత్రులగుదురు. ఇదియును ప్రార్థన రూపక జలదానమగును.

తుదిలోను మరికొంత జలంతో "యస్స్యస్మృత్యాచ.....", లేక "కాయేనవాచ.... నారాయణేతి సమర్పయామి". అను మంత్రజలదానంతో సర్వమునకు ఆధారమైన "అప్" (నీటి) స్వరూపుడగు ఆ నారాయణునకు త్రికరణ శుద్ధిగా, నే నొనర్చిన ఈ సంధ్యాప్రార్థన తంతు సర్వమును జెందుగాక) యని ప్రార్థనాపూర్వక సంధ్యాదేవతలకు, మన ఋషులకు, కామ,కామకృతులకు, పృథివ్యాది పంచభూతాలకును నమస్కారములు అర్పించబడును.

ఇచట "నారాయణ" అను సంబోధించుటలో 'నారాః అయనం యస్య సః నారాయణః' నరుల సమూహమే 'నారాలు' అనబడును.

"ఆయనం" అనుపదము వ్యాపించే వస్తువుగా తెలుపబడును.

"ఈయతే ఇతి అయనం" "ఇణ్-గతౌ" - అనుధాతువుతో నరుడనే భగవానుని వల్ల కల్గినందున ఉదకాలు "నారములు'గా, ఆ నారములందుండడంతో 'నారాయణుడ'ని అని అర్థం.

శ్లో॥ నరాత్ జాతాని తత్వాని నారాణీతి తతో విదుః ।
తాన్యేవ చాయనం తస్యాతేన నారాయణః స్మృతః॥
(వి.పురా.: 1-4-6)

సర్వసృష్టి, సమస్తలోకాలును ఈ జలమునందే ప్రతిష్ఠితమై యున్నవి. ఈ జగత్తంతా నీటిలోని నాలలాగా తేలియాడు చున్నదే, అని సృష్టి రహస్యము "ఆపోనారా ఇవప్రోక్తా" అను శ్రుతి వాక్యానుసారము శివతత్వములోని అష్టమూర్తులలో 'భవుడ'ను నామమొకటి. ఈతని స్థానమును జలమే అనగా భవుని దేహము జలరూపమే.

"ఆపోవా ఇదగ్ం సర్వం భూతాన్యాపః....." అని చెప్పుటలో ప్రారంభములో ఈ జగత్తంతా జల రూపమై యున్నదని మన భారతీయుల జీవనములో జలానికి ఇహపరతకు ప్రాధాన్యతనిచ్చినట్లు అను వేదవాక్కు వేద, శాస్త్ర, పురాణాలలో మంత్ర, శ్లోకాల రూపకంగా జలానికి ప్రాధాన్యతనిచ్చినట్లు తెలియును. అన్నిటికి ఆధారమైనది జలం. జలం పవిత్రమైనది, ప్రాణాధారమైనదిగా భగవత్స్వరూప మైనదిగా భావించబడుననుటలో జలానికి ప్రాముఖ్యత కలదని తెలియుచున్నది.

విష్ణుమూర్తి (నారాయణమూర్తి) నాభి జలతత్వానికి ప్రతీక అయితే, ఆ జలమునుండి పుట్టినదే తామర పుష్పము. అందుండి పుట్టిన బ్రహ్మ సృష్టికాద్యుడనని తలంపగా, కాదుకాదని తెలిసిన బ్రహ్మ తన తండ్రి నారాయణుడని తెలిసినవాడై, ఆ జలంతో విష్ణుని పాదాభిషేకం చేయగా, అదియే "బ్రహ్మకడిగిన పాదము"గా నిలిచెను. ఆ విష్ణు పాదమునుండి వెలువడినదే పవిత్ర గంగా జలము కదా! అందుకే ఆ గంగా జలమునకేగాక

శ్లో॥ గంగేచ యమునే కృష్ణే గోదావరి సరస్వతీ ।
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు ॥

అను శ్లోక ప్రార్థనతో ఆయా నదుల జలాన్ని కూడా స్మరించడంతో స్నానమొనర్చుటగును.

సూచన: పంచ భూతాలు పవిత్రమైనవిగా వేదము చెప్పును. వాటిలో జల ప్రాధాన్యత తెలుసుకొనుటతోబాటు ఆ జలమును నెవరైనను పాదముతో త్రోయరాదని కూడా గ్రహించవలెను.

స్నానావశ్యకత

ప్రపంచమునకెల్ల పరమ పావనమైన మన "భారతావని" అనాదిగా విజ్ఞానాన్ని కల్గియున్న కర్మభూమి, పుణ్యభూమి, యజ్ఞభూమియని నిరూపించబడియున్నది. కారణం ఇందు అనేక పుణ్య క్షేత్రాలు వెలసి పవిత్ర జీవనదులు ప్రవహించుచున్నవి. ఆస్తిక జనులు తమ ఇష్టప్రాప్తికై పూర్వము నుండి ప్రసిద్ధములైన వేద, పురాణ, ఇతిహాసాదులను ఓపికతో శ్రద్ధాభక్తులతో పఠించుచు సదాచార పరులుగా మెలగుచు స్నాన, సంధ్యావందనములాచరించువారు కొందరున్నందున ఈ భూమి పుణ్య భూమిగా వెలసియున్నది.

అట్టి ఈ అవనిలో అనూచానముగా వస్తున్న సంస్కృతిని కల్గియున్నవారు పవిత్ర నదీనదములందు, సముద్రములందు స్నానములొనర్చి, జప, ధ్యాన దాన, శ్రాద్ధాదులను ఆచరించువారున్నారు.

మానవజన్మ సార్థకతకు మన పూర్వ ఋషులు నియమించిన పవిత్ర నియమం స్నాన విధానం. స్నానమను ధర్మం పవిత్రమైనది. ఈ స్నాన విధానం నాలుగు తీరులుండును.

శ్లో॥ ఆర్జవం తూత్తమం స్నానం, నదీ స్నానంతు మధ్యమమ్ ।
అథమం వాహీకూపం పల్వలం త్వధమాధమమ్ ॥

భా: ఉత్తమం సముద్రస్నానం, మధ్యమం నదీస్నానం, వాహీకూప స్నానం అథమం, ఇక అథమాథమం పల్వలం (భాండ) స్నానం అన్నారు.

"ఆపోవాఇనగ్ం సర్వం" నీటిలో సర్వ శక్తులుండును, సముద్రస్నానంతో ఉప్పునీటి వలన శరీర భాహ్యాంతరములను శుద్ధియగును.

ఉత్తమం స్నానం ఆషాఢ, కార్తిక, మాఘ, వైశాఖ (ఆకామావై) మాస పూర్ణిమలలో సముద్రస్నానాలు చేయాలన్నారు పెద్దలు.

ఈ నాలుగు మాసాలును వ్యాస పూర్ణిమ తిథులుగా గుర్తిస్తూ, సంవత్సరంలోనొక పర్యాయమైనా ఈ నాలుగు పూర్ణిమల యందు (ఆ ఉప్పునీటి) స్నానమాచరించిన, ఆరోగ్యపరంగా వ్యాధి కారక క్రిమి సంహారిణి యగునని ఆయుర్వేద శాస్త్రం చెప్పును. సముద్ర జలస్నానము ప్రతి ఏటా ఒక పర్యాయమైన ఆచరించవలెనని, అటులే నదీ జలస్నానం మాసమునకొక పర్యాయమైన మొనర్చుట పుణ్యప్రదము, జలానికి ప్రత్యక్ష ప్రతీకలు సముద్రములు, నదులును. భారతీయ భాషగా నది స్త్రీ వాచకమైతే, సముద్రము పురుష వాచకముగా ఎంచబడినది. కారణం "నదీనాం సాగరోగతిః" అని నదుల జలమంతా తుదకు సముద్రములో కలియునని సామెతకలదు. ఆరోగ్యమును, ఇంకా పర్వ కాలమునందు నదీ స్నానము చేయుట మిక్కిలి పుణ్యఫలప్రదము. అందుకే, "నదీ జలస్నాన పుణ్యఫలదాయక నమః" అని స్తుతింపబడినది. శ్రీ ఆది శంకరాచార్యులవారు తన తల్లి కాంక్షతో నిత్యస్నానమొనర్చు నిమిత్తమై తన ఉపాసనా శక్తితో కావేరినదిని తన ఆశ్రమ సమీపమునకు రప్పింపజేసెను. నదీ స్నానం ఎప్పుడు ఎక్కడ చేసిన ముందు ఒక పిడికెడు మట్టిని ఒడ్డు నుండి గైకొని "కృత్యాః" అనే శక్తిని స్మరించి ఆ నదిలో వేయాలి. ఆపైన స్నానం చేయాలి. అలా చేయకుండా స్నానమాచరించిన ఆ పుణ్యం కృత్య అనే శక్తికే చెందుతుందని శాస్త్రవచనం.

నదీ స్నానం మిక్కిలిగా బ్రాహ్మీముహూర్తంలో చేయడం శ్రేష్ఠం, కారణం? ఆ ఉషః కాలంలో నక్షత్రాలు అస్తమించవు. కావున వాటి కాంతి నీరులో చేరియుండును. అదియునుగాక, అంగీరసుడు మున్నగు మహర్షులు భూలోకంలో చేసిన తపశ్శక్తి మొత్తాన్ని నదుల నీటిలో ధారవోసి తమలోకాలకు వెళ్ళిరి. అనగా వారు నదులలో స్నామాచరించి వెళ్ళారని కూడా భావించవచ్చును. ఆకాశంలో చంద్రుడును అస్తమించకుండా

ఉంటే ఇంకా ఉత్తమం. జలానికి అధిష్ఠాత అయిన వరుణుడును తన తపశ్శక్తిని ఈ నదీ జలమందే ధారవోసినట్లు చెప్పుదురు. చంద్రుడున్నచొ వీరి కాంతి శక్తియు ఆ జలమందు చేరి యుండును. ఈ నదులలోని నీరు అంతా లక్ష్మీ స్వరూపమే. చంద్రుని వెన్నెలయు లక్ష్మీ స్వరూపమే. అట్టి లక్ష్మీ స్వరూప నది జలంగా ఆయా నదులని గుర్తింపబడుచున్నవి. అట్టి ఉ షోదయ కాలమందు నదీ స్నానమాచరించిన వారికి లభించునని తెలియవలెను (మనోనిశ్చలతకు కారణమగును). అటు ఆయా నదుల స్నానముతో నదుల జలములోని ప్రభావము, వైశిష్ట్యము నుండుటలోగాక, పూర్వము అందులో ఎందరో మహానుభావుల, మతాధి, మతేతరాధి శక్తివంతుల ప్రభావము కూడా అందు సంక్రమించియుండును. అందులో మానవులు స్నానమొనర్చిన, వారి శక్తి ప్రభావ వైశిష్ట్యము వినూత్నమైన శక్తితో దివ్య తేజస్సుతో వెలుగొందుదురు. పరిశు ద్ధ జ్ఞానమును నిండిన (పొందిన) వారగుదురు. అటులా జీవులందరూ తమ తమ పాపాలను నదీ స్నానమాచరించుటతో నదులలో వదలిన కారణంగా జీవులు పునీతులవుతున్నారని భావన. కనుక నదీస్నానం కూడా పవిత్రమైనది.

నదీస్నానం చేయునపుడు "ఋతంచ సత్యంచ" అను మంత్రముతో ముమ్మార్లు మునిగిన అఘమర్షణ స్నానమగును. దైహికముగా, నదీజల మృత్తికా లేపనముతో స్నానం చేసిన శరీర బాహ్య మలినములును తొలగును. దాంతో పాటు దైవ ధ్యాన మన్త్రముల పఠనతో నదీ స్నానమొనర్చిన అంతశ్శరీర శుద్ధితోపాటు ఆత్మశుద్ధియు కలుగును. మిక్కిలిగా ప్రాతః కాలమందు తూర్పు దిశగా ప్రవాహ నదీజల స్నానమాచరించిన ప్రభావం గొప్పది. కారణం? ఆ నదీ జలము అనేక భూ పర్వత శ్రేణులతో ప్రవహించుచు వచ్చుచుండును. మరియు ఆ నదీ జలములందు మణ్యౌషధుల కలయికతో, అత్యున్నత జలపాతములతో ప్రవహించు కారణాన, వాటి ప్రభావము నీటియందు నిమగ్నమై యుండును. కావున అందు స్నానమాచరించిన వ్యక్తులు భౌతిక శరీరముతో పాటు అంతశ్శుద్ధి ఏర్పడి ఆధ్యాత్మిక దివ్య చైతన్యశక్తిని పొందుదురు. ఆధ్యాత్మికశక్తితో ఆత్మశక్తి, మానసిక, శారీరక శక్తి పొందడంతో జీవునకు పుణ్యఫలం ప్రాప్తమగును. పుణ్య ప్రాప్తియనగా ఆధ్యాత్మిక శక్తియని, ఆత్మ శక్తియని గ్రహించవలెను. ఆత్మ శరీరాదులను నియమించునది. కావున "ఆత్మ" శక్తివంతమైనదిగా మానసిక, శారీరక పీడనములు తొలగును.

అటులా సచేల స్నానానంతరం, ఆ ధరించిన తడి వస్త్రముల జలమును ఆ నది ఒడ్డున పిండినను అదియు జల తర్పణమగును. తదుపరి అర్ఘ్యపాద్యాదులతో, దేవ ఋషిపుంగవులకు, పితృ దేవగణములకును తర్పణాదుల నొనర్చి తుదకు యన్మయా దూషితం తోయం శారీర మల సంభవాత్। తద్దోష పరిహారార్థం యక్ష్మాణు తర్పయామ్యహమ్ ॥ అను మంత్రముతో యక్ష్మ (ఆయా శారీరక వ్యాధి నివారణకై) తర్పణమును చేయవలెను.

పుష్కర వైశిష్ట్యము

పర్వములలో పుష్కర దినములు మిక్కిలి పవిత్రములైనవిగా, శ్రేష్ఠములైనవిగా పురాణములు చెప్పుచున్నవి. ఈ పుష్కర కాలము 12 సంఖ్యతో భారతంలో కౌరవులతో పాచికలాడిన పాండవులు పరాజయం పొందిన కారణమున ఆ పుష్కర సంఖ్యయగు 12 సంవత్సరముల కాలము అరణ్యవాస మనుభవించిరని చెప్పబడెను. అనగా ఆ పుష్కర కాలము దాటితే, ఇక వారు పూర్వ ఆస్తిపాస్తులకు దూరమైనవారుగా లెక్కింపబడునట్లు భావన. అటుల ఆస్తి ఎవరి అనుభుక్తముగా వుండిన వారిదే ఆ ఆస్తియని అర్థము. పుష్కర కాలము దాటితే అనగా (దూరమైన వ్యక్తికి) పూర్వ బంధుత్వంతో సంబంధము వీడిపోయినట్లేయని చెప్పుటతో, ఆ పుష్కర కాలము ముగియకముందే ఎటులో వారితో సంబంధము కలుపుకొనుటకును అవకాశమివ్వబడెడిది. అమ్మయ్యా! నిను జూడక పుష్కర కాలమయ్యెకదా! అని కౌగిలించుకొని ఆత్మీయతను తెలుపుకొందురు. "పుష్కర" శబ్దమునకు "సరస్సు" అని ఆకాశమనియు అందురు. శ్రీ సుబ్రహ్మణ్యుని భార్యలగు వల్లీదేవి, దేవసేనలకును "పుష్కర" నామములు కలవు

(అష్టోత్తరం). పుష్కరమను నది భూమండలములోని సప్త ద్వీపాలలో నొక ద్వీపమని పేరు. అదియే పుష్కర ద్వీపము. సామాజికంగా ఈ పుష్కర కాలము నదులకును "కుంభమేళ" ప్రాధాన్యత దేశంమొత్తము పరిగణింపబడుచున్నవి.

పుష్కర రాజమని, పుష్కరిణియనునది గుజరాత్‌లో గొప్ప సరస్సు కలదు. అచటే మహేశ్వరుని అంతు తెలుసుకొను యత్నములో విఫలుడైన బ్రహ్మ, తాను అంతు తెలుసుకొన్నానని పలికిన అసత్య దోషవాక్కుతో, ఆ పరమేశ్వరుని శాపమునకు గురియై అదియే 'భూమండలములో నెచటను బ్రహ్మకు పూజలుండవని' శాపం పొందిన బ్రహ్మ ఖిన్నుడు కాగా, విష్ణుమూర్తిగారి అనుమతితో బ్రహ్మదేవుడిచట తపస్సొనర్చు చుండ అచట గొప్ప సరస్సు ఏర్పడెను. అదియే అతి పెద్ద పుణ్య, పవిత్ర పుష్కర రాజముగా వెలిసెను. అందు స్నానమొనర్చిన, దాన, శ్రాద్ధాదులొనర్చిన బహు పుణ్య ఫలప్రదులగురని ఆ స్థల పురాణ ప్రశస్తి చెప్పబడెను. అటులే అచట బ్రహ్మ దేవునకును ఆలయమేర్పడి నిత్య పూజలొనర్చు సంప్రదాయమిప్పటికి కథ సాగుచున్నది. ఈ పుష్కరిణిలో ఏ జాతి స్త్రీ, పురుషులైనా స్నానమాడిన బ్రహ్మ జ్ఞానులౌతారు. ఈ పుష్కరిణి చుట్టూ వున్న ప్రదేశము అనగా అరణ్యములోని ఔషదముల, రాతి కొండలను ప్రసిద్ధి కెక్కినవైయున్నవి. ప్రత్యేకంగా ఈ పుష్కరిణికి ధనస్సు రాశిలో బృహస్పతి ప్రవేశంతో పుష్కర ప్రారంభముతో మొదలు అంత్యమువరకును మహిమ వుంటుందని "బ్రహ్మ పురాణము" చెప్పును.

పుష్కరుడను బ్రాహ్మణుడు బ్రహ్మనుగూర్చి తనపేరిట పుష్కర నామ సరస్సుగా వెలయు కోరికగా తపస్సొనర్చగా, బ్రహ్మ అతనిని ఒక తామర (పుష్కర) పుష్పముగా మార్చెను. కొంత కాలానికి ఆ పుష్కర పుష్పమును గైకొని బ్రహ్మ దేవుడు భూలోకములో పయనించుచు అచట యజ్ఞమొనర్చ సంకల్పించి యుండగా ఒకచోట సుందరవనమును జూచి ముగ్ధుడై కొంతసేపు అచట నిలిచి తనచేతిలోని పుష్కర పుష్పమును ఆ నెలపైకి విసరివేసెను. అచట ఒక బహుధ్వనితో ప్రళయము పుట్టగా, ఆ ధ్వనికి దేవతలు చకితులై ఆ బ్రహ్మనే ఈ అకారణ ధ్వనియేమిటని ప్రశ్నించిరి. బ్రహ్మ వారి ప్రశ్నతోనిట్లు వివరించెను.

పూర్వమొక పరి వజ్రనాభుడను రాక్షసుడు తనను గూర్చి తీవ్ర తపస్సొనర్చి మెప్పించి తనకు మరణములేకుండనట్లు వరమివ్వమని కోరెను. అదెట్లు సాధ్యమని నేను పలుకగా ఆ రాక్షసుడు 'నేను పుష్పముగా మార్చబడిన తపస్వి చేతిలో తప్ప మరొకరి వలన మరణము కల్గుకుండగాక యని కోరగా నేను 'తథాఽస్తు' అని పల్కిన కారణాన యిప్పుడా పుష్ప పతనంతో తగిలి ఆ రాక్షసుడు గతించెను. వాని శిరస్సు పగిలిన కారణాన ఈ భీకర శబ్ధాన్ని మీరు విన్నారని చెప్పెను.

ఆ తామర (పుష్కర) పుష్పము పడినచోట ఒక గొప్ప జల తీర్థము పుట్టినది. అదే పుష్కరిణి నదీ తీర్థముగా ప్రసిద్ధి చెందినది. ఈ పుష్కరిణి నదీస్నానము కూడా అత్యంత పవిత్రము పుణ్య ప్రదమునిచ్చు నదిగా ప్రసిద్ధికెక్కెను.

అదియే బృహస్పతి ధనస్సు రాశిలో ప్రవేశించినప్పుడు ఆ పుష్కరిణి నదికి 12 రోజులుగా పుష్కరాలు వచ్చును. ఈ నది రాజస్థానంలోని అజ్మీర్‌కు సుమారు 12 కి.మి. దూరంలో కలదు. అదియే పుష్కర రాజమని మనం పూర్వం చెప్పుకొన్నాము.

ఇక ప్రతివత్సరమొచ్చు పుష్కరము కేవలము 12 రోజుల కాలము. పుష్కర శబ్దమునకర్థమును 12 రోజులే.

మరొక కథగా: పూర్వము "పుష్కరుడ"ను బ్రాహ్మణుడు కఠిన తపమాచరించి పరమేశ్వరుని మెప్పించి ప్రసన్నము గావించుకొని, తనకొక పవిత్ర జల రూపమును, పవిత్రసిద్ధిని అనుగ్రహించమని ప్రార్థించెను. శివుడట్లేయని అనుగ్రహించెను. అటులా ఈశ్వరుని అష్ట మూర్తులలో పుష్కరుడొకడయ్యెను. ఆ పిమ్మట పుష్కరుడు బ్రహ్మదేవుని కడకేగి ఈశ్వర దత్త ప్రసాద విషయము (అనగా పవిత్ర జల తత్త్వశక్తిని) తెలిపి, ఆ బ్రహ్మగారి కమండమున నివాస ముండునట్లు వేడుకొనెను. బ్రహ్మయు తన కమండలమున పుష్కరుడుండునట్లు అనుమతించెను.

అట్టి పంచభూతములలో 'అగ్ని, జలం, ప్రథివి'లనునవి 'త్రివృత్కరణము'లందురు. వీటిలో 'అగ్నేరాపః' అగ్ని నుండియే నీరు పుట్టినదని, పంచభూతాలలో 'అగ్ని, నీరు' ప్రకృతిలోని ప్రథమ జంటగా చెప్పబడెను. శివకేశవులకెట్లు అభేదము కలదో అట్లుగా అగ్నికి, నీటికిని అభేదం కలదు. నీటికి రోగాన్ని (కల్మషాన్ని పోగొట్ట శక్తి కలదు) అందుకే జలం, అగ్నితో కూడియున్నాయని ఎవరైనను దిగంబరంగా స్నానమొనర్చిన మహాపాతకం పొందుదురని శాస్త్రనీతి.

దేవతల గురువైన బృహస్పతి పరమ పూజ్యుడు అఖండ మేధాశక్తి కల్గినవాడు. తపస్సానర్చుటలో బ్రహ్మతో సమానుడు. నిష్ఠా గరిష్ఠుడైన బ్రాహ్మణోత్తముడు. అనేక ధర్మ శాస్త్రాలు తెలిసినవాడు. ఇతడు బంగారు దేహచ్ఛాయ కల్గినవాడు. వేద వేదాంగముల సారాంశమును దేవతలు ఈ బృహస్పతి ద్వారానే తెలుసుకొన్నారు. అందువలన బృహస్పతికి "గురువు" అని నామమేర్పడినది. దేవతలతో కలిసిమెలసి యుండువాడు. ఒకనాడు ఈ బృహస్పతి ఆ దేవలోకమును వదిలి భూలోకముననున్న కైలాసము తుల్యమైన కాశీకి చేరుకొని అచటి విశ్వేశ్వరుని దర్శించి, గంగానదీ తీరములో తపధ్యానములో నిమగ్నుడయ్యాడు. అప్పుడాతడు మరో సూర్యునివలె ప్రకాశించుచుండెను.

ఇది యుట్లుండ, కొంత కాలమునకు బృహస్పతి (గురువనుగ్రహము) బ్రహ్మనుగూర్చి తీవ్ర తపమాచరించి జలమయత్వ సిద్ధిని పొందిన పుష్కరుడు తనతో నుండునటుల వరమడిగెను. అందులకు బ్రహ్మకమండము నందున్న పుష్కరుడందుల కంగీకరించకపోగా, బ్రహ్మ వారిద్దరి పలుకులువిని, పుష్కరునితో నిట్లనెను. ఈ బృహస్పతి సంవత్సరముకొక రాశియందు ప్రవేశించియుండును. అటులా సంవత్సరములో ఏరాశియందు బ్రహస్పతి ప్రవేశించి యుండు ఆ నదికి పవిత్రముండునటుల ఆ పుష్కరుడందు జలమయత్వ సిద్ధిగా, ఆ రాశి ప్రవేశమునుండి ఆద్యన్తములుగా అనగా 12 రోజులు ఈ బృహస్పతితో నుండ తగునని పుష్కరునికనుజ్ఞ యిచ్చెను. అందుకు పుష్కరుడంగీకరించగా, బ్రహస్పతి సంతోషించి మరల బ్రహ్మదేవునినిట్లు ప్రార్థించెను. పుష్కరుడు తనతో ఆ పుష్కర (12) రోజులలో ప్రతి రోజు రెండున్నర ఘడియలు మధ్యాహ్న కాలమున నుండునటుల కోరగా ఆ పరమేశ్వరుడు పుష్కరుని అటులే సమ్మతింపజేసెను. పన్నెండు సంవత్సర కాలమొక పుష్కరం ఏర్పడును.

పుష్కరుడు ప్రవేశించిన నదికి పుష్కర నదిగా, సకల తీర్థాల మహిమలు అందు నివసించినదైన కారణాన ఆ నదులలో ముక్కోటి దేవతలు అనుదినమును ఉషోదయ కాలముననే స్నానమాచరించి వెళ్ళుదురు. కావున ఆ నదుల జలం మహా మహిమాన్వితములై ప్రవహించుచుండును.

నదుల స్నానమొనర్చుటె గొప్పదనంగా ఆపాదింపబడినది. అయితే జీవుల పాపపంకిల భరితమైన నదులు తిరిగి పునీతము పొందుటకే సంవత్సరమునకొకసారి పుష్కర ఆగమనముతో, ఆ నదియందు స్నానమొనర్చు జీవులును పునీతులగుదురు. కావున స్నానములలో ఉత్తమం పుష్కరస్నానము. ఆ పుష్కరస్నానములో బాహ్య శరీరము శక్తివంతమగును. ఈ పుష్కర స్నానము శుక్ల పక్షములో, ప్రత్యేక పూర్ణిమనాడు స్నానముచేసిన మానసిక శక్తి సమృద్ధమగును. ఇక అమావాస్యనాడు సూర్యుని నదీ క్షేత్రములలో తన ప్రభావముండును గనుక ఆనాటి స్నానము పైతృక శక్తి వృద్ధి చెందును. మానవునిలోని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక దోషములు ఆ నదీస్నానముతో అవి జలమందు సంక్రమించి ప్రవాహ భ్రమణములతో ఆత్మ శక్తి వృద్ధితో బాటు శుద్ధియగును. సంవత్సరమునకొకసారైనా వచ్చు పుష్కరస్నానమొనర్చుటతో మానవునకు సంపూర్ణ పుణ్యఫలప్రాప్తి పొందుటగును. ఆయా నదులలో పుష్కరుడు ప్రవేశించిన కారణంగా అట్టి నదుల స్నానం పుష్కరస్నానమని చెప్పబడెను. శరీర శుద్ధితో మనోబుద్ధియును ఈ పుష్కరస్నానము వలన కలుగును. మనస్సునకధికారి బుద్ధి. 'మనస్సస్తు పరా బుద్ధిః', బుద్ధికి అధిష్ఠాన దేవత బృహస్పతి. ఆ బృహస్పతి రాశి మార్పునుబట్టి ఆ రాశి నదికి పుష్కరము వచ్చునని ఆ నదిలో పుష్కరుడు నివసించియుండునని నియమమేర్పడెను. అదియే పుష్కరిణి

నదియని పుష్కరోత్సవ దినములని చెప్పబడెను. ఆది పుష్కరము ముందు వచ్చు 12 రోజుల కాలమున పవిత్ర పుష్కరస్నానమని చెప్పుదురు. ఇక అంత్య పుష్కరస్నానము తుది 12 రోజులు. ఈ అంత్య పుష్కరస్నానముతో కేవలం స్నాన పుణ్యమే లభించును. అనగా అంత్య పుష్కరస్నానము అగతి పక్షములో చేయవలసిన విధానము. అదియును వీలుగాకపోతే ఆ సంవత్సరములో వచ్చు ఆద్యంత కాలానికి మధ్యరోజులలో ఏ రోజైనా అభిజిల్లగ్నం (మధ్యాహ్నం 11 గం॥ 45 ని॥ నుండి 12 గం॥ 15 ని॥ల వరకు గల) సమయములో స్నానమొనర్చినను పుష్కరస్నానమనబడును.

బృహస్పతి మేషాది రాశులందు ప్రవేశిస్తే, ఆ రాశికి సంబంధించియున్న నదికి పుష్కర పవిత్ర కాలము ఆ నదికి పుష్కరాలొస్తాయని ప్రతీతి.

పుష్కరముల వివరణ: బృహస్పతి ఆయా రాశులందు ప్రవేశించిన నదుల పేర్లు:

1. మేషరాశి – గంగానది; 2. వృషభం – నర్మదా; 3. మిథునం – సరస్వతీనది; 4) కర్కాటకం – యమునానది; 5. సింహరాశి – గోదావరి; 6. కన్యారాశి – కృష్ణానది; 7. తులా – కావేరి; 8. వృశ్చికం – భీమరథీ; 9. ధనుస్సు – పుష్కరవాహినీ; 10. మకరం – తుంగభద్రానది; 11. కుంభం – సింధూనది; తుదిగా 12. మీనరాశి – ప్రణీతానదికి యిట్లు పుష్కరనదులు.

ఆయా నదులలో పుష్కర సమయములో సప్త ఋషులు, ముక్కోటి దేవతలు సూక్ష్మ దేహులుగా దిగివచ్చి ఆ పుష్కర నదులలో నివసించి యుందురని పురాణ ప్రశస్తి. అందుచే ఆ పుష్కర నదుల జలము పవిత్రవంతములై ప్రవహించు చుండును. అట్టి పుష్కర నదీ జలములందు వేద మంత్రాల సంకల్పములతో స్నానమాచరించి, కీర్తిస్తూ, ప్రార్థిస్తూ, పితృ దేవతలకు శ్రాద్ధ తర్పణాదులను ఆచరించిన వారికి అనేక శుభములు, వారి వంశాభివృద్ధితో బాటు, బహు పుణ్యఫలప్రదులగుదురని చెప్పబడెను.

పుష్కర కాలము బృహస్పతి మరొక రాశియందు ప్రవేశింప బోవుటకు ముందు వచ్చు 12 దినములు ఆది పుష్కర దినములని, ఆ సంవత్సరం తుది 12 దినములు అంత్య పుష్కర దినములని, రెండును పవిత్ర దినములని ప్రసిద్ధి. నీటి మహిమ 'వాయుపురాణ గ్రంథమున' వర్ణితమైయున్నట్లు.

పుష్కర మహిమ అమోఘము, సాటిలేనిదిగా జెప్పబడెను, అనగా ఆ నదీ జలములందు ఆయా పుణ్య కర్మలాచరించిన వారి పాపములు తొలగి, సత్సంతాన సౌభాగ్యములు పొంది, ఆయురారోగ్యప్రదులై, సుఖ సంతోషాలతో నుందురు.

అందుకే అన్నారు – "పుష్కర కాలము పుణ్యమొసగు కాలమని", పుష్కర దేవుని సేవించిన, ప్రార్థించినను, పుష్కర మహిమను విన్ననూ, ఆ దేవతల దీవెనలతో భక్తులు ధన్యజీవులగుదురని వినతి.

నదులలో గోదావరి దక్షిణ గంగగా వినుతికెక్కిన నదిగా చెప్పబడినది. భగీరథుని తపఃఫలంగా గంగానది యెట్లు భూమిపైకి అవతరించినదో, గౌతమ మహర్షి తపఃఫలంగా శివుని జఠాజూటమునించి పతనమై మహారాష్ట్రములోని గొప్ప శైవ క్షేత్రమైన త్ర్యంబకేశ్వర సమీపములోని నాసిక్ ప్రాంతము సహ్యాద్రి పర్వత శ్రేణిలో భాగమైన బ్రహ్మగిరిలో గోదావరి నది ఆవిర్భవించి నారసింహ క్షేత్రమైన అంతర్వేదిలో సముద్రమున కలియుటతో గోదావరి హరిహరా ద్వైతానికి సంకేతముగా ఈ నది పేర్కొనబడినది. ఈ గోదావరి మహారాష్ట్రమునుంచి తెలంగాణ రాష్ట్రమున బాసర సరస్వతీ పుణ్య క్షేత్రముతో ప్రవహించుచు భద్రాచలం దాటి ఆంధ్రప్రదేశములో పారుచున్నది.

ఈ భూలోకమునకు సప్తర్షులు, మేషాది రాశులలో క్రమముగా బృహస్పతి (గురుడు) సంచారమును బట్టి, ఈ మన్మథనామ సంవత్సరములో బృహస్పతి సింహరాశిలో సంచరించు కాలముతో "గోదావరి" నదికి పుష్కర కాలమని, ఒక సంవత్సరము బహు పుణ్య కాలమై యున్నది. ప్రత్యేకముగా గోదావరి నదికి మాత్రము సంవత్సరాంతమునను 12 రోజులు పుష్కర రాజువచ్చునదిగా అదియును పవిత్ర పుణ్యకాలమని

పురాణములు చెప్పుచున్నవి. అటులే సర్వ నదుల, సర్వ సముద్రముల స్నాన పుణ్య ఫలముతో ఒక గోదావరి నదీ స్నానము మనుష్యునకు పుణ్యఫల తుల్యముగా బుద్ధితోబాటు కొన్నివేలరేట్లు పరిశుద్ధిని ప్రసాదించి విశేష ప్రభావమును కల్గించునని పురాణవచనముగా జెప్పబడెను. గంగా జలముతో స్నానమొనర్చుట ఎంత శ్రేష్టమొ, అంతకంటే గోదావరి నదీ స్నానము మరింత శ్రేష్టతరమని, మరియు గౌతమిలో స్నానమాచరించిన తరువాతే గంగాస్నానము చేయుటనునది స్మృతులును నిర్ధేసించినవి. ఇట్టి గోదావరి నది ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రవహిస్తున్నందున తెలుగువారలకీ నది పుష్కరాలు రావడం ఎంతో అదృష్టము నోచుకున్నారని చెప్పవచ్చుననుటకు సందేహము లేదు. కావున ఇదియును సుప్రసిద్ధ నదిగా పేరొందియున్న కారణాన, ఇందు స్నానమొనర్చి, దాన ధర్మములొనర్చిన, పితరులకును శ్రాద్ధాదులొనర్చిన, వారికనేక జన్మ జన్మలయందు చేసిన ఘోర పాపములు నశించుటయేగాక, సకల అష్టైశ్వర్యములు కలిగి సుఖింతురని శ్రీమన్నారాయణుడు నారదుల వారికి వివరించెను.

ఈ గోదావరి నదికి మన్మథనామ సంవత్సరములో అధిక ఆషాడ బహుళ త్రయోదశి మంగళవారం తేది 14-07-2015 నాటి రాత్రి 10 గంటల 52 నిమిషములతో గురువు సింహరాశిలో ప్రవేశించుటతో తేది 15-07-2015 నాటి ఉదయాది సార్ధ త్రికోటి సహిత గోదావరి నది పుష్కరారంభమని 12 రోజులుగా పుష్కరోత్సవముతో నిజ ఆషాడమాసం శుద్ధ నవమి శనివారం తేది 25-07-2015 తో ముగుస్తాయి. అని పంచాంగ కర్తలు వ్రాసుకొనిరి. ఈ గోదావరి భక్తుల పాలిట వర ప్రసాదినిగా --

శ్లో॥ రేవాతీరే తపఃకుర్యాత్ మరణం జాహ్నవీతటే ।
దానం దధ్యాత్ కురుక్షేత్రే గౌతమ్యాం త్రితయమ్ వరం ॥

ఈ ప్రదేశాల మూడింటి సమాన ముక్తిప్రధం, గోదావరీ నది తీర్థజల స్నానంతో లభించునని క్షేత్రమహిమ తెలుపును. ఈ నది సముద్ర సంగమమునకు ముందు సప్త పాయలుగా విడిపోయి సప్త గోదావరిగా కీర్తి పొందినది.

పుష్కర నదీ స్నానానంతరం, "ఏవం ప్రీత్యర్థం మంత్రపూర్వక అస్యాం మహా నద్యాం సమస్తపాపక్షయార్థం సింహగతే దేవగురౌ సార్ధ త్రికోటి తీర్థసహిత, తీర్థ రాజ సమాగమాఖ్య మహాపర్వణి పుణ్యకాలే శ్రీ గోదావరీ నదీ పుష్కర ప్రయుక్త స్నానమహం కరిష్యే" పుష్కరోత్సవ కాలములో ఆయానదులలో సంకల్పముతో స్నానమొనర్చి దానాలు, పురాణ పఠానాదులు, శ్రవణాదులు, యజ్ఞాదులునొనర్చినను ముక్కోటి తీర్థాలలో స్నానముచేసిన సమాన ఫలితమొచ్చును.

"మహా సంకల్పపూర్వక శ్రీ గోదావరీ నదీ స్నానమహం కరిష్యే" అని జలములో మూడవ మునకవేసి, వీలున్న తడి వస్త్రములనో లేక పొడి వస్త్రముల ధరించి ఆయా ధ్యాన, దాన, జప, శ్రాద్ధాదులనొనర్చ వలెను. అయితే తడి వస్త్రముల నీటిని నదిలో పిండడంకూడ జలతర్పణముతో సమానమనియు చెప్పబడును. నదీ జల ప్రార్థన పూర్వక మంత్రముల పఠించవచ్చును.

వీలునుబట్టి పుష్కర నదీ రాజపూజయు జరుపవచ్చును. అదియే "పుష్కర రాజ పూజాం కరిష్యే" - అని సంకల్పముతో షోడశ పూజలుగా ఆ నదీ నామ అష్టోత్తర శతనామములతో పూజలొనర్చి. ఏతత్ఫలం సర్వ పరమేశ్వరార్పణమస్తు ॥ అని పలికి, పితృవర్గ క్రమముగా వారికి వీలున్నచో పిండప్రదానములు, లేక, తిలతర్పణాదుల సమర్పించి, వీలుగా బ్రాహ్మణునకు దశదానములును సమర్పించవచ్చును.

1. గోదానము దూడతో, శ్రేష్ఠమైన భూదానం, తిలదానం, హిరణ్యదానము, ఆజ్య (నెయ్యి) దానం, వస్త్రదానం, ధాన్యదానం, గుడదానము, రౌప్య (వెండి) దానం, తుది లవణ దాన మివ్వవలెను. వస్త్ర, దీపదానము కూడా చేయవచ్చును.

ఈ దానములు పుష్కర కాలము (12) రోజులుగాను అచటనే యుండినచే సమర్పించు ఆయాదానములొనర్చు ఆచారము కూడా యున్నది. ఆ విషయం అచటి విప్రుని అడిగి తెలుసుకొని దానాలు చేయవలెను.

అర్ఘ్యత్రయము

శ్లో॥ గోదావరి మహాదేవీ! సర్వపాప హరేశ్వరే ।
స్నాన సాద్గుణ్య సిద్ధ్యర్థం ఇదమర్ఘ్యం సమర్పయామి ॥
శ్లో॥ తీర్థ రాజమహాభాగ సర్వతీర్థ సమావృత్ ।
ఇదమర్ఘ్యం మయాదత్తం గృహాణ వరదోభవీ ॥
శ్లో॥ బృహస్పతే సురాధ్యక్ష సర్వదేవ నమస్కృతి ।
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి సంగృహాణ మహామతే ॥
"బృహస్పతయే నమః, తీర్థ రాజాయనమః ।
ఇదమర్ఘ్యం సమర్పయామి ॥
గోదావరీనది ప్రార్థనతో అర్ఘ్యాలివ్వడం:
శ్లో॥ త్ర్యంబక జటోద్భూతే, గౌతమస్యాఘనాశిని ।
సప్తధా సాగరం యాన్తి గోదావరి నమోస్తుతే ॥
శ్రీ గోదావర్యాయై నమః ఇదీమర్ఘ్యం సమర్పయామి.
శ్లో॥ పుష్కరాక్ష జగన్నాథ లక్ష్మ్యా సహ జనార్ధన ।
అర్ఘ్యం గృహాణ గౌతమ్యాం సింహయుక్తే బృహస్పతౌ ॥
శ్రీ లక్ష్మీసహిత విష్ణవేనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ।
శ్లో॥ బృహస్పతే సురాధ్యక్ష సర్వదేవ నమస్కృత ।
గృహాణార్ఘ్యం మయాదత్తం సింహస్థో భార్యయా సహ॥
తారాసహిత బృహస్పతయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
శ్లో॥ తీర్థరాజా మహాభాగ పుష్కరాఘ వినాశినీ ।
పుష్కరార్ఘ్యం గృహాణేశ సర్వతీర్థాభి పూజితా ॥
పుష్కరాయైనమః, ఇదమర్ఘ్యం సమర్పయామి.
శ్లో॥ మనయోవాలఖిల్యాద్యా స్సప్తచైవ మహర్షయః ।
సింహస్థితే దేవ గురౌ గృహ్ణంత్వర్ఘ్య మయోద్యతం ॥
శ్రీవాలఖిల్యాది సప్త ఋషిభ్యోనమః ఇదమర్ఘ్యం సమర్పయామి॥
శ్లో॥ పుష్యర్క్షే జన్మనక్షత్రే వ్యతీపాతే దినత్రయే ।
సకృద్గోదావరీ స్నానం కులకోటి సముద్ధరేత్ ॥

ఇటులా పుష్కర కాలంలో "బ్రహ్మ పురాణం 114వ అధ్యాయం"లోని గౌతమీ మహాత్మ్యం పారాయణం చేసిన అత్యుత్తమ శుభ ఫలితములుండును.

ఈ వృత్తాంతాన్ని పఠించిన, వినిపించిన వారికి ఆ జలము వారి కెల్లెడల పవిత్రులనొనర్చగలదని శ్రుతి ఉవాచ.

- తోటపల్లి బాలకృష్ణ శర్మ
సెల్: 94419 27725

పుష్కరస్నాన పుణ్యము

గౌతమమహర్షి సంస్పర్శపూతమైన
పుణ్యగోదావరీనదీ పుష్కరములు
పతితపావన జీవన పరిమళములు
తెలుగునేల - మహారాష్ట్ర ధృతిని బెంచు

పుష్కరములు పండ్రెండేండ్లు పూర్తియైన
వచ్చి తీర్థకోటి ప్రభావ ప్రభాస
భాసమానంబుగా బ్రోచు భక్తజనుల
మునుకలిడు నెల్లవారికి ముక్తి నిలుపు

బ్రహ్మగిరిబుట్టి నాసికు పట్టణమున
బారి తెలంగాణ ఆంధ్ర సంపత్తి బెంచి
సప్తభాగాల బంగాళజలధి జేరి
కాచు కామ్యార్థ నిర్వ్యాజ కరుణ కురిసి

తెలుగులు విడిపోయియు నే
కలతలు లేకుండ మెలగు కరణదయాశీ
స్సులు కురియు మంబ! జీవన
పులకల సర్వార్థ సిద్ధి పుష్కలమౌచున్

తెలుగుల భాగ్యమేమి గణియించగ? గౌతమికృష్ణ పుష్కరం
బులు వెనువెంట వచ్చు పాలుపొంద తెల్గుమరాఠ సీమలం
దలతిగ భారతావనిని - యయ్యది యీ ప్రకృతి ప్రసాదమై
వెలితి యొకింత లేక ప్రభవించెడు బుణ్యపురాసులీధరన్

ఏ రాష్ట్రమునకు లేని మ
హారాష్ట్రాంధ్రావనీ ప్రజావళికిచ్చెన్
ధారాళ జీవనావి
ష్కారము భాగ్య ప్రభావ సంపత్కరమై

ఈ తీర ప్రాంతమ్ములు
పూతాత్మ సుపుష్కరేషు పుణ్యస్నాన
శ్రీ తనివితీర మునుకుల
సాతత సాయుజ్య రాజ్య సవనఫలములౌ

ఆది మధ్యాంత్య పుష్కరమందు స్నాతు
లైనవారల భాగ్య మవ్యయము గాదె
నిరతనిశ్చయబుద్ధి సత్వరసభక్తి
మోక్షదాయక గౌతమీ పుష్కరములు

అనంతసాగర్ సరస్వతీక్షేత్ర నిర్మాత, అష్టావధాని
- అష్టకాల నరసింహరామశర్మ

ఘనచరిత సొంతం... మూడు రాష్ట్రాలు పునీతం

భారతదేశంలోని రెండవ అతి పెద్దనదియైన గోదావరి పశ్చిమ కనుమలలోని సహ్య పర్వత పంక్తులలో సముద్రమట్టానికి 2000 అడుగుల ఎత్తున ఉన్న బ్రహ్మగిరి అనే ప్రాంతంలో జన్మించింది. ఇక్కడి నుండి కొండ, కోనల నడుమ ప్రవహిస్తూ ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన త్ర్యంబకేశ్వర స్వామి దేవాలయం వెనుకనున్న ఎత్తైన మైదాన ప్రదేశంలో ఉన్న గో నాసిక (గోముఖం) నుండి బొట్టు బొట్టుగా క్రిందికి జారుతూ త్ర్యంబకేశ్వర ఆలయం నందు కుశావర్తమనే పేరుగల కుండంలోకి చేరుతుంది. అక్కడినుండి శిలామయమైన పీఠభూమిలో ప్రవహించి నాసిక్ పట్టణాన్ని చేరుకుంటుంది. దర్న, ప్రవర, మూలా, కద్రువ అనే ఉపనదులను, మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని బాలాఘాట్ పర్వతాలలో పుట్టి ఆగ్నేయ దిశగా మెదక్, నిజామాబాద్ మీదుగా 644 కి.మీ. ప్రవహించిన మంజీరా నదిని తనలో కలుపుకుని తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో జ్ఞాన సరస్వతీ దేవి కొలువైన బాసర దగ్గర గోదావరి తెలుగు దేశంలో అడుగు పెడుతుంది.

ఇక్కడి నుండి ఆదిలాబాద్-నిజామాబాద్ జిల్లాలమధ్య సరిహద్దుగా, తదనంతరం ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాలమధ్య సహజమైన సరిహద్దు రేఖను గీస్తు, ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహుని పాదాలను సేవిస్తూ, గూడెం శ్రీ సత్యనారాయణ స్వామిని కొలుస్తు, ఒకప్పటి సనాతన వైదిక సంప్రదాయాలకు ,వేదాలకు నిలయమైన మంథని అగ్రహారాన్ని దీవిస్తు ముందుకు సాగుతుంది. మానేరు నదిని తనలో విలీనం చేసుకుని ఆ నీటితో శ్రీ కాళీశ్వర, ముక్తీశ్వర స్వామిని అభిషేకిస్తు, మహారాష్ట్రలోని సాత్పురా పర్వత శ్రేణులలో పుట్టిన వైన్‌గంగ, పెన్‌గంగ, వార్ధ అనే మూడు చిన్న నదుల కలయిక వల్ల ఏర్పడ్డ ప్రాణహిత నదిని తన ఒడికి చేర్చుకుని అంతర్వాహినియైన సరస్వతీ నదితో కలసి త్రివేణి సంగమంగా మారుతుంది. ఆ తరువాత మధ్యప్రదేశ్ నుండి వచ్చే ఇంద్రావతిని కలుపుకుని ఆగ్నేయ దిశగా తిరిగి వరంగల్లు జిల్లాను పునీతం చేస్తు, ఖమ్మంజిల్లాలోని పర్ణశాలలో సీతాపహరణానికి మౌనసాక్ష్యంగా నిలుస్తు, భద్రాచల శ్రీరామభద్రున్ని దర్శిస్తు, కూనవరం వద్ద రామభక్తురాలైన శబరి నదిని తనలో విలీనం చేసుకుని, ప్రకృతి రమణీయతను కలబోస్తు, తూర్పు కనుమలలోని పాపికొండలను చేరుతోంది గోదావరి.

అక్కడి నుండి ఇరుకైన పాపికొండల మధ్య ప్రవహించి పోలవరం అనే గ్రామం దగ్గర మైదాన ప్రాంతంలోకి అడుగిడి ఉభయ గోదావరి జిల్లాలకు సరిహద్దుగా మారి చారిత్రక నగరమైన రాజమహేంద్రవరం మీదుగా సుమారుగా 3 కి.మీ. విస్తీర్ణంతో ధవళేశ్వరం చేరుకుంటోంది.

ధవళేశ్వరం తరువాత గోదావరి ఏడుపాయలుగా చీలి సప్తగోదావరిగా మారుతుంది. సప్తరుషుల పేర్లతో ఈ సప్తగోదావరి ప్రాంతం పురాణ ప్రసిద్ధిని పొందింది. అయితే ఆ ఏడుపాయలలో నాలుగు ఈనాడు కనిపించడం లేదు. మిగిలిన మూడు శాఖలలో ఉత్తర శాఖను గౌతమి గోదావరి అని అంటారు. ఇది యానాం వద్ద బంగాళఖాతంలో కలుస్తుంది. మధ్యశాఖను వశిష్ఠ గోదావరి అని అంటారు. ఇది 85 కి.మీ.ప్రవహించి నరసాపురం దగ్గరలోని అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తుంది. ఇక మూడవది అయిన వైనతేయ గోదావరి కొమురగిరిపట్నం వద్ద బంగాళా ఖాతంలో కలుస్తుంది.

ఈ విధంగా గోదావరి పుట్టిన చోటునుండి సముద్రంలో కలిసే వరకు మొత్తం 1584 కి.మీ.ప్రవహిస్తుంది. ఇందులో తెలుగు రాష్ట్రాలలో 770 కి.మీ. ప్రవహిస్తోంది. ఎన్నో ప్రాంతాలను సుభిక్షం చేస్తు వరప్రదాయినిగా నిలుస్తోంది.

పౌరాణికంగా గోదావరి నది ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. కేవలం పౌరాణికంగానే కాకుండా ఇతిహాస, కావ్యాదులలోను గొప్పగా వర్ణింపబడింది. మానవజాతికి ఆదర్శప్రాయమైన, అనుసరణీయమైన మార్గాన్ని

చూపించింది శ్రీమద్రామాయణము. అటువంటి రామాయణ మహా కావ్యంలో సీతారాములు వనవాస కాలంలో ఈ గోదావరీ తీరంలో సంచరించారు. గోదావరి ఒడ్డున పర్ణశాలను కూడా నిర్మించుకుని ఎంతోకాలం ఆనందంగా జీవించారు.

ఈ గోదావరి అందాలను చూచి ముగ్ధుడైన రాముడు "ఇయం గోదావరీ రమ్యా పుష్పితైస్తరుభిర్వృతా" ఈగోదావరీ చాలా రమ్యమైనది. పుష్పించిన తరువులతో కూడి ఉన్నది అంటూ ఈ నది అందాలను కీర్తించాడు. రామాయణానికి గోదావరి నదికి ఎంతో సంబంధమున్నది. రావణాసురుడు సీతమ్మను అపహరించింది ఈ నది తీరంలోనే. ఇంకా రామాయణంలోని అనేక ఘట్టాలకు ఈ నది సాక్షీభూతంగా నిలిచింది. మహా భారతంలో కూడా ఈనది గురించిన ప్రస్తావనలు మనకు కనబడతాయి.

సంస్కృత సాహితీవేత్తలలో అగ్రగణ్యుడైన కాళిదాసు తన కావ్యాలైన రఘువంశంలోను, మేఘసందేశంలోను, మరోకవి భవభూతి తన ఉత్తర రామచరితంలోను, ప్రసిద్ధ అలంకారికుడైన రాజశేఖరుడు తన కావ్యమీమాంస యందు, రాజశేఖరసూరి తన ప్రబంధకోశంలోను, వేంకటాధ్వరి రచించిన విశ్వగుణా దర్శంలోను, మొట్టమొదటి భారతీయ చరిత్ర కారుడిగా పేరుగాంచిన కల్హణుని రాజతరంగిణి యందు, మురారి తన అనర్ఘ రాఘవీయంలోను, ఈ నదిని చాలా గొప్పగా వర్ణించారు.

తెలుగు సాహిత్యంలో కూడా గోదావరీ నదిని దక్షిణ గంగగా, గౌతమీ గంగగా ఎంతో ప్రస్తుతించబడినది. తెలుగు సాహిత్యంలో గొప్పగా కీర్తించబడే ఆంధ్ర మహాభారతం, పోతన భాగవతం ఈ గోదావరీ తీరంలోనే ప్రారంభమయ్యాయి. కవిత్రయం లో మొదటి వాడైన నన్నయ **"శ్రీ వాణీ గిరిజాశ్చిరాయి"** అంటూ ఆంధ్ర మహాభారతానికి ఈ గోదావరి ఒడ్డునే శ్రీకారం చుట్టాడు. అరణ్య పర్వంలో విశేషంగా నదిని గురించి వర్ణించాడు. పోతన " అభ్రంకష శుభ్రసముత్తుంగ



తరంగ " అంటూ వర్ణించాడు. శ్రీనాథ కవి సార్వభౌముడు " గోదావరి గోదావరి గోదావరి యంచుబల్కు గుణవంతులకున్ గోదావరి తల్లీ– సంపాదింతువు గదమ్మ నీవు భవ్య శుభముల్ " అని తన భీమఖండంలో కీర్తించాడు. ఆనాటి నుండి నేటి వరకు కవులు తమతమ కావ్యాలలో ఈ గోదావరి నదిని, నది అందాలని వర్ణిస్తూనే ఉన్నారు.

తెలుగు సాహిత్యంలోనే కాకుండా ప్రాకృత భాషలోని గాథా సప్తశతి, తమిళ భాషలోని కంభరామాయణం మెదలైన వాటిలో కూడా గోదావరి ప్రస్తావనా కనబడుతుంది.

ఇక శాసనాల విషయానికి వస్తే క్రీ.శ. 1072 (కలచురి శకము823) ప్రాంతంలో కలచురియిశ: కర్ణదేవుడు వేయించిన శాసనంలో గోదావరి నది ఏడుపాయలు ఏడు స్వరాలై భీమేశ్వరున్ని కీర్తిస్తున్నదని వ్రాయబడింది.

1298–1323 ప్రాంతంలోని ప్రతాపరుద్రుని ఖండపల్లి తామ్రపట్టికలు గోదావరి ఆంధ్రదేశానికి ముత్యాలసరంగా ఉన్నదని వర్ణించాయి. ఈ విధంగా ఎన్నో కావ్యాలలో, మరెన్నో శాసనాలలో ఎంతోమంది చేత కీర్తింపబడిన "పుణ్యఝరి గోదావరి."

- అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

కృష్ణయజుర్వేద పండితులు



అఖండ గౌతమి

మహారాష్ట్రలో ఆవిర్భవించిన గోదావరీ నది నిజామాబాద్ జిల్లా గుండా ఆంధ్రదేశమున తన తొలికెరటపు అడుగును ఉంచినది. బాసర మహాక్షేత్రంలో సరస్వతీదేవి చల్లని చూపులను పొదువుకొని, కాళేశ్వరములో తన సోయగాలకై శివుడు చేసే చిలిపి సైగలకు సిగ్గుపడిపోతూ భావుకతలను రంగరించుకొని, అగ్నిమండలమైన భద్రాచలాన్ని ఆర్ద్రతా భరితంచేసి, తెలుగింటి ఇలవేలుపులైన సీతారాముల పవిత్రానురాగాలను పుణికి పుచ్చుకుని తూర్పు కనుమల ద్వారా పాపికొండలను తరించి మైదాన ప్రాంతానికి వచ్చి రాజమహేంద్ర వరము మీదుగా బంగాళాఖాతంవైపు సాగింది. అత్యంత విశాలయై ప్రవహించే గోదావరి యీ ప్రాంతంలోనే అఖండ గౌతమిగా ఆరాధింపబడుతోంది. సరస్వతి చల్లని చూపులనూ, భావుకతలనూ, పవిత్రానురాగ బంధాలనూ, రాజమండ్రిలోనే భద్రపరచి, ధవళేశ్వరంవైపు కదలి ఆపైనుండి అఖండగౌతమి సప్తగోదావరిగా యేడుపాయలుగా చీలిపోయినది.

సప్తగోదావరులు

1. తుల్య, 2. ఆత్రేయ 3. భరద్వాజ 4. గౌతమి, 5. వృద్ధ గౌతమి 6. కౌశిక, 7. వశిష్ఠ అను యేడు గోదావరి పాయలనూ సప్తగోదావరు లందురు.

ఈ సప్త గోదావరులునూ వివిధ దివ్యక్షేత్రములను, పునీత మొనరించుచు సాగి తూర్పు సముద్రమున కలియుచున్నవి. నాసిక్‌లో జన్మించి అంతర్వాహిణిగా సాగి త్ర్యంబకమందలి గోముఖము ద్వారా పునరావిర్భూతయై సముద్ర సంగమము వరకు దాదాపు వెయ్యిమైళ్ళ నిడివిని ప్రవహించు గోదావరి అడుగడుగునా పవిత్రమైనదే. కణకణమునా సోయగమున్నదే. ముఖ్యముగా పాపికొండల నడుమ ఆ పడవ ప్రయాణము చేసియే తీరవలెను. ఇంతయేల? పుష్కరవేళ గౌతమీనదిలో ఒక్కరోజు స్నానమాడినచో అరువదివేల సంవత్సరములు గంగాస్నాన మాడిన ఫలితమని పెద్దలు చెప్పుచున్నారు.

❖ ❖ ❖

గోదావరి జన్మ స్థలి నాసిక్ - త్ర్యంబకం

ఈ సంవత్సరం జూలై 14 తో మొదలవుతున్న గోదావరి పుష్కరాలతో పాటు నాసిక్ లో కుంభమేళా కూడా ప్రారంభమై సెప్టెంబర్ 25 వరకు కొనసాగుతుంది. గోదావరినది పుట్టుక నాసిక్ అని విదితమే. అట్టి దివ్య క్షేత్రం నాసిక్ గురించి, గోదావరి పుట్టుక, కుంభమేళా ఆవిర్భావం గురించి వివరిస్తున్న ప్రత్యేక వ్యాసం.

నాసిక్ మహారాష్ట్ర లోని అత్యంత ప్రాముఖ్యత వహించిన నగరం. ప్రసిద్ధ యాత్రా స్థలంగా, విద్యా, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో రాణిస్తున్న ఆధునిక పట్టణం. రామాయణంతో ఎంతో అనుబంధమున్న ప్రాచీన నగరం నాసిక్. శ్రీ రాముడు పదునాలుగేళ్ళ వనవాస కాలంలో చాలా భాగం ఈ ప్రాంతంలోనే గడిపేడు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసినదీ స్థలంలోనే. నాసికను ఉత్తరించిన చోటు కనుక నాసిక్ అయిందని జనశ్రుతి. ఈ పరిసరాల్లోనే సీతమ్మవారి గుహలు, పంచవటి, దండకారణ్యం ఉన్నాయి. వింధ్య పర్వతశ్రేణి నుంచి కృష్ణా తీరం వరకు విస్తరించిన అతి విశాల ప్రాంతం దండకారణ్యం. రావణుని సేనాపతి ఖరుడు ఈ దండకారణ్య అధిపతి. జనస్థానం దీని రాజధాని. నాటి జనస్థానమే నేటి నాసిక్. వందకి పైగా పురాతన దేవాలయాలున్న ఈ నగరానికి 7 కి.మీ. దూరంలో అంజనేరి పర్వతం ఉంది. ఇది ఆంజనేయుని జన్మస్థలంగా చెపుతారు.

మహారాష్ట్రలో బొంబాయి, పునే నగరాల తర్వాత పెద్ద నగరం నాసిక్. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో 16 వది గా చెప్పబడుతోంది. ద్రాక్ష తోటలు విస్తారంగా ఉండి ద్రాక్ష సారా కేంద్రంగా పేరుపడ్డది. ఉల్లి, టొమేటో వంటి పంటల ఎగుమతితో వ్యవసాయికంగా కూడా ప్రాముఖ్యత సంతరించుకున్నది.

నాసిక్ చుట్టుపక్కల త్రయంబకేశ్వరాలయం, గంగాద్వార్, కోలాంబిక మందిరం, నివృత్తినాథ మందిరం వంటి ఎన్నో ప్రాచీన దేవాలయాలు, పవిత్ర స్థలాలు ఉన్నాయి. ఇందులో త్రయంబకేశ్వరాలయం అతి పవిత్రము, ప్రాచీనము, ప్రసిద్ధము అయి అలరారుతున్నది.

ఈ ఆలయ విశేషాలు కొన్ని : నాసిక్ పట్టణానికి 40 కి.మీ. దూరంలో ఉన్న బ్రహ్మగిరి పర్వతాలకు ఆనుకొని ఉన్నదీ ఆలయం. పరమశివుని లీలలతో అలరారిన ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. దేశంలోని అతి పురాతనమైన శైవక్షేత్రాలలో గణనీయమైనది త్ర్యంబకేశ్వరం. గోదావరి నది పుట్టుక ఈ దివ్యక్షేత్రంలోనే. పచ్చని ప్రకృతి సౌందర్యం నడుమ విరాజిల్లుతున్న ఈ పుణ్యక్షేత్రానికి పురాణ ప్రశస్తి ఎంతో ఉంది. ఈ ఆలయాన్ని 1677- 1708 మధ్య కాలంలో నానాసాహెబ్ పీష్వా అనే భక్తుడు నిర్మించినట్లు చారిత్రికాధారాలు తెలుపుతున్నాయి. శిఖరం మీద ఒకే ఒక్క కలశం, త్రిశూలం కానవస్తాయి. ఆలయం వెలుపల ప్రాంగణంలో త్రిముఖాలతో ఉన్న చండముండేశ్వరుని ప్రతిమ ఉన్నది. ఈయన భక్తుల కోరికలను తెలుసుకొని స్వామివారికి తెలియచేస్తాడని అంటారు. లోపల నందిమండపంలో తెల్లని పాలరాతితో చెక్కబడిన నంది విగ్రహం ఉంది. నందీశ్వర దర్శనం చేసుకొని స్వామివారిని దర్శిస్తారు. గర్భాలయంలో అంగుష్ట మాత్ర స్వరూపంలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ ఉన్న లింగం ప్రతిష్టించబడింది. దీని పక్కనే కుశావర్త తీర్థం ఉంది. అనేక దిశలలో ప్రవహిస్తున్న గోదావరిని గౌతమమహర్షి ముందుగా కుశావర్తతీర్థానికి ప్రవహింప చేశాడని కథనం ఉంది. భక్తులు ముందుగా దీనిలో స్నానమాచరించి త్ర్యంబకేశ్వర దర్శనం చేస్తారు. 1690 ప్రాంతంలో నిర్మించబడిన ఈ తీర్థంలో పితృదేవతలకు పిండప్రదానం, కాలసర్ప దోషాలకు శాంతులు చేస్తారు. సమీపంలోనే కేదారేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయం ప్రాచీన శిల్పకళా మయమై శోభిల్లుతూ ఉంటుంది. ఇక్కడే

శ్రీమహావిష్ణు, గణపతి, గంగ గోదావరి మాతల ఆలయాలు దర్శనమిస్తాయి. త్ర్యంబకేశ్వరునికి ఒక పక్కగా త్ర్యంబకేశ్వరి, గాయత్రి మాతల మందిరాలున్నాయి. త్ర్యంబకేశుని కి కొద్ది దూరంలో సముద్రమట్టానికి 4248 అడుగుల ఎత్తులో ఉన్న బ్రహ్మగిరి పర్వతం ఉన్నది. పర్వతం మీది గంగాద్వార్ గుండా వెళితే గంగామాత, గౌతమ మహర్షి, కోలాంబిక మందిరాలు చూడవచ్చు. ఇలా ఎన్నో ఆలయాలు, ఉప ఆలయాలు మందిరాలు తీర్థాలతో అలరారుతూ ఉంటుంది నాసిక్. ఈ క్షేత్ర దర్శనం బహుజన్మల పుణ్యఫలమని పెద్దల మాట.

గోదావరి పుట్టుక : కొన్ని యుగాలకు పూర్వం బ్రహ్మగిరి, నాసిక్ ప్రాంతమంతా క్షామ పరిస్థితులేర్పడి ప్రజలు విలవిల్లాడి పోతున్నారు. ఈ పరిస్థితి ని నివారింపదలచి దేవతలు, మునులు ఎల్లపుడు తీవ్ర తపస్సులో యజ్ఞయాగాలతో గడిపే గౌతమ మహర్షిని తమ ప్రయత్నంలో పాలుపంచుకొనేలా చెయ్యాలని ఒక పధకం వేశారట. ఒక మాయా గోవుని సృష్టించి గౌతముని ఆశ్రమంలో వదిలిపెట్టేరు. దీనివల్ల గౌతమునికి తపోభంగమయ్యింది. అందుకు కోపించిన గౌతముడు ఒక దర్భ చేతబట్టి గోవుని అదలించగా అది మరణించింది. గో హత్యా పాతకాన్ని పోగొట్టుకొనుటకు గౌతముడు శివుని గురించి తపస్సు చేశాడు. శివుడు తన జటాజూటంలోని గంగను భూమి పై (గోవుమాదుగా) ప్రవహింపచేసి, గౌతముని పాపవిముక్తుణ్ణి చేశాడు. అలా దిగివచ్చిన గంగ వలన ఆ ప్రాంత క్షామం అంతరించి సుభిక్షంగా మారింది. గౌతముని వలన వచ్చిన గంగ గౌతమి గా, గోదావరిగా పిలువబడింది.

కుంభమేళా ఆవిర్భావం: ఈ సంవత్సరం జూలై 14తో మొదలవుతున్న గోదావరి పుష్కరాలతో పాటు నాసిక్ లో కుంభమేళా కూడా ప్రారంభమై సెప్టెంబర్ 25 తో ముగుస్తుంది. దేవదానవులు మంధరపర్వతాన్ని కవ్వంగా, వాసుకిని తాడుగా చేసుకొని క్షీరసాగర మథనం చేసిన కథ తెలిసినదే. అప్పుడు మొదట కాలకూట విషం పుట్టింది. లోక రక్షణార్థమై శివుడు దానిని స్వీకరించినపుడు కొన్ని బిందువులు నేలపై పడ్డాయి. వాటిని తేళ్ళు, పాములు వంటి జంతువులు నాకుటచేత అవి విష జంతువులయ్యాయి. సముద్ర మథనం చేస్తున్న కొద్దీ మందరపర్వతం సముద్రం లోతులకు క్రుంగిపోవటం మొదలయ్యింది. అప్పుడు శ్రీమహావిష్ణువు కూర్మ రూపంలో పర్వతం అడుగు భాగానికి చేరి కాపాడేడు. వెయ్యి సంవత్సరాల తర్వాత ధన్వంతరి అమృత కుంభం తో ప్రత్యక్ష మయ్యాడు. మొత్తం అమృతాన్ని దానవులే సంగ్రహించేస్తారన్న భయంతో దేవతలు ఆ అమృతభాండంతో పరుగు తీశారు. వారిని రాక్షసులు వెంబడించారు. ఇలా వెంటాడటం 12 దినములు 12 రాత్రులు జరిగిందట. ఇలా పరిగెడుతున్నపుడు అమృతభాండం నుండి కొన్ని బిందువులు హరిద్వార్,నాసిక్, ఉజ్జయిని,ప్రయాగ అన్న 4 ప్రదేశాల్లో పడ్డాయి. అందువల్ల అవి పవిత్ర క్షేత్రాలయ్యాయి. దేవతల చేతిలోని అమృతం నిండిన కలశాన్ని బట్టి కుంభం అన్న పేరువచ్చింది. దేవతలకు 12 దినములు మానవులకు 12 సంవత్సరాలకు సమానం. అందువల్లనే 12 సం.లకు ఒకసారి ఈ 4 ప్రదేశాల్లోకుంభమేళా జరుగుతుంది. బృహస్పతి సింహరాశిలో ఉన్నపుడు నాసికత్ర్యంబకేశ్వరంలోని గోదావరి తీరంలోను,వృశ్చిక రాశిలో ఉన్నపుడు ఉజ్జయిని లోని క్షిప్రానదీ ప్రాంతంలోను,మేష రాశిలో ఉన్నపుడు హరిద్వార్ లో గంగానదీ తీరంలోను, వృషభరాశిలో ఉన్నపుడు ప్రయాగలో త్రివేణీ సంగమ స్థలంలోను కుంభమేళా జరుగుతుంది. నాసిక్ లో జరిగే కుంభమేళా ని సింహస్థ కుంభమేళా అంటారు.

గోదావరి నదీమతల్లి పవిత్ర పాద స్పర్శతోను, పరమేశ్వరుని పావన లీలా విశేషాలతోను పునీతమైన గోదావరి తీర ప్రాంతంలో – అశ్వమేధ ఫలంచైవ లక్ష గోదానజం ఫలం ప్రాప్నోతి స్నాన మాత్రేణ ..... అన్న ఆర్షవాణిని శిరసావహించి ఉద్భవించిన నాసిక్ మొదలు సాగరసంగమం చేసే అంతర్వేది వరకు ఎక్కడయినా ఏ పుణ్యక్షేత్రమైనా దర్శించి సేవించి కృతార్థులమవుదాం ఈ పుష్కర సమయంలో.

-ప్రసాదవర్మ కామబుషి

వ్యాసభారతం - గోదావరి



భారతదేశం పవిత్రతకు మూలాధారాలైన మహావిషయాలలో నదులకు ఒక ప్రత్యేకత ఉంది. నది చైతన్యానికి సంకేతం. అంతేకాదు అది దాహార్తులకు పరమరుచికరమైన ఆరోగ్యభాగ్య సంధాయకమైన నీటిని ప్రేమతో అందిస్తుంది. అన్నార్తులకు అన్నం ప్రసాదించటంలో కూడా దానికదే సాటి. ప్రకృతిని పరవశింపజేయటంలో, గాలిలో శీతలత్వాన్ని సంధించటంలో, ఇంకా అనేకవిధాలుగా నదులు మానవజాతికి దేవతామూర్తు లవుతున్నాయి. మరొక్క విషయం, భారతీయ ఋషులు నదులను, కొండలను, వృక్షాలను, పక్షులను చివరకు ఒక్కొక్క దశలో నీచంగా భావించే పశువులను కూడా దేవతా చైతన్య స్ఫూర్తితోనే సంభావించారు.

భారతధాత్రిలో నదులలో అగ్రస్థానం గంగది అనటంలో సందేహంలేదు. గౌతమి అనే మరొక పేరుతో అలరారే గోదావరీనది కూడా ఆ విషయంలో గణనీయమే. ఇతిహాస పురాణాలలో గౌతమిని కూడా మహర్షులు నిండు హృదయాలతో మన్నించారు. ఆ మన్ననలో ఆ నది విశిష్టతకే ప్రాధాన్యం కాని దురభిమానాలకు ఏమాత్రమూ తావులేదు.

శ్రీవేదవ్యాసులు, ఒక్కమాటలో చెప్పాలంటే, సర్వజ్ఞులు. వారి అంతర్దృష్టికి అందని దేమీ లేదు. వారు అనేక సందర్భాలలో గోదావరిని గొప్పగా భావించి అభివర్ణించారు. కొన్ని మెతుకులను పట్టి చూపుతాను.

ముఖ్యంగా పాండవుల అరణ్యవాస వృత్తాంత కథన సందర్భం వారికి ప్రకృతి తేజస్సంపదను వర్ణించటంలో మంచి అవకాశం కల్పించింది. దానిని వారు ఎంతగానో సద్వినియోగం చేసుకున్నారు. మానవుల పుణ్యాలపంటను పండించారు.

వనపర్వంలో తీర్థయాత్రా పర్వం ఒకటి కొంచెం విస్తృతంగానే ఉంది. అందులో పులస్త్యమహర్షి భీష్మాచార్యులకు చెప్పిన తీర్థమహిమల విశేషాలు ఆయా తీర్థాలను మన కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తాయి. ఆ పులస్త్యుడు భీష్మునితో-

తతో గోదావరీం ప్రాప్య నిత్యం సిద్ధ నిషేవితామ్ ।
గవాం మేధ మవాప్నోతి వాసుకే ర్లోక ముత్తమమ్ ॥

వన - 85-33

అంటారు. గోదావరినది సర్వకాల సర్వావస్థలలో సిద్ధులు శ్రద్ధతో సేవిస్తూ ఉంటారట. దానిని సేవించిన నరుడు అనేక గోవుల పంచామృతాలను సేకరించుకొని చేసిన గొప్ప యజ్ఞఫలితాలను పొందుతాడట. ఉత్తమమైన వాసుకిలోకాన్ని చేరుకుంటాడట. సిద్ధులు దేవయోనులలో ఒక జాతివారు. అంటే మానవుల కంటే పైస్థాయి వారు. ఇంకా పై స్థాయికి పోగల శక్తియుక్తులు కలవారు. అట్టివారు ఈ గోదావరిని నిత్యమూ నిష్ఠతో సేవిస్తున్నారంటే ఆ నది విశిష్టతకు మరొక నిదర్శనం ఏం కావాలి? సిద్ధులు అనే పదానికి ఫలసిద్ధి పొందినవారు అనే అర్థాన్ని కూడా భావించవచ్చు. అప్పుడు తమ సాధనలకు ఫలం పొందినవారు కూడా మరేదో మహత్తర ఫలితాన్ని పొందటం కోసం గోదావరిని సేవిస్తారు అనే భావన కలుగుతుంది.

అఖండ గోదావరి సముద్రసంగమానికి ముందు ఏడుపాయలుగా చీలి ఎందరికో అన్నం పెట్టాలనే తపనను అభివ్యక్తం చేస్తున్నది. దానినే సప్తగోదావరం అనే పేరుతో మనం పిలుచుకుంటున్నాం. ఈ వ్యవహారం గడచిన ద్వాపరయుగంలో శ్రీవేదవ్యాసుల కాలానికే ఉన్నదనటానికి దాఖలా ఇదిగో చూడండి.

సప్తగోదావరే స్నాత్వా నియతో నియతాశనః ।
మహత్పుణ్య మవాప్నోతి దేవలోకం చ గచ్ఛతి ॥

వన - 85-44

ఒక పుణ్యనదిలో స్నానం చేయటానికి కూడా నరుడు ఎంతో పుణ్యం చేసి ఉండాలి. పుణ్యసంపాదనలో ప్రధాన విషయాలు ఆచారనిష్ఠా, ఆహారనిష్ఠా. అవి రెండూ చక్కగా అలవరచుకొని సప్తగోదావరంలో స్నానం చేసిన వ్యక్తి గొప్ప పుణ్యం సంపాదించుకుంటాడు. తత్ఫలితంగా దేవలోకానికి చేరుకుంటాడు. దేవలోకమంటే సాధారణంగా జనాల హృదయాలలో మెదలే భోగభూమిగా సంభావింపరాదు. 'దేవ' శబ్దానికి శమదమాది ముముక్షు ధర్మాలు అర్థాలని శాంతిపర్వంలో వేదవ్యాసులు సూచించారు. కనుక దేవలోకమంటే మోక్షసాధన సస్యాన్ని పండించుకునే క్షేత్రంగా వ్యాఖ్యానించుకోవాలి.

అర్జునుడు వ్యాసోపదేశం మీద అస్త్ర సంపాదన కోసం తపస్సు చేయటానికి వెళ్లాడు. అతని విరహం అన్నదమ్ములకూ, అర్ధాంగి ద్రౌపదికీ దుర్భరం అయింది. ఆవేదనకు ఉపశమనంగా పాండవులు తీర్థయాత్రలు చేయాలని నారదుని ప్రేరణతో నిర్ణయించుకున్నారు. కులపురోహితుడు ధౌమ్యుని దిశానిర్దేశం చేయవలసిందిగా ధర్మరాజు ప్రార్థించాడు. ఆ ధౌమ్యుని ఉపదేశంలో కూడా గోదావరీ నదీమతల్లి మనకు మహోన్నతంగా కనిపిస్తుంది.

దక్షిణస్యాం తు పుణ్యాని శృణు తీర్థాని భారత,
విస్తరేణ యథాబుద్ధి కీర్త్యమానాని తాని వై ।
యస్యా మాఖ్యాయతే పుణ్యాదిశి గోదావరీ నదీ,
బహ్వోరామా బహుజలా తాపసాచరితా శివా ॥

వన - 66 - 1,2

'నాయనా! ధర్మరాజా! భరతవంశ మణిదీపమా! దక్షిణదిక్కులో ఉన్న పుణ్యతీర్థాలను బుద్ధికి అందినంత మేరకు తనివితీరా వర్ణిస్తాను విను' అని ధౌమ్యుడు మొట్టమొదటగా గోదావరినే ఎన్నుకున్నాడు.

'ఆ దక్షిణ దిశలో గోదావరి పుణ్యనది. అక్కడ ఎన్నో ఆరామాలు (తోటలూ, దేవక్షేత్రాలూ ఉన్నాయి). ఆ నదిలో జలం పుష్కలంగా ఉంటుంది. అంతేకాదు. గొప్ప గొప్ప తాసులందరూ దానిని సేవించుకుంటూ ఉంటారు. అది సర్వశుభాలకు నెలవైనది. మంగళస్వరూపిణి'.

ఈ మాటలలో ఎంత మహిమ ఉన్నదో మనం గమనించాలి.

రాగఝరి.. గోదావరి





గోదావరీ! రాగఝరీ!!
ఉత్తుంగ తరంగిణీ
గగనధునీ! రససారిణి!!!..... గోదావరీ

అలుగువలె వెలుగువలె
ఎలుగెత్తిన రవళివలె
అలలన్ని కలలైన ఓ మరాఠ బాలికా
తెలుగింటి సిరివైన పరువాల నాయికా. గోదావరీ

కిసలయాల కుసుమలతల
చెఱకుచేల సేద్యాల
మంజీర నాదాల శింజానవాహినీ
మందాకినికీడైన శుభ్రనదీ సుందరీ గోదావరీ

వసంతాల వనాంతాల
గిరుల దరుల నొరుసుకొని
ఓంకార రూపిణిగా ఒదిగావే వ్యాసపురిని
సాకార సరస్వతీ చరణాలే గతియని గోదావరీ

వన్నెల జలపాతాల
కిన్నెరసాని గీతాల
భద్రాద్రి రామపాద ముద్రికలను ముద్దాడిన
ప్రవంతినీ శిరోమణీ కరుణాంతరంగిణీ.... గోదావరీ

- మరుమాముల దత్తాత్రేయ శర్మ
94410 39146



చెప్పే వ్యక్తి ఒక బ్రహ్మానుభూతిగల ఋషి. వినే వ్యక్తి అనుక్షణమూ హృదయకేదారంలో అనితర సాధారణమైన పుణ్యసస్యాలను పండించుకొనే తపనగల యుధిష్ఠిరుడు. విషయం గోదావరికి సంబంధించినది. 'పుణ్యా, శివా, బహ్వో రామా, బహుజలా, తాపసాచరితా' అని ఐదు విశేషణాలతో ఒక చిన్న శ్లోకాన్ని నింపి వర్ణిస్తున్నాడు. ఇది ఎంత సుందరమైన కథనమో, పావన గౌతమి ఆయన హృదయసీమలో ఏ యెత్తులలో కదలాడుతున్నదో మనం గమనించాలి.

మరొక ఘట్టం – ధౌమ్యుని వలన పుణ్యతీర్థాలను గూర్చి ఆలకించిన ధర్మరాజు తమ్ములతో ధర్మపత్నితో శక్తికొలదిగా తీర్థాలను సేవించుకుంటున్నాడు. అందులో భాగంగా మన గోదావరిని కూడా మనసారా తనివితీరా ఆరాధించి సేవించాడు.

తత్రా పి చాప్లుత్య మహానుభావః ।
సంతర్పయామాస పితౄన్ సురాంశ్చ,
ద్విజాతి ముఖ్యేషు ధనం విసృజ్య
గోదావరీం సాగరగా మగచ్ఛత్ ॥

వన – 118–3

ధర్మరాజు వరుసగా తీర్థాలు సేవిస్తూ 'ప్రశస్త' అనే నదిని దర్శించుకున్నాడు. (ప్రశస్త అనేది ఒక నది అని నీలకంఠులూ, మానియర్ విలియమ్స్ చెప్తున్నారు). దానిలో నిండుగా మునకలాడి ధర్మరాజు పితృదేవతలకు, దేవతలకు తర్పణాలు చేసి పుణ్యపురుషులకు గొప్పగా దానాలు చేసి తరువాత సాగరానికి సంబరంతో సాగిపోతున్న గోదావరీ నదిని చేరుకున్నాడు. అక్కడ కూడా పైన చెప్పి స్నానతర్పణాదులు భక్తిశ్రద్ధలతో నిర్వహించాడనేది ధ్వనిరూపంలో మనకు తెలియవస్తుంది.

మార్కండేయ మహర్షి మాట వింటేనే మనస్సు పులకరించిపోతుంది. ఆయన సృష్టి అంతా ఏకార్ణవ మయినప్పుడు దిక్కుతోచక తిరుగాడుతుండగా వటపత్రం మీద విలాసంగా కరారవిందంతో పదారవిందాన్ని పట్టుకొని ముఖారవిందంలో ముద్దుగా ఉంచుకొంటున్న బాలముకుందుడు కానవచ్చాడు. నాయనా! అలసిసొలసి ఉన్నావు. ఇదిగో ఇందులో విశ్రాంతి తీసుకో! అని మార్కండేయుని తన ముఖకమలం నుండి కడుపులోనికి భద్రంగా పంపాడు. ఆ కడుపులో బ్రహ్మాండ భాండాలనన్నింటినీ దర్శించిన మహర్షి గోదావరీ వాహినిని కూడా పరికించాడట!

సింధుం చైవ విపాశాం చ నదీం గోదావరీ మపి ।
వస్వోకసారం నలినీం నర్మదాం చైవ భారత ॥

వన – 188–103

మార్కండేయుడు మన్వంతర జీవి. మాధవుడు కాలావధులు లేని నిత్యసత్య చిత్స్వరూపుడు. అతని కడుపులో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న గోదావరమ్మ కూడా అంత ప్రాచీనతను సంతరించుకున్నదియే యనటం అతిశయోక్తి కాదు కదా!

శ్రీరామచంద్రుల వారు పదునాలుగేండ్లు అరణ్యవాసం చేసిన సందర్భంలో గోదావరితో గొప్ప అనుబంధాన్ని పెంచుకున్నారు. వాల్మీకులతోపాటు వ్యాసులవారు కూడా ఈ విషయాన్ని ప్రత్యేకభావనతో ప్రస్తావించారు.

సత్కృత్య శరభఙ్గం స దణ్డకారణ్య మాశ్రితః ।
నదీం గోదావరీం రమ్యా మాశ్రిత్య న్యవసత్ తదా ॥

వన–277–41

'శ్రీరామచంద్రుడు శరభంగ మహర్షిని సత్కరించి దండకారణ్యంలో ప్రవేశించి రమ్య అయిన గోదావరినదిని ఆశ్రయించి అందు నివాసం ఏర్పరచుకున్నాడు.

అంటే సర్వలోకోత్తరమూర్తి అయిన శ్రీరామచంద్రునికి కూడా గోదావరి రమ్యయై కనప్పట్టింది. కోరిక పడి అక్కడ పర్ణశాల కట్టించుకొని ఆయన జానకీ లక్ష్మణ సహితుడై కాపురం ఉన్నాడు. గోదావరి అంటే ఆయన గుండెలో ఎంత గౌరవం! ఎంత ప్రేమ!! ఎంత ఆరాధనాభావన!!!

ఈవిధంగా శ్రీవేదవ్యాసులు తమ భారతంలో పవిత్ర గోదావరీనదిని పరిపరి విధాల స్మరించి కొనియాడారు. మానవజాతికి ఆ నదీమహనీయతను వర్ణించి చెప్పారు. ఇది దిఙ్మాత్ర దర్శనం.


పుష్కర సందర్భంలో ఈ ఋషి వాక్యాలను హృదయంలో పదిలపరచుకొని సేవించుకుంటే మరింతగా పుణ్యం పాకానికి వస్తుంది.

- ఆచార్య శలాక రఘునాథశర్మ


తి.తి.దే. వారి 'మాతల్లి గోదావరి' నుండి

గోదావరి
(గౌతమీనది)
– సునితావెను

మన దేశంలో గంగ, సింధు తరువాత అతిపెద్ద నది గోదావరి. ఇది మహారాష్ట్ర లోని నాసిక్ దగ్గర, త్రియంబకమను చోట జన్మించి, నిజామాబాద్ జిల్లా కందకూర్తి వద్ద తెలంగాణాలో ప్రవేశిస్తుంది. ఈ నది ఒడ్డున బాసర వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు కలవు.




ఈ నదికొక కథ ఉన్నది. పూర్వం బ్రహ్మ అహల్యను సృష్టించి, గౌతముడికిచ్చి వివాహం చేసాడు. వారికి శతానీకుడనే కుమారుడు కలిగాడు.




గౌతముడు విత్తనాలు చల్లగానే అప్పటికప్పుడు మొలకెత్తి పంట పండేది. ఇలా అతనికి బ్రహ్మ వరం ఇచ్చాడు.



ఒకసారి విపరీతమైన కరువు వచ్చింది. మునులందరూ గౌతముడి ఆశ్రమానికి వచ్చారు. గౌతముడు అందరికీ భోజనాలు పెడుతూ వచ్చాడు.



అతనికి గల ఈ సంపదను చూసి మునులు ఈర్ష్య పడి ఒక మాయా గోవును సృష్టించి దాన్ని అతని పొలం మీదికి తోలారు.



గౌతముడు వచ్చి దర్భతో గోవును అదిలించాడు.


దర్భ తగలగానే ఆ మాయా గోవు చచ్చి పడిపోయింది.
ఛీ! ఛీ!! గోహత్య చేసిన వాడి ఇంట భోజనం చెయ్యరాదు.
గౌతముడు వారిని వేడుకుంటూ...
గోహత్యా పాతకం ఎలా పోతుంది?
గోవు కలేబరం మీదుగా గంగ ప్రవహింపజేస్తే పోతుంది.
గంగను తన పొలం గుండా ప్రవహింజెయ్యమని శివున్ని గురించి తపస్సు చేసాడు.
శివుడు ప్రత్యక్షమై తన జటను ఒకదాన్ని యిచ్చాడు.
గౌతముడు శివుని జటను పిండి గోవు కళేబరం మీదినుండి ప్రవహింపజేసే సరికి, గోవు బ్రతికి ఆడదాని రూపంలో అక్కడ నుండి వెళ్ళిపోయింది.
SOUMITHA
అక్కడ ప్రవహించిన నది గౌతముడు తెచ్చింది కావడం వల్ల గౌతమీనది అనీ, గోవును బ్రతికించింది కావడం వల్ల గోదావరి అని ప్రసిద్ధి చెందింది
ఈ పవిత్ర నది ఆదిలాబాదు, కరీంనగర్, ఖమ్మంలోని భద్రాచలం గుండా ప్రయాణించి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి చివరికి బంగాళాఖాతంలో కలుస్తుంది.

పుష్కర పుణ్య చరిత్ర

సృష్టి పంచమహాభూతాలతో ఏర్పడింది. భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే ఐదింటినే పంచమహా భూతాలంటారు. మన శరీరంతోపాటు మిగతా ప్రాణులన్నీ ఈ పంచభూతాలతోనే ఏర్పడ్డాయి. అంతటా వ్యాపించిన ఆకాశంలో మిగిలినవన్నీ వున్నాయి. వ్యాపించిన ఆకాశంలో మిగిలినవన్నీ వున్నాయి. మనం నివసిస్తున్న భూగోళంలో ఒక వంతు మాత్రమే భూమి వుంది. మిగిలిన మూడు వంతులు నీరే వుంది. భూమి పర్వతాలు, అడవులు, గుట్టలు, మైదానాలు, అని ఏవిధంగా మార్పు చెందివుందో, నీరు కూడా అనేక మార్పులు చెంది వుంది. సముద్రనీరు, వర్షపునీరు, మంచుపర్వతాల్లో గడ్డకట్టిన నీరు, కాలువలు, చెరువులు, బావులు, బోర్‌లు ఇలా నీరు వేర్వేరుగా వుంది. మనం నివసించడానికి భూమి ఆధారమైనట్లే నీరు కూడా ముఖ్యమైన ఆధారం.

భూమి తల్లి, నీరు తండ్రి, అగ్ని సోదరుడు, గాలి సోదరి, వీటన్నింటికి ఇల్లు ఆకాశం. ఆకాశం అనే అవకాశంలో ఇవన్నీ ఇమిడివున్నాయి. ఇందులో ఏ ఒక్కటి లేకున్నా మనం జీవించలేం. మనం ఈ ప్రత్యక్ష ఐదు భూతాలకు ఎంతో ఋణపడివున్నాం. అట్టి ఋణవిముక్తి కోసం ప్రధానంగా ఆచరించే విధానమే పుష్కర.

'పుష్కర' అంటే ఏమిటి?

నిఘంటువు ప్రకారం 'పుషపుష్టౌ' అవకాశాన్ని పోషించేది 'పుష్కర' అని ఒక అర్థం. మనం జీవించుటకే గాకుండా, మన సృష్టికి మూలకారణమైన ఐదు మహాభూతాలు మనల్ని అవకాశం ఇచ్చి, పోషిస్తున్నాయి. ఇందులో అన్నింటికన్నా పెద్దది, అన్నింటిని భరించేది ఆకాశం.

"పుష్కరముదకం రాతీతివా" అనగా నీటిని ఇచ్చునది అని రెండవ అర్థం. నిత్యజీవితంలో నీరే ప్రధానమైంది. నీటిని ఇచ్చేది కూడా ఆకాశమే. సముద్రంలో ఎంత నీరున్నా అది త్రాగలేం. తిరిగి ఆ నీరు ఆవిరై 'వర్షం' ద్వారా వస్తేనే మనకు ఉపయోగం.

తీర్థభేదానికి కూడా 'పుష్కర' అని అర్థం. అనగా మనల్ని తరింపజేసేది తీర్థం. పవిత్రజలానికి తీర్థం అని పేరు. అంతేగాక ఔషధ విశేషానికి కూడా 'పుష్కర' అని అర్థం వుంది. మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి ప్రాథమిక దివ్యౌషధం నీరే. అయితే అనేక రూపాల్లో వున్న నీరు 'ఎల్లప్పుడు పారే నీరుగా' వున్న రూపాన్ని 'నది' అంటారు. ఇందులో 'జీవనదులు' అంటే ఎల్లప్పుడు పారుతూనే వుంటాయి. సాధారణ నదులు వేరు. నీటి రూపాలన్నింటిలో కెల్లా ఈ 'జీవనదులకు' మిక్కిలి ప్రాధాన్యం వుంది. జీవనదుల పవిత్రతకే 'పుష్కర' అని పేరు.

మన పవిత్ర భారతదేశంలో అనేక జీవనదులున్నాయి. అందులోని ముఖ్యమైన జీవనదులకు మాత్రమే 'పుష్కర' వర్తిస్తుంది. ఏ నదికి ఎప్పుడు పుష్కర వస్తుంది అనే విషయం తెలుసుకోవాలి. 'పుష్కరకాలం' ఎలా ఏర్పడిందో తెలిస్తే, మిగతా విషయాలు సులభంగా తెలుస్తాయి.

'పుష్కరకాలం' ఎప్పుడు?

జ్యోతిశ్శాస్త్ర ప్రకారం 'కాల విభజన' జరిగింది. రవి, చంద్ర గమనాల ఆధారంగా తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలేర్పడుతున్నాయి. అదేవిధంగా గురు గమనాన్ని అనుసరించి ఈ 'పుష్కరకాలం' ఏర్పడింది. ఆకాశంలోని 'భ' చక్రంలో (12) పన్నెండు రాశులున్నాయి. నవగ్రహాల్లోని పెద్దదైన 'గురుగ్రహం' ఒక సంవత్సరకాలం ఒకే రాశిలో



వుంటుంది. గురుగ్రహం అత్యంత పవిత్రమైంది. సకల శుభాల నిచ్చునది. అందుకే గురుగ్రహానికి మిక్కిలి ప్రాధాన్యత ఏర్పడింది.

పన్నెండు రాశులకు గాను పన్నెండు జీవనదులను ఎంపికజేశారు. మన పూర్వీకులైన ఋషులు. మేషరాశి మొదలుకొని మీనరాశి వరకు గురుడు ఏ రాశిలో ప్రవేశించినపుడు ఆయా నదికి 'పుష్కర' వస్తుంది. ఇలా పన్నెండు సంవత్సరాలకొకసారి ఒక్కొక్క నదికి పుష్కర వస్తున్న కారణంగా 'పుష్కరకాలం' అంటే 'పన్నెండు సంవత్సరాల'ని దృఢపడింది. పుష్కర వచ్చిన నదికి సంవత్సరం అంతా పుష్కరకాలమే. అయినా, ప్రారంభం నుండి 12 రోజులు ఆది పుష్కర అని, ముగింపుకు ముందు 12 రోజులు అంత్య పుష్కర అని పిలుస్తారు. ప్రస్తుతం 'పుష్కర' అనే పదం కేవలం నదులకు వచ్చే గురుప్రవేశ కాలానికే పరిమితమైంది.

ఏ నదికి ఎప్పుడు పుష్కరాలు?

శ్లో॥ మేషే గంగా వృషే రేవా మిథునే చ సరస్వతీ ।
కర్కటే యమునాప్రోక్తా, సింహే గోదావరీ స్మృతా ॥
కన్యాయాం కృష్ణ వేణీ చ కావేరీ ఘటకే స్మృతా ।
వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కరవాహినీ ॥
మృగే తుంగా ఘటే సింధుః ప్రణీతా తటనీ ఝషే ।
తిష్ఠన్నబ్దాత్సర గురుః క్రమాత్సర్వే మునీశ్వరాః ॥

బృహస్పతి (గురుడు) మేషరాశిలో ప్రవేశించినపుడు గంగానదికి, వృషభరాశిలో – నర్మదానదికి, మిథునరాశిలో – సరస్వతీనదికి, కర్కాటక రాశిలో యమునానదికి, సింహరాశిలో గోదావరీ నదికి, కన్యారాశిలో కృష్ణానదికి, తులారాశిలో కావేరీ నదికి, వృశ్చికరాశిలో భీమరథీ నదికి, ధనూరాశిలో బ్రహ్మపుత్రానదికి, మకరరాశిలో తుంగభద్రా నదికి నదికి, కుంభరాశిలో సింధూనదికి, మీనరాశిలో ప్రణీతా నదికి పుష్కరాలుంటాయి.

"రాబోవు సంవత్సరం అనగా శ్రీమన్మథ నామ సం॥ర అధిక ఆషాఢ బహుళ (కృష్ణపక్ష) త్రయోదశి మంగళవారం తేది: 14.07.2015 రోజున గురుడు ఉదయం 6.25 ని.లకు సింహరాశిలో ప్రవేశిస్తున్నందున శ్రీసార్ధత్రికోటి తీర్థరాజ సహిత గోదావరీ నదికి పుష్కరాలు ప్రారంభమవుతున్నాయి". తేది: 25.07.2015 నిజ ఆషాఢ శుద్ధ నవమి శనివారం వరకు 12 రోజులు పుష్కర పర్వకాలం వుంటుంది.

పుష్కర ప్రాశస్త్యం గూర్చి అనేక పురాణ గాథలున్నాయి

పుష్కరుని కథ : పూర్వం తుందిలుడనే బ్రాహ్మణుడుండేవాడు. ఇతను శివుని గూర్చి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. శివుని యొక్క ఎనిమిదవ రూపమైన పుష్కర రూపం కావాలని కోరాడు. శివుడు ప్రసాదించాడు.

తర్వాత బ్రహ్మదేవుడు శివుని గురించి తపస్సు చేసాడు. శివుడు ప్రత్యక్షమైనాడు. బ్రహ్మదేవుడు సృష్టికార్యం చేయడానికి పుష్కరుడు కావాలని కోరాడు. శివుడు 'సరే' నని తన కమండలంలో వున్న పుష్కరుణ్ణి బ్రహ్మకు ఇచ్చేశాడు. బ్రహ్మదేవుడు తన సృష్టికార్యం చేస్తూ వున్నాడు.

కొంతకాలం తర్వాత దేవతల గురువైన బృహస్పతి బ్రహ్మదేవుని కోసం తపస్సు చేసాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. బృహస్పతి వెంటనే తనకు ఒక గ్రహాధిపత్యం, మరియు కమండలంలో నీటి రూపంలో వున్న పుష్కరున్ని ఇవ్వమని కోరాడు. అందుకు బ్రహ్మదేవుడు 'తథాస్తు' అన్నాడు. ఇందుకు పుష్కరుడు ఒక సవరణ కోరాడు బ్రహ్మదేవున్ని. తనను విడిచి మీరెక్కడికి పోకూడదు. అపుడు మీరు నన్ను ఎక్కడికి వెళ్లమన్నా వెళ్తానన్నాడు. బ్రహ్మదేవుడు ఒప్పుకున్నాడు. గురుడు సంవత్సరానికి ఒకసారి చొప్పున పన్నెండు సంవత్సరాలు, పన్నెండు రాశుల్లో సంచరిస్తాడు. ఆయా సంవత్సరాలకు అధిష్టానాలైన నదుల్లో పుష్కరుడు ఉండాలి అని బ్రహ్మదేవుడు పుష్కరున్ని ఆదేశించాడు. అదేప్రకారం గురుడు రాశిలో ప్రవేశించిన రోజు నుండి మొదటి పన్నెండు రోజులు, చివరి పన్నెండు రోజులు మధ్యకాలంలో అనగా ప్రతిరోజు మధ్యాహ్నం రెండు ముహూర్తాల కాలం (అనగా 1.36 ని.లు) సకల దేవతలతో, ఋషులతో తాను ఆయా నదుల్లో వుంటానని పుష్కరుడు బ్రహ్మదేవునితో ఒప్పుకున్నాడు.

ఈవిధంగా ప్రతి సంవత్సరం ఆయా నదికి పుష్కరాలు జరుగుతున్నాయి.

- గౌరీభట్ల విట్టలశర్మ సిద్ధాంతి

కవితా గోదావరి

గోదావరి. ఈ పేరే చాలు తెలుగు సంస్కృతిని చాటి చెప్పడానికి. ఎక్కడైనా నాగరకత అనేది నదీ పరీవాహక ప్రాంతాలలోనే వెల్లి విరుస్తుందనేది అక్షరసత్యం. అయితే తెలుగు భాషలో కవిత్వం ప్రారంభమయిందే గోదావరి ఒడ్డున. అంతవరకు సంస్కృత భాషా కవిత్వము మాత్రమే రాజ్యమేలుతున్న రోజులలో తెలుగు పద్యం ఎందుకు కవితాత్మకం కాదు, తెలుగులో కావ్యం ఎందుకు వ్రాయకూడదనుకొన్నాడు రాజమహేంద్రి రాజధానిగా రాజ్యపరిపాలన చేస్తున్న రాజరాజ నరేంద్రుడు. అందుకు తగినవాడు నన్నయామాత్యుడే అనుకొన్నాడు. అభ్యర్థించాడు. వెంటనే పనిలోకి దిగాడు నన్నయ్య. అప్పటికి గాసట బీసటగా ఉన్న తెలుగు భాషను ముందు సంస్కరించాడు. అందుకోసం ఆంధ్రశబ్ద చింతామణి అనే వ్యాకరణ గ్రంథాన్ని వ్రాసాడు. ఆ తరువాత ఘంటాన్ని కదిపాడు. అంతే రెండున్నర పర్వాలు అఖండ గౌతమిలా ప్రవహించింది భారత కవితాగోదావరి. అక్కడితో నన్నయ ఘంటం ఆగిపోయింది. అటు తరువాత వంద ఏండ్లకు తిక్కన, ఆ తరువాత మరో వంద ఏండ్లకు ఎఱ్ఱన పుట్టి ఆ భారతాన్ని పూర్తి చేయాల్సివచ్చింది.

అంటే తెలుగు పద్యకవిత్వానికి పునాది వేసింది నన్నయ. ఆ తరువాత దానిపై ఒక్కొక్క అంతస్థు పైపైకి లేస్తూనే ఉంది. ఆకాశసౌధంగా తయారవుతూనే ఉంది. పద్యాన్ని పాతిపెట్టాలని కొందరు అసమర్థ దుర్జనత్వంతో దాడి చేసినా ఆ ఉద్యమాల భూకంపాలు ఈ బహుళ అంతస్థుల పద్యభవనాన్ని ఏమీ కదల్చలేకపోయాయి. కదల్చలేవు కూడ.

నన్నయ్య తరువాత శ్రీనాథమహాకవి గోదావరీ జలపానం చేసి, సృష్టించిన కావ్యరాజాలు ఎన్నో. ఎన్నెన్నో. తెలుగు పద్యానికి కనకాభిషేక గౌరవాన్ని తీసికువచ్చిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు. అలాగే ఇంచుమించు అదే కాలంలో కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేల నేడ్చెదో కైటభదైత్య మర్దనుని గాదిలి కోడల! అంటూ సరస్వతీ దేవినే ఓదార్చిన మహానుభావుడు, ఇందుగలడందు లేడని సందేహము లేదు అంటూ సర్వాంతర్యామి అన్నమాటకు చక్కని తెలుగుతనాన్ని గూర్చిన మహాకవి తన పద్యాన్ని తెలుగువారందరికీ నోటిలో నానేలా చేసాడు పోతన ఈ గోదావరి నీటిని త్రాగి. వర్షాకాలపు గోదావరిలా భక్తిరసాన్ని పరవళ్లు త్రొక్కించాడు. కృష్ణుని లీలావిశేషాలను తెలుగువారి గుండెలలో కొలువు చేయించాడు.

శ్రీరామ నీనామ మెంత రుచిరా, పలుకే బంగారమాయెనా అంటూ కీర్తనా ప్రవాహాన్ని, అలాగే తన కత్తికి రెండువైపులా పదునుందని చెప్పినట్లుగా

భండనభీముడార్తజనబాంధవుడుజ్జ్వల బాణతూణ కో
దండ కళాప్రచండ భుజతాండవ కీర్తికి రామమూర్తికిన్
రెండవ సాటి దైవమిక లేడనుచున్ గడకట్టి భేరికా
దాండ దదాండ దాండ నినదంబులజాండము నిండి మత్త వే
దండము నెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ! –

అంటూ పద్య ప్రవాహాన్ని గోదావరీ ప్రవాహంతో సమానంగా నడిపించి, భక్తరామదాసుగా పేరు పొందిన కంచర్ల గోపన్న గోదావరి ముద్దు బిడ్డడే.

తొలి తెలుగు నవల గాని, తెలుగులో తొలి స్వీయచరిత్రగాని, తొలి కవుల చరిత్రగాని ఇలా ఎన్నో క్రొత్త ప్రక్రియలకు తెలుగు భాషలో శ్రీకారం చుట్టి, తెలుగు భాషావైభవాన్ని లోకానికి చాటడంతోబాటుగా సంఘ సంస్కారానికి సాహసించి సాఫల్యం సాధించిన మహానుభావుడు కందుకూరి వీరేశలింగం పేరు వింటే గోదావరి ఆనంద తాండవం చేస్తుంది. అందుకనే అంటాడు ఆరుద్ర– కొట్టుకొని పోయె కొన్ని కోటిలింగాలు. వీరేశలింగమొకడు మిగిలెను చాలు అని. అలాగే అవధానవిద్యద్వారా పద్యాన్ని పల్లె పల్లెకూ తీసికొని పోవడమే గాక నాటక రచనద్వారా నిరక్షరాస్యులైన గొడ్లకాపరులవంటివారుకూడా చెల్లియె చెల్లకో, జెండాపై కపిరాజు వంటి పద్యాలను ధారాళంగా

పాడగలిగే విధంగా ప్రజల నోట్లో నానేలా పద్యరచన చేసిన మహానుభావులు, ఇంకా శ్రవణానందం, దేవీభాగవతం, నానారాజ సందర్శనం, గీరతం వంటివి అసంఖ్యాకంగా పద్యకావ్యాలను లోకానికి అందించిన తిరుపతి వేంకటకవులుకూడా గోదావరి ఒడ్డున పుట్టి పెరిగినవారే. గౌడడిండిమభట్టు కంచుఢక్కను పగులగొట్టించిన శ్రీనాథుని తరువాత దోసమటంచెరింగియును దుందుడుకొప్పగ పెంచినారమీ మీసలు అంటూ సవాలు చేసివారు ఆ జంటకవులే.

గయోపాఖ్యానం వంటి నాటకంగాని, గణపతివంటి హాస్యరసప్రధానమైన రచనలుగాని లోకానికి అందించిన చిలకమర్తి లక్ష్మీనరసింహకవి, వరవిక్రయం, చింతామణివంటి నాటకాలతో సమాజంలోని కుళ్లు కడిగిన కాళ్లకూరి నారాయణరావుగాని, బారిష్టరు పార్వతీశం వంటి నవలతో తరువాతికాలంలో ఎన్నో తెలుగు చలనచిత్రాలకు హాస్యరసభరిత సన్నివేశాలను భిక్ష పెట్టిన మొక్కపాటి నరసింహంగాని వీరందరూ గోదావరీమాత అనుగ్రహంతో కవిత్వం చెప్పినవారే. అపర నన్నయ్య అనదగినవారు, ఆంధ్రపురాణాన్ని తెలుగు వాకిట నిలిపిన మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారుకూడా రాజమహేంద్రి గోదావరి నీటిలో స్నానం చేసి, ఆ నీటితో గొంతు తడుపుకొని కలం కదిపినవారే. దీక్షితదాస కీర్తనలు, హరికథలు, చింతా సుబ్బన్న దీక్షితుల కథలు ఈ నది ఒడ్డున పుట్టినవే. మధురమైన కంఠంతో పద్యాలను పాడి, పద్యనాటక పతాకాన్ని వినువీథిలో రెపరెపలాడించిన షణ్ముఖి ఆంజనేయరాజుకూడా గోదావరి ప్రాంతంవాడే. బహుభాషా శాస్త్ర కోవిదులైన మహాపండితులు, వాఙ్మయవారాశి శ్రీమాన్ అత్తిలి గోపాలకృష్ణమాచార్యులవారు, తిరుపతివేంకటకవుల తరువాత అవధానవిద్యకు విశేష ఆదరణ తెచ్చిన రావూరి వేంకటేశ్వరులవారు, వ్యాకరణ శాస్త్రాన్ని ఔపాసన పట్టిన మహామహోపాధ్యాయ శ్రీపాద లక్ష్మీనారాయణ శాస్త్రిగారు గోదావరి ఒడ్డున పెరిగినవారే. అభినవ పోతనగా పేరువడ్డ వానమామలై వరదాచార్యులవారు గోదావరి ప్రాంతంవారే.

కొంపెల్ల సుబ్బరాయశాస్త్రిగారు, పేరి సూర్యనారాయణశాస్త్రిగారు, రాణీ నరసింహశాస్త్రిగారు ఇటువంటివారెందరో ఆనాడు శాస్త్రవాఙ్మయాన్ని ఆపోశన పట్టినవారు గోదావరిలో ఆచమనం చేసినవారే. వేదంతో ఆటలాడుకొన్న ఉప్పలూరి గణపతి శాస్త్రిగారు, విశ్వనాథ ఘనపాఠిగారు, గుళ్లపల్లి ఆంజనేయ ఘనపాఠిగారు వీరందరూ గోదావరికి అటు ఇటూ ఉన్నవారే.

గతవైభవమే కాదు, నేటికీ గోదావరి ప్రాంతంలో కవులకు, పండితులకు, కళాకారులకు లోటులేదు. నాలుగు శాస్త్రాలను కాచి వడబోసిన మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణగారు, అలంకార శాస్త్రప్రవీణులు కొంపెల్ల రామసూర్యనారాయణగారు, వ్యాకరణశాస్త్రంలో అపర పతంజలి కొంపెల్ల సత్యనారాయణగారు, అష్టాదశపురాణాలను, వేదాన్ని, శాస్త్రాన్ని, సాహిత్యాన్ని అవలోధనం చేసికొన్న ఉభయభాషా శతావధానులు చిఱ్ఱావూరి శ్రీరామశర్మగారు, సంస్కృతమే ఊపిరిగా బ్రతుకుతూ తన ఇంటి పనిమనిషితో కూడా సంస్కృతంలోనే మాట్లాడే ఋషికల్పుడు దోర్బల ప్రభాకరశర్మగారు ఇటువంటి మహనీయులెందరో ఈనాటికీ గోదావరి ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నారు.

ఈనాటికీ అవధానరంగంలో నువ్వా నేనా అంటూ ముందుకు సాగిపోయేవారిలో అధికభాగం గోదావరీపరీవాహక ప్రాంతంలోనే ఉండడం గమనించాల్సిన విషయం. ఇలా గోదావరికి, కవిత్వానికి అవినాభావ సంబంధం ఉంది. నాటినుండి నేటికీ ఆ వన్నె అలానే ఉంది. తగ్గలేదు, కగ్గలేదు. అటువంటి గోదావరి నదికి, గంగ తరువాత అంతటి ప్రశస్తిని పొందిన గౌతమికి పుష్కరాలు వచ్చేయంటే భక్తులకే కాదు కవులకుకూడా పండుగే. ఎందుకంటే గోదావరిపై కవిత్వం చెప్పని కవి ఎవడూ ఉండడు. కవిత్వం గోదావరిలా, గోదావరి కవిత్వంలా పోటీపడి ప్రవహిస్తుంటాయి.

గురుసహస్రావధాని **డా. కడిమిళ్ళ వరప్రసాద్**

పాపహరీ – గోదావరీ



గోదావరీ పుష్కరాలు గలగలమంటూ వచ్చేస్తున్నాయి. తెలుగువారు రెండు రాష్ట్రాలుగా ఎదిగి ఎదనిండా ఆనంద ప్రవాహఝురులని పొదిగి స్వేచ్ఛావాయువులని పీల్చుకుంటున్నారు.

"త్వయి స్నాతుమనుజ్ఞాం మే దేహి గౌతమి పావని" (ఓ గౌతమీ! నీ పుణ్య జలాలతో స్నానం చేయడానికి అనుమతివ్వు) అంటూ పుణ్యంమీద మమకారం ఉన్నవారంతా పుష్కర స్నానాలకి బయలుదేరుతారు. అందమైన గోదావరీ జలాల్లో మునిగి, తేలి ఆధ్యాత్మిక ఆది భౌతిక ఆనందాలని పొందటం తెలుగు జాతి జన్మ హక్కు. అది వారికి పరమశివుని ప్రసాదం.

ద్వాదశ రాశుల్లో సింహరాశి రాజరికం ఉన్న రాశి. నవగ్రహాలన్నింటిలో అతి దీర్ఘకాయం ఉన్న గ్రహం గురుగ్రహం. త్రిమూర్తులలో అధికశక్తిగలవాడు పరమశివుడు. నదీమాతృకగా, శివుని జటాజూటోద్భవిగా, రాచకళలు రంగరించుకున్న నదీరాజము గోదావరి. అన్ని శాస్త్రాలలోనూ అగ్రగణ్యత అద్భుతంగా నిలబడిన వేళ పుష్కర వేళ. మహాపుష్కరశోభని అత్యంత సంప్రదాయకంగా సనాతన ఘనాపాటీల వేదఘోషలతో నినదించిపోయే దివ్యశబ్ద తరంగాలతో తరళించే గోదావరీ నదీమాతృకని శ్రవణ, మనన నిధి, ధ్యాస, తపో యోగాదులతో దర్శించాల్సిందే. భారతదేశంలో ప్రతి ఏటా ఏదో ఒక నదికి పుష్కర సంబరం జరుగుతూనే ఉంటుంది. కానీ గోదావరమ్మకి ఆది పుష్కర శోభ – అంత్యపుష్కరవైభం రెండూ సమాన సంరంభాలతో మహత్తర వేడుకలుగా సాగుతాయి. **"బ్రహ్మగిర్యవతీర్ణా – గోముఖాత్ వినిస్సృతా – వ్యోమకేశజటాభూష"**గా వర్ణింపబడిన గంగానదీ ప్రతిరూపమే గోదావరీమాత – దేవలోకంలోని నదులు దివ్యఋషుల ప్రయత్న ఫలితంగా భూలోకానికి తరలించబడటమనే అద్భుతగాథలు అనాదిగా మానవజాతి వెంటతెచ్చుకున్న వెలలేని సంపదలు ఒక కాశీపట్టణం – ఒక గంగానది లేకపోతే మానవ జన్మలకి ముక్తి – మోక్షాలు అందని ద్రాక్షలుగా మిగిలేవి. అదీగాక ఆ గంగమ్మ కూడా అలగకుండా (పాపం అలకానది అయినా) గౌతమిగా – గోదావరిగా – రాజమహేంద్రానికి రాణిగా దక్షిణభారతం తలుపుతట్టి మరీ ప్రవహించింది. ఈ గాధల వెనుక ఒక భగీరథుడు ఒక గౌతముడు ఉత్తరం నుంచీ దక్షిణం వరకూ ప్రవహిస్తూనే ఉన్నారు. ఇది కూడా దేవతల సంకల్పమే!!

గౌతమి మహర్షి పొలంలోకి గోవు రాకపోతే గోదావరి గలగలలు కోటి లింగాల నడుమ జలగీతాలు పాడేవి కావు. ఇవన్నీ తెలుగు ప్రజలు పురిటి మంచం నుంచీ పుడకల వరకూ పుణ్యాన్ని ముత్యాల మూటలుగా కట్టి వెంటతెచ్చుకున్న అదృష్టరాశులు – అన్నిటా అద్వితీయ – అగణిత – అనుపమ అయిన గోదావరి నదీమతల్లి పుష్కరుడుని ఆనందంగా ఆహ్వానించే వేళ ఎన్నో రాష్ట్రాలు పునీతమయి ప్రజలని వినీతులుగా దర్శిస్తాయి. మహారాష్ట్రలో త్ర్యంబక గ్రామానికి చేరువలో వున్న బ్రహ్మగిరి పుట్టిల్లుగా – తెలుగు రాష్ట్రాలు మెట్టినిల్లుగా చెబుతూ చరిత్రలో గోదావరమ్మ సుమారు 1400 కి.మీ. ప్రయాణించి తెలుగురాష్ట్రాలను పచ్చపచ్చగా పలకరించి బంగాళాఖాతంలో కలిసి సముద్రానికి సౌందర్యశోభలని పెంచుతుంది. కాకపోతే సముద్రం చేరే దూరాన్ని ఏడుపాయల జడలాగా అల్లుకుని సప్తఋషుల పేర్లతో (వసిష్ఠ, కౌశిక,

వాసుకి దేవి, జమదగ్ని, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి) జడబిళ్లల్లాగా వాళ్ళని తన కేశపాశంలో బంధించి పెట్టుకుంది.

పుష్కరాలు అంటే నదిలోకి పుష్కరుడు అనే పేరుతో ఒక ఋషి ప్రవేశించి ఆ నదీజలాలకి పవిత్రశక్తిని చేకూర్చటమే **"పోషయతీతిపుష్కరః"** పోషిస్తుంది కనుక పుష్కరం – గోదావరి జలాల్లో పుష్కలంగా మేధ్యం (శక్తిస్నానం) యజ్ఞం వంటి (మంత్రజలాన్ని చల్లడం) దైవిక శక్తులని ప్రవేశపెట్టడం 3.50 లక్షల కోట్ల పుణ్యతీర్థాలకు అధిపతిగా శివుని అష్టమూర్తిత్వంలోని జలల్లో ప్రవేశించాడు. తుందిల మహర్షి తన తపోశక్తితో శివుని మెప్పించి పుష్కరుడు అన్న పేరు తెచ్చుకున్నాడు.

జీవులకి జలామృతం ఇచ్చి బ్రతికించే గురువు (బృహస్పతి) పుష్కరుని తన ఆధీనంలో ఉంచేందుకు బ్రహ్మని ప్రార్థిస్తే మొదటి 12 రోజులు మాత్రమే పుష్కరుడు బృహస్పతిలో కలిసి ఉండేలా ఏర్పాటు చేశాడు. కానీ గోదావరికి మాత్రం ఆది – అంత్యదశలలో కూడా వీరి కలయిక ఉంటుంది. పుష్కర బృహస్పతుల సహవాస సమయంలో నదీజలాలకి ఎక్కడాలేని అద్భుతశక్తులూ వచ్చి చేరతాయి – దీనికి మరో కారణం నదీజలాల్లో స్నానం చేసే శ్రేష్ట పండిత గోష్టుల వేద పఠన ఘోషలోని శబ్దతరంగాలు ప్రవాహిత జలాల్లో నిలిచిపోతాయి. **"మంత్రాధీనంతు దేవతా"** – ఆ అపౌరుషేయ వేద పఠన గంభీర శబ్దతరంగ ప్రకంపనాలతో దేవతలంతా ఆ నదీజలాలని నివాస స్థానాలు చేసుకుంటారు. భూమండలంలోని పుణ్యనదులేకాక మిగిలిన 13 లోకాల్లోని జలాలు (పాతాళోపరి–పాతాళ గర్భిత లోకంలోని) ఆ పుష్కరుడిని చేరుకుంటాయి.

ఇంకేముంది 14 లోకాల్లోని కోట్ల కోట్ల పుణ్యతీర్థాలలోని జలశక్తి ఒక్క నదిలోకి చేరేసరికి దేవతలంతా ఆకర్షితులై త్రిమూర్తుల నుంచీ సిద్ధసాధ్య ఉరగ గంధర్వ కిన్నెరాదుల దాక సమస్త సన్మంగళ దేవతలు పుష్కరాలు ప్రారంభమవుతున్న జీవనదిలోకి తమ దేవతాశక్తులని మిళితం చేసి పుష్కరాంత సమయం వరకూ నదీజలాలని వదిలిపోరు – మరి ఇంతటి అఖండమైన అప్రమేయ శక్తిని కలిగిన నదీజలాల్లో దేవతలే ఇష్టపడి ఉండిపోతుంటే మనుష్యులు ఆ అద్భుత శక్తి జలాల్ని, ఆ దేవతాప్రసాద జలాలని, ఆ శివప్రసాదిత జలరూప పుష్కర స్నానాన్ని చేయకుండా ఉండటం సాధ్యమా! 12 రాశుల్లో నిర్విరామంగా సంచరించే పుష్కరుడిని ధ్యానించి నదీ ప్రవేశం చేయటం సముచిత కర్తవ్యం మనిషికి **"తీర్థరాజమహాభాగ సర్వతీర్థ సమాన్నతి ఇదమర్ఘ్యం సమర్పయామి"** అని ప్రార్థించి నదీజలాల్లో ప్రవేశించాలి. అంతేకాదు రేగిపండంత పరిమాణంలో బంకమన్ను నదిలో మూడుసార్లు వేయాలి **(మృత్తికాం తే మయా దత్తం ఆహారార్థం ప్రకల్పయ)** ప్రతిభక్తుడి వంటికి అంటిన మట్టిన బయటికి వెళ్ళకుండా తిరిగి నింపడం– భూమాతలో కలిసిన జలమాత పృథ్వీగంధాన్ని నదీమతల్లికిచ్చే ఆహారం ఇది. తరువాత సువాసినీ రూప గోదావరీ తల్లికి పసుపు కుంకుమలిచ్చి పచ్చగా మన్ని దీవించమని వేడుకోవాలి. అంతేకాదు ఎన్నో అసంకల్పితంగా పాపాలు తెలిసీ తెలీక చేస్తూ ఉంటాం. దానికి కూడా ఆమెకి సంజాయిషీ చెప్పుకుంటూ ఇలా చెప్పాలి **"సర్వపాపవిముక్త్యర్థం తీర్థస్నానం కరోమ్యహమ్"** (అన్ని పాపాలకి విముక్తి కోసం ఈ నదీస్నానం చేస్తున్నాను). తల్లీ – నన్ను రక్షించు – "తీర్థరాజనమస్తుభ్యం" – అంటూ పుష్కర రాజుకో నమ్కారం చేస్తూ గోదావరి నదికి ప్రత్యేకంగా చెప్పాలి.

"పుష్యార్కే జన్మనక్షత్రే వ్యతీపాతీ దినత్రయే
సకృద్గోదావరీ స్నానం కులకోటిం సముద్ధరేత్ ।
స్నాన సాద్గుణ్య సిద్ధర్థమిదమర్ఘ్యం దదామ్యహమ్
గోదావర్యైనమః ఇద మర్ఘ్యం సమర్పయామి" ॥

గోదావరీ నదీ శబ్దానికి ఎంతటి ప్రాచీన చరిత్ర ఉందో ఆమె పుట్టుపూర్వోత్తర సౌభాగ్య విశేషాలు ఎంతటి పవిత్రతని కలిగి ఉన్నాయో తరచిచూస్తే గోదావరి నది తెలుగు రాష్ట్రాలకు స్వర్గభోగాలనిచ్చేదిగా అర్థమవుతుంది.

శివుని శిరోజ అయిన గంగమ్మ పేరు దారి రెండు మార్చుకుని గోదావరీ నది అయ్యింది. **"నదతీతి నదీ" "సరతీతి సరత"** (అమరకోశం) గోదావరి నదిని సరిత్తు అనటం

సముచితం – **"తరంగాః అస్యాం సంతీతి తరంగిణీ"** తరంగిణీ– తరంగములు కలది కనుక గోదావరీ తరంగిణీ అనీ, **"నదీ మాతాస్య నదీమాతృక"** నదియే తల్లిగా భావన అని కూడా వ్యవహరించవచ్చు. గో (ఆవు) – దా(దానం) – వరీ (అనేకం)– గోవులని (అనేకమైన) దానంగా ఇచ్చినది అని శబ్దార్థంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ కూడా **"వృఙ్ వరణే"** అన్న శబ్దం నుంచీ (అమరకోశంలోని వనౌషధి వర్గం ప్రకారం) వేళ్ల చేత భూమిని కప్పేది అన్న అర్థం కనిపిస్తోంది. గో – దా – వరీ అన్న శబ్దత్రయానికి వాల్మీకి రామాయణంలోని ఒక సంఘటనని ఆధారంగా తీసుకుంటే కొన్ని యోజనాల మేర వరకూ ఉన్న గోసమూహాలని శ్రీరాముడు కపిశ్రేష్టులకి దానంగా ఇచ్చాడట రావణసంహారానంతరం. గోవుల చేత కప్పబడిన భూమిని గోదావరిగా చెప్పుకుంటే ఆ భూమిని గోదావరీ నదితటంగా భావించాలి.

గోదావరీ నదిని ఆ జలప్రవాహ సమూహ సంపదల ననుసరించి అనేక సుందర నామాలతో దర్శించవచ్చు– తటినీ (దరులు గలది) శైవలినీ (నాచు గలది) ప్రోదినీ (అవ్యక్తశబ్దం గలది) ధునీ (వాయువుచేత కంపించునది) స్రోతస్వినీ (తనంతట తానుగా ప్రవహించునది) నిమ్నగాపగా (పల్లము వైపు ప్రవహించునది)

ఇంతటి విశాల చరిత్ర వినీల కాంతులీనే సుందర శరీరము కలిగివున్న గోదావరి వాల్మీకి భావనలో మరింత సౌందర్యాన్ని కలుపుకుని అక్కడే శ్రీరామునికి పర్ణశాల నిర్మాణం జరిగేలా వర్ణించబడింది.

అరణ్యకాండలో ఆశ్రమ నిర్మాణానికి శ్రీరాముడికి ఒక ప్రదేశం నచ్చుతుంది **"విమృశన్రోచయామాస దేశం సర్వగుణాన్వితమ్"** (అరణ్య కాండం 8). అప్పటికి వాల్మీకి మహర్షి, రాముడు మెచ్చిన ప్రదేశమనే చెబుతారు. కానీ అది గోదావరీ నదీ ప్రాంతమని మరికొంచె ముందు కొడితే తెలుస్తుంది **"ఇయం గోదావరీ రమ్యా పుష్పితైస్తరుభిర్వృతా హంస కారండ వాకీర్ణా చక్రవాకోపశోభితే"** (అ.కాం. 12, 13, 14, 19) **"మయూర నదితా పుష్పితై రమ్యాః... సౌవర్ణై, రాజతై,**



స్తామ్రైర్దేశే దేశే చ దాతుభిః", "ఇదం పుణ్య మిదం మేధ్య మిదం బహుమృగద్విజమ్ పర్ణశాలాం సువిపులాం తత్ర సంఘాత మృత్తికామ్ (21)" ఇదిగో సుందరమైన గోదావరీ నది. పుష్పితమైన వృక్షాలతో పరిపూర్ణమైన తటము కలిగి భూమికే సొగసు నద్దుతోంది. హంసకారండవ చక్రవాకాది పక్షిగణములతో శోభాయమానంగా ఉంది. మయూర నాదాలతో, సువర్ణ రజత తామ్రాది వర్ణ సంపర్కమైన గైరికాది ధాతువులతో సుశోభితంగా ఉంది. అన్న మాటని ఆదేశంగా తీసుకుని అక్కడి మట్టిని తవ్వి సువిశాలమైన పర్ణశాలని నిర్మించాడు లక్ష్మణుడు.

"సగత్వాలక్ష్మణ శ్రీమాన్నదీం గోదావరీం తదా,
స్నాత్వా పద్మానిచాదాయ సఫలః పునరాగతః (24–31)
అన్వాస్యమానో న్యవస త్స్వర్గలోకే యథామరః"

ఇది పుణ్యప్రదేశం పావనమైనది అంటూ సంతోషించి గోదావరీ నదికెళ్లి శ్రీరాముడు స్నానం చేసి కొన్ని తామరపూలను – పళ్లను తీసుకొచ్చాడు. సమీప గోదావరి తీర నిర్మిత పర్ణశాలలో అగస్త్యాశ్రమ సమీపంలో రాముడు సీతాసమేతుడై దేవలోకంలో ఇంద్రుడులాగా సుఖించాడు. కృత త్రేతా యుగాల నుంచే కాదు వేదకాలం నుంచీ కూడా గోదావరీ నదికి ఆవిర్భావ వికాస విషయంలో చాలా ఘనమైన చరిత్ర ఉంది. అంతటి గోదావరీ ప్రవాహంలో ఎంతటి వారైనా మునక వేసి ముక్తి మోక్షాలని పొందాలంటే బయలుదేరాల్సిందే నదీ స్నానాలకి!!

- ఆచార్య విజయశ్రీ కుప్పా

శ్రేష్ఠం... పవిత్రం... గోదావరి పుష్కరం

భారతీయ సంప్రదాయంలో దేవతలను ఆరాధించేటపుడు నీటితో అర్ఘ్యమిస్తాం. ఏ ప్రదేశంలో ఏ శుభకార్యం చేసినా 'గంగేచ యమునే కృష్ణే గోదావరి సరస్వతీ, నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధింకురు ' అంటూ నదులన్నిటినీ ఆవాహన చేస్తాం. తెలుగువారికి గోదావరి అతి ప్రధానమైన జీవనది. పంచభూతాలలో నీరు శ్రేష్ఠమైనది. ఆ నీరు గంగాజలమైతే ఇంకా శ్రేష్ఠం. అంతకంటే గోదావరీ జలమైతే మరింత శ్రేష్ఠ తరం. అందువల్లనే కాబోలు గౌతమిలో స్నానం ఆచరించిన తర్వాతే గంగా స్నానం చెయ్యమని స్మృతులు నిర్దేశం చేశాయి.

"పంచానామపి భూతానాం ఆపః శ్రేష్ఠత్వ మాగతాః" పంచభూతాలలో నీరు శ్రేష్ఠమైనది. నీటికి ప్రత్యక్ష ప్రతీకలు నదులు. మన వైదిక మంత్రాలలో శ్లోకాలలో నీటి పవిత్రతను, ప్రాధాన్యతను వివరించేవి ఎన్నో కానవస్తాయి. ప్రారంభంలో జగత్తంతా జలరూపమే అని, అందులోంచి ప్రాణి ఉద్భవించినదని వేదవేత్తలే కాదు, శాస్త్రజ్ఞులూ అంటున్నమాట. ఇటువంటి అనేకానేక కారణాల వల్ల భారతీయ జీవనంలో జలానికి ఇహ పర ప్రాధాన్యత లభించింది. భారతీయ భాషలన్నిటా నది స్త్రీ వాచకం. అంతేకాదు ఆర్ష విచారధారలో భూమి ప్రకృతి నదులు అన్నీ మాతృమూర్తులుగా సంభావించి అర్చనార్హత కల్పించటం జరిగింది. **"ఆపోవా ఇదగ్ం సర్వం విశ్వభూతాన్యపః . . . . . ."** అన్న వేదమంత్రం నీటి ప్రాముఖ్యతను తెలియ చేస్తుంది. మానవ జీవితం పుట్టినది మొదలు గిట్టే వరకు నీటితోనే ముడిపడి ఉన్నదని అందరకు అనుభవమే! అందుకేనేమో నదీ స్నానం సర్వపాప హరమనీ, పరమ పవిత్ర మైనదని భావిస్తాం.

ఆంధ్రదేశాన్ని పునీతం చేస్తున్న జీవనదులు కృష్ణా గోదావరులు. పుట్టుక మహారాష్ట్రలో అయినా ఆంధ్రుల ఆధ్యాత్మిక సాంస్కృతిక రాజకీయ చరిత్రతో సాన్నిహిత్యాన్ని, ప్రగాఢ ప్రాముఖ్యాన్ని సంతరించుకుని, ఆంధ్రుల ఆత్మప్రవాహమా అన్నంతగా పెనవేసుక పోయిన జీవనది గోదావరి. మహారాష్ట్ర దాటి ఆంధ్రదేశంలో బాసర క్షేత్రం లో తొలి మజిలీ చేసి అంతర్వేదిలో ఆఖరి మజిలీ చేసిన గోదావరి దారి పొడుగునా అనేక పుణ్యక్షేత్రాలను దివ్యభూములను తన స్పర్శతో పునీతం చేస్తూ భక్తి ముక్తులతో పాటు భుక్తినీ ఇచ్చే వరప్రసాదిని గోదావరి. అందుకే

'రేవాతీరే తపః కుర్యాత్ మరణం జాహ్నవీ తటే

దానం దద్యాత్ కురుక్షేత్రే గౌతమ్యాం త్రితయం వరం' అని రేవాతీరంలో చేసిన తపస్సు, గంగా తీరాన సంభవించిన మరణం కురుక్షేత్రమున చేసిన దానం అత్యంత ముక్తిప్రదములని పెద్దలమాట. కాని ఆ మూడిటి ఫలం ఒక్క చోటే లభించే దివ్యతీర్థం గోదావరి. అట్టి పరమ పావని గోదావరి



ని ఎందరో తెలుగు కవులు మనసారా కీర్తించారు. అందు శ్రీనాథ మహాకవి గోదావరి ప్రాంతాన విశేషంగా తిరిగి చాలా క్షేత్రాలు దర్శించి ఆయా క్షేత్ర దేవతలను క్షేత్ర మహిమలను తన కావ్యాలలో ఎంతగానో ప్రస్తుతించాడు.

సీ॥ త్ర్యంబికాచల శిఖాగ్రమునందుదయించి
పొదలి యార్యావర్త భూమి దరసి
మలగి దండకవనీ మధ్యభాగమున
నా ప్రస్రవణాచల ప్రస్థమెరసి
పట్టిసశ్రీవర భద్రేశు సేవించి
తీరసోమేశుమందిరము డాసి
యేచి యనంత భోగేశ్వర స్థానంబు
రుద్రపాదములపై ద్రోవగాగ

తే. కోటిపల్లీశు కోమలాంఘ్రులకు మ్రొక్కి
కుండలాముఖ తీర్థంబు గుస్తరించి
భీమమండలి దాపల బెట్టుకొనుచు
గౌతమీగంగ లవణాబ్ధి గొగలించె -

అని భీమేశ్వర పురాణంలో వర్ణించాడు.

గోదావరీ పరీవాహక ప్రాంతం పొడుగునా అనేక పుణ్యక్షేత్రాలు దివ్య తీర్థాలున్నాయి. అందు ముఖ్యమైనవి : బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, కిన్నెరసాని, కూనవరం(శబరి-గోదావరి సంగమస్థలం) పాపికొండలు, పట్టిసం, రాజమహేంద్రి, కొవ్వూరు(గోష్పాద క్షేత్రం) కోటి లింగాలరేవు, ఇవి దాటి ధవళగిరి (ధవళేశ్వరం) చేరుకుంటుంది. ఇక్కడే అపరభగీరథునిగా అన్నదాతగా పేరొందిన సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్ట నిర్మించి , సప్త గోదావర ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశాడు. ఈ డెల్టా ప్రాంతంలోనే పంచారామాలలోని 4 క్షేత్రాలు దక్షారామం, భీమారామం, క్షీరారామం, కుమారారామం ఉన్నాయి.

సముద్రంలో కలిసే ముందు గోదావరి 7పాయలుగా విడిపోయి, సప్తగోదావరమైంది తూర్పు గోదావరి లోనే. అవి తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, వృద్ధగౌతమి, కౌశిక, వశిష్ఠ. కొందరు మహర్షులు తలొకపాయ గా తీసుకువెళ్ళి

గోదావరీ పుష్కరాష్టకమ్

కందకుర్తి గ్రామతీర్థే తెలంగాణ ప్రవేశిని ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥

వాసరా తీర్థ సంవాస జ్ఞానవాగీశ్వరీ ప్రియే ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి నమోస్తుతే ॥

శ్రీరామసాగరానంద సంధాన సుమనోహరి ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥

ధర్మపుర్యాం నృసింహస్య సేవనానందనందిని ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥

కాళేశ్వర మహాక్షేత్ర ముక్తీశ్వర సమర్చికే ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥

భద్రాచల మహాక్షేత్ర సీతారామ సుసేవికే ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥


నాసికాత్ర్యంబకోద్భూతే గౌతమాశ్రమవర్ధిని ।
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥

అన్నదాత్రి! జగద్ధాత్రి! ప్రాణదాత్రి! వరప్రదే!
పుష్కరోత్సవ సంప్రీతే! గోదావరి! నమోస్తుతే ॥

గోదావరీనదీమాతృపుష్కరాష్టక సంస్తుతిః ।
నటేశ్వరకృతా భూయాద్విశ్వకల్యాణకారికా ॥

అష్టావధాని, డా॥ అయాచితం నటేశ్వర శర్మ

❖ ❖ ❖



నందువల్ల 7 పాయలైనదని, అవి ఆయా మహర్షుల పేర్ల మీదుగా పిలువబడుతున్నాయని మరొక కథనం ఉంది. వసిష్ఠ పేరుతో ఉన్న ప్రధాన శాఖ నారసింహ క్షేత్రమైన అంతర్వేది వద్ద సముద్రంలో కలవటంతో గోదావరి ప్రస్థానం ముగుస్తుంది.



మహారాష్ట్రలో పుట్టినా అధికాధికంగా ఆంధ్రదేశంలోనే ప్రవహిస్తూ, **"పావనమీ నదీజలము పారెడు తెన్గుధరన్ ప్రశాంత శోభావలనంబగా సిరులు పండెడు సిద్ధమహీ తలంబు"**గా వెలుగొందటానికి కారణమయ్యింది.

గౌతమ మహర్షి తపఃఫలంగా శివుని జటాజూటం నుంచి బ్రహ్మగిరి చేరి గౌతమిగా అవతరించింది. సహ్యాద్రి పర్వతశ్రేణి లో భాగమయిన బ్రహ్మగిరి లో గోదావరి పుట్టుక. ఈ బ్రహ్మగిరి పర్వతం త్ర్యయంబకేశ్వరం అనే చోట ఉన్నది. అనేక ఉపనదులను తనలో కలుపుకొని మహానదియై వెయ్యిమైళ్ళకు పైగా ప్రవహించి సాగరసంగమం చేస్తుంది. గో హత్యా పాప పరిహారం కోసం అవతరించి, గో కళేబరం మీదుగా ప్రవహించి న నది గోదావరి అయినది.

పుష్కరాల ప్రారంభం : మహానదులన్నీ జీవుల పాప పంకిలమును తమలో ఇముడ్చుకుని ఆ జీవులను క్షాళితం చేస్తాయి. అలా కల్మషమైన నదులను శుద్ధి గావించి పునఃచైతన్య వంతం చెయ్యాలి. అందులకై జరిగే ప్రక్రియ యే పుష్కరం. జీవులందరూ తమ పాపాలను నదీస్నాన మాచరించుట ద్వారా నదులలో వదలి పునీతులౌతున్నారు. కాని నదులు కల్మషంతో కలుషితమై నిర్మలత్వాన్ని కోల్పోతున్నాయి. పాపపంకిల భరితమైన నదులను తిరిగి పునీతంచెయ్య దలచిన పుష్కరుడనే బ్రాహ్మణుడు శివుని గూర్చి తపస్సు చేశాడని, శివుని అభయం వల్ల పుష్కరత్వ సిద్ధి కలిగి నదుల పునఃపవిత్రతకు అవకాశం కలిగిందని పురాణ కథనం. బృహస్పతి మేషాది రాశులలో ప్రవేశించిన నాటి నుండి 12 రోజులు రేయింబవళ్ళును, మిగిలిన సంవత్సరమంతా మధ్యాహ్న వేళ రెండు ముహర్తముల కాలమును ఆయా నదులలో పుష్కరుడుండ వలెనని బ్రహ్మ సంకల్పం. వివిధ రాశులలో గురు గ్రహం ప్రవేశించినపుడు ఒకొక్కనదికి పుష్కర కాలంగా నిర్ణయింపబడింది. ఇట్లు ఒకొక్క రాశిలో సంవత్సరం చొప్పున 12 రాశులలో సంచరించుటకు 12 సంవత్సరాలు పడుతుంది. ఈ పద్ధతి ననుసరించి గురుడు మేష రాశి లో ఉన్నపుడు – గంగానదికి, వృషభ రాశిలో ఉన్నపుడు – నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నపుడు– సరస్వతి నదికి, కర్కాటక రాశిలో ఉన్నపుడు –యమునా నదికి, సింహరాశిలో ఉన్నపుడు – గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నపుడు – కృష్ణానదికి, తులారాశిలో ఉన్నపుడు– కావేరీ నదికి, వృశ్చిక రాశిలో ఉన్నపుడు తామ్రపర్ణి (భీమానదికి) , ధనుస్సు లో ఉన్నపుడు– పుష్కరవాహినికి, మకరరాశిలో ఉన్నపుడు– తుంగభద్రానదికి, కుంభరాశిలో ఉన్నపుడు– సింధునదికి, మీనరాశిలో ఉన్నపుడు– ప్రాణహిత నదికి పుష్కరములని శాస్త్రవచనం. పన్నెండు రాశులలో సంచరించిన పిదప తిరిగి మొదటిరాశిలో కి వస్తాడు. పుష్కరారంభం నుంచి మొదటి 12 రోజులు ఆది పుష్కరమని, సం. చివర 12 రోజులు అంత్యపుష్కరమని వ్యవహరిస్తారు. ఈ 12 రోజులలో అన్ని నదులలోని జీవశక్తి, మహత్వము పుష్కరం జరిగే నదిలో నిక్షిప్తమై అత్యంత పవిత్రత, ప్రాముఖ్యము సంతరించుకొటుంది.

పైన పేర్కొన్న నదులన్నిటికి అంత్యపుష్కరాలుండవు. గోదావరికి మాత్రం అంత్యపుష్కరాలున్నాయి.

ఉపవాసం పుష్కరనదీ స్నానం, నదీపూజ, పుష్కరపూజ, బృహస్పతి పూజ, పిండప్రదానం, శక్తి కొలది భూమి, ధనము, బంగారము, నెయ్యి, తేనె పాలు, వస్త్రము, పుస్తకము, అన్నదానము వంటి ఇతర దానములు చెయ్యటం అత్యంత పుణ్యప్రదమని శాస్త్రవచనం. పుష్కరాల సమయంలో ఏ చిన్న దానం చేసినా అది కోటి రెట్లు ఫలాన్నిస్తుందని అంటారు.

అచట దానంబు హోమమధ్యయన విధులు
శ్రాద్ధమును దేవతా సమర్చనము వ్రతము
లొక్కటొక్కటి కోటి గుణోపలబ్ధి
సంభవించును సతతంబు సాధకులకు.

అని అగస్త్యుల వారు చెప్పినట్లుగా భీమేశ్వరపురాణంలో శ్రీనాథుడు ఉల్లేఖించిన మాట అఖండ గోదావరీ తీర ప్రాంతమంతటికీ అన్వయిస్తుంది.

ఈ 12 రోజులలో ఏ రోజు ఏ దానం చెయ్యాలో శాస్త్ర వివరణ ఉంది. పుష్కరాల సమయంలో పుణ్యస్నానం ఆచరించి పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తే పాపవిమోచనమై సద్గతి కలిగి పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది. అందుకే పుష్కర పుణ్యకాలంలో శాస్త్రోక్తంగా, శ్రద్ధాభక్తులతో పిండప్రదానం తప్పక ఆచరించాలి.

ఈ సంవత్సరం అధిక ఆషాఢ బహుళ త్రయోదశి, మంగళవారం (జూలై 14) గురువు సింహరాసిలో ప్రవేశించటంతో గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి. నిజ ఆషాఢ శుద్ధ నవమి, శనివారం (జూలై25) నాడు ముగుస్తాయి.

శైవక్షేత్రమైన నాసికా త్రయంబకం లో పుట్టి నారసింహ క్షేత్రమైన అంతర్వేది లో సముద్ర సంగమం చేస్తున్న గోదావరి హరి హరాద్వైతానికి ప్రకృతి పరమైన దివ్య సంకేతం!

త్ర్యంబక జటోద్భూతే గౌతమస్యాఘ నాశని ।
సప్తధా సాగరం యాంతి గోదావరి నమోస్తుతే ॥

-ప్రసాదవర్మ కామబుషి

పుష్కర గోదావరి

పుష్కర గోదావరి యా
విష్కృతి సంస్కృతికి, ధర్మవృద్ధికి, జడ మ
స్తిష్కముల గూర్చు చేతన
పుష్కలముగ బుణ్యమిచ్చు పూజ్యాపగయై॥

ఏమని పల్కుదు నేమని పల్గుదు నేమని పల్కుదు గౌతమినిన్
రాముడు సీతయు స్నానమునాడిన రమ్యతరాపగ గౌతమియే
ఆమె మహత్త్వము పుష్కర వేళలయందు బదింతలుగా బెరుగున్
క్షేమమొసంగును యోగమొసంగును జేయుము స్నానము భక్తిమెయిన్

దేవాచార్యుడు గౌతమి
జీవనమున జేరువేళ జేసెడి స్నానం
బావలకు ద్రోయు పాపపు
ద్రోవను, బున్నెముల త్రోవలో నడిపించున్

వెన్నెలలో గోదావరి
పున్నెపు బసవోలె మనకు బొడగట్టు గదా!
వెన్నెల తెడ్డముగా
నున్నది యని చూచుకొనుచునుండును సొగసున్

పావనమైన సంస్కృతికి బట్టము గట్టుచు జెట్టు చెట్టుతో
దీవల కన్నెలన్ గలిపి దీవెనలిచ్చుచు రాగసాగరున్
భావన సేయుచున్ గదలు వైనము గాంచి గురుండు మెచ్చి గో
దావరి జేరె బుష్కరుడుదారత బెంచెను దన్మహత్త్వమున్

గోదావరి గట్టున్నది
మోదమ్మున గట్టు పైని బూచిన చెట్టో
మాదన్నది యా పిట్టను
గాదన్నది యెవ్వడంచు గర్జించె నళుల్

ఏ నదీవాహని యీ తెన్గువారికి
భారతమ్మిచ్చి జీవనము నేర్పె
ఏ నదీవాహని యీ తెన్గువారికి
భాగవతమ్మిచ్చి భక్తి గూర్చె
ఏ నదీవాహని యీ తెన్గువారికి
జ్ఞానసరస్వతీ ధ్యానమొసగె
ఏ నదీవాహని యీ తెన్గువారికి
సంఘసంస్కార విజ్ఞానమొసగె

అట్టి గోదావరీనదియందు నేడు
పుష్కరుడు చేరె గురుసింహమును రహించె
ఇట్టి వేళలో స్నానమ్ము నెవడు చేయు
వానికిహపరమ్ముల వైభవమ్ము హెచ్చు

గురుసహస్రావధాని, **డా. కడిమిళ్ళ వరప్రసాద్**

ఆంధ్రమహాభారతంలో గోదావరి

భారతావని ఎన్నో పవిత్ర నదీనదాలకు నిలయం. వాటిలో గంగ, యమున, సరస్వతి, నర్మద, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు, ప్రణీత అనే పన్నెండు నదులూ పుష్కరప్రవేశం గల పుణ్యతీర్థాలని పెద్దలు పేర్కొన్నారు.

గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతీ ।
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు ॥

అని స్నానవిధిలో ప్రతిదినం మనం స్మరించే పావన నదీమతల్లి గోదావరి.

గోదావరిని గంగ అనీ, దక్షిణ గంగ అనీ, గౌతమి అనీ సప్తగోదావరియనీ వివిధ నామాలతో మన కవులు పిలిచారు. భారతీయ సంస్కృతి నిధానములైన శ్రీమద్రామాయణఱ మహాభారత భాగవతాలలో గౌతమీ ప్రశంస కానవస్తుంది. ఆంధ్రభాషకు ఆదికవి అయిన నన్నయ మొదలు చిన్నయ వరకు ఆ మాటకొస్తే సినీ రచయిత ఆచార్య ఆత్రేయ వరకు గోదావరిని కొనియాడని తెలుగు కవి లేడనడం అతిశయోక్తి కాదు.

అర్జునుడు సమయోల్లంఘన ప్రాయశ్చిత్తార్థ: ద్వాదశ మాసిక వ్రతదీక్ష వహించి అన్నగారి అనుజ్ఞ పొంది తీర్థయాత్రలకు బయలుదేరతాడు. ఆ యాత్రల్లో మొదట గంగానదిని ఆ పిదప దక్షిణఱ గంగగా ప్రసిద్ధి వహించినర గోదావరిని సేవించి అనేకాగ్రహారాలతో విలసిల్లుతూ విప్రోత్తము లాచరించే యజ్ఞాలవల్ల కలిగే పుణ్యసమృద్ధితో వెలుగొందే వేంగీదేశ వైభవాన్ని తిలకిస్తూ కావేరీ సాగరసంగమంలో ధరణీదేవులకు దానాలిచ్చి ధన్యుడయ్యాడని నన్నయభట్టారకుడు స్వస్థాన వేషభాషాభిమానంతో తాను రచించిన భారత ఆదిపర్వ అష్టమాశ్వాసంలో మూలంలో లేని వేంగీ విషయ విభవాన్ని కీర్తించాడు.

ఆ పద్య స్వరూపమిది.

సీ. దక్షిణ గంగనాఁ దద్దయు నొప్పిన
గోదావరియు జగదాదియైన
భీమేశ్వరంబును బెడగగు చున్న శ్రీ
పర్వతంబును జూచి యుర్విలోన
ననఘమై శిష్టాగ్రహార భూయిష్టమై
ధరణీసురోత్త మాధ్వర విధాన



పుణ్యసమృద్ధమై పొలుచు వేంగీదేశ
విభవంబుఁజూచుచు విభుఁడు దక్షి
తే. ణాంబురాశి తీర్థంబున కరిగి దురిత
హారియైన కావేరీ మహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ
తార్థ దానంబుఁజేసి కృతార్థుఁడగుచు.

ఆది. 8-139

అవిరళ జపహోమ తత్పరుడైన వాగమశాసనుడు తాను నిత్యం మునిగే దక్షిణగంగ గోదావరినీ, తనకు ఆశ్రయ దాత అయిన రాజరాజనరేంద్రుడు పరిపాలించే వేంగీదేశాన్ని వర్ణించకుండా ఎలా ఉండగలడు?

ధర్మజుడు ప్రతిస్మృతి అనే యోగవిద్యను అర్జునుడికి ఉపదేశించి తపోయోగబలంతో ఇంద్రుణ్ణీ, ఈశ్వరుణ్ణీ మెప్పించి పరమాస్త్రలాభం పడసి రమ్మని చెప్పి పంపి, గాండీవి రాకను ప్రతీక్షిస్తూ కామ్యక వనంలో ఉండగా నారదమహర్షి వచ్చాడు. ఆయా తీర్థమహిమలు తెలుపుమని ధర్మపుత్రుడు వేడుకొనగా పులస్త్యమునీంద్రుడు భీష్మునికి చెప్పిన సకల తీర్థమహిమలు నారదుడు వివరిస్తూ -

"పెన్నయను మహానది నాడిన మయూర హంస విమానగతు లగుదురు. గోదావరీ స్నానంబు చేసిన దశాశ్వమేధ ఫలంబు వడయుదురు. సప్తగోదావరీ తీర్థంబును నాడిన పుణ్యులు పుణ్యలోక ప్రాప్తులగుదురు". అర. 2-278

అని గోదావరీ స్నాన ఫలమెలాంటిదో చెపుతాడు. అంతటితో తీర్థ ప్రభావ ప్రసంగాన్ని విరమించక దేవర్షి నారదుడు –

క. ఇది నిక్కువ మని మనములఁ
బదిలంబుగ తీర్థ సేవ భక్తిఁ దలఁచినన్
విదితముగ దురితహరమగు
సదమల సుజ్ఞాను లగుట సత్యము ధరణిన్.

అర 2-284

చ. వ్రతములు లేనివారు నుపవాస పరాఙ్ముఖులైనవారు దు
ర్మతులు విహీన శౌచులు గ్రమంబున తీర్థము లాడనోప;రా
తతగుణశాలి నీ వఖిల ధర్మ విదుండవు గావునన్ శుభ
స్థితిఁజని తీర్థసేవనము సేయుము నీకు నభీష్ట సిద్ధిగన్.

అర. 2-286

పులస్త్య వచనంతో భీష్ముడు ఎల్లతీర్థాలు సేవించి కృతార్థుడైనట్లు నీవు కూడా దేవలోకం నుంచి నీ కడకు రానున్న రోమశమహర్షి తోడ్పాటుతో తీర్థ సేవ చేసి కృతకృత్యుడివి కమ్మని చెప్పి వెళతాడు. అంతలో రోమశమహర్షి వచ్చి అర్జునుడు ఇంద్రుని వద్ద క్షేమంగా ఉన్నాడనీ, శీఘ్రమే రాగలడనీ, దేవేంద్రుడు నీచేత తీర్థయాత్రలు చేయింపుమని నన్ను నియమించాడు అనీ చెపుతాడు. ధర్మజుడు రోమశమహర్షితో కలసి తీర్థయాత్రలు కావిస్తూ దక్షిణదిశగా వెళ్ళి అక్కడ పరమపవిత్రమైన గోదావరిని దర్శించాడని శబ్దశాసనుడు అరణ్యపర్వ తృతీయాశ్వాసంలో వాకొన్నాడు.

క. భూవినుతంబై త్రిభువన
పావనమై త్ర్యంబక ప్రభవమైన జలౌ
ఘావళి పవిత్రమగు గో
దావరిఁబుణ్యనదిఁగనియె దక్షిణగంగన్.

అర. 3-156

ఉత్తర గంగను భగీరథుడు ధరణికి తరలించుక వస్తే, దక్షిణ గంగగా ప్రసిద్ధిగాంచిన గోదావరిని శివజటాజూటం నుంచి నిర్గమింపజేశాడు గోహత్యాపాప పరిహారార్థం గౌతమమహర్షి, పూతసలిల గోదావరి రాజమహేంద్ర పురి వద్ద తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, వృద్ధ గౌతమి, కౌశికి, వసిష్ఠ అనే పేర్లతో ఏడు పాయలుగ చీలి తూర్పు సముద్రంలో అంతర్లీన మవుతుంది. అటువంటి పుణ్యనదిలో గోబ్రాహ్మణ దేవతాభక్తి పరుడైన ధర్మపుత్రుడు స్నానం చేసి దానములు సల్పి అక్కడనుంచి కదలి ప్రభాసతీర్థంలో పన్నెండు రోజులు తపస్సు చేశాడు. ఆంధ్రకవిత్వ విశారదుడు నన్నయభట్టు గోదావరీ పుణ్యస్రవంతిని స్మరించాడు.

శా. గోదేవ క్షితిదేవ భక్తిపరుఁడై గోదావరీ స్నాతుఁడై
గోదానంబులు హేమదానములు పెక్కుల్ రత్నదానంబులున్
భూదోవత్తమ పూజసేయుచు జగత్పూజ్యుండు ధర్మాత్మజుం
డాదిత్యాభుఁడనేక తీర్థ శతసేవాసక్త పుణ్యాత్ముఁడై.

అర. 3-157

అంటూ సంజయుడు చేసిన ఈ నదీ ప్రస్తావనలో తెలుగుదేశాన్ని ధనధాన్య సుసంపన్నం కావిస్తున్న తుంగభద్ర, కృష్ణవేణి, పెన్న, గోదావరులు చేరియుండటం గమనార్హం. మూల విధేయంగా అనువాదం సాగినప్పటికీ కవిబ్రహ్మ తిక్కన సోమయాజి "శ్రీయును గౌరినాఁబరఁగు చెల్వకు" అంటూ విరాట పర్వ రచనకు శ్రీకారం చుట్టినది. ఈ పినాకినీ తీరంలోనే గదా!

అట్లాగే "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ" అనే మంగళశ్లోకంతో నన్నయగారు ఆదిపర్వ రచన మారంభించింది ఈ గోదావరీ తటినీ తటంలోనే కదా!

రాఘవుఁడు చిత్రకూటంబు వాసి శరభంగు పాలికిం జని
యతనిచేత సత్కృతుండై దండకారణ్యంబు సొచ్చి
యందు గోదావరీ తీరంబున ననుజవధూ
సహితంబుగా కృతనివాసుండై యున్నంత.

అర. 6-312

అని ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రెగడ అరణ్యపర్వంలో రామాయణ కథా రచన సాగిస్తూ శ్రీరామచంద్రమూర్తికి గోదావరి తీరవాసం కల్పించాడు.

వింటే భారతం వినాలి,తింటే గారెలే తినాలి అనే నానుడికి స్థిర ప్రతిష్ఠ కల్గించిన కవిత్రయం వారి ఆంధ్ర మహాభారతంలో గోదావరీ మహానది దృష్టి దర్పణం కావిస్తుంది.

- ముదివర్తి కొండమాచార్యులు

తి.తి.దే. వారి 'మాతల్లి గోదావరి' నుండి

❖ ❖ ❖

శాసనాలలో గోదావరి

దక్షిణ గంగగా, గౌతమీగంగగా ప్రసిద్ధి చెందిన గోదావరి మహారాష్ట్రలోని సహ్యాద్రి కనుమలలో నాసికాత్ర్యంబకంలో ఉద్భవించి తెలంగాణలో నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల ద్వారా ప్రవహించి అనేక ఉపనదులను తనలో కలుపుకొని రాజమహేంద్రవరం వద్ద ఏడు పాయలై బంగాళాఖాతంలో కలుస్తున్నది. ప్రాణహిత, వైన్‌గంగ, ఇంద్రావతి, శబరి, మంజీరలు గోదావరిలో కలిసే ఉపనదులలో ముఖ్యమైనవి. మరొక ఉపనది కిన్నెరసాని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'కిన్నెరసాని పాటలు' గేయ కావ్యం ఉద్భవించటానికి మూలకారణమైనది. నన్నయ, పోతన, మడికి సింగన వంటి ఎందరో కవులు గోదావరిని ఎన్నో విధాలుగా వర్ణించినారు. ముఖ్యంగా శ్రీనాథ మహాకవి తన భీమేశ్వర పురాణంలో గోదావరి పోకడలను ఇలా వర్ణించినాడు–

సీ. త్ర్యంబకాచల శిఖాగ్రమునందు నుదయించి
పొదలి యార్యావర్తభూమిఁ దటిసి
మలఁగి దండకవనీ మధ్యభాగమున నా
ప్రస్రవణాచల ప్రస్థ మొఱసి
పట్టిన శ్రీవీరభద్రేశు సేవించి
తిలసోమనాథు మందిరము డాసి
యేచి యనంతభోగేశ్వర స్థానంబు
రుద్ర పాదములపైఁ ద్రోవగాఁగ
తే. కోటి పల్లీశు కోమలాంఘ్రులకు మ్రొక్కి
కుండలాముఖ క్షేత్రంబు గుస్తరించి
భీమమండలి దాపలఁ బెట్టుకొనుచు
గౌతమీ గంగ లవణాబ్ధిఁ గౌగిలించె.

ఆంధ్రదేశంలో గోదావరి తీరంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు వెలసినాయి. ఆంధ్రదేశానికి త్రిలింగదేశమని ప్రసిద్ధి. కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానపండితుడు విద్యానాథ మహాకవి శ్రీశైల, ద్రాక్షారామ, కాళేశ్వరాల మధ్యభూమిని త్రిలింగ దేశంగా పేర్కొన్నాడు. వీనిలో కాళేశ్వర, ద్రాక్షారామాలు గోదావరీ నదీ ప్రాంతాలు. గోదావరీ తీర పుణ్యక్షేత్రాలు. ప్రాచీన కాలంనుండి ఎంతో ప్రాచుర్యం పొందినట్లు శాసనాలు ధ్రువీకరిస్తున్నాయి. గోదావరీ పుష్కరాల సందర్భంగా శాసనాలలో గోదావరి, తత్తీరప్రాంత పుణ్యక్షేత్రాల ప్రసక్తిని, గోదావరీ పుష్కరాలను పేర్కొన్న సందర్భాలను సంగ్రహంగా పరిశీలించటమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

కరీంనగర్ జిల్లాలోని మంథెన గ్రామంలోని శాసనం, క్రీ.శ. 1199 నాటిది, కాకతీయ మహారాజు గణపతిదేవుని అనుమతితో చెర్నూరి దేశపాలకుడు అల్లుంప్రోలరాజు మహారాజ పురోహితుడు, త్రిభువన విద్యా చక్రవర్తి బిరుదాంకితుడు అయిన మంచి భట్టోపాధ్యాయునికి గ్రామ, తటాక నిర్మాణానికి గాను, మకరసంక్రాంతి పుణ్యకాలాన, ప్రాణహిత గోదావరీ సంగమ స్థలంలో కొంత భూమిని దానం చేసినట్లు పేర్కొంటున్నది. ఈ దానభూమి సరిహద్దులలో గోదావరి ఒకటి. మంత్రకూటం (మంథెన)లో నృసింహాలయాన్ని నిర్మించినట్లుగా కూడా ఈ శాసనం తెలుపుతున్నది.

కాకతీయ గణపతిదేవ మహారాజు కాలం నాటిదే మరొక శాసనంలో గోదావరీ తీరస్థ కాళేశ్వర గ్రామంలోని కాళేశ్వరాలయ ప్రసక్తి ఉన్నది. ఈ శాసనం కాళేశ్వరం (కరీంనగర్ జిల్లా)లోని ముక్తేశ్వరాలయంలో ఉన్నది. ఆ గ్రామంలోనిదే క్రీ.శ. 1397 నాటి మరొక శాసనం విజయనగర మహారాజు హరిహరరాయల కుమారుడు దేవరాయలు దిగ్విజయ మహోత్సవ సందర్భంగా గౌతమీ (గోదావరీ) తీరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయంలో తులాపూరుషదానం చేసినట్లు తెలుపుతున్నది. ("కుర్వన్ దిగ్విజయోత్సవం హరిహర శ్రీదేవరాయో నృపః శ్రీముక్తేశ్వరధామ్ని ధన్యమహిమాదానం తులాపూరుషం"). తులాపూరుషం షోడశమహాదానాలలో ఒకటి. దాత తన బరువుతో సమానమైన బరువుగల బంగారాన్ని దానం

చేయటమే తులాపూరుషదానం. చక్రవర్తులు, మహారాజులు చేయదగిన దానం ఇది.

పవిత్ర గోదావరీ తీరంలోని పట్టిసం వీరభద్రేశ్వర స్వామి ప్రసక్తి కొన్ని శాసనాలలో ఉన్నది. క్రీ.శ. 1143 సం॥ నాటి ఒక శాసనం "ఉత్తరాయణతిథౌ గోదావరీ సన్నిధౌ శ్రీమత్పట్టిస వాసినే... శ్రీవీరభద్రేశ్వరాయ" అని పేర్కొంటున్నది.

గోదావరీ తీరస్థ ప్రధాన పట్టణాలలో ఒకటైన రాజమహేంద్ర వర ప్రసక్తి పెక్కు శాసనాలలో కనిపిస్తున్నది. ముగ్గుళ్ళ పోతమశెట్టి అనే వైశ్యుడు క్రీ.శ. 1334లో రాజమహేంద్రవరం కోటలో గోపీనాథస్వామి ఆలయంలో రామలక్ష్మణులను ప్రతిష్ఠ చేసి నిత్యనైవేద్యానికి గాను పుట్టెడు పొలం దానం చేశాడు. క్రీ.శ. 1438లో శింగన అనే వ్యక్తి "మృకండేశ్వర దేవరకు ముందటి భద్రమండపమును అందు సుత్తడ్లువున్ను కళ్యాణ మండపమున్ను దేవరకు నానా భరణమున్ను తూర్పు మండపానకు అరంగులోన్ను మధ్యాహ్నపు అవసరానకు" రెండు పుట్ల పొలాన్ని, వాహనాలను సమకూర్చినాడు. ఈ దేవాలయం గోదావరీ తీరంలోనే ఉన్నది. క్రీ.శ. 1850లో రాజా వేంకటరాయనింగారు గోదావరీ తీర పట్టణమైన రాజమహేంద్రవరంలోని "శ్రీవేణుగోపాలస్వామి శ్రీనృసింహస్వామి శ్రీవేంకటేశ్వరాస్వామివార్ల ఆలయములు విమానత్రయము ముఖమంటపం కళ్యాణ మంటపం ప్రాకారం" నిర్మింపచేసినారు.

ద్రాక్షారామం (తూర్పు గోదావరి జిల్లా) త్రిలింగ క్షేత్రాలలో ఒకటి. శ్రీనాథ మహాకవి స్కాందపురాణంలోని గోదావరీ ఖండాంతర్గతమైన ద్రాక్షారామ భీమేశ్వర మాహాత్మ్యమును 'భీమేశ్వర పురాణం' అనే పేరుతో తెలిగించినాడు. మురారి అనర్ఘరాఘవంలో "అన్ధ్రవిషక్ష్మా లక్ష్మ్యా సప్త గోదావరీహారకలాపైక నాయకో భగవాన్ భీమేశ్వరః" అని వర్ణించినాడు. గౌతమీ మాహాత్మ్యములోని సప్తసాగర మాహాత్మ్య కథనంలో–

గౌతమ్యా స్సప్తధాప్రోక్తస్సంగమస్సరితాంపతౌ
తుల్యాత్రేయీ భరద్వాజీ గౌతమీ వృద్ధగౌతమీ
కౌశికీ వసిష్ఠా చ సప్త భాగా ప్రకీర్తితాః

అని తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, వృద్ధగౌతమి, కౌశికి, వసిష్ఠలు సప్తగోదావరులుగా పేర్కొనబడినాయి.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో లభించిన పెక్కు శాసనాలలో సప్తగోదావరి ప్రసక్తి ఉన్నది. క్రీ.శ. 12వ శతాబ్దినాటి ఒక శాసనం సప్తగోదావరి సరిహద్దుగా ఉన్న రెండు వేల పోకమాకులతోపును భీమేశ్వరస్వామికి దానమొనర్చినట్లు తెలుపుతున్నది. అదే శతాబ్దికి చెందిన మరొక శాసనం సప్త గోదావరి సంగమమున శ్రీహరిహరేశ్వరాలయం ఉన్నట్లు తెలుపుతున్నది. క్రీ.శ. 1274 నాటి ఒక శాసనం సప్తగోదావరీ తీరంలోని భీమేశ్వరాలయాన్ని పేర్కొంటున్నది. క్రీ.శ. 1112 నాటి మరొక శాసనం సప్తగోదావరిని పశ్చిమ స్రోతగా వర్ణిస్తున్నది.

గోదావరీ పుష్కరాలకు సంబంధించినంతవరకు ద్రాక్షారామ శాసనాలలో రెండు అత్యంత ప్రధానమైనవి. వీనిలో మొదటి శాసనం క్రీ.శ. 1154 నాటిది. 'సింహ బృహస్పతి' సందర్భంగా ఒక బ్రాహ్మణునికి కొంత భూమిని దానమొసగినట్లు తెలుపుతున్నది. రెండవది క్రీ.శ. 1250లో మహామండలేశ్వర కోన సత్యరాజాదిత్య చోడగంగరాజు 'సింహబృహస్పతి', విష్ణువు సంక్రాంతి పుణ్యకాలాన శ్రీభీమేశ్వర మహాదేవర పడమటి సత్రమునకు భూమిని దానమిచ్చినట్లు తెలుపుతున్నది. ఈ రెండు శాసనాలలోని "సింహబృహస్పతి" గోదావరీ పుష్కరాలను (సింహరాశిలో ఉన్న బృహస్పతి) సూచిస్తున్నది.

క్రీ.శ. 1428లో అన్న మంత్రి ద్రాక్షారామ భీమేశ్వరాల యాన్ని గోపుర మంటపమును నిర్మించినట్లు ఒక శాసనం తెలుపుతున్నది.

'.... శ్రీయన్న మంత్రీశ్వరః ద్రాక్షారామజ భీమలింగ పురతః శ్రీసప్తగోదాతటే ప్రాచీ గోపురమండపం సమకరో ద్రమ్యం శిలానిర్మితం ద్వాదశ సంఖ్యాస్తంభే సదా బహిర్ద్వార మండపే విహరన్ రక్షతు భీమేశాయం శ్రీదేవయ యన్న సచివమాకల్పం'.

క్రీ.శ. 14వ శతాబ్దినాటి తెలుగు పద్యశాసనంలో సప్తగోదావరాన్ని సప్తసముద్రాలతో పోలుస్తూ ద్రాక్షారామ


భీమేశ్వరాలయాన్ని ప్రకాశభారతీ యోగి మనోహరంగా వర్ణించినాడు-

1. అమరాద్రి భీమేశరావా -
2. సమబ్ధి సప్తకము శ్రీస -
3. ప్త గోదావరంబు । వల-
4. యాచలేంద్రంబు వజ్రపు
5. ఊకోట గులపర్వతంబులు
6. గోపురములు । దిరుచుట్టు -
7. మాలియ యరవిందజాం -
8. డ్డమమర్త్య లోకము నాట్య -
9. మంట్టపంబు । పరివారదేవ -
10. తా భవనంబులీ చతుర్దశ భు -
11. వనంబులు దారకములు ।
12. గనక కుంభ తతులు గాంగ
13. దాక్షారామ మన్నవోంతు
14. వేమనానుజుండ్డు । గడు -
15. నపూర్వ శ్రిష్టిగావించి వా -
16. సనకెక్కె శ్రీ వేమసితయశు -
17. ండు ॥ ప్రకాశ భారతీ యోగి
18. కావ్యం । పెద్దనాచార్య లిఖితం.

గోదావరీ తటాన వేంచేసి ఉన్న భద్రాచల సీతారామ లక్ష్మణులు, 'గోదారి తల్లి' ఆంధ్రులకు విడదీయరాని బంధం. మహా యోగులనుండి పామర జనం వరకు, మహాకవుల నుండి జానపద గేయకర్తల వరకూ గోదావరి తల్లి. గోదావరీ పుష్కర పుణ్యకాలంలో ఆ తల్లి ఒడిలో ఓలలాడాలని ఆశించని ఆంధ్రులు ఉండరు.

- ఆచార్య ఎస్.ఎస్. రామచంద్రమూర్తి

తి.తి.దే. వారి 'మాతల్లి గోదావరి' నుండి



వెండితెరపై గోదావరి వెలుగులు

రామాయణంలో సీతారామలక్ష్మణులు పర్ణశాల నిర్మించుకోవడానికి అనువైన ప్రదేశంగా గోదావరీ తీరాన్ని అగస్త్య మహర్షి సూచించాడు. ఋషివంటి నన్నయ గోదావరీ తీరమైన రాజమహేంద్రిలోనే ఆంధ్రమహా భారతానికి శ్రీకారం చుట్టాడు. శ్రీనాథుడు గోదావరీ ప్రాంతంలోని పుణ్యక్షేత్రం మీద ఒక ప్రబంధాన్ని రచించాడు. భావకవులు గోదావరిని పౌరుషానికీ, పావిత్ర్యానికీ నెలవుగా సంభావించారు.

"గోదావరీ **పారనోదార వాఃపుర మఖిల భారతము మాదన్ననాడు....**" కవిసమ్రాట్ విశ్వనాథ ఆంధ్రపౌరుషాన్ని అభివర్ణిస్తే...

"ఉప్పొంగి పోయింది గోదావరీ– తాను తెప్పున్న యెగిసింది గోదావరీ...!" అంటూ బాపిరాజు వరద గోదావరి పరవళ్లను చూసి పొంగిపోయాడు. అనంతరం గోదావరీ సౌందర్యానికి ముగ్ధులై ఆ అనుభూతులకు పద్యాలలోను, వచన కవితలలోను, పదాలు కట్టిన, కడుతున్న ఆధునిక కవులెందరో!

ఇందరి రసహృదయాలను దోచుకున్న గోదావరి అందాలకు చిత్రపరిశ్రమ మాత్రం స్పందించకుండా వుంటుందా? ఎటొచ్చీ తెలుగు టాకీ ప్రారంభమైన ముప్పయ్యవ దశకం ప్రధానంగా నాటక పరివర్తనల యుగం కనుక, ఆ తర్వాత వచ్చిన నలభయ్యేవ దశకంలో ఎక్కువగా సంస్కరణల మీద స్వాతంత్ర్యోద్యమం మీద పరిశ్రమల దృష్టి కేంద్రీకరించింది కనుక – ఆ ఇరవయ్యేళ్లు తెలుగు చలనచిత్ర పరిశ్రమ గోదావరి వైపు చూడలేదు. అయితే ఆ కాలంలో వచ్చిన "లవకుశ" లో గోదావరిని చిత్రీకరించారనీ, దానిలో పొరపాటువల్ల రైలుబ్రిడ్జి కూడా కనిపించిందనీ ఇంటూరి వెంకటేశ్వరరావు చెప్పారు.

తెలుగు సినిమా పాటల్లో మొదటిసారి గోదావరి ప్రసక్తి 'మరదలు పెళ్లి' (1952) చిత్రంలో--

'పిలిచె గోదారొడ్డు, నోరూరించె బందరులడ్డు' అనే శ్రీశ్రీ పాటలో కనిపిస్తోంది.

ఇలాంటివి ఆ తర్వాత 'చిరంజీవులు' చిత్రంలో--

నీ ఆశ ఆడియాస, నీ బ్రతుకు అమవాస...
కన్నులలో గోదారి కాలువలే కట్టింది. – ఆరుద్ర



'పెద్దమనుషులు' చిత్రంలో –

కుక్కతోక పట్టి గోదావరీదితే
కోటిపల్లి కాడ తేలేనయా – కొసరాజు

మొదలైన పాటల్లో వచ్చినా, ఇవి కాకతాళీయాలు తప్ప గోదావరి ఔన్నత్యాన్ని వర్ణించడానికి ఉద్దేశించినవి కావు.

దేశభక్తి గీతాలలో నదుల ప్రాశస్త్యం ఒక భాగం కావడం – భావగీతాల నుంచి సినిమా పాటలకు కూడా ఒక ఒరవడిగా వచ్చింది. ఆ ధోరణి 'పల్లెటూరు' చిత్రంలో వాడుకొన్న వేములపల్లి శ్రీకృష్ణరచన --

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!....'లో

'కల్లోల గౌతమి, వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్ర తల్లి పొంగి పొరలిన చాలు...!'

అనే పంక్తులలో కనిపిస్తుంది.

కొసరాజు 'కన్యాదానం' (1954) చిత్రం కోసం రాసిన 'ఓరోరి తెలుగువాడ, ఒయ్యారి తెలుగువాడ....!' నృత్యరూపకంలో--

తుంగభద్ర కృష్ణవేణి, పొంగు లెత్తు గోదావరి
ముంగిట్లో తిరుగుచుండె, బంగారం పండుచుండె...!

అనే పంక్తుల్లో నదులవల్ల తెలుగునేల ఎలా సస్యశ్యామలమైందీ చెప్పే ఘట్టంలో కూడా ఇలాంటి భావనే కనిపిస్తుంది.

'పెళ్లినాటి ప్రమాణాలు' చిత్రం కోసం పింగళి రచించిన –

శ్రీమంతురాలివై చెలువొందు మాతా
మమ్ము దీవించుమా మా ఆంధ్రమాతా
కృష్ణ గోదావరీ హంద్రి నాగావళీ
తుంగభద్ర పెన్న నదుల పుణ్యమున....!

అనే పాట కూడా పై కోవకు చెందినదే!

ఈ బడికి చెందిన మరో ప్రసిద్ధ గీతం ఎన్నో సినిమాలలో వినియోగించుకోవచ్చు--

మా తెలుగు తల్లికి మల్లె పూదండ
మా కన్న ల్లికి మంగళారతులు
గలగలా గోదారి కదిలి పోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి.

అనే శంకరంబాడి సుందరాచారి తెలుగుతల్లిని అభివర్ణిస్తూ అల్లిన మల్లెపూల మాల!

ఈ సంప్రదాయానికి సంబంధించిన పాటల్లో మకుటాయమానమైంది -- 'విచిత్ర కుటుంబం' చిత్రం కోసం డా. సి. నారాయణరెడ్డి ఆంధ్రప్రదేశ్ పురా వైభవాన్ని నదులు ప్రాతిపదికలుగా వర్ణిస్తూ రాసిన పాట. కథానాయకుడు విదేశీ వనిత అయిన నాయికను తెలుగునాట జీవనదుల్లో జలకాలాడించే సందర్భాన్ని తీసుకొని కవి గోదావరి, కృష్ణ తుంగభద్రలను ఎన్నుకొని, మొదటి చరణం గోదావరిపై రాశారు–

ఆదికవి నన్నయ్య అవతరించిన నేల
తెలుగు భారతి అందియలు పల్కె ఈ నేల
ఆంధ్ర సంస్కృతికీ తీయని క్షీరధారలై
జీవకళ లొలుకు గోదావరీ తరంగాల....
ఆడవే జలకమ్ము లాడవే....

అనే ఈ చరణంలో 'క్షీరధారలు' అనే ప్రయోగం గురించి కవే వివరణ ఇచ్చాడు. నీరం కంటే క్షీరం జవవర్ధని గనుక తెలుగుభారతి శైశవ దశలో వున్నప్పుడు వెలువడిన మహాభారతం పాలు ఒంటబట్టి వర్ధిల్లిందని కవి అభిప్రాయం. ఇలాంటి పాటల్లో కొలత కుదరకపోతే తప్ప దక్షిణాది నదులలో సాధారణంగా గోదావరికే అగ్రతాంబూల మివ్వడం గమనార్హం.

గోదావరికి చెందిన మిగతా పాటల పాయల్ని పరిశీలించే ముందు – గోదావరీ సౌందర్యాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించిన తొలి చిత్రం గురించి ప్రస్తావించాలి. అంతకుముందు 'ఇలవేలుపు' మొదలైన చిత్రాలకోసం గోదావరీ తీరంలో అడపాదడపా ఔట్‌డోర్ షూటింగ్ జరిగినా, గోదావరి నేపథ్యంలోని కథను ఎన్నుకొని మాటల్లో, పాటల్లో చిత్రీకరణలో గోదావరితో పూర్తిగా ముడిపడిన మొదటి చిత్రం 'మూగమనసులే!' ఈ చిత్రాన్ని తమిళంలో 'ప్రాప్తం' గాను, హిందీలో 'మిలన్'గానూ పునర్నిర్మించినపుడు కూడా గోదావరి మీదే చిత్రీకరణ జరిగింది. అయితే గోదావరి జిల్లావాడైన ఆదుర్తికి అది అచ్చిరాగా, మహానటి సావిత్రికి ఆ 'ప్రాప్తం' లేక ఆర్థికంగా ఘోరంగా దెబ్బతింది. అది వేరే సంగతి!

1963లో కోటిపల్లి, నర్సాపురం రేవుల్లో 'మూగమనసులు' షూటింగ్ జరిగినప్పుడు ఒకటే సందడి. అభిమానులతో ఆ ప్రదేశాలు తిరునాళ్ల లయ్యాయి. ఆ ముచ్చట్లను ఇప్పటికీ కలబోసుకొనే వారెందరో! ఒక మాటలో చెబితే ఆ చిత్రం ఓ సంచలనం!

ఆ చిత్రంలోని --

గోదారి గట్టుంది, గట్టుమీద చెట్టుంది
చెట్టు కొమ్మన పిట్టుంది, పిట్టమనసులో ఏముంది!

అనే దాశరథి పాట నానని నోరులేదు!

అహ నీ ముక్కుమీద కోపం నీ ముహానికే అందం!
నా పాట నీ నోట పలకాల సిలకా....!!

అంటూ ఆత్రేయ తన పాటల్లో గోదావరి పరవళ్లను పాత్రలతో ప్రత్యక్షంగా అన్వయించగా, తక్కిన పాటల్లో ఆ పరిసరాలను అత్యద్భుతంగా చిత్రీకరించారు.

తల్లీ గోదావరికి ఎల్లువొస్తే అందం
ఎల్లువంటి బుల్లోడికి పిల్ల గౌరి బంధం

నా నీడ సూసి నువు కిలకిలా నవ్వాల
పరవళ్ల నురుగుల్ల గోదారి ఉరకాల

వంటి పంక్తులలో అచ్చమైన వలపును గోదావరి పరవళ్లలో మనోహరంగా ప్రతిబింబింప జేయడం గమనిస్తాం. **'ఈనాటి ఈ బంధ మేనాటిదో'** అని ఆత్రేయ అన్నట్లు – 'మూగమనసులు' పేరు చెబితే చాలు గోదారి గుర్తొస్తుంది. ఆ గోదారి పేరు చెప్పగానే గుర్తొచ్చే రమణీయ దృశ్యకావ్యం మూగమనసులే!

ఆ తర్వాత 'తల్లీ గోదావరి' పేరుతో ఒక చిత్రమే తీసినా అది అంతగా జనాదరణకు నోచుకోలేదు. 'మూగమనసులు'కు నకలు అనదగ్గ 'జానకిరాముడు' కూడా గోదావరీ నేపథ్యంలో తీసిందే!

'మూగమనసులు' తీసిన మరుసటి ఏడే నిర్మించిన 'అనుపమా' వారి 'ఉయ్యాల-జంపాల' చిత్రంలోని కొంత భాగం గోదావరి పరిసరాల్లో చిత్రీకరించిందే.

ముఖ్యంగా ఆ చిత్రం కోసం ఆరుద్ర రాసిన --

కొండగాలి తిరిగింది, గుండె వూసులాడింది
గోదావరి వరదలాగా కోరిక చెలరేగింది

– అనే పడవపాట విస్తృత ప్రచారాన్ని పొందింది.

గోదావరి ప్రాంతీయుడైన ఆదుర్తి గోదావరికి 'దారి' చూపించగా, ఆ తర్వాత పరిశ్రమకు చెందిన ఎందరో అభిరుచిగల దర్శకులు దానిని విజయానికి రహదారిని చేసుకొన్నారు. వారిలో బాపు, విశ్వనాథ్, రాఘవేంద్రరావు, క్రాంతికుమార్, జంధ్యాల, వంశీ పేర్కొనదగ్గవారు.

బాపు చిత్రాలలో 'సాక్షి' కథా స్థలం గోదావరి పాయలకూ, కాలువలకూ మధ్య వున్న ఓ చిన్న లంక అయితే, 'అందాల రాముడు' వేదిక రాజమండ్రి నుండి భద్రాచలం వెళ్లే లాంచియే! 'అదిగో భద్రాద్రి గౌతమి, ఇదిగో చూడండి!' అంటూ విభిన్నమైన పాత్రలతో, భద్రాచల యాత్ర నెపంతో గోదావరి పొడవునా వుండే రమణీయ ప్రకృతికి అద్దం పట్టిన అందమైన ప్రయోగం 'అందాల రాముడు!' ఇంకా 'బుద్ధిమంతుడు', 'ముత్యాలముగ్గు', 'గోరంతదీపం', 'వంశవృక్షం' మొదలైన బాపు చిత్రాలు ధవళేశ్వరం, పులిదిండి రేవు – ఇత్యాది గోదావరీ పరిసర ప్రాంతాలలో రూపుదిద్దుకొన్నవే. 'ముత్యాలముగ్గు'లో 'ఇషాన్ ఆర్య' గోదావరి అందాలను వెండితెరపై అద్దిన తీరు ఓ కలంకారీ విద్య లాంటిది! ఆ చిత్రంలో శేషేంద్ర శర్మ ఉత్తర రామాయణాన్ని సోషలైజ్ చేస్తూ రాసిన –

'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది...!' లోని
**'కొమ్మల్లో పక్షుల్లారా, గగనంలో మబ్బుల్లారాఃఃః

అనే పంక్తులు ఒక మహాకావ్యాన్ని స్ఫురింపజేస్తాయి. అలాగే–

'ఎదో ఎదో అన్నది గూటి పడవలో చిన్నది...!' అనే ఆరుద్ర గీతం ఒక మాధుర్య ప్రవాహంలా సాగిపోతుంది.

'విశ్వనాథ్', 'జీవనజ్యోతి', 'సప్తపది', 'స్వాతిముత్యం', 'ఆపద్బాంధవుడు' 'శంకరాభరణం', 'స్వాతికిరణం' మొదలైన చిత్రాలను గోదావరి ఒడిలోనే చిత్రీకరించారు. 'స్వాతిముత్యం' లోని **'సువ్వీ సువ్వీ సువ్వాలమ్మ'** అనే పాటలోని అడుగుల చిందులకు దోహదం చేసింది గోదావరీ సైకతమే! పోలవరం, పట్టిసీమ, పాపికొండలు మొదలైన అందమైన ప్రాంతాలు విశ్వనాథ్ చిత్రాల్లో కనువిందు చేస్తాయి.

'దేవత', 'త్రిశూలం', 'జానకిరాముడు', 'పెళ్లి సందడి' వంటి రాఘవేంద్రరావు చిత్రాల్లోని పాటలు గోదావరీ నేపథ్యంలోనే తెరకెక్కాయి.

'దేవత' చిత్రంలోని – **'ఎల్లువొచ్చి గోదారమ్మ ఎల్లాకిల్లా పడ్డాదమ్మా'** అనే వేటూరి పాట దొడ్డవరం రేవులో తీసిందే!

అభ్యుదయ చిత్రాల దర్శకుడైన క్రాంతికుమార్, హాస్య ప్రియుడైన జంధ్యాల కూడా గోదావరి ఆకర్షణ నుంచి తప్పించుకోలేక పోయారు. క్రాంతికుమార్ 'సీతారామయ్య గారి మనుమరాలు', 'ప్రవంతి', 'గౌతమి' వంటి చిత్రాలకోసం జంధ్యాల 'సీతారామ కల్యాణం', 'మూడుముళ్లు' వంటి చిత్రాల కోసం ఔట్‌డోర్ షూటింగ్‌కు గోదావరినే ఆశ్రయించారు.

ఆదుర్తిలాగే 'వంశీ' కూడా గోదావరి జిల్లావాడు, ఆపైన రచనాసక్తి గల భావుకుడు కావడంవల్ల తన మొదటి చిత్రం 'సితార' నుంచి ఇంతవరకు అవకాశం వస్తే చాలు.... ఔట్‌డోర్ షూటింగ్ కోసం రాజమండ్రి, రాజోలు పరిసరాలనే ఎక్కువగా ఎంచుకొన్నాడు. దర్శకుని అభిరుచికి వేటూరి భావనాబలం తోడై వంశీ చిత్రాల్లోని పాటల్లో అద్భుతమైన భావచిత్రాల సృష్టి జరిగింది.

వెన్నెల్లో గోదారి అందం
నది కన్నుల్లో కన్నీటి దీపం. – సితార

ఒయ్యారి గోదారమ్మా, ఒళ్లంతా
ఎందుకమ్మా కలవరం
కడలి ఒడిలో కలిసిపోతే కల వరం! – ప్రేమించు పెళ్ళాడు

గోదావరిమీద చిత్ర దీపాలను వెలిగించిన రచయిత లందరూ అంతకుముందే సాహిత్యరంగంలో లబ్ధ ప్రతిష్ఠులైన ఆత్రేయ, ఆరుద్ర, వేటూరి, సి. నారాయణరెడ్డి వంటివారే కావడం విశేషం.

ఆరుద్ర 'ఆంధ్రకేసరి' చిత్రంకోసం రచించిన –

'వేదంలా ఘోషించే గోదావరి
అమరధామంలా భాసించే రాజమహేంద్రి!'

అనే గీతం గోదావరి పావిత్ర్యాన్ని, రాజమండ్రి పూర్వవైభవాన్ని, ఆంధ్రమహా భారతావతరణాన్ని, వివరిస్తూ తెలుగువాడి గర్వాన్ని అతిశయింప జేస్తుంది.

కొట్టుకొని పోయే కొన్ని కోటి లింగాలు
వీరేశ'లింగ' మొకడు మిగిలెను చాలు...

అనే పంక్తుల్లోని శ్లేష వీరేశలింగం పంతులుగారి ఘనతకు నీరాజనం పడుతుంది, సహృదయులను పులకింపజేస్తుంది.

'వేటూరి' వివిధ సందర్భాలలో గోదావరిని 'పయ్యెద'గా 'పూలజడ'గా, 'పూదారి'గా వివిధ రూపాలలో మనోహరంగా చూపించారనడానికి....

నా వాలుజడ కృష్ణవేణి
నా పూలజడ వెన్నెల గోదారి. – అమెరికా అల్లుడు

గోదారి నీ పయ్యెద
కృష్ణ నీ వాల్జెడ. – సరిగమలు

గోదారి ఫ్లాసులు

వీరభద్ర సంబరం

కొన్ని కుటుంబాలలో పెళ్లికి ముందు 'వీరభద్ర సంబరం' జరుపుతారు. ఇది వీరభద్రుని పూజ అయినా అంతా ఒక రకమైన నృత్యవిధానంలో సాగుతుంది. శివుడు నాట్యానికి అధిదేవుడు. ఆయనను రుద్రునిగానూ, వీరభద్రునిగానూ ఆరాధిస్తారు. రుద్రుడుగా ఆయన ప్రళయతాండవం చేశాడు. దక్షయజ్ఞ సమయంలో వీరభద్రుడు రుద్రుని ప్రళయ తాండవాన్ని తలపింపజేశాడు. ఈ సంబరంలో ఉధృతంగా వీరణం, తాసా మర్ప వంటి వాద్యాలను వాయిస్తారు. కత్తిగాని, బెత్తంగానీ ధరించి, శైవులు శరభ, శరభ, తశ్శరభ, శరభ అని వీరావేశంతో నృత్యం చేస్తారు. ఈ సంప్రదాయం ఇప్పటికీ సజీవంగా వుంది. కొన్ని ప్రాంతాలలో దీనిని 'వీరభద్ర పళ్లెం ఎత్తడం' అని వ్యవహరిస్తుంటారు.

ఎడారిలో కోయిలా తెల్లారనీ రేయిలా
పూదారులన్నీ గోదారి కాగా – పాడింది కన్నీటపాట.

– పంతులమ్మ

వంటి పంక్తులెన్నింటినో చెప్పుకోవచ్చు. వేటూరి జన్మస్థలం కృష్ణా అయినా, గోదావరి మీద మమకారంతో వైవిధ్యభరితంగాను, సంఖ్యాపరంగాను ఎక్కువ పాటలు రాసినందుకు ఆయన అభినందనీయులు.

గోదావరి పేరు చెప్పగానే పోలవరం, పాపికొండలు, పట్టిసీమ, కోనసీమ, కోటిలింగాలు... మొదలైన ప్రదేశాలు స్ఫురిస్తాయి. వీటిని వివిధ చిత్రాలలో నయనపర్వంగా చిత్రీకరించడంతో పాటు కొన్నింటిని పాటలలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. అలా పాపికొండలను ఒరుసుకొని ప్రవహించే గోదావరి కేంద్రంగా అల్లిని గీతాలలో–

పాపికొండల కాడ పాలమబ్బుల కాడ
పట్టలేక దూకింది పడుచు జింక – దానికి
పగ్గం వేసే మొనగాడే లేడింక.... – అమ్మకోసం

అనే సి. నారాయణరెడ్డి రచన ప్రణయగీతం కాగా –

పాపికొండల వెనుక
పాపంటి మనసున్న జాబిల్లి వున్నాడనీ
చల్లని కబురొచ్చెనే – నా
జంకంత విడిపోయెనే! –ఆడాళ్లూ మీకు జోహార్లు

అనే ఆత్రేయ రచన కథానాయకునిపై నాయికకు అపోహ తొలగిన సందర్భాన్ని వివరించే పాట!

గోదారి గోలనే వింటారు
గుండెలోపల యెవరు చూస్తారు

అనే పాటలోని పంక్తులు గోదావరి హృదయ శైతల్యాన్ని, అంతస్సౌందర్య తత్త్వాన్నీ ఆవిష్కరిస్తాయి.

గోదావరి ఓ జీవనది. ఆ నదితో అనుబంధమేర్పడిన వాళ్లెవరూ ఆ అనుభూతుల్ని మర్చిపోలేరు. చిత్రపరిశ్రమకు కూడా దీనికి మినహాయింపు కాదు. అందుకే ఈ శతాబ్దంలో కూడా గోదావరిమీద–

గోదావరి రేవులోన రాదారి నావలోన
నా మాటే చెప్పుకొంటూ వుంటారట....! – రుక్మిణి
నిండు గోదారి కదా నా ప్రేమ – నీవు లేక నేను లేను
గోరువంక గోదారి వంక – కబడ్డీ కబడ్డీ

వంటి పాటలు వస్తూనే వున్నాయి. ఈ ప్రవాహం ఆగదు!

గోదావరీ తీరం ఓ వెన్నెల హారం. ఇక్కడి ప్రకృతి అందానికి ఆకృతి. ఈ సీమలో అడుగుపెట్టే మనుష్యులకు ప్రతిరంభాతరువు ఒక రంభా తరుణై స్వాగతం చెపుతుంది. ముచ్చట గొలిపే కొబ్బరి మిద్దు గుమ్మల బృందం పూర్ణకుంభాలతో ఎదురొస్తుంది. పావన గౌతమీనది పాదాలకు నీళ్లిస్తుంది. కోనసీమ కోయిలలు ఆహ్వానం పలుకుతాయి. పండితరాయల వారసుల వేద పనసలు గోదావరీ శ్రుతితో శ్రావ్యంగా వినిపిస్తాయి. తేనె పనసలు, చక్కెర కేళీలు అమృతాన్ని తలపింపజేస్తాయి. పడవ సరంగుల పాటల జానపద జావళీల తీయదనాన్ని రుచి చూపిస్తాయి.

ఇంత హృద్యమైన గోదావరీ సీమ సోయగాలు చూస్తే ఎవరి కళ్లు మాత్రం చెదరవు? తెలుగుదనానికి బొమ్మ కట్టడానికి పూనుకొనే ఏ చిత్ర దర్శకులు గోదావరీ లావణ్యాన్ని స్పృశించరు? కాని ఎంతమంది కళా తపస్వుల కళ్ల కెమేరాలు బంధించినా – వెండితెర పట్టని అందాలూ, చందాలూ గోదావరి సొంతం!

-పైడిపాల

తి.తి.దే. వారి 'మాతల్లి గోదావరి' నుండి

గోదారి ఘాట్లు

కైవార నర్తనం

పూర్వం ప్రతి ప్రధాన ఆలయంలోనూ, షోడశోపచార పూజలలో భాగంగా నృత్యపూజ కూడా వుండేది. ఇందులో కేళికలు, కైవార నర్తనాల వంటివి చేరి వుండేవి. కైవార నర్తనంలో పాడే కీర్తన, ఆ ఆలయ మూల వరులను స్తుతిస్తూ, ఆయనకే అంకితంగా వుంటుంది. దానికనుగుణంగా నాట్యం చేస్తారు. ఇది అభినయప్రాధాన్యం కల నాట్యవిశేషం.

రాజరాజు ఇష్టదైవం వేణుగోపాలస్వామి. ఆ రోజుల్లో కైవార నర్తనంలో పాడుతూ వుండిన ఒక కీర్తన: 'రారా మా యింటికి కృష్ణయ్య' అని మొదలై, 'భువి రాణ్మహేంద్ర పురమున వెలసిన వేణుగోపాల దేవా! వేగరారా బ్రోవా' అని ముగుస్తుంది.

జానపద సాహిత్యంలో గోదావరి సొరభాలు

తత్రైవ గంగా, యమునా చ వేణీ
గోదావరీ సింధు సరస్వతి చ
సర్వాణి తీర్థాని వసంతి తత్ర
యత్రాచ్యుతోదార కథాప్రసంగః

భగవన్నామ తీర్థాల్లో గోదావరి ఒకటి. ఎక్కడ భగవాన్ అచ్యుతుడి హరికథలు చెప్పబడతాయో అలాంటి స్థలాల్లో గంగ, యమున, వేణీ, గోదావరి, సింధూ, సరస్వతి నదుల లాంటివి పవిత్ర తీర్థాలవుతాయి.

'దక్షిణ గంగ నాఁ దద్దయు నొప్పిన గోదావరియు....' అని నన్నయ తన మహాభారతం (ఆది 8-139)లో గోదావరిని దక్షిణ గంగగా అభివర్ణించాడు.

'గోదావరి' - దీని అసలు పేరు 'గోదా' నది. ఆ నదికి ఉపనదిగా 'శబరి' అనేది కలవడం వల్ల 'గోదాశబరి' అయిందట. క్రమంగా అది 'శబరి'లోని 'శ' వర్ణాన్ని వదలిపెట్టి 'గోదాబరి' అయిందనీ, వ, బలకు, ఉన్న అభేత్వం వల్ల 'గోదావరి'గా మారి 'గోదారి' అయిందని అంటారు.

'పోసయతీతి పుష్కరం' - మేషం ఇత్యాది పన్నెండు రాశుల్లో వరుసగా గురువు సంచరించే సమయమే నదులకు పుష్కరకాలం. ఈ సమయంలో ముక్కోటి దేవతలు ఆయా నదులకు సన్నిహితంగా ఉంటారట. అందుకనే పుష్కరస్నానం శ్రేష్ఠమైంది, అతి పవిత్రమైంది.

జానపదులకు పుష్కరాల సమయం వేడుక సమయం. ఎంతో సంబరపడిపోతుంటారు. గోదావరి పుష్కరాలకు వెళ్ళిన ఓ పడుచుపిల్ల ఒయ్యారంగా తనవింత అనుభవాలను ఇలా చెప్తోంది.

గోదావరి పుష్కరాల వింతలు
దొడ్డమ్మ గోదావరి పుష్కరాల వింతలు
గోదావరి పుష్కరాలు చూదామని పోతుంటే
కొత్త నీటి కుదుపులకు కోక చెంగు బురదలకు
కొప్పులోన కొత్త సవరం
కొట్టుకో పోయిందో లమ్మ

(గోదావరి సీమ జానపద కళలు, వేడుకలు, పుట - 160)

అలాగే మరో వయ్యారి ఇలాంటి భావాన్నే ఈ క్రింది గేయంలో వ్యక్తం చేస్తోంది.

గోదావరి పుష్కరాల ఇంతలూ
కోటిలింగాల కాడ
కొడుకుని కోసం నేను
కోరి నేను తానం చేతంటే
కొప్పు నున్న కొత్త సవరం
కొట్టుకు పోయిన గంగమ్మా
గంగమ్మా పొంగి రాకమ్మా
నువు పొంగి పొరలి వడ్తేనే
ప్రజలు అడిలి పోతారు

శ్రామిక గేయాలు శ్రమను మరపింపజేస్తాయి. ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ కల్గిస్తాయి. 'గోదావరీ తల్లీకి గొజ్జంగి పూదండ' అంటూ పడవలాగే వాళ్ళు ఆయాసం తెలీకుండా రాత్రనక, పగలనక పనిచేస్తూ పాడుకొంటారు.

'ఏరుదాటియ్యరా జాలరన్నా' అంటూ ఓ యువతి ఇలా దీనంగా ఓ జాలరన్నను ప్రాధేయపడుతోంది.

అన్నా ఓరన్నా - ఓ జాలరన్న
ఏరుదాటియ్యరా - జాలరన్న
పొంగి పొరలోత్తుంది - జాలరన్న
వరదా నీరోత్తోంది - జాలరన్న
ఒడ్డుకు సేర్చరా - జాలరన్న
ఏటవతల మాయిల్లు - జాలరన్న
ఎప్పుడెల్లి సేరుతానా - జాలరన్న
చీకటి పడిపోతనాది - జాలరన్న
ఒంటరి ఆడకూతుర్ని - జాలరన్న
గోదారి గట్టునా - జాలరన్న
మా గుడిసెలున్నాయి - జాలరన్న

మా గుడిసెలున్నాయి – జాలరన్న
ఏను పొంగిందంటేను – జాలరన్న
గంగ పాలైపోతాయి – జాలరన్న
కనికరించి యిడువురా – జాలరన్న
మళ్లీ వచ్చి మాటాడతా – జాలరన్న
మంచిగ్గ నిను చూసుకుంట – జాలరన్న
నను ఏరు దాటియ్యరా – జాలరన్న

శ్రామికులు చాపలల్లుకొనేటప్పుడు పాడే జానపద గేయంలో గోదావరి ప్రసక్తి వస్తుంది చూడండి.

గోదావరొడ్డునా కొయ్యతాడి చెట్టో
ఎక్కండీ కొయ్యితాడి – కొట్టండీ మోపులో
రింగో జాణా యశో గౌరో జాణా!
.....
..... (త్రివేణి పుట. 21)

జానపద వీరగాథలలో అల్లూరి సీతారామరాజు కథ ప్రసిద్ధి చెందింది. ఇది తెలుగు సాహసిక వీరునికథ. ఆంగ్లేయుల పరిపాలనలో అట్టుడిగిపోయిన తెలుగుతల్లి తన సహజ వీర మాతృత్వాన్ని కోల్పోవలేదనడానికి ఈ కథాగేయం సాక్ష్యం. వీర గుణోత్కర్ష ఈ కథాగేయంలో అడుగడుగునా కన్పిస్తుంది. గోదావరి తీర ప్రసక్తి ఇందులో కన్పిస్తుంది.

శ్రీలలరారెడు తెనుగు దేశమున జీవనదులు గలవు;
మేలురకపు మైదానములడవులు వేలగనులు గలవు;
మేదిని చరిత్ర ప్రసిద్ధికెక్కె మన గోదావరి తల్లి
గోదావరి తీరంబున అడవులు కొండలెన్నో గలవు;
.....
.....

– ఇలా కథారంగస్థలాన్ని కళ్ళకు కట్టేలా వర్ణించే సమయంలో గోదావరి ప్రసక్తి కన్పిస్తుంది.

అలాగే ఈ కథా గేయంలోనే సీతారామరాజు అలౌకిక సౌందర్యాన్ని వర్ణించే సమయంలో కూడ గోదావరి ప్రసక్తి కన్పిస్తుంది.

బాలసూర్య తేజస్సంపన్నుండపార బుద్ధి బలుడు,
బాలయోగి, ధవళాంబుజనేత్రుడు, బాహుబలుడు, త్యాగి
నిరుపమాన గుణ రూప విలసితుం డరిజన భీకరుడు,
కరుణారస భర భరిత స్వాంతుడు, కాషాయంబరుడు
కొండ కోనలందొంటిగ తిరుగుచు కోదండము బూని
చెండాడుచు మారీచుల నీచుల, క్షేమంకరుడైన
సీతారాముండేమోనన మన సీతారామరాజు
ఆ తరుణంబున గోదావరి నదికరుగుచు.....

ఇలా గోదావరికి సంబంధించిన గేయాలు అనేకం ఉన్నా కథా గేయాలు, కథలు వ్రేళ్ళమీద లెక్కించేవిగా ఉన్నాయి.

సామెతలు, జాతీయాల్లో గోదావరి ఎలా చోటు చేసుకుందో చూద్దాం.

అలి మాటలు విని అన్నదమ్ములరోసి
వేరె పోవువాడు వెర్రివాడు
కుక్కతోక బట్టి గోదావరీదునా

అన్న వేమన పద్యంలోని మూడోపాదం 'కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్టు / దాటినట్టు' అని సామెత ముద్రను వేసుకొంది. ఇలాగే మరికొన్ని సామెతలు

గోదావరి స్నానానికి కొండు భట్లు అనుజ్ఞ కావాలా?
గోదావరి పారినా, కుక్కకు గతుకు నీళ్ళే
గోదావరీ పారింది, గొద్దెలేరూ పారిందీ
లంక మేత గోదావరి ఈత – ఇత్యాది

కొన్ని జాతీయాలు :

గోదావరి గలుపు = వెచ్చపెట్టు
గోదావరి పాలు చేయు = గోదావరి గలుపు
గోదాట్లోకి పోవు
గోదారి లంకలో వుండు – ఇత్యాది.

ఇలా ఈ జీవనది గోదావరి తన ఉనికిని తెలుగు జానపద సాహిత్యంలో నిలుపుకొంటోంది. ఎన్ని తరాలు మారినా, గోదావరి తరంగాలు జానపదుల హృదయాలను తాకుతూనే ఉంటాయి, తన్మయత్వంలో ఓలలాడిస్తూనే ఉంటాయి.

– డా॥ జి.ఎస్. మోహన్

తి.తి.దే. వారి 'మాతల్లి గోదావరి' నుండి

నదీ పర్వం – పుష్కర, కుంభమేళా

గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి ।
నర్మదా సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు ॥

గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి అనే ఏడు నదులనూ మనం నిత్యం స్మరిస్తూ స్నానం చేస్తే మనం ఇంట్లోనే స్నానం చేస్తున్నా ఆ పుణ్యనదులలో స్నానం చేసిన సత్ఫలితం లభించటం తథ్యం. అయితే ఈ సప్త నదులే కాక మనకు ఇంకా అనేక మహానదులు, ఉపనదులు కూడా ఉన్నాయి,. అసలు ఈ నదులు ఎలా ఆవిర్భవించాయో చూద్దాం.

సృష్టి చేద్దామనుకొన్న భగవంతుడు తపస్సును ఆరంభించాడు. ఆ తపస్సుకు తప్తుడు కాగా అతని లలాటంపై ఆర్ద్రత ఏర్పడింది. ఆ ఆర్ద్రతని లేదా తడిని లేదా ద్రవ్యాన్ని సువేదం అని సంబోధించాడు. అదే స్వేదంగా మారింది. ఆ తపస్సు మరింతగా సాగింది, అతని శరీరమందు గల రోమకూపాలనుండి స్వేద ధారలు స్రవించాయి. అవి నాలుగు దిశలా వ్యాపించాయి. అంతట భగవంతుడు ఈ జ్వలంతోనే సృష్టిని వ్యాపించి ఉంటానని సంకల్పించాడు. అందుకే జలానికి 'ఆపః' అనే పేరు వచ్చింది. ఈ ఆపః అనే పదం 'ఆప్ల వ్యాప్తౌ' అనే ధాతువు నుండి నిష్పన్నమైనది. వ్యాపకశీల మైనదని, ఈ ధాతువు యొక్క అర్థం. పరబ్రహ్మ స్వరూపమగు ఓంకారము యొక్కనిష్పన్నం కూడా ఈ ఆప్లధాతువు నుండి జరగడంవల్ల జలానికి ఉన్న మహిమ మరింతగా ఇనుమడిస్తుంది.

జలమే సర్వజీవరాశికి ఆధారం. జలమే లేకపోతే ఏ జీవి జీవించలేదు. పంచభూతాలలోనే అత్యంత శ్రేష్ఠమైనదిగా జలాన్ని పేర్కొనటం జరిగింది. ఈ యావత్ సృష్టికి పర్వం జలం మాత్రమే ఉన్నదని 'బృహజ్జాలబాల ఉపనిషత్' పేర్కొంటున్నది.

గోపథ బ్రాహ్మణం ..... పంచానామపి భూతానాం ఆపః శ్రేష్ఠత్వమాగతః

ఆపోవా ఇదమాసన్ సలిలమేవ। తదభ్య శ్రయ్యదభ్య తపత్ సమతపత్ లలాటే స్నేహో యదార్ద్ర జాయత సువేదమ విదామహా ఇతి తస్మాత్ సువేద భవస్తంవా ఏతం సువేదం సన్తం స్వేదమిత్యా చక్షతే అంటూ జలప్రాశస్త్యాన్ని, జలావిర్భావాన్ని గూర్చి తెలిపినది.

భగవంతుడు తన స్వేదధారల జలాన్ని సృష్టించి అందులో తన ప్రతిబింబాన్ని చూసుకొన్నాడు. ఆ సమయంలో భగవానుని బీజభూతమైన వీర్యం ఉప్పునీరుగాను, సముద్రంగాను, మధురజలంగానూ మారింది. అనంతరం ఆ జలం నుండే భగవానుడు ఈ భూమ్యాదులను సృజించాడు. ఆవిధంగా సృష్ట్యాది యందు జలమే జగత్కారణరూపమై, చరాచరాలకు తల్లియైంది. కనుకనే ఈ జగమంతా జలరూపమేనని జలము



సర్వదేవతా స్వరూపమని, దేవతలకు ప్రీతి కలిగించేది జలమేనని వేదం ఉద్ఘోషిస్తుంది. నేను నీటిలో ఉంటాను కాబట్టి నాకు నారాయణుడు అనే పేరు వచ్చిందని సాక్షాత్ భగవంతుడే స్వయంగా చెప్పటం విశేషం.

మనచే తాగబడే నీరు మూడు భాగములవుతుంది. దానిలో నీరుయొక్క అత్యంత స్థూలభాగం మూత్రంగా మారుతుంది. మధ్యభాగం నెత్తురవుతుంది. ఇంక అత్యంత సూక్ష్మభాగం ప్రాణమవుతుంది. కనుకనే ప్రాణం జలమయం అని ఛాందోగ్యోపనిషత్ పేర్కొంది.

ఈ జలం మనకు ఎనిమిదిరకాల ఫలాలను ఇస్తుంది. శుద్ధజలం వల్ల తేజస్సు, బ్రహ్మవర్చస్సు, అలలతో ప్రవహించే జలంవల్ల బలం, వీర్యం, జలాశయాల మధ్యలో ఉండే జలం వల్ల పుష్టి, సంతానోత్పాదక శక్తి, యజ్ఞాన్తంలో యజమాని, అధర్వుడు, ఋత్విక్కులు అవబృథస్నానం చేస్తే, ఆ జలంవలన ఆయువు, దీర్ఘాయుర్దాయం కలుగుతాయని కృష్ణయజుర్వేదం తెలియచేస్తోంది. **ఆపోగ్రీ విశ్వమావాన్, విశ్వస్యస్థాతుర్జగతో జనిత్రి, అపోవా ఇదుగం సర్వం, సర్వదేవతా ఆపో, ఆపోవై దేవానాం ప్రియంధామ, సృష్ట్యానారంతో యమన్త స్సిత్థోహం యేన స్యాన్మేనామ నారాయణాయేతి, అపః ప్రీతాస్త్రేధా విధీయన్తే తాసాం యఃస్థ విష్ణోధాతుస్తన్మాత్రం భవతియో మధ్యమన్త లోహితం యోణిస్థసన ప్రాణం, ఆపోమయఃప్రాణః –** అనే పురాణ, వేదవాక్యాలు సర్వత్కృష్టమైందిగా జలాన్ని ప్రశంసిస్తున్నాయి.

నదీ అనే శబ్దం.... ఆకాశంలో ఉండే జలం క్రిస్తందకి వస్తున్నపుడు 'అహం' అనే మేఘానికి తగిలి, వర్షధారలుగా కురుస్తున్నాయి. అలా కురిసే జలధారలే 'నదులు' అధర్వణ వేదం చెబుతుంది. నదీ శబ్దం అనే ధాతువు నుండి నదీ అన్న శబ్దం ఉత్పన్నమైంది. అలా ధ్వనించునది లేదా నదించునదని దాని అర్థం. అయితే పశ్చిమోత్తరములనుండి ప్రవహించి తూర్పు సముద్రంలో కలిసేది నదులుగాను, తూర్పు, దక్షిణముల నుండి ప్రవహించి పశ్చిమ సముద్రంలో కలిసేవి మహానదములని వ్యవహరింపబడుతున్నాయి.

నదులన్నీ స్త్రీ రూపాలుగా పరిగణింపబడి, స్త్రీ దేవతలుగా ఆరాధింపబడుతున్నాయి. సింధు, గంగ నాగరికతలు గూర్చి ఆలోచిస్తే ఒక దేశ నాగరికత నదులను అనుసరించే ఏర్పడుతందని తెలుస్తుంది. ఈ నదులలో కొన్ని నిత్యం ప్రవహించేవి కాగా కొన్ని వర్షాకాలంలోనే ప్రవహిస్తాయి. ఏ జాతియొక్క సుదీర్ఘచరిత్రనైనా నదులు, పర్వతాలు చిహ్నాలుగా నిలిచి వాటి చరిత్రను స్ఫురింపచేస్తాయి. మహర్షుల తపఃశక్తివల్ల ప్రవహించే పుణ్య నదులవల్ల భారతావని పుణ్యదేశంగా కీర్తించబడుతుంది. భారత భూమిపై ప్రవహించే నదులకే తీర్థాలు అనగా పాపనాశనం చేసేవని పేరుంది. ఇతర ఖండాలలో ఎన్నో నదులున్నా అవి కేవలం జలప్రవాహాలేనని వాటిలో తీర్థశక్తి లేదని పురాణాలు పేర్కొంటున్నాయి.

పురాణాల్లో నదీ ప్రశస్తి.... మార్కండేయ పురాణం నదులను ప్రపంచమునకు మాతృస్వరూపాలుగానూ, సర్వపాపాలను హరించేవనీ ప్రస్తుతించింది.

అధర్వణ వేదం – నదీ జలాలలో అమృతమున్నది అని తెలిపింది.

ఋగ్వేదం – నదులలో ఓషధులు, రోగనివారకశక్తి కలవని అవి రోగాలను నిర్మూలించి దీర్ఘాయుర్దాయాన్ని కలిగిస్తాయని కాబట్టి నదీ జలపానంవల్ల మనలోని దేహం పుష్టి పెరిగేందుకు దోహదం చేస్తాయని పేర్కొంది. నదులు హిమాలయాలు, పర్వతాలు, సరస్సువల నుంచి ప్రవహించే కారణంగా ఆయా పర్వతములలోని వృక్షములను, తీగలను, ఖనిజములను తమలో ఇముడ్చుకొంటాయి. మార్గంలో అడవులయందు గల సారములను కలుపుకొంటాయి. దీనివలన ఒక్కోప్రదేశంలోని నదులు ఒక్కో ప్రభావాన్ని కలిగి ఉంటాయి. అలాంటి నదీజలాలల దివ్యప్రభావం గూర్చి 'మునిభావ ప్రబోధిని' అనే ఉద్గ్రంథం ఈ క్రిందివిధంగా తెలియచేస్తోంది.

గంగానదీజలం – ప్రజ్ఞనిస్తోంది. త్రిదోషాలను నిర్మూలిస్తుంది. యమునానదీ జలం – పైత్యాదులు పోగొట్టి, బలమును చేకూరుస్తుంది. నర్మదానదీ జలం – పిత్త,

కఫములను పుట్టిస్తోంది. రుచి కలిగి మధురమై ఉంటుంది. సరస్వతీ జలం – పవిత్రమైంది. దేహకాంతిని కలుగచేయును. చంద్రభాగ నదీ జలం – దాహ, పిత్తాలను శోణిస్తుంది. శతద్రు, విపాశా, సింధు నదీ జలం – బుద్ధిని కలుగచేస్తాయి.

పయోష్ణి జలం – సర్వరోగములను పోగొట్టి, బలకాంతులనిస్తుంది. వితస్తజలం – తాప జంద్యములను పోగొట్టి, పుష్టిని కలుగచేయును. సరయూజలం – స్వాదై బలమును చేకూరుస్తుంది. గోదావరి జలం – పైత్య, రక్తపీడాలను పోగొట్టి బలాన్నిస్తోంది. కృష్ణవేణీ జలం – పైత్య, జాడ్యములను పోగొడుతుంది. తుంగభద్రా జలం – స్నిగ్ధమై, నిర్మలమై, గురువై స్వాదైయ్యుంటుంది. కావేరీ జలం – శ్రమను, దద్రుకుష్ఠాది రోగాలను పోగొడుతుంది.

మహాభారతం అనుశాసనిక పర్వమున భీష్ముడు ధర్మరాజుకు పుణ్యతీర్థ విశేషాలను, గంగానదీ ప్రభావం గూర్చి చెప్పాడు.

స్కాందపురాణాంతర్గత కాశీఖండంలో కాశిని గూర్చి అందు గంగానదిలోని మణికర్ణికాది ఘాట్‌ల గురించి వర్ణింపబడింది.

కూర్మపురాణమున బంధువులను చంపితినని దుఃఖంతో విలపిస్తున్న ధర్మజునకు మార్కండేయ మహర్షి ప్రయాగ మహిమను గూర్చి తెలిపెను.

వరాహపురాణంలో రైభ్యుని తీర్థయాత్రా విశేషాలు అతడు గంగకు పోయి, ప్రయాగను సేవించి, పిదప గయకు వెళ్ళినట్లు తెలుస్తోంది.

దక్షిణ భారతావనియందుగల గోదావరిని నన్నయ్యభట్టు 'దక్షిణగంగ' అని ప్రశంసించెను.

రామాయణంలో సీతారాములు, గంగ, కావేరీ, గోదావరి నదులను ఆయా సందర్భాల్లో పూజించినట్లు కలదు. ఇంతటి మహదాత్తమైన అత్యంత అమోఘవంతమైన దివ్యనదీమ తల్లులను పూజించే శుభప్రదమైన రోజులో కుంభమేళాలు, పుష్కరాలు. ఇవి ఉత్తరాదిన కుంభమేళాలుగా, దక్షిణాదిన పుష్కరాలుగా జరుపబడతాయి.

పుష్కరమంటే... పన్నెండు సంవత్సరాల కాలం, ఉదకము నిచ్చునది, బడలిన వానిని పోషించునది, సమృద్ధము, ఓషధీ విశేషము, మేఘరాజము, ఆకాశము, నీరు అనే వివిదార్థాలున్నాయి. సహజంగా హైందవ విశ్వాసం ప్రకారం కాశీలో మరణం, నర్మద తీరాన తపస్సు, కురుక్షేత్రంలో దానం మోక్షాన్ని కలుగచేస్తాయి. ఈ మూడింటియొక్క దివ్యమైన అత్యద్భుతమహాఫలం పుష్కరస్నానం వల్ల లభిస్తోంది. స్త్రీచేకాని, పురుషునిచే కాని జన్మించినది మొదాలుగా చేయబడ్డ పాపాలన్ని పటాపంచలవుతాయి పుష్కరస్నాన మహిమవల్ల.

కుంభమేళా... మన భారతావనిలోనే కాక అనేక ఇతర దేశాల్లో కూడా ఇది ఎంతో ప్రసిద్ధి. కుంభమేళా నాలుగు ప్రాంతాల్లోనే జరుగుతుంది. బృహస్పతి కుంభరాశిలో ఉండి సూర్యుడు మేషరాశిలో ఉన్న సమయాన గంగాద్వారంలో (హరిద్వార్‌లో) బృహస్పతి మేషరాశిలో ఉండి సూర్యుడు మకరరాశిలో ఉన్న సమయాన ప్రయాగలో, బృహస్పతి సింహరాశి, సూర్యుడు మేషరాశిలో ఉంటే ఉజ్జయినిలో, బృహస్పతి మరియు సూర్యుడు సింహరాశి గతులైన సమయాన నాసికాత్ర్యంబకేశ్వరంలోనూ కుంభమేళాలు జరుగుతాయని స్కాందపురాణం తెలుపుతోంది.

కుంభమేళా.... పూర్వం దేవదానవులు అమృతం కోసం వాసుకిని తాడుగా, మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని క్షీరసాగరాన్ని మధించారు. ఆ మధనం నుండి అనేకరకాలైన విశేష వస్తువులు జన్మించి, చివరికి అమృతం పుట్టింది. ఈ అమృత కుంభం కోసం దేవదానవులు యుద్ధం మొదలుపెట్టారు. వారి కలహంలో అమృతకుంభం జారి భూమిపై నాలుగు ప్రదేశాల్లో (ప్రయాగ, ఉజ్జయిని, హరిద్వార్, నాసిక్)లలో పడింది. 'వివాదోకాశ్యపేయానాం యత్ర యాత్రానివస్థలే। కలశేన్యపతత్తత్ర ఆ కుంభపర్వతదోచ్యతే' ఎక్కడెక్కడ ఈ అమృతకుంభం పడిందో అక్కడ కూడా ఈ కుంభపర్వం అంటే కుంభమేళా ఏర్పడింది. భూలోకంలో పడ్డ అమృత కుంభాన్ని సూర్య, చంద్ర, బృహస్పతులు రాక్షసులనుండి రక్షించారు అంటుంది స్కాందపురాణం.

హరిద్వార్‌లో కుంభమేళా సమయాన స్నానం చేస్తే పునర్జన్మ లేనివారై, ఉత్తమ లోకాలు పొందెదరు. కార్తికంలో వెయ్యిసార్లు, మాఘమాసంలో 100 సార్లు గంగానదీస్నానం చేస్తే, వైశాఖంలో నర్మదలో కోటిసార్లు స్నానం చేస్తే కలిగే ఫలితంతో సమాన ఫలితం ప్రయాగ కుంభమేళా స్నానంవల్ల ఉజ్జయిని కుంభమేళా స్నానం ముక్తిని, నాసిక్ కుంభమేళ సమయాన లక్షగోవులను దానం చేస్తే, అశ్వమేధయాగం చేస్తే వచ్చే పుణ్యంతో సమానమైన పుణ్యం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి.

పుష్కరగాథ.... పూర్వం తుందిలుడనే బ్రాహ్మణుడు విశ్వకళ్యాణ కాంక్షతో శివునికోసం తపస్సు చేసి, వరప్రసాదంగా శివుని అష్టరూపాల్లోని జలరూపంలో సుస్థిరస్థానం పొందాడు. ఆ సమయం నుండి తుందిలుడు పుష్కర నామధేయంతో మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు చక్రవర్తిగా వెలుగొందాడు. విశ్వసృష్టికై విధాతకు జలము కావాల్సి వచ్చింది. అందుకై అతను శివుని ప్రార్థించి శివకృపతో పుష్కరుడు తన కమండలంలో ఉండే వరం పొందాడు.

నవగ్రహాల్లో ఒకడైన గురువు ప్రాణికోటి పోషణకై పుష్కరుని తన వద్ద ఉంచమని బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. ఆ తపానికి సంతసించి ప్రత్యక్షమైన బ్రహ్మ గురువు కోర్కెని తెల్సికొని, పుష్కరుని గురువుతో ఉండమనగా అతను నిరాకరిస్తాడు. అందుకు గురువు బ్రహ్మను కూడా పుష్కరునితో వచ్చి తనతో ఉండమంటాడు. కానీ అది సాధ్యమయ్యేది కాదు. అప్పుడు బ్రహ్మ గురు పుష్కరులకు ఓ ఒడంబడిక చేస్తాడు.

ఆ ఒడంబడిక ప్రకారం బృహస్పతి మేషాది రాశులలో ప్రవేశించే 12 రోజులు, తిరిగి ఆ రాశులనుంచి నిష్క్రమించే 12 రోజులు పుష్కరుడు గురువుతో ఉండాలి. అలా ఉన్న సమయంలో బ్రహ్మ పుష్కరునితో సర్వదేవతా సమేతంగా గురువు సంచరిస్తున్న రాశిని అనుసరించి, ఆ నదికి వస్తానని వాగ్దానం చేస్తాడు. ఈవిధంగా పుష్కరాలు ఏర్పడ్డాయి. గురువు మేషరాశిలో ప్రవేశిస్తే గంగకు, వృషభం – నర్మద, మిథునం సరస్వతి, కర్కాటకం యమున, సింహం గోదావరికి, కన్య కృష్ణ, తుల కావేరి, వృశ్చికం భీమరథి, ధనస్సు బ్రహ్మపుత్రం, మకరం తుంగభద్ర, కుంభం సింధు, మీనం ప్రణీతానదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతికి ఎందుకింత ప్రాధాన్యం...

బృహస్పతి దేవతలకి ఆచార్యుడు. నవగ్రహాలలో శుభగ్రహంగా పేరు పొందాడు. ఈ బృహస్పతికి నీటికిగల సంబంధం ఏమిటంటే .... జలాధిపతియైన వరుణుని కుమారుడు ముచ్యుడు, ఇతనికి మృత్యువని పేరు. ఇతని దేహం నుంచి రసాలు స్రవించాయి. ఆ రసం నుండి పుట్టినవాడే ఆంగీరసుడు. ఈ ఆంగీరసుని కుమారుడే బృహస్పతి. అని గోపథ బ్రాహ్మణం ద్వారా తెలుస్తోంది. బృహస్పతి జన్మించినదీ ఆంగీరస నామ సంవత్సరంలోనే ఇదీ ఒక విశేషం. అంతేకాక **"ఏవా మహస్తు విజా అస్తు విష్మాన్ బృహస్పతిర్వృష బోధాయిదేవః"** పూజ్యుడు, జనోపకారి, బలవంతుడు, వర్షప్రదాయకుడిగా, బృహస్పతియే కీర్తింపబడుతున్నాడు అని ఋగ్వేదం చెబుతుంది. జ్యోతిశ్శాస్త్రం బృహస్పతిని సకలశుభాలకు కారకునిగా పేర్కొంటుంది.

మనకు ఈ సంవత్సరం దివి: జులై 14 2015 నుండి బృహస్పతి సింహరాశిలో ప్రవేశిస్తున్న కారణంగా గోదావరి నదికి పుష్కరాలు వస్తాయి. 25 జులై 2015 వరకు ఈ పుష్కరాలు జరుగుతాయి.

పుష్కరస్నాన సమయంలో చేయకూడనివి...

నదులలోకి దిగి ఆటలాడుకుంటూ నీళ్ళు ఎగజిమ్మటం, స్నాన సమయంలో తరచూ ముక్కులు ఎగబీల్చి నదిలో ఉమ్మి వేయటం, పుష్కర సమయంలోనే కాక ఎప్పుడూ ఈవిధంగా చేయకూడదు) ఒక నదిలో స్నానం చేస్తూ మరోనదిని విమర్శించటం ఎట్టి పరిస్థితులలోనూ చేయకూడదు. ఇటువంటివి చేస్తే వదలని పాపం అంటుకుంటుంది. తస్మాత్ జాగ్రత్త!

- పీసపాటి నాగేశ్వరశర్మ

'మార్గ' కవితా మార్గదర్శి - నన్నయ ఋషి



గోదావరీ తీరాన తెలుగు పద్యరచనకు శ్రీకారం. రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహంతో ఆంధ్రమహాభారత రచనకు నన్నపాడ్యుని శుభారంభం.

తెలుగు పద్యాన్ని సృష్టించిన అపరబ్రహ్మ, పంచమ వేదానికి తెలుగుతనం నేర్పిన తెలుగువారి అన్నయ్య నన్నయ్య. గోదావరి చిరుగాలుల మాధుర్యాన్ని కలబోసి మహాభారతాన్నందించిన ప్రవక్త నన్నయ్య. చిరుగాలికి కదలాడే గోదావరి తరగలపై తెలుగుభారతిని నాట్యమాడించిన మహామనీషి ఆదికవి నన్నయ.

నన్నయ సంస్కృతంలో తొలి తెలుగు వ్యాకరణ గ్రంథమైన 'ఆంధ్ర శబ్ద చింతామణి' రచించారని భావిస్తారు. సంస్కృత భాషా వ్యాకరణాలైన అష్టాధ్యాయి, వాల్మీకి వ్యాకరణం వంటివాటి సరళిని అనుసరించారు. అయితే పాణిని పద్ధతికి విరుద్ధంగా ఐదు విభాగాలుగా తన వ్యాకరణాన్ని విభజించారు. అవి సంజ్ఞ, సంధి, అజంత, హలంత, క్రియ. ఆదికవిగానే కాక శబ్దశాసనుడు, వాగనుశాసనుడు అన్న పేర్లతో ఆయన ప్రఖ్యాతుడయ్యారు. నన్నయ భారతంలోని అత్యుత్తమ, అత్యంత అభివృద్ధి చెందిన భాషను గమనిస్తే, నన్నయ భారతానికి పూర్వమే తెలుగు సాహిత్యంలో రచనలు ఉండి వుంటాయన్న సూచన కలుగుతుంది. నన్నయకు ముందేవున్న పద్యశాసనాల్లోని పద్యాలు, అనంతరకాలంలోని పాల్కురికి సోమన రచనలో సూచించిన అనేక ప్రక్రియల సాహిత్యరూపాలు ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. ఐతే తెలుగు సాహిత్యాభివృద్ధికి నన్నయే ముఖ్యుడన్న విషయాన్ని నన్నయకు, తిక్కనకు మధ్యకాలంలోని కవుల అవతారికల్లోని కవిప్రశంసలు తెలియజేస్తున్నాయి. నన్నయ వేగిదేశమునకు రాజైన రాజరాజనరేంద్రుని ఆస్థాన కవి. పూర్వము ఆంధ్రదేశమునకు వేగిదేశమని పేరు వ్యవహారము కలదు. నిజమైన వేగిదేశము 8000 చదరపు మైళ్ళ వైశాల్యం కలిగి ఉండేది. పడమటన తూర్పుకనుములకు, తూర్పున సముద్రమునకు, ఉత్తరాన గోదావరినదికి, దక్షిణాన కృష్ణానదికి మధ్యస్థమయిన తెలుగుదేశము అను వేగిదేశము వుండేది. ఈ వేగిదేశమునకు వేగి అను పట్టణము రాజధానిగా ఉండెను. ఈ వేగిపురమును పరిపాలిస్తున్న రాజరాజమహేంద్రుని బట్టి ఈ నగరానికి రాజమహేంద్రవరము అనే పేరు వచ్చింది. ఆంధ్రమహాభారతం రచించమని నన్నయను కోరిన రాజరాజ నరేంద్రుని (క్రీ.శ. 1019-1061) విగ్రహం రాజమండ్రి రైల్వేస్టేషన్ వద్ద వుంది. ఈ వేగిదేశ పాలకుడు, చాళుక్యరాజు విమలాదిత్యుడు. ఇతని పుత్రుడు రాజరాజనరేంద్రుడు. రాజనరేంద్రుడికి విష్ణువర్ధనుడు అనే బిరుదు కలదు. రాజరాజ నరేంద్రుడు క్రీ.శ.1022 నుండి క్రీ.శ. 1063 వరకు 41 సంవత్సరములు పరిపాలించెను. నన్నయ దానశాసనము రచించాడని, నదంపూడి శాసనము కూడ వేయించాడనే భావనవుంది. నన్నయ్య మహాభారతాన్ని తెలుగులో రాయడం మొదలుపెట్టి, అందులో మొదటి రెండు -ఆది, సభా -పర్వాలను పూర్తి చేసి, తరువాతి పర్వాన్ని (అరణ్య పర్వం) సగం రాసి కీర్తిశేషు డయ్యాడు. నన్నయ తెలుగు భాషకు ఒక మార్గాన్ని నిర్దేశించారు. వీరి తరువాత కవులందరూ ఒకసారి కాకపోతే ఒకసారి అయినా నన్నయ్య అడుగు జాడలను అనుసరించినవారే. నన్నయ్య రాజమహేంద్రవరం లేదా రాజమండ్రిలో వుండి ఈ మహా భారతాన్ని తెలుగులో రచించాడు. **తల్లి గోదావరి ఒడ్డున కూర్చోని, తన రాజయిన రాజరాజనరేంద్ర మహారాజు గారికి చెప్పినదే ఈ మహాభారతము.** రాజరాజనరేంద్రుని పాలన క్రీ.శ. 1045-1060 మధ్య కాలంలోనే భారతాంధ్రీకరణ జరిగి ఉంటుంది. నన్నయ ముద్గల గోత్రజాతకుడగు వైదిక బ్రాహ్మణుడు. అతడు రాజరాజ నరేంద్రుని కులబ్రాహ్మణుడు. ఆ విషయాన్ని తానే స్వయంగా క్రింది పద్యంలో తెలిపాడు.

సీ॥ సీతనకుల బ్రాహ్మణు ననురక్తు నవిరత జప హోమ తత్పరు విపుల శబ్ద శాసను సంహితాభ్యాసు బ్రహ్మోండాది నానా పురాణ విజ్ఞాన నిరతు బాత్రు నప స్థంభ సూత్రు ముద్గల గోత్ర జాతు సద్విసుతావ దాత చరితు లోకజ్ఞను భయ భాషా కావ్య రచనాభి శోభితు సత్ప్రతిభాభి యోగ్యు

ఆ నిత్య సత్య వచను మత్యమరాధిపా
చార్యు సుజను నన్న యార్యుఁ జూచి
పరమ ధర్మ విధుడు వర చాళుక్యా న్వ యా
భరణు డిట్టలనియె గరుణ తోడ'

ఆంధ్రభాషానుశాసనం లేదా ఆంధ్రశబ్ద చింతామణి' అనే వ్యాకరణం రచించాడని ప్రసిద్ధి. నారాయణ భట్టు వాఙ్మయ దురంధరుడు. అష్టభాషాకవి శేఖరుడు. సహాధ్యాయులైన నారాయణ, నన్నయభట్టులు భారత యుద్ధానికి సంసిద్ధులైన కృష్ణార్జునులవలె భారతాంధ్రీకరణకు పూనుకొని ఒక విజ్ఞాన సర్వస్వంగా దానిని రూపొందించే ప్రయత్నం ప్రారంభించారు. తెనుగు కావ్యభాషాస్వరూపానికి పూర్ణత్వం సాధించి, పండితులూ పామరులూ మెచ్చుకొనదగిన శైలిని రూపొందించి, తరువాతి కవులకు మార్గదర్శకులయ్యారు. ఆంధ్రభాషా చరిత్రలో నన్నయ నారాయణులు యుగపురుషులు. ఆంధ్రకవులలో మొదటివాడు. వేగిదేశాధీశుడైన రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రమున రాజ్యము చేయు కాలమున అతనివద్ద ఇతడు ఆస్థానపండితుడుగా ఉండెను. ఈయన తన యేలినవాని ప్రేరేపణచేత భారతమున మొదటి రెండుపర్వములను, ఆరణ్యపర్వమున కొంతభాగమును తెనిగించి కాలధర్మమును పొందెను. తక్కిన భారతవిశేషమును ఎఱ్ఱాప్రెగ్గడయు, తిక్కన సోమయాజియు తెనిగించిరి. మఱియు ఈయన ఆంధ్రశబ్దచింతామణి అను పేర తెనుగునకు ఒక వ్యాకరణమును రచించి దానికి లక్ష్యముగా ఈ భారతమును రచించెనని చెప్పుదురు. ఈ హేతువును బట్టి ఈయనకు వాగనుశాసనుడు అనే ప్రశస్తి ఉంది.

వ్యాసభారతాన్ని తెలుగులోకి తెచ్చిన ఆదికవి నన్నయ్య యథామూలానువాదం చెయ్యలేదు. ఒక్కో శ్లోకానికి ఒక్కో పద్యం అన్న పద్ధతి పెట్టుకోలేదు. **'భారత బద్ధ నిరూపితార్థము తెలుగు వారికి అందించడమే నా లక్ష్యం'** అన్నాడు. దానికి తగినట్టు పద్దెమినిమిది పర్వాలకూ ప్రణాళిక రచించి తన స్వేచ్ఛానువాదాన్ని ప్రారంభించాడు. తిక్కన, ఎర్రనలు అదే ప్రణాళికను అనుసరించి అదే లక్ష్యంతో దాన్ని పూర్తి చేసారు. అప్పటినుంచి ప్రాచీన తెలుగు కవులు అందరికీ అదే ఒరవడి అయ్యింది. స్వేచ్ఛానువాదాలే తప్ప యథామూలానువాదాలు అవతరించలేదు (శాస్త్ర గ్రంథాలు మాత్రం దీనికి మినహాయింపు). వర్ణనల్లోనేమి రసవద్ఘట్టాలలోనేమి అనువక్త ఈ తరహా స్వేచ్ఛను తీసుకున్నా సన్నివేశాలే ఆయా రచనల్లో కాంతిమంతాలుగా భాసించడం, పాఠకులు అందరికీ అవే ఎక్కువ నచ్చడం గమనించవలసిన అంశం. పదకొండవ శతాబ్దానికి ముందే వ్యాసభారతం కన్నడంలోకి దిగుమతి అయ్యింది. అయితే అది కన్నడ భారతమే తప్ప వ్యాస భారతం కాదు. వ్యాసుడి లక్ష్యమూ, పరమార్థమూ పూర్తిగా భంగపడ్డాయి. కథాగమనమూ, పాత్రల పేర్లు మాత్రం మిగిలాయి. స్వభావాలు మారిపోయాయి. భారత రచనకు పరమార్థమైన వైదిక ధర్మం స్థానాన్ని జైనమతం ఆక్రమించింది. ఈ అన్యాయాన్ని చక్కదిద్దడం కోసం నన్నయ ఘంటం అందుకున్నాడు. అందుచేత భారత పరమార్థాన్ని పునఃప్రతిష్ఠించడమే సత్వర కర్తవ్యంగా స్వేచ్ఛానువాద పద్ధతిని స్వీకరించాడు. బహుశ ఇందులోని స్వేచ్ఛ అనంతర కవులను ఆకర్షించింది. స్వీయ ప్రతిభా ప్రదర్శనకు అవకాశం ఇచ్చింది. అందుచేత కథాకల్పనల కోసం వృధా శ్రమ పడకుండా ప్రఖ్యాత వస్తులేశాన్ని స్వీకరించి సర్వాత్మనా స్వతంత్ర కావ్యాలను రచించారు. త్రిమూర్తులను స్తుతించే ఈ సంస్కృత శ్లోకముతో నన్నయ ఆంధ్ర మహాభారత రచనకు శ్రీకారం చుట్టాడు.

భారతంలో నన్నయ రచించిన ఒకే ఒక్క సంస్కృత శ్లోకం ఇది.

శ్లో॥ శ్రీవాణీగిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే।
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం।
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషాస్సంపూజితా వస్సురై।
ర్భూయాసుః పురుషోత్తమాంబుజ భవ శ్రీకంధరాశ్శ్రేయసే ॥

(తాత్పర్యం: లక్ష్మీ సరస్వతీ పార్వతులను వక్షస్థలమునందును, ముఖమునందును, శరీరము నందును ధరించి లోకములను పాలించువారును, వేదమూర్తులును, దేవపూజ్యులును, పురుషోత్తములును అగు విష్ణువు, బ్రహ్మ, శివుడు మీకు శ్రేయస్సు కూర్తురు గాక!)

భారతాంధ్రీకరణలో ఆయన మూడు లక్షణములు ప్రసన్నమైన కథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానా రుచిరార్ధ సూక్తి నిధిత్వము తన ఈ పద్యంలో ప్రత్యేకముగా చెప్పుకొన్నాడు.

సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తి లో
నారసి మేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారసంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్.

నన్నయ రచించిన చివరిపద్యం (అరణ్యపర్వం లోనిది) శారదరాత్రుల వర్ణన

శారదరాత్రులు జ్వలలసత్తర తారక హార పంక్తులన్
జారుతరంబులయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండు రుచి పూరము లంబరి పూరితంబులై

తాత్పర్యం : శరత్కాలపు రాత్రులు మెరిసే నక్షత్రాల పట్ల దొంగలైనాయి. అంటే వెన్నెలలో చుక్కలు బాగా కనుపించటము లేదు. వికసించిన కలువల సుగంధాన్ని మోసుకుపోయే చల్లగాలితో, పూల పరాగంతో ఆకాశం వెలిగి పోతున్నది. చంద్రుడు కర్పూరపు పొడి వంటి వెన్నెలను విరజిమ్ముతున్నాడు. సప్తమాతృకలు అనగా బ్రాహ్మి, మాహేశ్వరి, కౌముది, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ అనునవి సప్తమాతృకలు. ఆ కాలములో చరిత్రకాంశములను తెలెపె గ్రంధములు రెండు కలవు. అవి

1. జయంకొండన్ అఱవములో రచించిన కళింగట్టుపరణి (1063 నుండి 1112 వరకు చోళదేశమును పాలించిన కులోత్తుంగ చోళదేవుని విజయాలను తెలెపెను)

2. బిల్హణుడు సంస్కృతములో రచించిన విక్రమాంక దేవచరిత్ర. (1076 నుండి 1126 వరకును కుంతల దేశమును పాలించిన పశ్చిమచాళుక్య రాజైన విక్రమదిత్యుని విజయాలను తెలెపెను)

- మరుమాముల రుక్మిణి

భక్తి కవితా చతురానన బమ్మెర పోతన

బమ్మెర పోతన అనగానే భాగవతం గుర్తొస్తుంది. భాగవతం అనగానే భక్తిలో తడిసిన గాథలు అలలుగా పొంగివస్తాయి– గజేంద్రమోక్షం, ప్రహ్లాదచరిత్ర, వామన చరిత్ర, రుక్మిణీకల్యాణం, అంబరీషోపాఖ్యానం, అజామిళోపాఖ్యానం ఇంచుమించుగా భాగవతంలోని ఉపాఖ్యానాలన్నీ. ఈ భక్తమణుల చరిత్రలను ఏకత్రితం చేసిన మూలసూత్రం వాసుదేవతత్త్వం. వ్యాసునంతటి వాడే వేదాలను వింగడించి, అష్టాదశ పురాణాలు విరచించి, బ్రహ్మసూత్రాలను ప్రవచించి, భారతాన్ని ప్రబంధీకరించి అప్పటికీ మనస్సు నిండక 'హరికీ, యోగివరులకూ అభిలాషమైన భాగవత గాథ పలుకనైతినే' అని ఖిన్నుడైనాడు. నారదబోధితుడై విష్ణుకథాశిరోమణియైన భాగవతాన్ని ఎన్నుకున్నాడు. ఆ రకంగా తన మదిలో కలిగిన అరకొరలను తీర్చుకొన్నాడు. వ్యాసభారతం తెలుగుసేత ఆంధ్రకావ్యలక్ష్మికి అసలైన కైసేత. ఆ యమ్మను అంతకుముందు చిట్టిపొటి నగలతో సింగారించిన తెలుగు కవులు లేకపోలేదు. వారి వెన్నెలపదాలూ, తుమ్మెదపదాలూ, ఉయ్యాలపాటలూ, నివాళిపాటలూ, ఏలలూ, జోలలూ పుడమితల్లి కడుపున కరిగిపోయి ఉంటాయి. దేశీయుల నాల్కలలో మాటుమణిగి ఉంటాయి; లేక ఏ తాటాకులలోనో, రాగిరేకులలోనో, రాతిపలకపైనో ముక్తకప్రాయంగా పడి ఉంటాయి. అయితే తెలుగు కవిత్వానికి తొలిసారిగా గ్రంథస్థితి కలిగించింది కవిత్రయమే. అంటే నేటి గ్రాంథిక భాషకు పాదులు వేసినవారు నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్నలే! భాషకేకాదు, తెలుగులో కావ్యరచనాశైలిని తీర్చిదిద్దింది కూడా ఈ మూర్తిత్రయమే! చతుర్వేదసారమైన వ్యాసభారతం వారి చేతిలోపడి కావ్యచిక్కణత్వాన్ని సంతరించుకొంది. పద్యవిద్యకు ఆద్యుడైన వాల్మీకి రచించిన రామాయణం భాస్కరాదుల ద్వారా తెలుగు పొలంలో పదంమోపింది. ఆ విధంగా భారతీయ సంస్కృతికి మూల కందాలయిన మూడు గ్రంథాలలో భారత రామాయణాలు ఆంధ్రావళి చేతికందినవి. ఇక మిగిలింది వ్యాస భాగవతం. అప్పటికి దానిపై ఎవరిచూపూ పడనట్టుంది. చూపు పడినా చేయిసాచే చొరవ ఏ కవికీ కలుగనట్టుంది. ఆ మహాభాగవతం ఒక తెలుగు చిలుక కొరకు వేచి ఉంది. ఆ చిలుక తెలంగాణా నడిఒడ్డులో ఓరుగల్లుగడ్డలో బమ్మెర కొమ్మపై అప్పటికే వీరభద్ర విజయాన్ని వినిపించింది. భోగినీదండకాన్ని ఒక రాచవలరాచవాని చెవులకు రసికవాణిగా అందించింది. ఆ శుక రాజే మన పోతరాజు. ఆ "శుకముఖసుధాద్రవమున మొనసియున్న" భాగవతఫలరసాస్వాదనం



తెలుగు రసిక భావవిదుల మహిత భాగధేయం. వీరభద్రవిజయం రచించే నాటికి పోతన్న పిన్నవాడు. పెక్కుసత్కృతులు వ్రాయనివాడు. తన గురువైన ఇవటూరి సోమనారాధ్యుని ప్రసాదమహిమచే ఆ కృతిని రచింపగలిగినాడు. వీరభద్రవిజయం పోతన్న చేయనున్న సేద్యానికి తొలిచాలు. సర్వజ్ఞ సింగభూపాలునికి కానుకవెట్టిన భోగినీదండకం మలిచాలు. ఇకచాలు. ఆ తరువాత పోతన్న మనసు మలుపు తిరిగింది. అటు వీరశైవమతం మీదా ఇటు రసికరాజానుమతం మీదా దృష్టి తొలగింది. వ్యాసునికి విష్ణుకథ విరచించని కొరత తోచినట్లే మన పోతన్నకు "శ్రీమన్నారాయణ కథాప్రపంచ విరచనా కుతూహలం" కుట్మలించింది. అది రాకానిశాకాలం. సోమోపరాగసమయం. గంగాస్నానం, మహేశ్వర ధ్యానం అదీ పోతన్న స్థితి. "కించిదున్మీలత లోచనుడై" ఉండగా రామభద్రుని సాక్షాత్కారం. మహాభాగవతం తెనుగు సేయమని ఆనతి. వెరగుపడిన చిత్తంతో పోతన్న అంగీకృతి. చిత్రం! పోతన్నకు కలిగిందేమో విష్ణుకథా రచనా కుతూహలం, చేసిందేమో మహేశ్వరధ్యానం. కట్టెదుట నిలిచినవాడో రామచంద్రుడు. ఆమహానుభావుడు సూచించిన వస్తువో గోవిందకథాకదంబమైన భాగవతగ్రంథం. అంకితం తనపేరనే అన్నాడు ఆ రామరాజు.

జెనన్నాడు మన పోతరాజు. "శ్రీరామచంద్రుని సన్నిధానంబు కల్పించుకొని", "హరికి, నందగోకులవిహారికి" అంటూ షష్ఠంతాలెత్తుకొని ఆంధ్రభాగవతాన్ని చిన్నికృష్ణునికి సమర్పించుకున్నాడు. రామన్నను శ్రోతగా నిలుపు కొని భాగవతపుగాథను విన్నవించుకున్నాడు. ఇదిచిత్రమా? కాదు. పోతన్న పెంపొందించుకున్న సమచిత్తం. శివుడు, కేశవుడు, రాముడు, కృష్ణుడూ ఈ నాలుగు మూర్తులకు ఏకత భజించటం పోతన్న అభేదభక్తికి తులలేని తార్కాణం. ఇంతటి సమన్వయ దృక్పథం అప్పటి మతవాతావరణంలో అపూర్వం.ఏ కథను ఏరుకోవాలి? ఏరుకున్న కథను ఎక్కడ ఎత్తుకోవాలి? ఆ వస్తువును ఏ దృష్టితో విస్తరిస్తున్నదీ ఎలా వివరించాలి? తన కవితాలక్ష్యాలను ఏ రకంగా సిద్ధాంతీకరించాలి? ఏ కవికైనా ఈ అవస్థ తప్పదు. కృత్యాద్యవస్థ అంటే ఇదే. ఆదికవి నన్నయభట్టారకునికీ ఇది తప్పలేదు. అవతారికలో రాజరాజును గూర్చీ తనను గూర్చీ చెప్పుకున్న తర్వాత అసలు విషయం అందుకున్నాడు. తాను వ్రాయనున్న భారతం తన ఎన్నిక కాదు. అది ప్రధానంగా రాజరాజు మన్నిక. హిమకరుడు మొదలుకొని పాండవోత్తములవరకు తీగసాగిన తన వంశీయుల చరిత్రను తెలుగులో వినాలనే అభీష్టం రాజరాజుకు కలిగింది. అది కాస్తా తన కులబ్రాహ్మణుడైన నన్నయ చెవిలో వేసినాడు. భారత శ్రవణం అనేక పుణ్యఫల ప్రదమని దానికి ప్రాతిపదికకూడా వేసినాడు. ఆ రాజపోషకుని అనుమతంతో, విద్వజ్జనుల అనుగ్రహంతో తాను నేర్చిన విధంబున వ్యాసభారతాన్ని తెనిగించినాడు నన్నయ భట్టారకుడు. తెలుగులో ఆదికవి నన్నయ, సంస్కృతంలో ఆదికవి వాల్మీకి. మరి నన్నయ్య ఆ రామాయణాన్ని వదిలి భారతాన్ని చేపట్టడానికి ప్రధానకారణం రాజరాజుకు భారతంపట్ల గల అభిమానం అని తేలిపోయింది. అంటే వస్తువరణంలో కూడా ఆ కృతికర్తకు స్వేచ్ఛ లేదేమో అని అనుకోవలసి వస్తుంది. అవతారికారచనలోనూ తదనంతరకవులకు నన్నయ్యే మార్గదర్శి. తిక్కన్న స్థూలంగా ఆ సంవిధానాన్నే అనుసరించినా, కొంచెం కొత్త దారి తొక్కినాడు. నన్నయ్య తెనిగించగా మిగిలిన భారతాన్ని తాను రచించాలని సంకల్పించుకున్నాడు. ఇది ఎవరో సూచించిన వస్తువు కాదు. తిక్కన్న తానే చేసుకున్న ఎన్నిక. సరిగ్గా పోతన్న తిక్కన్న తెన్ననే అనుసరించినాడు. భాగవతావతారికను విరాటపర్వావతారికకు తోబుట్టువుగా తీర్చిదిద్దినాడు. తిక్కన్నలాగే తన వస్తువును తానే ఏరుకున్నాడు పోతన్న. తిక్కన్న భారత రచనా కౌతుకం కనబరిస్తే, పోతన్న శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలం కనబరచినాడు. అతడు నిద్రించే సమయంలో **"కలలో కన్నట్లు"**గా హరిహరనాథుడు కనిపిస్తాడు. ఇతడు గంగాతీరంలో మహేశ్వరధ్యానం చేస్తూ కన్నులు మూసుకొని ఉండగా రామభద్రుడగుపిస్తాడు. **"కరుణారసము పొంగి తొరగెడు చాడ్పున"** అన్న సీసపద్యంలో హరిహరనాథుణ్ని రూపుకట్టించినాడు తిక్కన్న. **"మెఱుగు చెంగట నున్న మేఘుంబు కైవడి"** అన్న సీసపద్యంలో సీతానాథుణ్ని చిత్రించినాడు పోతన్న. అతడు సర్వేశ్వరుడు. ఇతడు రాజముఖ్యుడు. అక్కడ హరిహరనాథుడు సెలవిస్తాడు భారత రచనా ప్రయత్నం భవ్య పురుషార్థ తరుపక్వఫలమని. దానిని తనకు కృతి ఇమ్మని; ఇక్కడ రామభద్రుడు ఆనతిస్తాడు. మహాభాగవతం 'తెనుగుసేయు'మని తనపేర అంకితమిమ్మని. తామే ఇతివృత్తాన్ని స్వీకరించడం, నరేశ్వరుణ్ని కాక సర్వేశ్వరుణ్ని కృతిపతిగా నిర్ణయించడం తిక్కన పోతన్నల కున్న సమధర్మం. ఈ కృతులు రచించేనాటికి ఇద్దరి మనఃప్రవృత్తులు ఎల్లలు లేని భక్తిసరిత్తులు. భారతరచనం తిక్కన్న దృష్టిలో ఆరాధన విశేషం. భాగవతరచనం పోతన్న దృష్టిలో భవబంధ విమోచనం. ఇక్కడే ఉంది పోతన్న అదృష్టం. చిత్తస్థితికి తగిన ఇతివృత్తం దొరికింది. పరవశించి పాడుకున్నాడు. **"పలికెడిది భాగవతముటపలికించు విభుండు రామభద్రుండుట; నేపలికిన భవహర మగునట; పలికెద వేఱొండుగాథ బలుకుగ నేలా?"** నాలుగు పలుకులను ప్రాసస్థానంలో చిలికి తన పులకలు వెలార్చుకొన్నాడు. అయితే భాగవతరచన అంతంత మాత్రాన జరిగేదికాదు. ఈ "సహజ పాండిత్య"నికి అది తెలియదా? అదీ విన్నవించు కొన్నాడు."భాగవతము దెలిసి పలుకుట చిత్రంబుశూలికైను దమ్మి చూలికైనవిబుధజనుల వలన విన్నంత కన్నంతతెలియ వచ్చినంత తేటపఱుతు."భాగవతం తెలుసుకోవడం, తెలిసింది తెలుపుకోవడం చిత్రమట! నిజమే, రామాయణం అలలా సాగిపోయే మనిషి కథ. భారతం భిన్న లౌకిక ప్రవృత్తుల సంఘర్షణ వ్యథ. భాగవతం స్థూలదృష్టికి కృష్ణలీలాపేటిక, విష్ణుభక్తుల కథావాటిక. సూక్ష్మంగా పరిశీలిస్తే అది మధ్యమధ్య ఎన్నెన్నో విప్పలేని వేదాంతగ్రంథులున్న మహాగ్రంథం. ఆ ముడులు విప్పడం హరునికీ, విరించికీ దుష్కరమే! మరి ఆ భాగవత రహస్యం ఆ భగవంతునికే తెలియాలి. భారం అతనిపై వేసి వ్యాసభాగవతవ్యాఖ్యాత అయిన శ్రీధరుణ్ణి ఆలంబనం చేసుకుని తెలియవచ్చినంత తేటపరచినాడు ఈ వినయశీలుడు. ఈ తేటపరచటం ఏ తెలుగులో? నన్నయ ప్రారంభించిన తత్సమపద బహుళమైన తెలుగులోనా? లేక పాల్కురికి సోమన్న ప్రఘోషించిన జానుతెనుగులోనా? పోతన్న సాత్వికత అహంతలకూ వింతవింత పుంతలకూ అతీతమైనది."కొందఱికి దెనుగు గుణమగు; గొందఱికిని సంస్కృతంబు గుణమగు; రెండున్ గొందఱికి గుణములగు; నేనందఱి మెప్పింతు గృతుల నయ్యెయెడలన్." కొందరికి తెనుగు గుణమట. ఇందులో పరోక్షంగా పాలకురికి,

ప్రత్యక్షంగా తిక్కన్న కనిపిస్తున్నారు. కొందరికి సంస్కృతం గుణమట. ఇందులో సుదూరంగా నన్నయ, సమీపంగా శ్రీనాథుడు వినిపిస్తున్నారు. ఆయా కవులే కాదు, వారి అనుయాయులు కూడా స్ఫురిస్తున్నారు. 'ప్రౌఢంగా పలికితే సంస్కృతభాష అంటారు. నుడికారం చిలికితే తెలుగుబాస అంటారు. ఎవరేమనుకున్నా నాకు తరిగిందేముంది? నా కవిత్వం నిజంగా కర్ణాటభాష' అని ఎదుటివాళ్లను ఈసడించి తోసుకుపోయే రాజసంగాని, తామసంగాని పోతన్నకు అలవడలేదు. అది శ్రీనాథుని సొత్తు. ఈ పద్యమే పోతన్న సత్త్వమూర్తికి అద్దం పట్టింది. 'ఆయా సందర్భాలనుబట్టి అందరినీ మెప్పిస్తాను' అన్న మాటలో వినయం ఎంత మెత్తగా ఉందో, విశ్వాసం అంత వొత్తుగా ఉంది. భాగవతం చదివితే తెలుస్తుంది అతని సంస్కృతగుణం; అచ్చతెనుగుతనం. నన్నయాదులు భారతాన్ని ఆంధ్రీకరించినారు. భాస్కరరంగనాథాదులు రామాయణాన్ని అందించినారు. నాచన సోమన మారన వంటివారు పురాణాలను అనువదించినారు. వీరెవ్వరూ తన పురాకృత శుభాధిక్యంవల్ల భాగవతాన్ని తెనిగించలేదు. దీనిని తెనిగించి పునర్జన్మ లేకుండా తన జన్మను సఫలం చేసుకుంటానని ఆకాంక్షించినాడు పోతన్న. వేయి నిగమాలు చదివినా సుగమం కాని ముక్తి భాగవతనిగమం పఠిస్తే అత్యంత సుగమం అని విశ్వసించినాడు. ఆ ముక్తివాంఛే భాగవత రచనకు మూలం. మొట్టమొదటి పద్యమే ఆ ఆశయానికి దిద్దిన ముఖతిలకం. **"శ్రీకైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్ లోకరక్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో ద్రేక స్తంభకు గేళిలోలవిలసద్భగ్జాలసంభూతనానాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్."** ఇది నాందీశ్లోకం వంటి పద్యం. ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశాలలోని ఒక లక్షణం నిక్షేపించడం దీని లక్ష్యం. "శ్రీవాణీగిరిజాశ్చిరాయ" అని నన్నయ అన్నాడు. "శ్రీయన గౌరి నాబరగు" అని తిక్కన అన్నాడు. "శ్రీకైవల్యపదంబు"ను పోతన్న ప్రస్తావించినాడు. ఈపద్యంలో నమస్క్రియతో పాటు వస్తునిర్దేశం కూడా ఉండటం విశేషం. భాగవత కథానాయకుడు నందనందనుడు. అత డవతార పురుషుడు. లోక రక్షణం ఆ అవతారానికి ప్రేరణం. అతడు గజేంద్రాది భక్తులను పాలించినవాడు. హిరణ్యకశిపు ప్రభృతి దానవుల ఉద్రేకాలను స్తంభింప జేసినవాడు. ఈ రెండు అంశాలు శ్రీమన్నారాయణుని శిష్టరక్షణకూ దుష్టశిక్షణకూ మూలకందాలు. భాగవత కథాచక్రం ఈ రెండు అంశాలచుట్టే చంక్రమించింది. ఈ రకంగా పోతన్న పై పద్యంలోని పాదచతుష్కంలో భాగవతంలోని పన్నెండు స్కంధాల పరమార్థాన్ని నిర్దేశించినాడు. మరొకవిశేషం ఈ పద్యంలోని నందాంగనా డింభకుడు కేవల స్థితికారుడే కాడు, సృష్టికారుడు కూడా. "కేళిలోల విలసద్భగ్జాల సంభూత నానాకంజాత భవాండకుంభకు" అనే ప్రయోగంలో అది ధ్వనించింది. "దానవోద్రేకస్తంభకు" అనే మాటలో అతని లయ కారత్వం స్ఫురించింది. అంటే ఈ పద్యంలో నందింప బడిన పరమాత్ముడు త్రిగుణాత్ముడు. అయితే విశ్లేషించుకుంటే బోధపడే అర్థమిది. ఒక మహోర్మికలా ఉప్పొంగి వచ్చే మూర్తి మాత్రం సత్త్వానిది. కాష్ఠంకంటే ధూమం, ధూమంకంటే త్రయీమయమైన వహ్ని విశేషమైనది. అలాగే తమోగుణం కంటే రజోగుణం, రజోగుణంకంటే బ్రహ్మప్రకాశకమైన సత్త్వం విశిష్టమైనది. (ప్రథమ స్కంధం 59) అందుకే తొల్లిటి మునులు సత్త్వమయుడని భగవంతుడైన హరినే కొలిచినారు. ఆ భగవంతుని సత్త్వనిర్భర స్వరూపమే పైపద్యంలో ఉల్లేఖింపబడింది. అవతారికలోని రచనాలక్ష్యాన్ని పరికించినా, నాందీపద్యాన్ని పరిశీలించినా పోతన్న ధ్యేయం కైవల్యమేనని బోధపడుతుంది. భవబంధరాహిత్యం, జన్మసాఫల్యం కైవల్యం వల్లనే సాధ్యం. ఆ కైవల్యం పోతన్న వాంఛించిన పరమపదం; పురాజన్మ తప్తఫలం. ఈ కైవల్యకాంక్ష ప్రవృత్తిలా భాసించే నివృత్తి; భాగవతంలోని ప్రధాన రసమైన భక్తికి ఆదిలోనే ఎత్తిన వైజయంతిక. ఇంచుమించుగా సమకాలీనులైన శ్రీనాథ పోతనామాత్యుల వ్యక్తిత్వాల వాసి ఇక్కడే ఉంది. శ్రీనాథుడు శృంగారిగా ఎంత వ్యాపృతుడైనా 'ఈశ్వరార్చన కళాశీలుండ'ననే చెప్పుకున్నాడు. భోగినీదండకం వంటి పరమశృంగార కృతి రచించినా పోతన్న మహాభక్తుడుగానే పేరొందినాడు. కాశీఖండం, భీమఖండం, హరవిలాసం, శివరాత్రి మాహాత్మ్యం వంటి భక్తిప్రబంధాలు వ్రాసినా, నైషధంలోని రక్తివల్లనూ, చాటుపద్యాలలోని శృంగార ప్రసక్తివల్లనూ శ్రీనాథుడు శృంగారసనాథుడుగా స్థిరపడినాడు. రుక్మిణీకల్యాణం, రాసక్రీడాభివర్ణనం వంటి ఘట్టాలలో ఎంతటి శృంగారదంతురితాలైన వర్ణనలు చేసినా పోతన్న తెలుగుల పుణ్యపేటిగానే కీర్తింప బడుతున్నాడు. ఇందుకు ఒకకారణం కాలం గడిచినకొద్దీ వీరిచుట్టూ అల్లుకున్న కట్టుకథలు. మరొకకారణం కావ్యావతారికల్లో వీరి వ్యక్తిత్వాలు వేసుకున్న ముద్రలు. శ్రీనాథుని కృతులన్నీ నరాంకితాలు. అతని జీవితంలోని ఉజ్జ్వల ఘట్టాలన్నీ రాచకొలువులకే సమర్పితాలు. పట్టెడు వరిమెతుకులు, గుక్కెడు మంచినీళ్ళు పుట్టని దుర్దశలో కూడా ఆ రాజస మూర్తి అటు కృష్ణుణ్ణో, ఇటు శివుణ్ణో దుయ్యబట్టినాడు. ఇరవై సంవత్సరాలు కొండవీటిలో విద్యాధికారిగా ఒక వెలుగు వెలిగి అంతటితో యశోభిలాష సన్నగిల్లక, ఎక్కడో కర్ణాటరాయల కొలువులో, నిక్కిపడే గౌడ డిండిమభట్టును ఉద్భట వివాదప్రౌఢితో ఓడించి, అతని కంచుఢక్కను పగులగొట్టించి, రాయల సభాగారంలో స్వర్ణస్నానం చేయించుకునే దాకా తృప్తిపడని మత్యహంకృతి అతనిది. దిక్కూమొక్కూ లేని అవసానదశలో

దివిజకవివరుని గుండియలు దిగ్గురనేటట్టు కడ ఊపిర్లో గూడా కవిత లల్లగల్గిన ప్రౌఢవ్యక్తిత్వం అతనిది. మరి పోతన్న వ్యక్తిత్వం ఇందుకు భిన్నం. అతడు నరాధిపులను కొలువలేదు; సిరులకై ఉరుకులాడలేదు; అధికారాన్ని ఆశించలేదు; అహంకారాన్ని ప్రకటించలేదు. పూర్వకవులతోపాటు, వర్తమాన కవులతో పాటు భావికవులను గూడా బహూకరించిన వినయభూషణు డతడు. సమకాలీనకవులను సంభావించడమే ఒక విశేషం. పుట్టని కవులకు జేకొట్టడం పోతన్న సహనశీలానికి నిదర్శనం. సహనగుణం సత్త్వం పాదులో పుట్టేదే కదా! ఈ సత్త్వగుణాన్ని ఆధారంగా చేసుకునే పోతన్న నిరాడంబర వ్యక్తిత్వాన్ని గూర్చీ, నరాధిప పరాఙ్ముఖత్వాన్ని గూర్చీ కొన్ని చాటు కథలు ఆ నోటికానోటి కెక్కి నేటికీ తెలుగునాట వాడుకలో ఉన్నాయి. భాగవతాన్ని తన కంకిత మివ్వవలసిందని సర్వజ్ఞసింగ భూపాలుడు కోరడం, పోతన్న కాదనడం, భూపాలునికి కోపం వచ్చి దానిని నేలపాలు చేయడం ఇదోకథ. శ్రీనాథుడూ పోతన్నా స్వయానా బావమరదులు. పోతన్న పొలం దున్నుతుంటే ఆ'నాథన్న' పల్లకిలో రావడం, అటు బోయీలు లేకుండా పల్లకి తేలిపోవడం, ఇటు ఎడ్లు లేకుండా నాగలి సాగిపోవడరా ఇది మరోకథ. ఇవే కాక 'కర్ణాటకిరాటకీచకు' లెవరో అతని కృతిని కాజేయాలని వస్తే ఆ తల్లి సరస్వతి 'కాటుక కంటి నీరు చనుకట్టు' మీద పడేటట్టు బావురు మనడం, "అమ్మా! ఏడువకమ్మా! నిన్ను ఎవరికీ అమ్మనమ్మా!" అని ఈ పరమభక్తుడు ఓదార్చడరా ఇదో పిట్టకథ. కృతిని ఇక్కడ 'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి', అక్కడ 'కాలుచే సమ్మెటవ్రేటులం బడక' బమ్మెర పోతరాజు భాగవతాన్ని 'సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె'నని అవతారిక లోని మరోపద్యం ఇచ్చే సాక్ష్యం. పోతన్న పేరు చెప్పితేనే సగటు సాహితీ బంధువులకు ఈ పద్యమే గుర్తు కొస్తుంది. ఈ పద్యం పోతన్నది కాదంటే చాలా మందికి గుండెల్లో కలుక్కుమంటుంది. నిజానికి ఈ పద్య రచనలో ఏ కోశానా పోతన్నశైలీవాసన లేదు. 'సొమ్ములు కొన్ని పుచ్చుకొని', 'సొక్కి', 'శరీరము వాసి', 'కాలుచే సమ్మెటవ్రేటులు' 3 'సమ్మతి', 'ఇచ్చిచెప్పె' ఈ 'బమ్మెరపోతరాజకుడు' ఇదీ ధోరణి. ఇవి పోతన్న పలుకులేనా? భావికవులను బహూకరించిన, భవబంధవిమోచనం ఆశించిన భక్తశిరోమణి మాటలేనా? కాదన వలసిన అవసరం లేకుండానే మరొక అంతస్సాక్ష్యం ఉంది. ఈ పద్యానికి ముందుమాట 'ఉభయ కావ్యకరణ దక్షుండనై' అన్నది. ఇది ఉత్తమపురుషంలో వుంది. వెంటనే 'ఇమ్మనుజేశ్వరాధముల' పద్యంలో 'బమ్మెర పోతరాజకుడు' అంటూ ప్రథమ పురుషం దూకుడుంది. ఆ పద్యం తరువాత మరొక పద్యం. తరువాత 'అని మదీయ' అంటూ మళ్లీ ఉత్తమపురుషం దర్శనం ఇచ్చింది. పద్యశిల్పాన్నిబట్టే కాక అన్వయ దోషాన్ని బట్టి చూసినా ఇది పోతన్న పద్యం కాదనే అనిపిస్తుంది. అతని భక్తులో, అనురక్తులో తదనంతర కాలంలో ఈ పద్యాన్ని జప్పించి ఉంటారు. ఎవరో ఎందుకు? అతని శిష్యుడు సింగయ్యే వ్రాసి ఉంటాడేమో? సింగయ్య భాగవతంలోని షష్ఠ స్కంధాన్ని రచించినాడు. పోతన్న పోతలోనే ఇతనూ ఒక అవతారిక సంతరించుకున్నాడు. పూర్వకవిస్తుతిలో శ్రీనాథునితోపాటు బమ్మెరపోతరాజును స్మరించినాడు. పోతరాజును స్తుతిస్తూ చెప్పిన పద్య మిది:"ఎమ్మెలు సెప్పనేల? జగమెన్నుగు బన్నగరాజశాయికిన్ సొమ్ముగ వాక్యసంపదలు నూఱలు చేసినవాని భక్తిలోనమ్మినవాని భాగవతనైష్ఠికుడై తగువాని బేర్మితోబమ్మెర పోతరాజు కవి పట్టపురాజు దలంచి మ్రొక్కెదన్."ఈ పద్యంలో ఒకటి రెండు అంశాలు గమనింపదగినవి ఉన్నాయి. 'ఇమ్మనురాజేశ్వరాధముల' పద్యంలో 'సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె' 'ఈబమ్మెర పోతరా జకుడు భాగవతంబు' అని ఉంది. 'ఎమ్మెలు సెప్పనేల' పద్యంలో 'పన్నగరాజశాయికిన్', 'సొమ్ముగ... భాగవత నైష్ఠికుడై... తగువాని ... బమ్మెర పోతరాజు.' అని ఉంది. ఆ పద్యంలో ప్రాసస్థానంలో 'సొమ్ములు' 'బమ్మెర' ఉన్నాయి. ఈ పద్యంలోనూ ఆ మాటలే ఉన్నాయి. అక్కడ 'జగద్ధితంబుగన్' అని ఉంటే ఇక్కడ 'జగమెన్నుగ' అని ఉంది. 'సమ్మతి శ్రీహరి కిచ్చి' చెప్పడం అని అందులో ఉంటే ఆ స్వామికి 'సొమ్ముగ వాక్యసంపదలు నూఱలు' చేయడం ఇందులో ఉంది. ఈ రెండు పద్యాల్లోనూ పోతన్న భక్తి తత్పరతే ఉగ్గడింప బడింది. పైగా రెండుపద్యాల గతికూడా ఒకేస్థితిలో ఉంది. కనుకనే ఈ సింగయ్యే ఆ పద్యం రచించి పోతన్న అవతారికలో చేర్చి ఉంటాడేమో అనే సందేహం కలుగుతుంది. అలాకాదు. పోతన్న పద్యానికే సింగన్న పద్యం అనుకరణమేమో అని ఎవరైనా వాదించవచ్చు. అందుకు నా సమాధానం మొదట చెప్పిందే. పద్యశిల్పంలో గానీ, పదప్రయోగంలో గానీ, భావశుద్ధిలోగానీ ఈ పద్యంలో పోతన్నముద్ర ఏమాత్రం లేకపోవడమే. ఇంకా **'హాలికులైననేమి, గహనాంతర సీమల కందమూల కౌద్దాలికులైన నేమి'** అంటూ ప్రాసస్థానంలో గుప్పించిన అనుప్రాస సౌరభం ఇందుకు సాక్ష్యం.అవతారిక దృష్ట్యానే కాక భాగవత కథల్లో ఉపాఖ్యానాల్లో పోతన్న మూలాతిరిక్తంగా పెంచిన పట్టులను బట్టీ, పేర్చిన పద్యాలను బట్టీ, అతని సత్త్వరమణీయమూర్తి సాక్షాత్కరిస్తుంది. గజేంద్రుని సంశయంలో, ప్రహ్లాదుని నిశ్చయంలో, గోపికల ఉద్వేగంలో, వామనుని ఉత్తేజంలో ఇవేకాక నవవిధ భక్తిలతల బహుముఖ వికాసంలో, భక్తిరసతరంగితమైన పోతన్న చిత్తవృత్తి

పలువిధాలా ప్రస్ఫుట మవుతుంది. వ్యాసభగవానుని భాగవత కోశాన్ని సైతం క్షణకాలం మరచిపోయి, ఆయా భాగవతుల శ్రవణకీర్తనలకు లోనై ఆ పాత్రలన్నీ తానై పరవశించి, పద్య సంఖ్యను పెంచి, ప్రతిభా శిఖరాలపై భాసించిన సన్నివేశాలు ఆంధ్ర భాగవతంలో కోకొల్లలు. అందుకే అంటున్నానూ అవతారికలోనే కాక ఆంధ్ర భాగవతంలో గూడా అడుగడుగున పోతన్న సాత్త్విక చిత్తవృత్తి, భక్తిభావనా ప్రవృత్తి వేయిరేకులతో విప్పారినవని. నవవిధ భక్తులను కథాత్మకంగా ప్రపంచించిన ప్రథమ గ్రంథం వ్యాసభాగవతం. ఆ భక్తిరస ఘట్టాలను ఇంతకు రెండింతలుగా విస్తరించి తొలిసారిగా మధుర భక్తికి పచ్చల తురాయిని కూర్చిన తెలుగు కావ్యం పోతన్న భాగవతం. ప్రహ్లాదుని నోట వ్యాసుడు పలికించిన భక్తిశాఖ లివి" శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాదసేవనం అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్"దీనికి పోతన్న చేసిన తెలుగు సేత ఇది"తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనార్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనంబను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి సజ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!"ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, కుచేలుడు, ధ్రువుడు, అక్రూరుడు, రుక్మిణి, గోపికలూ ఆయా భక్తిశాఖల విరబూసిన ప్రసూనాలు. ప్రహ్లాదుడూ, రుక్మిణీ, గోపికల వంటి పాత్రలలో పోతన్న పరమ భాగవత సత్త్వం, అరీణ భక్తితత్త్వం శబలసుందరంగా భాసిస్తాయి. ఇది చెప్పాలని ప్రహ్లాదుని ముఖతః ఎన్నెన్ని భంగులలో ఎన్నెన్ని ఫణుతులలో చెప్పించినాడు పోతన్న! **"మందార మకరంద మాధుర్యమును దేలు మధుపంబు వోవునే మదనములకు"** అంటాడు. మరోసారి **"కంజాక్షునకు గాని కాయంబు కాయమే"**అంటాడు. ఇంకోసారి "కమలాక్షు నర్చించు కరములు కరములు"అంటూ లాటానుప్రాసల్లో ఉద్ఘాటిస్తాడు. ఆ 'అంబుజోదర దివ్యపాదారవిందాలు', ఆ 'చింతనామృతం', ఆ 'మత్తచిత్తం' ఎన్ని సార్లంటాడు! ఎన్ని తీర్లంటాడు! విసుగులే దా భక్తవరుని నోటికి. అది పునరుక్తిదోష మని అనిపించనే అనిపించదు పరవశించిన ఆలేఖినికి. ఇంతకూ పోతన్న రచించిన భక్తి పద్యాల్లో కోటికెక్కిన 'మందార మకరంద' పద్యం అటు వ్యాసునిదీ కాదు, ఇటు పోతన్నదీ కాదు. పాలకురికి సోమన్నది. సోమన్న పోతన్నకు పూర్వీకుడు. బమ్మెరకు సమీపంలో ఉన్న పాలకురికి వాస్తవ్యుడు. అతని చతుర్వేదసారంలోనూ, బసవ పురాణంలోనూ ఈ పద్యం పోలికలే ఉన్నాయీ 'రాకామలజ్యోత్స్న ద్రావు చకోర మాకాంక్ష సేయునే చీకటి ద్రావ' (బసవ పురాణం)అని సోమన్న అంటే 'పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరకరా బరుగునే సాంద్ర నీహారములకు'అని పోతన్న అంటాడు. 'విరిదమ్మి వాసన విహరించు తేటీ పరిగొని నుడియునే ప్రబ్బలి విరుల' (బసవ పురాణం)అని సోమన్న అంటే 'మందార మకరంద మాధుర్యమును దేలు మధుపంబు వోవునే మదనములకు'అని పోతన్న అంటాడు. అయితే సోమన్నకు రాని కీర్తి ఈ పద్యంవల్ల పోతన్న కెందుకు వచ్చింది? అక్కడే ఉంది పోతన్న పోత. 'మందార' 'మకరంద' 'మాధుర్య' 'మధుప' 'మదనములు' ఎన్ని మకారాల ప్రాకారాలు కట్టినాడు! పద్యాన్ని ఎంత ప్రాసాదరమ్యంగా నిలబెట్టినాడు! అక్షర రమ్యతలో నన్నయ్యను దాటి, ఆపై అంచులు ముట్టినాడు. తరువాతి వాళ్ళెవరైనా ఈ శైలిని అనుకరిస్తే జారిపడిపోవడమో, నీరుగారిపోవడమో జరిగే అంత సొంతపుంత చేపట్టినాడు. మరి **'కమలాక్షు నర్చించు కరములు కరములు'** కూడా పోతన్న కొత్తగా చెప్పింది కాదు. భీమఖండంలో శ్రీభీమనాయక శివనామధేయంబు జింతింపనేర్చిన జిహ్వాజిహ్వదక్షవాటీ పురాధ్యక్ష మోహనమూర్తి జూడంగనేర్చిన చూపుచూపు దక్షిణాంబుధితట స్థాయిపావనకీర్తిచే నింపనేర్చిన చెవులు చెవులు తారకబ్రహ్మవిద్యాదాతయౌదల విరులు పూన్పుగ నేర్చు కరముకరముధవళకరశేఖరునకు బ్రదక్షిణంబు నర్థి దిరుగంగ నేర్చిన యడుగు లడుగులంబికానాయకధ్యాన హర్షజలధి మధ్యమును దేలియాడెడు మనసు మనసు అని శ్రీనాథు డెన్నడో అన్నదే. కాని లోకానికి తెలిసింది 'కమలాక్షు నర్చించు కరములు కరము'లే. ఈ ప్రాచుర్యానికి కారణం కూడా పోతన్న కూర్చిన పదబంధ తోరణమే. నవవిధ భక్తుల్లో "శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, ఆత్మనివేదనం" ఇవన్నీ ఒక పాదులో పుట్టిన మొలకలే. సఖ్యం మాత్రం వీటికంటే భిన్నతత్త్వం కలది. రుక్మిణికి శ్రీకృష్ణునిపట్ల గల రక్తికీ, భక్తికీ నేపథ్యం ఆత్మనివేదనం. అర్చన వందన స్మరణాదులు ఆ ఆత్మార్పణంలో నుంచి ఉదయించిన రేఖలు.

త్రేతాయుగంలో మునులు, ద్వాపర యుగంలో గోపికలు భగవద్విరహంలో సంతప్తులైన జీవాత్మలు. గోపిక లున్నారు. వాళ్ళకు ఇళ్ళూ, వాకిళ్ళూ ఉన్నాయి. కొందరికి పతులూ, సుతులూ ఉన్నారు. అయినా శారదయామినిలో యమునా తీరంలో బృందావనిలో గోపాలుని మురళీగానం ఆలకించగానే అన్నీ మరచి పరుగులు తీస్తారు. బృందావని చేరుకొని నందకిశోరుణ్ణి కానక రసోన్మాదంలో ఎలుగెత్తి పిలుస్తారు. ఆ మోహనమూర్తిని పదేపదే స్మరించుకొని ఇలా ఆక్రందిస్తారు **"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పైఁజల్లెడువాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రాజిల్లెడుమోమువాఁ డొకుడు చెల్వలమానధనంబు దోచె నోమల్లియలార! మీ పొదల మాటున లేఁడుగదమ్మ! చెప్పరే!"**

మధ్యమధ్య ఆ మాధవుడు, ఆ గోపికా మనోభవుడు తళుక్కున మెరుస్తాడు. అంతలోనే అంతర్హితుడౌతాడు. అప్పుడు గోపికల వియోగవిధురహృదయాలు ఇలా సంభ్రమిస్తాయి **"అదె నందనందనుం డంతర్హితుండయ్యెటలీతరులార! పట్టరమ్మ! హేలావతులు గృష్ణ! యేల పాసితివని యిలేయలతలార! యడుగరమ్మ! వనజాక్షు డిచటికి వచ్చి డాఁగుడు గదా చూతమంజరులార! చూడరమ్మ! మానినీ మదనుతో మారాక యెఱిగించి మాధవీలతలార! మనుపరమ్మ! జాతిసతులు బాయ నీతియె హరి కనిజాతులార! దిశలు జాటరమ్మ!కదళులార! పోయి కదలించి శిఖిపింఛజూటు దెచ్చి కరుణ జూపరమ్మ!"**సమస్త చరాచర జీవకోటికి అధినాథుడు మాధవుడు. ఆ మాధవుడే తమధవుడని భ్రమించినారు గోపికలు. ఆ భ్రమావరణమే వారి మనస్సుల మీద మోహయవనికలను కప్పింది. ఆ ముగ్ధప్రవృత్తే మధురభక్తికి మూలం. ఈ మధురభక్తిని రాసక్రీడాది వర్ణనంలో హృదయంగమంగా చిత్రించినాడు పోతన్న. లోకంలో భక్తకవులు పలువురున్నారు. వారందరు ప్రజాకవులు కాలేరు. ఒక తుకారాం, ఒక సూరదాసు, ఒక కబీరు, ఒక పోతన్న ప్రజాకవులుగా ప్రాచుర్యం పొందిన భక్తకవులు. మరి ప్రజాకవి ఎవడు? సామాన్యప్రజల జీవిత సమస్యలను చిత్రించేవాడు. ఇది బాగా వాడుకలో ఉన్న అభిప్రాయం. ఈ దృష్టితో చూస్తే పోతన్న ప్రజాకవి కాలేడు. అతడు ప్రజల దైనందిన జీవితసమస్యలకు బొమ్మకట్టి చూపలేదు. భాగవతుల భక్తిభావ పరంపరలకు శ్రుతులు కూర్చి కృతులు అల్లుకున్నాడు. ఆ భాగవతుల్లో ప్రహ్లాదునివంటి ఆజన్మజ్ఞానులు ఉన్నారు. గజేంద్రుని వంటి అర్ధజ్ఞాను లున్నారు. కుచేలునివంటి ఆర్థికదుర్దశా పీడితులున్నారు. ఈభక్తుల స్థితిగతులు వేరైనా, వారి వారి సంస్కారమతులు వేరైనా, అందరినీ కలిపికుట్టే మూలసూత్రం ఒకటుంది. అదే ఆర్తి. అది జీవాత్మలు, పరమాత్మకు నివేదించుకునే అలౌకికమైన ఆర్తి. భక్తపరమైన ఈ ఆర్తిని సార్వకాలీన సామాన్య ప్రజల ఆర్తిగా చిత్రించడంవల్లనే భక్తకవియైన పోతన్న ప్రజాకవియైనాడు. "కలడు కలం డనెడువాడు కలడో లేడో" అంటూ ఆందోళించినవాడు కరిరాజే కానక్కరలేదు, ఏ మూగజీవికైనా ఇది చెల్లుతుంది. "ఇందు గలడందులేడని సందేహము వలదు" ఇది ఏ ప్రహ్లాద భాషితమో కానక్కరలేదు, ఏ దృఢసంకల్పునికైనా ఇది సరిపోతుంది. "ఊరక రారు మహాత్ములు" దీన్ని ఏ గర్గమునికో ముడివెట్ట నక్కరలేదు. ఇప్పటికీ ఏ మహానుభావుని రాకకైనా ఇది వర్తిస్తుంది. "ఎందరో మహానుభావులు" అన్నంత వ్యాప్తి పొందిన సూక్తి ఇది. అయితే ఈ సూక్తి సహజ గంభీర్యాన్ని కాస్తా వదలుకొని కాలంగడిచిన కొద్దీ ఛలోక్తిగా మారడం కూడా జరిగింది. అంటే సామెతలకోవలో చేరిందన్నమాట. ఒక కవి రచించిన పద్యపాదాలు సామెతలుగా, లోకోక్తులుగా చెలామణి కావడం కంటె ఆ కవికి అంతకు మించిన ప్రాచుర్యం ఏముంది? ఇలా లెక్కించుకుంటూ పోతే, పోతన్న వందలాది పద్యాల్లోంచి వేలకొద్దీ పాదాలను ఉదాహరించవలసివస్తుంది. ప్రాచీనాంధ్ర కవులలో బహుళంగా ఉదాహరింపబడుతున్న వాళ్ళల్లో ఇద్దరే ఇద్దరిని చెప్పుకోవాలి. ఒకడు పోతన్న. మరొకడు వేమన్న. వేమన్న అక్షరాలా ప్రజాకవి. అధిక్షేపం అతని ఆయుధం. సంఘసంస్కరణం అతని లక్ష్యం. అతని ప్రతిపద్యం ప్రజలజీవితాలకు సంబంధించిందే. అతని ప్రతి విసురు పచ్చని ప్రజాజీవనాన్ని తొలిచే చీడపురుగులకు సంబంధించిందే. ప్రజలభాషలో ప్రజల సమస్యలను చిత్రికపట్టి వేమన్న ప్రజాకవియైనాడు. భాగవతుల భక్తిభావనలను సామాన్య ప్రజల ఆర్తికి పర్యాయంగా సమన్వయించి పోతన్న ప్రజాకవి యైనాడు. బమ్మెరకు వెళ్ళి అక్కడి పొలాల నడిగితే చెబుతాయి "ఇదిగో! ఇది పోతన్నగుడి! అదిగో! అది మల్లన్నమడి" అని. పోతన్న గుడి నిజంగా గుడి కాదు, పాతుకొని ఉన్న ఒక రాతిపలక. ఆరాతిపలకను పోతన్నకు ప్రతిరూపంగా నేటికీ అక్కడి పల్లీయులు భావించు కుంటున్నారంటే ఇప్పటికీ

పోతన్న ఎంత సజీవంగా ఉన్నాడో ఊహించుకోవచ్చు. మరి మల్లన్నమడి మాటేమిటి? ఈ పోతన్న కొడుకైన రైతన్న దున్నిన పొల మది. కవితాకేదారాన్ని పండించిన హాలికుడుగా అన్నివేళలా తలచుకోవడానికి అనువైన పద్యఖండాలను అందించిన ఆదర్శమానవుడుగా పోతన్న చిరంజీవి. భావికవులను బహూకరించిన ఆ పరమ భాగవతునికి తప్ప అంతంత మాత్రంవానికి ఉంటుందా ఇంతటి సముజ్జ్వల భావి. ఎప్పుడో పొట్టివడుగైన వామనమూర్తి ఇంతై అంతై అంతంతై మూడు లోకాలను ఆక్రమించినట్లు – ఎక్కడో బమ్మెరవంటి చిట్టూరిలో పుట్టిన పోతన్న మూడు కాలాలను ఆకట్టుకునే అమృత కృతులను నిర్మించగలిగినాడు. అవతారికలో అతడు నివేదించుకొన్నఈ పద్యం చూడండి –**"ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీయుర్విం బురాణావళు ల్తెనుగుం జేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు తా నెట్టిదోతెనుగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నాజననంబున్ సఫలంబు జేసెదు బునర్జన్మంబు లేకుండుగన్"** భాగవతాన్ని తెనిగించి పోతన్న తనజన్మను సఫలం చేసుకున్నాడు. ఆ భాగవత పద్యాలను పఠించి తెలుగు ప్రజలు తమ జీవితాలనే పండించుకున్నారు.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

- డా॥ సి. నారాయణరెడ్డి

(యువభారతి వారి వికాసలహరి ఉపన్యాస మంజరి నుండి)

భక్త కవిరాజు – శ్రీరామదాసు

శ్లో॥ దక్షిణేతు కరే కుంభం వామే వరుణ పాశకం ।
దధానా ద్విభుజా పూజ్యా సద్యోమకరవాహనా ॥

భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన ఇతని అసలు పేరు కంచెర్ల గోపన్న 1620 లో, ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో లింగన్నమూర్తి, కామాంబ దంపతులకు జన్మించినాడు. వీరి భార్య కమలమ్మ శ్రీరాముని కొలిచి, కీర్తించి, భక్త రామదాసుగా సుప్రసిద్ధుడైనాడు. భద్రాచల దేవస్థానమునకు, ఇతని జీవిత కథకు అవినాభావ సంబంధము. తెలుగులో కీర్తనలకు ఆద్యుడు. దాశరధి శతకము, ఎన్నో రామ సంకీర్తనలు, భద్రాచలం దేవస్థానము – ఇవన్నీ రామదాసు నుండి తెలుగు వారికి సంక్రమించిన పెన్నిధులు. ఇతని గురువు శ్రీ రఘునాథ భట్టాచార్యులు. (కబీర్ దాసు గారు రామదాసునకు తారక మంత్రముపదేశించిరని కూడా ఒక కథ యున్నది)

గోపన్న మేనమామ మాదన్న అప్పటి గోల్కొండ నవాబు తానీషాగారి కొలువులో పెద్ద ఉద్యోగి. మేనమామ సిఫారసుతో గోపన్నకు పాల్వంచ పరగణా తహసిల్దారు పని లభించింది. గోదావరి తీరములోని భద్రాచల గ్రామము ఈ పరగణాలోనిదే. వనవాసకాలమున సీతా లక్ష్మణులతో శ్రీరాముడు ఇక్కడే పర్ణశాలలో నివసించెననీ, భక్తురాలైన శబరి ఆతిథ్యము స్వీకరించెననీ స్థలపురాణము.

ఆలయ నిర్మాణం

పోకల దమ్మక్క అనే భక్తురాలు అక్కడి జీర్ణదశలోనున్న మందిరమును పునరుద్ధరింపవలెనని గోపన్నను కోరగా, స్వతహాగా హరి భక్తులైన గోపన్న అందుకు అంగీకరించాడు. ఆలయనిర్మాణానికి విరాళములు సేకరించాడు గాని, అది చాలలేదు. జనులు తమ పంటలు పండగానే మరింత విరాళములిచ్చెదమని, గుడి కట్టే పని ఆపవద్దనీ కోరినారు. అప్పుడు అతను తాను వసూలు చేసిన శిస్తునుండి కొంతసొమ్ము మందిరనిర్మాణ కార్యమునకు వినియోగించెను.

గోపన్నకు జైలు శిక్ష

కోపించిన నవాబుగారు గోపన్నకు 12 ఏండ్ల చెరసాల శిక్ష విధించాడు. గోల్కొండ కోటలో ఆయన ఉన్న చెరసాలను



ఇప్పటికీ చూడవచ్చును. ఖైదులో నున్న రామదాసు గోడపై సీతారామలక్ష్మణాంజనేయులను చిత్రించుకొని, వారిని కీర్తించుచూ, ఆ కరుణా పయోనిధి శ్రీ రాముని కటాక్షమునకు ఆక్రోశించుచూ కాలము గడిపినాడు. రామదాసు యొక్క మార్దవభరితమైన ఎన్నో ప్రసిద్ధ సంకీర్తనలు ఈ కాలములోనే వెలువడినాయి. "నన్ను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి", "పలుకే బంగారమాయెనా", "అబ్బబ్బో దెబ్బలకునోర్వలేనురా" వంటివి. అతని బాధను వెళ్ళగక్కిన "ఇక్ష్వాకు కులతిలక, ఇకనైన పలుకవే రామచంద్రా", కీర్తన బాగా ప్రసిద్ధి చెందినది– "నీకోసము ఇంతింత ఖర్చు పెట్టాను. ఎవడబ్బ సొమ్మని కులుకుచున్నావు? నీబాబిచ్చాడా? నీ మామిచ్చాడా?" – అని వాపోయి, మరలా – "ఈ దెబ్బలకోర్వలేక తిట్టాను. ఏమీ అనుకోవద్దు. నా బ్రతుకిలాగయ్యింది. నీవే నాకు దిక్కు" – అని వేడుకొన్నాడు. అతను సీతమ్మ వారికి చేయించిన చింతాకు పతకము, లక్ష్మణునకు చేయంచిన హారము, సీతారాముల కళ్యాణమునకు చేయించిన తాళి వంటి ఆభరణాలు ఇప్పటికీ దేవస్థానములోని నగలలో ఉన్నాయి.

రామ లక్ష్మణుల తిరిగి చెల్లింపు

అతని కర్మశేషము పరిసమాప్తి కాగానే, రామ లక్ష్మణులు తానీషా గారి వద్దకు వెళ్ళి, ఆరు లక్షల వరహాలు శిస్తు సొమ్ము చెల్లించి, రామదాసు విడుదల పత్రము తీసుకొన్నారని ప్రతీతి. ఆప్పుడిచ్చిన నాణెములను రామటంకా నాణెములని అంటారు. వీటికి ఒకవైపు శ్రీరామ పట్టాభిషేకము ముద్ర, మరొకవైపు రామభక్తుడు హనుమంతుని ముద్ర ఉన్నాయి. ఇవి ఇప్పుడు కూడా ఉన్నాయి. రామదాసు గొప్పతనము తెలిసికొన్న నవాబుగారు వెంటనే ఆయనను విడుదల చేయించి, భద్రాచల రాముని సేవా నిమిత్తమై భూమిని ఇచ్చారు. శ్రీ సీతారామ కళ్యాణ సమయంలో గోల్కొండ దర్బారు నుండి ముత్యాల తలంబ్రాలను పంపే సంప్రదాయము అప్పుడే మొదలయ్యింది. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ ప్రభుత్వము ద్వారా ఈ ఆనవాయితీ కొనసాగుతున్నది.

వాగ్గేయకారులలో ఆద్యుడు

శ్రీ రాముని సేవలో, సంకీర్తనలో రామదాసు తమ శేషజీవితమును గడిపాడు. త్యాగరాజాదులకు అతను ఆద్యుడు, పూజ్యుడు. త్యాగరాజు కీర్తన – "ధీరుడౌ రామదాసుని బంధము దీర్చినది విన్నానురా రామా?" – ఇంకా ప్రహ్లాదవిజయములో "కలియుగమున వర భద్రాచలమున నెలకొన్న రామచంద్రుని పాదభక్తులకెల్ల వరుడనందగి వెలసిన శ్రీరామదాసు వినుతింతు మదిన్" – అన్నాడు.

భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన ఇతని అసలు పేరు కంచెర్ల గోపన్న శ్రీరాముని కొలిచి, కీర్తించి, భక్త రామదాసు గా సుప్రసిద్ధుడైనాడు. తెలుగులో కీర్తనలకు ఆద్యుడు. దాశరధి శతకము, ఎన్నో రామ సంకీర్తనలు, భద్రాచలం దేవస్థానము – ఇవన్నీ రామదాసు నుండి తెలుగు వారికి సంక్రమించిన పెన్నిధులు.

శ్లో. శ్రీ రామచంద్ర శ్రితపారిజాత
సమస్త కళ్యాణ గుణాభిరామ
సీతా ముఖాంభోరుహ చంచరీకో
నిరంతరం మంగళ మాతనోతు

- మరుమాముల దత్తాత్రేయ శర్మ

❖ ❖ ❖

గోదావరీ ప్రేంఖణం

రచన: **ఆచార్య వి.యల్.యస్. భీమశంకరం**

ఉ. స్థైరవిహారధీరయగు శారదనీర తరంగరంగ గం
భీరము గౌతమీనదము ప్రేంఖణ నడ్డిడి పాపికొండలన్
భోరున చీల్చి నిమ్నతల భూముల దూకెడువేళ చూపు శృం
గార విలాసముల్ కనగ కన్నుల పండువ గాదె యేరికిన్.

శా.కన్నుల్ చాలవు చూడ ముచ్చటలునౌ కల్యాణి గోదావరీ
న్నీరంబులు, త్ర్యంబకేశ్వర పదోత్పన్నంబులౌ నిత్య సం
పన్నంబుల్, బహుళాంధ్ర ధీరవనితాప్రాగల్భ్య సంఘాతమౌ
విన్నాణంబులు, నాట్యభంగిమలు, సంవేగ ప్రతిధ్వానముల్.

ఉ. భద్రగిరీశు భవ్యపదపద్మ గవేషుడు రామదాసు హృ
న్ముద్రల తెల్గు వెల్గు పదమోహరమందు పసందు విందులన్,
తద్రస మాధురీ నిర్ఝురుల తన్మయతన్ విహరించి మించు నా
భద్రవతిన్ కనంగ మది ప్రాప్తముగావె యనేక లాస్యముల్.

శా. రంగత్తుంగ తరంగ రంగములునై రంజిల్లు వైభోగముల్,
పొంగంబారెడు బుద్బుదంబులు వళీపుంజంపు సందోహముల్,
సాంగోపాంగముగాగ పూర్ణ, శబరీ సాంగత్య మాంగళ్యముల్,
గంగామౌళి వసించు క్షేత్రవర శృంగాలింగనాభంగిమల్.

ఉ. పట్టిన వీరభద్రు శుభపాద పవిత్ర మహత్వయౌచు, నే
పట్టున నిల్వనొల్లక అపాంపతి శీఘ్రుమె జేరు నిచ్ఛతో,
గట్టుల కోనలన్ దుమికి గాఢ తరంగ పృషంతిభంగ, అ
ప్పట్టున నేడు పాయలయి పావన సప్త ఋషీశ్వరాన్వయై.

శా. అక్షయ్యంబుగ సప్త నిర్ఝురుల అన్యోనానుసంధానమౌ
సుక్షేత్రంబుల శ్రీ ఉమాసహిత తేజోమూర్తియై శర్వుడున్
సాక్షాత్కారము నిచ్చు నాశ్రితజనాశామోదమై, యందునన్
దక్షారామము క్షోణిపై వెలసె సత్యంబైన కైలాసమై.

ఉ. ఎన్నగ తెల్గు సాహితికి నేర్పడ వాగనుశాసనుండు సం
పన్న మనోభిరామముగభారతసంహిత నాంధ్రభాషలో
నెన్నికగల్గురీతి వెలయించిన నన్నయభట్టు వాక్కులో
నన్నువ గౌతమీజలములందున కన్పడు భావుకాళికిన్.

❖ ❖ ❖

భూషణ వికాస!... శ్రీధర్మపుర నివాస!!

ఆర్ద్రత... భక్తిపరిపక్వత... 'ప్రజాకవి శేషప్ప' సొంతం

యావదాంధ్ర దేశంలో వీధిబళ్లలో చదివించి, ఆంధ్రుల కందరికీ కంఠస్థంగా జీవితాంతం వెంబడి ఉండే శతకంగా నరసింహ శతకానికి ప్రశస్తి ఉంది. "భూషణ వికాస శ్రీధర్మపుర నివాస, దుష్టసంహార నరసింహ దురితదూర" అన్న తేటగీతి చివరి రెండు పాదాల మకుటంతో నరసింహ శతకం జగద్విఖ్యాతం. ఈ శతక రచనద్వారా శేషప్ప ధన్యుడైనాడు.

శేషప్ప జీవితవిశేషాలు సాహిత్యలోకంలో చాలామందికి విశేషంగా తెలియవు. ఈతడు ధర్మపురి నివాసి. ఈతని పూర్వీకులు అదిలాబాద్ జిల్లా నిర్మల్ తాలూకాలోని మోటాపూర్ (మోటపురం), గోదావరికి అవతలి ఒడ్డునగల గ్రామం నుండి వలసవచ్చి ధర్మపురిలో స్థిరపడ్డారు. ధర్మపురిలో లభించిన ఒక సన్నద్ (రాజాజ్ఞ) పత్రం ప్రకారం శేషప్ప, నరసింహస్వామి ఆలయంలో సంవత్సరానికి 3 రూపాయల వేతనంతో దీపరక్షకునిగా, దేవాలయ రక్షకునిగా (వాచ్‌మన్) నియమింపబడ్డాడు. ఈ వేతనం చాలదని దేవాలయ పారుపత్తెంకల బ్రాహ్మణ జాగీర్దారుల ఈతనికి గ్రామంలో భిక్షాటన జరిగేలా కట్టడి చేసారు. "పెట్టజాలక యేల భిక్షమెత్తించెదు" అని శేషప్ప నరసింహునితో మొరపెట్టుకున్నాడు. జీతం సరిగ్గా అందేదికాదు. కటకట పడేవాడు. "కువలయశ్యామ నీకొలువు చేసిననాకు జీతమెందుకు ముట్టజెప్పవైతి" (నరసి. 47) అని, "తిరుపతి స్థలమందు తిన్నగా నేనున్న వేంకటేశుండామేతవేయలేడ? శ్రీరంగమునకు నేజేరబోయినఁ జాలు స్వామి గ్రాసముపెట్టి సాకలేడ!" (నరసిం. 85ప.) అని నరసింహునితో నిష్ఠూరాలాడినాడు. శేషప్ప ధర్మపురివాడు కాదని తిరుపతి వాడని ఈ పద్యమును చూపి నిర్ధారింపబూనినారు కొందరు. (చూ. నరసింహ శతకం – శ్రీపావని సేవాసమితి ప్రచురణ, హైద్రాబాద్) ఇది అసమంజసము. ధర్మపురివాడైన సుప్రసిద్ధ స్మృతికారుడు యావద్భారత విఖ్యాతమైన ప్రయోగపారిజాతకర్త నరసింహసూరిని, శేషప్ప తన యక్షగానములో 'సౌర్యుడ'ని స్మరించి పూర్వకవి స్తుతిలో నమస్కరించినాడు. శేషప్ప ధర్మపురివాడనుటకు ఇదొక సాక్ష్యము.

శేషప్ప గొప్ప సంగీతజ్ఞుడు. వీణ వాయించేవాడు. మృదంగవిద్య తెలుసు. "నీ కథ పాడు కొందు వీణ తాలములనెపుడు" (నృకే. 21 ప.) అని చెప్పుకొన్నాడు. ఈతడు వేశ్యల ఇండ్లకు బోయి మృదంగం వాయించేవాడు. ఒక స్థానిక కథ ప్రకారం కోడెకారు కుర్రాళ్ళు కొత్తగా ధర్మపురి వచ్చిన వేశ్యకై నట్టువాంగంలో మృదంగం కావల్సివచ్చి యౌవనంలో వేశ్యలవద్ద మృదంగం వాయించినవాడేనని వృద్ధాప్యంలో భక్తుడైన ఈ మహనీయుని మృదంగ వాదనకు బలవంతం చేసి, విననందుకు మోదినారు. శేషప్ప ఆ బాధలో గుడికి వెళ్లి స్వామికి ఆర్తితో విన్నవించుకొన్న హృదయనివేదనే నరసింహ శతకంలోని కొన్ని పద్యములుగా రూపుదిద్దుకొన్నవి అని స్థానిక కథనం. క్షేత్రమైన ధర్మపురిలో వేశ్యలకు కొదువలేదు. పింగళిసూరన ధర్మపురిలోని వేశ్య ఇంట కొంతకథను కళాపూర్ణోదయ కథగా మలచినాడు. (చూ. కళాపూర్ణో 6వ అశ్వా. 139-144) వేశ్యలు 'కేళిక' అనబడే విశేష నృత్యం ధర్మపురి నారసింహునికి అర్పించేవారని నటరాజరామకృష్ణ రాసినారు. స్వయముగా శేషప్పే తాను వేశ్యల ఇండ్లకు వెళ్లేవాడినని, ఆ వ్యసనం మాన్పమని స్వామిని వేడికొన్నాడు. "నా మది వారాంగనల పాలుగాకుండ పతి! నన్ను జేర్చుకుంటేమి కీడు" (నరహరి శ. 67) ధనవంతుడై వేశ్యా సంపర్కము గలవాడుగాక మృదంగకారునిగా సాంగత్యము

కల్గిఉండి ఉంటాడు. నిత్యదారిద్ర్యం అనుభవించిన శేథషప్ప వారాంగనల తృప్తిపెట్టే ధనమున్నవాడు కాడు.

శేషప్ప తల్లిపేరు లక్ష్మి అని నరహరి శతకం (73)లో చెప్పుకున్నాడు.

లక్ష్మీపతివి నీవు లక్ష్మీ సుతుడనేను
తండ్రి కొడుకులు సత్యముగ మనము
పాపాంతకుడవీవు పాపకర్ముడనేను (నరహ. 73)

అని రాసుకున్నాడు. ఈతని కూతురు గంగ (గంగమాంబ). సుతులు లేరు. గంగమాంబ కుమారుడే కాకుత్థ్సపుటింటి నరసింహదాసు. (దౌహిత్రుడు కృష్ణశతకకారుడు). శేషప్పకు పురుష సంతానము లేదు. పున్నామనరక విముక్తి లేదన్న (అపుత్రస్య గతిర్నాస్తి) సమకాలికుల నిరసనలకు జవాబుగా ఆడపిల్లల తండ్రులు సువర్ణాక్షరాలతో లిఖించి దాచుకొనతగిన అందమైన సత్యమును ఒక పద్యమున చెపి&ఉపనాడు.

సుతులు లేకుంటె సద్గతి లేదనిరిగాని
తాను ధన్యుండైన తనయులేల?

అంతేకాదు పుత్రులుండి ప్రత్యక్ష నరకం చూపేవారుంటే ప్రయోజనం ఏమిటి అని

ధృతరాష్ట్రునకు దండి సుతులు నూర్గురుండి
తాముద్ధరించిరా తండ్రినెల్ల!

అదే పద్యము (నరహరి శ.52)లో చెప్పినాడు.

శేషప్ప అనంతపురం జిల్లా వాడని జనుమంచి సుబ్రహ్మణ్య శర్మగారన్నారు. ఇంటిపేరు యాయవారం వారన్నారు. ఎలా చెప్పగలిగారో ఆయనకే ఎరుక.

శేషప్ప ధర్మపురి వాడు కాదేమోనని "తిరుపతి..." అన్న పద్యమును బట్టి చెప్పినది ప్రమాదకారణము. మానవల్లి రామకృష్ణకవి కురుగంటి సీతారామభట్టాచార్యులు, శేషాద్రి రమణకవులు, ఆరుద్ర ధర్మపురి వాడేనని చెప్పినారు. ఈ విషయంలో చర్చ అక్కరలేదు. స్థానిక కథనంతోబాటు శేషప్ప తన ఊరు ధర్మపురి అని చెప్పికొన్నాడు.

పుట్టితి మీ పదాబ్జముల భూమిని, నా తలవంచి దండముల్
బెట్టితి, నీదుపేరిట కుఠారము చేత ధరించి.....

(నృకే. 19వ)

ఈ పద్యంలో శేషప్ప దేవాలయ రక్షకునిగా ఆయుధం చేత బట్టానని కూడా చెప్పుకున్నాడు. పద్యములలో, భాషలో శేషప్ప ధర్మపురివాడన్నదే స్పష్టము.

శేషప్పకాలం గూర్చి చెపుతూ మానవల్లి రామకృష్ణ కవిగారు 1000 సం।లకు పూర్వుడన్నారు. నేదునూరి గంగాధరంగారి పరిష్కరణలో నరసింహశతకం (కొండపల్లి వారి ప్రచురణ 1961) పీఠికలో ఇది చెప్పబడ్డది. శేషాద్రి రమణకవులు శతాబ్దిముందు వాడన్నారు. వారన్ననాటికి 100 ఏండ్ల క్రితమంటే క్రీ.శ. 1826. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు 19వ శతాబ్దం వాడన్నారు. శేషప్ప క్రీ.శ. 1735లో పుట్టి క్రీ.శ. 1815 వరకు అనగా 80 సం. సంపూర్ణ ఆయుర్దాయంతో బతికినాడు. దీనికి గతంలో చెప్పిన 'సన్నద్' ఆధారం. అంతేగాదు నరసింహశతకం వ్రాతప్రతి లభించినవానిలో అతి ప్రాచీనమైన ప్రతి క్రీ.శ. 1824 నాటిది. దీనిని నాచారంలోని



(గజ్‌వేల్ తాలూకా) ములుగు భీంరావ్‌దేశ్‌పాండే వ్రాసుకున్నాడు. ప్రతిలో రాసిన కాలం "తారణ నామ సంవత్సర ఆషాఢ బహుళ పంచమి బేస్తవారం 1239 హిజ్రీ"గా నమోదు చేసినాడు. అంటే క్రీ.శ. 1824. గజ్వేల్ ప్రాంతీయులు నరసింహుని భక్తులుగా, తూముకుంట వాసి శివలూరి అల్లయ సుతుడైన అన్నమంత్రి శాసనం ధర్మపురిలో శివాలయకుడ్యంపై లభించినది చెప్పుతున్నది. (నా రచన – ధర్మపురి క్షేత్ర చరిత్రలో ఈ శాసన విషయం రాసాను). దీనికి ముందు కాలంలోనే శేషప్ప నరసింహశతకం రాసినాడు. నరసింహ శతకం కంటే ముందే రాసిన నృకేసరి శతకంలో (1) గోవధజేయు మ్లేచ్ఛులకు గొబ్బునలేచి సలాము చేతురున్ (93 ప.), (2) దిద్దక ఏసు మంత్రముపదేశములిత్తురు కాసులాసకై (94ప.) అన్నచోట్ల, ముస్లింలను, క్రైస్తవులను పేర్కొనుటచే శేషప్ప కాలం చాలా ప్రాచీనం కావటానికి వీలులేదు. దీని తొలిముద్రణ క్రీ.శ. 1868. ధర్మపురి రామాయణం తొలిముద్రణ క్రీ.శ. 1889

శేషప్ప మూడు శతకాలు రాసినాడు. నరహరి, నృకేసరి, నరసింహ శతకములు. ఈ మూడింటిని ధర్మపురివారైనా కీ.శే. శ్రీమధ్వాచారి శ్యామసుందరశాస్త్రి (నాకు సంస్కృత పాఠశాల ధర్మపురిలో సహవ్రతులు, హిందీభాషా గురువులు) త్రిశతిపేరిట అచ్చువేసినారు. ఈ శతకములే కాక ఈతని రచనలు 'అవనిజా చరిత్రమ'న్న కావ్యము. ధర్మపురి రామాయణమన్న యక్షగానమును, కొన్ని భజనలు (ధర్మపురి నరసింహుని మీద రాసి, సంగీతము కూర్చి పాడినవి) లభిస్తున్నాయి. 'అవనిజా చరిత్రము' అలభ్యం. 'ధర్మపురి రామాయణం సుప్రసిద్ధ యక్షగానం. కరీంనగర్ జిల్లాలో యక్షగానాలకు ఆదరణ ఎక్కువ. ఇల్లంతకుంట రామాయణము, మంథని రామాయణమన్న రెండు యక్షగానాలు ఈ జిల్లాలోనివే. శేషప్పకు తరువాతివి. నేటికి 20 గ్రామాల్లో పలు కుటుంబాలవారు యక్షగానాలాడే వారున్నారు. మనుమడు నరసింహదాసు కూడా మైరావణ చరిత్రమన్న యక్షగానము రాసినాడు. ధర్మపురి రామాయణము మూడు రోజులు ఆడబడేది. ఆటగాక పాటగా త్రితార తంబూరను భూమిపై పడుకోబెట్టి సన్నని పొడవైన కర్ర బెండులతో కొట్టి రాగయుక్తంగా చదవడమనే పద్ధతి నేటికి ఉంది. శేషప్ప దీనిలో నాయకుడైన రామునకు నరసింహునకు అభేదము పాటించినాడు. రాముడు సీతనడవికి పంపెనని రాయడానికి బదులు 'నరసింహుడు' సీతనడవికి పంపెనని' రాసినాడు. ఇది త్యాగయ్య స్వీకరించినట్టున్నాడు. తన ప్రహ్లాద భక్త విజయంలో నాయకుడైన నరసింహుని రామునిగా జూచుకొని 'హిరణ్యకశిపుడు స్తంభముపై వేటు వేయగా స్తంభమునుండి రాముడు వచ్చినట్లుగా రాసినాడు. (పై వాక్యములు పాఠకులకు అర్థం కావాలని నేను 'మాదిరిగా' రాసినవి). ఆ భక్తులకు దశావతారములు విష్ణుస్వరూపమే. శేషప్పకు 50 సంవత్సరముల తరువాతివాడు త్యాగయ్య.

శేషప్పలోని అప్ప శబ్దమును జూచి కొందరు శేషప్ప అనంతపూర్ జిల్లా వాడనుకొన్నారు. పైగా ధర్మపురి అని మరొకటి కన్నడ దేశమునకుఉ దక్షిణముగా తమిళదేశమున ఉండుట దీనికి కారణము. వీరికి ఆంధ్రదేశంలో తెలంగాణాలో ధర్మపురి అనే సుప్రసిద్ధ నారసింహక్షేత్రం ఉందన్న సంగతి తెలియదు. తమిళదేశపు ధర్మపురి, నారసింహ క్షేత్రము కాదు. దీనంత ప్రాచీన నగరమూ కాదు. పైగా అప్ప శబ్దవాచ్యులు తెలంగాణలో ఉండుటకు కారణము కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు క్రీ.శ. 8వ శ. నుండి 11వ శతాబ్దం వరకు రాష్ట్రకూట, పశ్చిమ, వేములవాడు చాళుక్య చక్రవర్తుల ఏలుబడిలో కన్నడ దేశములవలెనే ఉన్నవి. ఈ జిల్లాలోని సగం శాసనాలు కన్నడ శాసనాలే. వేములవాడ, బోధన్‌లలో నివసించి, ధర్మపురిని అగ్రహారముగా గొన్న కన్నడ ఆదికవి పంపడు తన విక్రమార్జున విజయమును ఇక్కడే రాసినాడు. కాకతిరాజు (ప్రోలరాజు) ప్రోలరుసు అని. (నాందేడ్ శాసనంలో) ఇత్యాదిగా, దడ్డప్ప (బెక్కల్లు – క్రీ.శ. 12వ శ.శాస.) నారప్ప (నగునూరు – కరీంనగర్ జిల్లా శాసనం) మొ॥ కన్నడ నామాలవారు శాసనాల్లో పేర్కొబడ్డారు. దాని ప్రభావంతోనే ఇక్కడి అప్పశబ్దం ఉంది.

శేషప్ప వంశీకుల ఇంట శేషప్ప రచనలలోని మిగిలిన రెండు శతకాలు, ధర్మపురి రామాయణ యక్షగానం

లభించాయి. 'అవనిజా చరిత్రం' లభ్యంకాలేదు. ఆయన పూజించిన సీతారాముల విగ్రహాలు తమ ఇంట దేవతామందిరంలో ఉన్నాయని శేషప్ప వంశీకులగు కాకుత్థ్సం నారాయణగారు తెలిపినారు. శేషప్ప కట్టతో చెక్కిన నరసింహ విగ్రహం వీరింట పూజామందిరంలో ఉంది. దాని వివరాలు శేషప్ప నరసింహ శతకం 87వ పద్యంలో చెప్పినాడు. శేషప్ప ఇల్లు కోవెలనుండి గంగకు వెళ్లే దారిలో ఎడమవైపు గోదావరి ఒడ్డునర నేటి శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాలకు పక్కన ఉండేది. వరదలకు కొట్టుకుపోయిన సంగతిని 'గంగ ఒడ్డున ఇల్లు గట్టినట్టు' అని వ్యర్థయత్నముగా శేషప్ప నరసింహ శతకంలో సూచించినాడు. ప్రస్తుతం ఆ స్థలం వారి వంశీకుల మధ్య వివాదంలో ఉంది.

శేషప్ప వంశీకులు కాకుత్థ్సం నారాయణగారింట లభించిన నరసింహ శతకంలో చివరి ఈ పద్యం అధికంగా ఉంది.

శ్రీనృకేసరిదేవ శేషాచలమనెడి
దాసుడర్పించు పద్యములు నీకు
సరిపోని ప్రాసలు వ్యంగ్య వాక్యాల,
కేనాడు తప్పులు నెంచబోక
క్షమియించి దయచేసి కలుషముల్ దొలగించి
నీ కటాక్షంబుంచి నిర్వహించి
ప్రీతి వాసిన జదివిన భక్తితో విన్న
వారికాచంద్రార్క వంశవృద్ధి
గీ. ఆయురారోగ్య సర్వసౌఖ్యంబు లొసగి
పావనుల జేసి రక్షించు పరమపురుష!
భూషణ వికాస! శ్రీధర్మపురి నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

ఈ పద్యాన్ని ఇందవరపు నరసింగరావు గారు ఉదాహరించినారు.

శేషప్ప పేరునుబట్టి ఇతడు కన్నడ ప్రభావిత ప్రాంతం వాడని పొరబడ్డవారికి మరో విషయం తెలియదు. ఈతనికి కేవలం ఈ పేరే కాకుండా శేషచలదాసు, శేషాచలం అని కూడా వ్యవహార నామాలున్నాయి. తాను రాసిన మూడు శతకాల్లో తన వ్యవహార నామాలు మూడు విధాలుగా చెప్పుకున్నాడు. "శేషాచలదాసు నేలుత ముని సన్నుత ధర్మపురీ నృకేసరీ (నృకే. శ. 108) అని చెప్పుకున్నారు. "శేషప్పయను కవి చెప్పిన పద్యముల్ చెవులకానందమై చెలగుచుండు" (నరసి. శ. 100ప.), "శ్రీనృకేసరిదేవ! శేషాచలమనెడి దాసుడర్పించు పద్యములు నీకు" అని నరసింహశతక వ్రాత ప్రతి పద్యాల్లో ఉంది. (ఇది 101వ నరసింహ శతకపద్యం. నరసింహశతకం ముద్రితం నూరుపద్యాలే.) నయముగ రామాయణంబు శ్రీకరము / శేషాచలాఖ్యుడు శ్రీధర్మపురీ నృహరి కర్పణముగ అని – యక్షగానంలో చెప్పుకొన్నాడు.

(1) నృకేసరి శతకం చంపకోత్పల మాలలతో 108 పద్యాలతో **'ధర్మపురీ నృకేసరీ'** అనే మకుటంతోనూ, (2) నరహరి శతకం సీసపద్యాలు 75 పద్యాలతో **"చక్రధర ధర్మపురిధామ సార్వభౌమ, నరహరే భక్తజనకల్ప నాగతల్ప"** అనే మకుటంతో, (3) సుప్రసిద్ధ నరసింహ శతకం సీసపద్యాలు నూరు పద్యాల్లో **"భూషణ వికాస శ్రీధర్మపురి నివాస దుష్టసంహార నరసింహ దురితదూర"** అనే మకుటంతోనూ అలరారుతున్నాయి. నృకేసరి, నరహరి శతకాలు తొలిరచనలు వీటిని దిద్ది, మధుర వ్యక్తీకరణ ఘటితతో నరసింహశతకం పక్వ దశలో రాసినట్టు కనబడుతున్నది. నరసింహశతకం క్రీ.శ. 1800 ప్రాంతపు రచన ప్రౌఢ నిర్భరవయఃపరిపాక సృజన. నరహరి, నృకేసరి, నరసింహ శతకములను, వీటి రచనాకాలమును, పౌర్వాపర్యముగా, శైలినిబట్టి నిర్ధారింపవచ్చును. శతకములలో వైయక్తిక విషయములు రాసేందుకు కావ్యాలలో అవతరాఇకలలోవలె సౌకర్యంలేదు. అయినా తొలి రచనలలో తన జీవిత విశేషాలు కొన్ని శేషప్ప చెప్పుకొన్నాడు. నివాస, మాతృనామ, వృత్తి, వైయక్తిక బలహీనతలు ఆర్థిక స్థితిగతులు తొలి శతకాల్లోనే చెప్పడంవల్ల నరసింహ శతకంలో వాటిని చెప్పలేదు. ప్రసిద్ధ నరసింహ శతకంలో లేకపోవడం, ఇతర శతకాలకు తెలుగునాట ప్రచారం లేకపోవడం వల్ల శేషప్ప జీవిత విశేషాలు చాలామందికి

తెలియకుండా పోయినవి. నృకేసరి శతకం శేషాద్రి రమణ కవులచేత పరిష్కృతం.

శేషప్ప గొప్ప పండితుడను కానని చెప్పుకొన్నాడు. కాని ఆ చెప్పుకొన్నది వినయంతోనే, "నీ కటాక్షంబున నేరచించితిగాని ప్రజ్ఞ నాయిదిగాదు ప్రస్తుతింప" అన్నపుడే తెలుస్తోంది.

గణ యతి ప్రాస లక్షణము జూడగ లేదు
పంచకావ్య శ్లోక పఠన లేదు
అమరకాండత్రయం బరసి చూడగ లేదు
శాస్త్రీయ గ్రంథముల్ చదువలేదు

అన్నమాట ఔపచారికమే. నృకేసరీశతకంలో సైతం

అమరము పంచకావ్యములనైన పఠింపగలేదు లెస్సగా
శ్రమపడి ప్రాస, విశ్రమ విచారము జేయగలేదు నేకవి

(నృకే. 2ప)

అని చెప్పుకొన్న ఇతని పాండిత్యానికేం లోటులేదు. "తప్పుగల్గిన సద్భక్తి తక్కువౌనె చెఱుకునకు వంకబోతేనె చెడునె తీపి" అని చక్కని అర్థాంతరన్యాసంతో చెప్పినాడు. శేషప్ప కవితలో తప్పులు లేవు. పైగా తన ధర్మపురి రామాయణం యక్షగానములో బాలకాండ ప్రారంభశ్లోకం సంస్కృతంలో, ద్వ్యర్థిగా రాసినాడు.

శ్లోకసార సమాకీర్ణం, సర్గకల్లోల సంకులం
కాండగ్రాహ మహామీనం, వందే రామాయణార్ణవం

దీంట్లో రామాయణం సముద్రంతో పోల్చబడింది. ఇది శ్లేష చమత్కార శ్లోకం. పాండిత్యం లేనిది రాయగల్గేది కాదు.

నరహరి శతకం తొలిరచన. సీసపద్య రచన ఐనా నరసింహ శతకధార, సీసం తూగు దీనికిలేదు. చాలా భావాలు తిరిగి నరసింహ శతకంలో అందంగా చెప్పబడ్డాయి. ఇది నరసింహ శతకానికి పూర్వరచనగానే ఉంది. నరసింహ శతకంలో "తుల్యాన్యాయం" ఉంటుంది. ఇది సీసపద్యపు రచనలో ఉండే ప్రత్యేకత వృత్తచ్ఛందస్సులో సాధ్యపడదు. భావాలు పాదాల్లో సమతూకంతో సమాంతరంగా నడుస్తాయి. తక్కెడలోని పళ్లాలు నిమ్నోన్నతాలై, వ్యుత్క్రమంలో ఉన్నత నిమ్నాలైనట్టు నడపడం తులాన్యాయం అన్నాను. ఈ శైలి నరహరి శతకంలో తక్కువ.

ధర్మశాస్త్రంబులందరికైన వినజెప్పి నీచరకరక్మములందు నేను బడితి
కోడండ్ర మన్నించి గొప్ప బుద్ధులు సెప్పి అత్త తావిటకాండ్ర నంటినట్టు
చదువులు పొట్టకోసరము నేర్చితిగాని అందులో ధర్మంబులైతె నడుప
వాగ్జాన ఫలమేమి? నా పెద్ద తనమేమి? వేషభాషలెకాని వృత్తినెరిగి

(నరహరి శ. 21)

నరసింహ శతకంలో మొదటి నాలుగు పాదములలో విషయవిస్తరణ జరిగి, పై తేటగీతి రెండు పాదాలు ఉపసంహారాంశంగా (ఆపై రెండు పాదాలు మకుటమై, విషయం ఉండదు) ఉన్న భావపు తూగు నరహరి శతకంలో అరుదు. దీన్నిబట్టి నరసింహశతకం నాటికి సీసశైలి పక్వమైందని, కనుక ఇది (నరహరిశతకం) తొలి రచన అని భావించవచ్చు. ఇందులో వర్ణనాశైలి ఒక ప్రత్యేకత. కథ (వస్తువు) లేని శతకాల్లో వర్ణనలు కూడా ఉండవు. కాని దీనిలో నృసింహావతారగాథ ఉంది. (ప.సం.61) ఇలాంటివి మరికొన్ని (ఉదా. 65 ప.) చూపవచ్చును.

శేషప్ప శతకకర్తలలో అదృష్టవంతుడు. ఇతర శతకాలను కేవలం నచ్చినవారే చదివితే, శేషప్ప శతకం మాత్రం వీధిబళ్లల్లో కూడా పాఠ్యగ్రంథమై తెలుగువారందరికి కంఠస్థమైంది. ధర్మపురిలో బ్రాహ్మణులు వీధిబళ్లలో ప్రారంభించిన ఈ శతకం యావదాంధ్రదేశంలో వీధిబళ్లలో పాఠ్యమైంది. ఈనాటి ప్రభుత్వం పాఠశాల విద్యలో పాఠ్యనిర్ణయ సంఘం పెట్టిన గ్రంథమును అందరు చదివినట్లు నాడు ఆంధ్రదేశమంతా ఏకచ్ఛత్ర ప్రభుతలేని రోజుల్లో, రవాణా, ప్రసార సాధనాలు లేని రోజుల్లో రెండు శతాబ్దులు పల్లె పల్లెకు వీధి బళ్లల్లో ఏకాభిప్రాయంగా పాఠ్య గ్రంథమైందంటే శేషప్ప ధన్యుడే కదా! బాల్యంలో కంఠస్థం చేసిన పద్యం జీవితాంతం వెంబడిస్తుంది. నరసింహ శతకం తెలుగుజాతి నరనరాల్లో నిండింది. శతకంలో సారళ్యం, కంఠస్థ యోగ్యత, మనోహర కవిత, నీతి, ధర్మ, జ్ఞాన, వైరాగ్య, భక్తిబోధకాంశాలు, సీసపు నడకలు ఈ శతకాన్ని యావదాంధ్రుల హృదయాల్లో ప్రతిష్ఠింపజేసాయి. ఆంధ్రులు నరసింహారాధకులు. మిగతా రాష్ట్రాలకంటే ఆంధ్రదేశంలో

నరసింహారాధన అధికం. ఈ శతక ప్రచారానికి నారసింహుడు కారణం.

నరసింహ శతకం జద్విఖ్యాతం. ఈ విశేషణం ఔపచారికం కాదు. శతధా, సహస్రధా నిజం. ఎలాగంటే ఆఫ్రికా ఖండంపక్కన గల మారిషస్ ద్వీపంలో ఈ శతకాన్ని పండుగలలో పఠించడం నేను చూసాను. నేను మారిషస్ ద్వీపయాత్ర చేసినపుడు అక్కడి తెలుగువారు, శ్రీరామనవమి, దసరా, ఉగాది వంటి పండుగలలో దీపస్తంభం వెలిగించి చుట్టూ ఈ శతకం పాడుతూ ప్రదక్షిణస్తూ దీన్ని (వేదంలా) చదువుతారు. తొలితరం నిరక్షరాస్యులైన శ్రీకాకుళం, విశాఖ ప్రాంతాల నిమ్నవర్గాలవారు బ్రిటిషర్లచేత వంచించబడి సముద్రమార్గాన చెర బట్టబడి ఈ మారిషస్ ద్వీపంలో చెరుకు తోటల కూలీలుగా స్థిరపడి, మౌఖికంగా తమ ప్రాంతం నుండి తెచ్చుకున్న అలిఖిత నరసింహశతకం చదివేవారు. అదే సంప్రదాయం నేటికి మూడో తరంలో (వైదికులు ఆ ద్వీపంలో లేని కారణంగా) వేదంలా చదువుతున్నారు. నరసింహ శతకానికి ఒకదేశంలో ఇలా వేద ప్రతిపత్తి వచ్చింది. ఇది చారిత్రకాద్భుతం. సింహాచలం అప్పన్న కారణంగా తెలంగాణ కరీంనగర్ జిల్లా నుండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గుండా నాటి ప్రాచీన మార్గాన వెళ్లి విశాఖ, శ్రీకాకుళంలో స్థిరపడి, వీధిబళ్లలో పాఠ్యమై, నిరక్షరాస్యులకు కూడా కంఠస్థమై వారి వెంబడి మారిషస్ ద్వీపానికి వెళ్లి:ది. దీనికంతటికి కారణం శతకమాధుర్యం, నీతి, భక్తిబోధ.

శేషప్ప నరసింహ శతకం అతిసరళమై, సహజస్నిగ్ధమై, మనోహరమై, హృదయావర్జకమై, అయత్న కంఠస్థమై సాగుతుంది. శతకం నిండా సూక్తులే. ధర్మాలే. నీతిబోధలే. భక్తిమాధుర్యమే. (1) అర్థివాంఛకు నీక హాని జేయుటకంటె తెంపుతో వసనాభి తినుటమేలు (2) ఆడుబిడ్డల సొమ్ములపహరించుటకంటె బండకట్టుక సూతబడుటమేలు (10 ప.), (3) పసరంబు పండైన పసుల కాపరితప్పు (12 ప.) (4) అతివిద్య నేర్చుట అన్నవస్త్రములకే, (31 ప.), (5) బలగమందరు దుఃఖపడుట మాత్రమెగాని ఇంచుక అయుష్యమియ్యలేరు. శతవత్సరములదాక మితము చెప్పిరిగాని నమ్మరాదామాట నెమ్మనమున, (21 ప.), (6) మాన్యంబులీయ సమర్థుడొక్కడులేడు, మాన్యముల్ చెరుప సమర్థులంత, ఎండిన ఊళ్ళ గోడెరిగింపడెవ్వడు పండిన ఊళ్ళకే ప్రభువులంత (14 ప.) వంటివెన్నో ఉన్నాయి. ఈ శతకంలో (7) కోటివైద్యుల గుంపు గూడి వచ్చినగాని మరణమయ్యెడి వ్యాధి మాన్పలేరు (37 ప.), నీ కృపాపాత్రులకు జాతినీతులేల (74 ప.), వ్యాసుడే కులమందు వాసిగా జన్మించె (74 ప.) వంటి సమాజస్థితి, లోపదోషాలను చూపినాడు. (8) తల్లి గర్భమునుండి ధనము తేడెవ్వడు వెళ్ళిపొయ్యేనాడు వెంటరాదు, లక్షాధికారైన లవణమన్నమెకాని మెరుగు బంగారమ్ము మ్రింగబోడు (15ప.), (9) ధరణిలో వేయేండ్లు తనువు నిలువగబోదు, ధనమెప్పటికిని శాశ్వతముగాదు (32 ప.), (10) పచ్చి చర్మముతిత్తి పసలేదు దేహంబు లోపలనంతట రోయరోత (10 ప.) వంటి లక్షర లక్షల నిచ్చే సత్యాలు. (11) నీలమేఘశ్యామ, నీవె తండ్రివి మాకు, కమలవాసివి మమ్ము గన్న తల్లి (18 ప.), (12) అడవి పక్షుల కెవ్వడాహారమిచ్చెను, మృగజాతికెవ్వడు మేతబెట్టె (44 ప.) (7 ప.), (13) చిత్తశుద్ధిగ నీకు సేవజేసెద గాని పుడమిలో జనుల మెప్పులకు గాదు వంటివి భక్తిరసార్ద్ర గుళికలు. శేషప్ప అన్నమయ్యవలెనే కులాధిక్యతను తిరస్కరించినాడు. "నమ్మినజాలు ముక్తి చండాలునకైన కద్దు" (నృకే. 51) అని అంటాడు.

కులములశ్రేష్ఠతెవ్వరిది? కొంచెము గానగరాదు...
తెలిసిన నిండుభక్తులె సుధీరులు ధర్మపురీ నృకేసరీ! (52)

అని పేర్కొన్నాడు. "వ్యాసుడే కులమందు వాసిగా జన్మించె" అన్న పద్యములో 74-న.సి.శ.) నిమ్నకులాల వారైనా భగవంతుని సేవతో వారికి ముక్తి లభించినట్టు చెప్పినాడు.

ధర్మపురిలోని సమకాలికులైన బ్రాహ్మణులు ఇతనిపట్ల భక్తకవి అన్న గౌరవముతో వీధిబడిలో శతకాన్ని పాఠ్యంగా పెట్టుకొని, ఇళ్లల్లో పారాయణ గ్రంథంగా ఉంచుకొని, భిక్షాటనపు కట్టడిని గౌరవించినారు. పైగా ఇతడు,

మృతుడైనపుడు అంతిమయాత్రలో పార్థివ శరీరాన్ని మోసినారని స్థానిక కథనం ఉంది.

శేషప్పపై పోతన ప్రభావమధికం. భక్తి, సరళ వ్యక్తీకరణలకు పోతన్న శేషప్ప కొజ్జబంతి. "ఇభ కుంభములమీదకెగరెడి సింగంబు ముట్టునే కురుచైన మూషికమును" అన్నపుడు మందార మకరంద మాధుర్యమున దేలునన్న పద్యము, "నీ మందిరములేని గ్రామంబుగ్రామమే ఆ చోటు దొంగలయడవిగాక!", "భువన రక్షక నిన్ను బొగడ నేరని నోరు ప్రజకరోచకమైన పాడుబొంద" వంటివి "కుంజాక్షు నర్చించు కాయంబు కాయమే" వంటి పద్యములను గుర్తుకు తెచ్చును. కంచర్ల గోపన్న దాశరథి శతకము శేషప్ప ఇతర రచనలలో ప్రభావము చూపినది. (1) "చూచితి నీ కిరీటమును జూచితి కుండలముల్" – "కంటి నదీతటంబు పొడగంటిని భద్రనగాధివాసమున్" అన్న పద్యమునకు, (2) సాటిరాడనుచు దండిగ బొబ్బలువెట్టి చేత జేగంటను కొట్టి చాటెదన్ (నృ.శ.) అన్నది "గడకట్టి భేరికా డాండ .... వేదండము నెక్కి చాటెద" అన్న పద్యమునకు (3) "ఆవేళ యమదూతలాగ్రహమున వచ్చి... నాటికిపుడే జేతు నీనామ భజన" (నర.శ.) "ముప్పునకింకరులు ముంగిట... నాటికిపుడే చేతు మీ నామభజన", అన్న పద్యమునకు, (4) ప్రహ్లాదుడే పాటి పైడికానుకలిచ్చె మదగజంబెన్నిచ్చె మౌక్తికములు (నర.శ.), ఆగజరాజు నీకు ఘనమైన మణులిచ్చెనా (నృ.శ. 83), "దాసిన చుట్టమా శబరి దానిదయామతినేలినావు" అన్న గోపన్న పద్యములకు సంవాద రూపములు కాదగినవి.

శేషప్ప ధర్మపురివాడు కావడంవల్ల ధర్మపురి భాష, పలుకుబడి, తెలంగాణ మాండలిక పదాలు అనేకంగా మూడు శతకాల్లో చోటు చేసికొన్నాయి. దండివాడు (న.సి. 45), దండిదొర (న.సి. 64), దండిదాత (న.సి. 86), సుంకరి (న.సిజ 13), ముల్లెపోయినట్టు (న.సి. 13), చూరజెక్కి (న.సి. 21), గుంజజుయికచని (న.సి. 15), బుక్కుట, బుక్కలు వెట్టు (నరహ. 43), (బొక్కు అని అక్కడక్కడవాడినాడు నృకే. 89), పాడుబొంద (న.సి. 30), తోలుకొనిపోవు, వేసటపుట్టి, కోసరము = కొరకు (నరహ. 21, నరసి. 52), వెట్టిపట్టి, లావు (న.సి. 86), లావుపిస్స = మిక్కిలి పిచ్చి (నృకే. 97), జమచేసి = పోగుచేయు, నడిగంగ (నృ.శ. 30), కైకిలి = కూలీ (నృ. 94), కంటీలు = కంఠీలు కంఠాభరణాలు (29 న.సి.), నల్లసరపుగుండు = బ్లాక్ గ్రానైట్ స్టోన్ (న.సి. 30), తొలులు = తొలి = రంధ్రం (పొక్క) (న.సి. 30), పంచెపేగు (నరహ. 12), నౌబోతు = ఖండశర్కర (నరహ. 30), పిడుదు = ఆవుపొదుగుకు పట్టేక్రిమి (నరహ. 40), పెద్దపిట్ట = గుడ్లగూబ (నరహ. 64), గంగ ఒడ్డున ఇల్లు గట్టినట్టు = వ్యర్థం అని, బెల్లపుగడ్డ నోటిలో పెట్టుకొన్నావా? = మౌనంగా ఉన్నావా? (43 నృకే.) వంటివి అనేకంగా చూపవచ్చు. జాజుబట్ట = కాషాయవస్త్రం (నరహ. 24), తొట్టిగవ్వ = చిల్లిగవ్వ (చెల్లని నాణెం), పైడికంటె = స్వర్ణ కంఠాభరణం (నరహ. 25), నాయిది = నాది, పణతి = పడతి (25), పైనము = ప్రయాణము (నరహ. 27), దెప్పు = వెక్కిరించు (నరహ. 27), దుబ్బ తుత్తురుచెట్లు = నాముచెట్లు, తుమ్మకట్టె = తుమ్మ చెట్లకర్ర = ముండ్లతో ఉండి పట్టుకోవడానికి వీలులేనిది, చౌడుభూమి = సున్నమువంటి మన్నును చౌడు అంటారు. పంటలుపండనిది. (ఈ చౌడుమన్నును సబ్బులు లేని రోజుల్లో సబ్బుపొడిగావాడి బట్టలుతకడం నా చిన్నతనంలో చూసాను) ఇలా అనేకంగా స్థానికభాషా పదాలునా&ఉనయి. (ఇవి నేటికీ ధర్మపురిలో బాగా వాడుకలో ఉన్నాయి.)

నరసింహ శతకం బహువ్యాప్తితోబాటు ఇతర భాషల్లోకి అనువాదమైంది. సంస్కృతంలోకి చిట్టిగూడూరు వరదాచార్యులవారు అనువాదం చేసారు. కన్నడంలోకి సంతేకల్లహల్లి లక్ష్మీనరసింహశాస్త్రి గారు అనువదించారు. ఈవిధంగా నరసింహునివల్ల నరసింహ శతకం, శతకంవల్ల శేషప్ప, శేషప్పవల్ల ధర్మపురి జగద్విఖ్యాతమైనాయి.

- డా॥ సంగనభట్ల నరసయ్య

❖ ❖ ❖

అభినవ పోతన వానమామలై



తెలుగుభాషను వెలుగుభాషగా మార్చిన మహా కవిపుంగవులెందరో... వారిలో వ్యాస విరచిత భారతేతిహాసాన్ని కమనీయ కథాసంవిధానంతో కావ్య కల్పతరువుగా ఆంధ్రీకరించిన కవిత్రయము నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱాప్రగడలు, సరళమైన తెలుగుభాషను సుసంపన్నం చేసిన మహాకవులు. వారంతా నిత్యస్మరణీయులు. ఆ ముగ్గురూ ఒక ఎత్తయితే, వ్యాసభాగవతాన్ని భక్తిరస కావ్యంగా తెలుగు వారికందించిన సహజకవి బమ్మెరపోతన మరొక ఎత్తు. పోతన భాగవతంలోని ఒక పద్యమైనా రాని తెలుగువారు లేరనటం అతిశయోక్తి కాదు. తెలుగువారి హృదయాల్లో చెరగనరి స్థానాన్ని సంపాదించుకున్న విశిష్టకవి మన పోతనామాత్యుడు. నన్నయ మొదలు విశ్వనాథ వరకుగల కవులతో సరితూగగల స్థాయిలో మహాకావ్య రచన గావించి, అమూల్య సాహిత్య సంపదను తెలుగువారికి అందించిన కవితా విశారదుడ, వాగీశ్వరీ మంత్రసిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్యులు.

"పోతన చరిత్రము" రాసి 'అభినవ పోతన'గా వాసికెక్కిన వానమామలై వరదాచార్యులు మహాకవుల మన్ననలొందిన కవికుల తిలకుడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ఎలుగెత్తి చాటిన దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితుడు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు వరదాచార్యులు. వానమామలై తెలంగాణ కవులలోనే అగ్రగణ్యుడు. 'మణిమాల'గా వెలువడిన పద్యకృతి, 'విప్రలబ్ధ', 'జయధ్వజం', 'ఆహానవం' వంటి గేయకృతులు, ఎన్నో వ్యాసాలు, మరెన్నో నాటకాలు, బుఱ్ఱకథలు వ్రాశారు. అయితే తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని, పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించి పెట్టింది మాత్రం పోతన చరిత్రము. తొలి తెలుగు కవుల శైలికి దీటైనదీ అపూర్వ గ్రంథం. అలంకారాలతో, అష్టాదశ వర్ణనలతో, పట్టువదలని కథా సంవిధానంతో మహాభాగవత కర్త బమ్మెర పోతన జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన వారు వరదాచార్యులు.

కళలకు కాణాచి, కాకతీయుల రాజధాని. పలువురు సాహిత్యకారులు కొలువుదీరిన నేల ఓరుగల్లు. దానికి సమీపంలోని 'బమ్మెర' గ్రామం పోతన్న జన్మస్థలమైతే, అదే ప్రాంతానికి చెందిన 'మడికొండ' గ్రామం వరదన్న జన్మస్థలం కావడం యాదృచ్ఛికం. పోతన్నకు సిద్ధుడు తారక మంత్రోపదేశం చేసి,'వాణి నీ జిహ్వాగ్రమందుండు'నని దీవిస్తే, వరదన్న వాగీశ్వరీ మంత్రోపాసన చేసి వరసిద్ధిని పొందారు. పోతన్నకు రామచంద్రవిభుడు స్వప్నంలో సాక్షాత్కరిస్తే, వరదన్నకు రామతారక మంత్రోపదేశం లభించింది. నిరాడంబరత్వం లోనూ, నిరుపమాన కవితాశక్తిలోనూ ఇరువురికి సామ్యం ఉంది. ఇద్దరు మహాకవుల జీవితాలలోగల

సాదృశ్య ఘట్టాలను చూసి తెలుగు రచయితల సంఘం ఈ మహానుభావునికి 'అభినవ పోతన' బిరుదునిచ్చి సత్కరించింది. తెలంగాణలో పురాణ కాలక్షేపానికి బక్కయ్యశాస్త్రి పెట్టింది పేరు. బక్కయ్యశాస్త్రి కుటుంబం వైదిక కార్యకలాపాలకు, నియమనిష్ఠకు పెట్టింది పేరు. ఆయన ధర్మపత్ని సీతాంబ మహాసాధ్వి. ఈ పుణ్యదంపతుల కనిష్ట సంతానమే వరదాచార్యులు. తండ్రి నుంచి సంగీత సాహిత్యాలతో పాటు పాండిత్యాన్ని, తల్లి నుంచి సౌమ్యతను పుణికి పుచ్చుకున్నాడు. అగ్రజులైన వేంకటాచార్యులు, లక్ష్మణాచార్యులు, జగన్నాథాచార్యులు సైతం బహుముఖ ప్రజ్ఞాశాలురే కావడంవల్ల ఆ ఇల్లొక విజ్ఞాన నిలయంగా భాసిల్లేది. ప్రజాకవి కాళోజీ, పల్లాదుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి మహానుభావులు ఆ ఊరివారే కాక, ఆచార్యులవారికి ఆత్మీయులు. వీరందరి ప్రోత్సాహంతో ఎదిగిన మహాకవి వానమామలై. వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాతముత్తాతల ఊరైన చెన్నూరులోనే. పద్దెనిమిదవ యేట మేనమామ కొడుమగుళ్ల జగన్నాథాచార్యుల ఏకైకు పుత్రిక వైదేహితో ఆచార్యులవారి వివాహం జరిగింది.

వరదన్నకు చిన్నతనంలోనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథని వాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు ఆచార్యులవారికి వాగీశ్వరీ మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలో గల మెట్టుగుట్టపై ఎనభై రోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందిన విద్వద్వరేణ్యులు వరదన్న. అమ్మ కృపాకటాక్షవీక్షణాలతో ఆయన జన్మ ధన్యమైంది. నాటి నుంచి ఆ కలం సాహిత్యవనంలో హలమై సంచలనాలకు శ్రీకారమైంది. మంగళహారతులతో మొదలిడి, గోపాలబాలుని లీలను 'దాగుడుమూతలు' పద్యకావ్యంగా రాసి తొలినాళ్లలోనే అనేక సామాజిక, ఆధ్యాత్మికాంశాలను వస్తువులుగా గైకొని, వస్తు వైవిధ్యంతోపాటు వర్ణనాత్మకమైన 'మణిమాల'ను వెలువరించారు. 'జయధ్వజం, ఆహ్వానం' లఘుకావ్యాలు. ప్రణయ శృంగారము కావ్యవస్తువుగా గైకొని 'విప్రలబ్ధి' గేయకావ్యం రాసి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

వృత్తిరీత్యా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యనిర్వాహకులుగా పనిచేస్తున్న కాలంలో అనేక నాటికలు, బుఱ్ఱకథలు రచించి, విద్యార్థులచేత ప్రదర్శింపజేసి తద్వారా దేశభక్తిని ప్రబోధిస్తూ, ప్రగతిబాటను చూపారు ఆయన. మార్కండేయ పురాణంలోని చిన్నకథను 'వైశాలినీ పరిణయం' మహానాటకంగా మలిచి, 'కావ్యేషు నాటకం రమ్యం' అన్నమాటను సార్థకం చేశారు. అభినవ కాళిదాసు బిరుదును కూడా పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి. 'స్తవరాజ పంచశతి, స్తోత్ర రత్నావళి, సూక్తి వైజయంతి' వంటి రచనలు ఆయనలోని భక్తిభావ పరిపుష్టిని, మానవతా దృక్పథాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, నైతిక విలువల పట్ల గౌరవాన్ని చాటిచెబుతాయి.

'ఆంధ్రకవి వతంస, మధురకవి, కవికోకిల, ఉత్ప్రేక్షా చక్రవర్తి, మహాకవి శిరోమణి, కవిశిరోవతంస' వంటి వెన్నో బిరుదులు వరదన్నను వరించాయి. 196లో వీరి పోతన చరిత్ర కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించడం వారి అపూర్వ ప్రతిబకు తార్కాణం. 1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయము, వారణాసి వారు 'విద్యావాచస్పతి' (డి.లిట్) గౌరవ డాక్టరేటును ప్రదానం చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే 1979 మార్చి నెలలో కరీంనగర్ జిల్లా కోరుట్లలో జరిగిన పౌర సన్మానం మరో ఎత్తు. ఏ కవికీ జరుగని రీతిలో ఆచార్యులవారి అంతేవాసి, ఆచార్యుల వారి గ్రంథాలపై సిద్ధాంత వ్యాసం సమర్పించిన అందే వెంకటరాజం నేతృత్వంలో నాడు జరిగిన సన్మానం 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా జరిగింది. సాహితీ దురంధరులు సినారె, దావరథి, దివాకర్ల, పల్లా దుర్గయ్య, కాళోజీ వంటి పలువురు కవి పండితుల సమక్షంలో జరిగిన ఆ ఘనసాన్మనం వేలాది ప్రేక్షకులను తన్మయులను చేసింది. నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు ఆచార్యుల వారి కాలికి గండపెండేరం అలంకరించిన దృశ్యం, ఆ సభలోనే స్వర్ణకంకణ ప్రదానం, రత్నాభిషేకం వంటి గౌరవ పురస్కారాలకు నోచుకున్న వానమామలై పుంభావ సరస్వతిగా పూజలందుకున్న పుణ్యజీవి, ధన్యజీవి.

ఆయన 'భోగినీలాస్యం' కావ్యగానమంటే పండిత పామరులందరూ చెవికోసుకునేవారు. పోతన చరిత్రలోని ఒక

ఘట్టమైన భోగినీలాస్య వృత్తాంతాన్ని అపూర్వంగా రూపొందించిన ఘనత వరదాచార్యుల వారిది. అనేక నాట్యరహస్యాలను నిష్ణాతులైన నాట్యాచార్యుల నుంచి తెలుసుకుని ప్రపంచ సాహిత్యంలోనే నృత్యాన్ని వర్ణిస్తూ రచించిన ఇంతటి అమోఘమైన కవిత్వం లేదని చెప్పవచ్చు. వీరు మరాఠీ భాష నుంచి అనువదించిన 'గీత రామాయణ' కావ్యం చాలాకాలంపాటు ఆకాశవాణిలో ప్రసారం చేయబడి శ్రోతల నలరించింది. ఈ మహాకవి సాహితీ గరిమకు అబ్బురపడ్డ నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఆచార్యుల వారిని నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులుగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న సమయంలో, అశేష పాండితీప్రకర్షతో భాసిల్లుతున్న ఆచార్యుల వారికి ఉద్యోగం కోసం ప్రమాణ పత్రం అవసరం ఏర్పడింది. పట్టాలు లేని సహజ పండితుడాయన. పట్టాకోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు వారి విశారద పరీక్షకు కూర్చొని ప్రథమశ్రేణిలోఉ త్తీర్ణులయ్యారు. ఆ పరీక్షకు ఆయన రాసిన కావ్యమే 'మణిమాల' పాఠ్యాంశంగా ఉండడం విశేషం.

1961లో దోమకొండ నుంచి బదిలీ అయి చెన్నూరు ఉ న్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. ఉ పాధ్యాయులుగా ఉన్న కాలంలో ఎందరో విద్యార్థులను ప్రభావితం చేశారు. 1972లో ఉపాధ్యాయ వృత్తిలో పదవీ విరమణ పొందిన తర్వాత ఎమ్మెల్సీగా ఎంపికై ప్రజలకు తమ అమూల్యమైన సేవలందించారు. ఆయన నిరంతర కవితోపాసకులు. నిరాడంబరులు. మానవతావాదులు. మధురగంభీర స్వరం కలిగిన వరదాచార్యుల వారిని ఒకసారి చూసినవారు ఎన్నటికీ మరువలేరు. ఆయన జీవిత గమనంలో అశనిపాతంలా క్షయవ్యాధి సోకింది. ఆ వ్యాధి ఆయన ఒక ఊపిరితిత్తిని బలిగొన్నది. చికిత్సకోసం ఆయన మైసూరులో ఉన్నప్పుడు ఈ విషయం తెలిసిన మైసూరు మహారాణి ఆస్పత్రి ఖర్చులు భరించి, వారిపై ఆమెకుగల అభిమానాన్ని చాటుకున్నారు.

వానమామలై గారంటే పీవీ నరసింహారావుగారికి ఎనలేని అభిమానం. అందుకే వారిని పోతనతో పోలుస్తూ పోతన జీవితానికీ, వరదన్న జీవితానికి ఎంతో సామ్యం ఉంది. నిర్ధనత్వంలో స్వామ్యం వుంది. అమృత హృదయంలో సామ్యం ఉంది. కవితా వైభవంలో సామ్యం ఉంది. ఉదాత్త కల్పనలో సామ్యం ఉంది' అని పొగుడుతూ... పోతన్న చరిత్ర వరదన్న రాస్తే, వరదన్న చరిత్ర ఎవరైనా రాయబూనితే బాగుండునని అన్నారు. ఆచార్యుల వారి పోతన చరిత్రను శ్లాఘిస్తూ డాక్టర్ దివాకర్ల వేంకటావధాని 'నవ్యకవితా శోభితమయ్యా, ప్రాచీనతా పరిమళముల గుబాళింపుల బుక్కిలించిన ఆధునికాంధ్ర మహాకావ్యమని' అన్నారు. 'ఆచార్యుల వారెంత గొప్ప కవిశేఖరులో అంత నిరాడంబరజీవులని' మాడపాటి హనుమంతరావు గారంటే, 'ఆధునిక తెలంగాణ మహాకవికి నా అభినందనలు' అని బూర్గుల రామకృష్ణారావుగారు ప్రశంసించారు. ప్రజాకవి కాళోజీ వారిరువురి మధ్యగల అనుబంధాన్ని చెబుతూ 'వరదన్నకు పోతన్న సంగతి తెలుసు. వరదన్న సంగతి కాళన్నకు తెలుసు. ఇది కవికుల మైత్రి. కన్నీటిలో మున్నీట మస-పస. రెంటిలోనూ వున్నది ఉప్పెన. రెండూ తెస్తాయి ఉప్పెన, ఇసుక దిబ్బలను చేస్తాయి క్షాళన' అన్నారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు 'ఆచార్యులు మట్టిలో నుంచి వెలువడిన మణి' అని కీర్తించారు. 'నిన్నేమని వినుతింతును అన్నా! వరదన్నా!' 'నీ మనసువెన్న, తనువు వెన్న మాట తీరువెన్న!' అన్నారు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సినారె.

పలువురి మన్ననలందిన మహనీయుని జీవితంలో ఆఖరుక్షణాలు గుర్తుకు వస్తే ఎవరికైనా దుఃఖం వస్తుంది. సరస్వతీపుత్రులు, విద్వాంవిశారదుడు, శ్రుతులను, స్మృతులను ఔపోసన పట్టిన కృతికర్తకే స్మృతిపోవడం కాలవైచిత్రికాక మరేమిటి? అక్టోబర్ 3 తెలుగు సాహిత్య రంగానికి, సాహిత్యాభిమానులకు ఒక చీకటిదినంగా మారినరోజు. అంటే 1984 అక్టోబర్ 31న ఆచార్యులవారు అంతిమశ్వాస వదిలారు. ఒక జ్యోతి ఆరిపోయింది. ఒక మహాకవిని కాలం తన కబంధ హస్తాలలో కరిగించివేసింది. చెన్నూరు గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. కవికి, కళాకారుడికి మరణం ఉండదంటారు. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం వానమామలై కూడా జీవించే ఉంటారు.

- ప్రముఖ సినీ దర్శక, నిర్మాత నాగబాల సురేష్‌కుమార్

చైతన్య గోదావరి - కందుకూరి

ఇది నవసహస్రాబ్దిలో జరుపుకొంటున్న తొలి గోదావరి పుష్కరోత్సవాలు! ఇవి నవయుగ వైతాళికుడు శ్రీకందుకూరి వీరేశలింగంగారికి గౌరవ నీరాజనాలు!

గత సహస్రాబ్దం చివరిదశలో...

ఇప్పటికి సుమారు ఒకటిన్నర శతాబ్దానికి పూర్వం....

జంబు ద్వీపంలోని భరతవర్షం, అందలి ఆంధ్రభూమి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, అస్వతంత్రమైన అంధకారంలో దోబూచులాడుకుంటున్నాయి. ఆంగ్లపాలనవల్ల కలిగిన పారతంత్ర్య తిమిరాలు, భావస్వాతంత్ర్య లేని మూఢవిశ్వాసాల గాఢాంధకారాలు మన జాతి చుట్టూ చీకటి ప్రాకారాలు నిర్మించాయి. కన్నుకానని కటిక చీకట్లను చీల్చుకొంటూ తూరుపు కొండమీద ఉదయించే వేకువ వెలుగు వాకలాగా.... పావన గోదావరీ తీరంలో, సుప్రసిద్ధ రాజమహేంద్రవర నగరంలో ఆవిర్భవించిందొక వీర విప్లవ విస్ఫులింగం! ఆ విస్ఫులింగమే వీరేశలింగం!

ఆయన ఇంటిపేరు కందుకూరి!
ఆయన తెలుగుగుండెలపై తొలకరి!
ఆయన వెలుగు కెరటాల చైతన్య గోదావరి!
ఆయన మేలుకొలుపుల మేలుమలుపుల రహదారి!

ఆనాడు క్రీ.శ. 11 శతాబ్దంలో ఆంధ్రకవిత్వానికి ఆదికవిగా నన్నయభట్టుకు ఊపిరిపోసింది గౌతమీగంగ!

ఈనాడు క్రీ.శ. 19వ శతాబ్దంలో ఆధునికాంధ్ర సాహిత్యానికి ఆదికవిగా, కందుకూరికి ఊపిరులూదింది గోదావరీగంగ! ఆనాడు పవిత్ర గోదావరీతీర పులినతలాలలో తెలుగు కవితా కుమారి గొంతు విప్పింది. ఈనాడు అదే పావన గోదావరీ తీరసైకత స్థలాలలో తెలుగు సరస్వతి సంకెళ్లను ఛేదించుకొని సంస్కరణ పథంలో గర్జించింది. ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఇద్దరు యుగకర్తలకు పురుడుపోసిన గౌతమీమాత నిత్యచైతన్య సీమంతిని! శ్రీకందుకూరి వీరేశలింగంగారు 16.094.1848వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించారు. రాజమహేంద్రి నుండి చెన్నపట్టణం వరకు సాగిన ఆయన సంస్కరణ సాహిత్య యాత్ర యావదాంధ్ర దేశానికి ప్రగతిమార్గం చూపింది. 1919వ సం॥లో మరణించేవరకు కందుకూరి



కలం, గళం మానవ సమాజహితం కోసమే. ముఖ్యంగా మహిళా సంక్షేమం కోసమే అనర్గళమై పురోగమించాయి. ఆనాటి ఆంధ్రదేశంలో... ముక్కుపచ్చలారని ముద్దుబాలికలను ముసలివాళ్లకు భార్యలు చేయటం, సతీసహగమనాలకో, బలవన్ వితంతు దుర్దశలకో గురిచేయటం, చదువుకునే అవకాశాలు కలిగించకపోవటం వంటి వికృతాచారాలతో స్త్రీలు ఆహుతి అవుతున్నారు. రుద్రమ్మలు, మాంచాలలు, ఝాన్సీలక్ష్మమ్మలు జన్మించిన భారతదేశంలో స్త్రీలకు ఇటువంటి దురవస్థలు ప్రాప్తించటం చిత్రమే! పారిశ్రామిక విప్లవం, పాశ్చాత్య విజ్ఞాన పరిచయం, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం పురులు విప్పిన దశలో కూడా ఆంధ్రదేశంలో కందుకూరి గోదావరి ఒడ్డున జన్మించే వరకు స్త్రీలను గురించి ఆలోచించినవాళ్లు లేరు. తల్లి అయినా, చెల్లి అయినా, ఇల్లాలు అయినా స్త్రీ పురుషుని అధీనంలో ఉండవలసిన వస్తువుగా భావించారు. స్త్రీ వంట ఇంటికి, పడకటింటికి మాత్రమే పనికి వచ్చే యంత్రంగా మార్చివేశారు.

అటువంటి గాఢ మూఢ విశ్వాసాల అంధకార కల్లోలిత సముద్రంలో నుంచి ఉద్ధరించి స్త్రీలకు ఒక వెలుగుదారి చూపిన కందుకూరికి జన్మనిచ్చిన పావన గోదావరి తీరభూమి ధన్యమైపోయింది! దానితో కలిసి ఆంధ్రదేశం యావత్తూ ధన్యమైపోయింది.

'తెలుగుదేశంలో వీరేశలింగం అనే మహాపురుషుడు ఉ ద్భవించి, చీకటింట్లో కిటికీలు తెరచి, సూర్యుడి వెలుగును, చంద్రుని వెన్నెలను ప్రసరింపజేసి, దుమ్ము దులిపి, బూజు తుడిచి, మనుష్యుల్లో మంచి కొంచెం పెంచి, మానవత్వాన్ని నిలిపేదాకా మహిళల స్థితిగతులు దుస్సహంగా ఉండేవి! ఆయన తెచ్చిన సంఘసంస్కరణ సూర్యుని వెలుగు. ఆయన ఇచ్చిన సాహిత్యం చంద్రుని వెన్నెల. ప్రత్యేకంగా స్త్రీల అభ్యుదయం కోసమే ఆయన ఎన్నో యుద్ధాలు చేశారు అని అక్కిరాజు ఉ మాకాంతంగారు కందుకూరిని ప్రస్తుతించారు. ఈ వాక్యాలు కేవలం స్తవాలు కావు... వాస్తవాలు.

వీరేశలింగం గారికి బాల్యంలోనే తిరుగుబాటు తత్వం అబ్బింది. అవినీతిని, అక్రమాన్ని, అలసత్వాన్ని అంగీకరించే వారుకారు. నీతికోసం, న్యాయంకోసం, తాను నమ్మిన మంచికోసం తన మేస్టర్లను కూడా వ్యతిరేకించటానికి వెనుకాడే వాడుకాడు. అర్థం పర్థంలేని మూఢనమ్మకాలను కూడా వ్యతిరేకించేవారు. బడిపంతులుగా మొదటిసారి ఉద్యోగంలో చేరటానికి అందరిలాగా మంచి దినం, మంచి లగ్నం చూడలేదు. పెద్దలను కాదని, కావాలని అమావాస్యనాడు కందుకూరి తొలి ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. పున్నమి చంద్రునిలా జాతికి చల్లని వెలుగు అందించాడు. అదీ ఈ గోదావరీ లహరి విశిష్టత!

ఈ గోదావరీ తరంగం చిన్నతనంలోనే అంతరంగంలో కవిత్వానికి చోటు కల్పించారు. ధారాశుద్ధి, వేగం కలిగినర గంగాతరంగంలో కవిగా తురంగలించారు. సంప్రదాయ కవితా ప్రౌఢత్వంలో తన పటిమ ఏపాటిదో పండితలోకానికి చాటి చెప్పాలనుకున్నారు. మార్కండేయ శతకం, గోపాల శతకం వంటివి చాలా పసివయస్సులోనే రచించారు. 'శుద్ధాంధ్ర నిరోష్ఠనిర్వచననైషధము' రచించారు. చిత్రకవిత్వం రచించగలనని తొలిదశలోనే నిరూపించారు. సంస్కృతం నుంచి కాళిదాస నాటకాలను అనువదించారు. 'రత్నావళీ' 'ప్రబోధ చంద్రోదయం' నాటకాలను అనువదించారు. స్వతంత్ర నాటకాలు అనేకం రచించారు. భారతకథకు సంబంధించి తెలుగు తొలినాటకం రచించిన కీర్తి వీరేశలింగంగారిదే! 'దక్షిణ గోగ్రహణము' అనే నాటకాన్ని ఆయన 1885లోనే రచించారు. 'సత్యహరిశ్చంద్ర' 'తిర్యగ్విద్వన్మహాసభ' 'మహారణ్య పురాధిపత్యము' 'ప్రహ్లాద నాటకము' వంటి నాటకాలు రచించారు.

షేక్‌స్పియర్ వంటి ప్రసిద్ధ ఆంగ్లకవుల నాటకాలను కూడా కొన్నింటిని కందుకూరి ఆంధ్రీకరించారు. మరికొందరి ఆంగ్లేయ రచనలను కూడా ఈయన నాటకాలుగా రచించారు. షేక్‌స్పియర్ 'మర్చంట్ ఆఫ్ వెనీస్' నాటకాన్ని 'వినీసు వర్తక చరిత్రము'గా, 'షెరిడిన్ రచించిన 'ది రైవల్స్'ను 'కల్యాణ కల్పవల్లి' అనీ, 'డ్యూయాన్నా'ను 'రాగమంజరి' అనే నాటకాలుగా మలిచారు.

పంచతంత్రంలోని 'సంధి', 'విగ్రహము' అనే వచన రచనలు చేసి 'గద్యతిక్కన' అనిపించుకున్నారు. తెలుగులో 'స్వీయరచన'కు, 'కవులచరిత్ర'కు శ్రీకారం చుట్టిన యుగకర్త కందుకూరి.

పాతికేళ్ల ప్రాయానికే కందుకూరి రచనా విధానంలో మార్పు రావలసిన ఆవశ్యకత గుర్తించారు. సాహిత్యం స్వోత్కర్ష కోసమో, పాండిత్య ప్రదర్శన కోసమో కాదనీ.... సాహిత్యం సమాజ సంస్కరణ కోసం సాధనమనీ గ్రహించారు. 'సరస్వతీ నారద సంవాదం' ద్వారా కందుకూరి తన పరిణతిని, పరిణామనీతిని వెల్లడించారు.

'సరస్వతీ నారద సంవాదం' అనే పద్యకావ్యంలో....

తెలియదు సుమ్మిప్పుడు నా
పలుకుల యర్థంబు నాకె భావములేమిన్
వెలసొమ్ములు గాకివి సం
కెలలయి కడునాదుమేనికిన్ వెత నించున్... అనీ...
దయమాలి తుదముట్ట తలకట్లు నిగిడించి
ధీరుడై నన్ను బాధించునొకడు,
పాదంబులోపల పాదంబులిమిడించి
వీరుడై నన్ను నొప్పించునొకడు,
ప్రాసంబుపై పెక్కు ప్రాసంబులడరించి
పోటుబంటయి నన్ను పొడుచునొకడు,

బెండుపల్కులు గూర్చి నిండైన నగలంచు
దిట్టయై చెవులు వేధించునొకడు.

ఖడ్గచక్రాది రూపముల్ గానిపించి
వర్ణముల్ మార్చి నను చిక్కు పరచునొకడు,
కుమతులొడలెల్ల విరిచి ప్రాణములు తీయ
ఒడలి పసలేక శుష్కించియున్నదాన....' అనీ

సరస్వతీదేవి వేదనను తన మాటలలో వెల్లడించారు. అన్నిరకాల చిత్రకవితారీతులు అర్థరహితాలనీ, అవి సాహిత్యానికి శోభనివ్వవనీ, పైపెచ్చు క్షోభ కలిగిస్తాయనీ కందుకూరి చాలా స్పష్టంగా తన అభిప్రాయాలు ఇందులో చాటిచెప్పారు. తన జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని సమాజసేవకే.... ముఖ్యంగా స్త్రీజనోద్ధరణకే అంకితం చేశారు.

సుమారు 125 సం॥ క్రితమే కందుకూరి వీరేశలింగం విప్లవ విస్ఫులింగమై ఆంధ్రమహిళ సర్వతోముఖాభివృద్ధికోసం చేసిన సామాజిక సాహిత్యపోరాటం... కురుక్షేత్ర సంగ్రామం కంటె తక్కువదికాదు. అనాటి దేశభక్తులు ఆంగ్లపాలకులతో వారి భయంకర మారణాయుధాలతో చేసిన స్వాతంత్ర్య పోరాటంకంటే చిన్నదికాదు.

యుగయుగాలుగా, తరతరాలుగా జాతి నరనరాలలో స్థిరపడిపోయిన మూఢవిశ్వాసాలతో, వాటికి పట్టుగొమ్మలైన సంప్రదాయ ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో కందుకూరి సల్పిన భావయుద్ధం, చైతన్యసమరం రాజీలేనివి! చాలా ప్రమాదభరితమైనది. తెలుగునేలపై వేళ్ళూని బలంగా ఎదిగి ఉన్న కులబలంతో, ధనబలంతో, మదబలంతో మందుబుద్ధుల బలంతో మతబలంతో, అంధవిశ్వాసబలంతో కందుకూరి పోరాడవలసి వచ్చింది. పోరాటంలో ముందుకు దూసుకొని వెళ్లాడేగాని మడమ తిప్పలేదు.

ఆనాడు ఆయన సంస్కరణకోసం ఎదురుచూస్తూ పరమ వికృతంకల క్రూరంగా సాక్షాత్కరించిన సామాజిక దురాచారాలు... స్త్రీ బాల్యవివాహాలు.

వారికి అకాలంగా అవాంఛనీయంగా ప్రాప్తించిన బాలవైధవ్యాలు, వారిపై సాగుతున్న హింసారాక్షస దురాచారాలు... స్త్రీలు ఇన్ని వేదనలకు బలియై పోతూ ఉండటానికి కారణం వారిలోని అవిద్య అని ఆయన గ్రహించారు. పురుష దురహంకారంపై ఆగ్రహించారు. చదువులేకపోవటం వల్ల స్త్రీలు లోకజ్ఞాన హీనులవుతున్నారు. కుటుంబాలను కాదు... తమ బ్రతుకులనే చక్కదిద్దుకొనలేని అబలలవుతున్నారు. కాబట్టి... 'స్త్రీ విద్యావతి కావాలి' అని కందుకూరి నిర్ణయించుకున్నారు. తన నిర్ణయాన్ని ఆచరణలోనికి తేవటానికై పూనుకున్నారు. విద్యలేని మనిషి వింతపశువు అని అంగీకరించిన సమాజం... తనలో సగభాగమైన మహిళను విద్యకు దూరం చేయటం వింతకాదా! అంటే సమాజ శరీరంలో సగభాగం ఇంకా మృగ్యంగానే పశువుగానే మిగిలివుందని ఆయన ఆకళించుకున్నారు. ఆయనలోని సంస్కార సాహస చేతనత్వం మేలు నేలపై తొలివైతాళికుడుగా మేలుకొలుపుల మేలుమలుపులు చూపి జాతిని నడిపించటానికై నడుం బిగించారు. సంస్కర్తగా కందుకూరి పరిష్కరించదలచిన సమస్యలివి.

స్త్రీ విద్యను ప్రారంభించి ప్రోత్సహించటం
స్త్రీ బాల్యవివాహాలు నిరోధించటం
బాలవితంతువులకు పునర్వివాహాలు జరిపించటం.

పై ఆశయాలతో కందుకూరి కేవలం ప్రవక్తగా ఆగిపోదలచలేదు. ఆచరణశీలియై సంస్కర్తగా మధ్యందిన మార్తాండునిలా ఉజ్వలించారు!.... తన గళాన్ని, కలాన్ని, కాలాన్ని, సర్వస్వమూ మహిళా జనశ్రేయంకోసం వినియోగించారు.

వీరేశలింగంగారు వీరులేకాదు కార్యశూరులు! 1874 సం॥ స్త్రీల ప్రయోజనాలకోసం రచనలు వ్యాప్తిలోనికి తేవడానికి 'వివేకవర్ధని' పత్రిక స్థాపించారు. అంతేకాదు, ఆంధ్రదేశంలో తొలి బాలికా పాఠశాలను కందుకూరివారే రాజమండ్రి సమీపంలో ధవళేశ్వరంలో నెలకొల్పారు. ఆవిధంగా స్త్రీవిద్యకు అంకురార్పణ చేసిన దార్శనికుడాయన.

1883 సం॥లో 'సతీహితబోధిని' అనే పత్రిక కూడా ప్రారంభించారు. 'హాస్యసంజీవని' అనే పత్రిక కూడా నడిపారు. అనేక అవాంతరాలను అధిగమించి, వీరేశలింగంగారు 1881 సం॥ మొదటి వితంతు వివాహం జరిపించి, స్త్రీల జీవితంలో వికాసయుగానికి బాటవేశారు. ఆంధ్రుల సామాజిక చరిత్రలో కొత్తపుటను ఆవిష్కరించారు. రాజారామమోహనరాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వంటి ఉత్తరాది సంస్కర్తల ప్రభావంతో కందుకూరి ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం

స్థాపించారు. అనంతరకాలంలో రఘుపతి వేంకటరత్నం వంటి మహామహులు బ్రహ్మసమాజ విధానాలను ఆంధ్రదేశంలో ప్రాచుర్యం చేశారు.

కందుకూరి మహిళాభ్యుదయం కోసం బహుముఖమైన కృషి చేశారు. పునర్వివాహాలకు అవకాశాలు కలిసిరాని వితంతువుల సంక్షేమం కోసం 'వితంతు శరణాలయం' స్థాపించారు స్త్రీల అభ్యున్నతికోసం కృషి చేయటానికి పురుషులను కూడా సమాయత్తం చేయవలసిన అవసరాన్ని కందుకూరి గుర్తించారు. ఆధునిక అభ్యుదయభావాలు కలిగిన యువకులు, పెద్దలు సమావేశమై, భవిష్యత్ కార్యక్రమాలపట్ల అవగాహన పెంచుకోవటానికి, తరచూ కలిసికొంటూ ఉండటానికి అనువుగా 'హితకారిణీ సమాజాన్ని' , 1890 సం॥ పురమందిరాన్ని, 1897లో ప్రార్థన సమాజ మందిరాన్ని రాజమండ్రిలో నిర్మించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకై ఆయన చాలవరకు తన ఆస్తిపాస్తులనే ఖర్చు చేశారు. తాను రచించిన పుస్తకాలవల్ల లభించిన సొమ్మునంతా వీరేశలింగంగారు తమ సంస్కరణ కార్యక్రమాలకే వెచ్చించేవారు.

కందుకూరి రచించిన రాజశేఖర చరిత్ర, సత్యవతీ చరిత్రము, సత్యరాజాపూర్వదేశయాత్రలు వంటి నవలలు ఆనాడు అమిత ప్రచారం పొందాయి. పత్రికలద్వారా, నవలల ద్వారా మాత్రమే తన కార్యక్రమాలు ప్రాచుర్యంలోకి రావని, తన ఉద్దేశాలు, అభ్యుదయభావాలు, స్త్రీ జనోద్ధారణ సమాజం బాధ్యత అనే విషయాలు ప్రజాబాహుళ్యంలో బాగా ప్రాచుర్యం చెందాలంటే నాటకాలు మంచి సాధనాలని ఆయన గుర్తించారు. ఆనాడు ఆంధ్రదేశంలో ధార్వాడ నాటక సమాజం అనేక ప్రాంతాలలో విజయవంతంగా నాటక ప్రదర్శనలు ఇస్తూ ఉంది.

ఆ ప్రేరణతో కందుకూరి వీరేశలింగంగారు అనేక నాటకాలు, ప్రహసనాలు రచించి ప్రదర్శింపజేశారు. వీరి తొలినాటకం, 'బ్రాహ్మవివాహము', దాని తర్వాత, 'వ్యవహార ధర్మబోధిని' దీనిని వ్యవహారభాషలో రచించారు. ఈ ప్రహసనానికి విశేష ప్రాచుర్యం లభించింది. 'ప్లీడరు నాటకం' అని దీనికి పేరు వచ్చింది. ఆయన కదిలించిన కలం ఆగకుండా–

అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం, విచిత్ర వివాహ ప్రహఖసనం, మహాబధిర ప్రహసనం, పునర్మరణ ప్రహసనం, బలత్కారగాన వినోదప్రహఖసనం, కలహప్రియా ప్రహసనం, మహావంచక ప్రహనం, అసహాయశూర ప్రహసనం.... వంటి రచనలు ఆంగ్లభాషలోని వివిధ రచనల ప్రేరణతో రచించి ప్రచురించారు. నాటకాలయినా, ప్రహఖసనాలయినా, వచన ప్రబంధాలయినా, నవలలయినా, పత్రికలయినా... వీరేశలింగంగారికి స్త్రీల శ్రేయస్సు కోసం సమాజాన్ని సంస్కరించే సాధనాలుగానే ఉపకరించాయి. వీటిని ఆయనా అలాగే వినియోగించుకున్నారు.

చంద్రమతీ చరిత్ర, సత్యవతీ చరిత్ర, సత్యరాజాపూర్వదేశ యాత్రలు, సత్యసంజీవని, నీతికథామంజరి, దేహారోగ్య ధర్మబోధిని, పత్నీహిత సూచని, సత్యద్రౌపదీ సంవాదం, మాతృపూజ, పితృపూజ.... వంటి రచనలన్నీ మహిళల కవసరమైన అంశములను ప్రబోధిస్తున్నాయి.

ఇంత సామాజిక సేవా కార్యక్రమభారం మోస్తూ, కందుకూరి తెలుగులో అన్ని సాహిత్య ప్రక్రియలను ప్రారంభించి, వాటికి సాహిత్య గౌరవం కలిగించారు. కందుకూరి వీరేశలింగంగారు రాజమహేంద్రవరానికీ, గోదావరీ తీరానికి, మహిళా లోకానికే పరిమితమైనవారు వారు. వారి ప్రయత్న ప్రయోగ ఫలితాలు యావదాంధ్రజాతికి ఉపకరించాయి.

అందుకే కందుకూరిని 'దేవత' అని కట్టమంచి రామలింగారెడ్డి, 'నూత్న మహాంధ్రయుగ ప్రవక్త' అని యస్.టి. జ్ఞానానందకవి, 'విప్లవ మారుతమ్ము' అని పోచిరాజు శేషగిరిరావు, 'తెలుగు జాతికే జ్యోతిర్లింగం వీరేశలింగం' అనీ, 'తెలుగుజాతికి జాతిపిత' ని బోయిభీమన్న, 'నాటికన్న ఈనాడే కందుకూరి కావాలి' అని దాశరధి కందుకూరిని ప్రస్తుతించారు. కందుకూరి సంస్కరణశీలి! సాహిత్యశాలి! కందుకూరి ఆనాడు నిర్మించిన సంస్కరణలదారి నేటి నారీలోక పురోగమనానికి రహదారి!

- డా॥ మన్నవ భాస్కరనాయుడు

తి.తి.దే. వారి 'మాతల్లి గోదావరి' నుండి

ప్రాచీన, ఆధునిక కవులకు పుట్టినిల్లు గోదావరి

తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ప్రాంతం ఆంధ్రదేశంలో ఎంతో సుసంపన్నం. ఈ రెండు జిల్లాలను గోదావరి నది వేరు చేస్తున్నది. ఉభయ గోదావరి ప్రాంతాలు గోదావరి నది పరీవాహక ప్రాంతాలు కావడం ఈ సుసంపన్నతకు కారణం. ప్రాచీన కాలంనుండి ఈ ప్రాంతంలో పాడిపంటలకు కొరత లేదు. ఆర్థిక సమస్యలు లేనపుడు ప్రజలు కళలను గురించి కవిత్వాన్ని గురించి ఆలోచిస్తారు. ఈ రెండు జిల్లాల ప్రజలలో ఎందరో సంపన్నులు కళలను కవిత్వాన్ని పోషించారు. చారిత్రకంగా పరిశీలిస్తే ఈ ప్రాంతం పెద్ద పెద్ద రాజవంశాల పాలనలో ఉండినట్లు తెలుస్తుంది. తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని కాలం నుండి రాజమహేంద్రవరం (రాజమండ్రి) లలిత కళలకు ఆవాసమైంది. తెలుగులో తొలికావ్య రచన ఈ నగరంలోనే ప్రారంభమైంది. ఆ తొలికావ్యం రెండున్నర పర్వాల ఆంధ్రమహాభారతం.

తెలుగు భారతావిర్భావ కాలం నుండి గోదావరి ప్రాంతంలో అనేకమంది కవులు వెలసి కావ్యాలు రచించారు. క్రీ.శ. 18వ శతాబ్దం నుండి కవుల సంఖ్య అధికంగా కనిపిస్తుంది. ఇతర వృత్తులలో ఉంటూ కవిత్వకళను ఆరాధించిన వారున్నారు. ఈ ప్రాంతపు కవులలో ఎక్కువమంది ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవాళ్లే. వైద్యులుగా, న్యాయవాదులుగా, ఇతర రకాల కళాకారులుగా ఉండిన వారెందరో కావ్యాలు రాశారు. అలాటి వారందరూ ఈ వ్యాసంలో కనిపిస్తారు. నవలాకర్తలుగా, కథకులుగా, నాటకకర్తలుగా, కావ్యకర్తలుగా, వ్యాసకర్తలుగా, అనేక ఇతర ప్రక్రియలలో రచనలు చేసినవారుగా అనేకులు కనిపిస్తారు. అలాంటి వారు ఈ వ్యాసంలో కనిపించినా కవులుగా మాత్రమే వారిని గుర్తించడం జరిగింది. వారి కవితా గ్రంథాలే ఈ వ్యాసంలో చోటు చేసుకున్నాయి. ప్రాచీన కాలం నుండి సుమారు 1980 వరకు గోదావరి ప్రాంతంలో వెలసిన కవులీ వ్యాసంలో ప్రదర్శింపబడినారు.

అల్లమరాజ రామకృష్ణకవి : క్రీ.శ. 18-19 శతాబ్దాల నడిమిభాగం. పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా. కవిజన మనోరంజనం, కవిచకోర చంద్రోదయం వంటి ఎనిమిది ప్రబంధాలు రచించాడు.

అల్లమరాజు వేంకటకవి : 19వ శతాబ్ద ఉత్తరార్ధం. పిఠాపురం సంస్థానం. తూర్పు గోదావరి జిల్లా. కొన్ని కీర్తనలు, ఒక నీతి శతకం రచించాడు.

అవసరాల పద్మరాజు : 18శ. చివర 19శ. ప్రారంభం. పిఠాపురం సంస్థానం, సంస్థానాధిపతి రావు వేంకట నీలాద్రిరాయని మంత్రి. విద్వత్కవి. బాల భాగవత చంపువు ఇతని రచన.

అనివిళ్ళ వేంకటశాస్త్రి : 1750 ప్రాంతం. పశ్చిమ గోదావరి జిల్లా. కవి, పండితుడు, మహేశ్వర మహాకావ్యం, సతీశతకం మొదలగునవి ఇతర రచనలు.

ఈదులపల్లి భవాని శంకర కవి : 17వ శ. చివర - 18 శతాబ్దం ప్రారంభం. అమలాపురం ప్రాంతం. తూర్పు గోదావరి జిల్లా. శృంగార మంజరి, ధర్మఖండం ఇతని రచనలు.

ఎర్రమల్లి సూర్యప్రకాశ కవి : 1810 ప్రాంతం. పెద్దాపురం. తూర్పు గోదావరి జిల్లా. కూచిమంచి తిమ్మనకవికి సమకాలికుడు. రామేశ్వర మాహాత్మ్యం, రామవిలాసం, సంస్కృత సూర్యశతకం, కొన్ని దండకాలు, స్తుతులు ఇతని రచనలు. సుభాషిత రత్నావళి పేరు తెచ్చిన రచన.

ఏనుగు లత్సకవి : 17వ శతాబ్దం. సోమేశ్వర గ్రామం. గోదావరి మండలం. పెద్దాపురం సంస్థానాధీశుల ఆశ్రితుడు. ఇతని కృతులన్ని లభించడంలేదు. తుల్యా మాహాత్మ్యం భీమసేన విజయం లభిస్తున్నాయి.

ఓగిరాల జగన్నాథ కవి : 19వ శతాబ్దం నీలపల్లి, గోదావరి మండలం. సుమనో మనోభిరంజనం అనే ప్రబంధం ఇతని రచన.

ఓగిరాల రంగనాథ కవి : 19వ శతాబ్దం నీలపల్లి, గోదావరి మండలం, సమర్థుడైన విద్వత్కవి. అనేక ప్రబంధాలు రచించారు. కానీ అలభ్యం. జగన్నాథకవి ఇతని పినతండ్రి కుమారుడు.

కూచిమంచి జగ్గకవి : 1684-1757. కందరాడ గ్రామం. తూర్పు గోదావరి జిల్లా. కూచిమంచి తిమ్మకవికి కనిష్ఠ సోదరుడు. తిట్టుకవి. జానకీ పరిణయం, సుభద్రా పరిణయం, చంద్రరేఖా విలాసం మొ।। ఇతని రచనలు.

కూచిమంచి తిమ్మకవి : 18వ శతాబ్దం పిఠాపురం సంస్థానం. తూర్పు గోదావరి జిల్లా. కవిసార్వభౌమ, అభినవ వాగనుశాసన బిరుదాంకితుడు. అనేక ప్రబంధాలే కాకుండా క్షేత్ర మాహాత్మ్యం, శతక, దండక రచనలు కూడా చేశారు. రసిక జన మనోభిరామం ప్రసిద్ధ ప్రబంధం.

కూచిమంచి వేంకటరాయడు : 19వ శతాబ్దం పూర్వార్ధం. పిఠాపురానికి దగ్గర వున్న రావువారి చంద్రమపాలెం, తూర్పు గోదావరి జిల్లా లక్షణ చక్రవర్తి అనే బిరుదు వుంది. సుకవి మనోరంజనం ఇతని ప్రబంధం.

కొడిచెర్ల శ్రీనివాసకవి : 17వ శతాబ్దం రాజమహేంద్రవరం. శేషధర్మ రత్నాకరం ఇతని రచన. కవిత్వం ప్రౌఢం, రసవంతం.

కొత్తలంక మృత్యుంజయకవి : 1800 ప్రాంతం. కొమరిగిరి గ్రామం. గోదావరి మండలం. బృహన్నారదీయం, ధరాత్మజా పరిణయం, నిరోష్ఠ్య నలచరిత్ర ఇతని రచనలు.

చెళ్ళపిళ్ళ నరసకవి : 1795-1840, కడియం, తూర్పు గోదావరి జిల్లా. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రికి పినముత్తాత. యామినీ పూర్ణ తిలకావిలాస ప్రబంధం. ఏకాంతసేవాకలాపం లభిస్తున్న రచనలు. అహల్యా సంక్రందన విలాసం అలభ్యం.

జగన్నాథ పండితరాయలు : 1590-1665. ముంగండ అగ్రహారం. తూర్పు గోదావరి జిల్లా. 'పండితరాజు' అన్నది బిరుదు. నానాశాస్త్ర పారంగతుడని, అష్టభాషా కవిత్వక్షముడని ప్రఖ్యాతి. అనేక రచనలున్నాయి. అన్నీ సంస్కృతంలోనే. రసగంగాధరం ప్రసిద్ధ అలంకార శాస్త్రం.

తామరపల్లి తిమ్మయ్య : 1575 ప్రాంతం. గోదావరి మం. హరివంశంలోని ఆశ్చర్యపర్వం ఇతని రచన.

దామరాజు లక్ష్మీనారాయణ : 19వ శతాబ్దం ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా. బృందావన విహారం ఇతని రచన.

దిట్టకవి వేంకటామాత్యుడు : 1610-1680 దాక్షారామం. తూర్పు గోదావరి జిల్లా. సంస్కృతాంధ్రంలో అనేక గ్రంథాలు రచించినట్లు తెలుస్తున్నా ఏవీ లభించలేదు.



నడిమింటి సర్వమంగళేశ్వర శాస్త్రి : 1759-1836 గన్నవరం గ్రా. తూర్పు గోదావరి. అభినవ కాళిదాసు బిరుదు. సునిత సన్నుతీరు, విభక్తి విలాసం, సర్వమంగళీయం, వేదసారం, లౌకిక దృష్టాంతరమంజరి, భగవద్గీత భాష్యం, జగన్నాధ అష్టకం - మొదలగునవి ఇతని రచనలు.

నింబార్కుడు : 13వ శథాబ్దం గోదావరి మం. ప్రసిద్ధ వేదాంత దర్శన కర్త. వేదాంత పారిజాత సౌరభం, మాధ్వముఖ మర్ధనం, దశశ్లోకీ, శ్రీకృష్ణస్థవరాజం ఇతని రచనలు.

నిట్టల ప్రకాశదాసు : 19వ శతాబ్దం గోదావరి మం. భద్రాద్రి రామభక్తుడు. తత్త్వ, శృంగార బోధకాలైన కీర్తనలెన్నో రచించాడు.

నూతనకవి సూరన్న : 1410-1480. గోదావరి మం. ధనాభిరామం ఇతని రచన. నూతన కవి ఇతని బిరుదు కావచ్చు.

పట్టమట్ట సరస్వతీ సోమయాజి : 17వ శతాబ్దం ఉత్తరార్ధం. దాక్షారామం ప్రాంతం. తూర్పుగోదావరి. పోతనామాత్యుని మనుమడట. పృథుచరిత్ర ఇతని రచన.

పిండిప్రోలు లక్ష్మణ కవి : 19వ శతాబ్దం రామచంద్రాపురం ప్రాంతం. తూర్పుగోదావరి. తిట్టు కవిత్వంలో దిట్ట. రావణదమ్మీయం అనే ద్వర్థికావ్యం ఇతని రచన.

భాస్కరాచార్యులు : 1500-1700 నడుమ. పెనుగొండ. తూర్పు గోదావరి. వైశ్యపురాణం. ఇతని రచన.

మల్లికార్జున పండితుడు : 12వ శ. దాక్షారామం. తూర్పుగోదావరి. మల్లికార్జున పండితారాధ్యుడు అని కూడా అంటారు. సంస్కృతంలో తెలుగులో అనేక శైవమత ప్రతిపాదిత రచనలు చేశాడు.

మిక్కిలి మల్లికార్జున కవి : 1805-1875. పెద్దాడ - తూర్పు గోదావరి. నాచికేతు చరిత్ర, నిర్వచన విక్రమార్కర చరిత్ర, రామచంద్ర చరిత్ర, భేతాళ పంచవింశతి, భగవద్గీత, రాఘవ శతకం - ఇతని రచనలు.

ములపాక బుచ్చన్న శాస్త్రి : 18వ శతాబ్దం గుండ్లూరు. కోనసీమ, తూర్పుగోదావరి. అష్టభాషా కవిత్వ కోవిదుడు. అనేక ప్రబంధాలు రచించాడట. కాని అలభ్యం. సి.పి. బ్రౌన్ పోషణలో రచించిన వసుచరిత్ర వ్యాఖ్య లభ్యం.

యథావాక్కుల అన్నమయ్య : 1280-1340. పట్టిస గ్రామం. తూర్పు గోదావరి. ప్రసిద్ధ శతకకర్త. సర్వేశ్వర శతకం, లీలానంద సర్వేశ్వర శతకం ఇతని రచనలు.

రేకపల్లి సోమనాథ కవి : 1720-1790. గోదావరి మండలంలోని తాళ్ళపూడి. తర్క, వ్యాకరణాది శాస్త్రాలలో దిట్ట. రుక్మవతీ పరిణయం ఇతని కావ్యం.

వంకాయలపాటి వేంకటకవి : 1800 ప్రాంతం. గోదావరి మండలంలోని కోలంక. మదనగోపాల శతకం ఇతని రచన.

శ్రీనారాయణ తీర్థులు : 1700 ప్రాంతం. కోనసీమలోని కూచిమంచి అగ్రహారం. తూర్పు గోదావరి జయదేవ కవి అపరావతారంగా పేరు పొందాడు. శ్రీకృష్ణలీలాతరంగిణి, హరిభక్త సుధార్ణవమ్, ఇతని సంస్కృత రచనలు. తెలుగులో పారిజాతాపహరణం రచించాడు.

చిర్రావూరి కామేశ్వరరావు : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. రాజమండ్రి. సంఘసంస్కరణ లక్ష్యంగా పద్యకథలు, గేయాలు, నవలలు, నాటకాలు రచించారు. ఏకాంతప్రేమ అనే పద్యకథ ప్రసిద్ధి చెందినది.

జనమంచి కామేశ్వరరావు : 1911 జననం. రాజమండ్రి. గేయకవి. విస్తృత హృది, ఆకొండ - అనేవి ఇతని గేయాలు. కథలు కూడా రాశారు.

సత్యవోలు కామేశ్వరరావు : 1864 జననం. ఉప్పాడ కొత్తపల్లి. తూర్పు గోదావరి. శ్రుతి కంఠోపాఖ్యానం ఇతని పద్యరచన. సంస్కృత కావ్యాలను తెలుగులోకి అనువాదం చేశారు.

నిశ్శంకుల కృష్ణమూర్తి : 20వ శతాబ్దం పూర్వార్ధం. ముమళ్ళ పోరవరం. తూర్పుగోదావరి. దేవీభాగవత నవమస్కందం వీరి అనువాద రచన.

పొన్నాడ కృష్ణమూర్తి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. రాజవోలు. తూర్పు గోదావరి. భక్తి, వేదాంత విషయాలను ప్రచారం చేసే ఉద్దేశ్యంతో రచనలు చేసిన కవి. సంస్కృత, అధ్యాత్మ

గ్రంథాలను అనువదించారు. ఆత్మబోధం, గోపకుమార శతకం పద్యరచనలు.

మొక్కపాటి కృష్ణమూర్తి : 25-2-1912 జననం. వసంతవాడ (ఏలూరు సమీపం) పశ్చిమగోదావరి. కవి, చిత్రకారుడు. కథలు, గేయాలు, వ్యాసాలు రాశారు. విరహిత, భగీరథి స్మృతి, పద్యరచనలు.

నాళం కృష్ణారావు : 18-11-1961. మండపేట. తూర్పు గోదావరి. మధురకవి అనేది బిరుదు. అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. గోరుముద్దలు, విరిదండ, వెన్న బుడగలు, తేనె చినుకులు, దీపావళీ, వెన్నెల వెలుగులు మొదలగునవి పద్యరచనలు.

కాకరపర్తి కృష్ణశాస్త్రి : 1905 జననం. లక్ష్మీనరసాపురం పశ్చిమ గోదావరి. కవికంఠీరవ, కవి మూర్ధన్య, ప్రౌఢకవి చంద్రబిరుదాంకితులు. బహుగ్రంథకర్త. ఆయుర్వేదంలో నిష్ణాతులు. కంచడెక్క. చంద్రహాస విలాసం, పద్య రచనలు. సంస్కృతంలో కూడా గ్రంథాలు రచించారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి : 1897-1980 పిఠాపురం. తూర్పు గోదావరి. భావకవిత్వంలో అందెవేసిన చేయి. పద్మభూషణం, కళాప్రపూర్ణ బిరుదాంకితులు. అనేక ఖండకావ్యాలు, గేయనాటికలు, సినిమా పాటలు రచించారు.

ముతుకుపల్లి కృష్ణశాస్త్రి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. పోలవరం సంస్థానం. పశ్చిమగోదావరి. వీరభద్ర శతకం ఇతని రచన.

దూపాటి కొండమాచార్యులు : 20వ శతాబ్దం పూర్వార్ధం. పేరాల, పశ్చిమగోదావరి. శాల్మలీ, కాలవాహిని మణిమాల, పద్యరచనలు. సంస్కృతంలో కూడా రచనలు చేశారు.

తటవర్తి కొండయ్య కవి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. తణుకు. పశ్చిమ గోదావరి. రామశతకం, మల్లేశ్వర శతకం ఇతని రచనలు.

మోగంటి కొండల రామదాసు : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. యర్నగూడెం. కొవ్వూరు తాలూకా, పశ్చిమగోదావరి. శతకకర్త. కృష్ణశతకం రచించారు.

చదలవాడ కోటి నరసింహం : 1907 జననం. ఏలూరు. పశ్చిమ గోదావరి. శాస్త్ర విషయాలలోను, గణితంలోను, పరిశ్రమ చేసిన కవి. తిరుమలేశ శతకం, శేషాద్రి వేంకటేశ శతకం ఇతని రచనలు.

జయంతి గంగన్న : 20వ శతాబ్దం. పూర్వార్ధం. రాజమండ్రి, నవ్యకవిత్వ ధోరణులతో రచనలు చేసిన కవి. కంఠమాల ఇతని కవితాఖండికల సంపుటి.

గంగాధర కవి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. పిఠాపురం. తూర్పు గోదావరి. పండితకవి. కీరవాణి శతకం, శ్రీరమణీ మనోహర శతకం, చెన్న మల్లేశ్వర శతకం ఇతని రచనలు.

నేదునూరి గంగాధరం : 1904-1970. కొంతమూరు (రాజమండ్రి దగ్గర) కవికోకిల, జానపద వాఙ్మయోద్ధారకుల బిరుదాంకితులు. అనేక జానపద గేయాలు రచించారు.

చర్ల గణపతిశాస్త్రి : 1909 జననం. కాకరపర్రు. తణుకు తాలూకా. పశ్చిమగోదావరి. బహుశాస్త్రవేత్త, విద్వత్కవి. హిందీ, బెంగాళీ, ఆంగ్లభాషలు నేర్చినవారు. వీరి రచనలన్నీ ధర్మోపదేశ ప్రధానాలు. రఘువంశలహరి, మొయిలు రాయబారం, గణపతి రామాయణ సుధ, కావ్యమంజరి, సరల సంగ్రహగీత, దమ్మపదం, పద్యరచనలు.

పిలకా గణపతి శాస్త్రి : 1911-1983 రాజమండ్రి. ఇంగ్లీషు, హిందీ, ఫ్రెంచి, సంస్కృత భాషలు నేర్చినవారు. విద్వత్కవి. విభ్రాంతామరుకము. రత్నోపహారము ఇతని పద్యకృతులు, ఎన్నో నవలలు, ఏకాంకికలు రచించారు.

కనకదండి గోపాలకృష్ణశాస్త్రి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. ఏనుగులు మహల్. కొత్తపేట తాలూక, తూర్పుగోదావరి, నవరత్నమాలికా స్తోత్రం, చిత్రకవిత్వం ఇతని రచనలు.

ఆత్మకూరి గోవిందాచార్యులు : 1901 జననం. ఏలూరు. పశ్చిమ గోదావరి. గోవిందరామాయణం పాహిమాం శతకం. ఇతని పద్యరచనలు. బహుగ్రంథకర్త.

కర్రా చంద్రశేఖర శాస్త్రి : 1912 జననం రాయవరం. తూర్పు గోదావరి ఉభయభాషా ప్రవీణులు. బాదరాయణం వీరి పద్యకృతి.

వాడ్రేవు చలమయ్య : 1900 జననం. పిఠాపురం. తూర్పు గోదావరి. ఎక్కువగా ఖండకావ్యాలు రాశారు. సంస్కృతి, తేనె వెల్లువలు, భావవీచికలు – ఇతని ఖండకావ్యాలు.

చాట్రాతి చినవేంకటప్పయ్య : 20వ వథాబ్దం పూర్వార్ధం. ఏలూరు పశ్చిమగోదావరి. కాల్పనిక ఉద్యమ ప్రభావంతో రచనలు చేసిన కవి. కృషీవల విలాసం ఇతని పద్యరచన.

ననందివాడ జగన్నాథ కవి : 18178 జననం ఏలూరు. తూర్పు గోదావరి. యక్షగాన, హరికథా ప్రక్రియలలో కృషి చేసిన విద్వత్కవి. భైష్మకీపరిణయం, కృష్ణరాయబారం, ఇతని పద్యరచనలు. అనేక యక్షగానాలు, శతకాలు రచించారు.

మంగు జగన్నాథరావు శాస్త్రి : 1910 జననం కొవ్వూరు. పశ్చిమ గోదావరి. పండితకవి. శ్రీమదాంధ్ర కార్తీక మాహాత్మ్యం ఇతని పద్యరచన.

శిష్ట జగన్నాథ శాస్త్రి : 19వ శథాబ్దం. ఉత్తరార్ధం. రాజమండ్రి. ఇంగ్లీషు సాహిత్య ప్రభావంతో తెలుగులో రచనలు చేసిన కవి. చిల్లాబంది అను భ్రాతృ సౌహృదం, లింగప్రకాశిక, కాళికావిలాసం ఇతని రచనలు.

నిడమర్తి జలదుర్గా ప్రసాదరాయుడు : 1862–1947. కొమ్మ. భీమవరం తాలూకా, పశ్చిమగోదావరి. చంపు రామాయణం, మేఘసందేశ కావ్యం. ఇతని పద్యరచనలు.

సామవేదం జానకిరామశర్మ : 1909 జననం వసంతవాడ (ఏలూరు దగ్గర) పశ్చిమగోదావరి. 11వ ఏట నుండి కవిత్వం చెప్పారు. కర్ణభారం, మృత్యుంజయ శతకం, అశ్రుగీతి, బుద్ధ జననం, రామకథామృతం – మొదలగునవి వీరి రచనలు.

ఏనుగు తమ్మిరాజు : 1897 జననం తాపేశ్వరం. తూర్పుగోదావరి. సంప్రదాయ రీతిలో రచనలు చేసిన కవి. వీరివి ఎక్కువగా పద్య రచనలు. మిత్రస్మృతి, శ్రీబుచ్చిరాజీయం, శ్రీకృష్ణచాతుర్యం, ముని ప్రభావం, శ్రీమాహాత్మ్య శతకం, కుమార శతకం, శ్రీమత్ అన్నవర వీరవేంకట సత్యనారాయణ శతకం – మొదలగునవి వీరి రచనలు.

వడ్డి తాతయ్య : 1908–1936 వనపురం. యర్నగూడెం తాలూక, గో.మం. ఆశుకవి. ప్రధానంగా యక్షగాన నాటకకర్త. లవకుమార శతకం, కోనాల వేణుగోపాల శతకం, కోనాల సోమలింగేశ్వర శతకం – ఇతని రచనలు అనేక యక్షగానాలు రచించారు.

చళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి : 1870–1950 యానాం. తిరుపతి వేంకటకవులలో ఒకరు. దివాకర్ల తిరుపతి శాస్త్రిగారితో కలసి అనేక అవధానాలు చేశారు.

జూలూరి తులశమ్మ : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. పిఠాపురం. తూర్పుగోదావరి. భాగవత కృష్ణుడు, ఋతుచక్ర వర్ణనలు, ఋతుమాల ఈమె రచనలు.

చింతా దీక్షితులు : 1891–1960. దంగేరు రామచంద్రపురం తాలూకా, తూర్పుగోదావరి. భావకవి. కథాసాహిత్యంలో బాలసాహిత్యంలో ఉత్తమ స్థానం ఆక్రమించిన రచయిత. లక్కపిడతలు, చంద్రార్పణం ఇతని గేయరచనలు.

ముడుంబ దొడ్డయాచార్యులు : 1865 జననం తాళ్ళరేవు. తూర్పుగోదావరి. పద్యగర్భిత ముకుంద శతకం ఇతని రచన.

భళ్ళమూడి నరసింహమూర్తి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. పెద్దాపురం. తూర్పుగోదావరి. బాల్యం నుండి కవిత్వం చెప్పారు. ఉత్తర మేఘం, భానుస్తవం, భాస్కర శతకం, సమీర సందేశం – మొదలగునవి ఇతని రచనలు.

కాకాని నరసింహారావు : 1903 జననం గుడివాడ. పశ్చిమ గోదావరి. అభ్యుదయ భావాలుగల కవి. శ్రీహరి శతకం, బాలప్రబోధం, శ్రీభక్త సంరక్షికా శతకం, కవితోన్మాదం, సతీస్మృతి – మొదలగునవి ఇతని రచనలు.

పుట్రేవు నాగభూషణం : 1894 జననం ఏలూరు. పశ్చిమగోదావరి. అలంకారశాస్త్ర సంబంధమైన రచనలు, పురాణేతి వృత్తాలతో కూడిన రచనలు ఎక్కువగా చేశారు. హరికథలు కూడా రాశారుఏ. సీతాకళ్యాణం, మార్కండేయ చరిత్ర, విప్రనారాయణ చరిత్ర, శ్రీనివాస కళ్యాణం ఇతని హరికథలు. దాసపోషక శతకం కూడా రచించారు.

కాళ్ళకూరి నారాయణరావు : 1871-1927. కాకినాడ. తూర్పుగోదావరి. నాటకం ప్రహసనం, కవిత్వం, విమర్శ ప్రక్రియలను చేపట్టి అనేక గ్రంథాలను రాశారు. సంఘసంస్కరణాభిలాషి. వరవిక్రయం, మధుసేవ నాటకాలలో రచించినవర పద్యాలు ఇతనిని గొప్ప కవిగా నిరూపిస్తాయి.

ద్వివేది నారాయణశాస్త్రి : 1888 జననం వింజరం. తూర్పు గోదావరి. వ్యాకరణ, తర్క, వేదాంత, మీమాంస శాస్త్రాలలో నిష్ణాతులు. సంస్కృతంలో కూడా కావ్యాలు రచించారు. కల్పవల్లిక, తారావళి, తిలకసహస్రం, మొ।। ఇతని రచనలు.

వోలేటి పార్వతీశం : 1822-1955 కొమరగిరి. పిఠాపురం తాలూకా. తూర్పుగోదావరి. కవికులాలంకార, కవిరాజహంస బిరుదాంకితులు. అనేక నాటకాలు రచించారు. జలజమాలిక ఇతని పద్యరచన.

జటావల్లభుల పురుషోత్తం : 1906-1973 కొవ్వూరు. తూర్పు గోదావరి ఆర్షవిద్యాభూషణ, ధర్మస్థాపక, ఉపన్యాసకేసరి బిరుదాంకితులు. పండితకవి. ప్రాచీన హైందవ సంస్కృతీ వైశిష్ట్యాన్ని నిరూపించే రచనలు చేశారు. సంస్కృతంలో చిత్రశతకాన్ని రచించారు.

మంగిపూడి పురుషోత్తమ శర్మ : 1893-1946 పిప్పర. పశ్చిమ గోదావరి. జాతీయోద్యమ యోధుడుగా, కవిగా పేరు పొందిన దేశభక్తుడు. స్వేచ్ఛాగానం, గోదావరి - ఇతని పద్యకృతులు.

బెండా పెంటయ్య : 19వ శతాబ్దం. రాయవరం. తూర్పుగోదావరి. ఉర్దూభాష పరిచయమున్న కవి. రాజమండ్రి తాలూకా పోలీసు స్టేషన్లో రైటర్‌గా పనిచేస్తూ రచనా వ్యాసంగం కొనసాగించారు. ఆత్మసంబుద్ధిగా 108 పద్యాలతో పెంట శతకం రచించారు.

చావలి బంగారమ్మ : 1897 జననం మోడేకుర్రు. తూర్పుగోదావరి. భావకవిత్వరీతులను అనుసరించినవర కవయిత్రి. ఆకొండ, కప్పతల్లి పెండ్లి, తమస్సు, కార్తీకపౌర్ణమి, కాంచన విపంచి - మొదలగునవి ఈమె గేయ సంపుటాలు.

పిన్నమరాజు బలరామకవి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం ఆలమురు పశ్చిమగోదావరి. భక్తివైరాగ్య బోధకాలైన శతకాలు రచించాడు. ఆపన్నివారణ కృష్ణశతకం, శ్రీమత్ అంతర్వేది లక్ష్మీనృసింహశతకం, కేశవ శతకం, వేంకటశైలపతి శతకం, కాంతాశతకం ఈయన రచించిన శతకాలు. పద్యకృతులు కూడా రచించాడు.

అడివి బాపిరాజు : 1895-1952 భీమవరం. పశ్చిమ గోదావరి. కవిత్వంలో చిత్రలేఖనం, చిత్రలేఖనంలో కవిత్వం కూర్చిన దిట్ట. ప్రసిద్ధ నవలా కారులు, విమర్శకులు, కథారచయిత. వసుధైక కుటుంబ నిర్మాణం లక్ష్యంగా కలం పట్టిన భావుకులు. మంచికవి. శశికళ, గంగిరెద్దు, వరదగోదావరి, గోధూళి - మొదలగు గేయసంపుటాలు. కళాప్రపూర్ణ బిరుదాంకితులు.

బొడ్డు బాపిరాజు : 1912 జననం ఏలూరు, పశ్చిమగోదావరి. 10 సంవత్సరముల వయసులోనే కలం పట్టిన ప్రతిభామూర్తి. భావకవి, అనేక ఖండకావ్యాలు, గేయకావ్యాలు రచించారు. కాత్యాయని, బిపంచి, కాకవిలాసం, దీవెనం - మొదలైనవి ఇతని ఖండకావ్యాలు. భక్తలోల శతకం కూడా రచించారు.

దేవరకొండ బాలగంగాధర తిలక్ : 1922-1966 తణుకు, పశ్చిమగోదావరి. కవి, కథకుడు. భావకవితాయుగానికి చివరి గొప్ప ప్రతినిధులు. అమృతం కురిసిన రాత్రి ప్రసిద్ధ కవితాసంపుటి. కఠోపనిషత్, వసుధైక గీతం, శిఖరారోహణ, మాగ్నకార్టా - మొదలైన ఇతర రచనలు. ఎన్నో కథలు, నాటకాలు రచించారు.

శొంఠి భద్రాది రామశాస్త్రి : 1856-1915. కొమరగిరి, పిటాపురం దగ్గర. తూర్పుగోదావరి. అలంకార, వ్యాకరణ శాస్త్రాలలో పండితులు, విద్వత్కవి. శివరామ శతకం, కాళిందీ పరిణయం, శంతనోపాఖ్యానం మొదలగునవి పద్యకృతులు.

మంత్రిప్రెగడ భుజంగరావు : 1876-1941 ఏలూరు. పశ్చిమ గోదావరి. రాజకవిగా, కవిపోషకులుగా, శతాధిక

గ్రంథకర్తగా ప్రసిద్ధులు. కావ్యాలు, నాటకాలు, ప్రహఖసనాలు, కథలు, నవలలు, శతకాలు, ప్రబంధాలు, చాటువులు, అవధానాలు, ఆశుకవిత్వం మొదలగునవి వివిధ సాహిత్య శాఖలలో పరిశ్రమ చేసి అనేక రచనలు చేశారు.

గరికపాటి మల్లావధాని : 1899 జననం కొవ్వూరు, పశ్చిమ గోదావరి. కవిశేఖర బిరుదాంకితులు, జాతీయోద్యమ ప్రభావంతో రచనలు చేసిన పండితకవి. భారతాంబికా శతకం, జాతీయగీతాలు, బాలగీతాంజలి, శ్రీబాలమ్మ మొదలగునవి ఇతని రచనలు.

బుద్ధవరపు మహాదేవుడు : 1899-1968 పలివెల, తూర్పుగోదావరి. కవితా విశారద బిరుదాంకితులు. ఉభయ భాషలలోను, తర్క, వ్యాకరణాది శాస్త్రాలలో నిష్ణాతులు. శ్రీమదాంధ్ర మాఘము, సూతసంహిత, చంపూరామాయణం, కువలయానందం, ఖండకావ్య సంపుటి - మొదలగునవి ఇతని రచనలు.

వేదుల మీనాక్షిదేవి : 1917 జననం. రాజమండ్రి. సంప్రదాయ రీతిని అనుసరించిన కవయిత్రి. రాసక్రీడాష్టకం, సత్యాధరం. సోదరి హితోపదేశం - మొదలగునవి ఈమె ఖండకావ్యాలు.

చిల్లరిగె యోగానందకవి : 1880-1957 సీసలి, పశ్చిమ గోదావరి అష్టావధాని, ఆశుకవితా ప్రవీణులు. నూతన పోతన బిరుదాంకితులు. బాలశతకం, బాలనీతి ప్రతిపద శతకం శుభోదినీ శతకం రచించారు. వాల్మీకి రామయణాన్ని యోగానంద రామాయణంగా అనువదించి ముద్రించారు.

అల్లంరాజు రంగశాయి కవి : 1861-1936. చేబ్రోలు, పిఠాపురం దగ్గర, తూర్పు గోదావరి. శతావధానాలు, అష్టావధానాలు చేసిన పండికతవి. చిత్రకవితలో, సమస్యా పూరణంలో నేర్పరి. శ్రీమదాంధ్ర చంపూ భారతం, సర్వేశ్వర శతకం కుక్కుట లింగ శతకం, రఘురామ శతకం, రామాయణ చంపువు, పరాత్మ శతకం, గోవింద శతకం - మొదలగునవి ఇతని రచనలు.

బాలాంత్రపు రజనీకాంతరావు : 1920 జననం. నిడదవోలు, పశ్చిమగోదావరి. భావకవిత్వానికి పరిమితమై రచనలు చేసిన కవి, గాయకుడు, సంగీత దర్శకుడు. వేంకటపార్వతీశ కవులలో ఒకడైన వేంకటరావుగారి రెండవ కుమారుడు. నాటకాలు, గేయాలు,పాటతలు, ప్రబోధ గీతాలు రాశారు. గేయనాటికలు రచించారు. కడలినుండి కొండదాక, మూలస్తంభాలు వీరి గేయనాటికలు. అనేక బహుమతులు పొందారు.

క్రొవ్విడి రామకవి : 1868 జననం, భీమవరం తాలూకా, పశ్చిమ గోదావరి. ఆశుకవి. పద్యకావ్యాలే గాక, నాటకాలు, యక్షగానాలు, ప్రహసనాలు రచించారు.

నండూరు రామకృష్ణమాచార్య : 1921 జననం, అగ్రహార గోపవరం, పశ్చిమగోదావరి. కవి, విమర్శకుడు శీర్ణమేఖల, తారాతోరణం, ఖండకావ్యాలు. అమరజీవులు - పద్యకావ్యం. చారిత్రక నాటకాలు కూడా రచించారు.

వేదుల రామకృష్ణశాస్త్రి : 1889-1918 కాకరపర్తి, తణుకు తాలూకా, పశ్చిమగోదావరి. విద్వత్కవి. 11వ యేటనే కవిత్వం చెప్పడం ప్రారంభించి పుంభావ సరస్వతిగా ప్రసిద్ధి కెక్కారు. వేంకటరామకృష్ణ కవుల జంటలో రెండవవారు.

ఆకొండి రామమూర్తి శాస్త్రి : 1875-1963. కేశనకుర్రు, కాకినాడ తాలూకా తూర్పుగోదావరి. విద్వత్కవి. ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు. దేవీభాగవత నవమస్కంధాన్ని తెనిగించారు.

జయంతి రామయ్య పంతులు : 1860-1941. ముక్తేశ్వరం, అమలాపురం తాలూకా. తూర్పుగోదావరి. కళాప్రపూర్ణ బిరుదాంకితులు. బాలరామాయణం, ముక్తేశ్వర శతకం, అమరుకం పద్యరచనలు. ప్రసిద్ధ శాసన పరిశోధకులు. నిఘంటు నిర్మాతలు, తాళపత్ర గ్రంథ పరిష్కృతులు. ఉత్తర రామచరిత్ర, చంపూరామాయణం, అమరుకం, ఆంధ్రకరణలు.

పెండ్యాల రామశాస్త్రి : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. అంబికపల్లి అగ్రహారం, రామచంద్రాపురం తాలూకా, తూర్పుగోదావరి.

భక్తిని, నీతిని బోధించే రచనలు చేశారు. వాటిలో వేంద్రలేటు గోపాలశతకం ప్రధానమైనది.

భువనగిరి లక్ష్మీకాంతమ్మ : 1890 జననం. రాజమండ్రి. భక్తి, అద్వైత మతాల ప్రధానంగా రచనలు చేసిన కవయిత్రి. భీష్మస్తవరాజం, భారతకృష్ణ శతకం, జగద్గీతా మాహాత్మ్యం, వన్యవృత్తి మొదలగునవి ఈమె రచనలు.

పులుగుర్తి లక్ష్మీనరసమాంబ : 1878 జననం. కాకినాడ, తూర్పు గోదావరి. హింది, బెంగాలీ భాషలలో పాండిత్యం ఉన్న రచయిత్రి. పద్యం, కథ, నవల, ద్విపద మొదలగునవి ప్రక్రియలలో అనువాదాలు కూడా చేశారు. ఎన్నో నీతి పదాలు రచించారు.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ : 1904 జననం. ముత్యాలపల్లె, పశ్చిమగోదావరి. సాహిత్య రంగంలోనే గాక, సాంఘిక రాజకీయ రంగాలలో కూడా చురుకుగా పాల్గొన్న మహిళ. జ్ఞాననేత్రం, నైవేద్యం, రమణగీత, ఆరాధన, ఆంధ్రస్త్రీలు మొదలగునవి ఈమె రచనలు.

కొత్తపల్లి లచ్చయ్య : 1863-1898 చందుర్తి గ్రామం, పిఠాపురం దగ్గర. తూర్పుగోదావరి. ఆశుకవనంలోను, సమస్యా పూరణంలోను ప్రావీణ్యాన్ని ప్రదర్శించిన ప్రౌఢకవి. దాశరథి విలాసం, చెల్లయ్యమ్మరావు శతకం, సూర్యశతకం ఇతని రచనలు.

కల్లూరి విశాలాక్షి : 1901 జననం. రాజమండ్రి కల్లూరి సుబ్బారాయుడి సతీమణి. ఎలాంటి విషయాన్నైనా సుబోధకంగా, సరళంగా చెప్పగల కవయిత్రి. దమయంతీ చరిత్ర, భారత కథామృతం, చంద్రమతీ చరిత్ర, రామశతకం, స్వరాజ్యలక్ష్మి పరిణయం – మొదలగునవి ఈమె రచనలు.

మల్లవరపు విశ్వేశ్వరరావు : 1906-1986 ఉండి. పశ్చిమగోదావరి కాల్పనికోద్యమ ప్రభావంతో రచనలు చేసిన వ్యక్తి. ఇంగ్లీషు, బెంగాలీ భాషలలో మంచి ప్రవేశం ఉంది. ప్రకృతిని, ప్రణయాన్ని వస్తువుగా రచించి 50 పైగా కవితలు రాశారు. మధుకీల, కికిడీ, ఉగాదులు – ఉత్సవాలు ఈయన కవితాఖండికలు. కథలు కూడా రాశారు.

వింజమూరి వీరరాఘవాచార్య : 1885-1920. దొంతవరం అగ్రహారం, తణుకు తాలూకా. పశ్చిమగోదావరి. నూజివీడు సంస్థానంలో విద్వాంసులు. చాలా మంచి కవి. పండితులకు విద్యాగురువులు. సంస్కృతంలో చాలా గ్రంథాలు రాశారు.

నడకుదుటి వీరరాజు : 1871-1937 శాహపురం. కాకినాడ తాలూకా. తూర్పు గోదావరి. చిన్నతనంలోనే కవిత్వం చెప్పారు. అవధానాలు చేసి పేరు పొందారు. విమర్శకాదర్శ బిరుదాంకితులు. విభ్రమ తరంగిణి, జానకీ పరిణయం, సకలజన మనోభిరంజనం, లక్ష్మీనారాయణ విలాసం – మొదలగునవి వీరి రచనలు.

కందుకూరు వీరేశలింగం పంతులు : 1848-1919. సాహిత్యాన్ని సంఘసంస్కరణ సాధనంగా గ్రహించినర నవయుగ వైతాళికుడు. తెలుగులోని అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశాడు.

శెట్టిపల్లి వేంకటరత్నం చౌదరి : కొవ్వలి. ఏలూరు తాలూకా. పశ్చిమ గోదావరి. సామ్యవాద భావాలతో ప్రబోధాత్మకంగా గీతాలు రాసిన తొలితరం కవి. జ్యోతిర్మయి ఇతని ఖండకావ్యం.

జనమంచి వెంకటరామయ్య : 1872-1933. రాజమండ్రి. పండిత కవి. అమృత కలశి, నాదారితోడు, నవ కుసుమాంజలి, మేఘదూత, సుప్రభాతం మొదలగునవి వీరి రచనలు.

తురగా వెంకటరామయ్య : 1893 జననం అమలాపురం. తూర్పు గోదావరి. భావకవి. భూవగేయ, కవి చక్రవర్తిగా పేరు పొందారు. కోకిల కళ్యాణం, జన్మభూమి, విస్మృతగానం వీరి ఖండకావ్య సంపుటాలు.

ముళ్లపూడి వెంకయ్య : 19వ శతాబ్దం. ఉత్తరార్ధం. కాకినాడ. తూర్పుగోదావరి. కాశీమాహాత్మ్యం, విఘ్నేశ్వర చరిత్ర, చంద్రహాసా చరిత్ర, ప్రహ్లాద చరిత్ర మొదలగునవి వీరి రచనలు.

చెలికాని వేంకటరాయులు : 19వ శతాబ్దం ఉత్తరార్ధం. చంద్రమపాలెం. తూర్పుగోదావరి. రామరాజీయం అనే పద్యకావ్యం ఇతని రచన.

మంగు వేంకట లక్ష్మీనరసింహారావు : 1855 జననం పొలమూరు. పశ్చిమగోదావరి. కావ్యకర్త, శతకకర్త. శ్యమంతకోపాఖ్యానం, శ్రీకృష్ణభక్త సంవాదం, కేశవ శతకం, సూర్యశతకం – ఇతని రచనలు.

కిళాంబి వేంకట వరదాచార్యులు : 19వ శతాబ్దం. ఉత్తరార్ధం. పెంటపాడు అగ్రహారం, పశ్చిమగోదావరి. శతకాలు, నాటకాలు రాసినకవి. దశావతారస్తోత్రం, ముకుంద శతకం, రుక్మాంగద నాటక ప్రబంధం, శ్రీమత్ అంతర్వేది లక్ష్మీనృసింహ శతకం – మొదలగునవి వీరి రచనలు.

మంగిపూడి వేంకటశర్మ : 1882–1951. రాజమండ్రి. తెలుగులో ఖండకావ్య రచన ప్రారంభించిన తొలి తరం కవి. జాతీయోద్యమ కవితకు మార్గదర్శి. వివిధ ప్రక్రియలలో రచనలు చేశాడు.

చెల్లపిళ్ళ వేంకటశాస్త్రి : 1870–1950. కడియం గ్రామము తూర్పు గోదావరి. తిరుపతి వేంకటకవులలో ఒకరు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ప్రథమాంధ్ర ఆస్థానకవి. ఆరోగ్య కామేశ్వరీ శతకం, కామేశ్వరీ శతకం, వీరి రచనలు. గొప్ప అవధాన సరస్వతి.

రావూరు వేంకటసుబ్బమ్మ : 1896–1966. రాజమండ్రి. పద్యరచనలో సిద్ధహస్తురాలు. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి మేనకోడలు. కర్పూరమంజరి, హర్షచరిత్ర, మృచ్ఛకటికం, ఉదారపాండవం – ఈమె రచనలు.

కేసిరాజు వేంకట సుబ్బారాయకవి : 1858–1899. మలకపల్లి. తూర్పుగోదావరి. ఆశుకవి. యక్షగాన నాటకాలు ఎక్కువగా రాశారు. చోరచరిత్రం, వేంకటరమణ శతకం, భద్రాద్రి రామాయణం – మొదలగునవి వీరి రచనలు.

కొమరవోలు వేంకటసుబ్బారావు : 20వ శతాబ్దం. పూర్వార్ధం. కాకినాడ. కాల్పనిక ఉద్యమ ప్రభావంగల పండితకవి. లతాప్రేత సల్లాపములు అనేది ఖండకావ్యము. కవిహృది, జీవన్మృత ఘోష – అనేవి గేయాలు.

ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రి : 1860–1916. ఖండవల్లి. పశ్చిమగోదావరి. ఉభయ భాషాప్రవీణులు. చాలామంది కవిపండితులకు విద్యాగురువు. సంస్కృతం నుండి అనేక రచనలను తెనిగించారు. సూర్యశతకం, భామినీ విలాసం, శుద్ధాంధ్ర ఋతుసంహారం, గంగలహరి స్తోత్రం, శ్రీమహాభారత నవనీతం, కృష్ణాపుష్కర మాహాత్మ్యం మొదలగునవి వీరి రచనలు.

కస్తూరి శివశంకర కవి : 1875 జననం విశ్వేశ్వరాయపురం. రాజోలు తాలూకా. తూర్పుగోదావరి. విద్వత్కవి. సంగీత వైద్యశాస్త్రాలలో ప్రవీణులు. శంకర రామాయణం, శివానందలహరి, ద్వాదశమంజరి, నృసింహస్తోత్రం, సముద్ర అష్టకం, ఉపమాన శంకర శతకం – మొదలగునవి వీరి రచనలు.

బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు : 1916 జననం, ద్వారకా తిరుమల. పశ్చిమగోదావరి. బహుభాషావేత్త, విద్వత్కవి, మంచి అనువాదకులు. ఆరు ద్రావిడ ప్రబంధాలకు పద్యానువాదం చేశారు. పాశురాలను సీస పద్యాలుగా అనువదించారు. దివాళీ, ఓవరి – వీరి ఖండకావ్య సంపుటాలు.

శ్రీరమణ కవి : 20వ శతాబ్దం. పూర్వార్ధం. రాజమండ్రి. సమకాలిక కవుల మెప్పు పొందిన సహజకవి. పత్నీ స్మృతి–పుష్కర కృతి, నీతిబోధిని, రామశతకం, భీష్మైకాదశి మాహాత్మ్యం – మొదలగునవి వీరి రచనలు.

మధునాపంతుల సత్యనారాయణ మూర్తి : 1920 జననం. వల్లిపాలెం. కాకినాడ తాలూకా. తూర్పు గోదావరి. తెలుగుదేశ చరిత్రకు కావ్యత్వం సిద్ధింపజేసిన మహాకవి. ఆంధ్ర కల్పణ బిరుదాంకితులు. వీరి ఆంధ్రపురాణం మహాకావ్యం. ఇతర రచనలు అనేకం. చైత్రరథం. కేళాకుళి ఖండకావ్యాలు.

శిష్ట సర్వశాస్త్రి : 1830–1880. కాకినాడ. ఉభయ భాషలలో కవి, పండితుడు, అవధాని. లలితాశతకం, అమరుకం, జ్ఞాన ప్రసూనాంబికా శతకం – మొదలగునవి వీరి రచనలు.

బొమ్మకంటి వేంకట సింగరాచార్యులు : 1916–1978. ద్వారకా తిరుమల. పశ్చిమగోదావరి. కవి, పత్రికా రచయిత అనువాదకుడు. గీతాంజలి. అన్యాపదేశం, గోపీహృదయం మొదలగునవి వీరి రచనలు.

జనమంచి సీతారామస్వామి : 20వ శతాబ్దం. పూర్వార్ధం. పిఠాపురం. తూర్పుగోదావరి కవి పండితులు. కళత్ర వియోగ విషాదకావ్యం, రామశతకం, వీరి రచనలు.

మధిర సుబ్బన్న దీక్షితులు : 1868–1928. తాళ్లపూడి. తూర్పు గోదావరి కాశీమజిలీ కథల ప్రచురణతో పేరు పొందిన కవి. విద్యార్థి దశనుంచి కవిత్వం చెప్పారు. అవధాని. తెనాలి రామలింగ విజయం, గౌతమీ పుష్కర మాహాత్మ్యం. సప్తసాగర సంగమ మాహాత్మ్యం – వీరి పద్యరచనలు. వచన రచనలు ఎన్నో ఉన్నాయి.

వడ్డాది సుబ్బారాయుడు : 1854 – 1938. పాశర్లపూడి. నగరం తాలూకా. తూర్పుగోదావరి. మంచి కవి, అనువాదకులు. పదునాల్గవ సంవత్సరంలోనే భజగోవింద శ్లోకాలను తెనిగించారు. అనేక సంస్కృత నాటకాలను తెనిగించారు. రాజమండ్రి కవిత్రయంలో ఒకరు. సతీస్మృతి, సుతస్మృతి, ఆంధ్ర సూర్యశతకం, ఆర్ద్ర రక్షామణి శతకం. వీరి రచనలలో కొన్ని.

కృత్తివెంటి సుబ్బారావు : 1907 జననం, శ్రీరామపురం. భీమవరం తాలూకా. పశ్చిమగోదావరి. కవిరాజ, కవిచంద్ర బిరుదాంకితులు. శతావధాని నాటకం, శతకం, ఖండకావ్యం అధిక్షేపకావ్యం – మొదలగునవి. అన్ని ప్రక్రియలను చేపట్టిన కవి. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని పద్యాలు, కీర్తనలు రాసి, జాతీయ కవిగా గుర్తింపు పొందారు.

అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి : 1831–1892 చేబ్రోలు. తూర్పుగోదావరి. శతావధాని ఆశు, చిత్ర, ప్రబంధాది కావ్యాల రచనలలో పేరుపొందారు. సుభద్రాపరిణయం, పాపయ్య మంత్రి శతకం, చాటుధారా చమత్కార సారం, ఆత్మప్రబోధం, సింహాద్రి రామాధిప శతకం, మొదలగునవి వీరి రచనలు.

కామవరపు సూర్యనారాయణ కవి : 1906 జననం. ఆలమూరు. తూర్పుగోదావరి. భక్తకవి శ్రీదండక రామాయణము, దశావతార దండకం, వాసవీకన్యకా పరమేశ్వర శతకం, శ్రీగోదావరి దండకం మొ. పాతికకు పైగా దండకాలు రచించారు.

ఆవంత్స సోమసుందర్ : 1924 జననం. పిఠాపురం. తూర్పు గోదావరి. భావకవిత్వానికి సన్నిహితంగా వుండి, అభ్యుదయ భావాలను విరివిగా ప్రచారం చేసిన కవి. అనేక కవితా ఖండికలు, విమర్శా గ్రంథాలు రచించారు. వజ్రాయుధం, మందీ – మనిషి, అనల కిరీటం, కాహళి, గోదావరి జల ప్రళయం, రక్తాక్షి, అంగారతల్పం, వెన్నెలలో కోనసీమ మొదలగునవి వీరి రచనలు.

పానుగంటి లక్ష్మీనరసింహారావు : (1865– 1940) : వీరు తూర్పుగోదావరి సీతానగరం లో జన్మించారు . విద్యాభ్యాసం రాజమండ్రీ లో జరిగింది. పెద్దాపురం హైస్కూల్ లో ఉపాధ్యాయునిగా కొంతకాలం పనిచేశారు. పాదుకా పట్టాభిషేకం, కంఠాభరణం, విప్రనారాయణ, సారంగధర, కోకిల, రాధాకృష్ణ మున్నగు నాటకాలు దాదాపు 30 వరకు రాశారు. ఈ నాటకాల ప్రత్యేకత అన్నీ ప్రదర్శన యోగ్యంగా ఉండటమే. ఇంకా భాషా విషయికమైన రచనలు, విమర్శనలు, ప్రహసనాలు రచించారు. పిఠాపురం ఆస్థానకవిగా నియమితులయ్యారు. వీరికి అఖండ ఖ్యాతి తెచ్చిన రచన 'సాక్షి' వ్యాసాలు. ఇందులో వారు స్పృసించని అంశం లేదు. సంఘంలోని పలు దురాచారాల దుమ్ముదులిపేరు. 75 సం.ల జీవితంలో ఏబది సం.ల పైగా పిఠాపురంలోనే ఉండి ఆవూరికి , సంస్థానానికి కీర్తి సంపాదించిన ప్రతిభాశాలి పంతులుగారు.

భిషగ్వర పాపయలింగ కవి (1812-1882) : పీఠికాపురము వీరి జన్మ స్థలము. మంత్ర శాస్త్రం, జ్యోతిషం, కవిత్వ ములందు ప్రసిద్ధి గాంచెనవారు. మౌక్తికాభ్యుదయము, గణేశ శతకము, కుక్కుటలింగ శతకము, వైద్యనాథ స్తవము (ద్విపద), ముక్తవంశాను వర్ణనము , కొన్ని చాటువులు రచించారు. వీరు కిర్లమపూడి, పిఠాపురము సంస్థానముల గౌరవ సత్కారములను పొందినారు. ఆయుర్వేదము నందు కూడా నిష్ణాతులని పేరు గాంచినారు.

కామర్షి వేంకటసుబ్బయ్య గారు (1858-1943) : కాకినాడ వాస్థవ్యులైన వీరు శ్రీవిద్యోపాసకులు, నిత్య శివపూజా దురంధరులు. శ్రీవిద్యారణ్య చరిత్ర, శ్రీసోమేశగౌరీ శతకము, ముక్తేశ్వరోపాఖ్యానము రచించారు. ముకుందమాల, అష్టావక్రగీత లను తాత్పర్య సహితముగా ప్రచురించారు. రామకృష్ణ మఠము వారి ప్రఖ్యాత ప్రచురణ 'వివేకచూడామణి' కి ఆంధ్ర తాత్పర్యము, వివరణ రచించారు. వీరి ఈ వివరణ బహుపాఠక జనామోదము బడసి పలుమార్లు ముద్రణకు నోచుకున్నది. వీరి రచన లనేకము నాటి త్రిలింగ పత్రికలో ప్రచురించబడు చుండెడివి. అమలాపురము దగ్గరి పేరూరిపేటలో డెల్టా సూపర్నెంట్‌గా ఉద్యోగించారు.

పేరూరి వెంకటసుబ్బారావు. (1876-1931) : వీరు గోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయమున హుజూర్ కేషియర్ గా పని చేసిరి. శ్రీశంకరభగవత్పాదుల సౌందర్యలహరికి పద్యానువాదము, మురహరి శతకము, తులసీ మహత్త్యము, ముహూర్తఫల సర్వస్వము, కుమారాభ్యుదయమను నాటకము రచించారు. శివకర్ణామృతస్తోత్రము ప్రాచీన తాళపత్ర గ్రంథము పరిష్కరించి ముద్రించినట్లు తెలియుచున్నది.

వడలి లక్ష్మీనారాయణ శాస్త్రి : పిఠాపురం వేదపాఠ పరిషత్ కు అధ్యక్షులు. తర్క వ్యాకరణ మీమాంసాది శాస్త్రాలలో అసమాన పండితులు. వేదార్థమును వివరించుటలో అఖండ ప్రజ్ఞాశాలి అనిపించుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదవేదాంత పండిత బిరుదును, కాశిలోని వేదవిద్యాలయం వారు ఆమ్నాయార్థ వాచస్పతి అనే బిరుదు ను సమర్పించాయి. "శ్రీపిఠాపుర సంస్థాన పండితానాం శ్రీ వడలి లక్ష్మీనారాయణ శాస్త్రిణాం మానపత్ర మిదమ్" అన్న సమ్మాన పత్రంలో "శ్రీమంతో వైదిక మూర్ధన్యా జటాఘనాది వికృతి ప్రపంచానాం అనులోమ్యేన ప్రాతిలోమ్యేనాపి పాఠే ప్రవీణా, మీమాంస ప్రవరాః" అని సంబోధించ బడిన పండిత శ్రేష్టులు.

కామఋషి మృత్యుంజయవర్మ (1880-1936) : పిఠాపురము వీరి నివాసస్థానము. జ్యోతిష, మంత్రశాస్త్ర, కవిత్వ ములందు ప్రవీణులు. బ్రహ్మశ్రీ పేరి పేరయ్యశాస్త్రి, దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి(తమ్మనశాస్త్రి) వీరి కవితా గురువులు. ఆయుర్వేదము నభ్యసించిన వీరు పిఠాపురము నందు భిషగ్వరులుగా ప్రఖ్యాతి చెందిరి. శ్రీహరి శతకము, కర్మవిజ్ఞానము సుబ్రహ్మణ్యశతకము, రసతంత్ర విజ్ఞానము వ్యాసములు (ఆంధ్రపత్రిక ఉగాది సంచికలలో ప్రచురణ) హరిజనులు అస్పృశ్యులు కారు (వ్యాస సంపుటి) అనునవి వీరి రచనలు.

శ్రీపాద లక్ష్మీనృసింహ శాస్త్రి: పిఠాపురం సంస్థాన పండితునిగాను, పరిక్షాధికారి గాను ఉండేవారు. కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి పిఠాపురం వచ్చినపుడు వీరి శాస్త్ర ప్రకర్షకు ఆశ్చర్యపడి "శాస్త్ర రత్నాకర" అన్న బిరుతో సన్మానించారు. నవద్వీపం(బెంగాలు)లో మదన మోహన మాలవ్యా పండితులు వీరి అసాధారణ ప్రతిభావిశేషాలకు ముగ్ధుడై బ్రహ్మరథం పట్టి ఊరేగించి, మాలవ్యాగారు స్వయంగా చత్రం పట్టేరట.

పురాణపండ మల్లయ్య శాస్త్రి : పశ్చిమగోదావరి ఖండవల్లి గ్రామం వీరిది. మల్లయ్య శాస్త్రిగారు సంస్కృతాంధ్రాలలో అఖండ ప్రజ్ఞ కలవారు. మొదట కొండపల్లి, తణుకు, అమలాపురం, రాజమహేంద్రి పాఠశాలలో ఆంధ్రభాషాధ్యాపకునిగా పనిచేశారు. తదనంతరం

పిఠాపురం రాజావారు తమ సంస్థానంలో భాషా పండితునిగా ఆదరించారు. రాజాగారి కోరికమీద అనేక గ్రంథాలు రాశారు. ప్రభావతీప్రద్యుమ్నం కావ్యానికి టికాతాత్పర్యాలు, పలు గ్రంథాల పరిష్కరణలు, బ్రహ్మసూత్రాలకు, శుక్రనీతి సారానికి తెలుగు అనువాదం చేశారు. కవి, నాటక రచయిత, అయిన చిలకమర్తి లక్ష్మీనృసింహ శాస్త్రిగారికి వీరు మేనమామ.

శ్రీ కూచి నరసింహం గారు : వీరు ఇంగ్లీషు, సంస్కృతాంధ్రాలను కూలంకషంగా చదివి జీర్ణించుకున్న జ్ఞాన నిధి. ఆయననోట వెలువడే విజ్ఞాన ప్రవాహాలు వీనులవిందుగా విద్యార్థుల మనసులో నిలిచి పోయేవి. శ్రావ్యమైన కంఠస్వరం గల అద్భుత వక్త! ఇట్టి ప్రతిభావంతులు ఉపాధ్యాయునిగా రాణించుటలో ఆశ్చర్య మేమున్నది. రూపలత నాటకం, గౌరాంగ చరిత్ర పద్యకావ్యం, రాశారు. ఇవిగాక వివేకానందుని ఉపన్యాసాలను, గాంధీ గారి సెల్ఫ్ రిస్ట్రెంట్ అనే గ్రంథాన్ని ఆత్మసంయమనము– అమిత విషయాసక్తి గా తెలుగు లో ప్రకటించారు. ఆ రోజుల్లో సింహత్రయం గా పేరుగాంచిన వారిలో వీరొకరు. మిగిలిన ఇద్దరు చిలకమర్తి, పానుగంటి.

నేదునూరి కృష్ణమూర్తి (1927–2014) : ఆనాటి యువ గాయకులలో అగ్రేసరుడు. పిఠాపురంలో జన్మించారు. తండ్రి పిఠాపురం సంస్థానంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పని చేశారు. అక్కడే హైస్కూల్ లో విద్యాభ్యాసం చేశారు. మొదట ఉపమాకయ్య, వేమన్నదొర వద్ద సంగీత అభ్యాసం మొదలుపెట్టేరు. తరువాత విజయనగరం లో ద్వారం నరసింగరావు వద్ద సంగీతాభ్యసనం కొనసాగించి, చివరగా డా.శ్రీపాద పినాకపాణిగారి వద్ద మెరుగులు దిద్దుకుని శాస్త్రీయ సంగీతాంబరంలో ఒక ధృవతార గా ప్రకాశించారు. సప్తస్వరాల్ని బీజాక్షరాలుగా భావించి ఉపాసించిన నాదయోగి. మద్రాస్ మ్యూజిక్ ఎకాడెమిలో 51 సంవత్సరాలు బ్రేక్ లేకుండా పాడిన రికార్డ్ వీరిది. విజయవాడ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ గా చేశారు. మద్రాస్ మ్యూజిక్ ఎకాడెమీ వారిచే ప్రతిష్ఠాత్మక సంగీతకళానిధి బిరుదు పొందేరు. "నాదయోగి ఆత్మ కథ" అన్న పేరుతో వీరు స్వీయచరిత్ర రాసుకున్నారు. వీరు ఇటీవలే స్వర్గస్తులయ్యారు.

రామకృష్ణ కవులు : ఓలేటి వెంకటరామ శాస్త్రి, వేదుల రామకృష్ణశాస్త్రి అను వీరిద్దరూ జంత కవులుగా పసిద్ధులు. ఇరువురూ గోదావరీ మండల వాసులే. ఓలేటి వారిది పల్లెపాలెం. వేదులవారిది కాకరపర్రు. ఇద్దరూ మేనత్త మేనమామ బిడ్డలు. వీరు పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే అష్టావధానాలు, శతావధానాలు చేసి ప్రసిద్ధికెక్కారు. శతావధానం చేస్తూ పద్యాలు చెప్పుకుపోతూ ఉంటే ఎనమండుగురు లేఖకులు కూడా రాయ లేక పోయేవారట. గంటకు నూరు పద్యాలు అలోకగా చెప్పే స్పీడ్ వీరిది. కౌరవ గౌరవం, ఆంధ్రకవుల అపరాధములు ఖండకావ్యాలు, మదాలస, ఉత్తర రామచరిత నాటకాలు, ఇందిరాదేవి నవల, ఔచిత్య విచార చర్చ, కవికంఠాభరణం, సువృత్త తిలకం లక్షణ గ్రంథాలు, వెంకటాధ్వరి విశ్వగుణాదర్శం కావ్యానికి తెలుగు అనువాదం వీరి ప్రసిద్ధ రచనలు. 1918 లో 29వ యేట రామకృష్ణశాస్త్రిగారు, 1939 లో వెంకటరామశాస్త్రి గారు దివంగతులయ్యారు.

ఉమర్ ఆలీషా గారు (1885–1945): (పిఠాపుర వాస్తవ్యులైన వీరు కవి, నటకకర్త, వైజ్ఞానికుడు, రాజకీయ వేత్తగా ఖ్యాతి గడించారు. ఎక్కడ ఏ ప్రాంతంలో ఉన్నా ముస్లిముల మాట ఉర్దూ యాస లేకుండా ఉండదు. కాని వీరు గోదావరి జిల్లాల్లో వాడుకలో ఉండే శిష్ట వ్యవహారికం మాట్లాడేవారు. తెలుగు సంస్కృతము, ఇంగ్లీషు అభ్యసించారు. అరబ్బీ పర్షియన్ భాషలలో పరిచయం ఉంది. తండ్రి మొహియుద్దీన్ బాద్ షా గొప్ప వేదాంతి, సంస్కృత పరిచయమున్న ఆధ్యాత్మిక వేత్త. అన్ని మతాలలో ఉన్న సారాశాలను కలబోసి ఒక నూతన వేదాంత మార్గాన్ని బోధించేవారు. అది ఒక వేదాంతపీఠంగా శ్రీ విశ్వవిజ్ఞానవిద్యాఆధ్యాత్మిక పీఠంగా రూపుదిద్దుకుంది.

తండ్రితరువాత దీనికి ఉమర్ ఆలీషా గారు పీఠాధిపతిగా కొనసాగేరు. కూచినరసింహం గారి శిష్యులైన వీరు చిన్నప్పటినుంచే పద్యాలు రాయటం మొదలుపెట్టేరు. తత్త్వసందేశం, ఉమర్ ఖయ్యాం రుబాయిల తెలుగు అనువాదం, మణిమాల మున్నగునాటకాలు, నవలలు రచించారు.

జానకీజాని (1932- 2011) : జానకీజాని అన్న కలం పేరు పెట్టుకున్న జానకిరామ శాస్త్రి, తెలుగునాట మధురకవిగా ప్రసిద్ధులైన సామవేదం జానకీరామశర్మ గారి పుత్రులు. పశ్చిమగోదావరి ఏలూరుదగ్గరి వసంతవాడ లో జన్మించారు. వృత్తి రీత్యా కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ఆంగ్ల శాఖాధిపతి. ప్రవృత్తి నిరంతర సాహిత్యోపాసన. వెన్నెలమెట్లు, దిగివచ్చిన అరుంధతి అన్న కథా సంపుటాలు, మేలుకున్నవాడి కలలు కవితా సంపుటి, నేతాజీ జీవిత చరిత్ర, రామాయణ పావని (ఆంజనేయస్వామి చరిత్ర) ముఖ్య రచనలు. ఇవి గాక ఆంధ్రభాషలో అర్థవిపరిణామం, తెలుగులో అన్యభాషా పదాలు వంటి పరిశోధనాత్మక వ్యాసాలు, విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం మీద శతాధిక ప్రసంగాలు, వందలాది ఆంధ్ర, ఆంగ్ల వ్యాసాలు వెలువరించారు. సాహిత్య విషయికంగా అనేక రేడియో ప్రసంగాలు కూడా చేశారు.

ప్రసాదవర్మ కామబుషితో కలిసి

డా॥ గల్లా చలపతి



శ్రీ గోదావర్యష్టకమ్

శ్లో. మాతర్గౌతమ్యఘ మయలతాదాత్రభూతోర్మిమాలే।
ప్రాతశ్శీతం విశతి తవ కం యస్సనాకం ప్రయాయాత్।
కోఽతః పోతస్తవ జలనిధేస్సంసృతేరంబు పూరాత్।
చేతోమేఽతః కలయ విమలేతాపరిక్తం ప్రశాంతమ్॥ 1

శ్లో. మాతర్గౌతమ్యవతి భవతీస్వాశితంచాపిదుష్టం।
చేతఃపాతఃస్త్వయిభవతిహి బ్రహ్మరుద్రాదికానామ్।
శ్వేతశ్వేతస్తవ జలభరోహంతి హార్దం తమోవా।
యాతఃప్రేతస్తవ తటభువి బ్రహ్మలోకం నరస్యాత్॥ 2

శ్లో. మాతర్గౌతమ్యమృత మివతే భాతికం దేవతానాం ।
జాతం జాతం తటభువితవప్రేక్షతే జంతుమీశః ।
తాతశ్చేతః కమలనిలయో కస్య తే తీరకేవ ।
శ్వేతఃపోతః ప్రలసతి నృణాం సంసృతిక్షీరరశేః ॥ 3

శ్లో. మాతర్గౌతమ్యుదితవతితేకే హరిర్వీతకృత్యో ।
నాతశ్చేతః ప్రియపదరదం వస్తుకించిజ్జగత్యాం ।
ధౌతస్తాతస్త్వజ నిజకృతిం గౌతమి వారిణాతే ।
నీతంపాతం విషమలిఖితం లోక ఏషోఽద్య ధన్యమ్ ॥ 4

శ్లో. మాతర్గౌతమ్యపిజలగతస్తే మహాశక్తిమత్యాఃఽ ।
ప్రాతర్వాతస్పృశతితు తనుం యస్సధన్యో మనుష్యః ।
క్వాత్రశ్చేతః ప్రసరతు పరత్రాఽమృతాత్పండితస్య ।
స్రోతస్తేఽతస్సకలవిబుధ శ్లాఘ్యమానప్రభావమ్ ॥ 5

శ్లో. మాతర్గౌతమ్యుపనిషదివత్వం వహస్యేవ సత్యం ।
ప్రీతఃప్రీతఃత్వయి భవతి వా రామచంద్రో మహీంద్రః ।
పీతః పూతస్తవనుపయసా వైష్ణవం ధామయాయాత్ ।
పీతం పీతం జనయతి శుభం జ్ఞానమప్యేధతేనుః ॥ 6

శ్లో. మాతర్గౌతమ్యమృత నిచయే బ్రహ్మణీవ త్వదీయే ।
పాతం పాతం ప్రతిదిన మమీధన్యతాం యాంతి సంతః ।
చేతశ్శాతం భవతి తం సంసేవనేన క్రమేణ ।
శ్వేతస్సోఽతో భవతి పురుషో హంస ఏవ క్రమేణ ॥ 7

శ్లో. మాతర్గౌతమ్యమృత మయతా తావకం తపబృందం ।
హాతంతాతం వరమమృతం మోహనాశేనజైం ।
నీతంచేతస్త్వవశమపిచాద్వైతమాత్మ ప్రజేశోః ।
జాతం యాతం పరమపి బృహత్యాన్నమోదేవి తేఽస్తు ॥8

॥ఇతి బెల్లకొండ రామకవి విరచితం గోదావర్యష్టకం సంపూర్ణం॥

సేకరణ : అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

జనజీవన ధాత్రి



భారతదేశంలోని అనేక పుణ్యనదుల్లో గోదావరి ముఖ్యమైంది గదా! ఈ నది ఒడ్డున ఎన్నో మహాయజ్ఞాలు జరిగాయి. వైదిక యజ్ఞాలు మాత్రమే కాక వాఙ్మయ యజ్ఞాలు కూడా జరిగాయి. అవిరళ జపమహోతత్పరుడైన నన్నయ భట్టారకుడు తెలుగులో ఆదికవి కదా! హిమవంతం నుండి జాలువారినర గంగానది వలెనే గోదావరీ నది మహారాష్ట్రంలో నాసికా త్ర్యంబకం నుండి ఆంధ్రలో అదిలాబాద్ జిల్లాలో బాసర సరస్వతిని సంభావిస్తూ, భద్రాచల రామచంద్రుని సంస్మరిస్తూ, తూర్పు కనుమలు, పాపికొండలు దాటి రాజమహేంద్రం మీదుగా అంతర్వేదికి వచ్చి అక్కడ వసిష్ఠ మహర్షి చేతులమీదుగా సముద్రునితో సంగమించింది. ఇక్కడ గోదావరి వసిష్ఠ గోదావరిగా ప్రసిద్ధి చెందింది.

అన్నట్లు గోదావరులలో వసిష్ఠ గోదావరి ఒకటి. తక్కిన ఆరు గోదావరు లేవంటే తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, వృద్ధగౌతమి, కౌశిక అనేవి. వీటికి ఈ పేర్లు స్థిరపడటానికి కూడా కారణాలున్నాయి.

ఇంక కవుల భావనలో గోదావరి దక్షిణ గంగగా ప్రస్తుతి లందుకొన్నది. వ్యాసభారతంలో అర్జునుని తీర్థయాత్రలు ప్రస్తావిస్తూ, వ్యాసుడు గోదావరిని ప్రస్తావించాడు. **"గోదావర్యాం తత స్నాత్వా తా మతీత్యమహాబలః"** గోదావరిలో స్నానం చేసిన జీవుడు మహాబలుడు కావటం తథ్యం. నన్నయ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇట్లా వర్ణించాడు.

"దక్షిణ గంగనా దద్దయు నొప్పిన గోదావరియు జగదాదియైన భీమేశ్వరంబును బెడగుచున్న శ్రీపర్వతంబును చూచి ఉర్వీలోన అనఘుయై శిష్టాగ్రహార భూయిష్టమై ధరణీసురోత్తమాధ్వర విధాన పుణ్య సమృద్ధమై పొలుచు వేగీదేశ విభవంబు చూచుచు విభుడు"

ముందుకు సాగిపోయాడు.

నన్నయ గోదావరిని దక్షిణ గంగ అనరటంలో దాని పవిత్రత స్పష్టమౌతున్నది.

ఇక రసికకవిసార్వభౌముడైన శ్రీనాథుడు భీమేశ్వర మండలంలో గోదావరిని జనజీవన దాత్రిగా అభివర్ణించాడు.

ఆంధ్రభూభువన మధ్యము పుండరీకముగా భావించి సప్తగోదావరీ జలమును తేనెగా అభివర్ణించాడు. గోదావరీ జలాలు అంత మధురమైనవన్నమాట.

"ఆంధ్ర భూభువన మధ్యము పుండరీకము;
సప్తగోదావరుల జలము తేనె
బ్రహ్మసంవేద్యాది బహుతీర్థములురేకు,
లకరులు చారు దివ్యస్థలములు
నాళంబు లవణాబ్ధి వేలావిభాగంబు,
కల్యాణభోగమోక్షములు తావి
దక్షవాటీ మహాస్థానంబు కర్ణిక,
హంసంబు భీమనాయకుడు శివుడు
గౌతమీ సింధు కౌంతేయకణ్వనదులు తుల్యభాగయు,
నేతి రుద్రుమ్మికొనలు

భువన సంభావ్యమైన యీ పుణ్యభూమి అనఘ!
సంసార తాపశౌంత్యౌషంబు"

ఆంధ్రభూమి మధ్య స్థలమైన భీమమండలాన్ని పుండరీకముగా సంభావించి, సప్తగోదావర జలాన్ని తియ్యతేనెగా అందించిన శ్రీనాథుని కవిత అజరామరంకదా!

ఇక ఆధునికుల దగ్గరకు వస్తే శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు కృష్ణా గౌతమీ పెన్నలలో జలాలను కాంక్షాక్షీరములుగా సంభావించి వాటిని ఎంత ఆప్యాయంగా తాము క్రోలినారో ఇట్లా వర్ణించాడు.

"తేటల్ తేరెడు కాంతి పురముల నుద్దీపించు ముత్యాల ము
ప్పేటల్‌వోలె త్వదీయకంఠమున శోభింపుల్ నిగారింపు చే
నాటన్ జీవన శోషణల్ కనని కృష్ణా గౌతమీ పెన్నలన్
గాటంపుందమి త్రావు వారమిదె కాంక్షా క్షీర మాంధ్రావనీ!"

ఏనాడూ ఎండిపోని పుష్కల వాహినులు కనుక తెలుగువారి దప్పి మాత్రమే కాక కాంక్షలను కూడా హాయిగా తీర్చగల నదులు కృష్ణ, గౌతమి, పెన్న. ఈ మూడింటిలో గౌతమి జగద్విఖ్యాత.

ఆధునిక కవులలో కవిసమ్రాట్ బిరుదాంకితులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు గోదావరిని ప్రస్తావిస్తూ "గోదావరీ పావనోదార వాఃపూర మఖిల భారతము మాదన్ననాడు" అని చెబుతూ గోదావరీ నదిలోని పవిత్ర జలాలు యావద్భారతం వ్యాపించి తమ కీర్తిని వ్యాపింప జేసుకొన్నవన్నారు. ఈ సీసపద్య పాదంలోని 'భారతము' మరొక అర్థ విశేషాన్ని కూడా ప్రతిపాదిస్తున్నది. మహాకవులు మధునాపంతుల వారు తమ అమరకావ్యం ఆంధ్రపురాణంలో "సారోదార తరంగ శీకర సుధా సంబంధ వద్దేతమీ తీరోత్సంగిత రార్మొ కేంద్ర" నగరి అన్నారు.

ఆధునికుల్లో ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారి 'క్రొత్త గోదావరి' సహృదయ కోటిలో సానుభూతి స్పందం కలిగిస్తూ గోదావరీ గాంభీర్యమును, పవిత్రతను అపూర్వంగా అనుభూతం చేస్తుంది.

"నిను వీక్షించుచు కూరుచుండుటది అంతే చాలు నో తల్లి! బం
ధు నికాయంబులు చూడవచ్చినటు, మిత్రుల్ చేరి ఆత్మీయ భా
షణముల్ చేసినయట్లు, సత్కవుల వాచామాధురుల్ విన్న య
ట్లనుభూతుల్ కలిగింతు, వీ యెడద నృత్యత్కేకి – గోదావరీ!

సత్కవియైన రామబ్రహ్మంగారు గోదావరి నుద్దేశించి పలికిన యీ పలుకులు రసజ్ఞ హృదయాలను నెమళ్లుగా మార్చి నాట్యం చేయిస్తాయని వేరే చెప్పక్కర్లేదు.

ఇదేరీతిగా శ్రీఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు గారి 'గోదావరి' కావ్యంలో ఆయన గోదావరి నెన్ని విధాలుగా దర్శించాడో స్పష్టంగా తెలుస్తుంది చూడండి.

"విరివై, వెన్నెలవై, వికాసపథివై, విద్వాణివై, వీణవై
సిరివై, సింగిణివై, సితాంబుజమవై, సీమంతవై, సీతవై
హరివై, హారిణివై, హసన్ముకురవై, హారంబవై, హంసివై
కరివై, కావ్యమవై, కళాలలితవై కన్పింతు గోదావరీ!

ఒక రకంగా గోదావరీ విశ్వరూపం ఇందులో సాక్షాత్కరింపజేశాడు.

అత్యాధునికుడైన శ్రీఅద్దేపల్లి రామమోహనరావుగారికి గోదావరి తన ప్రతిబింబంలా కనిపించిందట. ఇది కవికి గోదావరితో కలిగిన తాదాత్మ్యానికి నిదర్శనం.

"ఒకప్పుడు – కవిత్వాన్ని మాత్రమే ప్రేమించినపుడు– గోదావరి నన్నయపద్యాల్లా, శ్రీనాథుని సీసాల్లా కనపడింది. ఇప్పుడు జీవితాన్ని కూడా అర్థం చేసుకుంటున్నప్పుడు – దోవపొడుగునా పోరాటాన్ని మోసుకుపోతున్న పరమాణు ప్రవాహంలా కనిపిస్తోంది" గోదావరి పరమాణు ప్రవాహంలా కన్పిస్తున్నదంటే ఎంత మహత్తర శక్తిమంతమైనదిగా గోచరిస్తోందో స్పష్టం – ఈవిధంగా ప్రాచీనార్వాచీనాధునిక కవుల నందర్నీ గోదావరి మంత్రముగ్ధం చేసిందన్నమాట.

❖ ❖ ❖

గోదావరి పుష్కరాల్లో గోపూజ

మనము భారతీయులము! మనది కర్మభూమి. మానవునిలో నే కాక దేవతలకు, సకల చరాచర జగత్తునకు ప్రతిరూపమైన గోవునకు అవశ్యము పూజింపదగినది. గోవు సాక్షాత్తు మన భూలోకమునకు మహలక్ష్మి.


"గవా మంగేషు తిష్టన్తి భువనాని చతుర్ధశ:" అని పురాణోక్తి కలదు. వాణి హిరణ్య గర్భులు!! లక్ష్మీనారాయణులు! పార్వతీ పరమేశ్వరులు! ముప్పదిమూడు కోట్ల దేవతలు, అష్టవసులు, ఏకాదశ రుద్రలు, ద్వాదశా దిత్యులు, విశ్వదేవతలు, సమస్తమూర్తులు, ఆధిత్యాదినవగ్రహములు, పంచభూ తములు, సూర్యచంద్రులు, నక్షత్రంరాశులు, గంగా, గోదావరి మహపుణ్య తీర్థములు, యక్షాధిసకల దేవయోని విశేషములు, సప్తకుల పర్వతాలు, సప్తస ముద్రాలు, అశ్వినీ దేవతలు, సనకసనందాది మునీంద్రులు – వీరి సమూహస్వ రూపమే గోవు. అగ్ని, అమృతం, దేవతలు త్రివేణి సంగమమే గోమాత. అరుదుగా 12 సంవత్సరములకొకసారి వచ్చు పుష్కరములు ఎంతో మహిమాన్వితమైనవి. పుష్కరుడు సార్ధత్రికోటి అనగా మూడుకోట్ల,యాభైలక్షల పుణ్యతీర్థములలో గోదావరి నదిలో ప్రవేశించినప్పుడు. జాతకులు ఈ క్రింది నక్షత్ర పట్టిక రీత్యా వారి జన్మ, నామ నక్షత్ర రీత్యా పుష్కర స్నానం చేసి గోవును దర్శించి, గోప్రదక్షిణ, గోదాన వితరణ చేసిన జాతకులకు పుణ్యప్రాప్తి, పితృదేవతలకు పుణ్యప్రాప్తి , గృహస్థులకు సమస్త దోషములు తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి కలుగునని మహర్షులు తెలుపును.

గోప్రదక్షణ ప్రార్ధన:

శ్లో॥ నమోగోభ్యః శ్రీమతీభ్యః సౌర భేయీభ్య ఏవచే! ।
నమో బ్రహ్మ సుతభ్యశ్చ పవి తాభ్యోనమోనమః ॥

గోపూజా ప్రార్ధన

శ్లో॥ నమోబ్రాహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణ హితాయచ! ।
జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమోనమః ॥



14-7-2015 : మంగళవారం, మృగశిర, ధనిష్ట, జన్మ, నామనక్షత్ర జాతకులు పుష్కర స్నానము చేసి గోమాతకు, గోధుమపొట్టు, తౌడు, దానవితరణ చేసి, గోవుకు 21ప్రదక్షిణ లు చేసిన, ఆలస్యవివాహదోషంతొలగును, ఋణములుతీరును, కుటుంబసౌఖ్యం, ఆరోగ్యవృద్ధి.

15-7-2015: బుధవారం, ఆశ్లేష, రేవతి జన్మనామ నక్షత్రజాతకులు పుష్కరస్నానం చేసి, గోమాతకు పెసలు, పెసలపొట్టు, తమలపాకులు దానవితరణచేసి గోవునకు 17ప్రధక్షిణలు చేసిన ఆరోగ్య సౌఖ్యం, దాంపత్యసౌఖ్యం, పుత్రపౌత్రాభివృద్ధి కలుగును.

16-7-2015: గురువారం, పునర్వసు, పూర్వాబాధ్ర, జన్మ,నామ నక్షత్ర జాతకులు పుష్కరస్నానం చేసి గోమాతకు అరటిపండ్లు,శనగనూక , తీపిపదార్థాలు దానవితరణ చేసి, గోవుకు 16ప్రదక్షిణలు చేసిన వృత్తి,వ్యాపారలాభం, కుటుంబ సౌఖ్యం, ఉద్యోగమునందు ప్రమోషన్లు, నిరుద్యోగులకు ఉ ద్యోగ యోగం కలుగును.

17-7-2015: శుక్రవారం – భరణీ, పూర్వాషాఢ, జన్మ, నామ నక్షత్రజాతకులు పుష్కరస్నానం చేసి గోమాతకు బొబ్బర్లు, బొబ్బరునూక, పండ్లుదానవితరణ చేసి, గోవుకు 21 ప్రదక్షణ

చేసిన వివాహయోగం, స్త్రీసౌఖ్యం, పుత్రపౌత్రాభిసౌఖ్యం, వాహనలాభం, కుటుంబసౌఖ్యం, ఉద్యోగప్రాప్తి కలుగును.

18-7-2015: శనివారం – పుష్యమి, ఆరుద్రా జన్మనామనక్షత్ర జాతకులు పుష్కరస్నానంచేసి, గోమాతకు ఎర్రటి పండ్లు, కందినూక, గోధుమలు దానవితరణ చేసి, గోవుకు 18 ప్రదక్షిణలు చేసిన విద్యాభివృద్ధి, శరీరసౌఖ్యం, శత్రురోగనివారణ కుటుంబసౌఖ్యం, ఆలస్యవివాహదోషం, తొలగును.

19-7-2015: ఆదివారం – కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ జన్మనామనక్షత్ర జాతకులు పుష్కర స్నానంచేసి గోమాతకు అలసందలు, బెల్లం, ఎర్రిపండ్లు, పోట్లు దానవితరణచేసి గోమాతకు 21ప్రదక్షిణలు చేసిన ఆరోగ్యసౌఖ్యం, వ్యాపారవృద్ధి, కుటుంబసౌఖ్యం, వివాహసౌఖ్యం, శత్రుపీడ తొలుగును.

20-7-2015: సోమవారం- రోహణీ, హస్త, శ్రవణం, జన్మనామ నక్షత్రజాతకులు పుష్కరస్నానం చేసి గోమాతకు చిట్టు, నూకలు, ఎండుగడ్డి, బార్లీ, కొబ్బరి దానవితరణ చేసి, గోవునకు 19ప్రదక్షిణలు చేసిన వ్యాపారవృద్ధి, శత్రుజయం, వాహనప్రాప్తి, ఆరోగ్యసౌఖ్యం కలుగును.

21-7-2015: మంగళవారం చిత్త, ఉత్తరాబాద్ర, శతభిషం, జన్మనామ నక్షత్రజాకుల పుష్కరస్నానంచేసి గోమాతకు గోధుమలు, కందులు, శెనగపిండి, కందినూక, దానవితరణ చేసి గోవునకు 27ప్రదక్షిణలు చేసిన వృత్తి, వ్యాపార లాభం, ఉద్యోగులకు ప్రమోషన్లు, స్త్రీలకు మానసిక అశాంతి తొలగును.


22-7-2015: బుధవారం జ్యేష్ట, మూల జన్మ,నామ నక్షత్ర జాతకులు పుష్కరస్నానంచేసి గోమాతకు పచ్చని అరటిపండ్లు, పచ్చగడ్డి, పెసలు, పెసరపొట్టు, దానవితరణ చేసి, గోవుకు 16 ప్రదిక్షణలు చేసిన వ్యాపారవృద్ధి, విద్యాలాభం, కుటుంబసౌఖ్యం, మనస్సు నందు ఆనందం, గృహ లాభం, స్త్రీ సౌఖ్యం, వాహనప్రాప్తి, కలుగును.

23-7-2015: గురువారం– విశాఖ,మఖ, జన్మనామ నక్షత్ర జాతకులు పుష్కరస్నానముచేసి గోమాతకు పచ్చి శెనగలు, గుల్ల శనగలు, శెనగపిండి, బెల్లం, శెనగపొట్టు, దానవితరణ చేసి,గోవునకు 19ప్రదిక్షణలు చేసిన ఆరోగ్యసౌఖ్యం, విద్యాలాభం, ఉద్యోగలాభం, ప్రమోషన్లు, కుటుంబసౌఖ్యం, కళత్రసౌఖ్యం కలుగును.

24-7-2015 : శుక్రవారం పుబ్బ, భరణీ, జన్మనామనక్షత్ర జాతకులు పుష్కరస్నానం చేసి, గోమాతకు అలచందలు, బొబ్బర్లు, ఎర్రటిపండ్లు, ఎర్రగోధుమనూక, దానవితరణచేసి గోమాతకు 28ప్రదక్షిణలు చేసిన బంధు,మిత్రసౌఖ్యం, వ్యాపారవృద్ధి, ఆరోగ్యం, కుటుంబసౌఖ్యం, వివాహయోగ్యత, సంతానసౌఖ్యం, పుత్రసౌఖ్యం కలుగును.

25-7-2015: శనివారం అనూరాధ, స్వాతి జన్మ,నామ నక్షత్రజాతకులు పుష్కరస్నానం చేసి గోమాతకు తమలపాకులు అరటిపండ్లు, పచ్చగడ్డి, పంచదార, కందిపప్పు, దానవితరణ చేసి గోమాతకు 18 ప్రదక్షిణలు చేసిన విద్యాలాభం, ఆరోగ్యం, కోర్టు సమస్యలు, భూలాభం, వ్యాపారవృద్ధి కలుగును.

-బ్రహ్మశ్రీ బాణాల శివసూర్య భాస్కర
దుర్గా వర ప్రసాదు సిద్ధాంతి.



పుష్కర గోదావరి



పుష్కర గోదావరీ
పుణ్యప్రదలహరీ
అగణిత భాస్వజ్ఝరీ
సరససహిత సుమనోహరి ॥

నాసికలో పుట్టుమనుచు
నా త్ర్యంబకేశ్వరుండు
నానతీయ నా తావున
నాన్యముగ జనించినావ ॥

పరుల పుట్టువును
రుషీశ్వరుల పుట్టుకలగూర్చి
తరచి తరచి మరలమరల
సారాసార విచారము
నీరెరుగని ఎండమావి ॥

మా తెలంగాణమందు
కందకుర్తి గ్రామమందు
హారిద్రామంజీరల
సారసరసధారలతో
ఏకమై త్రివేణి గంగ
సంగమముగ సార్థవైతె ॥

అలవేదవ్యాసుడు
తాననవరతముతపముజేయ
నీ నీరమె ఆ శక్తిని ఆతనికిచ్చెనుగాదె
ఆ శక్తియె వాగ్గుక్తిగ
ఆధిదైవతమ్మనంగ
సరస్వరూపమ్మున
సాక్షాత్కారమునందెను ॥

అమ్మపదములంటినీవు
ఆనందముతో సాగుచు
నారసింహు పురిని
ధర్మ, పురిని జేసి ధన్యవైతె ॥

చిన్నని నీ పయనమందు
చెన్నగు జనపదములెన్నో
పారుల ఊరులవెన్నో
చెన్నూరు ప్రసిద్ధినందె ॥

తెలంగాణ తొలి వెలుగుల
జిలుగుల పలుగుల సొబగుల
సింగరేణి బంగారము
సింగారముగా ధరించి
చెంగుమనుచు దుముకులిడుచు
మంద్రసాయిని పొందుచు
మంథెనపురి జేరితీవ ॥

సరసరపారుచు
బిరబిర ఉరుకుచు
గరగరలాడుచు
నురుగుల తీయుచు
సరగున మైదానమ్మున నీ దరి
సోదరిగాదరిజేరిన సరసిని
ప్రాణహితముగ సంభావనజేసి
ముక్తిధామమౌ ముక్తేశ్వరునకు
కాలయోగమౌ కాళేశ్వరునకు
ఆలవాలమై సువిశాలమ్మై
మూడురాష్ట్రముల ముక్తిప్రదమై
ముందుకు ముందుకు సాగే గౌతమి॥

కారడవుల కాననముల
గిరిదరువుల గోపురముల
పురముల నగరాలదరులి
పల్లెపట్టులెన్నోదాటి
శాతవాహనాదిరాజ
చరితల భవితల తలచుచు
కాలగర్భమున కలిసిన
కోటిలింగపురి దడుపుచు ॥

తడబడు నడకల
వడివడి పరుగుల
సుడి సుడి నురుగుల
బుడిబుడి బురగల
గడసుదనమ్ముల
దుడుకుల జడుపుల
గలగల గలగల గజ్జెలమోతగ
గణగణ గణగణ గాజుల రవళిగ
కనకశింజికలు ఘల్లు ఘల్లుమన
సరిగమపదనిస సంగీతమ్ముగ
తధిగిణ, తధిగిణతాళలాస్యముగ
సరసమనోహర దృశ్యకావ్యముగ
ఊహలనూయల నూగుచు సాగుచు

తండ్రిమాట జవదాటని రాముడు
ధరణిజ సీతను తమ్ము లక్ష్మణుని
తోడుగ దండక దాటుచు నినుగని
అమ్మా! గౌతమి ఆశ్రయమిమ్మని
అర్థించిన ఆ రాముని గనుగొని
పర్ణశాల నిర్మాణము జేసితె ॥

అందమైన రఘురాముని పదముల
పొందికగా అపుడపుడు తడుపుచును
వయ్యారమ్ముగ సయ్యాటమ్ముగ
చయ్యన సయ్యన రుయ్యనసాగే
నీ తెలంగాణ సుదూర ప్రయాణము ॥

సింహముతో గురువర సంచారము
గౌరవ పావనశుభసంకేతము
ద్వాదశ వత్సర పర్వశుభస్కరి
గోదావరి పుణ్యప్రద భాస్వరి ॥

కవి, చారిత్రక పరిశోధకులు,
విశ్రాంత అధ్యాపకులు
- శాస్త్రుల రఘురామశర్మ

గోదావరి నదీస్నాన సమయములో చేయాల్సినవి

1. పవిత్రమైన హృదయంతో గోదావరిని చేరుకోవాలి.
2. తీరంనుండి గోదావరికి నమస్కరించాలి.
3. నదిని, తీరాన్ని పవిత్రంగా ఉంచాలి.
4. మొదటగా పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకుని స్నానానికి ఉపక్రమించాలి.
5. వీలైతే సమంత్ర పూర్వకంగా సంకల్పం చెప్పుకొని (చెప్పించుకుని) స్నానమాచరించాలి.
6. లేకుంటే తమ గోత్రనామాలు చెప్పుకుని "గంగా గంగా గంగా" అని మూడు సార్లు గోదావరిని స్మరించి స్నానం చేయాలి.
7. ఖచ్చితంగా శిరస్నానం చేయాలి.
8. సూర్యుడికి మూడు అర్ఘ్యములనివ్వాలి.
9. స్నానమైన తరువాత శుభ్రమైన పొడి బట్టలను ధరించి కుంకుమ పెట్టుకోవాలి.
10. గోదావరి మాతను పూజించి వాయనం సమర్పించాలి.
11. ఒడ్డున ఉన్న లేదా దగ్గరలో ఉన్న దేవాలయాలను తప్పక దర్శించాలి.
12. యథాశక్తి దానధర్మాలను ఆచరించాలి.
13. పుష్కర సమయంలో పెద్దలకు పిండ ప్రదానములు ఆచరించాలి.
14. పిండప్రదానినికి ఆకులతో తయారు విస్తరాకులనే ఉపయోగించాలి. ఇదే శాస్త్ర సమ్మతం.
15. శ్రాద్ధమైన తదుపరి తప్పక పిండములను నదిలో నిమజ్జనం చేయాలి.
16. పవిత్ర గోదావరి జలాలను ఇంటికి తీసుకువెళ్ళి పూజా మందిరంలో ఉంచి నిత్యము పూజించాలి.

గోదావరి నదీస్నాన సమయములో చేయకూడనివి

1. పుష్కర సమయంలో గోదావరి తీరంలో 3కోట్ల 50లక్షల మంది దేవతలు కొలువై ఉంటారు. కాబట్టి తీరంలో కానీ, నీటిలో కాని మల, మూత్రాదులను విసర్జించరాదు. నీటిలో ఉమ్మి వేయరాదు. ఇది మహాదోషం.
2. చెప్పులతో స్నానం చేయరాదు.
3. నగ్నంగా, అర్ధనగ్నంగా స్నానం చేయకూడదు. మగవారు పంచె, పైపంచె ధరించి, స్త్రీలు సంప్రదాయ దుస్తులతో స్నానాన్ని చేయాలి.
4. గంగ సహజ సిద్ధముగానే మన శరీర మాలిన్యంతోపాటుగా మనో మాలిన్యాన్ని కూడా తొలగించు గుణము కలది. అటువంటి చోట సబ్బులు, షాంపూలు వాడకూడదు.
5. తడిబట్టలతో పూజాది కార్యక్రమములు చేయరాదు.
6. నదిలో ప్లాస్టిక్ విస్తరాకులు, కవర్లు వేయకూడదు.
7. నదిలో ఈత కొట్టరాదని శాస్త్రం. నదిలో ఎక్కువ దూరం పోరాదు. ప్రమాదకరం.
8. బట్టలు ఉతకకూడదు.

– సేకరణ : అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రం



మనదేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో పదవ జ్యోతిర్లింగం త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగం. పశ్చిమ కాశీగా ప్రసిద్ధి చెందిన త్ర్యంబకేశ్వరం పుణ్యక్షేత్రం. దేశంలో మహిమాన్వితమయిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటి.

త్ర్యంబకేశ్వరం మహారాష్ట్ర ప్రాంతంలో వుంది. నాసిక్ నుండి త్రయంబకేశ్వరానికి సుమారు 35 కి.మీ. నాసిక్ నుండి త్ర్యంబకేశ్వరానికి మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులు, జీపులు, ఇతర వాహనాలు చాలా వున్నాయి. ముంబాయినుండి త్ర్యంబకేశ్వరం సుమారు 180 కి.మీ. ఇక్కడికి ముంబాయి నుండి కానీ, హైదరాబాదునుండి కానీ రావచ్చు. ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ వారి బస్సులు హైదరాబాదునుండి త్రయంబకేశ్వరానికి వున్నాయి.

మనదేశంలోఅత్యంత పవిత్రమయిన ప్రాచీన క్షేత్రాలలో త్ర్యంబకేశ్వరం ఒకటి. ఇక్కడికి దేశంలోని అన్ని ప్రాంతాలనుండి హిందువులు జ్యోతిర్లింగ దర్శనార్థం వస్తారు.

త్ర్యంబకేశ్వరం, సహ్యాద్రి పర్వతంలో భాగమైన బ్రహ్మగిరి పర్వత ప్రాంతంలో వుంది. పర్వతప్రాంతంలోని ప్రకృతి సౌందర్యం, యాత్రీకులను ఆకర్షిస్తుంది. ఈ బ్రహ్మగిరి పర్వతం సముద్రమట్టం నుండి 2,711 మీటర్ల ఎత్తులో వుంది.



ఇక్కడ జ్యోతిర్లింగ ఆవిర్భావం గురించి శివపురాణంలో కథ వుంది. సప్తమహాఋషులలో ఒకరైన గౌతమమహర్షి ఇక్కడ తన ధర్మపత్ని అహల్యాదేవితో కలిసి 1000 (వెయ్యి) సంవత్సరాలు తపస్సు చేశాడట. ఆ కాలంలో కొన్ని సంవత్సరాలు అక్కడ తీవ్రమయిన దుర్భిక్షం ఏర్పడిందట. వర్షాలు లేకపోవడం వల్ల జీవించడమే కష్టమయిపోయింది. ఆ క్లిష్టపరిస్థితుల నుండి అక్కడ యజ్ఞయాగాది క్రతువులను చేసుకుంటున్న మునులకు ఊరట కలిగించడానికి గౌతముడు వరుణుడి అనుగ్రహం కోసం తపస్సు చేస్తాడు. వరుణదేవుడు గౌతమునికి సాక్షాత్కరించి ముని అభీష్టమేమని కోరగా, దుర్భిక్ష నివారణకు వర్షాలు కురిపించమని గౌతమముని కోరుకుంటాడు. అయితే భగవంతుని ఆజ్ఞ లేనిదే తను వర్షాలు కురిపించలేనని, మునులు తమ కార్యక్రమాలను కొనసాగించు కోవడానికి ఒక గుంటలో నీటిని అనంతంగా సృష్టించగలనని, వరుణుడు తెలియజేస్తాడు. అందుకు గౌతముడు అంగీకరించడంతో, గౌతముడు చేసిన మూరెడు లోతు గుంటలో అనంతమయిన జలం ఏర్పడుతుంది. అందులోని నీటితో అక్కడి మునులు తదితరులు తమ పనులు ఏ ఇబ్బంది లేకుండా కొనసాగించారు. అలా రోజులు గడుస్తుండగా ఒకరోజు నీటికుండ దగ్గర, గౌతమఋషి

శిష్యులకు, ఆ ప్రాంతంలోనే వున్న మునిపత్నులకు వివాదం ఏర్పడుతుంది. గౌతమఋషి శిష్యులు, తాము గుంటకు ముందు రావడంవల్ల తామే ముందు నీటిని తీసుకుంటామని కాదు మేము ముందు నీటిని తీసుకుంటామని మునిపత్నులు వాదించుకుంటారు. సమస్యను పరిష్కరించమని ఋషిశిష్యులు తమ గురుపత్ని అహల్యాదేవిని వేడుకుంటారు. అప్పుడు ఆమె కుంట దగ్గరకు వెళ్ళి శిష్యులు కుంట దగ్గరకు ముందుగా చేరడంవల్ల వాళ్ళే ముందు నీటిని తీసుకుంటారని తీర్పు ఇస్తుంది. అందుకు మునిపత్నులు ఆగ్రహించి అహల్యాదేవిపై లేనిపోని నిందలు మోపుతూ గౌతమమహర్షిని, ఆమె పత్ని అహల్యాదేవిని అక్కడినుండి వెళ్ళగొట్టాలని పట్టుపడుతారు. అందుకు మునులు, గణపతి అనుగ్రహంకోసం తపస్సు చేసి, గణపతిదేవునికి తమ కోరికను విన్నవించుకుంటారు. అందుకు గణపతి ఆగ్రహించి మునులను మందలిస్తాడు. మీకందరికీ నీళ్ళులేని కష్టకాలంలో నీటిని సృష్టించి ఉపకారం చేసిన ఉత్తముడికి, మీరు ద్రోహం తలపెట్టడం మహాపాపం. మీరు మీ కోరికను విడనాడండి అని గణపతి ఆ మునులకు తెలియజేస్తాడు. అయినా మునులు వినకపోవడంతో గత్యంతరంలేక గణపతి మునులకు తాము కోరిన వరమిస్తాడు. ఆ తర్వాత ఒకరోజు గౌతముని ఆశ్రమ సమీపంలోఒక గోవు పంటను తినడం చూసి గౌతముడు ఆ గోవుపై ఒక సన్నని దర్భను విసురుతాడు. ఆ దర్భ గోవును తాకిన వెంటనే గోవు మరణిస్తుంది. గోహత్యాపాతకానికి గురి అయిన గౌతముడు వెంటనే ఆ ప్రాంతాన్ని వదలి వెళ్ళాలని అక్కడి మునులందరూ ఆయనను దూషిస్తారు. అహల్యాదేవిని కూడా తూలనాడుతారు. అందుకు గౌతముడు చింతించి, ఆ ప్రాంతానికి దూరంగా వెళ్ళి, తన గోహత్యా పాతకానికి విముక్తి మార్గాన్ని సూచించమని ఋషులను వేడుకుంటాడు. అప్పుడు ఋషులు, మొత్తం భూమినంతటిని మూడుసార్లు ప్రదక్షిణం చేయడంవల్లకాని, గంగను శివుని తలమీది నుంచి భూమిమీదికి ప్రవహింపచేయటంవల్ల కానీ, గోహత్యాపాతకం నుండి విముక్తి పొందడానికి వీలవుతుందని తెలియజేస్తారు. అప్పుడు గౌతముడు పరమేశ్వరుని అనుగ్రహం కొరకు ఘోరతపస్సు చేస్తాడు. తపస్సుకు సంతుష్టడయిన పరమేశ్వరుడు గౌతమమునికి దర్శనమిచ్చి, వరము కోరుకొనమనగా పరమేశ్వరా! నన్ను గోహత్యా పాతకము నుండి విముక్తుని చేయమని వేడుకుంటాడు. అందుకు పరమేశ్వరుడు ఇక్కడి దుర్మార్గ బ్రాహ్మణులు నిన్ను మోసగించి, నీకు గోహత్యాపాతకము కలుగునట్లు చేసిరి అని అనగా గౌతముడు స్వామీ వారు నాకు మేలే చేసినారు. వారు ఆ పని చేయకపోతే నాకు మీ అనుగ్రహం కలిగెడిది కాదు గదా! అని గౌతముడు వినమ్రతతో పరమేశ్వరుడికి విన్నవించుకున్నాడు. అంతట పరమేశ్వరుడు గౌతముని గోహత్యా పాతకమునుండి విముక్తునిగా చేయడానికి, గంగను, గౌతముడున్న ప్రదేశంలో ప్రవహించి, అతనిని, అతని అనుచరులను పునీతులుగా చేయమని ఆజ్ఞాపిస్తాడు. ఆ పని కాగానే ప్రజల సౌకర్యార్థం, గంగాదేవి భూమిపై నిరంతరం ప్రవహించేటట్లు చేయమని గౌతమముని పరమేశ్వరుని వేడుకుంటాడు. అందుకు పరమేశ్వరుడు సమ్మతిస్తాడు. కలియుగాంతంవరకూ భూమిమీద ప్రవహించమని, గంగాదేవిని ఆజ్ఞాపిస్తాడు. అందుకు గంగాదేవి ఒక షరతు విధిస్తుంది. మీరు కూడా ఇక్కడే వుండాలని, పరమేశ్వరుడికి విన్నవిస్తుంది. అందుకు పరమేశ్వరుడు అంగీకరించడంతో ఇక్కడ శివుడు స్వయంభూ జ్యోతిర్లింగమై వెలసినాడని శివపురాణంలో సూతుడు శౌనకాది మునులకు వివరిస్తాడు.

త్ర్యంబకేశ్వరంనుండి కొండమీదికి 500 (ఐదువందలు) మెట్లు ఎక్కితే గోదావరి నది పుట్టుక స్థానాన్ని చూడలుగుతాం. గోదావరి జన్మస్థానాన్ని గంగాద్వారం అంటారు. గోవును తిరిగి జీవింపచేయడం వల్ల ఈ నదికి గోదావరి అని పేరు వచ్చిందంటారు గోముఖం ద్వారా ఇక్కడ నది ప్రారంభం కావడంవల్ల నదికి గోదావరి వచ్చిందని కూడా అంటారు. గౌతమువల్ల జన్మించిన నది కాబట్టి ఈ నదికి గౌతమి అనే పేరు కూడా వుంది. ఇక్కడ సన్నగా ప్రవహించే గోదావరి నాసిక్‌లో విశాలరూపం దాలుస్తుంది. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రాంతాలలో ప్రవహించి తూర్పుగోదావరి జిల్లాలో సముద్రంలో లీనమవుతుంది. గోదావరి జన్మించిన స్థలంలో గోదావరికి చిన్న దేవాలయం వుంది. ఇక్కడి గుహలో 108 శివలింగాలు కూడా వున్నాయి.

బ్రహ్మగిరి పర్వతం చుట్టూ కొంతమంది ప్రదక్షిణ చేస్తారు. ఇలా ప్రదక్షిణ చేయడంవల్ల పాపాలన్నీ నశించి, పుణ్యం లభస్తుందని భక్తులు విశ్వసిస్తారు. భక్తులు శక్త్యానుసారం బ్రహ్మగిరి పర్వతం చుట్టూ 1, 21, 31 సార్లు ప్రదక్షిణ చేస్తారు. ఈ ప్రదక్షిణ మార్గంలో రామతీర్థం, ప్రయాగతీర్థం, నృసింహతీర్థం మందిరాలు వున్నాయి.

గోదావరి పుష్కరాల సమయంలో త్ర్యంబకేశ్వరానికి చాలామంది భక్తులు గోదావరిలో స్నానం చేయడానికి వస్తారు. పుష్కరాలను, ఇక్కడ 'కుంభస్త' అంటారు. గురువు సింహరాశిలో ప్రవేశించినప్పుడు ప్రతి 12 సంవత్సరాల కొకసారి ఈ కుంభమేళా వస్తుంది. ఆ సమయంలో దేవతలందరూ ఇక్కడ వుంటారని భక్తుల విశ్వాసం.

త్ర్యంబకేశ్వర దేవాలయం, సువిశాల క్షేత్రంలో వుంది. దేవాలయం చుట్టూ చాలా స్థలం వుంది. దేవాలయం చుట్టూ దృఢమయిన గోడలు వున్నాయి. దేవాలయం ఎత్తైన మందిరం. మనదేశ ప్రాచీన శిల్పకళ, ఈ దేవాలయ స్తంభాలమీద, గోడలమీద, ఉట్టిపడుతుంది. తూర్పుముఖంగా వున్న ఈ దేవాలయ ముఖద్వారం విశాలంగా ఎత్తుగా వుంది.

త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగం త్రిమూర్తుల సమ్మిళితం. ఇది త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగ ప్రత్యేకత. ఈ జ్యోతిర్లింగంలో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలసి వున్నారు. త్రిమూర్తులు కలసి వుండడంవల్లే ఈ క్షేత్రానికి త్ర్యంబకేశ్వరమని పేరు వచ్చిందంటారు. జ్యోతిర్లింగం క్రింద ఎప్పుడూ గోదావరి ప్రవహిస్తూ లింగానికి అభిషేకం చేస్తుంది. లింగం 5 లేక 6 అడుగుల లోతు ప్రదేశంలో వుంది. లింగం దగ్గరికి వెళ్లడానికి మెట్లు వున్నాయి. స్త్రీలను లింగం దగ్గరికి రానివ్వరు. ధోవతి, అంగవస్త్రం, ధరించిన పురుషులు క్రిందికి దిగి, జ్యోతిర్లింగానికి అభిషేకం చేసుకోవచ్చు. లింగాన్ని స్పృశించి, పూజించు కోవచ్చు. పూజలు చేసుకోవడానికి దేవాలయంలోనే పూజారులు వున్నారు. ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ దేవాలయాన్ని భక్తుల దర్శనార్థం తెరచి వుంచుతారు. శివుని దర్శించుకోవడానికి వెళ్ళేదారిలో గణపతి, నంది విగ్రహాలున్నాయి. శివలింగం దగ్గర త్ర్యంబకేశ్వరి విగ్రహం కూడా వుంది. దేవాలయ ప్రాంగణంలోనే లోతైన తటాకం వుంది. దీనికి మెట్లు వున్నాయి. త్ర్యంబకేశ్వర దేవాలయం దగ్గరే వేదమాత గాయత్రీదేవి మందిరం కూడా వుంది. ఇక్కడ సందర్శించవలసిన ఇంకొక ముఖ్యమయిన మందిరం. గంగా–గోదావరి మందిరం. ఈ మందిరానికి పక్కనే గోదావరి కుండం వుంది. ఇక్కడ గోదావరిలో భక్తులు స్నానాలు చేస్తారు. స్నానం తర్వాత మందిరాలలోని దేవతలను దర్శిస్తారు.

త్ర్యంబకేశ్వర దేవాలయంలో, ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. కార్తీక, శ్రావణ మాసాలల్లో శివరాత్రి సందర్భంగా ఇక్కడ పెద్ద ఉత్సవాలు జరుగుతాయి.

త్ర్యంబకేశ్వరంలో దేవగిరిని పరిపాలించిన యాదవులు నిర్మించిన ఒక కోట కూడా వుంది. ఇది శిథిలావస్థలో వుంది. ఈ కోట ఆవరణలో గణపతి, హనుమాన్ తదితర దేవతల దేవాలయాలు వున్నాయి. త్ర్యంబకేశ్వరంలో చూడవలసిన స్థలాలన్నీ చూడటానికి ఆటోలలో వెళ్ళవచ్చు. ఇక్కడ మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ప్రజాదరణ పొందని మతప్రవక్తల సమాధులు వున్నాయి. సంత్ నివృత్తినాథ్ సమాధి, సంత్ జనార్దన్ మహారాజ్ మందిర్ ఇక్కడ వున్నాయి. ముక్తాబాయి మందిర్‌కూడా ఇక్కడ వుంది. త్ర్యంబకేశ్వరస్వామి దేవాలయాన్ని పీష్వాలు పునర్నిర్మించారు. 18వ శతాబ్దిలో 1755 నుండి 1785 వరకు ఈ దేవాలయాన్ని బాలాజీ బాజీరావు పీష్వా నిర్మించినట్లు చారిత్రక గ్రంథాల ద్వారా తెలుస్తుంది. త్ర్యంబకేశ్వరంలో యాత్రీకులు బస చేయడానికి వసతిగృహాలు వున్నాయి. మహారాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వసతిగృహం, మునిసిపల్ వసతిగృహం వున్నాయి. ధర్మశాలలు కూడా వున్నాయి. దేవాలయం దగ్గరలోనే బస చేయడానికి హోటళ్ళు కూడా వున్నాయి.

త్ర్యంబకేశ్వరానికి నాసిక్ దగ్గరలో వున్నందున యాత్రీకులు ఈ రెండు పుణ్యక్షేత్రాలను ఒకదాని తర్వాత ఇంకొకటి సందర్శిస్తారు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కును (నాసిక) కోసిన స్థలం కాబట్టి ఈ స్థలానికి నాసిక్ అని పేరు వచ్చింది. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు నివసించిన పంచవటి ఆశ్రమం కూడా ఈ నాసిక్‌లోనే వుంది.

ఎంతోమంది ఋషులు, మునులు, దేవతలకు ఆలవాలమైన పుణ్యక్షేత్రం, త్రయంబకేశ్వరం. గౌతమమహర్షి ముక్తిని సాధించిన పవిత్రక్షేత్రం ఇది. ప్రాచీన కాలం నుండి ఈనాటివరకూ ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా త్ర్యంబకేశ్వరం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ జ్యోతిర్లింగాన్ని దర్శించినంతమాత్రాన, పాపాలన్నీ పటాపంచలై, పుణ్యం లభిస్తుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. ఐహిక కోర్కెలు నెరవేర్చుకోవడానికి ఆధ్యాత్మిక గమ్యాలు చేరుకోవడానికి దేశంలోని అన్నిప్రాంతాల నుండి, భక్తులు ఇక్కడికి వస్తారు. దేవాలయంలో ప్రశాంతంగా కూర్చొని, ధ్యానం చేసుకుంటే ఎంతో మనశ్శాంతి కలుగుతుంది. త్రయంబకేశ్వర దర్శనం ఒక మహద్భాగ్యం. భక్తితో ఇక్కడికి వచ్చే యాత్రీకులందరూ ఈ యాత్రవల్ల తమ కోరికలన్నీ నెరవేరుతాయని నమ్ముతారు.

-గీతాప్రెస్, గోరఖ్‌పూర్ వారి సౌజన్యంతో

త్రివేణి సంగమం - పవిత్ర కందకుర్తి

రాజమండ్రి తెలుసా? ఆంధ్రలో గోదావరి ప్రవేశించే ప్రాంతం.. మరి కందకుర్తి?? తెలంగాణలోకి గోదావరి ప్రవేశించే ప్రాంతం.. పైగా ఇది త్రివేణి సంగమ పవిత్ర భూమి.. నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి. మరాఠ నేల నుంచి వడివడిగా పరిగెడుతూ గోదావరి తెలుగు నేలపై అడిగిడే ప్రాంతమిది. హరిద్ర, మంజీర నదులను సంగమించుకొని గలగలా బాసరమ్మ వైపు పరుగు తీసే ప్రాంతం.. ఆ కందకుర్తి డిస్కవరీ ఇది.


నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రం నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో కందకుర్తి ఉంటుంది. గోదావరి, హరిద్ర, మంజీరా నదుల త్రివేణీ సంగమమిది. త్రివేణి సంగమం మహిమ ప్రయాగ మహిమతో సమానమని పురాణాలు చెబుతున్నాయి. గోదావరి మహత్యం అనే గ్రంథం ఇక్కడ స్నానమాచరిస్తే వచ్చే పుణ్యాల గురించి వివరిస్తున్నది.

మన నేలపై వడి వడిగా...

మహారాష్ట్రలోని నాసికాత్రయంబకం వద్ద జన్మించిన గోదావరి నది వడివడిగా తెలంగాణ నేలపై ప్రవేశించేది ఇక్కడే. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ తాలూకా సంగమేశ్వర్ గ్రామం నుంచి నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తిలోకి ప్రవేశిస్తుంది. కర్నాటకలోని బీదర్ జిల్లా పటోడా తాలూకాలో పుట్టిన మంజీరమ్మ గోదావరి మాత చెంతకు చేరేది ఇక్కడే.. మెదక్ జిల్లాలో పుట్టిన హరిద్రా నది గలగలా ప్రవహిస్తూ గోదావరి నదిలో సంగమించే దివ్యధామమిది.

మూడు నదులూ ఒకే చోట సంగమించే ప్రాంతంలో పురాతన సంగమేశ్వరాలయం ఉంది. కొద్దిపాటి వరద వచ్చినా నదీగర్భంలోకి చేరుతుందా మందిరం. ఆ సందర్భంలో ముక్కంటిని పూజించేందుకు వీలుగా మహారాష్ట్ర సరిహద్దు గ్రామంలో గోదావరి ఒడ్డున మరో సంగమేశ్వరాలయాన్ని నిర్మించారు. ఇక్కడి నుంచి ఉధృతంగా ప్రవహిస్తూ బాసరలోని సరస్వతీ మాతకు బిరబిరా తరలివెళుతుంది గౌతమీ నది.

కందకుర్తి అంటే..



కందకుర్తి అనే పేరు స్కంద కుడుతి నుంచి రూపాంతరం చెందిందని చరిత్రకారులు చెబుతున్నారు. స్కంద మహర్షి ఇక్కడే తపస్సు చేసినట్లు ఆధారాలున్నాయి. ఇక్కడ పురాతన స్కందమాత మందిరం ఉండేది. ప్రస్తుతం ఆ ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. తల్లియైన పార్వతీ దేవి ఒడిలో కూర్చున్న స్కందుని విగ్రహం గోపురంపై ఉండేది. ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. స్కందము అంటే నది అని కూడా అంటుంటారు. మూడు నదుల కూడలిలో ఉన్నందున దీనిని స్కంద కూడుతి అనే వారట.. కాలక్రమేణా కందకుర్తిగా రూపాంతరం చెందిందని చరిత్రకారులు చెబుతున్నారు.

స్కంద పూజ..

మహారాష్ట్రలోని గోదావరి తీర ప్రాంతాల్లో కచ్చితంగా స్కందుని ఆలయం ఉంటుంది. తమకు ఎలాంటి ఆపదలూ రాకుండా స్కందుడిని పూజిస్తారు. స్థానికంగా వారు ఖండోబా అని, కండేరాయుడని పిలుస్తుంటారు. సమీపంలోనే ఉన్నందున ఇక్కడి వారు సైతం స్కందుడిని పూజస్తూ వచ్చారని చెబుతారు. పూరాతన కాలంలో నది ఒడ్డున ఒక గద్దె మాత్రమే ఉండేది. దానిపై స్కంద మాత కర్ర విగ్రహాన్ని ప్రతిష్టించేవారట.. ఏటేటా పండగలు నిర్వహించి ఆమెకు బోనాలు సమర్పించడం ఇక్కడి ప్రజల ఆనవాయితీగా కొనసాగుతోంది. 150 ఏళ్ల క్రితం అహల్యాబాయి అనే మరాఠా స్త్రీ దాన ధర్మాలు చేసేవారని,



ఆమె సహాయంతో ఇక్కడ మొదటి పుష్కరఘాట్‌లో ఉన్న శివాలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది.

శ్రీరాముడు నడయాడిన ప్రాంతం..

కందకుర్తి గ్రామానికి యుగయుగాల చరిత్ర ఉన్నది. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన నడయాడిన ప్రాంతం కావడంతో ఇక్కడ పురాతన రామాలయం ఉంది. పాలరాతితో ఉత్తరభారత శైలిలో నిర్మించిన సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలున్నాయి. ఆలయం శిథిలావస్థకు చేరడంతో పక్కనే మరో ఆలయాన్ని నిర్మించి ఆ విగ్రహాలను నూతన మందిరంలో ప్రతిష్టించారు. అయోధ్యకు చెందిన సీతారామ్ సేవాసమితి శ్రీరామచంద్రుడు అయోధ్య నుంచి శ్రీలంక వెళ్లిన రూట్‌ను వివరిస్తూ ఒక మ్యాప్‌ను ఇక్కడ ప్రదర్శించారు.

నిజామాబాద్ జిల్లా కందకుర్తి గోదావరీ నది తీరాన శ్రీరామచంద్రుడు కొన్ని రోజులున్నట్లు ఈ మ్యాప్ ద్వారా అవగతమవుతోంది. ఇక్కడ నుంచి కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట గ్రామానికి వెళ్లినట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. శ్రీరాముడు నడయాడిన ప్రాంతం కావడంతో అయోధ్యకు చెందిన సాధువు సీతారామ్‌జీ మహరాజ్ స్థానిక దాతల సహకారంతో నదీతీరంలో ఆశ్రమాన్ని నిర్మిస్తున్నారు. ఛత్రపతి శివాజీ పూణే నుంచి గోల్కొండ కోటకు ఈ దారి గుండానే పోయినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. ఈ క్రమంలో కందకుర్తి గ్రామంలో బస చేసినట్లు, అప్పుడు స్థానికులకు భూములు కేటాయిస్తూ ఫర్మానాలు జారీ చేసినట్లు చెబుతున్నారు. ఆదిశంకరాచార్యులు సైతం కందకుర్తి గ్రామాన్ని సందర్శించినట్లు స్థానికులు చెబుతుంటారు.

పూర్వీకుల స్వస్థలమిది..

డాక్టర్ కేశవరావ్ బలిరాం హెడ్గేవార్.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థాపకుడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కేంద్రంగా ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభిచారీయన. ఈయన పూర్వీకుల స్వస్థలం కందకుర్తి. హెడ్గేవార్ జన్మించక పూర్వం ఈ కుటుంబం నాగ్‌పూర్‌కు వలస వెళ్లింది. వీరి వంశస్తులు ప్రస్తుతం నిజామాబాద్‌లో నివాసముంటున్నారు. హెడ్గేవార్ ఇంటిని కూల్చేసి అక్కడ కేశవనిలయం అనే భవనాన్ని స్మృతి మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్మృతి మందిరంలో హెడ్గేవార్, కేశవుడు, భారత మాత విగ్రహాలు ఏర్పాటు చేశారు. కేశవ సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చరిత్ర కారుడు కందకుర్తి యాదవరావు చెబుతున్నారు.

తెప్పలు విడవడం..

ఆషాఢమాసంలో గోదావరి తీర గ్రామాల ప్రజలు తెప్పలు విడిచి మొక్కులు తీర్చుకుంటారు. వర్షాకాలం మొదలై నదీమ తల్లి ప్రవహిస్తున్న సమయంలో నది వద్దకు కుటుంబ సమేతంగా చేరుకొని అప్పాలు, అన్నం, తోటకూర నైవేద్యం తయారు చేసి గడ్డితో తయారు చేసిన తెప్పలో ఉంచి అందులో దీపం వెలిగిస్తారు. గోదావరి మాతకు కొబ్బరికాయ కొట్టి తెప్పను నదిలో విడిచి భక్తితో మొక్కుకుంటారు. వచ్చే ఏడాది వరకు సల్లంగ సూడాలని కోరుకుంటారు. ఈ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతోంది. నిజామాబాద్ జిల్లా గోదావరి తీరంలో ఉంది. స్థానికులు గోదావరిని గంగగా పిలుస్తారు. అందువల్లే ఈ జిల్లాలో గంగాధర్, గంగారాం, గంగాకిషన్, గంగామణి, గంగారెడ్డి తదితర పేర్లు ఎక్కువగా వినిపిస్తాయి. ఇంతటి మహోనీయ కందకుర్తిలో గోదావరి పుష్కర శోభ వెల్లివిరియాలని ఆశిద్దాం..

- మరుమాముల వెంకటరమణశర్మ

పరమపావనంబు... భవ్య గోదావరి

గోదావరి మాత
గోముఖమ్మునందు గోత్రాన జనియించి
పారి పారి మనకు చేరవచ్చె
గోదశబరి గూడి గోదావరీమాత
తెలుగుదేశ మందు వెలుగు నించె.

రామపాద సాగ రానను నిలుచుండె
కాకతీయ భూమి కనకమాయె
ముద్దు ముచ్చటైన ముత్యాల రాశులు
కూర్చగలరు నెవరు గోద తప్ప!

రామభద్ర విభుడు రాజిల్లుచుండంగ
పాదస్పర్శచేసి పారుచుండు
ఇంతకన్న నీకు ఇంకేమి వలయును?
గోద సరిత, నీవు గొప్ప కాదె?

సాని కిన్నెరమ్మ సరసమౌ సఖి నీకు
అడుగు అడుగు వేసి ఆటలాడు
విశ్వనాథకవియె విశ్వవిఖ్యాతిని
కలుగజేసె మీకు ఘనచరిత్ర!

వెండి పట్టమట్లు వెలుగుచు నుండును
ధవళ ఈశమమందు నవ నవమ్ము
ఆనకట్టకాదు, అందాల నగయేను
చెప్పలేని సొగసు గొప్ప నొప్పు

గంగతీరమందు సంగమించెను నాదు
గొప్ప నాగరకము మెప్పు పొంది
గంగవోలె నిచట గౌతమి కూడను
సర్వ విద్య నిలయ ద్వారమయ్యె.

రాజమండ్రిలోన రారాజునేకాదు
రాజకవులు కూడ రాజ్యమేల
స్వచ్ఛమగుచు మెరిసె సంగీత సాహిత్య
రీతులన్ని జ్వలన జ్యోతి వోలె.

కావ్య గాన సభలు కనకాభిషేకాలు
నిత్యవైభవాలు నిరత సుఖము
రాజమండ్రి యనగ రమణగా విరిసెను
గోదతటము నందు వేదమట్లు.

వేదసామ్యమైన వినుతమ్ము భారత
రచన యిచట సాగె లక్షణముగ
నన్న పార్యవిభుడు నారాయణాఖ్యుడు
జ్ఞాన ఖేలనమ్ము, మాన్య వరులు.

సిరుల చిందుచుండు శ్రీనాథ కవిరాజు
కావ్యహేలకాసె నవ్యరీతి
జ్ఞాన దేవి తాను నాట్యాలు చేయగా
వెల్లి విరిసె కవిత వింత శోభ.

ధర్మపురములోని ధరణి దేవతలైన
వేములాడలోని వేదవిదులు
రాజమండ్రిలోని రక్షణ కవులేమి
గోదమాత వలన గొప్పలైరి.

'కందుకూరి' యిచట గర్జించి దూకెను
కవిత చేతబట్టి కాళివోలె
అతడు లేకపోతె, అబల లిప్పుడు
అందలాలనెక్కి అలరగలరె?

పదియు మీద రెండు వత్సరాల్ గడువగా
పుష్కరాలు వచ్చు పొంగి పొంగి
ఆంధ్రదేశమంత అమృతమ్ము కురిపించు
పరమ పావనమ్ము భవ్య చరిత.

- ఆచార్య ఎం. కులశేఖరరావు

అన్ని విద్యలకూ నెలవు.. బాసర కొలువు

శరదిందు సమాకారే పరబ్రహ్మ స్వరూపిణీ।
వాసరా పీఠనిలయే సరస్వతీ నమోస్తుతే।।

అన్ని విద్యలకు మూలరూపమైన తల్లి, కొలిచే వారికి కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, "వాసర" క్షేత్రంలో వెలసిన వీణా పుస్తకపాణి, విరించి రాణి, గీర్వాణి శ్రీ జ్ఞానసరస్వతీమాత. అవధూతలకు, యోగులకు, సాధకులకు యోగ్యమైన గోదావరీ తీర్థం, తపోక్షేత్రం 'బాసర' పుణ్యక్షేత్రం.

తెల్లని చల్లని వెన్నెలలు కురిపించే శరత్కాలపు జాబిల్లి ఆ తల్లి మోము. సృష్టి, స్థితి, లయ కారకులైన త్రిమూర్తులకు కూడా జ్ఞానశక్తిని ప్రసాదించే పరబ్రహ్మ స్వరూపం ఆ తల్లి రూపం. నాటి వ్యాసపురే నేటి వాసర (బాసర) ఆ తల్లి కొలువైన క్షేత్రం. పావన గోదావరీ తీరంలో శ్రీ వేదవ్యాస మహర్షి ప్రతిష్ఠించిన చిద్రూప వికా సం ఆ తల్లి స్వయం ప్రకాశం. అందరికీ అక్షరభిక్షను ప్రసాదించే భాషాయోషగా పేరొందిన జ్ఞాన సరస్వతీ మాతపై 'దర్శనమ్' అందించిన విశేష వ్యాసం.

ఒకవేళ 'వాక్కు' అనే జ్ఞానజ్యోతి ప్రకాశం లేకుంటే ఈ లోకాలన్నీ అజ్ఞానాంధకారంలో మునిగిపోయి ఉండేవని సంస్కృతంలో దండి అనే మహాకవి ఒకచోట పేర్కొంటాడు.

నిజమే! మాట మనిషికి భగవంతుడిచ్చిన గొప్ప వరం. ఆ మాటతో పాటు వివేచించే శక్తిని, ఆలోచించే మనస్సునూ ఇచ్చి భగవంతుడు మనిషిని ఒక బాధ్యతాయుత వ్యక్తిగా మలచాడు.

మరి ఆ వాక్కుకే ఒక రూపం ఉంటే, జ్ఞానానికే ప్రతిరూపంగా ఒక మూర్తిని నిలుపుకుంటే, ఆ శక్తిస్వరూపం ఎలా ఉంటుంది?

ఇంకెలా? అచ్చంగా బాసరలో వెలసిన జ్ఞానదాయిని విద్యావాణి లా– త్రిమూర్తులకే చైతన్యాన్ని ప్రసాదించగల అమృతాక్షయ అక్షర రూపిణిలా ఉంటుంది.

ఆ తల్లి కరుణ లేకపోతే లోకాలన్నీ చీకటిమయమే కదా! సకల సృష్టి చైతన్యానికీ ఆమె వాత్సల్యమే కారణం కదా! అన్ని విద్యలకూ ఆమే ఆధారం కదా! అందుకే ఆ తల్లి రూపం అపురూపం. అరుదైన ఆమె ఆలయం అతి సనాతనం.



యుగయుగాల సృష్టి చైతన్యాలకు అది నిలయం. జ్ఞానాకృతికి సంకేతం.

సమస్త వేద వాఙ్మయాన్నీ విభజించిన వేదవ్యాస మహర్షి భారత, భాగవత గాధలను రచించి అష్టాదశ పురాణాలను లోకానికి అందించి, ఎంతగా వాఙ్మయ తపస్సును చేసినా ఆయన మనస్సు నిండా ఇంకా ఏదో తీరని అశాంతి, ఏదో వెలితి, అంతులేని ఆవేదన...

ముని మదిలో మెదిలే అశాంతిని తొలగించేదెవరు? ఆయనలోని ఆవేదనలన్నీ మటుమాయం చేయగల మహత్తర శక్తి ఎవరు? వ్యాసుని అన్వేషణ కొనసాగింది... ఉత్తర భారతదేశమంతా సంచరించాడు. ప్రతి తీర్థాన్ని సేవించాడు. ప్రతి క్షేత్రాన్నీ దర్శించాడు. దక్షిణాపథానికి చేరుకున్నాడు. దండకారణ్యంలోకి ప్రవేశించాడు. పావన గౌతమీ నదీజలాల్లో మునకలేశాడు. ఒకానొక అగోచర అద్భుతశక్తి వ్యాసుని హృదయాంతరాళాల్లో ప్రతిధ్వనించింది. గోదావరీ తీరంలో



ధ్యానమగ్నుడయ్యాడు. నాదబిందు కళారూపిణిగా అవ్యక్త మనోహరమైన ఆది ప్రణవనాదం ఆయనకు వినిపించసాగింది. మనోనయనాల నుండి ఏదో తెలియని కరుణామయమైన అమృతరూపం ఆప్యాయంగా గోచరించింది. మాతృ ప్రేమలోని మాధుర్యాన్ని ఆ ముని చవిచూశాడు. ఏకాంత గంభీర ప్రకృతిసీమలో తనను పులకరింపజేసిన ఆ నాదాన్ని, ఆ రూపాన్ని తదేక దీక్షతో ధ్యానం చేయసాగాడు. ఎంతగా ధ్యానం చేస్తే అంతగా ఆ దివ్యరూపం అతణ్ణి అలరించసాగింది. అమ్మా! అమ్మా! అమ్మా! అని ముమ్మార్లు ఆ తల్లిని ఆర్తిగా పిలిచాడు. ఓయి అన్న పిలుపే ఓంకార రూపంతో అతనికి మాతృదర్శనమై లభించింది. నెమ్మది నెమ్మదిగా మనో వికారాలన్నీ మౌనికి తొలగిపోయాయి. గుండె బరువు తగ్గిపోయింది. అశాంతి పటాపంచలైపోయింది. అంతులేని ప్రశాంతి సమకూరింది.

తనను కరుణించిన ఆ దేవతను అక్కడే నిలిచిపొమ్మని వ్యాసుడు వేడుకునానడు. చిత్తశాంతిని ప్రసాదించిన జననిని లోకానికి వెలుగులు నింపే వరదాయినిగా అక్కడే ఆగిపొమ్మని ప్రార్థించాడు.

'అలాగే!' అని అభయమిచ్చింది అమ్మ. 'నన్ను నీవే నిలుపుకో' అని కోరింది. కలియుగంలో భక్తులందరికీ విజ్ఞాన దీధితులను పంచే అక్షరాకృతిగా నిన్ను నిలుపుతానని వేడుకున్నాడు వ్యాసుడు. 'సరే!' అన్నిది గీర్వాణి. ప్రతినిత్యం మూడు పిడికిళ్లతో గోదావరీ నదిలోని ఇసుకను తెచ్చి తనను ప్రతిష్ఠించమని ఆదేశించింది.

సత్వరజస్తమో గుణాలకు సంకేతంగా శ్రీ మహాసరస్వతీ శ్రీ మహాలక్ష్మీ శ్రీ మహాకాళి రూపాలను ఆవాహన చేసుకుని ప్రతినిత్యం గౌతమీ నదిలో స్నానంచేసి మూడు పిడికిళ్ల ఇసుకను తెచ్చి మూడు ప్రదేశాలలో పోయసాగాడు వేద వ్యాసుడు. ఆశ్చర్యకరంగా ఆ ఇసుక తిన్నెలే ముగ్గురమ్మల రూపాలు దాల్చాయి. శ్రీ మహాసరస్వతి ప్రధాన దైవతంగా, రమాకాళికలు తోడుగా జ్ఞానదాయిని ఆవిర్భవించింది. వ్యాసుడాడిన తీర్థమూ, వ్యాసుడు నిల్పిన క్షేత్రమూ సకలలోకా లకూ వెలుగులిచ్చే కోవెలగా నిలిచింది.

భారతదేశంలోని అతి పురాతన దేవాలయాలలో సరస్వతీ క్షేత్రాలుగా చెప్పుకోదగినవి రెండు మాత్రమే. ఒకటి హిమాలయ

పర్వతసానువులలో వెలసిన కాశ్మీర సరస్వతీ క్షేత్రం. కాగా రెండవది అతి విశిష్టమైనది, వ్యాసప్రోక్తమైనది శ్రీ వాసర జ్ఞానసరస్వతీ క్షేత్రం. లోకంలో బ్రహ్మయ్యకు గుళ్ళు లేకున్నా ఆయన ఇల్లాలికి రెండు గుళ్ళైనా ఉండడం విచిత్రం. అదీ మన రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ముధోల్ మండలంలో, నిజామాబాద్, నిర్మల్‌కు సమీపంలో ఉండడం తెలుగువారంతా చేసుకున్న పుణ్యఫలం.

ఈ క్షేత్రం గోదావరీ నదీ తీరంలో ఉన్నందున తీర్థరాజంగానూ విరాజిల్లుతున్నది. సాక్షాత్తుగా నారాయణాంశ సంభూతుడైన వేదవ్యాసుడు తపస్సు చేసుకున్న గుహను ఈ క్షేత్రంలో మనం సందర్శించవచ్చు. రామాయణ, భారత కాలం నుండి ఈ క్షేత్రం తీర్థం ఉన్నట్లుగా, ఇంద్రాది సమస్త దేవతలూ ఈ దేవిని అర్చించి తరించినట్లు ఎన్నో పౌరాణిక గాధలూ ఐతిహ్యాలు ప్రచారంలో ఉన్నాయి. 18వ శతాబ్ది మధ్యకాలంలో అహ్మద్‌షాహి, ఇమాద్‌షాహి, కుతుబ్‌షాహి, బరీద్‌షాహి అనే మహమ్మదీయులు దండెత్తి వచ్చి ఈ దేవాలయాన్ని ధ్వంసం చేయగా మక్కాజీ పటేల్ అనే వీర యోధుడు సమీప గ్రామ యువకులను పోగుచేసి మ్లేచ్ఛుల నెదుర్కొని తరిమికొట్టి ఆలయాన్ని పునరుద్ధరించాడు. జగద్గురు శ్రీ విద్యారణ్య భారతీస్వాములు పునఃప్రతిష్ఠ గావించారు. ప్రస్తుతం మహాలక్ష్మి విగ్రహం సరస్వతీ మాతకు కుడివైపున ఉన్నది. మహాకాళి విగ్రహాన్ని మాత్రం ఆలయ పైభాగాన వేరొక మందిరంలో ప్రతిష్ఠించారు. వీర మక్కాజీ పటేల్ విగ్రహం కూడా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉంది. ఈ క్షేత్రం పరిసరాల్లో ఎన్నెన్నో ప్రాచీన దేవతా మందిరాలున్నాయి.

మరాఠీ ప్రాంతానికి చేరువలో ఉన్న కారణంగా ఈ ఆలయానికి మరాఠీ భక్తులు అధికంగా వస్తారు. గత కొన్ని దశాబ్దాలుగా ఆలయ ఖ్యాతి అన్ని ప్రాంతాలకూ పరివ్యాప్తం కావడం వల్ల ఎందరెందరో భక్తులు దేశంలోని అన్ని ప్రాంతాల నుండి వస్తున్నారు. బాసర ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా అన్ని విద్యలకు నిలయమైన క్షేత్రంగా విరాజిల్లుతుండడంతో ప్రతి నిత్యం ఎంతోమంది బాలబాలికలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు జరుగుతాయి. యోగుల సాధనలు, సాధకుల జపతపాలు ఇప్పటికీ ఇక్కడ కొనసాగుతున్నాయి. బ్రహ్మచర్య దీక్షతో సారస్వతోపాసన, మండల దీక్ష చేస్తే అమ్మవారు తప్పక స్వప్నంలో కనిపిస్తారని భక్తుల విశ్వాసం. ఎన్నో ఉదాహరణలు ఇక్కడి స్థలపురాణంలో ఉన్నాయి.

ఇటీవలి కాలంలో మన రాష్ట్రానికి ఐఐటి కేంద్రంగా బాసర క్షేత్రం విలసిల్లాలని ప్రబలమైన ఆకాంక్ష బయల్దేరడంతో బాసరకు ఒక కొత్త వెలుగు సమకూరింది. ప్రముఖ విద్యావేత్త, ఐఐటి గురువు శ్రీ చుక్కా రామయ్యగారి నేతృత్వంలో బాసర ఒక ఐఐటి విద్యానిలయంగా మారి దేశానికే ఆదర్శంగా నిలవాలని అందరూ ఆకాంక్షించారు. మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు మొదలైన వారందరి చూపులూ బాసరపైనే నిలవడంతో కొన్నేళ్ళుగా బాసరలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చి చేరాయి. సహజ సిద్ధమైన ప్రకృతి సీమతో అలరారే ఈ క్షేత్రానికి హుడా వారి హరిత సౌందర్యం సమకూరి నందనోద్యానవనాలు, అధునాతన ఆవాస సదుపాయాలు, రైలు, బస్సుల సౌకర్యాలు, ఆర్జితసేవలు వంటి హంగులన్నీ సమకూరుతున్నాయి. అయితే సాధకులకు, యోగులకు నిజమైన నిలయమైన అక్షరవాణీక్షేత్రం పురావైభవానిన కోల్పోతుందని సనాతన ఆర్షధర్మానికి ప్రతీకగా నిలిచిన ఈ క్షేత్రంలో వ్యాపార సంస్కృతి పెరిగిపోయి మధుకర వృత్తి (మధ్యాహ్న సమయంలో సాధకులు ఇంటింటికీ వెళ్లి భిక్ష తీసుకునే సంప్రదాయం) యోగసాధనలు, జపతపాలు వంటివి కనుమరుగై పోతాయని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

వాణి విలసిల్లే విద్యాకేంద్రం వాణిజ్య కేంద్రం కాకూడదనే ఆకాంక్ష ఒక వంక, ఆధునిక విద్యాలయాల రాకతో నిజంగా అపర విద్యానగరంగా మారాలనే తపన మరోవంక బాసర క్షేత్రాన్ని తల్లడిల్లజేస్తుంది. కానీ ప్రసిద్ధ కారణాంతరాలవల్ల బాసరలో ఉండాల్సిన ఐఐటీ హైదరాబాద్ పరిసరాలకు మళ్లినా రాజీవ్‌గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం మాత్రం బాసరకు దక్కింది.

మరి విద్యాధిదేవత మదిలో ఏముందో త్వరలోనే కాలమే తీర్పు చెబుతుందని ఆశిద్దాం!

- కవి, గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు
మరుమాముల దత్తాత్రేయశర్మ

జ్ఞానపీఠం.. బాసర

బాసర చదువుల తల్లి.

ఈనాడు చదువు సంపదకు మూలం. సామాన్య ప్రజానీకం బాసరను తమ ఆశాజ్యోతిగా కొలవటం సహజం.

బాసర ఒకనాడు ఆధ్యాత్మిక వాఙ్మయానికి కేంద్రం. వ్యాసుడు కొన్ని వందల సంవత్సరాల క్రితం దక్షిణ దేశం వచ్చి, బాసర దేవాలయాన్ని పరిశీలించి, ఇక్కడ పరిసరాలతో ముగ్ధుడయ్యాడు. అమాయక గిరిజన ప్రజల్ని చూసి కొంతకాలం ఇక్కడే ఉండాలన్న నిర్ణయం తీసుకున్నాడు.

గోదావరి తీరం, అడవి ప్రాంతం గిరిజనుల యొక్క వేష, భాష, సంస్కృతితో ఆకర్షితుడై సమాజ నిర్మాణానికై బ్రహ్మసూత్రాలు రాశాడు.

చాలామంది బ్రహ్మసూత్రాలనగానే మంత్రాలనుకుంటారు. కానీ అవి సమాజ నిర్మాణంలో పునాది అంశాలపై చర్చ. ఉదాహరణకు వివాహ పద్ధతులు మారవచ్చును. మతాలు వేరు కావచ్చును. దేశాలు వేరు కావచ్చును. కానీ భార్యాభర్తల సంబంధాలు శాశ్వతం. వీటి గురించి వ్యాసుడు ప్రస్తావించాడు.

అదేవిధంగా పరిపాలకులకు, పాలితులకు మధ్య సంబంధాలను బ్రహ్మసూత్రాల్లో పొందుపరిచాడు. ఈ బ్రహ్మ సూత్రాలను సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యయనం చేశారు. ఆయన రష్యా రాయబారిగా ఉన్నప్పుడు బ్రహ్మసూత్రాల విశిష్టతను గూర్చి స్టాలిన్‌కు చెప్పారు. భారతీయ తత్త్వశాస్త్రంలోని భావాలకు స్టాలిన్ ఆకర్షితుడయ్యారు.

అదే భావాలను సామాన్యమైన వారికి అర్థమయ్యే విధంగా వ్యాసుడు అష్టాదశ ఉపనిషత్తులు రాశారు. అదే భావాలను వ్యక్తం చేస్తూ కథల రూపంలో పురాణాలు రాశాడు.

ఈ ఆధ్యాత్మికమైన సందేశం బాసర నుంచి ప్రపంచానికి ఇవ్వబడింది.

ఈనాడు అదే బాసర ప్రపంచానికొక కొత్త సందేశం ఇవ్వనుంది.



జ్ఞానమనే ప్రవాహానికి రెండు దారులు. ఒక దారి ఆధ్యాత్మికమైతే, మరొకటి భౌతికమైనది.

ఈ రెండూ ఎంత పటిష్ఠంగా ఉంటే జ్ఞానప్రవాహం అంత వెలుగులతో సమాజంలో ప్రవహిస్తుంది.

ఇది సాంకేతిక యుగం.

ఆనాడు వ్యాసుడు గిరిజనుల యొక్క జీవన విధానాన్ని క్రమంలో పెట్టేందుకు ఒక సందేశమిస్తే, ఈనాడు సామాన్యుల జీవనం మెరుగుపరిచేందుకై సాంకేతిక విద్య అండగా నిలవవలసి ఉంది.

సాంకేతిక విద్య సామాన్యుని కన్నీళ్లు తుడిచే సాధనంగా అందరూ గుర్తిస్తున్నారు.

ఆ సాంకేతిక విద్య ప్రాముఖ్యతను అదే బాసర నుంచే ప్రజలకు అందవలసి ఉంది.

ఒక మహావిద్యాలయం బాసర పరిసరాల నుంచే ఐఐటి వంటి సాంకేతిక పరిశోధనా సంస్థ వస్తే పేద ప్రజలకు నిజమైన వరంగా మారుతుంది.

ఈనాడు బాసర జ్ఞానానికి పీఠం కావాలి.

జ్ఞానమనగా సామాన్యుని జీవితాన్ని బాగుపరచటమే. అందుకే బాసర జ్ఞానసరస్వతిగా ఈ యుగంలో కూడా ప్రజ్వరిల్లుతుందని నా ఆశ.

– శ్రీ చుక్కా రామయ్య, ప్రముఖ విద్యావేత్త

దక్షిణ కైలాసం – కాళేశ్వరం

పూర్వం ఒకానొక సమయంలో నారదుడు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి ఓ జగత్పితా! మీ నుండి తపస్సు, యజ్ఞ, దానముల గురించిన అన్ని విషయములను నేను విన్నాను. ఇప్పుడు స్వర్గ, మర్త్య, పాతాళ లోకములలో ఎన్ని తీర్థములు ఉన్నవి? వాటిలో ఏది విశిష్టమైనదో దయతో నాకు చెప్పుమని ప్రార్థించగా అప్పుడు బ్రహ్మ నారదునితో ఓ నారదా! మూడులోకములలోను తీర్థము అతి పవిత్రమైనది. అందునా జమ్బూద్వీపములోని తీర్థములు విశేషము.

స్వర్గ, మర్త్య, పాతాళములలోని తీర్థములు దైవములు, ఆసురములు, ఆర్షములు, మానుషములని నాలుగు విధములుగా దేవతలచేత మూడు లోకాలలోను ప్రసిద్ధి పొందినవి. **"బ్రహ్మ విష్ణు శివైశ్చైవ నిర్మితం దైవముచ్యతే"** (గౌతమీ మాహాత్మ్యము 1-1-20) బ్రహ్మ,విష్ణు,శివులచేత నిర్మించబడిన తీర్థములు దైవతీర్థములని చెప్పబడుతున్నవి. **"దైవ ప్రభావాత్తపస ఆర్షాణ్యపిచ తాన్యపి"** ఋషులు తీవ్రమైన తపస్సును ఆచరించి ఆ తపస్సు ప్రభవముచేత లేదా దైవానుగ్రహము వలన నిర్మించిన తీర్థములను ఆర్షములని అంటారు. **"ఆసురైరావృతాన్యాసం తదేవాసురముచ్యతే"** ఇట్టి ఆర్షతీర్థములు ఆసురబృందములచే ఆవరింపబడినచో వాటిని ఆసురతీర్థములంటారు. **'మానుషై: కారితాన్యాహుర్మానుషాణీతి నారదా"** తమ తమ అభీష్ట సిద్ధిని పొందుటకు మానవులచేత నిర్మించబడే తీర్థములు మానుషములు. ఈ విధంగా తీర్థములు నాలుగు విధములుగా విభజింపబడినవి.

శ్లో. **మానుషేభ్యశ్చ తీర్థేభ్య ఆర్షం తీర్థమనుత్తమమ్ ।**
ఆర్షేభ్యశ్చ తీర్థేభ్యః ఆసురం బహుపుణ్యదం ।
ఆసురేభ్యస్తథా పుణ్యం దైవం తత్సార్వకామికమ్ ।

(గౌతమీ మాహాత్మము 1-1-18)

తా. మానుష తీర్థములకన్న ఆర్షతీర్థములు ఉత్తమములు. ఆర్షతీర్థములకన్న ఆసురతీర్థములు చాలా పుణ్య ప్రదమైనవి. ఈ ఆసుర తీర్థములకంటే దైవతీర్థములు అత్యంత ఉత్తమమైనవి. సకల జనుల కోరికలను నెరవేర్చునవి.

హిమాలయాలనుండి వింధ్యపర్వతముల మధ్యలో ఉన్న ఆరు నదులు, వింధ్య పర్వతాలనుండి దక్షిణ సముద్రాల మధ్యలో ఆరునదులు, మొత్తం ఈ పన్నెండు నదులు దేవసంభవములగా కీర్తించబడుతున్నవి. వీటిలో గోదావరి నది మొదటిది.

అటువంటి పవిత్ర గోదావరీ నదీతీరంలో వెలసిన క్షేత్రమే శ్రీ కాళేశ్వర క్షేత్రం. ఈక్షేత్రమును గురించి "కుశతర్పణ తీర్థవర్ణన"మనే పేరుతో బ్రహ్మపురాణాంతర్గత గౌతమీ మహాత్మ్యములోని 92వ అధ్యాయమున సాక్షాత్తు బ్రహ్మదేవునిచే నారదునికి ఈ క్షేత్ర మాహాత్మ్యం వివరించబడినది.

సృష్టికి పూర్వం బ్రహ్మ ఈ ప్రపంచాన్ని సృష్టించేందుకు నిశ్చయించుకుని దేవయజనమనే యజ్ఞాన్ని నిర్వహించేందుకు సిద్ధమై అందుకు కావలసిన యజ్ఞసాధనములను పొందినవాడై యజ్ఞాన్ని ఆచరించగా అపుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమైనాడు. అతనినుండి పంచభూతములు, దిక్కులు, కాలములు, చాతుర్వర్ణములు, పశుపక్ష్యాదులు, క్రిమి కీటకాదులు ఆవిర్భవించినవి. యజ్ఞము పరిపూర్ణమైనది. ఆ యజ్ఞసాధనమైన ప్రణీతా పాత్రనుండి వచ్చిన ప్రణీతోదకమే ప్రణీత నదిగా మారినది. ఆ తర్వాత దర్భలచే మార్జన చేసి ప్రణీత పాత్రను విసర్జించెను. మార్జన చేసే సమయంలో ఆ బిందువులు ఎక్కడైతే పడినాయో అవి అచ్చట తీర్థములైనాయి. మార్జనము చేసిన దర్భలు ఎక్కడ పడవేయబడినవో ఆ శుభస్థలమునే కుశతర్పణ తీర్థమని చెప్పబడుతుంది.

శ్లో. **కుశతర్పణ దేశేతు తత్తీర్థం కుశతర్పణమ్ ॥**
కుశైశ్చ తర్పితాః సర్వే కుశతర్పణముచ్యతే ।
పశ్చాచ్చ సంగతా తత్రగౌతమీ కారణాస్తరాత్ ॥

(గౌ.మా. 92-64)

తా. కుశములచే (దర్భలచే) అందరు తృప్తిని పొందినారు కాబట్టి ఆ ప్రదేశమునకు కుశతర్పణమనే పేరు సార్థకమైనది. దేవనదియైన గోదావరి ఇక్కడే ప్రణీతానదితో, అంతర్వాహిని యైన సరస్వతి నదితో సంగమించి త్రివేణి సంగమముగా రూపుదిద్దుకున్నది. ఈ స్థలము దండకారణ్యమున ఉన్నది.

క్షేత్ర ప్రాశస్త్యం

శ్లో. మద్దేవ యజనంచేదం దండకారణ్య ముచ్యతే।।
ధర్మబీజం ముక్తిబీజం దండకారణ్య ముచ్యతే।
విశేషాద్గౌతమశ్చిష్టో దేశః పుణ్యతమో భవేత్।।

(గౌ.మా.92-68)

తా. బ్రహ్మయజ్ఞము దండకారణ్యమున జరిగినది. దండకారణ్యము ధర్మప్రదము, ముక్తిప్రదము. విశేషముగా గోదావరి నదితో (గౌతమీ) కలసి ఉండటం వలన ఈ ప్రదేశము అత్యంత పుణ్యప్రదమైనది.

శ్లో. ఉభయోస్తీరయోస్తత్ర తీర్థాన్యాహుర్మనీషిణః ।
షడశీతి సహస్రాణి తేషుపుణ్యం పురోదితమ్।।
వారణస్యా అపి మునే కుశతర్పణముత్తమమ్।
న అనేన సదృశం తీర్థం విద్యతే సచరాచరే।।
బ్రహ్మహత్యాది పాపానాం స్మరణాదపి నాశనం।
తీర్థమేతన్మునే ప్రోక్తం స్వర్గద్వారం మహీతలే।।

(గౌ.మా.92-76)

తా. ఈ కుశతర్పణ (కాళేశ్వర) క్షేత్రములోని ఉభయ తీరములందు 86వేల తీర్థములున్నట్లు పెద్దలు చెప్పెదరు. ఈక్షేత్రం వారణాసి కంటే కూడా ఉత్తమమైనది. సకల జగత్తులో దీనినిమించిన తీర్థము లేదు. దీని గురించి స్మరించిన మాత్రముచేత బ్రహ్మహత్యాది దోషములు తొలగిపోతాయి. ఈ తీర్థము భూమిపై ఉన్న స్వర్గద్వారము.

ఈక్షేత్రములో స్నాన, దానాది ఫలము

శ్లో. ప్రణీతా సంగమేచాపి కుశతర్పణ ఏవవా।
స్నానదానాది యఃకుర్యాత్సగచ్ఛేత్పరమం పదమ్।।

(గౌ.మా.92-74)

తా. ప్రణీతా సంగమమైన ఈ క్షేత్రమున ఎవరైతే స్నానము, దానము మొదలైనవి ఆచరిస్తారో వారు పరమపదాన్ని పొందుతారు. కుశతర్పణమని ప్రణీతా సంగమమని చెప్పబడిన ఈ శ్రీ కాళేశ్వర తీర్థం భుక్తి, ముక్తి ప్రదాయకము.

శ్లో. స్మరణం పఠనంవాపి శ్రవణం చాపిభక్తితః ।
సర్వకామప్రదం పుంసాం భుక్తిముక్తి ప్రదాయికం ।।

(గౌ.మా.92-75)

తా. ఈ కాళేశ్వర క్షేత్రమును గురించి స్మరించినా, చదివినా, విన్నా సర్వకోరికలు నెరవేరును.

స్థలమహత్యం

కాళేశ్వర క్షేత్రములోని ప్రధాన దైవం శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి. ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఇది దేశంలో మరెక్కడాలేదు. అదే విధంగా గర్భాలయానికి నాలుగు వైపుల నాలుగా ద్వారాలు మరో ప్రత్యేకత. స్కాందపురాణంలోని కాళేశ్వర ఖండం ప్రకారం ఇక్కడి ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న వారు దర్శనమాత్రంచేత వారి పాపాలు తొలగి మరణాంతరము ముక్తిని పొంది స్వర్గలోకానికి వెలుతుండటంతో యమునికి పని లేకుండా పోయింది. దానితో యమధర్మరాజు ఈ దేవాలయ ప్రాంగణంలో తపస్సు ఆచరించగా ప్రత్యక్షమైన శివునికి ఇక్కడ దర్శనం చేసుకున్న వారంతా స్వర్గలోకానికి వెలుతుండటంతో యమలోక ప్రాభవం, భూలోకంలో పాపభీతి లేకుండా పోయాయని విన్నవించగా, అప్పుడు శివుడు ఈ క్షేత్రంలో నీ పేరుతో ఒక లింగాన్ని ప్రతిష్ఠించు. దాన్ని దర్శించకుండా నా దర్శనం చేసుకున్న వారు యమలోకాన్ని పొందుతారని వరమిస్తాడు. యముడు ప్రతిష్ఠించిన లింగమే కాళేశ్వర లింగం. యముడు తపస్సు చేసిన యమకోణం నేటికి మనం దర్శించవచ్చు. ఇక్కడ శివుడిపై అభిషేకించిన జలం గోదావరిలో కలుస్తుంది

ఎలా వెళ్ళాలి

కాళేశ్వర క్షేత్రం కరీంనగర్ జిల్లాలోని ప్రధాన శైవ క్షేత్రం. ఇది జిల్లా ప్రధాన కేంద్రం కరీంనగర్ పట్టణం నుండి130కి.మీ దూరం, జిల్లాలోని మంథని నుండి 50 కి.మీ.దూరం, వరంగల్ నుండి 110కి.మీ.దూరం ఉంటుంది. అన్ని చోట్లనుండి బస్సు సౌకర్యం ఉన్నది. రైలు సౌకర్యం లేదు. ఇక్కడ బస చేయడానికి పెద్దగా వసతులు లేవు.

- అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

వేదపండితులు, అచ్చలాపూర్, జి. ఆదిలాబాద్

ఉత్తరవాహిని తీరం...అగస్త్యేశ్వరాలయం

గోదావరి ఉత్తర దిశగా... సాధారణంగా నదులన్నీ పశ్చిమ దిశ నుంచి తూర్పుదిశకు ప్రవహిస్తాయి. కానీ, ఈ క్షేత్రంలో ఆలయానికి తూర్పున ఉన్న గోదావరికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది ఉత్తర దిశగా 15 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. కాశీలో గంగానది ఆరు కిలోమీటర్లు ఉత్తరదిశగా ప్రవహిస్తుండగా చెన్నూరు మండలంలోని పొక్కూరు గ్రామం నుంచి కోటపల్లి మండలంలోని పాదుపల్లి గుట్టల వరకు గోదావరినది ఉత్తర దిశగా ప్రవహిస్తుంది. పారుపల్లి గుట్టలపై దిగంబరంగా ఉన్న భైరవుడి విగ్రహ రూపాన్ని చూడలేక ఇలా ప్రవహించిందని పురాణాలు చెబుతున్నాయి. గోదావరి జన్మస్థలం నుంచి సముద్రంలో కలిసే వరకు మరెక్కడా ఇలా లేదు. అందుకే ఆ ప్రాంతంలో పుణ్యస్థానాలకు, అస్తికల నిమజ్జనానికి భక్తులు తరలివస్తుంటారు. గోదావరి ప్రత్యేక ప్రవాహం వల్లే ఈ ప్రాంతానికి ఉత్తర వాహిని తీరం అనే పేరు వచ్చింది. ఎంతో విశిష్టమైన ఈనదిలో ఆంజనేయుడి తల్లి అంజనాదేవి స్నానమాచరించిందని స్థలపురాణం చెబుతోంది.

గోదావరి నది పుట్టిన చోటి నుంచి సముద్రంలో కలిసే వరకు మరెక్కడా లేని ప్రత్యేకత ఆ ప్రాంతంలో ఉంది. నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న ఆ ఆలయంలోకి అడుగుపెడితే నాలుగు శతాబ్దాలుగా ఉన్న ఒక అద్భుతం దర్శనమిస్తుంది. అగస్త్యుడు తపస్సు చేశాడని చెప్పే ఆ అద్భుత క్షేత్రం, అంజనాదేవి స్నానమాచరించిందని చెప్పే ఆ నది ఉన్న ఊరు ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు. గోదావరినది తీరం పొడవునా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే పుణ్యక్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో ఆదిలాబాద్ జిల్లా చెన్నూరులోని ఆగస్త్యేశ్వరాలయం ఒకటి. దీన్ని ఉత్తర వాహిని తీరం అని పిలుస్తారు. మరణించిన వారి ఆస్తికలను నిమజ్జనం చేయడానికి పుణ్యస్నానాలు చేయడానికి ఇక్కడకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇంతకీ, ఈ ప్రాంతానికి ఉత్తరవాహిని తీరం అని పేరెందుకు వచ్చిందీ, ఇంత ప్రాధాన్యత ఎలా వచ్చింది అంటే...

ఆగస్త్య మహాముని తపస్సు చేసి... రాష్ట్రంలోని అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఆగస్త్యేశ్వరాలయం ఒకటి. ద్వాపరయుగంలో ఆగస్త్య మహాముని ఈ ప్రాంతంలో తపస్సు చేయడానికి వచ్చారట. ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి ప్రశాంతతకు ముగ్ధుడైన ఆ మహర్షి అక్కడ ఓ భారీ శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. అలా ఇక్కడ నిర్మితమైన ఈ ఆలయానికి అగస్త్యేశ్వరాలయం అని పేరు వచ్చింది. ఆ తర్వాత సంవత్సరంలో కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడు ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్టు స్థలపురాణం. 20 ఏళ్ల తర్వాత అల్లావుద్దీన్ ఖిల్జీ కాలంలో సేనాని మాలిక్ కపూర్ ఈ ఆలయంపై దాడి చేసి గోపురాన్ని ధ్వంసం చేశాడట. అనంతరం శ్రీకృష్ణ దేవరాయలు చెన్నూరు ప్రాంతానికి వచ్చినపుడు ఈ ఆలయాన్ని మరోసారి పునరుద్ధరించినట్టు ఆలయం ప్రాంగణంలో దొరికిన ఒక శాసనం చెబుతోంది. ఆలయం ముందు ప్రతిష్ఠించిన ఈ శాసనం తెలుగు, కన్నడ మిశ్రమ భాషల్లో కనిపిస్తుంది.

గోదావరి ఉత్తర దిశగా... సాధారణంగా నదులన్నీ పశ్చిమ దిశ నుంచి తూర్పుదిశకు ప్రవహిస్తాయి. కానీ, ఈ క్షేత్రంలో ఆలయానికి తూర్పున ఉన్న గోదావరికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది ఉత్తర దిశగా 15 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. కాశీలో గంగానది ఆరు కిలోమీటర్లు ఉత్తరదిశగా ప్రవహిస్తుండగా చెన్నూరు మండలంలోని పొక్కూరు గ్రామం నుంచి కోటపల్లి మండలంలోని పాదుపల్లి గుట్టల వరకు గోదావరినది ఉత్తర దిశగా ప్రవహిస్తుంది. పారుపల్లి గుట్టలపై దిగంబరంగా ఉన్న భైరవుడి విగ్రహ రూపాన్ని చూడలేక ఇలా ప్రవహించిందని పురాణాలు చెబుతున్నాయి. గోదావరి జన్మస్థలం నుంచి సముద్రంలో కలిసే వరకు మరెక్కడా ఇలా లేదు. అందుకే ఆ

ప్రాంతంలో పుణ్యస్థానాలకు, అస్తికల నిమజ్జనానికి భక్తులు తరలివస్తుంటారు. గోదావరి ప్రత్యేక ప్రవాహం వల్లే ఈ ప్రాంతానికి ఉత్తర వాహినీ తీరం అనే పేరు వచ్చింది. ఎంతో విశిష్టమైన ఈనదిలో ఆంజనేయుడి తల్లి అంజనాదేవి స్నానమాచరించిందని స్థలపురాణం చెబుతోంది.

అఖండ జ్యోతి : ఈ ఆలయ గర్భగుడిలో అడుగుపెట్టగానే అగస్త్యుడు ప్రతిష్టించిన భారీ శివలింగం దర్శనమిస్తుంది. గర్భగుడిలోని మరో విశేషం, అఖండ జ్యోతి. ఇది సుమారు 410 ఏళ్ల నుంచి నిరంతరం వెలుగుతూనే ఉంది. అప్పట్లో జక్కెపల్లి సదాశివయ్య అనే బ్రాహ్మణుడు దీన్ని వెలిగించాడు. అంతేకాదు, శివలింగానికి నిత్యపూజలు చేసేవాడు. నాటి నుంచి నేటి వరకు జ్యోతి దేదీప్యమానంగా వెలుగుతూనే ఉ ంది. సదాశివయ్య తర్వాత ఈ జ్యోతి బాధ్యతలను, నిత్యపూజలను ఆయన కుమారులే చూసుకుంటున్నారు. ఆయన కుటుంబంలో నాలుగో తరానికి చెందిన హిమకర్ శర్మ ప్రస్తుతం వీటిని నిర్వహిస్తున్నారు.

పుష్కరాలు: గోదావరి పుష్కరాల సమయంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచే కాక మహారాష్ట్ర నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఈ తీరంలో పుణ్యస్నానాలు చేస్తారు. వేమనపల్లి మండల కేంద్రంలోనూ (చెన్నూరు నుంచి 30 కిలోమీటర్ల దూరం) కోటుపల్లి మండలంలోని ఆర్జునగుట్ట (20 కిలోమీటర్లు దూరం) వద్ద నిర్వహించే ప్రాణహిత పుష్కరాలకు వచ్చే భక్తులు చెన్నూరులోని ఆలయాన్ని సందర్శించి వెళతారు. శివరాత్రి రోజున అఖండ జ్యోతికి పూజలు నిర్వహించి, శివపార్వతుల కళ్యాణం చేస్తారు. కార్తీక మాసంలో వైకుంఠ చతుర్దశి వేడుకను ఆలయంలో అత్యంత వైభవంగా జరుపుతారు. ఆరోజు రాత్రి భక్తులు ఉమ్మెత్త పూలతో శివలింగానికి పూజ చేస్తారు. శ్రావణ మాసంలో నెలరోజుల కఠోర శివదీక్షతో భక్తులు ఈ లింగానికి నిత్యాభిషేకాలు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో గ్రామస్థులు దోషాలు పోవాలని, వాళ్లకు ఎలాంటి కష్టమూ కలగకూడదని, స్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఈ ఆలయం మంచిర్యాల నుండి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతి గంటకూ ఒక బస్సు ఉంటుంది. హైదరాబాద్ నుంచి రైళ్లో నేరుగా మంచిర్యాల వచ్చి ఆలయానికి వెళ్లవచ్చు. విజయవాడ, వరంగల్, ఖమ్మం వాళ్లు ఖాజీపేట వరకూ రైళ్లో వచ్చి, అక్కడ నుంచి మంచిర్యాలకు రైలులో వెళ్లాలి.

- మరుమాముల రుక్మిణి

❖ ❖ ❖



వేదమూర్తులకు ఆలవాలం - మంథని

వింధ్యాద్రి దక్షిణే ప్రాంతే విలసత్ గౌతమీతటే
మంత్రకూటం సహస్రానా లింగానాం దానముత్తమమ్ ॥

మంత్రకూటం మంత్రపురి లాంటి అనేక పేర్లతో ప్రసిద్ధి చెందిన నేటి మంథని ఒక పెద్ద బ్రాహ్మణ అగ్రహారం. గోదావరి తీరంలో అనేక వాపీకూపతటాకాదులతో నేటికీ భాసిస్తోన్నది మంథని. పూర్వం రామచంద్రుడు దండకారణ్యంలో సంచరిస్తున్న సందర్భంలో అడ్డువచ్చిన పర్వతరాజాన్ని తన బాణపు మొనలతో చిలికినందున (మంథన చేసినందున) ఇది మంథనిగా మారిందని విజ్ఞుల అభిప్రాయం. ఎందరో కవిగాయక వేదవిదులకు నిలయమైన మంథని ఒక బృందావనమని పూర్వకవుల అభిప్రాయం.

రావులచెరుకట్ట రంగైన మందాట
తరచుగా తమ్మిచెఱువుకట్ట
వేడుక నడివీధి వెలయంగ వాగ్గడ్డ
పేరుకెక్కిన ప్రతిత పెంజేరు గడ్డ

ఇలా గ్రామం చుట్టూ ఆరు చెఱువులుంటాయి. అనేక బావులు. అందుకే నీటికి కొరతలేనిది అంటూ ఒక కవి చమత్కారంగా మణిప్రవాలంలో ఇలా చెప్పారు. **మంథెన్న మహాగ్రామం. చుట్టుగోడలు సురక్షితం. అన్నవస్త్రద్వయం చాక్తిథ్యం కలహమేవన ।** తెలంగాణలో సహస్ర ప్రభోజనం అంటే మంథని గుర్తుకు వచ్చేవిధంగా దాతలు ఇక్కడ అన్నదానం చేస్తుంటారు. ప్రభోజనం అంటే వేయికి పైగా బ్రాహ్మణులకు చేసే అన్నదానం. తెలంగాణ ప్రాంతంలోని ధనికవర్గాలు ముఖ్యంగా రెడ్లు, వెలమలు, వైశ్యులు ఈ ప్రాంతానికి వచ్చి అన్నదానం చేసి సంతృప్తిపడుతుంటారు. ఈ ప్రాంతం కవులకు, గాయకులకు నెలవు. ముద్దు బాలంభట్టుగారు వ్రాసిన మంథెన రామాయణం ఈ ప్రాంతంలో ఒక ప్రసిద్ధి చెందిన కావ్యం. ఇటటి స్త్రీలు కూడా ఎన్నో స్తోత్రములను, కావ్యములను, కథలను రచించినారని అంటూ ఉంటారు. బ్రహ్మశ్రీ గంగా రాజేశ్వరశర్మగారు నేటిరోజుల్లో బహుగ్రంథకర్తలైనటువంటి గట్టు నారాయణ గురూజీగారు, డా॥ రంగి కమలగారు లాంటి అనేకులు సమకాలీన ఇతివృత్తాలను చక్కగా మలచి తమ జ్ఞానామృతాన్ని ఇతరులకు పంచడంలో ముందుంటారు. ఎరబాటి బాబూరావుగారు, స్వర్గీయ బిరుదురాజు రామరాజుగారు మంథనిని వేనోళ్ల పొగిడారు.

జయభవాని శంకరాయ చంద్రమౌళి హే కృతాంత భయనివారణాయ మాం పాహి మంగళం ॥ అనే శివకీర్తనలో మంథకూట వర్ణన స్పష్టంగా కనిపిస్తుంది.





ఉత్తరమున గంగ దక్షిణమున గంగ
తూర్పు పడమట్ల బోయలింగాలు
ఆరువీధులతోని అలరారుతున్నట్టి
మంథపురం అదొక బృందవనం

ఇలా మంథనిలో ప్రతీ వీధికి ఒక హనుమదాలయం తప్పక ఉంటుంది. ఇక్కడ దగ్గరలో వున్న సుంగిళ్ల గ్రామంలోని నరసింహస్వామిని భక్తులు కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భావిస్తుంటారు. మంథనిలో ఒకే ఒక వైష్ణవాలయం శ్రీలక్ష్మీ నారాయణ మందిరం, మిగతా ఎక్కువగా శివాలయాలే. లక్ష్మీనారాయణ స్వామి మందిరం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ స్వామి మంథనిలో కొలువై వుండాలనే తలంపుతో మంథనికి వస్తున్న చింతపండు వ్యాపారుల బండిపైన ఎక్కి మంథనికి వచ్చి వెలిశారని ప్రతీతి. ఇదేకాకుండా వేలాది కమలాలతో నీరు కనిపించనంతగా నిండిపోయిన రావుల చెరువు కట్టకు ఆనుకొని ఉన్న మహాలక్ష్మీ మందిరం ప్రతిరోజూ నిత్యపూజలతో, సేవింపబడుతూ భక్తులతో కిటకిటలాడుతుంటుంది. ఈ మందిరంలోనే అనేక హరికథాగానాలు, భజనలు, గోపాల కళోత్సవాలు నిర్వహించబడుతుంటాయి. ఎందరో జ్ఞానులను గన్న మంథనికి జ్ఞానభిక్షను పెట్టిన లక్ష్మీనారాయణ మందిరంలోని హరికథా మండపం ఈ ప్రాంతంలో ప్రసిద్ధం. ఇదేకాక పోచమ్మ దేవాలయం, 12 చేతులు భాగీరథి, గోదావరి త్రోవలో వెలసిన అష్టభుజ మహాగణపతి విశేషంగా భక్తులను ఆకట్టుకొంటుంది. ఇక కాలభైరవ, కళింగదేవుల దత్తమందిరాలు చూపరులను ఆకట్టుకొంటాయి. గోదావరి తీరాన వున్న గౌతమేశ్వర క్షేత్రం అత్యంత పురాతనమైనది. కళింగులు స్థాపించిన దేవతగా భావించే కాళింగలమ్మ పల్లేరు రాయడుగా పిలువబడే బలవీర ఆంజనేయ దేవాలయాలు వూరికి క్షేత్రపాలకులుగా రక్షిస్తూ వుంటాయి. ఇవేకాక మంథనికి పేరు తెచ్చిన వేదపాఠశాల, శ్రీగురూజీ గారు నిర్వహిస్తున్న శ్రీసీతారామ సేవాసదనం ఉద్యోగరీత్యా పిల్లలకు దూరంగా ఉంటున్న వృద్ధ తల్లిదండ్రులకు మడితో రుచిగా, శుచిగా భోజనం ఇంటికి తెచ్చి ఇవ్వబడుతుంది. "మంథని – దర్శని" అనే ఒక మ్యూజియం మంథని చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపుతుంది. బ్రాహ్మణ బంధువు, విద్యావేత్త శ్రీ సి.ఎల్. రాజంగారు నిర్మించిన కళ్యాణ మండపం మా ప్రాంత వాసులకెంతగానో ఉపయోగపడుతుంది. ఇది అందరికీ ఉచితంగా ఇవ్వబడే కళ్యాణమండపం. ప్రసిద్ధి గాంచిన నాగులసంధి మంథనిలోనే ఉంది. ప్రతి నాగపంచమికి వటువులకు భిక్ష ఇచ్చి, చలిమిడితో నాగేంద్రుని పూజించే ఆచారం ఇక్కడ కనిపిస్తూ వుంటుంది.



శ్రీ అవధానుల నరసింహ ప్రసాదన నిర్వహిస్తున్న మన మంథని.డాట్‌కామ్ విజ్ఞాన విపంచిలనే కాక సమాచారాన్ని వేగంగా మంథనివాసులకు అందిస్తూ విశేషమైన సేవ చేస్తున్నదనడంలో సందేహంలేదు. అనేకులైన వేదవిద్వాంసులకు నిలయమైన ఈ మంథనిని ఎంత కీర్తించినా సమయం చాలదు.

అపర చాణక్యునిగా పేరు గడించిన స్వర్గీయ పి.వి. నరసింహారావు గారు మంథని నుండి ఎమ్మెల్యేగా ఎంపికయ్యాక అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పనిచేశారు. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గారు కూడా ఎమ్మెల్యేగా ఎన్నికై గత ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణం చేశారు. ఆంగ్ల వ్యాఖ్యాత, అంతర్జాతీయ క్రికెట్ వ్యాఖ్యాత మహావాది విజయ్ మంథని నివాసులు.

– రంగి సత్యనారాయణ శర్మ
మంథని

గోదావరి తీరం నుండి భారత ప్రధాని దాకా.... పీవీ నరసింహారావు



మంథని ప్రాంతంతో అనుబంధం కలిగి జాతీయస్థాయిలో కీర్తిప్రతిష్ఠలు నార్జించిన విభిన్నరంగాల ప్రముఖులు వున్నారు. గోదావరీ నదీతీర ప్రాంత వాసులుగా వీరు ఆయా రంగాలలో లబ్ధప్రతిష్ఠులై తమ స్వస్థలానికి వన్నె తెచ్చారు. ఇక్కడ పుట్టి పెరిగినవారు కొందరైతే, ఈ ప్రాంతంతో అనుబంధాన్ని పెంచుకొని ఇక్కడివారిలో మమేకమై ఉన్నత పదవులను అలంకరించిన ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో ప్రముఖంగా పేర్కొనదగిన మహనీయులు శ్రీ పి.వి. నరసింహారావు. ఈ సందర్భంగా వారి జీవనగమనాన్ని ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకుందాం.

భారత ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన మొదటి దాక్షిణాత్యుడు, ఒకేఒక్క తెలుగువాడు, పాములపర్తి వేంకట నరసింహారావు 1921, జూన్ 28న జన్మించాడు. పి.వి.నరసింహారావు, పీవీ గా ప్రసిద్ధుడైన ఆయన బహుభాషావేత్త, రచయిత. అపర చాణక్యుడిగా పేరుపొందిన వాడు. భారత ఆర్థిక వ్యవస్థ లో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి, కుంటుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకున్న వ్యక్తి. 1957లో శాసనసభ్యుడిగా రాజకీయజీవితం ఆరంభించిన పివి రాష్ట్రమంత్రిగా, ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్ర రాజకీయాలలో కూడా ప్రవేశించి ప్రధానమంత్రి పదవిని సైతం చేపట్టాడు. కాంగ్రెస్ నేతృత్వంలో తగిన సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపించడం అతని ఘనకార్యం.

ఆంధ్ర ప్రదేశ్‌లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలుపెట్టాడు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ లు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండి పాములపర్తి వేంకట నరసింహారావు అయ్యారు. 1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ వందేమాతరం గేయాన్ని పాడారు. దీంతో తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు.

దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుడి ఇంట్లోనే ఉంటూ 1940 నుండి 1944 వరకు ఎల్లెల్బీ చదివాడు శ్రీస్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమంలోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నాడు. బూర్గుల శిష్యుడిగా కాంగ్రెసు పార్టీలో చేరి అప్పటి యువ కాంగ్రెసు నాయకులు మర్రి చెన్నారెడ్డి, శంకరరావు చవాన్, వీరేంద్ర పాటిల్ లతో కలిసి పనిచేసాడు. 1951 లో అఖిల భారత కాంగ్రెసు కమిటీ లో సభ్యుడిగా స్థానం పొందాడు.

- అదరాసుపల్లి శశిధర శర్మ

'అగ్రహారాల' సమాహారం - గోదావరి తీరం

"వేదంలా ఘోషించే గోదావరి" అంటూ ఓ కవి తన భావుకత్వాన్ని చాటుకున్నాడు. గోదావరి నది వేదంలా ఘోషించడమే కాదు. గోదావరి తీరమంతా వేదఘోషకు నిలయమే. గోదావరి నది ప్రవాహంతో సమానంగా వేదనాదామృతం కూడా ఉరకలేసింది. గొప్ప గొప్ప వేదపండితులంతా ఏదో ఒక విధంగా గోదావరిని సేవించినవారే! గోదావరి జల మాధుర్యాన్ని , పవిత్రతను పొందినవారే! ఎంతోమంది వైదిక ఉద్దండులు గోదావరి తీరంలో తమ పాండిత్య ప్రకర్షను నిరూపించుకున్నవారే!

వైదిక పరంపర రక్షణకు తమ జీవితాలనే త్యాగం చేసిన మహాత్ములను ఆనాటి ప్రజలు, ప్రజాపాలకులు ఎంతగానో ఆదరించి గౌరవించేవారని, వారి భక్తి, ప్రపత్తులను ఎల్లప్పుడు చాటుకునేవారని ఏచరిత్ర చూసినా మనకు తెలిసిపోతుంది. ఎన్నో సంస్థానాలు, మరెన్నో ఆస్థానాలు వేదపండితులను పోషించబట్టే ఈనాడు మనం పవిత్ర వేదఘోషను వినగలగుతున్నాము. అలా పండితుల పోషణార్థమై ఇచ్చినవే ఆనాటి అగ్రహారాలు. ఈనాడు వాటి రూపం కేవలం నామమాత్రమే. కానీ ఒకప్పుడు అవి పోషించిన పాత్ర ఎంతో విలువైనది. పవిత్ర గోదావరి పుష్కరాల సందర్భంలో వాటిని తలచుకుని భవిష్యత్తులో ఆయా గ్రామాల వారు కనీసం గుర్తుంచుకునేలా చేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

గోదావరి తీరంలోని వైదిక గ్రామాలు - అగ్రహారాలు

1. స్వర్ణపురి - సోన్

గోదావరి తీరంలోని వైదిక గ్రామాలలో స్వర్ణపురి ఒకటి. ఒకానొక సమయంలో ఈగ్రామమంతా స్వర్ణమయంగా ఉండేదట. అటుంటి సమయంలో పరశురాముడు ఒక యజ్ఞాన్ని ఇక్కడ నిర్వహించగా యజ్ఞంలో పాలొన్న ఋత్విక్కులు ఇచ్చిన సంభావనతో సంతృప్తి చెందక పోవడంతో ఈ గ్రామమంతా శిలలరూపకంగా మారుతుందని పరుశురాముడు శాపమివ్వడంతో అప్పటినుండి ఈ గ్రామమంతా సాలగ్రామ శిలా రూపకంగా మారిందని గ్రామస్తులు చెబుతారు. ఈ స్వర్ణపురినే కాలక్రమంలో సోన్‌గా మారింది.

స్థానికుల కథనం ప్రకారం ఈ గ్రామానికి 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్నట్టుగా మనకు తెలుస్తున్నది. ఒకప్పుడు ఈ గ్రామంలో వేద, సంస్కృత పండితులు విరివిగా ఉండేవారు. ఈగ్రామంలోని బ్రాహ్మణులు ఎక్కువగా మధ్వ సంప్రదాయం కలిగిన వారు.


2. ధర్మపురి

తెలంగాణ ప్రాంతంలో వేదపండితులకు పుట్టినిల్లు ధర్మపురి. కొంతకాలం క్రితం వరకు ఉభయ గోదావరి జిల్లాలోని ఘనపాఠీలు సైతం ఇక్కడికివచ్చి ఇక్కడి పండితుల వద్ద తమవిద్యను ప్రదర్శించి వారి ఆశీస్సులను పొందేవారని అక్కడి పండితులే ఈనాటికి చెప్పుకుంటుండడం వేదవిద్యాభి వృద్ధిలో ఈ గ్రామ వైభవాన్ని తెలియజేస్తోంది. పాలెపు ఘనపాఠి, మధు మాధవ ఘనపారి, మొదలైనవారంతా ఈ గ్రామంవారే.

3. మంత్రపురి - మంథని

సనాతన వైదిక సంప్రదాయాలకు నిలయం ఈ అగ్రహారం. ఇది వ్యాసుడు నడయాడిన ప్రదేశం. ఇక్కడి పండితులు తమ గ్రామంలోకి వచ్చిన పండితులకు చక్కని అతిథి మర్యాదలు చేసి ఆ పండితుల పాండిత్యాన్ని పరిక్షించే వారని, వారుగనుక యోగ్యులైన వారైతే ఘనంగా సన్మానించేవారని ఈనాటికి అక్కడి వారు చెబుతారు. వీధి వీధిన దేవాలయాలకు, ఆహితాగ్నులకు, సోమయాజీలకు, కాశిలో సైతం గుర్తింపు పొందిన శాస్త్ర పండితులకు నిలయం ఈ గ్రామం. ఈగ్రామంలోని పండితులకు ఆనాటి ప్రభువులు ఎన్నో గ్రామాలను అగ్రహారాలుగా దానమిచ్చారు. అలా ఇచ్చిన ఒక గ్రామమే అచ్చలాపురం అగ్రహారం. గోదావరి తీరానికి కాస్త దూరంలో ఉన్నప్పటికి ఎన్నో వైదిక విశేషాలను కలిగి ఉన్నది ఈ అచ్చలాపురం గ్రామం.

కందకుర్తిలో పుట్టి... ఆరెస్సెస్‌ను స్థాపించిన గోదావరి తీరపు ముద్దుబిడ్డ డా॥ హేడ్గేవార్



ఆధునిక భారతంలో అన్నివిధాల పరాజయ మనస్తత్వం వ్యాపించి, నీలినీడల మాటున రాష్ట్రధర్మం ఉనికిని, మనుగడను దాదాపు కోల్పోయిన వేళ రాష్ట్రీయ స్వయంసేవక సంఘాన్ని స్థాపించి, హైందవ జీవన ప్రతిష్ఠకు సాకార రూపాన్నిచ్చిన డా॥ కేశవ్ బలీరామ్ హెడ్గేవార్ గారికి పవిత్ర గోదావరి నదితో ఎంతో దగ్గరి సంబంధమున్నది.

నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామానికి చెందిన సాంప్రదాయ వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన వారే డా॥ హెడ్గేవార్. గోదావరి తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించేది ఇక్కడే. గోదావరి, మంజీర, హరిద్రా నదుల సంగమంతో త్రివేణి సంగమంగా ఇది రూపుదిద్దుకున్నది.

ఈ గ్రామంలోని వేదపండితుడు, ప్రముఖ నిష్ఠాపరుడు శ్రీ బలీరాం పంత్. ఈయన భార్య రేవతీ భాయి. ఈ దంపతులకు **1889** ఏప్రిల్ **1**వతేది చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో జన్మించాడు హెడ్గేవార్.

బలీరాం పంత్ గారి ఆధ్వర్యములో గ్రామంలోని కందకుర్తీశ్వర దేవాలయ పునర్నిర్మానం జరుగుతుండగా స్థానిక మసీదు శిఖరం కన్నా దేవాలయ శిఖరం ఎత్తు ఎక్కువగా ఉండరాదన్న నిజాంపాలకుల శాసనంతో కందకుర్తిని విడిచి నాగపూర్ సంస్థానానికి వలస వెళ్ళింది ఈ కుటుంబం.

అక్కడే లోకమాన్య తిలక్ పిలుపు మేరకు సార్వజనిక గణేశ ఉత్సవాలను ప్రారంభించి తన ఉద్యమ పంథాను ప్రారంభించారు హెడ్గేవార్. ఆ తరువాత **1925**వ సంవత్సరం విజయదశమి రోజున దేశం కోసం సర్వస్వాన్ని సమర్పించే రాష్ట్రీయ స్వయం సేవక సంఘాన్ని స్థాపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు డా॥ కేశవ్ బలీరామ్ హెడ్గేవార్.

---

4. అచ్చలాపురం

మంథనిలోని హరితస గోత్రజుడు, ముద్దు వంశస్తుడు, మంథెన్న రామాయణ కావ్య రచయిత ముద్దు బాలంభట్టు గారి వంశంలోని వారు ఈ అగ్రహారాన్ని దానంగా పొందినారు. ఈ గ్రామం ఆదిలాబాద్ జిల్లాలోని తాండూర్ మండలంలో ఉన్నది. తెలంగాణ ప్రాంతంలో వేదవిద్యకు పెట్టనిపేరు ఈ అచ్చలాపురం. చుట్టుప్రక్కల జిల్లాల్లోని వేదాధ్యయనం చేయాలనుకునే విద్యార్థులకు వెంటనే గుర్తుకు వచ్చేది ఈ ఊరే. 1952లో స్థాపించిన శ్రీ మహాదేవ వేద పాఠశాల నేటికి నిరంతరంగా వేద విద్యార్థులను తయారుచేస్తు వేదమాత సేవలో తరిస్తోంది. ఈ వేదపాఠశాల నుండి నేటి వరకు సుమారుగా 300పైగా విద్యార్థులు అధ్యయనం పూర్తి చేసుకుని ఆయా ప్రాంతాలలో పండితులుగా గుర్తింపు పొందినారు. సనాతన కట్టుబాట్లు ఇంకా ఈ ఊరిలో పాటింపబడుతుండటం చెప్పుకోతగ్గ విశేషం. గ్రామంలోని కేదారేశ్వర స్వామి దేవాలయం అరుదుగా కనబడే కేదారేశ్వర ఆలయాలలో ఒకటి.

ఇలా చెబుతూవెళితే ఎన్నో గ్రామాలు. వాటికి ఎన్నో విశేషాలు. ఆయా గ్రామాల చరిత్రను మరింతగా పరిశీలిస్తే మరెన్నో సంగతులు తెలుసుకొవచ్చు.

– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

వేదపండితులు

అచ్చలాపూర్, జి. ఆదిలాబాద్

సెల్: **9440951366**

పుష్కర వైభవం – ధర్మపురి వైశిష్ట్యం



పుష్కర వైభవాన్ని మన పూర్వీకులైన ఋషులు, మునులు అతి విస్తారంగా ప్రశంసించినారు. కారణం వేదకాలం నుండి జలాల ప్రశస్తిని వారు తమ పరంపరాగత ప్రవచనాల్లో విశిష్టంగా పేర్కొన్నారు. జలం జీవనాధారం. జలంవల్ల శరీరం పవిత్రం అవుతుంది. మాలిన్యాలు ఉద్గారింపజేస్తుంది. అయితే జలాలనందించే జలాధారాల్లో బావులు, జలాశయాలకంటే ప్రవాహసదృశమైన నదులు మరింత శ్రేష్ఠమనే భావనతో నదీమతల్లులను తమ స్తోత్రాలతో స్తుతించినారు. విశేషదినాల్లో స్నానాదులు చేయాలని నిర్దేశించినారు. బ్రహ్మవద్ద నివసించే పుష్కరుణ్ణి బృహస్పతిద్వారా ద్వాదశరాశి చక్రంలో వివిధ ప్రాంతాల నదులలో నివసించేలా చేసి, తద్వారా ప్రజలకు స్నానాదికాన్ని నిర్దేశించి, సర్వమానవకోటి పావనత్వానికి కారణం ఐనారు. నదులన్నీ సర్వశ్రేష్ఠాలే. పుష్కరశోభతో నిలిచేవాటికి ఆయా కాలాల్లో పవిత్రత నాపాదించినారు. ఈ కాలంలో నది విశిష్టత పెరిగి మనుష్యుల స్నానాదికాలే కాక, వారి పూర్వీకుల ఉత్తమగతులకు తర్పణ, శ్రాద్ధాదులు నిర్దేశించినందువల్ల మరింత పావిత్ర్యం ఆపాదించబడింది.

అన్ని నదులకంటే గోదావరికి పుష్కర విశిష్టతకు కారణం, ఇది మధ్యభారతంలో అతి పెద్దది. దక్కను పీఠభూమిపై వేలాది సంవత్సరాలుగా అభివృద్ధి సాధించిన ప్రజల సంస్కృతితో ముడిపడింది. దండకారణ్యమధ్యస్థ గురుకులాలు, ఆశ్రమాలలోని ఋషులు, మునులు తమ పురాణాల్లో ఈ నదీపుష్కర శోభను వేనోళ్ల పొగడినారు. గోదావరి మాహాత్మ్యం, సింహస్థ మాహాత్మ్యం వంటి అనేక బ్రహ్మాండాది పురాణాంతర్గత ఖండ గ్రంథాలు దీని వైశిష్ట్యాన్ని తెలిపాయి. ప్రతిష్ఠానపురం, బాసర, సంగమేశ్వర కందకుర్తి, ధర్మపురి, సప్తగోదావరి, మంథని, కాళేశ్వరం వంటి అనేక ప్రాచీన పుణ్యతీర్థాలు రెండు వేల సంవత్సరాల పూర్వం నుండే జనులను పవిత్రం చేస్తున్నాయి.

కరీంనగర్ జిల్లాలోని గోదావరీ తీరస్థమైన మహాపుణ్యక్షేత్రం ధర్మపురి. ఉత్తరం నుండి దక్షిణాదికి ప్రవహించే గోదావరినది విశిష్టత కారణంగా ప్రసిద్ధ తీర్థంగా, శ్రీలక్ష్మీ నరసింహస్వామి భక్తకోటికి ఇలవేల్పుగా వెలసిన కారణంగా ప్రసిద్ధ క్షేత్రంగా విలసిల్లుతోంది. ఆ కారణంగా ఈ గ్రామం రెండువేల సంవత్సరాలుగా ఈ ప్రాంతాల్లో ప్రసిద్ధమైన అతి ప్రాచీన పుణ్యక్షేత్రం.

ఇక్కడ లభిస్తున్న విస్తార చారిత్రక సంపద దీని ఔన్నత్యాన్ని మరింత పెంచింది. బౌద్ధం కారణంగా వేరుపడ్డ ఈ ప్రాంతం బుద్ధుని సమకాలికంగా ఆ మతం ఆచరణలోకి తెచ్చిన నేల. అనేక పురాణాలు ప్రశంసించిన ప్రాంతం. బౌద్ధం కాలంనాటి అశ్మక దేశంలో భాగం. అనేకులైన రాజులు వివిధకాలాల్లో సమర్పించిన, దానాదిక వివరణలతో మొత్తం నలభై వరకు శాసనాలు లభించిన గ్రామం ఇది.

పశ్చిమ చాళుక్యుల కాలంలోనే నిర్మితమైన నరసింహ, శివాలయాలు సుమారు వేయి సంవత్సరాల క్రితం నాటివి. పశ్చిమ చాళుక్య ఆరవ విక్రమాదిత్యుని శాసనం, కాకతీయ గణపతి దేవుని శాసనం నుండి, 19వ శతాబ్ది చిన్న చిన్న దాతలు వేయించిన శాసనాలు బండరాళ్లపై ఈ గ్రామౌన్నత్యాన్ని చాటిచెప్పుతున్నాయి. గ్రామమంతటా విస్తరించిన అనేక దేవాలయాలు, శిథిల విగ్రహాలు, అమితమైన సుందరశిల్పాలు, గాలిగోపురాలు, ప్రాచీన శిలామంటపాలు, ఇతర దేవతా విగ్రహాలు చరిత్రకు, సంస్కృతికి సాక్ష్యంగా ఉన్నాయి.

ఇక్కడి శ్రీలక్ష్మీనరసింహస్వామి స్థానిక దైవంగా అద్భుత



సుందర స్వరూపంతో విరాజిల్లుతూ భక్తుల కోర్కెలు తీరుస్తూ శతాబ్దాలుగా కొలువై ఉన్నాడు. ఇది మైదాన నారసింహ క్షేత్రం. కొండ లెక్కలేని వృద్ధులకు, వికలాంగులకు అందుబాటులో గుహాలయాల, పర్వతాలపై వెలసే నారసింహుడు ఇక్కడ అందరికీ అందుబాటులో ఉండి కోర్కెలు తీరుస్తున్నాడు. విమతాల విధ్వంసకాండకు గురియైన మొదటి (పశ్చిమ చాళుక్య), నరసింహాలయం 4 శతాబ్దాల తర్వాత 14వ శతాబ్దిలో ధ్వంసమై శతాబ్ద్యానంతరం మసీదుగా మారిపోగా, విధ్వంసాలకు గురి అవుతున్న ఆలయాలు పునర్నిర్మాణమై మొత్తం ఐదు నరసింహాలయాలకు నెలవైంది. మిగతావాటి స్వరూపాలు మారినా ప్రక్కప్రక్కనే రెండు నరసింహాలయాలు జంటగా ఉభయులు యోగనారసింహ రూపమే ఐనా, భక్తులచేత ఉగ్రనారసింహుడు, శాంత నారసింహుడుగా యోగానంద లక్ష్మీనరసింహాలయం (పాతది), కొత్త నరసింహ స్వామి పేర్లతో పూజలందుకొంటున్నారు.

ఇక్కడ గోదావరి దక్షిణవాహిని కుబేరుని దిశయైన ఉత్తరం నుండి సస్యసమృద్ధినిచ్చే జలధనంతో పరుగులెత్తి వచ్చి స్వామికి తీర్థాదులతో సేవించి, యమదిశగా దక్షిణానికి పరుగులెత్తుతుంది.

దక్షిణాభిముఖీ గంగా యత్రదేవో నృకేసరిః ।
తత్రశ్రీర్విజయోభూతిః కాశ్యాశ్శతగుణామహత్ ॥

యమప్రీతిగా మనం దీపాలు వదిలితే మనం నీళ్లలో చేతులతో తోయనవసరం లేకుండా అవే యముని దిశకు జలప్రవాహాలతో బాటు కదిలిపోతుంటాయి. ఈ గ్రామం పడమట ఉన్న కారణంగా ఉదయం భక్తులు నదిలో దిగేముందే ఉదయించే సూర్యుణ్ణి నదీజలాల్లో ప్రతిఫలించే దృశ్యాన్ని మనోహరంగా తిలకిస్తారు.

ఈ నది ప్రాకృతికంగా సృష్టించిన ఇక్కడి అద్భుతాల్లో యమగుండం, బ్రహ్మగుండం, చక్రతీర్థం, వశిష్టగుండం ఇత్యాదిగా నదీలోయల్లో జలాశయాలుగా రూపమిస్తూ ప్రయాణిస్తుంది గోదావరి తల్లి. ఈ గుండాలు పదమూడు శతాబ్దాలకు ముందే మహాకవులు, పురాణకర్తలచే ప్రశంసించబడ్డాయి. వీటితో పురాణకథలు అల్లుకున్నాయి. యమగుండం స్నానం చేస్తే యమలోకం వెళ్లే అవసరం ఇక ఉండదని స్థానిక కథనం. ఇక్కడి ఇసుక తిన్నెలు మనోహరం ప్రకృతి సౌందర్యాన్ని అందించడమేగాక, ఫాల్గుణ బ్రహ్మోత్సవాల్లో వేలాది భక్తులకు పున్నమి వెన్నెట్లో ఆవాస, ఆహార, నిద్రా కేంద్రాలుగా విలసిల్లుతాయి. నదీమధ్యస్థంగా వెలసిన ప్రాకృత శిలావితర్ధిక మీద పంచాయతన ఆలయ సౌందర్యం, దాన్ని ఒరసిపారే నదీ జలాల గలగలలు పోతన మహాకవికే ఇక్కడ భాగవత ప్రేరణ ఇచ్చాయంటే ఇంక సాధారణుల విషయంలో చెప్పేదేముంది? ఈ నదీజలాలు అనాదిగా సాగు, తాగునీటిని అందించడమే కాదు, అత్యంత పవిత్రతతో భక్తుల స్నానాదికాలకు, పిండప్రదాన సంధ్యాది విధులకు అవసరాలు తీరుస్తాయంటే అతిశయోక్తికాదు. ఈ నీరు తాగిన గ్రామంలో జనంలో వందల సంవత్సరాలుగా మహానుభావులు, మేధావులు, అమాత్యులు, గ్రంధకర్తలు, కవులు జగద్విఖ్యాతు లయ్యారంటే అతిశయోక్తి కాదు.

క్రీ.శ. 1725-50ల మధ్య నిర్మాణమైన ఇప్పటి ప్రధాన యోగానంద శ్రీలక్ష్మీ నరసింహాలయంలో స్వామి లక్ష్మీదేవి సమేతంగా కొలువై నరసింహస్వామి అఖండ శిలపై దేవేరి సహితంగా ఆసీనుడై అతివిశాలంగా, అతిపెద్దగా, గర్భాలయంలో దివ్యశోభలతో విరాజిల్లినాడు.

"భూషణ వికాస శ్రీధర్మపురనివాస
దుష్టసంహార నరసింహ దురితదూర!"

అనే మకుటంతో శేషప్ప ఈ నరసింహస్వామినే తన "నరసింహ శతకం"తో తనివిదీరా వర్ణించినాడు. ఈ (భారీ) శోభాయమాన మూర్తిమత్వాన్ని చూసినాక ఇతర నరసింహాలయాలు చూడనక్కర లేదనిపించే అందమైన అసితచంద్ర కాంత శిలావిగ్రహం ఇది.

ఈ ఆలయానికి తోడు, దీని ధ్వంసం కారణంగా నిర్మించిన మరో కొత్త నరసింహాలయం స్థానిక బ్రాహ్మణుడు నిరతాన్నదాన సత్ర నిర్వాహకుడైన పణతుల నారాయణ దీక్షితులు కట్టించి కొత్త నరసింహాలయం. దీన్నే ఉగ్ర నరసింహాలయం అంటారు. స్వామి ఉగ్రత్వాన్ని చల్లబరిచే చందనపు పూతకోసం అక్కడే ఆలయంలో నలుగురు మనుషులు గంధం ఒకేసారి తీయగలిగే పెద్ద గంధపుసాన ఉంది. ఆలయంచుట్టూ అష్టదిక్పాలకు లుండేవారు. ప్రస్తుతం ప్రదక్షిణాపథంలో ఇంద్ర అగ్ని కుబేరుల విగ్రహాలు గణపతి విగ్రహంతోబాటు నిలిచి వున్నాయి.

ధర్మపురిలో అతి ప్రాచీనాలయం రామలింగేశ్వరాలయం. ఇది వేయి సంవత్సరాల క్రితంది. పశ్చిమచాళుక్య కాకతీయ శాసనాలున్నాయి. ఆలయం సువిశాలం. ముఖద్వారం చాలా అందంగా తూర్పున ప్రవేశించే చోట ఉంది. శత్రువులపై దాడికి సైనికులు నిలిచే నిలువెత్తు ప్రభూణాలున్నాయి. ద్వారం పక్కస్తంభం – నంది స్తంభం 12 అడుగుల ఎత్తుతో గంభీరంగా ఉంది. ప్రాంగణంలో మూడు దిశల ద్వారాల్లో 3 నందులు శిల్పశోభితాలు. ప్రాచీన మూల శివలింగంతోబాటు 5 అడుగుల మరో అందమైన కాకతీయుల కాలపు శివలింగం బయట ఉంది. నిత్యం స్థానికులైన బ్రాహ్మణుల వేదఘోషలతో మారుమ్రోగే ఈ శివాలయ సౌందర్యం చూసి తీరవలసిందే. ప్రధాన ద్వారంకు కుడివైపున కూర్చున్న 7 అడుగుల భారీ గణపతి విగ్రహం బాదామీ చాళుక్యుల కాలంనాటిది. గణపతి దేవుని శాసనంతో ఈ ఆలయం రామలింగేశ్వరాలయంగా పేర్కొనబడింది. ఈ శివాలయం నరసింహాలయాల సముదాయానికి వెలుపల ఉంది.

నరసింహాలయాల సముదాయం రెండు నరసింహాలయాలతో బాటు తూర్పున నేడు మసీదుగా మారిన ప్రాచీన నరసింహాలయం, వేంకటేశ్వర వేణుగోపాల ఆలయాలున్నాయి. శ్రీవేంకటేశ్వర ఆలయం ఒకప్పటి నరసింహాలయమే. దీనికి 60 స్తంభాల గుడి అని పేరు. క్రీ.శ. 16వ శతాబ్ది నిర్మాణం. దీని వెనుక వేణుగోపాల ఆలయం. భూంపల్లి చలం అనే భక్తుడు 1803లో కట్టించింది.

గోదావరి, ఆలయాలతోబాటు చూడదగిన మరో ప్రాచీన కట్టడం కోనేరు. సువిశాలమైన జలాశయంగా, నలుదిశలా తీర్చిదిద్దిన రాతిమెట్లతో , వెలుపలి తూములతో కోనేటి జలాలమధ్యలో భోగమంటపంతో క్రీ.శ. 16వ శతాబ్ది నాటి జూపల్లి ధర్మారాయుడు, చింతల నరుసబోయిలు నిర్మించి వేయించిన శాసనాలతో తళతళలాడే జలాలతో ముగ్ధమనోహరంగా ఉంటుంది. ఇది ఊరి మధ్యలో ప్రాచీన (నేటి మసీదు) నరసింహాలయం ముందున్న నిర్మాణం.

దీనికి నైఋతి దిశలోగల సత్యవతి ఆలయం ఊర్లో చూడదగ్గ మరో విశేషం. ఈ సత్యవతి ఒకనాటి రాచకూతురు, నేటి బతుకమ్మగా కొలువబడే ఒక పతివ్రత (భక్తురాలి) ఆలయం. దేవాలయం మధ్యనుండి నిలువెత్తు 30 అడుగుల రాతిస్తంభం ఆకాశంలో నంది మంటపం కిరీటంగా గల స్తంభం కలది. ఈ రాతి స్తంభం సత్యవతీదేవి తన పాతివ్రత్యాన్ని నిలుపుకొనుటకు సాక్ష్యంగా పైకి ఇసుక చల్లితే చల్లిన ఇసుక సాక్ష్యంగా నిలిచేలా నారసింహుడు స్తంభంగా మార్చినాడని స్థానిక కథనం. ఇది నేడు ఇసుక స్తంభం అని పిలువబడుతుంది. దీని ముందర అందమైన రాతిమంటపం ఉంది. దీనిపై ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా వచ్చినపుడు స్వామి ఉపవిష్టుడు కాగా వేదసదస్సు జరుగుతుంది.

విజయనగర సామ్రాజ్యాన్ని శంఖుస్థాపన చేసిన విద్యారణ్యుడు, వేదాలకు భాష్యం రాసిన అతని తమ్ముడు సాయణుడు, మహారాష్ట్ర దేవగిరి యాదవరాజులకు ఆర్థికమంత్రిగా వ్యవహరించిన హేమాద్రి పండితుడు, పుష్టిమత ప్రవక్త వల్లభాచార్యులు, చిత్రభారత కృతిభర్త, ఓరుగల్లుకు మహామాత్యునిగా పనిచేసిన ఎనుములపల్లి పెద్దనామాత్యుడు, వామనభట్ట బాణుడు, శేషప్ప మొ।। మహాకవులు, మహామంత్రులు, ఆధ్యాత్మికవేత్తలు పుట్టిన ఊరు. పింగళి సూరన, కొరవి గోపరాజు వంటి మహాకవులు తమ కావ్యాలలో కథను నడిపిన ఊరు.

అటు ఆధ్యాత్మికక రంగంలో, ఇటు సాహిత్యరంగంలో, అటు పాలనారంగంలో, మహామహులైన వ్యక్తులకు జన్మనిచ్చిన ఈ ధర్మపురి గ్రామం వేద, సంస్కృతులకు, ఆర్ష సంస్కృతికి, ప్రాచీన హిందూ సభ్యతకు అనాదిగా కాణాచిగా, అభివృద్ధి కేంద్రంగా వెలసిన పుణ్యక్షేత్రం నేడు లక్షలాది భక్తులను తరింపచేస్తుంది. ఫాల్గుణ మాసంలో ప్రతియేటా బ్రహ్మోత్సవాలు జరుపుకొనే ఈ హరిహరక్షేత్రం హిందూమత చైతన్యానికి ఎత్తిన సజీవ పతాకం.

చారిత్రక పరిశోధకులు, కవి, విశ్రాంత ప్రధానాచార్యులు

- డా॥ సంగనభట్ల నరసయ్య

9440073124

వేదశాస్త్ర సంప్రదాయ ధామం – ధర్మపురి

తెలంగాణలో ప్రాచీనకాలంనుండి ముని ఆశ్రమంగా, పుణ్యభూమిగా, వేదభూమిగా పరమపావన ధామంగా ప్రకాశిస్తున్న పుణ్యక్షేత్రం ధర్మపురి. మూడువేల సంవత్సరముల చరిత్ర కల్గి, బౌద్ధం, శైవం మొదలైన మతాలకు నిలయమై, శాతవాహన కాలంలో ప్రసిద్ధిని పొంది నాటినుండి నేటివరకు చరిత్రకు, సంప్రదాయమునకు తరగని నిధిగా వెలుగొందుతున్న తీర్థక్షేత్రం ధర్మపురి. ఇక్కడి విశేషం ఏమిటంటే భూస్వాములంతా బ్రాహ్మణులే. 400కు పైగా బ్రాహ్మణ కుటుంబాలు కల్గి ఆదర్శవంతమైన, సమాజహితకరమైన, ధార్మికమైన జీవితం గడిపేవారు ఇక్కడి బ్రాహ్మణులు. బ్రాహ్మణుల అడుగుజాడల్లో మిగతావారు నడిచేవారు. ఈ క్షేత్రంలో ఆలయసముదాయం చుట్టూ బ్రాహ్మణ గృహాలే. హిందూ ధర్మానికి పునాది అయిన బ్రాహ్మణ వ్యవస్థ ఒకప్పుడు ఈ క్షేత్రంలో ప్రధానంగా ఉండేది.

ఇక్కడి బ్రాహ్మణ సంస్కృతి, జీవనవిధానం భాష చరిత్ర పుటల్లో లేకుండా ఇప్పటికి నిలిచి ఉండటం విశేషం. పురాణపరంగా చూస్తే గౌతమమహర్షి ఈశాన్యభాగంలో తపస్సు చేసినాడు. అదే గౌతమేశ్వరాలయం. దత్తాత్రేయులవారు ఈనాటికి ఇక్కడ సంచారం చేస్తారని ప్రతీతి.

ప్రశాంతమైన వాతావరణం, గోదావరితీరం, పుణ్యప్రదమైన ఆర్షజీవనవిధానం, సాత్వికమైన తపోజీవనం నియమనిష్ఠలుగల వ్రతాదులతో ఇక్కడి బ్రాహ్మణులు సంప్రదాయాలకు నిలువెత్తు రూపములుగా ఉండేవారు. వేదానికి నిలయంగా ధర్మపురి గ్రామం ప్రసిద్ధి చెందింది. వేదాధ్యయనమే కాదు, వేదమును ప్రయోగించటంలో కూడా పారంగతులైనవారు ఉండేవారు. ఒకసారి కర్ణాటక ప్రాంతం నుండి వేదపండితులు ధర్మపురి గ్రామమునకు వేసవిలో వచ్చారు. మధ్యాహ్నవేళ వారికి దాహమయితే బ్రాహ్మణవీధిలో వేదం వల్లించుకుంటు వెళ్తున్న చిన్న కుర్రవాడిని మంచినీరు అడుగగా, ఆ కుర్రవాడు ఆశ్చర్యంతో ఆ పండితులను చూచి 'మీకు వరుణమంత్రం' రాదా? అని అడిగినాడు. దానికి వారు మాకు ఆ మంత్రం వచ్చు అని సమాధానం చెప్పినారు. అయితే నన్నెందుకు మంచినీరు అడుగుతున్నారు అనగా వారు తెల్లబోయి చూస్తుండగానే, ఆ పిల్లవాడు కన్నులు మూసుకొని వరుణమంత్రం జపించి ఒక చిన్న రాయిని తీసి భూమిమీద కొట్టగా పాతాళగంగలాగా స్వచ్ఛమైన జలం వచ్చింది. ఆ పిల్లవాడి మంత్రబలమును చూచిన కర్ణాటక పండితులు ఆశ్చర్యపోయినారు. అనగా ఆనాడు ధర్మపురి గ్రామంలో నిష్ణాతులైన మంత్రదీక్షాపరులు ఉండేవారు.

విద్యారణ్యస్వామివారు విజయనగర సామ్రాజ్య శంఖుస్థాపన కోసం చతుర్వేద పండితులను ధర్మపురి నుండి ఆహ్వానించాడు. సాయణుడు సాయనభాష్యంలో ఋగ్వేదమునకు ఇక్కడి నరహరి శ్రోత్రుల సహాయం తీసుకున్నాడు. మధుమహాదేవ ఘనాపాఠి, మధుహన్మంతు ఘనాపాఠీ, పాలెపు నరసింహ ఘనాపాఠీ మొదలైన ఎంతోమంది ఘనాపాఠీలు ఇక్కడ అవతరించారు. వేదములో సంహిత, పదం, క్రమం, జట, ఘన అని అధ్యయన విధానాలు ఉన్నాయి. వీటిలో 'ఘన' చాలా కష్టం. మొత్తం మూలమును ఘనతో చదివించే ఘనాపాఠి ఇటువంటి 'ఘన' ధర్మపురిలో పుట్టిందని, ఘనాపాఠిలకు నిలయం 'ధర్మపురి' అని చెబుతారు. ధర్మపురి బ్రాహ్మణులు వేదపఠనంలో అనేక పద్ధతులు పాటించేవారు. స్వస్తివిధానం, నేత్రావధానం, ఓంకారావధానం, శ్రోతృనామావధానం మొదలైనవి చాలా ఆకర్షణీయంగా ఉండేవి. సంగనభట్ల వంశీకులు అగ్నిష్టోమ, చయన, వాజపేయములను చాలాసార్లు ధర్మపురిలో నిర్వహించినారు.

వేదమే కాదు, భాగవతాది ఇతిహాస పురాణములను ప్రవచించు చాలామంది పౌరాణికులు ఇక్కడ ఉండేవారు. గుండి రాజన్నశాస్త్రిగారు అనే మహాపండితులు 18000 శ్లోకముల శ్రీమహాభాగవత పురాణమును కంఠస్థంగా చెప్పేవారు. సంగనభట్ల మాణిక్యశాస్త్రిగారు, కాకరి లక్ష్మీకాంత శాస్త్రిగారు, రొట్టె చంద్రశేఖరశాస్త్రిగార్లను "పౌరాణిక త్రయం"గా పిలిచేవారు. "చతుర్వర్గ చింతామణి" అనే ప్రసిద్ధ స్మృతి గ్రంథం వ్రాసిన 'హేమాద్రి పండితుడు' ఈ గ్రామం నుండే వెళ్లినాడు. వేదంలో 'మాడుగుల రామక్రిష్టయ్య, మధుహన్మంతు శాస్త్రి, పెద్దమహాదేవు, సంగనభట్ల లక్ష్మీనరహరి శ్రౌతులు, సంగనభట్ల రామక్రిష్ణ ఘనాపాఠి, పాలెపు నరసింహ ఘనాపాఠి, ఈ ఆరుగురిని 'షడ్రధికులు' అనేవారు. భారతదేశంలో ఎవరైనా

వేదపండితుడిని 'ధర్మపురి వెళ్లావా, షడ్రధికులు నిన్ను అంగీకరించారా? వారికి నీ ఘనాపాఠం వినిపించావా' అని అడిగి, వెళ్లానంటేనే పండితుడిగా అంగీకరించేవారు. నృసింహతాపనీయ ఉపనిషత్తులోని "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం, నృసింహం భీషణం భద్రం మృత్యోర్మృద్రుం నమామ్యాహం" అనే మంత్రమునకు సాకారక్షేత్రం ధర్మపురి. 'మృత్యోఃమృత్యుం' అనగా యమధర్మరాజుకు కూడా మృత్యువు శ్రీనృసింహుడు ఇక్కడే ఉన్నాడు. అందుకే ఇక్కడ స్వామివారిని దర్శించటం కంటే ముందుగా వాకిట్లో 'యమధర్మరాజు'ను దర్శించి తదుపరి నృసింహ దర్శనం చేసుకుంటారు.

యముడి దిక్కు దక్షిణం. అందుకే విచిత్రంగా ఈ క్షేత్రంలో గోదావరినది ఉత్తరం నుండి దక్షిణంవైపు ప్రవహిస్తుంది. 'ధర్మపురికి వస్తే యమపురి లేదు' అనేది ప్రసిద్ధమైన నానుడి.

వేదం, శాస్త్రం, పురాణం ఈ మూడింటికి ధామంగా ఈ 'ధర్మపురి గ్రామం ప్రకాశిస్తున్నది. ఇటువంటి ఈ పరమపవిత్ర క్షేత్రంలో పుట్టడం ఒక గొప్ప యోగం, అట్టి యోగాన్ని పొందిన నేను మా తాతగారు శ్రీ మాణిక్యశాస్త్రిగారిలాగా పౌరాణికుడిగా జీవితం గడపటం మహదానందంగా భావిస్తూ ఈ గోదావరి పుష్కరములలో జులై 18వ తేదీ నుండి 7 రోజులపాటు "పుష్కర భాగవత సప్తాహజ్ఞానయజ్ఞం" నిర్వహిస్తున్నాను. ఆస్తికులైన ప్రతీ ఒక్కరిని మా ధర్మపురి క్షేత్రాన్ని దర్శించి పుష్కరములలో గోదావరి స్నానమునకు ఆహ్వానిస్తూ, ఇటువంటి మంచి అవకాశమును ఇచ్చిన మా మిత్రులు దర్శనం వెంకటరమణశర్మగారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

శ్రీశృంగేరి ఆస్థాన పౌరాణికులు

– డా॥ బాచంపల్లి సంతోషకుమారశాస్త్రి

సాహిత్యంలో ధర్మపురి

మహాకవులు అనేకులు సంస్కృతాంధ్రాల్లో వ్రాసిన తమ గ్రంథాల్లో ధర్మపురి వైశిష్ట్యాన్ని పేర్కొన్నారు. భవభూతి తన ఉత్తరరామ చరితలో గోదావరి నదిలోని సీతా తీర్థమనే గుండం ధర్మపురిలోనిది.

నరసింహసూరి అనే కవి ప్రయోగపారిజాతమనే గ్రంథం వ్రాశాడు. ఈయన ధర్మపురికి చెందినవారు. ఇతడు 14వ శతాబ్దమునకు చెందినవాడని చెప్పవచ్చు.

మహాకవి బమ్మెర పోతనామాత్యునకు ధర్మపురితో సంబంధం ఉంది. పోతన తను వ్రాసిన నారాయణ శతకములో ధర్మపురి నరసింహుని మీద ధర్మపురి లక్ష్మీనాథ నారాయణ అనే మకుటంలో కొన్ని శ్లోకములు రచించినారు.

చరిగొండ ధర్మన్న ధర్మపురివారు. ఈయన వ్రాసిన చిత్రభారతం అనే అనే కావ్యంలో కొన్ని పద్యాలు ధర్మపురి నరసింహస్వామి మీద వ్రాసినవి ఉన్నాయి. పింగళి సూరన తన కళాపూర్ణోదయం (కల్పితకథలోని కొంత కథను ధర్మపురి గ్రామంలో నడపడం విశేషం.

శేషప్ప కవి ధర్మపురి కవులలో ప్రముఖుడు. ఇతడు నరసింహ శతకం రచించారు.

ఇంకను వీరేకాక పంపకమహాకవి, హేమాద్రి, మడికి సింగన, సర్వప్ప, విద్యారణ్యస్వామి, విశ్వనాథ సత్యనారాయణ మొదలగు మహాకవులు తమ కావ్యాలలో ధర్మపురి ప్రాశస్త్యము గురించి వ్రాసినారు.

విఖ్యాత సంస్కృత పండితుడు, , అభినవ చిన్నయసూరి బిరుదాంకితులు కొరిడె రాజన్నశాస్త్రిగారు ధర్మపురి వాస్తవ్యులే. అలాగే కొరిడె నర్సయ్యగారు ప్రముఖ హిందీ పండితుడు, భాగవతంపై హిందీలో పరిశోధన చేశారు. ప్రముఖ న్యాయవాదులు. వీరు ధర్మపురి నుండి వచ్చిన ప్రప్రథమ న్యాయవాది. ధర్మపురి చరిత్రను హిందీలోకి అనువదించినారు.

గేయ సాహిత్యంలో కూడ ధర్మపురి చాల విశిష్టమైనది. ధర్మపురి నారసింహుని బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు గోదావరినదిలో స్నానమాచరించి భక్తితో పాడుకునే స్తుతిగేయాలు మనను మంత్రముగ్ధల్ని చేస్తాయి.

ఉదా: కోనేట్లో స్నానాలయో ఓ నర్సయ్య
కొబ్బరి బెల్లాలయ్యో ఓ నర్సయ్య
గంగదాటి మేమొస్తిమి ఓ నర్సయ్య

ధర్మపురి లక్ష్మీనరసింహ నాట్యమండలి (1936 నుండి నాటకములు వేస్తున్నది) కొరకు వ్రాసిన పాటల్లో స్వామివారి స్తుతి ఉన్నది. ఒక పాట తెర ఎత్తి ముందు పాడేది.

జయ విచిత్ర వేషధారి	సుమతినంత సూత్రధారి
సురరిపు సుత వాక్యధారి	జయసుమ భక్త విహారి
అరిభంజన దృతరంజన	కంజనయన! కృష్ణహారి

రాక్షస ప్రభు సంహారి జయ సుమ భక్త విహారి
వరధర్మపురి నృసింహా నాట్యమండలి సుఖకారి
దుష్టహారి సృష్టికారి రాక్షససుత వరదాయ

ఈవిధంగా పౌరాణిక గేయాలు, గంగపాట, చారిత్రిక గేయాలు, స్తుతి గేయాలు, భజనగేయాలు (కాకిరి లక్ష్మీకాంత శాస్త్రి మంగళహారతులు....)

పండుగల పాటలు ఈవిధంగా గేయ సాహిత్యంలో అత్యంత విలువైన గేయసంపద ధర్మపురిలో ఉన్నదని చెప్పుట అతిశయోక్తి కాదు అని చెప్పవచ్చు.

ధర్మపురిలో వేదపాఠశాల, శ్రీలక్ష్మీనరసింహ సంస్కృత ఆంధ్ర కళాశాల

కళాసంస్థలు

ధర్మపురిలో వేదవిద్యలతో పాటుగా కళలకు కూడ ఎనలేని ప్రోత్సాహం ఉన్నది.

బాచంపల్లి రామయ్య, చాచం కిష్టయ్య వంటి సంగీత విద్వాంసులు పుట్టిన ఊరు.

చాచం కిష్టయ్య క్రీ.శ. 1917-1978 "తెలంగాణ త్యాగరాజు"గా పేరొందినవారు. వీరు యావదాంధ్ర దేశం కచేరీలు చేసినారు.

వారు ఎందరికో విద్యాదానం చేసినారు. వీరివల్ల పలువురు సంగీత విద్వాంసులై ప్రసిద్ధులైనారు.

శ్రీలక్ష్మీనరసింహ నాట్యమండలి

1936లో ఈ సంస్థ స్థానిక స్వామి పేరుతో ప్రారంభమైనది. తెలంగాణలో మొదటి నాటక సంస్థ ఈ నాట్యమండలిని కీ.శే. కాసర్ల వెంకటరాజయ్య గారు వారి మిత్రబీందం ఈ మండలిని స్థాపించినారు.

కాసర్ల వెంకటరాజయ్యగారి దర్శకత్వంలో నాటకాలు నడిచాయి. ద్రౌపది వస్త్రాపహరణం, భక్తప్రహ్లాద, తులాభారం, లవకుశ, గయోపాఖ్యానం, ధీర వంటి నాటకాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించి మన్ననలు పొందినారు.

ఈ నాట్యమండలి ఈతరం నటులు కొరిడె నరహరి, కాకర్ల దత్తాత్రేయ, సంగనభట్ల కిషన్, నర్సయ్య, రామకిష్టయ్య వంటి నటులతో వీరపాండ్య కట్టబొమ్మన, దక్షయజ్ఞం, కృష్ణరాయ బారం మరియు సాంఘిక, చారిత్రక నాటకాలు ప్రదర్శించేవారు.

ఈవిధంగా ధర్మపురి క్షేత్రం ఆధ్యాత్మిక, సంగీత, సాహిత్య, వైదిక, నాటక, కళారంగాలలో ఈ తీర్థక్షేత్రం విరాజిల్లుతూ యుండెడిది.

-సంగనభట్ల లాస్యప్రియ

పుష్కర సమయంలో దానాలు-విధులు

1వ రోజు : అన్నదానం, సువర్ణదానం, రజత దానం, భూదానం, ధాన్యదానం ప్రాధాన్యం వహిస్తాయి.

2వ రోజు : ధనికులు వజ్రవైఢూర్య రత్నదానం, స్త్రీ పురుషులకు వస్త్రదానం, లవణదానం, గోవత్స (ఆవుదూడ) దానం కూడా చేస్తారు.

3వ రోజు : వెండి బొమ్మ, పండ్లు, కూరలు, బెల్లం మాత్రమే కాక అశ్వదానం కూడా సూచించబడింది.

4వ రోజు : పాలు, పంచదార, తేనె, ఆవునెయ్యి, వెండి, వెండి బొమ్మ, రెండు జతల వస్త్రాలు దానం చెయ్యటం విధి.

5వ రోజు : చిన్న వెండి నాగలి, రెండు రకాల ధాన్యాలు, బంగారు బొమ్మ, రెండు జతల వస్త్రాలు, గేదె, దున్న, చిన్నబండి, నాగలి దానం.

6వ రోజు : వెండి, బంగారం, ధనం, గంధపుచెక్క, మంచి గంధం, ఓషధీ మూలికలు, కర్పూరం, కస్తూరి.

7వ రోజు : భూ, గృహ, ఆసన, వాహన, పీఠాదులు, పల్లకి దాన వస్తువులు.

8వ రోజు : పూలు, అరటిపండ్లు, పనసపొట్టు, అల్లం, మంచి గంధపు చెక్కలు, వెండి, ధనము, సద్గంధాలు, దాన యోగ్యములు.

9వ రోజు : పితృదేవతలకు పిండ ప్రదానం, ఇతర యోగ్యులకు సువర్ణదానం, పరిచారక దానం, కన్యాదానం, చామరదానం, వస్త్రదానం.

10వ రోజు : వెండి, బంగారాలు, వస్త్రాలు, పూలు, ముత్యాలు, శివపార్వతి పూజ, లక్ష్మీకేశవ పూజ, గౌతమీనదీ పూజ చేస్తూ దానం చేయాలి.

11వ రోజు : వెండి జందెం, నూలు జందెం, సద్గంధాలు, వస్త్రాలు, సువర్ణ తాంబూలం, సంపద, ఓపిక ఉంటే గుఱ్ఱాన్ని, ఏనుగును కూడా దానం చేయవలసి వుంటుంది.

12వ రోజు : షోడశ మహాదానాలు సూచించబడినాయి. 1. గోదానం 2. భూదానం 3. తిలదానం 4. హిరణ్యదానం (బంగారం) 5. రత్నదానం 6. విద్యాదానం 7. కన్యాదానం 8. దాసీ దానం 9. శయ్యాదానం 10. గృహదానం 11. అగ్రహార దానం 12. రథదానం 13. గజదానం 14. అశ్వదానం 15. ఛాగదానం (మేకపోతు) 16. మహిషీదానం.

ఈ దానాలు సంప్రదాయ పద్ధతిని సూచిస్తాయి. వారి వారి అభీష్టాన్ని బట్టి, సౌకర్యాన్ని బట్టి దానవిధులు నిర్వర్తించటం కద్దు.

❖ ❖ ❖

ప్రాచీన మహానగరం - కోటిలింగాల

కోటిలింగాల తెలంగాణలోని అతి ప్రాచీన మహానగరాలలో ఒకటి. ఇది శాతవాహనుల తొలిరాజధాని క్రీ.పూ. 3,4 శతాబ్దాలనుండే ఆంధ్రులకు రాజధాని. ఆంధ్రులనబడే ఒకజాతి రాజులు ఈ నేలను కోటిలింగాల రాజధానిగా ఏలినారు. వారిలో సమగోప, నరన, గోబద అనే రాజులు ప్రముఖులు. వీరి పేరిట నాణెములు ముద్రింపబడినవి. అది కోటిలింగాల తవ్వకాలలో లభించాయి. ఒకరోజు పేరిట నాణెం సమస్త భారతదేశంలో ఎక్కడా లభించని కాలంలో కోటిలింగాలలో మాత్రమే లభించడం విశేషం. అంతేకాదు ఈ రాజులకు శాతవాహనులు 'ఆంధ్రభృత్యులమ'ని (సేవకులమని) చెప్పుకొన్నారు. బహుశ వీరిని తరువాతి కాలంలో తోసిరాజని, లేదా ప్రతికూల పరిస్థితులలో రాజ్యభారం స్వీకరించారు.

శాతవాహనుల సామ్రాజ్య స్థాపకుడు శ్రీముఖుడని పురాణాలు ఘోషించాయి. ఆ రాజు నాణెములు కోటిలింగాలలో పుష్కలంగా లభించాయి. ఈ రాజు నాణెములు మరెక్కడా లభించకపోవడంవల్ల శాతవాహన రాజవంశం ఇక్కడే ప్రారంభం ఐందని చెప్పవచ్చు. ఈ కోటిలింగాల తవ్వకాలలో గర్భనగరం బయట పడింది. అనగా నాటి నగరం యొక్క ఆనవాళ్లు కోటిలింగాలలో మట్టిని తవ్వగా లభించాయి. నాగరికత విలసిల్లిన గొప్ప నగరం ఏలిన రాజులు ఏ మతం వారో చెప్పటానికి ఇంకా ఆధారాలు లభించకున్నా శాతవాహనులు తొలుత బౌద్ధాన్ని ఆదరించారని తెలుస్తోంది. బుద్ధునికి సమకాలికంగానే బౌద్ధం ఈ ప్రాంతంలో ఆచరణలో ఉంది.

శాతవాహనుల తరువాత కోటిలింగాల చరిత్ర మరుగున పడింది. ఐతే ఇది తిరిగి ఈ ప్రాంతాన్ని ఏలిన పశ్చిమ చాళుక్యుల కాలంలో వెలుగులోకి వచ్చింది. పశ్చిమ చాళుక్యులలో ఒక శాఖయైన వేములవాడ చాళుక్యులు మరియు కొలనుపాక నేలిన చాళుక్యులు ఈ ప్రాంతం నేలినారు. వేములవాడ చాళుక్యులు జైనమతాన్ని ఆదరించారు. పశ్చిమ చాళుక్యులు మాత్రం శైవాన్ని బాగా ఆదరించి ఉత్తర తెలంగాణలో అనేక శివాలయాలు నిర్మించారు. అలాంటిదే కోటిలింగాలలో కూడా ఉంది. ఇది త్రికూటాలయం. దీన్ని నిర్మాణానికి సంబంధించిన శాసనం ఏదీ ప్రస్తుతం లభించట్లేదు. కాని ఇది శిథిలమైన ఆలయం. త్రికూటాలయమైన దీనిలో రెండు కూటాలున్నా, గోదావరి వైపు కూటం కూలిపోయింది. శివలింగం మాత్రం మిగిలింది. బహుశ ఈ వై పే శాసనం ఉండి, వరదల్లో భూగర్భస్థం అయ్యుంటుంది. నాటికీ ప్రాంతం హిందూమతం ఆచరణలోనికి వచ్చిందని చెప్పవచ్చు. వేములవాడు చాళుక్యుల కాలంలో ప్రసిద్ధిగన్న ధర్మపురి ఈ రేవుకు ఎగువన గోదావరి ఒడ్డున ఉంది. నేడిది గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం. నరసింహాలయం 11వ శ. నాటికే ప్రసిద్ధం. దిగువనగల మంథని కాకతీయుల కాలంలో అంటే 2 శ. తరువాత చాలా ప్రసిద్ధి గాంచింది. దీన్ని బట్టి ఈ ప్రాంతంలో బౌద్ధం ప్రాబల్యం శాతవాహనులకు తదనంతరంగా తగ్గిందనవచ్చు. శాతవాహనులలో ఆఖరి ప్రసిద్ధులైన రాజులలో గౌతమీపుత్ర శాతకర్ణి వంటివారు యజ్ఞయాగాదులు నిర్వహించి వైదికమతోద్ధారణ గావించినారు.

క్రీ.శ. 2వ శతాబ్ది తరువాత రచింపబడిన పురాణాల్లో శాతవాహన వంశం వర్ణించబడింది. హిందూమతం క్రీ.శ. 5శ. ప్రాంతంలో బాగా వేళ్లూనింది. ఈ కోటి గ్రామం, ఈ గ్రామం పేరుతోగల రాజ్యంలో శైవం కారణంగా ఈ గ్రామానికి కోటిలింగాల అని పేరు వచ్చింది. శివాలయం కారణంగా ఈ తీరాన్ని కోటిలింగాల తీరం అన్నారు. అంతేకాని ఇక్కడ కోటి సంఖ్యలో లింగాలున్నాయన్న అర్థం కాదు. కాలక్రమంలో అదో గొప్పగా భావించి, ఇక్కడినుండి ఇతర ప్రాంతాలకు వలసవెళ్లినవారు ఆ ప్రాంతాల్లో కోటిలింగాల గ్రామాలను ఏర్పర్చినారు. కోటి పేరుతో కోటిపల్లి అనికూడా గ్రామనామాలు వచ్చాయి. సహస్రలింగాల అని రేవులు పేర్లు స్థిరపడ్డాయి. కాని కోటిలింగాలలో మాత్రం కోటి అనే ఊరులోని లింగం కల రేవు అనే అర్థమే చారిత్రక సత్యం.

హిందూమతం వేళ్లూనడానికి పూర్వం ఇక్కడి గోదావరి తీరం విదేశీ వ్యాపారానికి ఉపయోగపడింది. హిందూమతం అభివృద్ధి ఐనాక నదీప్రాశస్త్యం ఋషుల, మునుల కారణం పెరిగి పురాణస్థం అయ్యింది.



శాతవాహనుల రాజధాని


కరీంనగర్ జిల్లా కేంద్రమైన కరీంనగర్ పట్టణానికి 50 కి.మీ. దూరంలో వెల్లటూరు మండలంలో గోదావరి నదికి దక్షిణదిశవైపు గ్రామమే కోటిలింగాల. ఇది చరిత్రకారులు భావిస్తున్న శాతవాహన రాజ్యపు తొలి రాజధాని, తెలుగువారి అతి ప్రాచీన నగరం ఒక వంద ఎకరాల స్థలంలో గోదావరి నదిలో పెదవాగు సంగమించే చోట ఉంది. పడమటి నుండి తూర్పుగా ప్రవహించే గోదావరిలో దక్షిణం నుండి వచ్చే పెదవాగు నిరంతరం నీటితో తూర్పు వైపుకు తిరుగుతూ సంగమించడం వలన మూడు వైపుల ప్రవాహంతో కోటిలింగాల ద్వీపకల్పం మాదిరి జలదుర్గంగా రూపొందినది. పెదవాగు – గోదావరి తీరం వెంబడి ఉన్న 300 మీటర్ల కోటగోడ శిథిలాలు నాటి చరిత్రకు ఆనవాళ్లుగా నేటికీ దర్శనమిస్తునా&ఉనయి. కేవలం శాసనాల్లో లభించిన శాతవాహన రాజు శ్రీముఖుని నాణెములు ఇక్కడ పదులకొద్దీ లభించాయి. ఇవేకాక ఇంకా అనేక రకాల నాణేలు ఇక్కడ లభిస్తుండడం వలన ఈ ప్రదేశంలో రాష్ట్ర పురావస్తు శాఖ వారు క్రీ.శ. 1979-84 సం॥ మధ్యన జరిపిన త్రవ్వకాల్లో ప్రాచీన నగరం వెలుగులోనికి వచ్చింది.

ఈ త్రవ్వకాల్లో 2.5 మీటర్ల లోతున ఆవాసాలు బయల్పడినవి. అనేక అమూల్యమైన నాణెములు లభించాయి. ఇక్కడ లభించిన నాణెములు 1.78 మీటర్ల లోతున 'రాజ్ఞోసామపగొప' నాణెములు, 1.,30 మీ. లోతున శ్రీశాతవాహన నాణెములు, 1.22 మీటర్ల లోతున శ్రీశాతకర్ణి నాణెములు, 0.38 మీటర్ల లోతున 'చిముకుని' (శ్రీముఖుని) నాణెములు లభించినాయి. 'ఒకటవ పులుమావి; మహాసేనాపతి' సగమన; 'కంవామసిరి' నాణెములు, 'మహతలవర', 'సిరినారన' నాణెములు, ఉపరితలంలో లభించాయి. ఇవేగాక విద్ధంక (పంచ్ మార్క్డ్) నాణెములు, రాతలు లేని ఏక్కలు ఎక్కలుగల నాణెములు మహారధి, 'మహాగ్రామిక', 'శివసేబక', 'సాదకస' పేర్లు గల నాణెములు దొరికాయి. పునర్ముద్రితాలు, సగం తయారైన నాణెములు లభించుటవలన ఇక్కడ నాణెములు ముద్రణాలయం ఉండేదని చెప్పవచ్చు. బంగారం, రాగి, సీసంతో తయారైన నాణెముల వలన ఇక్కడ కోశాగారం ఉండేదని పండితులు పేర్కొంటున్నారు.

నానాఘాట్ శాసనంలో పేర్కొన్న శ్రీముఖుడు ఇక్కడ రాజ్యస్థాపన చేసి పరిపాలించినట్లుగా ఈ నాణెముల వలన రూఢీ అయినది. ఇతనికి ముందు రాజుల పేర్లతో ఇక్కడి భూమి లోతు పొరల్లో గోభద్ర, సంవాయి, సమగోప, నారన అనే నాణెములు లభించుటచేత గోభద్రుని నుండి రాజ్యం శ్రీముఖునికి వశమైనదని అతడే శాసన సామ్రాజ్యాన్ని స్థాపించాడని ఋజువైంది.

ఈ ప్రాంతాన్ని తొలుతగా ఏలిన రాజులు గోభద్ర, సామగోప అనువారు ఆంధ్రరాజులు. వీరి అనంతరం వచ్చిన శాతవాహనులను 'ఆంధ్రభృత్యులు'గా భావించడమైనది. సెరవజ్ఞజాతకకథ ఆధారంగా ఇది వ్యాపార కేంద్రమని బౌద్ధభిక్షువులు వచ్చే ఆరాధ్య స్థలమని ఉత్తర భారతదేశ వ్యాపారులకు (తైర్థికులకు) వాకిలి ద్వారమని తెలియుచున&ఉనది.

స్థూపము : పురావస్తు త్రవ్వకాల్లో పూర్తిగా ఇటుకలచే నిర్మించిన శిథిల స్థూపం వెలుగులోకి వచ్చినది. స్థూప అండానికి చుట్టూ అలంకరించిన 59 చలువరాతి ఫలకాలు లభించాయి. వీటిపైన వున్న లఘుశాసనాలు పూర్వబ్రాహ్మీ లిపికి చెందినవి. భట్టిప్రోలు, మౌర్యబ్రాహ్మీలిపుల కన్నా పూర్వపుదిగా చరిత్రకారులు గుర్తించారు. వీటిద్వారా మౌర్య





చక్రవర్తి కన్నా ముందే బౌద్ధ స్థూపం నిర్మింపబడిందని, బౌద్ధ ధర్మం వ్యాప్తిలో ఉందని తెలుస్తుంది. థేరవాద శాఖకు చెందిన ఈ బౌద్ధస్థూప శాసనాలు ఈవిధంగా తెలియజేస్తున్నాయి.

'మాయించ సదా ఏచ్చమయేన' భూమిపైన ఎల్లప్పుడు కోరికలు వున్నాయి.

'పుంఖేమ సదాదమ ఏచ్చయీ పుదశమకోద' – డేగవలె ఎల్లప్పుడూ ధర్మాన్ని ఈ కోరికయే తగ్గిస్తుంది.

'క్షమద ఏ సదా యీ ఏచ్చ క్షేస దసమా చిచేదసి' ఇది నిజమైతే క్షేమాన్ని కోరి, కోరికను వివిధ దశలలో ఛేదించాలి అని బౌద్ధధర్మాన్నీ తెలియజేస్తూ, దాన వివరాలను కూడా తెలుపుతున్నాయి.

గోదావరి వరదలకు ఈ ప్రాంతమంతా నాశనమైపోయినది ఏవో కొన్ని ఆనవాళ్ళు కన్పిస్తున్నాయి.

కోటిలింగాలకు 3 కి.మీ. దూరంలో హుస్సేన్ వాగు సమీపాన 'పాసిగాం' అనే గ్రామముంది. దాని ప్రక్కనున్న పర్వతంపైన రెండే రెండు కట్టడాలున్నాయి. ఒకటి స్థూపచైత్యం మరొకటి చైత్య గృహం. వీటిని వృత్తాకార పునాదులపైన నిర్మించినారు. త్రవ్వకాల్లో ఆరు చలువరాతి థఫలకాలు లభించినవి. వాటిపైన పూర్ణఘటము పద్మము, సింహము, గుఱ్ఱములున్న శిల్పాలను చెక్కినారు. పూర్తిగా ఇటుకలతో నిర్మింపజేసిన స్థూపానికి వీటిని సున్నంతో తాపడం చేసారు. సుత్తనిపాతలో బుద్ధుని సమకాలికుడైన పామసి అనే యువరాజన్నట్లుగా పేర్కొనబడినది. ఇతడు కోటిలింగాల రాజవంశానికి చెందినవాడై వుంటాడు. అతని పేరునే ఈ గ్రామం ఏర్పడి ఉంటుంది.

– డా॥ సంగనభట్ల నరసయ్య

అందరి దేవుడు - భద్రాద్రి రాముడు

అన్నమయ్య వేంకటాద్రి దర్శకుడైతే గోపన్న భద్రాద్రి దర్శకుడు. ఆ తీర్థాలు, క్షేత్రాలు, దైవతాలు - వాని బహిరంగాలతో పాటు అంతరంగాలను కూడ చిత్రించి ప్రదర్శించిన భక్తగాయకులు వారు. గిరిపై నెలకొన్న ఆ పరంధాములతో తమ జీవితాలను పంచుకొని, పెంచుకొని కృతార్థులైన ఆ భక్తకవులు తమ వచోక్రియలతో ఆంధ్రవాఙ్మయాన్ని పావనం చేసినారు.

'అదివో అల్లదివో' అంటూ చిందులేస్తూ పదివేళ శేషుల పడగల మయమైన హరివాసాన్ని చూపిస్తూ 'బంగారు శిఖరాల బహుబ్రహ్మమయాన్ని' గానం చేసిన పదకవితా పితామహుడు అన్నమయ్య. ఆ శ్రీనివాసదాసుని తలపిస్తూ ఈ శ్రీరామదాసుడు 'చారుస్వర్ణ ప్రాకార గోపుర ద్వారాలతో' విరాజిల్లే 'ఇలవైకుంఠాన్ని' ప్రదర్శిస్తూ 'ముదముతో సీతాముదిత లక్ష్మణుల కొలువై ఉన్న కోదండపాణిని' సేవింపరమ్మని గౌతమి సాక్షిగా పిలుస్తున్నాడు. ఆ వేంకటాచలం మేరు సమానము. ఈ భద్రాచలం మేరు పుత్రుడే. శేషాద్రి ఆకాశ గంగా పరిష్కృతం. భద్రాద్రి వృద్ధగంగా పరివృతం. గౌతమిని, భద్రాద్రిని దర్శించమని రామదాసు గానం చేసినాడు. శ్రీరామచంద్రుడు తన వనవాస ఆయాసాన్ని ఈ గోదావరి తీరంలోనే తీర్చుకొన్నాడు. పర్ణశాలను నిర్మించుకొని ఈ గోదావరి ఒడ్డున సీతాలక్ష్మణులతో గడిపినాడు. రావణుడు సీతమ్మను ఎత్తుకొనిపోవడం గోదావరి చూసినది. సీతమ్మ జాడ తెలుపుమని చెట్టును, పుట్టను అడుగుతూ శ్రీరాముడు ఈ గోదావరిని కూడా ప్రార్థించినాడు. రావణునికి భయపడి "పిరికి గోదావరి" ఊరకున్నది. ఆ పాపాన్ని కడుగుకొనడం కోసమే కాబోలు సీతారామలక్ష్మణులు వెలసిన భద్రాద్రిని పరివేష్టించి ప్రవహిస్తున్నది గోదావరి. తన పావనోదకాలతో తనివిదీర హరివెలసిన గిరిని అభిషేకిస్తున్నది.

మేరు పర్వతము సంతానం కోసం బ్రహ్మదేవుని ఉద్దేశించి తపస్సు చేసినది. చతుర్ముఖుడు భద్రుడనే కుమారుని ప్రసాదించినాడు. కాగల పుణ్యశాలి భద్రుడు పర్వతాకృతిని పొంది దండకారణ్యాన గోదావరీ తటంలో తపస్సమాధిని పొందినాడు. శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై వనవాస



సమయాన ఈ భద్రగిరిలో విశ్రమించినాడు. ఆ భద్రుని కోరిక మన్నించి రామభద్రుడు ఆ కొండపైన శాశ్వతముగ సీతాలక్ష్మణ సమేతుడై వెలసినాడు. స్వయంవ్యక్త శిలామూర్తులు భద్రుని అంకసీమ నిలిచినవి. శంకర భగవత్పాదులు ఈ దివ్యమూర్తులను దర్శించి పులకించి తన రామకర్ణామృతంలో గానం చేసినాడు.

వామాంకస్థిత జానకీ పరిలసత్కోదండం కరే
చక్రం చోర్ధ్వకరేణ బాహుయుగళే శంఖంపరం దక్షిణే
బిభ్రాణం జలజాత పత్రనయనం భద్రాద్రి మూర్ధ్నిస్థితం
కేయూరాది విభూషితం రఘుపతిం సౌమిత్రియుక్తం భజే


భద్రాద్రిలో వెలసిన సీతారామలక్ష్మణులు తమ్ము తాము ప్రకటించుకొన్నారు. గిరికి సమీపంలో భద్రిరెడ్డి పాలెమనే గ్రామం ఉన్నది. అక్కడ శబర కులానికి చెందిన పోకల దమ్మక్క అనే భక్తురాలు ఉండేది. ఆమెకు స్వప్నాదేశం కలిగింది. ఊరివాళ్లతో కలసి ఆమె స్వామి చెప్పిన తాటిచెట్టు సంకేతంగా ముద్దులు గొలిపే ముమ్మూర్తులను దర్శించుకొన్నది. శంఖచక్రాలతో పద్మాసనాసీనుడై సీతాసమేతంగా విలసిల్లే

శ్రీరామచంద్రుడు చెంత ధనుర్ధారియై నిల్చున్న సౌమిత్రి. ఆ దివ్యమూర్తులకు ఒక పందిరివేసి చిన్న కుటీరాన్ని నిర్మించినారు. తాటిచెట్టున రాలిన పండ్లను స్వామికి నైవేద్యం పెట్టి దమ్మక్క ప్రతినిత్యం పూజలు సాగించేది. ఆ పర్ణశాల గుడియై గోపుర ప్రాకారాదులతో విలసిల్లినది. రామాయణ భక్తశబరిని తలపించే దమ్మక్క నిర్మల పూజలతో ప్రకాశమానుడై భద్రాద్రి రాముడు ఆంధ్రుల హృదయాభిరాముడైనాడు. ఆ తొలి పూజాఫలము దమ్మక్కదే.

భద్రాద్రి రాముని స్మరిస్తే భక్తరామదాసు ప్రత్యక్షమౌతాడు. అతడు రామదాసు భజించిన వేలుపుగా ప్రసిద్ధిని పొందినాడు. ఈ రామదాసుని పూర్వనామం కంచర్ల గోపన్న. గోల్కొండ నవాబు తానీషా కొలువులో ఉన్న అక్కన్న, మాదన్నల మేనల్లుడు గోపన్న. మంత్రులుగ దండనాధులుగ తానీషా మెప్పును పొందినవారు అక్కన్న మాదన్నలు. వీరి ప్రాపకంతో గోపన్న పరగణాధికారిగ నియమింపబడెను. పాల్వంచ, బూర్గుంపాడు, భద్రాచలము తాలూకాలు వీరి ఏలుబడిలో ఉన్నది. సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యముతోబాటు కవితా ప్రావీణ్యము కలిగిన గోపన్న అటు నవాబును ఇటు ప్రజలను మెప్పించెను. శిస్తుల బకాయిలను వసూలు చేసెను. పరగణాల తహశీల్దారు శ్రీరామభక్త సామ్రాజ్యంలో ప్రవేశించెను. 'రాముని సేవకు రమ్మని పిలిచిన రాలేననకే ఓ మనసా' అది గోపన్న మానసబోధ. తమ్మక్క పూజలను తెలుసుకొన్నాడు. సీతారామ లక్ష్మణులను సేవించుకొన్నాడు. కరుణాపయోనిధియైన దాశరథి ప్రసన్నుడైనాడు. గోపన్న మనసు గోదావరిలా పొంగినది.

కంటి నదీతటంబు, పొడగంటిని భద్రనగాధివాసమున్
కంటి నిలాతనూజ, నురుకార్ముక మార్గణ శంఖచక్రముల్
గంటిని, మిమ్ము లక్ష్మణుని గంటి, కృతార్థుడనైతి
ఓ జగత్కంటక దైత్యనిర్దళన! దాశరథీ! కరుణాపయోనిధీ!

గోపన్న రామదాసుడైనాడు. కబీరు వీరికి శ్రీరామతారక మంత్రం ఉపదేశించినాడట. దమ్మక్క పూజలకు శాశ్వతత్వం కల్పించినాడు. కాంచీపురం నుండి పంచగోత్రాలకు చెందిన వైష్ణవులను రప్పించినాడు. పాంచరాత్ర ఆగమవిధానం ప్రవేశించినది. శాశ్వత ప్రాతిపదిక మీద ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించినాడు.



చుట్టూ ప్రాకారములు సొంపుతో కట్టిస్తి రామచంద్ర!
ఆ ప్రాకారములకు పట్టె పదివేల వరహాలు రామచంద్ర!

గోపురాలు, మండపాలు, బంగారు ఆభరణాలు, వాహనాలు ఒక్కటేమిటి, అన్నీ అంగరంగ వైభవంగ సమకూరినవి. పాలకుడు భక్తుడైనాడు. భక్తుని పాలన కర్తవ్యాన్ని విస్మరింపచేసినది. నిధికాదు రాముని సన్నిధి సుఖమని తెలుసుకొన్నాడు. సర్కారు బొక్కసం ఖాలీ అయినది. దేవాలయ నిర్మాణానికి ఆరులక్షల ప్రభుత్వ ధనమును వెచ్చించినాడు. నవాబు అనుమతి రాకముందే అంతా ఖర్చు చేసినాడు. అంతా రామునికే వెచ్చించినా అది నియమోల్లంఘనమే. అక్కన్న మాదన్నల ప్రాభవం తగ్గినది. గోల్కొండ రాజకీయ ఆర్థిక స్థితులు ఇరకాటన పడినవి. నవాబు దృష్టిలో నేరస్థుడైన రామదాసు కారాగృహశిక్ష అనుభవించెను. (క్రీ.శ. 1674 నుండి 1686 వరకు) శ్రీరామ వనవాసానికి శ్రీరామదాసు కారాగృహవాసానికి సరి.

రామదాసు బందిఖానాలో పొందిన అనుభవాలు అక్షరాలుగా అతని కీర్తనలలో నిలిచినవి. వానిలో నింద – స్తుతి రెండూ చోటు చేసుకొన్నవి.

అబ్బ తిట్టితినని ఆయాసపడవద్దు రామచంద్ర!
ఆ దెబ్బల కోర్వక అబ్బ! తిట్టితినయ్య రామచంద్ర!



"నీ మరుగు జొచ్చితిని. నన్ను కావుము" అన్న రామదాసు మనసు దీర్ఘశరణాగతిని పొందినది. శ్రీరామచంద్రునకది జటాయువు పిలుపు. శబరి పిలుపు, సుగ్రీవుని పిలుపు, విభీషణుని పిలుపు. రామలక్ష్మణులు కదలినారు. భద్రాద్రి కంపించినది. గోదావరి ఉప్పొంగినది. తానీషా పడకగది ప్రవేశించినారు. ఆరులక్షల ధనము రాశిపోసినారు. రామదాసు బందిఖాన ప్రవేశించినారు. రశీదు రామదాసు తలక్రింద పెట్టినారు. అది భక్తుని శరణాగతి. అది భగవంతుని శరణాగతి రక్షణ. భక్తి సత్యము. భగవంతుడు సత్యము. గౌతమి సాక్షిగ, భద్రాచలం సాక్షిగ జరిగిన కథ యిది.

పవిత్ర గౌతమీ జలాలలో స్నానం చేసి పావన భద్రాచల సీతాసౌమిత్రీ సమేత శ్రీరామచంద్రుని దర్శనం చేసుకొంటూ రామదాసులమై పాడుకొందాం.

ఏ తీరుగ నను దయ జూచెదవో ఇనవంశోత్తమ రామా!
నా తరమా భవసాగరమీదను నలినదళేక్షణ రామా!

- ఆరవేటి వెంకటసుబ్బయ్య

❖ ❖ ❖

గోదారి ఫ్యూజులు

గరగలు

పల్లెలలో గ్రామదేవతల సంబరాలు జరుపుతారు. నెత్తిమీద లోహపు బిందె పెట్టుకొని, దానికి చుట్టూ చీర చుట్టి, అమ్మవారిని నిలబెట్టి, సుమారు మూడు, నాలుగడుగుల ఎత్తున్న పూల గరగను ధరించి కొందరు డప్పుల వాద్యానికి అనుగుణంగా నర్తిస్తూ, చిత్రవిచిత్ర గతులలో అడుగులు వేస్తూ, చేతులతో వివిధ భంగిమలను చూపుతూ ఆడుతూ వెళుతుంటారు. గోదావరి తీరంలోని గ్రామాలలో ఈ గరగల సంప్రదాయం ఇంకా సజీవంగా వుంది.


❖ ❖ ❖


'గోదావరి పావనోదార వాఃపూర
మఖిల భారతము మాదన్నినాడు
అక్షర జ్ఞానమెరుగదో, ఆంధ్రజాతి?

- విశ్వనాథ సత్యనారాయణ

పరమపావన రామక్షేత్రం

'నడిచే దైవం' ప్రబోధం





"శ్రీరాములవారి చరణస్పర్శచేత పవిత్రమైనది, ఈ గోదావరీతీరం, ఈ తీరాన వెలసి ఉన్నది భద్రగిరి క్షేత్రం, ఈ క్షేత్ర మెప్పటికీ భద్రంగావ ుండాలి. నిత్యకళ్యాణంగా, మంగళకరంగా, శుభంగా వుండాలి. ఇక్కడ నివసించేవారు, ఇక్కడికివచ్చి దేవుని దర్శించేవారు అందరూ భద్రంగావుండాలి. ఈ క్షేత్రంలో వేంచేసివున్న శ్రీరామభద్రుని అనుగ్రహం చేత ప్రపంచమంతా భద్రంగా వుండాలి."

"శ్రీరాములవారి చరణస్పర్శచేత పవిత్రమైన గోదావరీ తీరము. ఇక్కడికి అనతిదూరంలో వున్న పర్ణశాల, సీతారాములు వాసం చేసినస్థలం, చిత్రకూటంలో కొంతకాలం గడిపిన పిమ్మట సీతారాములు గోదావరీ తీరానికి వచ్చారు, ఇంచుమించు పదిసంవత్సరాలకు పైగా ఇక్కడే వుండివుంటారు. అప్పుడు చాలాదూరం గోదావరీ తీరమున సంచారం చేయడం చేత ఈ తీరమంతా వారి చరణస్పర్శచేత పవిత్రమైనది."

రామభద్రుడు

శ్రీరామునికే "రామభద్రుడు" అని పేరు.

"రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః "

ఇక్కడ ఈ క్షేత్రంలో ఆయన భద్రాద్రి రాముడై నాడు, రామభద్రుడు భద్రరాముడైనాడు. ఇక్కడినుంచే ప్రపంచమంతటినీ భద్రంగా చూస్తున్నాడు.

ఎవరి కెట్టి ఆపద సంభవించినా, తనయందు నిజమైన నమ్మకం గలవారిని కాపాడడానికి తాను వారికి దాసుడనౌతానన్నాడు. రామదాసు శ్రీరామునికి దాసుడుకావడమే కాదు. రామదాసుకే శ్రీరాముడు దాసుడైనాడు. రామ లక్ష్మణులు రామసింగ్, లక్ష్మణ్‌సింగ్ అనే రూపాలు దాల్చి రామదాసు భటులమని చెప్పుకోలేదా?

దాసులకు దాసుడు

తనపట్ల అచంచలమైన విశ్వాసంవుంచితే చాలు, ఎట్టి ఆపదలనుంచి అయినా, ఎవరినైనా రక్షించగలడు. అతడు సంకల్పించితే ఎట్టి క్రూరులైనను ప్రభువులైన వారిలో సైతం భక్తిని కలుగజేసి, దాసులకు దాసుడూ, దాసానుదాసుడుగా కూడ తాను అవుతాడు. 'నాయందు నమ్మకముంచిన వారికి

నేను దాసుడ నౌతాను' అన్న నిదర్శనం చూపించా డిక్కడ శ్రీరాముడు.

"భద్రాన్ని ప్రసాదించే స్థలం"

భద్రమనే శబ్దానికి నిఘంటువు ఇలా అర్థం చెప్పింది: "స్వశ్రేయసం శివం భద్రం కళ్యాణం మంగళం శుభం."

"భద్ర" మనేది మధ్యలోవున్నది: ఈ క్షేత్రం పేరు భద్రగిరి. ఇదెప్పుడూ భద్రంగా వుండాలి. కళ్యాణంగా వుండాలి, నిత్యకళ్యాణంగా, మంగళకరంగా, శుభంగా వుండాలి, ఇక్కడ నివసించేవారు, ఇక్కడికి వచ్చి దేవుని దర్శించేవారు అందరూ భద్రంగా వుండాలి. ఈ క్షేత్రంలో వేంచేసివున్న శ్రీరామభద్రుల అనుగ్రహంచేత ప్రపంచమంతా కూడా భద్రంగా వుండాలి. ఒక్కజీవుడు, ఒక్క కుటుంబం, ఒకవూరు వీటిని కాపాడడానికి మాత్రమేకాదు, పరమేశ్వరుడు భద్రుడు అనుపేరు వహించింది. ప్రపంచ మంతటికీ భద్రాన్ని అనుగ్రహించే స్థలమిది, ఇది ఉత్తరోత్తరా ఇంకా అభివృద్ధి కావాలి.

రామాయణంలో ముఖ్యపాత్ర సీతామహాలక్ష్మి, 'మా జానకీ చెట్ట బట్టగా మహారాజు వైతివి–' అని త్యాగరాజు రాముని గూర్చి అన్నాడు. శ్రీరాముడిక్కడ సీతను వామ భాగంలో పెట్టుకుని ఆవిర్భవించాడు. ప్రపంచంలో మన మందరం ఆ మహాతల్లి బిడ్డలమే, ఆ తల్లే మనల నందరిని సృష్టించింది. సీతారామప్రసాద సిద్ధిరస్తు.

భద్రాద్రి:ఆంధ్రప్రభ: 22. 9. 1967.

దేవాలయంలేని గ్రామాన్ని కుగ్రామమని యీసడించడం కూడ కలదు. అయోధ్యనుండి రామేశ్వరం వరకు కొన్ని వేల రామాలయాలు ఉన్నవి. కాని భద్రాద్రి రామాలయ ప్రత్యేకత వానికి లేదు. దీని విశిష్టత దీనిదే.

ఇచట పచ్చిక బయళ్లలో ప్రకృతి సౌందర్య లక్ష్మి ఎన్నటికి విడిదిచేసినది. ఇచట కొండల, కోనల, వాగుల, సెలయేళ్ల అందమే అందము. సనాతన సత్య సౌందర్యములు రెండూ సీతారాములవలె పరస్పరాశ్లేషంతో మైమరచి, అద్వైతసిద్ధి పండిన మహా పుణ్యభూమి యీ ప్రాంతం. భవభూతి యీ ప్రాంతమునే తన ఉత్తరరామ చరితలో లోకాతిశయ మనోహరంగా కీర్తించి తన కావ్యమునకూ, తనకూ చరితార్థతను గడించుకుని అమరుడైనాడు.

పుష్కలామరభంగి! ఓ పుష్కరాంగి!

సుమధుర రాగ పరాగా!
గమకిత గంభీరవేణి! కళ్యాణి! మహా
సుమహిత శీకర సలిల
క్రమ! శ్రీకర ఫణితి నిన్ను గౌతమి! తలతున్

గలగల పారుచు కవులకు స్ఫూర్తివై
సాగు గోదావరీ! జయము నీకు
పరమ రమణీయపు భావుకోద్దీప్తివై
సాగు గోదావరీ! జయము నీకు
నవరసాల నటనా ప్రవణ సంశక్తివై
సాగు గోదావరీ! జయము నీకు
కమనీయ సంగీత గాయక శక్తివై
సాగు గోదావరీ! జయము నీకు

పుష్కరాంచిత పర్వ శుభోదయమున
భువిని పులకింపజేయుచు పుణ్య గరిమ
పొంగి వచ్చెదు నీ మృదు భంగికిదియె
స్వాగతమ్ము గోదావరీ! స్వాదులహరి!

నాసికయందు బుట్టి నవనాద వినోద విలాసితాంగవై
బాసరదేవి పీఠమున్ భక్తితరంగ యుతాంతరంగవై
భాసిలి, భద్రశైలరఘువల్లభ పాదసరోజ సన్నిధిన్
జూసి, లయానుకూల శుభశోభలతో నటనమ్ములాడి, మే
ల్బాసల నన్నయం గలిసి లాలిత రాజమహేంద్రిలోన, నా
పై సముదాత్త చిత్తమున్ స్వాద్భుత వేణిక నేడుపాయలన్
జేసియు, ప్రౌఢ నాయికగ శ్రీరసముద్రు సముద్రుకౌగిటన్
రాస కళాప్రభాసిత సురాగము లందితవమ్మ! గౌతమీ!

నీ నాదమ్మొక వేదమై చెవులలో నిండుంబరామోదమై
నీ నామమ్మొక నిత్యగానమయి శాంతింగాంతినిచ్చున్మదిన్
నీ నానాగతి లాస్యము ల్నిగనిగ ల్దివ్యాత్మకోపాస్యముల్
ఈ నీ పుష్కర వేళకున్నతులు మా హృద్వారి! గోదావరీ!

నీటిచే నీటి గుంతలు నెండిపోవు
ననెడి నుడి మేము వినలేదు కలగలేదు
కాని గోదావరీ! నీదు కమ్రజలము
నిండు సంసార జలధినే ఎండగొట్టు
నంటి! నీ నీటి రుచికి జోహారులమ్మ
పుష్కరామల భంగి, ఓ పుష్కరాంగి!

– శతావధాని డా॥ జి.ఎం. రామశర్మ

ఈ భద్రగిరికి సంబంధించి ఒక ఐతిహ్యమున్నది. భద్రుడను మహర్షి యీ కొండమీద శ్రీరామచంద్రునికై ఘోరమైన తపస్సు చేశాడు. అతని తపస్సునకు సంతుష్టుడైన శ్రీరామచంద్ర ప్రభువు స్వయముగా యిచటకు నడచివచ్చి భద్రునకు దర్శనభాగ్యాన్ని యిచ్చి, మోక్షాన్ని అనుగ్రహించాడు. ఆ మహర్షి పేరుగా యిది భద్రాచలమనీ, భద్రాద్రి అనీ అనాదిగా కీర్తించ బడుచున్నది. ఆంధ్రదేశంలో రామభజన చాల ప్రాచీనకాలంనుండి జరుగుచున్నది. శ్రీరామచంద్రుడు తెలుగుల ఆరాధ్య దైవము. ఈ దేశంలో ఆ స్వామికున్న ఏలుబడి, పలుకుబడి మరొక దేవునకు లేదన్నచో అతిశయోక్తి కాదు. రామమందిరములేని గ్రామం లేదు. శ్రీరామ పదాంక ముద్రితము కాని అంగుళంమేర యైనా ఈ దేశంలో కనుపించదు. వాల్మీకి మహర్షి విరచిత మహా కావ్య మహారామాయణ మాలా నాయక మణియైన నీలోత్పల సంహృత్కాంతి శ్రీరామ చంద్ర ప్రభు పుణ్యచరితము హిందువుల కెల్లరకు వేదంతో సమానంగా శిరోధార్యం. ఈ పుణ్యగాథనే తులసీదాసు రామచరిత మానసం ద్వారా హిందీలోనూ, కంబన్ తమిళం లోనూ, పోతన, త్యాగరాజులు తెలుగులోనూ కీర్తించి ధన్యులైనారు. వీరుకాక కబీరు, రామదాసు, పురందరదాసు మున్నగు మహాభక్తులెందరో తమ కృతుల ద్వారా రామచరిత అమృతవాహినిని దేశం నలుచెరగులా ప్రవహింపచేసి ఎన్నటికీ వట్టిపోవని పుణ్య సస్యములను పండించి మనకు యిచ్చి వెళ్లారు.

భద్రాద్రి దేవాలయ ప్రశస్తికి యిటీవలి కాలంలో జయస్తంభంగా నిలిచినవాడు రామదాసు అని కీర్తింపబడుచున్న కంచర్ల గోపన్న. గోపన్న తన భద్రాచలం తహసీలుదారు హయాంలో ప్రభుత్వ ఖజానాకు చెందిన 6 లక్షల రూపాయలను వెచ్చించి దేవాలయాన్ని నిర్మించాడు. ప్రభుత్వ ద్రవ్య దుర్వినియోగ నేరం క్రింద అతనిని తానీషా గోల్కొండ కోట లోని ఒక చీకటి గదిలో ఖైదు చేశాడు. నేటికి గొల్కొండ కోటలోని ఒక గది 'రామదాసు జైలు' అని యాత్రికులకు చూపబడుతూ ఉంటుంది. సుదీర్ఘ కారాగార క్లేశంతో విసిగిపోయిన రామదాసు ఆత్మహత్యకు తలపడతాడు. అప్పుడు రామలక్ష్మణులు ఒకరాత్రిపూట రామదాసు సేవకులమని చెప్పుకుంటూ తానీషావద్దకు వెళ్లి, అతని కివ్వవలసిన 6 లక్షల రూపాయలను చెల్లించి, గోపన్న విడుదలకు కారకులవుతారు. గోపన్న రామదాసుగా భక్తిరస బంధురములైన ఎన్నో మనోహరములైన కృతులతో శ్రీరామచంద్రుని కీర్తించారు. ఈ పాటలు తెలుగుదేశంలో అశేషమైన ప్రచారాన్ని సంపాదించుకున్నవి. 'లోకుల రసనకె ఆకులుగా' యివి నేటికి ఆంధ్ర జానపద సీమలో అమరములై జీవించుచున్నవి. విడుదలయైన తరువాత రామదాసు దేవాలయాన్ని విస్తరింప చేయడమేకాక పెక్కు మండపములను, గోపురములను నిర్మించి యున్నారు. కల్యాణ మండపాన్ని కూడ ఆయనే నిర్మింపచేశారు.

ఇక పరమార్థ శిల్ప కళాలక్ష్మి క్రీడా మందిరమైన కల్యాణమండప నిర్మాణమంతా మహాశిల్పి గణపతి స్థపతి స్వోపజ్ఞకమే. ఈ శిల్పాచార్యపుంగవుడు మద్రాసు రాష్ట్రం లోని రామనాథపురం జిల్లాకు చెందినవాడు. తమిళనాడు నుండి 500 మంది శిల్పకళా మర్మజ్ఞులను తనవెంట తీసుకుని వచ్చి శ్రీ గణపతి స్థపతి ఈ మహా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీరు అక్షరాలా రాళ్ళకు ప్రాణం పోశారు. రాళ్ళను మలచి, వానికి ప్రాణప్రతిష్ట చేయడంలో వీరి మహాద్భుత ప్రజ్ఞ కళ్ళకు కట్టినట్టు గోచరిస్తుంది. ఈ ప్రాంతంనుండి సేకరించిన రాయికాక, ఇందునిమిత్తం మద్రాసులోని తిండివనం నుండి ప్రత్యేకశిలను తెప్పించారు. ఈ కళ్యాణమంటపములో శిల్పకళాచాతుర్య, చారకులు మహోచ్చస్థితి నందుకొన్నవి. పాలరాతిలో మలచిన గొలుసులకు కట్టబడిన వూయల వూగుచున్న బాలకృష్ణ విగ్రహం అతిలోక సౌందర్య నివాసభూమి. ఒక్కమాటలో ఈ మంటపం మహాశిల్పి గణపతి స్థపతి పరమాద్భుతశిల్పశాస్త్ర పారీణత కెత్తిన జయపతాక ధనుర్భంగము, కన్యాదానం చేయుచున్న జనకుడు, రామపట్టాభిషేకం జగద్గురువుల ప్రత్యేక ప్రశంసల నందుకున్నవి. జగద్గురువుల సలహామీదనే పాంచరాత్రాగమశాస్త్ర విహితంగా ఈ గర్భాలయ పునరుద్ధరణ కార్యక్రమం కైకొనబడింది.

– "తెలుగునాట వచోవిభూతి" నుండి

పుష్కరోత్సవము

విద్వత్కవి, కవికోకిల
కీ॥శే॥ **శ్రీమాన్ వేముగంటి నరసింహాచార్యులు**

నిష్కలుషాంబుపూర!
రమణీయ తరంగ విహార భవ్యతా
పుష్కల! నిష్కలమ్ములగు
భూముల గూర్తువు క్రొత్త నిగ్గులన్
దుష్కృత హారిణీ! కృషిక
దుఃఖ నివారిణి! పూత పుష్కరా
విష్కృత! సర్వధూర్వహ!
పవిత్ర చరిత్ర! సవిత్రి! గౌతమీ!

రకముగ పది రెండేండ్లకు
ఒకపరి మహనీయ పుష్కరోత్సవ వేళా
ప్రకటిత వైభవ శోభన్
సకలాంధ్రావళికి గూర్తు సంతోషంబున్

తల్లీ! కర్షక కల్పవల్లి! విలసన్నానా
స్థలోద్భాసినీ!
కల్లోల వ్యవహారచారుచరితా!
కారుణ్య రూపాంబుసం
పల్లీలామయి! పుష్కరోత్సవ శుభ
ప్రారంభ సంరంభ! కో
కొల్లల్ నీకు నమస్కృతుల్, శతనుతుల్
గోదావరీ వాహినీ!

వాసరస్థిత వాణిపాణి వీణాస్వరా
భ్యంచితగానము నాలకించి
శ్రీధర్మపురి నారసింహునెమ్మోని
గందపుపూత చేతలన్ పరిమళించి
భద్రాద్రి శ్రీరామభద్రుని వరచర
ణాంబుజ యుగళికి అంజలించి
కాళేశ్వరావాస కాలకంఠ విలాస
రంజిత లీలలు ప్రస్తుతించి

దక్షవాటి భీమేశు కటాక్షవీక్ష
ణంబులన్ నిత్య నిర్మలత్వంబు గాంచి
ఉల్లసంబుగ ప్రవహించుచుందువీవు
మేలుములదొంతి! శ్రీగౌతమీ స్రవంతి!

నన్నయభట్టు ఆంధ్ర కవినాథుడు
నీ సికతా ప్రసన్నతా
స్విన్నములైన తిన్నెల
వసించి, మరందరసానుభావ సం
పన్నముగా, మనోజ్ఞముగ
భారత సంహిత సంతరించె; మా
పున్నెము, నీ పయోమహిమ
మూలము చల్లని తల్లి గౌతమీ!

దక్షిణ భారత గంగవు
ప్రక్షాళిత దోష వంకభారవు, కరుణా
వీక్షణములు నీ వీచి స
మీక్షణములు దివ్యగౌతమీ శైవలినీ!


వెచ్చని యూరుపున్ సెగల
విహ్వలతన్ గను బీడు నేలలన్
నిచ్చలు ఆర్ద్రభావమును
నెక్కొన జేసి సిరుల్ ఘటించి, ని
ప్పచ్చరమైన కర్షక
నివాసములన్ పలు ధాన్యరాసులన్
బిచ్చమువెట్టి బువ్వ తిని
పింతువు చల్లని తల్లి! గౌతమీ!

కానల కోనలన్ గడచి,
గ్రామపురంబులు దాటి, నాటికిన్
వానల పొంగి, వాగులను,
వంకల సంకులమై, తపంబునన్
మౌన విపంచి మీటుచు
సమానముగా విహరించు నీదు శో
భానటనంబు, నీ గరిమ
ప్రస్తుతి చేసెద గౌతమీనదీ!


దానములున్, జపంబులు
విధానయుతంబుగా జేసి, పుష్కర
స్నానమొనర్చునట్టి సుజ
నంబులకున్ మహనీయ పుణ్యసం
ధానము చేయు నీదు
కరుణా గుణమున్ వినుతింతు దివ్యగో
దానది! ముఖ్య సౌఖ్య శుభ
దాయిని! పావన జీవనామృతా!

అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి

రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లాలో ముఖ్యనగరం. రాజమహేంద్రవరమని కూడా పేరు. చరిత్ర సృష్టించిన, నడిపించిన, నడిపిస్తూ ఉన్న ఊరు. గోదావరినది అన్ని పెద్దనదులలాగ పలు ఉపనదులతో కలసి పుష్టిని పొందుతుంది. సామాన్యంగా ఉపనదులను గుర్తించటం కష్టం. అయితే అసంఖ్యాకమైన ఇతర పేరులేని పాయలు కూడా గోదావరిలో కలుస్తాయి. రాజమండ్రి తీరాన్ని గోదావరి చేరకముందే ఉపనదులన్ని గోదావరిని కలుస్తాయి. రాజమండ్రిలోని ధవళగిరి (ధవళేశ్వరం) దగ్గర గోదావరి ఏడు పాయలుగా విడిపోయి సముద్రంలో కలుస్తుంది. అంటే రాజమండ్రి గట్టున గోదావరి సంపూర్ణంగా, అఖండంగా వుంటుందని చెప్పేందుకు ఆస్కారముంది. సర్వదిక్కులనుంచి వచ్చిన సమగ్రజలం రాజమండ్రి ఒడ్డున ప్రవహించి ముందుకు పోవలసిందే. అలాంటప్పుడు ఇక్కడి నీళ్ల నిలువ, నది వైశాల్యం ఎక్కువనే చెప్పాలి. దానికి తోడు తరతరాల సాంఘిక రాజకీయ జీవన స్రవంతి, దానితో రాజ్యాలు వికసించి, నశించి నగరాలు కొత్త శోభను సంతరించుకొని దినదినాభివృద్ధి చెందాయి. ఇక్కడి ధర్మాలు, ధర్మాలను అంటిపెట్టుకొని ఆలయాలు అంతస్సత్వంలో ప్రధానమైతేను బహిరావరణంలో కొత్తకొత్త రంగులు మారుతూ నిత్యనూతనంగా కనబడటం సాధారణము. అటువంటప్పుడు మొత్తం రాజమండ్రి ప్రాచీనతను, వైభవాన్ని దర్శించడానికి



మనకు చేయూత నిచ్చేవి అక్కడి ఆలయాలు మాత్రమే అని చెప్పాలి. ఆ దిశలో కొన్ని ఆలయాల పరిచయం ఇక్కడ ఇస్తున్నాం.



మార్కండేయ క్షేత్రం

గోదావరి గట్టున రాజమండ్రిలో శ్రీమార్కండేయేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఈ క్షేత్రానికి పురాణ చరిత్ర వుంది.



మృఖండుముని సంతానం కోసం గౌతమీ తీరంలో పరమేశ్వరుని ఆరాధించాడు. శివుని వరంవల్ల పుత్రుడు పుట్టాడు. మార్కండేయుడికి యుక్తవయస్సు రాగానే మృత్యువు సంభవిస్తుందని చెప్పిన ఆకాశవాణి మాటలకు చింతించి తన ఆయుర్దాయం కోసం గౌతమీ తీర్థంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి ఉమామహేశ్వరులను ఆరాధించాడు.

ఈశ్వర వరానుసారం ఆకాశవాణి మాటల ప్రకారం ప్రాణహరణకు యముడు వచ్చాడు. మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకుంటాడు. యముడు తన పాశాన్ని మార్కండేయుడి కంఠానికి తగిలించాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమై తన శూలంతో యమధర్మరాజును కొట్టాడు. 'ఈ తీర్థంలో మునిగి నన్ను దర్శించినవారు, పాపాలనుండి విముక్తులై పునర్జన్మ రహితులౌతా'రని శివుడు మార్కండేయుడికి వరమిచ్చాడు. ఈ వరంవలన గౌతమీ తీరంలో స్నాన, జపదానాదులను చేసుకొనేవారు ఎక్కువయ్యారు.

భీమేశ్వర పురాణంలో –

కమలాచలాగ్ర మార్కండేయ శివ శిర
శ్శశిచంద్రికాధౌత సౌధ వీధి (భీ.పు. 1-43)

అని ప్రస్తావింపబడి ఉంది.

కాశీఖండంలో – 'ఉండునేవట మార్కండేయ మునినాథ సజ్జలింగమనంగ శాసనుండు' అని ఈ మార్కండేయ దేవాలయ ప్రస్తావన ఉంది.

గోదావరి గట్టుపైన తిరుమల తిరుపతి దేవస్థానంవారు నిర్మించిన శ్రీవేంకటేశ్వర పద్మావతి స్నాన ఘట్టానికి ఎదురుగా ఈ ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి వెళ్ళాలంటే రోడ్డునుంచి లోపలిమెట్లు దిగి క్రిందికి దిగి వెళ్ళాలి. దిగిన వెంటనే కుడివైపుకు మార్కండేయేశ్వరస్వామి దర్శనం చేసుకొనవచ్చు. ప్రక్కనే అమ్మవారిని కూడా దర్శించుకోవచ్చు. ఇక్కడ పలు దేవతల చిన్న చిన్న గుళ్ళు ఉన్నాయి. వేంకటేశ్వరస్వామి కూడా ప్రతిష్ఠింపబడి వున్నాడు. ఆలయంలో నల్లరాతి బవసన్న స్థిరమూర్తిగా ఉంటే లోహపు బసవన్న నిలిచి స్వామివారికి వాహనమయ్యేందుకు సదా సిద్ధమనే భావాలు వెలిబుచ్చుతూ ఉండడం చూడవచ్చును. ఈ ఆలయంలో ఇంకో ప్రత్యేకత ఏమిటంటే గుడి మహద్వారం ప్రక్కనే అయ్యప్పస్వామి ఆలయాన్ని గూడ చూడవచ్చును.


చరిత్రలో చూస్తే కాటయ వేముని భార్య మల్లాంబిక మార్కండేయస్వామి కోసం కేసవరం గ్రామాన్ని సమర్పించింది. అతని తల్లి దేవాలయాన్ని పునర్నిర్మాణం గావించింది. ఆ ఆలయం నాశనం అయిపోగా కోటగుమ్మం దగ్గర మరల నిర్మించారు. అదికూడా కాలగర్భంలో కలసిపోయింది.

గుండు రాజనే ధనికుడు మార్కండేయేశ్వరుణ్ణి పార్వతీదేవిని పునఃప్రతిష్ఠించాడు. ఆ దేవాలయము కూడా శిథిలమైంది. 1949 ప్రాంతంలో ఆలయాన్ని పునఃప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి స్వామివారి కళ్యాణోత్సవం, రథోత్సవం, వినాయకచవితి, నవరాత్రి ఉత్సవాలు, అఖండ దీపారాధన, అయ్యప్పస్వామి వారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాయి.

కోటిలింగాల

గోదావరి వద్ద మార్కండేయ క్షేత్రం ప్రక్కన బ్రహ్మ యాగశాలను నిర్మించెను. యాగాన్ని నిర్వహించి కోటిలింగాలను ప్రాణ ప్రతిష్ఠ చేశాడు. కొంతకాలానికి కోటిలింగాల్లో ఒకటి తక్కువ కాగా మహర్షులు ఒక లింగాన్ని ప్రతిష్ఠించారు. ఆ లింగమే కోటిలింగేశ్వరుడు. ఇతడు శతకోటి ఫలాలను ప్రసాదించేవాడు. కాబట్టి దీనికి కోటిలింగ క్షేత్రమని పేరు వచ్చింది. ఇక్కడ కావించే స్నానజప ధ్యానాదులు అమోఘ ఫలప్రదాలు.

ఈ క్షేత్రానికి సంబంధించి మరో కథనం – త్రిపురాసురుడనే రాక్షసుణ్ణి, అతని అనుచరులు కోటిమందిని ఈశ్వరుడు, కుమారస్వామి కలిసి వధించిన తర్వాత బ్రహ్మ వారిని కోటిలింగాలుగా మార్చివేశారని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. కోటిలింగాల స్వామిని పూజిస్తే ఒక కోటి శివలింగాలను పూజించిన ఫలితం వస్తుందని ప్రసిద్ధి. బ్రహ్మ, విష్ణువు కలిసి నర్మదానది నుంచి బాణలింగాన్ని తెచ్చారని, దానిని ప్రతిష్ఠించి కోటిలింగాలను చేసి యీ లింగానికి శ్రీకోటిలింగేశ్వరస్వామి



అని పేరుకూడా పెట్టారని చెబుతుంటారు. ఇక్కడ స్వామి రాతి శివలింగం రూపంలో పూజింపబడుతున్నాడు. నది నీరు లేనప్పుడు యీ కోటిలింగాలు కన్పిస్తాయని అంటారు. మహాశివరాత్రికి ఉత్సవం జరుగుతుంది.

వేణుగోపాలస్వామి దేవాలయం

రాజమండ్రిలో గోదావరి తీరాన్ని ఉమామార్కండేశ్వర స్వామి ఆలయానికి అతి దగ్గరలో కంబంవారి సత్రము ఉంది. దాని ప్రక్కన వేణుగోపాల స్వామి దేవాలయం, నరసింహస్వామి వారి ఆలయాలు ఉన్నాయి. రాజమహేంద్ర వరం క్షేత్రపాలకుడు శ్రీవేణుగోపాలస్వామి.

కృష్ణద్వైపాయనుడు పుట్టిన తక్షణమే తండ్రి వద్ద అన్ని విద్యలు నేర్చుకొని వేదాసక్తుడై తండ్రికి దూరంగా వెళ్ళినప్పుడు పరాశరుడు పుత్రవిరహం వలన వైరాగ్యంలో పడ్డాడు. గోదావరి తీరాన తపస్సుకు దిగిన పరాశరునికి స్వామి గోపాలుడై కనబడి కొంచెం ఊరట కలిగించాడు. పరాశరుడు ఆయనను ఇక్కడే ఉండమని కోరాడు. గోపాలుడు తన వేణువుతో, గోవర్ధనంతో పాటు ఇక్కడే నిలిచాడు. పరాశరుడే కాకుండా వ్యాసుడు, వ్యాసపుత్ర శుకుడు, నారద సనకాదులు స్వామిని ఆరాధించి తరించారు.


చరిత్ర పుటలలో వేణుగోపాలస్వామి ఆలయం నాలుగైదు చోట్ల నాలుగైదు కాలాలలో కనబడుతుంది. ఒకే విగ్రహం స్థానాంతరం చెందుతూ ఆయా కాలాలలోని సామాజిక స్థితిగతులను తెలుపుతుందని చెప్పవచ్చును. మొట్టమొదట క్రీ.శ. 1390 సం॥లో వేణుగోపాలునకు అనవరత పురాన్ని కాటయ వేమారెడ్డి సమర్పించాడు. ఈ ఆలయం ఆచూకీ లేకుండా పోయింది. ఆపై గోదావరి గట్టుపై వెంకటరాయనింగారు కొత్తగా ఆలయ నిర్మాణాన్ని గావించి స్వామివారిని ప్రతిష్ఠించారు.

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ దశమినాడు కళ్యాణోత్సవం జరుగుతుంది. ఏకాదశినాడు రథోత్సవం, భీష్మైకాదశి మొదలు పూర్ణిమదాకా సాగర సంగమ స్నానం (చక్రస్నానం) చేస్తారు. ఇక్కడి స్నాన జప దానాదులు సకల ఫలాలు కలిగిస్తాయి. రెడ్డిరాజుల కాలంలో ఆలయం పునర్నిర్మింపబడింది.

లక్ష్మీజనార్దనస్వామి – ధవళేశ్వరం

పంచగిరి దుర్గమని పేరు పొందిన రాజమహేంద్రవరంలో ధవళగిరి ఒకటి. ఈ ధవళగిరే ధవళేశ్వరం. అఖండంగా వచ్చిన గోదావరి ఇక్కడ కశ్యప, అత్రి, గౌతమీ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ట అని ఏడు పాయలౌతుంది. సోమకాసురుడనే రాక్షసుణ్ణి వధించి మహావిష్ణువు తిరిగి తెచ్చిన నాలుగు వేదాలకు జనార్దనుడు ప్రతిరూపం. ఈ ధవళగిరి మీదనే మహావిష్ణువు కోసం బ్రహ్మ తపస్సు చేశాడు.

జనార్దనస్వామి ఆలయాన్ని నారదుడు నిర్మించాడని అంటారు. గర్భగుడిలో జనార్దన స్వామితో శ్రీదేవి, భూదేవి ఇరువైపుల ఉన్నారు. ఈ ధవళగిరికి ప్రక్కన ఒక గుహ ఉంది. అందులో నారదుడు కొంతకాలం తపస్సు చేశాడనీ, అందువల్ల దానికి నారదగుహ అని పేరు వచ్చిందని అంటారు. ఇక్కడ చేసిన ధర్మకార్యాలకు ఇతోధిక ఫలం లభిస్తుందని నమ్మకం. ఆలయం కొండపైన ఉన్నది. ఆలయానికి సుమారు 200 మెట్లెక్కాలి. ఇక్కడ ఆలయ ప్రదక్షిణయేగాక గిరి ప్రదక్షిణ కూడా చేస్తారు. ఈ స్వామివారికి భీష్మ ఏకాదశికి కల్యాణ



రథోత్సవాలు మహావైభవంగా జరుగుతాయి. ఇక్కడ శివుడి గుడి కూడా ఉన్నది. విభీషణునికై వెదుకుతూ వచ్చిన శ్రీరామచంద్రుడు గౌతమీస్నానం చేసి ఈశ్వరలింగాన్ని ప్రతిష్ఠించడం వలన రామలింగేశ్వరాలయం అయిందని అంటారుఏ.

ఈ రెండు గుడులను ఒకవైపుకు వదలి కాటన్ దొరగారు బ్యారేజిని మరొక వైపుకు నిర్మించ దలచినప్పుడు అది సఫలమైందని, ఆ మొదలు రెండు ఆలయాల మధ్య శివకేశవులను విడదీస్తూ బ్యారేజీ నిర్మించే ప్రయత్నం విఫలమైందని చెబుతారు.

అగస్తేశ్వరస్వామి దేవాలయం – ధవళేశ్వరం

ఈ శివలింగాన్ని అగస్త్యమహర్షి పూజించడం వల్ల దీనిని శ్రీ అగస్త్యేశ్వరస్వామి అంటారు. సహజంగా ఏర్పడిన శివలింగాల్లో ఇది పెద్దది. దీనిని త్రేతాయుగంలో కూడా పూజించారు. అగస్త్యమహర్షి ప్రతిష్ఠించిన శ్రీబాలా త్రిపురసుందరి దక్షిణాభిముఖంగా ఉండడం ఒక ప్రత్యేకత.

పట్టసం – పట్టిసాచలక్షేత్రం

పట్టసాద్రి సమంక్షేత్రం నాస్తి బ్రహ్మాండగోళకే
వీరభద్ర సమోదేవో న భూతో న భవిష్యతి

రాజమహేంద్రవరం దగ్గర పవిత్ర గోదావరీ నదీ మధ్యంలో దేవకూటాద్రి మీద వున్న ఈ పట్టసాచల క్షేత్రానికి పట్టిసీమ, పట్టసాద్రి, పట్టసాచలం అనేవి నామాంతరాలు.

ఈ క్షేత్రం మన దేశంలోని పంచ మహా శివక్షేత్రాలలో ఒకటి అని అంటారు. తక్కినవి కాశి, కేదారం, శ్రీకాళహస్తి, శ్రీశైలం అనేవి. పట్టసాచలంలో శివుడు మహాలింగాకారంలో



సపరివారంగా భద్రకాళితో వేంచేసి యున్నాడు. ఇక్కడే శ్రీ భూ – నీలతా సమేతుడై మహావిష్ణువు భావనారాయణ స్వామి అనే పేరుతో క్షేత్రపాలకుడుగా వెలసి వున్నాడు. హరిహరులిద్దరు వెలసిన క్షేత్రం కనుక ప్రసిద్ధ క్షేత్రంగా ప్రఖ్యాతి చెందినది. ఈ క్షేత్రానికి వీరక్షేత్రం అని కూడా అంటారు.

మహాశివరాత్రినాడు యాత్రికులు దర్శించి తరిస్తారు. ఆనాడు వీరేశ్వరునికి అభిషేకార్చనలు జరుగుతాయి. కార్తిక మాసంలో ఉత్సవాలు జరుగుతాయి.

శ్రీశైలం కాశికేదారం కాళహస్తిం చ పట్టసం ।
పంచక్షేత్ర పఠేన్నిత్యం మహాపాతక నాశనం ॥

గోదావరి నీళ్లతో నిండి ఉంటే ద్వీపం అయిన పట్టిసానికి వెళ్ళడం కష్టం. ప్రవాహం వచ్చి పాతవూరు పాడైపోగా కొత్త పట్టిసీమ ఒకటి తయారైంది. దూరం నుంచి ఆలయాన్ని చూపెట్టే విధంగా నదీతీరాన ఎత్తైన ఆంజనేయస్వామి నిలిచియున్నాడు. నావలో గోదావరిని దాటి లోపలకు వెళ్ళి ద్వీపంలో దిగి కొంత దూరం నడచి మెట్లు ఎక్కి శిఖరాగ్ర భాగాన్ని చేరుకోవాలి. జానపద నమ్మకాలు ఎక్కువైన ఈ స్థలానికి చాలామంది దూరప్రాంతాల నుంచి వస్తూంటారు. సుభాను సంవత్సర పుష్కరాలకై కొత్తముస్తాబుతో శోభిల్లుతుంది.



ముఱమళ్ళ – శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి



ముఱమళ్ళకు పూర్వనామం మునుపల్లె. ఎందరో మునులు ఇచ్చట ప్రశాంతముగా తపస్సు చేసికొనెడివారు. గౌతమీ తీరమున నిర్మలమైన ప్రదేశమిది. దక్షుని యాగధ్వంసము చేయుటకు అవతరించిన వీరభద్రుడు ఆ యాగ విధ్వంసానంతరము శివసంకల్పమున భద్రకాళీ సహితుడై మునిపల్లె వద్దకు వచ్చి వెలసెను. ముఱమళ్ళకు దగ్గరగానున్న కొమరగిరి గ్రామనివాసి వీరశరభరాజు ప్రస్తుతమున్న ఆలయమును నిర్మించెను. రాజా దంతూరి జగన్నాధరాజు, శ్రీవారి నిత్యకళ్యాణం నిమిత్తము ఏబది ఎకరముల భూమిని దానమిచ్చారు. ఇదిగాక వారి బంధువులు సుమారు 200 ఎకరములు వరకూ దానము చేసిరి. ఆంధ్రదేశమున మరి ఏ స్వామికి నిత్యకళ్యాణము లేదు. ఈ వీరేశ్వరస్వామి వారికి నిత్యకళ్యాణము. ఇక్కడి విశేషమేమిటంటే పెండ్లికాని ఆడపిల్లలు స్వామివారిని దర్శించి భక్తితో ఆయన కళ్యాణము జరిపించుకుంటే వారికి తొందరలో వివాహం జరుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం.

పలివెల – కొప్పు లింగేశ్వరస్వామి

వాడె మా యింటి వేల్పు పల్వల పురమున
గొప్పులింగంబు ఫణిరాజు కుండలుండు–

అని కొప్పు లింగేశ్వర స్వామిని శ్రీనాథుడు భీమేశ్వర పురాణమున వర్ణించెను. కూచిమంచి సోమసుందరకవి కొప్పు లింగేశ్వర శతకము ప్రసిద్ధమైనది. ఆ స్వామి నిలయమే పలివెల.



ఇది గోదావరీ మండలమునందలి ప్రాచీన శైవక్షేత్రాలలో కొత్తపేటకు మూడు కిలోమీటర్ల దూరములో కౌశికీ తీరమునందు ఉన్నది. కోనసీమలోని అతి ప్రాచీన దేవాలయాలలో ఇది యొకటి. ఈ స్వామి అగస్తేశ్వరుడు. అగస్త్య ప్రతిష్ఠ యగుటచే లింగముపై కొప్పు ఉండును. వేశ్యాలోలుడైన అర్చకునకు స్వామికి అలంకరించవలసిన పూలమాలలు తన ప్రియురాలికి సమర్పించుట అలవాటు. ఒకనాడు మహారాజు ఆ స్వామి దర్శనమునకు వచ్చెనని తెలిసికొని, వేశ్య ధరించిన మాలను రాజునకు ప్రసాదముగా సమర్పించెను. దానిలో నొక శిరోజమును చూసిన రాజు ఈతని వేశ్యాలోలత్వమును గూర్చి విని ప్రశ్నించెను.

ఈ శిరోజము స్వామిదే. ఆ స్వామి శిరస్సుపై కొప్పు కలదని చెప్పి తప్పించుకొనెను. నేడు అలంకారము పూర్తి అయినది రేపు ఉదయము వచ్చినర చూపించెదనని పల్కెను.

నాటి రాత్రి అర్చకుడు తనకు సంభవించిన క్లిష్ట పరిస్థితిని స్వామికి వివరించి వేడుకొనగా మరునాడు వచ్చిన రాజునకు కొప్పుతో అగుపించి భక్తుని రక్షించెనని కథ గలదు. ఆ పూజారికి రాజు యిచ్చిన మాన్యములే "జుత్తుగపాడు" మాన్యములు. ఇట్లు అగస్తేశ్వరుడు కొప్పు లింగేశ్వరుడుగా మారెను. మహాశివరాత్రికి రథోత్సవము మహావైభవముగా జరుగును.

స్వామి ఎడమ ప్రక్క పాను పట్టముమీదనే అమ్మవార ఉ ఉమాదేవి కలదు. మండపములో ఒక పెద్ద నంది కలదు. స్తంభ మండపములు, ఉయ్యాల మండపము, ధ్వజద్వార మండపము వివిధ శిల్పరీతులతో ప్రకాశించుచున్నవి. 12వ శతాబ్దమునాటి నుండి రాజశాసనాలు ఈ ఆలయ స్తంభములపై గలవు.

కోటిపల్లి – సోమేశ్వరస్వామి ఆలయం

రామచంద్రాపురం తాలూకా కోటిపల్లిలో ఈ ఆలయం వుంది. కోటిపల్లి అంటే పురాణాల్లో కోట్ల ఫలి అని ఉంది. కోటి పల్లినే కోటితీర్థం అనేవారు. ఇక్కడ శివుడు సోమేశ్వరస్వామి పేరుతో పూజింపబడుతున్నాడు. దేవి శ్రీరాజేశ్వరి అమ్మవారుఏ.

గోదావరినది తీరంలోనే వున్న క్షేత్రమిది. ఈ క్షేత్రంలో చేసే ఒక మంచి పనికి కోటి పుణ్యకార్యాలు చేసిన ఫలితం వస్తుందట. ఈ కోటిఫలి క్రమేణా కోటిపల్లిగా మారిందని అంటారు. యీ స్థలాన్ని గురించి బ్రహ్మపురాణంలో ప్రస్తావన



వుంది. బృహస్పతి శిష్యుడు చంద్రుడు అతని ఆత్మలింగంతో దీనిని ప్రతిష్ఠించాడు. గురుపత్నితో కూడిన చంద్రుడు పాప పరిహారార్థం ప్రతిష్ఠ చేసినది. అదే సోమేశ్వరాలయమని ప్రతీతి. అలాగే అహల్యను మోసగించిన ఇంద్రుడు కట్టిన ఆలయం కోటీశ్వరాలయమని మరో అభిప్రాయం.

ఇక్కడ శివరాత్రికి (మాఘ బహుళ అమావాస్య) గొప్ప ఉత్సవం జరుగుతుంది. ఆ రోజున సాలగ్రామాలు దానం చేస్తే భక్తులు ముక్తి పొందుతారని విశ్వాసం. ఈ ఆలయంలో నంది చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. పుష్కర సమయమున ఇక్కడ గోదావరీ సముద్ర సంగమ స్నానం సర్వపాపహరము యాత్రికులు దర్శించాల్సిన పుణ్యక్షేత్రం ఇది.

మందపల్లి – మందేశ్వరుడు

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలూకాలో ర్యాలీ క్షేత్రానికి అతి సమీపంలో మందపల్లి గ్రామం వుంది. అమలాపురానికి ఆరు కిలోమీటర్ల దూరంలో వుంది. రావులపాలెంకు అతి సమీపంలో ఉన్నది. మందపల్లిలో శనిచే ప్రతిష్ఠింపబడిన ఈశ్వరుడు ఉన్నాడు. సామాన్యంగా శివాలయంలో శివుడు జలాభిషేకంతో తృప్తి చెందితే ఇక్కడి శంకరుడు శనికి ప్రియమైన తైలాభిషేకాన్ని అపేక్షిస్తాడు. తైలాభిషేకాని&ఉన జరిపిన భక్తులకు తాము చేస్తున్నది శివార్చనే కాక శని ఆరాధన కూడా అవుతుందనే నమ్మకం. శని అగస్త్యునికి శిష్యుడు. దధీచి మహర్షిని అసురులు హింసించినప్పుడు అగస్త్యమహర్షి సలహామేరకు జనులు అసురులచే సంభవించిన కష్టాలను శనికి చెప్పుకున్నారు. శని వారి కోరికపై అసురులతో పోరాడి వారి బాధనుంచి విముక్తులను చేశాడు. అంతేకాకుండా తాన ఉపోరాడిన స్థలంలో ఈశ్వరుణ్ణి స్థాపించి అతని పూజ చేసిన వారికి శని బాధలు ఉండవని హితవు చెప్పాడు. అందువలన ఇక్కడ మందేశ్వరుడు భక్తులకోసం వెలిశాడని అంటారు.

ముక్తేశ్వరం – క్షణ ముక్తేశ్వరుడు

ముక్తేశ్వరం తతస్తీర్థం శ్రుణుష్వే సుసమహితః ।
యస్మిన్ తీర్థే సదాముక్తిం క్షణాద్యాంతి శివాజ్ఞయా ॥

శ్రీరామ ప్రార్థన మేరకు శివుడు ఇక్కడి జ్యోతిర్లింగములో లీనమయ్యాడు. ఇక్కడే ఒక శాపగ్రస్త శ్రమణికి క్షణంలో ముక్తి కలిగినది. ఆ కారణాన ఇతడు క్షణముక్తేశ్వరుడుగా ప్రసిద్ధి చెందాడు. స్వామిని దర్శిస్తే చాలు! ఆ క్షణమే ముక్తి కరతలామలక మౌతుంది అంటారు. స్వామి ఎదురు సన్నిధిలో నిలబడిన క్షణం ఇతరత్ర కష్టసుఖముల, భవబంధనముల ఈతిబాధలు పోయి మనసు కుదుటపడుతుంది. అదే మోక్షము అనే పరమార్థాన్ని చెప్పేందుకు చేసిన ప్రయత్నమే



క్షణముక్తేశ్వరం అనే పేరులోని సారం. ఇక్కడి శివలింగం ప్రత్యేక వర్చస్సు కలది. ఈ సన్నిధిలో నిలిచిన భక్తుడు పారవశ్యంతోనే ధన్యుడవుతాడు. ఇది అమలాపురానికి 12 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ క్షేత్రమున కేశవస్వామి క్షేత్రపాలకుడు. విజయదశమి, కార్తికమాసము, ధనుర్మాసములలో ముఖ్య ఉత్సవములు జరుగుతాయి. మహాశివరాత్రికి కల్యాణము జరుగుతుంది.

అంతర్వేది – లక్ష్మీనరసింహస్వామి

ప్రసిద్ధి చెందిన అంతర్వేది క్షేత్రం అతి ప్రాచీనమైన నరసింహ క్షేత్రాలలో ఒకటి. ఇది గోదావరి జిల్లా వశిష్ట గోదావరి తీరంలో వుంది. శ్రీలక్ష్మీనరసింహస్వామి హిరణ్యకశిపుని చంపి అంతర్వేదిలో పడవేయడం వల్ల ఇది అంతర్వేది అయిందట. ఇక్కడ గోదావరి సముద్రంలో లీనమౌతుంది.

ఈ స్వామి స్వయంభువు. ఆలయం నల్లరాతితో నిర్మింపబడింది. ఈ క్షేత్రంలో దక్షిణావృత శంఖం ఉండడాన్ని విశేషంగా పరిగణిస్తారు.

ఇక్కడ కృతయుగంలో బ్రహ్మ వంద సంవత్సరాలు యాగం చేసి యజ్ఞశాలలో అంతర్వేదికా స్థలంలో నీలకంఠేశ్వరుని ప్రతిష్ఠించి క్షేత్రపాలకుడిగా చేశాడట. అనంతరం వశిష్ఠ మహర్షి గోదావరి నుండి వశిష్ఠపాయను తెచ్చాడని అంటారు. వశిష్ఠుడు శ్రీలక్ష్మీనరసింహ విగ్రహాన్ని కొంతదూరంలో ఆంజనేయస్వామి విగ్రహం స్థాపించెను.

ఆలయ గర్భగృహంలో స్వామివారి విగ్రహం పశ్చిమాభిముఖంగా వుంది. ఈ స్వామి నవ నరసింహులలో ఒకరనే అభిప్రాయం వుంది. ఆలయంలో చీకటి వున్నా సూర్యాస్తమయ కిరణాలు స్వామి విగ్రహ వక్షఃస్థలంలో ప్రసరిస్తాయట. స్వామి చుట్టూ రాజలక్ష్మి తాయారు, వేంకటేశ్వరస్వామి శ్రీభూదేవి తాయార్లు, సంతాన గోపాలస్వామి కేశవస్వామి మొదలైన సన్నిధి దేవతలున్నారు. శ్రీరాముడు రావణ సంహారానంతరము ఈ స్థలమునకు వచ్చి శివపూజ చేసెను. మాఘశుద్ధ దశమికి లక్ష్మీనరసింహ కల్యాణము. నృసింహ జయంతి వైకుంఠ ఏకాదశికి ముఖ్య ఉత్సవములు ఉత్సవ సమయాలలో వచ్చు యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యం కలదు.

ఇవి మాత్రమేకాక రాజమండ్రిలో ఇంకా అనేక దేవాలయాలున్నాయి. గోదావరి గట్టుమీద లక్ష్మీగణపతి మందిరము, శ్రీ(సీతారామ భక్తాంజనేయ స్వామివారి ఆలయము, రావిచెట్టు క్రింద కనకదుర్గ మందిరము వున్నాయి. సంజీవ ఆంజనేయస్వామి దేవాలయము, గురురాఘవేంద్ర స్వామి ఆలయము ఉన్నాయి. సంజీవ ఆంజనేయస్వామి ఆలయము ప్రాచీనమైంది. ఇక్కడ నిత్యం పూజలు, అభిషేకాలు, హనుమద్ వ్రతానికి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. రాజమహేంద్రవరంలోని కోటిలింగాల పేటలో శ్రీరామమందిరం రాజేశ్వరి దేవాలయం ఉన్నాయి. ఇంకా రాజమహేంద్రవరంలో కనకదుర్గాదేవి ఆలయం, కాశీవిశ్వనాథ ఆలయం, ఉమారామలింగ చౌడేశ్వరి ఆలయం, విఘ్నేశ్వర మందిరాలు, రామమందిరాలు గోదావరి గట్టువద్ద గిరిజౌచంద్ర మౌళీశ్వరాస్వమి ఆలయం, బాలసుందరి విశ్వేశ్వరాలయం, పాత శ్యామలాంబ గుడి, బసవలింగేశ్వర ఆలయం తదితరాలు కలవు.

- డా॥ అల్లాడి సంధ్య

తితిదే 'మా తల్లి గోదావరి' నుండి

